# పలనాటి చరిత్ర

సర్వం చెన్నరెడ్డి



954-8436
4-1091
16014

# పల్నాటి చరిత్ర

రచయిత:

గుర్రం చెన్నారెడ్డి

కాపీలు : 1000
ప్రథమ ముద్రణ 1992
హక్కులు రచయితవి.

954.8434
చె గు - ప
G 20214

41091

ముఖచిత్రం : బాలి, విజయవాడ

టైటిల్ ప్రింటింగ్ : ఓం శాయి గ్రాఫిక్స్
నారాయణగూడ - హైదరాబాద్

వెల : రు. 90-00

ప్రతులకు :

1) చిటిప్రోలు పబ్లిషర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్
రామిరెడ్డిపేట, నరసరావుపేట - 522 601.

2) గుర్రం చెన్నారెడ్డి
రెంటచింతల (గుంటూరు జిల్లా)

---

శ్రీ కోటేశ్వర ప్రింటింగ్ ప్రెస్, నరసరావుపేట. ఫోన్ : 455

# తెలుగు విశ్వవిద్యాలయం
# TELUGU UNIVERSITY

Prof. C. NARAYANA REDDY
M A, Ph D, D Ltt
V CE-CHANCELLOR

La tha Ka a Kshetram
Pub c Gardens
Hyderabad-500 004
Andhra Pradesh


Date 28-11-1991

## అభినందన

పల్నాటి వీరచరిత్ర అంటేనే పాఠకుల గుండె గగుర్పొడుస్తుంది. మన తెలుగునాట జరిగిన మరో భారతగాథ అది. భారతానికి, ఈ వీరచరితకూ పోలికలు చాలావున్నాయి. కండలు సడలిన వారికి కూడా కాక పుట్టించే వీరతాస్ఫూర్తి ఈ కథకుంది.

రంగస్థల నటులుగా, దర్శకులుగా ఇప్పటికే అందెవేసిన చేయిగావున్న గుర్రం చెన్నారెడ్డిగారు పల్నాటి చరిత్రను కూలంకషంగా పరిశోధించి ఈ విలువైన గ్రంథాన్ని రచించారు.

అనుగురాజు తెలుగువాడా? పలనాడు వ్యుత్పత్తి యేమిటి? బ్రహ్మనాయుడు పలువురు అనుకున్నంత ఉదాత్త పురుషుడా? నాగమ్మ వ్యక్తిత్వంలోని నైజం ఏమిటి? ఇలాంటి ప్రశ్నలెన్నో వేసుకుని తమకు తోచిన పరిష్కారాలను అందించడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించారు చెన్నారెడ్డిగారు.

చెన్నారెడ్డిగారి అభిప్రాయాలు సర్వసమ్మతాలు కాకపోవచ్చు. కానీ చరిత్ర కారులకు కూడా సరికొత్త ప్రేరణ కలిగించే విలక్షణాంశాలు ఎన్నిటినో ఈ గ్రంథంలో ప్రతిపాదించారు. ఒక నూతన విషయగవేషణ దృష్టితో చేసిన పరిశోధన వివాదాస్పదమైనా విచారించవలసిన పనిలేదు. నిలిచిపోయిన మడుగునీటి కంటే పారే సెలయేటి నీరే ప్రశస్తం కదా.

ఆ దృష్టితో నేను చెన్నారెడ్డిగారి కృషిని అభినందిస్తున్నాను. పరిశోధన వ్యాసంతో పాటు తాము రచించిన "పల్నాటి వీరులు" అనే నాటకాన్ని గూడా ఈ గ్రంథంలో చేర్చడం సముచితంగావుంది.

— సి. నారాయణరెడ్డి

# అపూర్వ పరిశోధన

— ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావు
అధ్యక్షులు
తెలుగు అధ్యయనశాఖ
బెంగుళూరు విశ్వవిద్యాలయం
బెంగుళూరు 560056

రామాయణ మహాభారతాలు భారతీయులు ఆచంద్ర తారార్కమూ గర్వింపదగిన మహేతిహాసాలు. ఆంధ్రులకు ఈ రెండింటితోపాటు మరో రెండు జాతీయేతిహాసాలు ఉన్నాయి. అవి పల్నాటి వీరచరిత్ర, కాటమరాజుకథ. ఇవి ఒక ఆంధ్రదేశంలోనేకాదు, ప్రపంచంమొత్తంమీదే అపూర్వాలూ, అతి ప్రాచీనాలూ అయిన జానపదేతిహాసాలు (Fo k Ep cs) ఈ ఆంధ్రుల జాతీయేతిహాసాలను గురించి మొట్టమొదట చెప్పి వీటిని పరిరక్షించిన మహానుభావులు కల్నల్ కాలిన్ మెకంజీదొరగారు (1754-1821), సి. పి బ్రౌనుదొరగారు (1798-1884).

పల్నాటి వీరచరిత్రను గురించి మొట్టమొదట పరిశోధన చేసిన పండితుడు అక్కిరాజు ఉమాకాన్తంగారు (1889-1932). వీరు 1911 లో "కల్లుప్రతిష్ఠ', "బాలచంద్రుని యుద్ధము" అనే రెండువీరగాథలను పరిష్కరించి ప్రచురించారు. ఈగ్రంధానికి ఒక అపూర్వమైన పీఠిక వెలయించారు తర్వాత మాగురువర్యులు ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు (1894-1972) పల్నాటి వీరచరిత్రలోని పదకొండు వీరగాథల్ని చేర్చి, ఒక విలుపైన పీఠికవ్రాసి, 1961లో ప్రకటించారు. (విశాలాంధ్ర ప్రచురణ 1963లో నేను తెలుగు వీరగాథాకవిత్వము' అనే అంశాన్ని గ్రహించి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయములో లక్ష్మీకాంతంగారిదగ్గర పరిశోధనకు పూనుకొన్నాను. (ఈఅంశాన్ని సూచించినవారు లక్ష్మీకాంతం గారే.) 1965 వరకూ లక్ష్మీకాంతంగారిదగ్గర పరిశోధనచేసి, తర్వాత వారు రిటైర్ కావడంలో, ప్రొ॥ జి. యస్. రెడ్డిగారిదగ్గర నాపరిశోధన 1968లో పూర్తిచేశాను.

నా పరిశోధనలో సుమారు 180 వీరగాథల్ని గురించి చెప్పాను. 25 ప్రకరణాలు, 1445 పుటలుగల నా సిద్ధాంత వ్యాసంలో పదకొండవ ప్రకరణం "పలనాటి వీరకథాచక్రము". ఈపల్నాటి వీర చరిత్ర లో 25 వీరగాథలున్నాయనీ, బ్రహ్మనాయని చరిత్రలో నీలినీడలు కనబడుతున్నాయనీ, నాయకురాలు గొప్ప ప్రతిభావంతురాలైన మంత్రిణి అనీ మొదటిసారిగా నిరూపించాను. నాపరిశోధనయొక్క గొప్పతనాన్ని గ్రహించిన పండితులు ఆంధ్రదేశంలో ఇంతవరకూ ముగ్గురే ఉండేవారు. ఆచార్య తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు, నోరి నరసింహశాస్త్రిగారు, శ్రీ కె. వి. రమణారెడ్డిగారు. ఇప్పుడు నాలుగోవారు లభ్యమయ్యారు. వారే ఈగుఱ్ఱం చెన్నారెడ్డిగారు.

నా సిద్ధాంత వ్యాసంలోని పదవ ప్రకరణమైన శక్తి కథాచక్రాన్ని, పదకొండవ ప్రకరణమైన పల్నాటి వీరకథా చక్రాన్ని కలిపి ఒక పుస్తకంగా 1983 లో ప్రచురించాను. ఆపుస్తకాన్ని గుఱ్ఱం చెన్నారెడ్డిగారికి పంపించాను. వారు ఆనందంతో ఉక్కిరిబిక్కిరై, నా పరిశోధనను ప్రశంసిస్తూ 10 పుటల సుదీర్ఘలేఖవ్రాశారు. "చెన్నారెడ్డి గారి కి ఇంత ఆనందం ఎందుకు కలిగింది?" అంటే వారుకూడా నాలాగె పలనాటి వీరచరిత్రను గురించి చాలాకాలంగా పరిశోధన చేస్తున్నారు. బ్రహ్మనాయనిచుట్టూ పేరుకున్న పుక్కిటి పురాణాలు, నాగమ్మకు జరిగిన అన్యాయం గమనించారు. ఈవిషయాలను నేను బయటపెట్టడంతో వారు బ్రహ్మానందభరితులయ్యారు. మరింత ఉత్సాహంతో తమ పరిశోధనను కొనసాగించారు. నాకన్నా ముందుకు పయనించారు. ఎన్నో అపూర్వవిషయాలు బయటపెట్టారు. ఇప్పుడు నేను వారిస్థితిలో ఉన్నాను. ఆశ్చర్యాన్నీ, ఆనందానందాన్నీ పొందుతున్నాను....

గుఱ్ఱం చెన్నారెడ్డిగారు సుప్రసిద్ధరంగస్థలనటులు; నాటకరచయిత; విజ్ఞానతృష్ణఉన్న గొప్ప పరిశోధకులు. మీదుమిక్కిలి వీరు పల్నాటి గడ్డమీద పెరిగినవారు. అందువల్ల పలనాటి చరిత్రను ఎంతో పట్టుదలతో, భక్తిశ్రద్ధలతో, లోతుగా పరిశోధించి అనేక నూతనవిషయాలు బయట పెట్టారు. నేను నాపరిశోధనను ఎక్కడ ఆపుజేశానో, అక్కడినుంచి

ప్రారంభించి చాలా ముందుకువెళ్ళారు గుట్టం చెన్నారెడ్డిగారు. ఈపని ఆంధ్రదేశంలో ఇంతవరకూ (1968 నుండి 1991 వరకూ) ఏవిశ్వ విద్యాలయమూ, ఏపరిశోధకుడూ చేయలేదు. 'పలనాటి వీరకథాచక్రము' 'కాటంరాజు కథాచక్రము"- ఈరెండింటిలోను కొన్ని కొత్తవిషయాలు చెప్పి, భావిపరిశోధకులు నా పరిశోధనను ముందుకు తీసికొని వెడతారని గత పధ్నాలుగు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న నాకు చెన్నారెడ్డిగారి పరిశోధన ఎంతో సంతృప్తినీ సంతోషాన్నీ కలిగిస్తోంది!

పల్నాటి వీరచరిత్రను గురించి పరిశోధనచేయడంలో ఒక ఇబ్బంది ఉంది. ఈజానపదేతిహాసంలో 65 వీరగాధలుండాలి. కాని వీటిలో పది, పన్నెండుమాత్రమే ముద్రింపబడి లభిస్తున్నాయి. వీటిలోకూడా 'కల్లుప్రతిష్ఠ' 'బాలచంద్రుని యుద్ధం' కోడిపోరు' (ఇటీవల ప్రకటింప బడింది) అనే మూడుకథలుమాత్రమే సంపూర్ణంగా లభిస్తున్నాయి. మిగిలినవి సంక్షిప్తరూపాలు. అక్కిరాజు ఉమాకాంతంగారు మిగిలిన వీరగాథలలో కథ ఎలాఉందో వచనంలో వ్రాసిఉంచారు. మెకంజీ స్థానికచరిత్రలలో సమాచారం కొంత లభిస్తుంది. మద్రాసు, తిరుపతి ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారాల్లోఉన్న తాళపత్రగ్రంధాలు కాంపూడిలో వీరాచార పీఠాధిపతులదగ్గరా, వీరాచారాన్ని పాటించే వివిధ కులాలవారిదగ్గరా, వీరవిద్యావంతులదగ్గరా ఉన్న తాళపత్ర గ్రంధాలనూ, వ్రాతప్రతులనూ ప్రకటించవలసి ఉంది. ఇన్ని కష్టాలు ఉన్నప్పటికీ, చెన్నారెడ్డిగారు శాసనాలు పరిశీలించి, ముద్రితగ్రంధాలు చూసి వీరవిద్యావంతుల్ని కలుసుకొని, వీరగాధలు పాడించుకొని విని ఆయాప్రదేశాలను స్వయంగా దర్శించి ఈపరిశోధనను సంతరించారు.

'కర్ణునాదలనెభారత సంహిత నిల్చుచాద్పునన్"

(తెనాలిరామకృష్ణుడు-పాండురంగమాహాత్మ్యం) : కర్ణుని తలమీదనే భారతవేదం నిలబడి ఉన్నట్లుగా, ఈపల్నాటి వీరచరిత్ర అంతా 'నాయకురాలు" నాగమ్మ పాత్రమీదనే నిలబడిఉంది. కాని ఇంత ముఖ్యమైన పాత్రనుగురించిన విశేషాలేమీ ప్రచారం కాలేదు. మహాభారతంలో శ్రీకృష్ణపాత్ర విశ్వరూపాన్ని ధరించినట్లుగా,

ఈపల్నాటి వీరచరిత్రలో బ్రహ్మనాయుడి పాత్ర విపరీతంగా పెరిగిపోయింది. ఈయనకు 'పల్నాటి కృష్ణుడు" అనికూడా పేరు. జాతీయోద్యమ ప్రభావంతో గాంధీగారి లక్షణాలుకూడా ఈపాత్రకు అంటగట్టడం జరిగింది. ఇదంతా సరికాదని నిరూపిస్తూ, నాయకురాలి పాత్రనుగురించిన నూతన విశేషాలను ఆవిష్కరించడం గుజ్జుం చెన్నారెడ్డిగారి గ్రంధంలోని గొప్పతనం. అందుకే దీనిని నేను "అపూర్వ పరిశోధన" అంటున్నాను....!

1955-58 ప్రాంతం నేను బి. ఏ. చదువుతున్నాను. మాస్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు. మా ఊరిప్రక్కనే "రేలంగి" అనే గ్రామం ఉంది. (అది మాతాత ముత్తాతల ఊరు). అక్కడ భద్రం అనే హరికధకుడు ఉండేవాడు. ఆయన 'పల్నాటి వీరచరిత్రను' గద్య పద్యాలలో నాటకం వ్రాశాడు. దానిని కర్రి అబ్బులుట్రూపువారు ప్రదర్శించేవారు. (అందులో మా తణుకు గ్రామానికి చెందిన జనార్ధన రావు అనే అందమైన యువకుడు నాయకురాలి పాత్ర ధరించేవాడు). భద్రంగారు తననాటకాన్ని ముద్రిస్తూ, తణుకువచ్చి, ప్రముఖకవి, నాకు సన్నిహిత గురుమిత్రులు అయిన దేవరకొండ బాలగంగాధరతిలక్‌గారిని పీఠిక వ్రాయమని కోరారు. తిలక్‌గారు పీఠిక వ్రాశాడు. వ్రాసి ప్రక్కనే ఉన్న నాముఖంలోకిచూచి! ఈనాయకురాలిపాత్ర చాలాగొప్పపాత్రోయ్ సుబ్బారావ్! కాని ఈమెను గురించిన వివరాలు తెలియడంలేదు. ఆమె పుట్టుపూర్వోత్తరాలేమిటి? చివరకు ఆమె ఏమయింది?' అని అడిగారు. అప్పటికి నాకేంతెలుసు? నేను వెర్రిమొహం వేశాను. పది సంవత్సరాల తర్వాత పరిశోధనచేస్తే కొంత తెలిసింది ఇప్పుడు చెన్నారెడ్డిగారి రచన వల్ల పూర్తిగా తెలుసుకున్నాను. (నిజానికి 'రీసెర్చి" అనేదానికి 'పూర్తి' ఉండదు. భవిష్యత్కాలంలో చెన్నారెడ్డిగారివంటివారు మరిన్ని నూతనవిశేషాలు ఆవిష్కరించే అవకాశం ఉంది)

గుజ్జుర చెన్నారెడ్డిగారు కావించిన ఈ అపూర్వ పరిశోధనలోని ముఖ్యాంశాలను ఈక్రిందివిధంగా పట్టీవేయవచ్చు :-

1. కట్టుకథలను, పుక్కిటి పురాణాలను హేతు వాదదృష్టితో పరిశీలించి, చారిత్రక సత్యాలను నిరూపించారు. అనుగురాజు ఉత్తరదేశం వాడుకాడు. అతని మంత్రి సామంతులందరూ ఆంధ్రదేశంలోనివారే. అతని అన్న సాగి రెండవ బేతరాజు కాలంలో కొన్ని రాజకీయ కారణాలవల్ల పల్నాటిని వదిలి పాలమూరు (మహబూబ్‌నగర్) వెళ్ళిపోయారు. తిరిగి అనుగురాజు కాలంలో తీర్థయాత్ర సెపంతో వచ్చి పల్నాటిని ఆక్రమించుకున్నారు.

2. మాచెర్లలోని చెన్నకేశవస్వామి గుడి ఎలా ఏర్పడిందో సాధికారికంగా నిరూపించారు. అది మొదట జైన దేవాలయమట.

3. "పలనాడు" అనే పేరు ఎలా వచ్చిందో శాసన ప్రమాణంతో స్థాపించారు. "పాలి" "పల్లి" అనేపదాలు జైన శాసన పదాలనీ, "పాలి" అంటే "జైనుల విశ్రాంతిస్థల" మనీ, "పల్లి" అంటే "జైనులు వస్తువులు భద్రపరచుకొనే స్థల" మనీ వివరించారు. ఇది ఇంత వరకూ ఎవరూ చెప్పని విషయం.

4. క్రి. శ. 12వ శతాబ్దినాటికి ఆంధ్ర దేశంలో వివిధ కులాలు యెలా ఏర్పడ్డాయో సూచించారు. గోసంగులు జైనులనీ, యుద్ధ కళా ప్రవీణులనీ, మాతేపాడు ప్రాంతంవారు కాబట్టి వీరు "మాలలు" అని పిలువబడ్డారనీ చెప్పారు. "మహాదిగంబరు"లే "మాదిగ" లయ్యారనీ, "తెలుగు చోడులు" "తెలగా"లయ్యారనీ, పద్మనాయక వెలమకులాన్ని బ్రహ్మనాయడే సృష్టించాడనీ, అప్పటికి కమ్మకులం ఇంకా ఏర్పడలేదనీ తెలియజేశారు. ఇవన్నీ అపూర్వ విషయాలు.

5. నాయకురాలు నాగమ్మ పుట్టు పూర్వోత్తరాలు కనిపెట్టడం చెన్నారెడ్డిగారి చేసిన గొప్ప పరిశోధన. (దీంట్లో ఈయన వన్నుదాటి చాలా దూరం వెళ్ళిపోయారనడంలో సందేహంలేదు). కరీంనగర్ జిల్లా, మల్యాల తాలూకా, పెగడపల్లి మండలంలోని "ఆరవెల్లి" అనేగ్రామం నాయకురాలి స్వగ్రామం. అందువల్లనే ఈమె "ఆరవెల్లి నాయకురాలు" అని పిలువబడేది. అక్కడ నాయకురాలి

గుడి, విగ్రహం ఉన్నాయి. (ఫోటోలు కూడా ఇచ్చారు) రెడ్లలో 'చౌదరిశాఖ'వారు ఆ ప్రాంతంలోనే ఉన్నారు. నాగమ్మ "చౌదరిరామిరెడ్డి"కూతురు. తెలంగాణాలో చెప్పబడే కొండలరాయని కథలో నాయకురాలి కథ కొంత వస్తుంది. ఏడేళ్ల ప్రాయంలో ఆమె ఆరవెల్లిని వదిలి పల్నాటికి వెళ్లి, ముసలితనంలో తిరిగి వచ్చిందని ఈకథలో ఉంది.

6. నాగమ్మకు బ్రహ్మనాయునిపై శత్రుత్వం ఎందుకు ఏర్పడింది? ఈ ప్రశ్నకు సరియైన సమాధానం ఇంత వరకూ ఎవ్వరూ చెప్పలేదు. (నాగమ్మ భర్తయైన సింగారెడ్డిని బ్రహ్మనాయుడు చంపించాడని అన్నగారు ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు తమ నాటకంలో సూచించారు. దీనికి ఆధారం చిలూకూరి వీరభద్రరావుగారి రచన అని నాతోచెప్పారు)... గుట్టం చెన్నారెడ్డి గారు చెపుతున్నారు. పల్నాటిలో నీటి కరవు ఏర్పడిందనీ, దొడ్డనాయుడు చౌదరి రామిరెడ్డి పొలాలలో పెద్ద చెఱువు త్రవ్వించడానికి ప్రయత్నించాడనీ, దానికి రామిరెడ్డి అంగీకరించ లేదనీ అది తెలుసుకున్న దొడ్డనాయని కుమారుడు బ్రహ్మనాయుడు కోపంతో రామిరెడ్డిని రాత్రికి రాత్రి 'పొందుగుల' అడవులకు తీసికొనిపోయి ఉరితీయించాడనీ, అందువల్ల నాగమ్మకు 'తన తండ్రిని తెగటార్చిన బ్రహ్మనపై శత్రుభావం అంకురించింది" అనీ నిరూపించారు. పుట : 128

7. 'చాపకూడు"ను గురించిలోతైన చర్చచేశారు. అది బ్రహ్మనాయుడు చేసిన కుల నిర్మూలన ప్రయత్నం అనడం సరికాదనీ, అది కేవలం సామంతనృపతులు సాగించిన చాపకూడు" అనీ నిరూపించారు. (ఈ విషయం ఇంతకుముందే కొర్లపాటివారు తమ నాటక పీఠికలో సూచించారు.)

8. బ్రహ్మనాయని చుట్టూ అల్లుకున్న పుక్కిటి పురాణాలనూ, అభూత కల్పనలనూ చెన్నారెడ్డిగారు చీల్చి చెండాడారు. "మనుష్యులకు దైవత్వాన్ని అంటగట్టడం నేరం మాత్రమే కాదు, పాపం. మనిషిని

భగవంతుడితో పోల్చవచ్చు. కానీ భగవంతుడి లాంటి ఊహాకందని లీలలు చూపించకూడదు. అదే చరిత్ర చేసుకున్న పాపం. అభూత కల్పనలులేని చరిత్రే సజీవ చరిత్ర' (పుట 142)

— ఇది చెన్నారెడ్డిగారి ఈ అపూర్వ పరిశోధనకు మూలభూతమైన పునాది మరియు సారాంశంకూడా.

ఈ పరిశోధనను గురించి ఇలా చెప్పుకుంటూపోతే, బ్రహ్మనాయుని పాత్ర చుట్టూ పుక్కిటి పురాణాలు అల్లిన ప్రాచీన కవులూ, గాథాకారులూ చేసిన తప్పే నేనూ చేసినట్టు అవుతుంది. చెన్నారెడ్డిగారి పరిశోధనలో ఉన్న చిన్నలోపాన్ని గురించి కూడా ఇక్కడ చెప్పక తప్పదు.

సుబ్బం చెన్నారెడ్డిగారు "నాయకురాలు చాలా మంచిది; బ్రహ్మనాయుడు చాలా చెడ్డవాడు" అని మనస్సులో ముందుగా అభిప్రాయం ఏర్పరచుకొని ఈరచన చేశారేమో అనే అనుమానం చాలాచోట్ల కలిగే అవకాశం ఉంది. నాగమ్మ శివభక్తిని మతసహనానురక్తిగాచెపుతారు. కోడిపోరులో ఆమె మోసంచేయలేదంటారు. ఆమె కళాపోషణను ప్రశంసిస్తారు బ్రహ్మనాయుని వైష్ణమతం మాత్రం "యుక్తి" అనీ, అతడు దైవవిగ్రహాలను దొంగిలించాడనీ, క్షుద్రదేవతారాధకుడనీ, అతనికి నరకాన్నదాహం ఉందనీ "వ్యభిచారాన్నీ చౌర్యాన్నీ విచ్చలవిడిగా సాగించినవాడు బ్రహ్మనాయు"డనీ నిరూపించడానికిచేసిన ప్రయత్నాలను పరిశీలిస్తే, చెన్నారెడ్డిగారు "సమచిత్తం'తో ప్రవర్తించలేదేమో అని భావించడానికి వీలుంది పరిశోధకుడైనవాడు ఉన్నవిషయాలను బేరీజువేసి, సాక్ష్యాధారాలుచూపి, "దీనినిబట్టి ఇలా ఊహించడానికి వీలుంది" అని పక్షపాతరహితంగా తీర్పుచెప్పాలి. బ్రహ్మనాయుడు శ్రీకృష్ణునివంటి కుటిల రాజకీయవేత్తఅనిమాత్రం చెప్పవచ్చు. అంతమాత్రంచేత నాయకురాలు చేసిన పనులన్నీ సమర్థించలేం. (కర్ణునిపాత్రకూడా సరిగ్గా ఇటువంటిదే. కర్ణుడు దానవరుడే, గుణవంతుడే, మహావీరుడే, నమ్మిన మిత్రునికోసం ప్రాణాలర్పించినవాడే కాని పాండవులయెడ ముఖ్యంగా ద్రౌపదివట్ల అతడెంతక్రూరంగా ప్రవర్తించాడో, దుర్యోధనుణ్ణి ఎలా తప్పుదారులు పట్టించాడో, అభిమన్యుణ్ణి ఎంత నిర్దయగా చంపాడో, పరిశోధకుడు (లేదా విమర్శకుడు) గుర్తించకుండా ఉంటే అది అపరిశోధన

లోపమునకతప్పదు. నాగమ్మ మలిదేవాదుల్ని జైల్లో పెట్టించింది, కోడిపోరులో మోసంచేసింది. అలరాజును చంపాలనుకుంది నరసింగ రాజును సింహాసనమెక్కిద్దామనుకుంది, నలగామరాజును తప్పుదారులు పట్టించింది. అలరాజును చంపడానికి బ్రహ్మనాయుడు ఆమెకు మంచి అవకాశం కల్పించాడు. కుటిల రాజకీయవేత్త అయినంతమాత్రాన కృష్ణుడు మహావీరుడు కాకుండాపోడుకదా? ఆయనమీద మనకు గౌరవం లేకుండా పోదుకదా? బ్రహ్మనాయుని పాత్రకూడా కృష్ణునిపాత్రవంటిదే. అలాగే నాయకురాలిపాత్రకూడా తక్కువేమీకాదు. రాజనీతిదృష్టితోచూస్తే ఆమెచేసినపనులు తప్పులుకావు కాబట్టి నాయకురాలు నాగమ్మ గొప్పస్త్రీ ఆంధ్రులు ఆచంద్రార్కమూ గర్వించదగినఆడపడుచు. 12వ శతాబ్దిలోనే ఆంధ్ర స్త్రీశక్తి ఇంత అద్భుతంగా ఉండేది" అనడానికి గొప్ప తార్కాణమైన పాత్ర. కానినాయకురాలి గొప్పతనాన్ని చెప్పడానికి బ్రహ్మనాయుడ్ని ఇంతనీచంగా చూపవలసిన పనిలేదేమో. అనిపిస్తుంది నాకు.

వేశ్యాసంపర్కం తప్పుకాదు, పైగా గొప్ప (నిన్న మొన్నటి వరకూ) అధికారం ఉన్నచోట, స్త్రీ పురుషులు ఉన్నచోట ఆనాడూ, ఈనాడూ, ఏనాడూ ఇవి ఉంటాయి దీనిని ఆధారంగా చేసికొని బ్రహ్మనాయుడు చేసిన నీచకృత్యాలు అని నిరూపించడం సమంజసంకాదేమో. భోగం సబ్బాయితో క్రీడించినంతమాత్రాన బాలచంద్రుడు మహావీరుడు కాకుండాపోతాడా? బ్రహ్మనాయుడూ మహావీరుడే మహామంత్రి.

చెన్నారెడ్డిగారి పరిశోధన కొన్నిచోట్ల "సమచిత్తం"తో సాగకపోవడం ఒక లోపమే అయినా "ఏకోహిదోషో గుణసన్నిపాతే ..." అన్న కాళిదాసు సూక్తికి అనుగుణంగా, ఈలోపం రెడ్డిగారి పరిశోధనలోని సమగ్ర పరిశీలనమనే పండువెన్నెల్లో మునిగిపోతుంది మొత్తంమీద ఇటువంటి అపూర్వపరిశోధన చేసిన గుణ్ణం చెన్నారెడ్డిగారిని మనసారా అభినందిస్తున్నాను. వారికీ, వారికుటుంబానికీ పరమేశ్వరుడు ఆయురారోగ్య సంపత్పూర్ణ పరాభివృద్ధిని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

"జ్ఞాన భారతి"
బెంగుళూరు

— తంగిరాల వెంకటసుబ్బారావు

3-12-1991

# తొలి పలుకులు

ఆచార్య వి. రామచంద్రచౌదరి
Professor and Head,
Dept. of Telugu
University of MADRAS
Marina Campus, Madras-5.

ప్రపంచంలోని వీరగాథల్లోనే ఒక ప్రత్యేక స్థానాన్ని పొందదగినది పల్నాటి వీరగాథ. అది యించుమించు పునరావృతమైన భారత వీరగాథగా కన్పట్టినప్పటికీ పలనాటి చరిత్రకున్నంత చారిత్రక నిష్కృష్టత భారతగాథకు లేదనే చెప్పాలి. అయినా పలనాటి గాథలోకూడా అనేకమైన కల్పనలు చోటు చేసుకోవడం మనం గమనించవచ్చు. ఈకల్పనలచేత చారిత్రకమైన ఈ వీరగాథ కొంత పౌరాణికత్వాన్నికూడా సంతరించు కున్నమాట నిజం. ఈగాథకు సంబంధించిన పరిశోధన చేసిన వ్యక్తు లెందరో ఉన్నారు. అయితే ఈపరిశోధన పలనాటి వీరగాథా విశేష సంపాదనకే చాలవరకు పరిమితమైపోయింది. ఎవరెన్ని విశేషాలు సేకరించి లోకానికి తెలియపరిస్తే అంతగొప్పగా భావించారేగాని, ఆ విశేషాల్లో ఉన్న యథార్థ్యమెంతో పరిశీలించాలనే పట్టుదల అంతగా కనిపించలేదు.

ఈ కథ ఎందరో రచయితల్ని ఆకట్టుకుంది. ఈకథను స్వీకరించి ఆయా రచయితలు పలురకాల సాహిత్య ప్రక్రియలుగా రూపొందించారు. ఇటీవల పరిశోధనాదృష్టి ప్రబలినపిదప కొందరు పరిశోధకులీకథను సత్యదృష్ట్యా కొంత పరిశీలించిన మాటకూడా నిజం. కాని ఈఅన్నిటికీ మకుటాయమానంగా వెలసిన రచన శ్రీ గుర్రం చెన్నారెడ్డిగారి "పలనాటి చరిత్ర"

ఈ పలనాటి చరిత్ర సునిశిత పరిశోధన ఫలితంగా గ్రంథకర్త దర్శించు కథా స్వరూప స్వభావాల కనుగుణంగా ప్రామాణికమైన విమర్శతో సాగిన కథనం రచయితయొక్క యీ విమర్శకారిత కథలోని

ప్రతి ఘట్టంలోనూ, చదువరులకు దర్శనమిస్తుంది. శ్రీ చెన్నారెడ్డిగారి అభిప్రాయాలు నిర్దుష్టంగా, నిష్పాక్షికంగా ఉన్నాయి. కాకుంటే కొన్ని సత్యాలను ప్రకటించే సందర్భాల్లో ఒకింత ఆవేశాన్ని పొందినట్లు చదువరులకు అనిపించవచ్చు. కాని, అటువంటి సందర్భాలు చాలా సకృత్తు. తరతరాలుగా అణచి పెట్టబడిన లేదా అవగాహనకురాని సత్యాలను ప్రకటించటంతో పరిశోధనతోపాటు పట్టుదల, పట్టుదలతోపాటు సమగ్రదర్శనం, దర్శనంతోపాటు ప్రదర్శనశక్తి, ఆశక్తితోపాటు సత్య ప్రకటనలో సాహసం, సాహసంతోపాటు విమర్శకారిత, దానితోపాటు నిష్పాక్షికత రచయితకుండవలసిన గుణాలు. ఈగుణాలన్నీ చెన్నారెడ్డి గారికి పుష్కలంగా ఉన్నాయి. ఈ చరిత్రలో నూత్న విషయాల ప్రతిపాదలో చెన్నారెడ్డిగారెంత సునిశిత మేధాశక్తిని ప్రదర్శించారో, కొన్ని పాత్రలను - అందునా ముఖ్యంగా బ్రహ్మనాయని పాత్రను- క్రొత్తరీతిలో ఆవిష్కరించటంలో అంతసాహసాన్ని ప్రదర్శించారు.

పలనాటి కృష్ణుడుగా ప్రఖ్యాతి గాంచిన బ్రహ్మన్న కాపట్యాన్ని సహేతుకంగా నిరూపిస్తూ, తుదకతని రాజ్య కాంక్షే తద్వంశక్షయానికీ, పలనాటి వీరక్షయానికీ మూలహేతువైందని నిరూపించారు. అనుగు రాజునూ, తన తండ్రి దొడ్డనాయననూ బ్రహ్మన్నే చంపాడనీ, అలరాజును చంపించింది బ్రహ్మనాయుడేననికూడా నిరూపించారు. అవతారపురుషుడుగా మన్నింపబడుతున్న బ్రహ్మన్నను గురించి ఇటువంటి విషయాలు చెప్పటానికి-అవి సత్యాలే అయినా-చాలా దమ్ములుకావాలి. కేవలం సత్యదర్శనం చేయగలశక్తేగాక, అదర్శించిన సత్యాన్ని ప్రామాణికంగా, నిర్భయంగా లోకానికి చాటగల గుండెదిటవుకూడా తనకున్నదన్న విషయాన్ని శ్రీ చెన్నారెడ్డిగారు నిరూపించుకొన్నారు. అసలైన బ్రహ్మన్న వ్యక్తిత్వాన్ని గురించి తెలుసుకోవాలన్న ప్రతివ్యక్తి ఈ పలనాటి చరిత్రను చదువక తప్పదు.

చౌదరి రామిరెడ్డి కులాన్ని గురించీ, నాయకురాలు నాగమ్మ వ్యక్తిత్వాన్ని గురించీ, చాపకూటిని గురించీ చెన్నారెడ్డిగారు చెప్పిన విషయాలు ప్రామాణికంగా ఉన్నాయి, ముఖ్యంగా నాయకురాలు

అంత్యదశను గురించి కొండలరాయని కథతో సమన్వయపరచి చెప్పిన విషయాలు సమ్మోదజనంగా ఉన్నాయి. ఇదియదియననేల: ఆయన దిద్దితీర్చిన పల్నాటి వీరగాథలోని ప్రతిపాత్ర కొత్తవెలుగులో మనకు దర్శనమిస్తుంది. చెన్నారెడ్డిగారొక వైష్ణవ్యగీతం: సత్యతేజస్సును ప్రసరించే సుప్రభాతం.

ఆయన దర్శించి నిరూపించిన చారిత్రక సత్యాలను కొన్నింటి నిక్కడ దిక్ప్రదర్శనంగా ఉదాహరిస్తాను.

"అనుగురాజుకు పూర్వమే అతని వంశంవారెవరో ఉత్తర దేశం నుండి, ఆంధ్ర దేశానికి వచ్చి, సామంతులుగనో, రాజ్యాధిపతులుగనో ఉండి, తెలుగువారిలో కలిసిపోయి స్థిరపడి ఉండవచ్చు. లేకున్న, ఇలాంటి దేశీయ పదాలతోకూడిన పేర్లుండవు". నిజానికి అనుగురాజు ఆంధ్ర సరిహద్దు ప్రాంతాలైన ద్రవిడ కర్ణాటకం నుండి కానీ, లేక తెలంగాణా ప్రాంతం నుండి కానీ వచ్చియుండవచ్చు." (పేజి 526)

"పల్లి అంటే జైనులు వారి నివాసస్థలాలకు వసతులేర్పచుకుని, అందులో వారి జీవనానికి కావలసిన ఆహార విహార వినియోగ వస్తువులను భద్రపరచుకునే స్థలాలనీ వాడబడేవి. ఎవరెన్ని భాష్యాలు పల్లించినా ఈ "పల్లి" అను పదమే రూపాంతరం చెంది నేటికి "పల్నాడు" "పలనాడు" అని పిలువబడుతూ వుంది." (పేజి 47 & 48)

"శ్రీనాధుడు చెప్పిన చాటువుల్లోని "జొన్నకలి, జొన్నయంబలి" అను పద్యంలో పలనాడును, పలనాటి సీమ అనటం నిందావాచకమని పరిగణించారు....నిజంగా శ్రీనాధుడాఊహతోనే ప్రయోగించాడనుకుంటే, అసలు పల్నాటి చరిత్రనే వ్రాసేవాడు కాడు." (పేజి 58 & 59)

చెన్నారెడ్డిగారి పరిశోధనా పటుత్వానికి, విమర్శనా విధానానికీ ప్రతీకలు కాదగిన ఉదాహరణలలో ఇవి కొన్నిమాత్రమే.

పోతే "పూర్వపురోజుల్లో ఈ బిచ్చ కుంటివారు, రెడ్ల కథల్ని గానం చేస్తూ, రెడ్లనే యాచిస్తూ బ్రతికేవారు"అన్నారు శ్రీరెడ్డిగారు. (పేజి 68) మరి, ఇటీవలకాలంలో ఈ బిచ్చకుంటి (పిచ్చుకుంటి) వారు కమ్మవారినే యాచిస్తూ బ్రతికేవారు. దీనికి కారణం ఏమిటి? ఇది మార్పే అయితే, ఆ మార్పెలావచ్చింది? ఈయంశాన్ని పురస్కరించుకొని, పూర్వపురోజుల్లో రెడ్లకూ, కమ్మవారికీ ఉన్న సంబంధాలను గురించిన సత్యాన్వేషణ చేయడానికేమైనా అవకాశముందేమో శ్రీ రెడ్డిగారు ఆలోచింతురని నా కోరిక।

"మూడవ విష్ణువర్ధన మహారాజుయొక్క దాడికి భయపడి 612 గోత్రాల వైశ్యులు పారిపోయ్యారనీ, అందు రెండువందల గోత్రాలవారు కమ్మవారిలోనూ....చేరినట్లు తెలుస్తుంది. (పేజి 92) భాస్కరాచార్యుని వైశ్యపురాణంలో "కమ్మటవారని కమ్మవారిని జేరిరి" అని ఉన్నమాట నిజమే. అయితే ఈచేరటమంటే కమ్మకులంలో కలిసిపోవడంకాదు. రక్షణకోసం వారినాశ్రయించడమే కావచ్చు. అందుకే వారు "కమ్మట + వార"నే ప్రత్యేకమైనపేరే పెట్టుకొన్నారు. ఈ "కమ్మట" శబ్దమే నేటి "కోమటి" శబ్దానికి మూలం కావచ్చుననిపిస్తుంది. దీన్ని గురించి చెన్నారెడ్డిగారు కొంత పరిశోధిస్తే బాగుంటుంది.

మొత్తంమీద సత్యదృష్టితో శ్రీచెన్నారెడ్డిగారు సాగించినపరిశోధన పల్నాటి చరిత్రకే ఒక క్రొత్తవెలుగును ప్రసాదిస్తుందని చెప్పక తప్పదు. అయితే, చెన్నారెడ్డిగారి యీ విమర్శ అవతార పురుషుడుగా, పలనాటి కృష్ణుడుగా భావింపబడుతున్న బ్రహ్మన్న వ్యక్తిత్వానికి మచ్చ తెస్తుందని ఎవరైనా భావించవచ్చు. కాని, బ్రహ్మన్న ఎంతకుటిలుడైనా, అతని శక్తిసామర్థ్యాలు మాత్రం అప్రతిమానమైనవనడంలో సందేహం లేదు. అందుకే ఆయన పల్నాటి కృష్ణుడు. కృష్ణుని రాజకీయాల్లోకూడా కౌటిల్యానికి కొఱతలేదు. అయినా, అతను ఘటనాఘటనసమర్థుడే. కాకుంటే కురురాజ్యం....కడకు అతని చెల్లెలు మనుమడికి దక్కేటట్లుగా అతడు చేయగలిగాడు. బ్రహ్మన్నకు అదీ కలిసిరాలేదు. కారణం-

బాల చంద్రునివల్ల మాంచాలకు పుత్రోదయం కాకపోవడమే. అదే జరిగిఉంటే మిగిలిన నలగామరాజునుకూడా మట్టుపెట్టేవాడేమో బ్రహ్మన్న. అప్పుడు పల్నాటిరాజ్యం బ్రహ్మన్న వంశానికే సంక్రమించేది.

కాబట్టి యీవిధమైన సత్యాన్వేషణకు దారితీయించే శ్రీ గుర్రం చెన్నారెడ్డిగారి పలనాటి చరిత్ర ఉత్తమ విమర్శగ్రంథం. సత్యదృష్టి కలిగిన సహృదయులందరూ తప్పక చదువదగిన మంచి విమర్శ.

పోతే ఈసంపుటిలోని రెండవ గ్రంథం "పల్నాటివీరులు"నాటకం. పల్నాటి చారిత్రకాంశాల ఆధారంగా నిర్మించిన నాటకమిది. ఇది దేశీయమైన యక్షగాన రచనకాదు. పైగా మార్గనాటక సంప్రదాయానికి చెందిన లక్షణాలూ కనిపించవు. అంక విభాగం ఉన్నది. కానీ, వాటినే రంగాలుగా వ్యవహరించడం జరిగింది. నాటకం గద్య పద్యాత్మకంగాసాగి పరిమితంగానే ఉండటంచేత కథాగతికి భంజకాలు కాని విధంగా అమరి ఉన్నాయి.

ఇక నాటక ప్రక్రియదృష్ట్యా నాంద్యాదులు లేకపోవడంవల్ల ఈ నాటకానికి రచనపరంగా కలిగిన లోటేమైనా ఉందేమో పరిశీలించవలసి ఉంది. ఇందులో పాత్రప్రవేశసూచనలూ, అర్థోపక్షేపకాలు, భరత వాక్యమూ లేనందువల్ల నాటకం లక్షణానుసారం లేదన్న మాటేకాని, అందువల్ల నాటక కథా గతికి కలిగిన లోటేమీలేదు. నాటక రచనా విధానంలోనే పాత్ర ప్రవేశ సూచనలు, అర్థోపక్షేపకాలకు సంబంధించిన వాక్యాలు నిర్వహింపబడినవి. పోతే భరతవాక్యం కథానాయకుడిచేత చెప్పించబడాలి. మలిదేవాదులు మరణించినందువల్లా, బ్రహ్మనాయుడు గెలిచినా, తానై సింహాసనాన్నధిష్ఠించే అవకాశం లేనందువల్లా, నలగాముడు సజీవుడై అతడే ప్రభువు కానున్న కారణాన "అంకమాసన్న నాయకం"అనే లక్షణాన్నిబట్టి నలగాముడే కథానాయకుడైనందువల్ల, నాటకం ముగింపునుబట్టి కథానాయకునిచే భరతవాక్యం చెప్పించడం కుదరనందువల్ల రచయిత భరతవాకాన్ని విసర్జించి యుండవచ్చు. ఇక మిగిలినవి నాంది ప్రస్తావనలు. నాంది లక్షణాల్లో "మనావ్యాకార్థ

సూచనమ్'' అనే లక్షణ మొక్కటే సార్ధకమైనది. ఈ పల్నాటి వీరులను గురించిన "మనాకాంక్ష్యార్ధ సూచన" చేయవచ్చును గాని, అసలు నాందే లేనప్పుడు ఆ పని కుదరదు గదా! లక్షణాన్ని బట్టి నాటకం మంగళాది, మంగళమధ్యం, మంగళాంతం కావాలి. ఈనాటకమంతా మారణహోమంలో నుండి విషాదాంతమైంది కాబట్టి, దీనికి "నాంది" ఒక కొదువగాదు అని భావించి రచయిత దాన్ని వదలియుండవచ్చు. కాని, నాటకశిల్పదృష్ట్యా ప్రదర్శన నిర్విఘ్నంగా కొనసాగాలనే తలంపుతో "నాంది"ని నిర్వహించినా తప్పులేదు. అయినా, దాన్ని వదలినందువల్ల నాటకానికి వచ్చిన పెద్ద లోటేమీ లేదని నామనవి. అయితే ఒక్క ప్రస్తావన నిర్వహింపబడకపోవడం మాత్రం కొంతలోటుగా కనిపిస్తుంది. ఎందుకంటే; నాటకంలో ప్రస్తావన ఆ నాటకరచయితనూ, సూత్రధారాదులనూ సభాసదులకు పరిచయం చేస్తుంది. నాటక కథకు సంబంధించిన ప్రధాన రసానికి ఉచితమైన వాతావరణంకూడా ప్రస్తావన లోనే కల్పింపబడుతుంది. ఈయవకాశం వదలిపెడితే, తక్కిన అంశాల మాట ఎలాఉన్నా, నాటక రచనలో రచయిత ఉద్దేశమూ, ప్రజ్ఞా పాటవాలూ ప్రేక్షకులకు విశదమయ్యే అవకాశంలేదు. కాబట్టి నాటకంలో ప్రస్తావన ఉంటేనే బాగుండేది. అయితే, నాంద్యంతంలో ప్రవేశించే సూత్రధారుడే ప్రస్తావనను నిర్వహించాలి కాబట్టి, నాందే లేకపోవటంవల్ల ప్రస్తావనా నిర్వహణం రచయితకు కుదరక పోయి యుండవచ్చు. పూర్వోక్తర కారణాలవల్ల రచయిత "నాంది" వద్దనుకోవడం నిజమైతే, ప్రస్తావన కావాలనుకోవడమూకుదరదు. నాంది వలదనుకొని ప్రస్తావనను విడనాడడంకంటె, ప్రస్తావన కావాలనుకొని, నాందిని ప్రవేశపెట్టి ఉంటేనే బాగుండేదనిపిస్తుంది.

ఈకారణాలన్నింటిచేతా చెన్నారెడ్డిగారి "పల్నాటివీరులు" కేవలం నాటక కార్యంమాత్రమే ప్రాధాన్యం వహించిన ఆరురంగాల నాటకంగా రూపొందించడం జరిగిందని భావించక తప్పదు.

ప్రధానంగా ఈనాటకం నేటి రంగస్థలాన్ని దృష్టిలో ఉంచుకొని వ్రాయబడిందనిపిస్తుంది. కర్త చెన్నారెడ్డిగారు నాటకాలు వ్రాయడం,

వేయుడం, దర్శకత్వం చేయుటలో త్రివిక్రమత్వాన్ని వెలార్చిన సమర్థులు కాబట్టి, నేటి రంగస్థలాన్ని దృష్టిలో ఉంచుకొని, తమ నాటకానుభవాన్ని పురస్కరించుకొని, యీనాటకాన్నీ విధం రూపొందించడమే సమంజసం. కాబట్టి స్థూలదృష్టికి నాంద్యాదులు లేకపోవడం ఒక లోపంగా కనిపించినా, సూక్ష్మదృష్టి కవిలోపాలుగా కన్పట్టవనిపై వివరణనుబట్టి గ్రహించవచ్చు.

తాను "వల్నాటి చరిత్ర''లో వివరించిన అంశాల ఆధారంగా నడిపిన యీ నాటకంలో, ఆయన రస భావ నిరంతరమైన పాత్రల చిత్త వృత్తులనే ప్రదర్శించి, నాటక కార్యానికెక్కడా భంగం కలుగకుండా కథాగతిని కాపాడారనిమాత్రం నిక్కచ్చిగా చెప్పవచ్చు. కాబట్టి యీ నాటకం ప్రదర్శనానుకూలమనీ, సహృదయ ప్రేక్షకులను ఆకట్టుకొని, నాటక ప్రయోజనాన్ని సంపూర్ణంగా నెరవేర్చగలదనీ, నేనేమాత్రం సంకోచించకుండా చెప్పగలను. ప్రత్యక్ష నాటకానుభవం లేనివారు ఈ నాటకరచనకు ప్రయత్నిస్తే, దానికి తప్పకుండా సాంప్రదాయకమైన రూపాన్నే యిస్తారు. కానీ, యీరూపాన్నివ్వలేరు. అందుచేత శ్రీగురత్రం చెన్నారెడ్డిగారు ప్రశంసాపాత్రులు.

ఒక్కచోట మాత్రం నాటక రచనాసందర్భంలో చిన్న పొరపాటు దొర్లింది. అది ఆయనమీద తత్కథా పరిశోధనా ప్రభావం ఎంత గాఢంగా ప్రసరించిందో తెలుపుతుంది. యువరాజైన నరసింగరాజుతో వల్లయ్య సంభాషించేటప్పుడు ఇలా అంటాడు. (పుట 25)

"ఇకముందెవరైనా వెలమవారు పెండ్లి జరుపుకుంటే, రేచెర్ల గోత్రీకులైన కన్నమదాసు వంశంవారికి ముందుగా పెండ్లి జరిపి, ఆ తలంబ్రాలతోనే రేచెర్ల గోత్రజులైన పద్మనాయక వెలమలు పెండ్లి జరుపుకోవాలట" అంటాడు. అంతవరకు బాగానేవుంది. కాని, ఆతరువాత "ఇప్పుడాతంతునేగదా వెంకటగిరి ప్రాంతంవారు అక్షరాలా పాటిస్తుంది. అన్నమాటలు వల్లయ్య అనదగినవికావు. 12వ శతాబ్దానికి చెందిన నాటకపాత్ర ఇరవైయవ శతాబ్దంలో కొనసాగుతున్న ఆచారాన్ని గురించి ప్రస్తావించడం సబబుకాదు. ఇది కేవలం ప్రామాదికమే.

తక్కిన కథాసన్నివేశన, పాత్ర చిత్రణ రసపోషణాదులలో శ్రీ చెన్నారెడ్డిగారు మంచి ప్రజ్ఞ చూపారు. ఈ యంశాలన్నింటినీ వివరించాలంటే ఈపీఠిక ఎక్కడ అగుతుందో తెలియదు. ఒక్క విషయం మాత్రం ప్రస్తావిస్తాను. కట్టకడపట యుద్ధ రంగంలో తారసిల్లిన బ్రహ్మన్న. నాయకురాలు పాత్రల్ని రచయిత కథాపరిణితికనుగుణంగా, ఎంతో ఉదాత్తంగా చిత్రించారు. నాగమ్మ బ్రహ్మన్న దోషాల నెత్తి చూపుతుంది. బ్రహ్మన పశ్చాత్తప్తుడౌతాడు. నాగమ్మకూడా అంతకు మునుపు తనకతనిపట్లఉన్న వైర భావాన్ని వదలి గౌరవంచూపుతుంది. ఈకథనుఎవరువ్రాసినప్పటికీ, ఈపాత్రలతోనే ముగింపకతప్పదు. కానీ, శ్రీ చెన్నారెడ్డిగారా పాత్రల్ని చిత్రించినతీరు మాత్రం ప్రశంసా పాత్రంగా ఉంది. నాటకాన్ని మహోదాత్తంగా రూపొందించారు.

అందుచేత కథాంశ మౌలికత దృష్ట్యా, ప్రదర్శన యోగ్యత దృష్ట్యా ఉత్తమమైన నాటకాన్ని నిర్మించిన శ్రీ గుర్రం చెన్నారెడ్డిగారిని నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. వారి పరిశోధన పాటవం, నాటక రచనా నైపుణ్యం, ఆంధ్ర సారస్వతోపాసకులకు మరెన్నో విలువైన గ్రంథాలను ప్రసాదించగలవని విశ్వసిస్తున్నాను. సహృదయులు మన్నిస్తే ఈకోరికే ఒక భరతవాక్యంగా ఈ పీఠికను ముగిస్తాను.

సహృదయ విధేయుడు

**వి. రామచంద్రచౌదరి**

ది. 25-12-'91

డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి,
ఎం. ఏ., పిహెచ్. డి.
పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి,
ఎం. ఏ., ఎం. ఫిల్.
ఆంధ్రోపన్యాసకులు.

ఎస్. కె. ఆర్. బి. ఆర్. కళాశాల
నరసరావుపేట.

# సమర్పణం

'వింటే భారతమే వినాలి' అనే మాట మహాభారతం పట్లనే కాదు. పల్నాటి భారతం పట్ల కూడా సత్యం. ఆ పల్నాటి భారతాన్ని గురించి శ్రీ గుర్రం చెన్నారెడ్డిగారు చేసిన కృషి ఫలిత మిది. ఇది వారి రెండు రచనల సంపుటి. మొదటిది పలనాటి చరిత్ర, రెండవది పల్నాటి వీరులు. "పలనాటి చరిత్ర" క్రీ. శ. 12వ శతాబ్ది ప్రాంతంలో జరిగిన పల్నాటి యుద్ధాన్ని గురించిన పరిశోధన గ్రంథం. అందులో రెడ్డిగారు చేసిన నిర్ణయాలకు లక్ష్యప్రాయంగా వ్రాసిన నాటకం పల్నాటి వీరులు. వీటిలో రెడ్డిగారు మనకు ఉత్తమ పరిశోధకులుగాను, గొప్ప రచయితగాను కన్పిస్తారు.

పల్నాటి వీరచరితం రసభరితం. చెన్నారెడ్డిగారు పల్నాటి సీమకు మణిపూస అయిన రెంటచింతల వాస్తవ్యులు. స్వస్థానాభిమానం గలిగిన రెడ్డిగారు పల్నాటి సీమకు, పల్నాటి యుద్ధానికి సంబంధించిన అనుపానుల అన్వేషణను ఆరంభించి ఒక లఘువిజ్ఞాన సర్వస్వంగా ఈ గ్రంథాన్ని రూపొందించారు

ఇది ఆషామాషీ రచన కాదు. రెడ్డిగారు అనేక గ్రంథాలను నిశితంగా పరిశీలించారు. బహు ప్రదేశాలను పర్యటించారు. సంబంధిత వ్యక్తులతో ముఖాముఖి జరిపి అసూర్యంపశ్యలుగా ఉన్న అనేక జనశ్రుతులను వారి వలన తెలుసుకున్నారు. ముఖ్యమైన, విలువైన ఛాయాచిత్రాలు తీశారు. ఇంత విశేషమైన కృషిని సల్పిన ఔత్సాహిక పరిశోధకులు చెన్నారెడ్డి గారు అభినందనీయులు.

పరిశోధన అంటే ఏమిటి? సమాజానికి తననాటివరకూ అపరిచితంగా ఉన్న విషయాన్ని వెలుగులోకి తేవడం. అందరికీ తెలిసిన అంశంమీద కొత్త వెలుగును ప్రసరింపజేసి, నూతనమైన విశ్లేషణ జరపడం. రెడ్డిగారి పరిశోధన ఈ రెండింటినీ గర్భీకరించుకొన్నది.

ఇంతవరకు పల్నాటి వీరచరిత్రను పరవశించి చదువుకొంటున్న మన అందరి ఊహలను తలక్రిందులు చేసేవిధంగా రెడ్డిగారు కొన్ని కొత్త కోణాలను ఆవిష్కరించారు. మన ప్రాచీన కావ్యాలలో ఉన్న పాత్రల స్వభావాలను పునర్విమర్శ చేయడం ఆధునికయుగ లక్షణాలలో ఒకటి. భాసుడిలో కన్పించే ఈ లక్షణాన్ని ఆధునిక విమర్శకులు 'కవిరాజు' త్రిపురనేని రామస్వామిచౌదరి, కాటూరి వేంకటేశ్వరరావు, నార్ల వేంకటేశ్వరరావు, ముద్దుకృష్ణ మొదలైనవారు విస్తరింపజేశారు. మాగురువర్యులు ఆచార్య శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తిగారు ఈ పునర్విమర్శనా మార్గాన్ని పరిపుష్టం చేశారు. వారి పరిశోధనాత్మక నాటకం 'పలనాటి వీరచరిత్ర' దీనికి ప్రబలమైన ఉదాహరణ.

పలనాటి కృష్ణుడుగా, సమతామార్గ ప్రవర్తకుడుగా తరతరాలుగా ప్రజలచేత అభిమానించ బడుతున్న బ్రహ్మనాయుడి ప్రసక్తి ఇందులో తద్విరుద్ధంగా ఉండి, సంచలాన్ని రేకెత్తిస్తున్నది. బ్రహ్మన క్షుద్ర దేవతారాధకుడని, అలరాజు హత్య ఇతని కుట్ర అని, అతడు పరశుల్క పిశాచి అని, ద్యూతవ్యసనపరుడని, శాస్త్రాలూ కళలు అతనికి రుచించవని, నాయకు నారీ జన ద్వేషిఅని, భార్య శీలాన్నే శంకించినవాడని, పరస్త్రీ లోలుడని, ఎన్నో హత్యలకు మూలకారణమని రెడ్డిగారు సోపపత్తికంగా నిరూపించారు. బ్రహనాయడి పేరు వింటే మనకు ముందుగా గుర్తు వచ్చేది చాపకూడు. అది వర్ణభేదరహిత సమాజదృష్టికి సంకేతం. కాని అందులోని సమత నేతిబీరకాయఅని, చాపకూడు కదన కార్యార్థం కదలివచ్చిన తరలివచ్చిన సామంతరాజుల సహపంక్తిభోజనమే అనీ వీరు సిద్ధాంతీకరించారు. చెన్నారెడ్డి గారు తమ సిద్ధాంత స్థాపనకోసం ఆధారాలుగా శ్రీనాథుడి పల్నాటి వీరచరిత్ర నుండి తీసుకొన్నవి కొన్ని,

ముదిగొండ వీరభద్ర కవిగారి వీరభాగవతం మొదలైన వాటినుండి గ్రహించినవి మరిన్ని కావటం గమనార్హం.

పల్నాడు పూర్వం జైనులకు నివాసస్థలమని, ఆ కారణంగానే ఆ ప్రాంతానికి పల్లినాడు, పల్నాడు అని పేరు వచ్చిందని, ఇప్పుడు మాచెర్లలో ఉన్న చెన్నకేశవాలయం పూర్వం జైనాలయమని, పల్నాటి యుద్ధ కారణం శైవ వైష్ణవమతాల ఘర్షణ కానేకాదని, వ్యక్తిగత మని చెన్నారెడ్డిగారు ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు.

రెడ్డిగారు 'దీని భావమేమి తిరుమలేశ' అన్న రీతిలో కొన్నిచోట్ల పాఠకుల మీదికి ప్రశ్నల బాణాలను ప్రయోగించారు. అవి అన్నీ సమాధానాలను అపేక్షించేవే! మరికొన్ని సందర్భాలలో వారు కొంతవరకు పరిశోధన జరిపి, అక్కడ నుండి ముందుకు సాగవలసిన బాధ్యతను భావిపరిశోధకులకు సవినయంగా అప్పగించారు.

'పల్నాటి వీరులు' ఆరురంగాల నాటకం. నాటక రచయితగా, ప్రయోక్తగా, దర్శకుడుగా, నటుడుగా వారికున్న విశేషానుభవాన్ని పురస్కరించుకొని రెడ్డిగారు ఈ నాటకాన్ని వ్రాశారు. ఇంతకు ముందు మనం ప్రస్తావించుకొన్న సిద్ధాంతాల సారమంతా ఈ నాటకంలో కళా రూపంలో దర్శనమిస్తుంది.

ఇది అన్ని నాటకాలలాగాకాక, కొంత కథ జరిగిన తర్వాత నలగామ రాజు వేగులు హరిదాసుల వేషాల్లో మండాదివీథిలో తిరిగే ఘట్టంతో ప్రారంభమౌతుంది. భూతకాలంలో జరిగిన కథ కొందరి సంభాషణల ద్వారా మనకు తెలుస్తుంటుంది.

బలహీనుడుగా, పిరికిపందగా బ్రహ్మనాయడిచేత నిందించబడిన లంకన్న ఆమరణాంతమూ స్త్రీ వేషంలోనే సంచరించాడనే విషయం అతని మరణానంతరం బ్రహ్మనాయడు చేసిన విలాపంలో (పుట 9) ఉంది.

వర్తమాన సమాజంలో సహస్రముఖాలుగా ప్రచార మౌతున్న స్త్రీ వాద (ఫెమినిజం) భావాలు ఈ నాటకంలో కన్పిస్తాయి. ఐదవరంగంలో నాగమ్మ "పురుషాధిక్యతనెలకొన్న ఈ ప్రపంచంలో నేనువికాకినయ్యాను" (పుట 68) అని విలపిస్తుంది, మరణించిన తన భర్తకోసం యుద్ధ రంగానికి వచ్చిన మాంచాలతో నాగమ్మ ఆడది సింహాసనం ఎక్కినందుకే బ్రహ్మనాయుడింత చేశాడని, పశువులకూ పక్షులకైనా స్వాతంత్ర్యం ఉంది కాని తమ ఆడజాతికి లేదని అది పురుషాధిక్యానికి బలై, పురోగతిని కోల్పోయిందని చెప్పి బాధపడి, మాంచాల తన స్త్రీజాతిపరువు నిలిపిందని ప్రశంసించింది. (పుట 85)

రాజకీయాల్లో హృదయమున్న వారికి తావు లేదు (పుట 54), భావదాస్యంతో బ్రతికే బడుగుజీవులు నోరు మెదపలేరు. (పుట 63), వర్గ శత్రువును తుదముట్టించడం (పుట 70), అతివాదు లందరూ అర్ధాయుష్కులే (పుట 69) అనే భావాలూ, పదబంధాలూ రెడ్డిగారి సామాజికస్పృహకు అద్దం పడుతున్నాయి.

చెన్నారెడ్డిగారు మంచి కవి. "శాంతికి పట్టాభిషేకమని సంధి కల్పాం మనం. కాంతికి కాటుక పూసి కాటికి పంపారు వారు" (పుట 55) అనే కొమ్మరాజు మాటలలో కవితా పరిమళం గుబాళిస్తున్నది. ఆకాశ మావులించాలి, దిఙ్మండలం గర్జించాలి, గండ శిలలదిరిపోవాలి (పుట 80) అనే బాలచంద్రుడి పౌరుషవచనాలు, బాలచంద్రుడి సాహసానికి అసూయ చెందిన యుద్ధరాక్షసి మృత్యుఘంటను మ్రోగించింది (పుట 81) అన్న బ్రహ్మనాయని పలుకులు ఇటువంటివే.

రెడ్డిగారు ప్రయోగించిన మగులుగోడ (పుట 49), రిక్కవేయటం (పుట 64) పెడసరకట్టెలు, చొప్పలాగా కుప్పకూలటం (పుట 68) లాంటి దేశీయ పదాలు ఈ నాటకానికి తెలుగుదనాన్ని సంతరించిపెడుతున్నాయి.

చెన్నారెడ్డి గారు ఈ పుస్తకంలో ప్రయోగించిన భాష చాలా రసవత్తరంగా ఉండి, పాఠకులను తన వెంట లాక్కొని వెళుతుంది.

ఏకనిష్ఠతో చదివించే శక్తి దీనికున్నది. పూర్తిగా వ్యావహారికంలో నడిచిన వీరిభాషలో అక్కడక్కడా గ్రాంథికపదాలు దొర్లినై. అయితే వెలుగు నిచ్చే దీవం క్రింద చీకటి నీడ ఉన్నట్లుగా అవరాతిరి (పుట 28) సపరివారమును వెంటబెట్టుకొని (పుట 33), కులవగలు (పుట 74, 80) అరిసేనాబలగము (పుట 76), ఆధిక్యత (పుట 66), అంతరిత (పుట 58) వంటి అసాధువులు కొన్ని కన్పిస్తున్నాయి. పునర్ముద్రణలో వీటిని సవరించుకోవలసిందిగా కవి గారికి మా మనవి.

వల్నాటి చరిత్రను గురించి ఇంత మంచి పుస్తకాలను రచించిన సహృదయులు, స్నేహశీలి శ్రీ గుర్రం చెన్నారెడ్డి గారి ఈ రచన విద్వజ్జనామోదానికి పాత్రం కావాలని మా శుభాశంస. అవుతుందని ప్రగాఢవిశ్వాసం. చెన్నారెడ్డిగారి బృహత్ప్రయత్నానికి చిరుకానుకగా ఈ సమర్థణాన్ని సమర్పిస్తున్నాం॥ "శీతాంశో రమృతార్పణమ్"॥

ప్రజోత్పత్తి, కార్తిక పూర్ణిమ.
దీ. 21-11-1991, గురువారం

చేరెడ్డి మస్తాన్ రెడ్డి,
పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి.

తాటిపర్తి శామ్యూల్ కవి
"సంయమీంద్ర"

ఇనుమెళ్ళ
ది. 20-11-91

# ప్రస్తావన

మానవ జీవితక్రమ మజ్ఞాత దశనుండి కాలగమనముతోపాటు పరిసరముల చక్కదిద్దుకొనుచు, విజ్ఞానాన్వేషణ చేయుచు సాగిపోవుచున్నది. ఈపెరుగుదలనుగుర్తింపజేయగలపరిశోధనలు గ్రంథస్థములయి భావితరములబాట సుగమము చేసినవి. అయిననూ చంద్రలోకము నందుకున్న యీరోజులలోగూడ పురాతన జ్ఞానాంధతకే పెద్దపీట లభించుచున్నది.

ఆనాడు "దైవాంశీలు" తలగట్టుకున్న రాజులు, యుద్ధములందోటువడిన వారిని దేశబహిష్కృతులను జేయుట, వారి స్మృతులందకుండా నాశనముజేయుట, బానిసలు అస్పృశ్యులుగా సంఘ జీవితమునకు దూరగుల జేయుటవంటి క్రూర చర్యలు కొనసాగించిరి. రాజులు రమణప్పలనే ఘరానా దొంగలు ప్రజలనెంతగా దోచుకొనిరో? వారి పక్షమున సానుభూతి యెవరు చూపగలరు?

పరశురామ శ్రీకృష్ణావతారములలో బ్రహ్మనాయనను, అభిమన్యావతారములో బాలచంద్రుని, కార్తవీర్యార్జునసంతతిలో నలగామరాజాదులను చూడవలసి వచ్చినది. విద్యావిహీనులైన యానాటి ప్రజలకిది సులభోపాయమైనది. కాదన్న వారికంఠములుత్తరింపబడుచుండ నెవరు కాదనగలరు? నేడు నిజము ఋజువుచేయుట కెంత శ్రమపడవలయునో, అంతకు మించి వ్యయప్రయాసలకోర్చి, పలనాటి సంబంధిత ప్రాంతములను చూచి, అనూచానముగా నాయా ప్రాంతములందు చెప్పబడుచున్న విషయముల సేకరణజేసి, చరిత్రగ్రంథముల శాసనముల నాధారముగా తీసికొని మిత్రుడు గుఱ్ఱం చెన్నారెడ్డిగారు చంద్రలోకము నందుకొన్నంత సాహసము చేసినారు. ఈ రచన పాతకాలముల చీకటి

కోణాలలో దాగిన నిజాలను చూవగల సునిశిత దూరదర్శినియైనది. ఆంధ్ర దేశమున జీర్ణించిపోయిన జైనమత యవశేషములను వెదకి, వట్టిగుడులను సాక్ష్యముగా ధృవవర్చిరి. దిగంబరులు, శ్వేతాంబరులు గలరనుటయు, ప్రస్థాపించిరి. మహా దిగంబరులనియెడి యొకశాఖ దిగంబరత్వమునే స్వీకరించిరట. వారు హైందవమున కుదురుకొనలేదట. అందుచే మహాదిగంబర అనువదము క్రమముగా "మాదిగ"గా మారెనట. ఇది చరిత్ర. సాంబ నిఘంటుకారుడు ఆసాది, గొడగరి, గోసంది, మాదిగ అని సూచించినాడు. అమర నిఘంటుకారుడు మాత్రము "పాదూకృత్, చర్మకారః" అను రెండు శబ్దములే మాదిగకు చూపినాడు. ఈ విధముగా చరిత్రపుగల ఈకలోకలూడ్చి, పురాణేతిహాస గ్రంథముల ఆధారముతో నిబద్ధించిన విషయములు దృష్టాంతములకు నిలువవు. కనుక కవిగారొనర్చిన కృషి యనిర్వచనీయము, దృష్టాంతపూర్వకము, అనన్య సామాన్యము. కాలగమనములో గణనీయ స్థాన మేర్పరచుకో గలదు. పాతకాలముల బానిస భావముల తుడిచివేయగలదు.

మ॥ ఒక వర్గానికె విద్య గుత్తకిడి దస్యుల్ క్షుద్రులంచెల్ల వా
రికి పేర్పెట్టి దరిద్రమీదగల తర్బీతిచ్చు కాకమ్మ క
ట్టు కథల్ నేర్పి యవాంఛనీయమగు పుట్టుంబానిస స్థాయి క్రిం
దికి మళ్ళించెడి పాతకాలముల సందేశంబు లింకేటికిన్।

మ॥ నరమేధమ్ములు నశ్వమేధముల పుణ్యంబెందరింగాచె; గో
పురముల్ గుళ్ళును పుణ్య తీర్థముల కైపుల్ కొల్లగొట్టింవ కె
వ్వరి బోనిచ్చెను। పుట్టు బానిసలుగా బంధించు శాస్త్రస్మృతి
స్మరణంబుల్ తలలో వ్రణంబులయి కొంపల్‌గూల్చగా నేర్చెడిస్।

ఉ॥ సాగవికెన్ని నాళులో నిజమ్ము శ్రమాఫలమెల్ల నొక్కచో
పోగొనరించుకొంచు, తమ పొట్టలు పెంచుకొనంగ మెక్కుటల్
రాగల గడ్డురోజుల తరాన్తరలవ్రాతలు నమ్మబోక స్వే
చ్ఛా గమనమ్ము పైపు కనసాగి గ్రహింతురు మానవత్వముల్.

టి. శామ్యూల్ కవి

**M. RAMAMURTHY**
M. A., B. Sc., B. Ed.
Andhra Pradesh H M.P. Industries Federation
M. D. Chairman P. & G. P. Ltd..
Adviser: Sri Rama Krishna Seva Mandali.

RENTACHINTHALA
Dt.........................

# ఆశంస

"పలనాటి చరిత్ర" అను ఈపరిశోధన గ్రంథం బాల్యమిత్రులు శ్రీ గుర్రం చెన్నారెడ్డిగారు గత ఆరుసంవత్సరాలుగా ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఎన్నో పురాతన శాసనాలను పరిశీలించి, వీరగాథల్ని విని వాటి ఆధారంతో మనకు తెలియని ఎన్నో చారిత్రక వాస్తవాలను బహిర్గతం చేశారనటంలో సందేహం లేదు.

పలనాటి చరిత్రలో ప్రధాన వ్యక్తిగా ఉన్న బ్రహ్మనాయుడు అత్యుత్తమ నాయకుడుగా, బాలచంద్రుడు శౌర్యసంపన్నుడుగా, నాగమ్మ కుటిల కుతంత్రాలకు ప్రఖ్యాతినొందిన వనితగా వాడుకలోనున్నది. కాని, ఈపరిశోధన గ్రంథం ద్వార శ్రీచెన్నారెడ్డిగారు తద్విరుద్ధాభిప్రాయాలను సేకరించి అందించారు. దీనినిబట్టి కొన్ని వేలసంవత్సరాలనాటి చరిత్రలు కూడా వాస్తవాన్ని మభ్యపెట్టి ఇతిహాస రూపంలో ఇష్టమొచ్చిన రీతిలో వ్రాసినట్లు అర్థమౌతుంది. కనుక చారిత్రక పరిశోధకులు విశేష కృషి సలిపి నిజానిజాలను నిగ్గుదేల్చి భావితరాలవారికి అందించవలసిన బాధ్యత ఎంతైనావుంది. ఇలాంటి కృషిని ప్రభుత్వం అన్నివిధాల ప్రోత్సహిస్తే చక్కని ఫలితాలు రాగలవని నా అభిప్రాయం.

అనేక శ్రమలకోర్చి రూపొందించిన ఈ పరిశోధన గ్రంథాన్ని రచయితలు, విమర్శకులు, చారిత్రక పరిశోధకులు సంపూర్ణ అవగాహన చేసుకొని ఈ అభిప్రాయాలు ఎంతవరకు వాస్తవమో సరియైన సాక్ష్యాలను సేకరించి ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యత వారికుంది. ఏది ఏమైనప్పటికీ ఈ గ్రంథం ఒక నూతన అధ్యాయాన్ని నెలకొల్ప గలదని సహృదయులు దీనిని సద్భావంతో సమీక్షచేసి ఆదరించగలరని ఆశిస్తూ పలనాటి దర్శక బ్రహ్మ అయిన శ్రీగుర్రం చెన్నారెడ్డిగారిని

అభినందిస్తున్నాను.

M. RAMAMURTHY.

*P. Jagannadha Rao,*
B. A., B. L.
Munsif Magistrate, Macherla

Phone: 60006
12-1-21/3, Upstairs
Ganjipet,
VISAKHAPATNAM-2
Date 27-4-1991

SRI SAI

I had the great pleassure of going through the Script "పలనాటి చరిత్ర" written by SRI GURRAM CHENNA REDDY of Rentachintala, Guntur District and it focussed the realities of the then culture, living and temperment of those devine souls and his collection of information is really of considerable strain and he deserves to be encouraged in getting the script printed and brought to light as otherwise in course of time people may not have History of Palanadu at all for the generation to come.

With Best Wishes
P. JAGANNADHA RAO

# కృతజ్ఞతా నివేదనం

ఈ పరిశోధనకు నిండుహృదయాలతో అమూల్య సూచనలిచ్చిన సర్వశ్రీ డా॥ కంభాళమఠం బసవలింగదేవర, కర్నూరపు జేసురత్నం, డా॥ బిట్టు వెంకటేశ్వర్లు, ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, కోటపాటి మురహరిరావు, దిడుగు చక్రపాణి, రెంటాల వెంకటసుబ్బారావు, తిరునగరి రామాంజనేయులు. యన్.కె. సలామ్, ఎం. ఎ., గన్నిశెట్టి వెంకటేశ్వరరావు,

విషయసేకరణలో, క్షేత్రపర్యటనలో సహకరించిన సర్వశ్రీ బోయపాటి ఆరోగ్యరెడ్డి, కె. రాములు, మేడం శేషిరెడ్డి, బొడ్డపాటి అక్కిరెడ్డి, యన్. పెంటారెడ్డి, అడపా బావనయ్య, P.A.O., ఉడుముల చిన్నపురెడ్డి, పామిరెడ్డి ఆంజనేయరెడ్డి, గుర్రం మల్రెడ్డి, కటకం విజయకుమార్ రెడ్డి.

పుస్తక ప్రచురణకు ఆర్థికంగా తోడ్పడిన సర్వశ్రీ డా॥ గాలి బాలి D D (బిషప్ గుంటూరు) శిద్దగిరి నంజిరెడ్డి, MRO, రెవ॥ ఫా॥ పి. ఇన్నయ్య (డి. సి. ఎల్.) గాదె జోజిరెడ్డి, దేవరశెట్టి నాగేశ్వరరావు, యమ్. రామమూర్తి, డా॥ యన్. మధుసూదనబాబు, రెవ॥ యం. రాయపరెడ్డి, రెవ॥ సి. రాజారెడ్డి, కట్టమూరి భిక్షాపతి, రెవ॥ ఎ. శౌరయ్య, పాశం నర్సిరెడ్డి, ఎం. పి. పి. వంగా బలరామిరెడ్డి, విక్టోరియా మెమోరియల్ ఆనందసమాజం, కటకం మల్రెడ్డి, ఆత్మకూరి అంకాళయ్య, డా॥ పి. చక్రారెడ్డి, యరబోతు నాగభూషణం, నాళం నరసింహారావు, మిట్టపల్లి రామారావు, వై. నరసయ్య, కొమ్మారెడ్డి జోజిరెడ్డి, ఏచూరి కోటేశ్వరరావు, హెచ్. నాగేంద్రం, Erich Frink, బెల్లి విశ్వనాథం, కె. రామాంజనేయులు, వై. యస్. యల్. జి. ముక్తేశ్వరరావు, పొట్టిమూర్తి సంపూర్ణారావు.

ఈ పరిశోధనలో నాకు సహకరించిన కథకులకూ, కళాకారులకూ.

ఈ గ్రంథాన్ని ఓపికగా చదివి వారి అమూల్యాభిప్రాయాలను అందించిన ఆచార్య సి. నారాయణరెడ్డి, ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు, ఆచార్య వి. రామచంద్రచౌదరి, ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, డా॥ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి, టి. శామ్యూల్ కవి (సంయమీంద్ర) గారలకు ధన్యవాదాలు.

— రచయిత.

# ఆకాంక్ష

ఆంధ్రదేశంలో మరోభారతగాథగా వినుతికెక్కిన వీరగాథ పలనాటి చరిత్ర. రచయితగా, రంగస్థల నటులుగా, దర్శకులుగా పరిశోధకులుగా పరిణితి చెందిన శ్రీగుర్రం చెన్నారెడ్డిగారు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఈ 'పలనాటి చరిత్ర' గ్రంథాన్ని రచించి, ఈ కృతికి స్వీకర్తగా నుండమని నాముందుంచారు. అందుకు హృదయపూర్వకంగా అభినందిస్తూ అంగీకరిస్తున్నాను.

ఆంధ్రలో ఆరుసంవత్సరాలపాటు అవిరళ కృషితో, అకుంఠితదీక్షతో స్వలాభాపేక్షనాశించక అనేక శాసనాలను పరిశీలించి, కథకుల వీరగాథల్ని మననం చేసుకొని, సంబంధిత ప్రాంతాలను దర్శించి, వాస్తవాలను సేకరించి సత్యదృష్టితో సంతరించిన గ్రంథమిది. నా దృష్టిలో ఇదొక Up h task. చరిత్రకు హేతువును చూపిస్తూ వ్రాసిన ఇలాంటి గ్రంథాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తే, కొన్ని వేల సంవత్సరాల వెనుక దాగిన చారిత్రక రహస్యాలు బహిర్గతం కావడానికి మంచి అవకాశముంది. ఇలాంటి కృషి భావితరాలవారికొక స్ఫూర్తినిస్తూ, నూతనోత్తేజంతో ముందుకు సాగడానికి, వాస్తవ సంగ్రహణకూ మార్గదర్శకమౌతుంది.

పలనాటి చరిత్ర వాస్తవ దృక్పథం పలనాటివారికే పరిమితం కాకుండ, దేశప్రజలందరికీ తెలియపరచడం ముదావహం. చిరకాలంగా నాకూ, పలనాటి ప్రజలకూ ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ గ్రంథ స్వీకారం మరింత దగ్గరకు చేర్చిందనడంలో సందేహంలేదు. నా రాజకీయ జీవిత ఔన్నత్యానికి పునాది పల్నాటిప్రజల ఆప్యాయతలు, అనురాగాలే! ఈ పరిశోధన గ్రంథం సర్వులకూ సమతుల్యంగా సంతృప్తిని కలుగచేస్తుందని నా ఆకాంక్ష.

కాసు బ్రహ్మానందరెడ్డి

ది. 15-2-92.

# కృతిస్వీకర్తలు



శ్రీమతి కాసు రాఘవమ్మ, శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారలు

# కానుక

తలమున్కల్‌గల రాచకార్యముల రాద్ధాంతాలలో నుండినన్
పలనాడన్న నొకింత తేరుకొని సంభాషించు ధీశాలి-ని
ర్మల వాత్సల్యము నిచ్చి పుచ్చుకొను బ్రహ్మానందరెడ్డిన్ యశః
కలితున్ చేకొనుమంచు నీ కృతిని కాన్కస్పెట్టి కాంక్షించెదన్.

తలపై పెట్టిన గాంధిటోపి సవరింతల్ సేయుచున్నిల్చి, కా
కలు పుట్టించెడు రాజధర్మముల వక్కాణించి వాదించినన్
తలలాడించెదు వారెకాని, ప్రతివాదాల్ సేయ సందేహులై
పలుకం జాలక మిన్నకుందురట "వాహ్వా" కాసు వంశాగ్రణీ!

నిన్నొక వేల్పువోలె మది నిండుగగొల్చెడి రాఘవమ్మ నీ
సన్నిధి నిత్యమున్నిలిచి శక్తిని భక్తిని నీకొసంగి, అ
భ్యున్నతిగోరి కన్పడ, మహోత్తమమై వెలుగొందు జంటగా
నున్నతి గాంచినారలిట ఉర్విని విజ్ఞులు మెచ్చురీతిగా!

— గుర్రం చెన్నారెడ్డి

# విజ్ఞాపనం

ఇది పలనాటి చరిత్ర. తెలుగు భాషకు అక్షర రూపం ప్రజల్లో కొందరికైనా సరిగా అందనిరోజుల్లో జరిగిన చరిత్ర. ఇంతకు ముందూ, ఇప్పుడూకూడా వరంపరగా వచ్చే ఐతిహ్యాలతో కలగాపులగంగా కలిసి పోయిన 12వ శతాబ్దపు చరిత్ర. మొదట్లో కొందరు నిరక్షరాస్యులు భావోద్వేగంతో అల్లుకుని, జానపద కళారూపంలో పొదిగి, ఆడుతూ పాడబడిన చరిత్ర.

ఈ జానపద కళారూపాలు సమకాలీన సమాజ స్థితిగతులకు దర్పణాలై చరిత్రకు శాశ్వతం ప్రసాదించిన సజీవ ప్రతిబింబాలు. ఈ జానపద కళా సంపద ఒకరినోట మరొకరు వినటం, వాచ్యార్థాన్నీ, భావ ప్రకటననూ, ఆంగికాభినయాన్నీ అనుకరించి ప్రదర్శించటంద్వారా తరతరాల దాకా నిలిచి, ఈనాటికీ ఆనాటి చరిత్రను తెలుపుతుందనేది జగమెరిగినసత్యం. కాని, రానురాను అనేక కారణాలవల్ల చారిత్రక కథలూ, కథల్లోని వ్యక్తుల వ్యక్తిత్వాలూ, పెట్టుబడిదారీ విధానానికీ, అధికార నియంత్రణకూ లోనై కొన్ని గొప్పగా చిత్రింపబడ్డాయి. మరికొన్ని అల్పీకరింపబడ్డాయి, అపార్థాలకు లోనయ్యాయి. పైగా కథ పండికొనుటకోసం కాలానుగుణంగా రకరకాల టక్కులూ చమక్కులూ జోడించి ప్రదర్శించటం అలవాటు చేసేవని. అలాంటి నేర్పులవల్ల కొంత మార్పుకూ, మరికొంత చేర్పుకూ అవకాశముంది. ఎన్ని మెలికలుతిరిగినా చరిత్రకు చావులేదుగదా! అది చిరంజీవి.

ఇతిహాసపు చీకటికోణం అట్టడుగునపడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు దాచేస్తే దాగని సత్యం

అని విశ్లేషించారు శ్రీ శ్రీ గారు

అందుకే నా శక్తిమేరకు ఆరుసంవత్సరాలుకృషిచేసి, నాకులభించిన సాక్ష్యాధారాలతో పలనాటి చరిత్ర లోతులను వెతికి, వెలికితీసి హేతువును చూపిస్తూ సమీక్షించాను. ఆ సాక్ష్యాలను ఇందులోనే పొందుపరిచాను. కేవలం పుస్తకాలను చూసి పుస్తకాన్ని వ్రాసే ధోరణితోకాక, పుస్తక పరిశీలనతోపాటు, ఆంధ్రదేశమంతటా పర్యటించి, పరిశోధించి వ్రాసిన చరిత్రయిది. చారిత్రక పరిశోధకులకు ఎంతో విషయ సామగ్రి అందించాలనే కుతూహలంకొద్దీ వ్రాయటం జరిగింది. అయినా చారిత్రి కాంశాల్లో ఎంత శోధించి వ్రాసినా ఎంతో కొంత మిగిలిఉండకపోదు.

ఇంతకు ముందు తెలుసుకున్నవారిముందు ఇప్పుడీ పలనాటి చరిత్రను ఉంచుతున్నాను. సౌహృదయ పాఠకమహాశయుల సౌమనస్యమే ఈ రచయితకు సౌభాగ్యం. పరిపూర్ణ హృదయులైన పండిత విమర్శకుల పరితోషమే ఈ పరిశోధకుడికి సంతోషం.

గుర్రం చెన్నారెడ్డి

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1 | అనుగురాజు పలనాటి రాజ్య సంపాదన | 1 |
| 2 | పలనాటి హైహయరాజ వంశక్రమం | 10 |
| 3 | అనుగురాజు తెలంగాణంలోని పాలమూరు నుండి రాక | 11 |
| 4 | పల్నాడు అనేపదమెలావచ్చింది | 24 |
| 5 | నాయకురాలు నాగమ్మ పుట్టు పూర్వోత్తరాలు | 60 |
| 6 | నాగమ్మ సాధించిన పల్నాటి నాయకత్వం | 68 |
| 7 | హైహయరాజుల కాలంలో పల్నాట కులాలు, మతాలు, సాంఘిక జీవనాలు | 76 |
| 8 | బ్రహ్మనాయని కులం-గోసంగులతో అతని అనుబంధం | 80 |
| 9 | నాగమ్మ శివభక్తి-మతసహనానురక్తి | 94 |
| 10 | బ్రహ్మనాయని వైష్ణవ మతయుక్తి-దైవవిగ్రహాలపై ఆసక్తి | 97 |
| 11 | బ్రహ్మనాయని క్షుద్రదేవతారాధన- అలరాజు హత్యకు కుట్ర | 101 |
| 12 | అలరాజు హత్యకు బ్రహ్మనాయుడే కారణ | 108 |
| 13 | బ్రహ్మనాయని వరకట్నదాహం | 115 |
| 14 | నాయకురాలు నాగమ్మ కళాపోషణ | 118 |
| 15 | వ్యభిచారాన్నీ, చౌర్యాన్నీ విచ్చలవిడిగా సాగించిన బ్రహ్మనాయుడు | 120 |
| 16 | బ్రహ్మనాయుడు చేసిన హత్యలు-చూసిన భయోత్పాతాలు | 128 |
| 17 | చాపకూడు-బ్రహ్మనాయుడు | 138 |
| 18 | బ్రహ్మనాయుడు చేయించిన చివరి హత్య | 150 |
| 19 | కోడిపందెం | 154 |
| 20 | పలువురి పాలనలో పల్నాడు | 169 |
| 21 | మాచెర్ల-చెన్నకేశవాలయాలు | 172 |
| 22 | ఉపయుక్త గ్రంథాలు, వ్యాసాలు | I |
| 23 | మౌఖిక కథలు | III |
| 24 | కొన్ని చారిత్రిక అంశాలు, వాటి కాలాలు | IV |
| 25 | పల్నాటి వీరులు-నాటకం | 1 to 90 |

# దైవస్తుతి

కేవల మానవాకృతిని కీల్పడు బాలుడు, నాకవైభవ
శ్రీ విలసిల్లు శోభితుడు, చిన్మయరూపుడు, దివ్యతేజుడై
భూవలయమ్ము నందడుగు మోపిన పావడు, విశ్వపూజ్య సం
భావనగొన్న బాలభగవానునికేను నమస్కరించెదన్.

# అనుగురాజు పలనాటి రాజ్య సంపాదన

క్రీ.శ. 12వ శతాబ్దంలో పల్నాడును పాలించిన హైహయ రాజ వంశంలో సంభవించిన అన్నదమ్ముల కలహం, వారి పోరాట పరాక్రమాలను వర్ణిస్తూ, జానపదులు గానంచేసే గాథల్ని ఆధారం చేసుకొని క్రీ.శ. 15-16 శతాబ్దాల్లో రచించిన మంజరీ ద్విపద కావ్యాలే 'పల్నాటి వీర చరిత్ర'. ఆ తర్వాత క్రీ.శ. 1862లో ముదిగొండ వీరభద్ర కవిగారు 'వీర భాగవతము' అను పేరుతో ఈ పల్నాటి వీర చరిత్రను పద్య కావ్యంగా రచించారు. ఇక ఈ చరిత్రకు సంబంధించిన తక్కిన కావ్యాలన్నీ పూర్వ కవుల ననుసరించి రచించిన వర్తమాన కాలానివి. దాదాపు అన్ని కావ్యాలూ పురాణ పద్ధతిలో నడిచినవే.

పూర్వమీ చరిత్రను రచించిన ద్విపద కావ్యాలకూ, ముదిగొండ వీరభద్ర కవిగారు రచించిన పద్య కావ్యానికీ, అచ్చటచ్చటా కొంత వైవిధ్యం లేకపోలేదు. పరిశీలించి చూస్తే, వీర విద్యావంతులు (మాలలు) పిచ్చుకుంట్లు (బిచ్చకుంటివారు) మొదలైనవారు, వంశానుగతంగా చెప్పే పల్నాటి వీర చరిత్ర కథలకూ, వీర భాగవతమనే ఈ పద్య కావ్యానికీ చాలా దగ్గరి పోలిక ఉన్నాయి. అయినా, అంతకు పూర్వపు ద్విపద కావ్యాల్లోవలె, ఈ పద్య కావ్యంలో కూడా కొన్నికొన్ని ఘట్టాలను, అందులో చరిత్ర కందేవానిని వదలివేసినట్లు, కథకులు చెప్పే కథల్ని వింటే అర్థమౌతుంది. వీని నన్నింటినీ క్రోడీకరించుకుని అవగాహన చేసుకుంటే; హైహయుడైన అనుగురాజు, పలనాటికి చేరిన చరిత్ర యీ విధంగా వుంది.

ఉత్తర హిందూ దేశంలో పాలమాచాపురి అనే పట్టణ ముంది. దానికి జంభనాపురి, కనకజంభనాపురియని నామాంతరాలు. దాన్ని అనుగురాజు పరిపాలిస్తున్నాడు. ఇతడు కార్త వీర్యార్జునుని కేడవతరం వాడు. కార్త వీర్యార్జునుని సంతతి వాడగుట చేతనే, అనుగురాజు హైహయుదని చరిత్ర

రాదుల నిర్ణయం. పూర్వం కార్తవీర్యార్జునుడు చేసిన బ్రహ్మహత్యాదోషం, ఈ అనుగు రాజును బాధింపగా, బ్రాహ్మణుల ఆలోచనమేరకు జీడినూనె గుడ్డలు ధరించి, సచివులూ, సైన్యాధిపతులూ, సర్వసైన్యమూ, వారివారి కుటుంబాలూ, సమస్త సంపదా, అంతఃపుర కాంతలూ, చివరకు తన యిలవేల్పయిన కనకాద్రి చెన్నకేశవ విగ్రహాన్ని, - పీఠంతో సహా పెకలించుకుని, తీర్థ యాత్రలకు బయలుదేరాడీ అనుగురాజు. ఏ పుణ్య క్షేత్రంలో స్నానం చేస్తే, తాను ధరించిన నీలికోకలు తెల్లబడుతాయో, ఆ పుణ్య తీర్థంలో తన నంటుకున్న బ్రహ్మహత్యాదోషం తొలగిపోతుందని వారి ఆలోచన. ఇదీ అనుగురాజుగారి ప్రయాణం.

ఈ ఆలోచనతోనే, అనుగురాజు ఉత్తరదేశం నుండి ప్రయాణం చేస్తూ, తీర్థ యాత్రలు సేవిస్తూ దక్షిణ దేశానికి వచ్చి, ఆంధ్ర దేశంలోని మోటుపల్లి వద్ద సముద్ర స్నానం చేస్తే, తాను కట్టుకున్న మలిన వస్త్రాలు తెల్లబడ్డాయి. దానితో తన నంటుకున్న పాపమూ తొలగి పోయింది అని ఈ దిగువ పంక్తులు తెలుపుతున్నాయి.

కృష్ణవేణును దాటి కొమరొప్పగాను
మోట్లుపల్లెకు వచ్చి మోదంబు తోడ
సాగర జలముల స్నానంబు చేయ
కట్టు పుట్టములెంతొ కాంతి చెన్నొందె
అగణిత చారిత్రు డనుగు భూవిభుడు
సకల దేవతలకు సాగరం బిదియు
ముక్తికినిది మంచి మూలమార్గంబు
ఈ సాగరము దరి నిరవుగా మేము
కొన్ని నాళ్ళుండగా కోర్కె జనియించె.[1]

ఇక వీరభద్రకవి తన 'వీర భాగవతము'లో; అమరావతి వద్దనున్న కృష్ణానదిలో స్నానంచేసి అనుగురాజు పాపాలు పోగొట్టుకున్నాడని చెపుతూ

1. పలనాటి వీర చరిత్ర-పద కావ్యం-పింగళి లక్ష్మీకాంతం - పుట 20

కం॥ బంధ విరామంబునఁ బ్రతి
బంధంబులు బాయ నాత్మబంధు తత్సం
బంధులు కృష్ణావిమల క
బంధంబుల మునిఁగి తేలి వడసరి సుఖముల్.

ఆ చేతనములు లేని జీడి పుట్టంబులు
దివ్యతీర్థ మహిమఁ దెల్లనయ్యెఁ
బంచ జనులు చేయు పాపంబులుండునే
స్నాన విధుల సేయ సమయుగాని.

కం॥ ఉత్తర దేశాధీశ్వరుఁ
డుత్తమ వంశజుఁడు సద్గుణోపేతుఁడుఁ దా
నిత్తటిని జలకమాడన్
క్షత్తలతో నున్నవాఁడు సంప్రీతుండై.

'అమరలింగేశ దివ్యాభిషేకంబునఁ బరమ కైవల్య సంప్రాప్తి కలుగుఁ' నని షించి.[2] అక్కడ కొంతకాలముండ నిశ్చయించాడు.

ఇదే ప్రస్తావము వచ్చినప్పుడు శ్రీ సూరపురాజు వెంకట్రామయ్య గారు తన 'చెన్నకేశవస్వామి క్షేత్ర మాహాత్మ్యము' అను పుస్తకంలో 'మహాదేవి చెరువు' (నేటి మాచెర్ల) కు దగ్గరున్న చంద్రవంక నదిలో స్నానమాడి పావ విముక్తుడయ్యాడని వివరించారు. ఇక జానపద గాథాకారులు దాదాపు అందరూ, అనుగురాజు కట్టిన మలిన వస్త్రాలు; మాచెర్ల చంద్రవంక నదిలో స్నానం చేస్తేనే తెల్లబడ్డాయని వ్యాఖ్యానిస్తారు.

ఎవరేమి చెప్పినా; ఆంధ్ర దేశంలో ఏ ప్రాంతంలో తీర్థ స్నానాలు చేసి పాపాలు బాపుకున్నాడని వివరించినా; అనుగురాజు ఉత్తర దేశం

2. వీర భాగవతము-పద్య కావ్యం-ముదిగొండ వీరభద్ర కవి-పుట 43

నుండి ఆంధ్ర దేశానికి వచ్చాడని వివరించడంలో అందరూ ఒకే అభి ప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాని, ఇది యధార్థమనీ, చారిత్రక సత్య మనీ చెప్పటానికి వీల్లేదు. ఇది కేవలం అభూత కల్పనతో కూడిన కట్టుకథ. అనుగురాజు తాను ముందుముందు చేయబోవు రాజకీయ కార్యకలాపాలకు, అనుకూలంగా మలచుకోవటానికి మాత్రమే వేసిన ఎత్తుగడలా కనిపిస్తుంది. తీర్థయాత్ర అనే నెపంతో, ఆనాటి ప్రజల్ని పక్కదోవ పట్టించటానికి వేసిన పాచికే యిది.

ఉత్తరదేశం నుండి వచ్చాడనుకుంటే 'పాలమాచాపురి' అని అచ్చమైన తెలుగు పేరుతో వ్యవహరింపబడే గ్రామం, ఉత్తర దేశంలో ఉండట మేమిటి? పైగా అనుగురాజు తన రాజ్యాన్ని వదలి వస్తు న్నప్పుడు, ఆయన వెంట వచ్చిన తన భార్య విద్దెల (విద్యల) దేవి, రాజోద్యోగులైన దొడ్డనాయుడు, తెప్పలి వాయుడు, పెద్దన్న, బ్రహ్మన్న, పేర్నీడు, సూర్నీడు, మల్నీడు, కన్నమనీడు అంతా తెలుగు వారు. ఇక వారి ననుసరించి వచ్చిన పద్మనాయకులు, ఆవాలవారు, అచ్యుతవారు, బల్మూరువారు, పైడి చుక్కలవారు, పాలెమువారు, అట్లూరి, ముట్లూరి, ఆభ్యలవారు, ముతసాని, ముయ్యూరువారు, బండారు, బాదం, గోవిందులవారు, కొండవిందులవారు మొదలైన ప్రధాన కార్యపురుషు లంతా తెలుగు పేర్లతో వ్యవహరింప బడుతున్న వారే. వారితోపాటు శీలమ్మ, పెద్ద సాెమ్మ, పెమ్మ సానెమ్మ; వారివారి కోడళ్ళూ, వారి అనుచర గణమూ అంతా స్వచ్ఛమైన తెలుగు దేశపు పేర్లతో వ్యవహరింప బడుతున్న వారే. ఇంత మంది తెలుగువారు ఉత్తర దేశంలో ఉన్న ఒక రాజు కొలువులో వున్నారనటం అసంగతం, అసమంజసం.

అంతేకాక, అనుగురాజు తన ఇలవేల్పుగా తెచ్చుకున్న 'చెన్న కేశవ స్వామి' అను పేరుకూడా కేవలం దక్షిణ దేశానికే పరిమితమైన శుద్ధ దేశీయ పదం. 'చెన్న కేశవ స్వామి'అనే పేరుతో పిలువబడే దేవుడు కానీ, ఆ పేరుతోవున్న ఆలయాలు కానీ ఉత్తర దేశంలో ఉండవు. చెన్నుడు, చెన్న కేశవుడు అను పదాలు కేవలం దేశీయాలు. దీనితోపాటు, ఇదే దేవుణ్ణి 'కనకాద్రి చెన్నుడు' అని మరోచోట సంబోధించారు.

పై నుదహరించిన విషయాల నన్నిటినీ చక్కచుకుని పరిశీలిస్తే, ఈ 'కనకాద్రి'అనే పదం కూడా దేశీయమే కావచ్చు. 'కనకాద్రి' అంటే.... బంగారపు కొండ అనే అర్థమున్నప్పటికీ....దాన్ని శుద్ధ దేశీయంగా పరిగణిస్తే ప్రకాశించే కొండ అని అర్థం స్ఫురించకపోదు. 'కనక తప్పెట' అంటే, బంగారపు తప్పెట కాదు గదా! నిప్పునందలి ప్రకాశంచేత 'కనకన' అను తప్పెట. కనుకనే 'కనక తప్పెట' అన్నారు. అలాగే కనకాద్రి కూడా. ఆ అర్థానన్నుసరించే 'కనకాద్రి చెన్నుడు' అని సంబోధించటం జరిగి యుండవచ్చు.

వీని నన్నిటినీ మించిన మరొక విశేషమేమిటంటే.... అసలు తీర్థయాత్రలకు వచ్చిన 'అనుగురాజు'అను పదం కూడా తెలుగు పదమే. తెలుగు రాజులు కూడా క్రీ.శ. 11-12 శతాబ్దాల్లో ఉత్తర దేశాన్ని పాలించినట్లు భారతదేశ చరిత్రలో మనకెక్కడా కనిపించదు. ఇంకా జాగ్రత్తగా పరిశీలించి చూస్తే; పూర్వమేనాడో కొన్ని యుగాల క్రిందట పురాణ యుగంలోని కార్తవీర్యార్జునుడు చేసిన పాపాలు, ఈ అనుగురాజుకు ముందున్న, ఆయన పూర్వుల నెవ్వరినీ బాధించక, ఒక్క ఈ అనుగు రాజునే పట్టి పీడించాయనటం అవ్యక్తం.

పై విషయాలను పురస్కరించుకుని పరిశీలిస్తే; అనుగురాజు తెలుగువాడు. అతని రాజోద్యోగులూ, పరివారమూ అంతా తెలుగువారు. చివర కాయన కదిలి వచ్చిన గ్రామమూ, తెచ్చుకున్న దేవుడూ కూడా తెలుగు పేర్లతో పిలువబడేవే! ఇంత శుద్ధ దేశీయం మనకు యథార్థంగా కనిపిస్తుంటే; అనుగురాజు ఉత్తరదేశం నుండి వచ్చినాడనే వార్తను ఎలా నమ్మాలి?

కనుక, అనుగురాజుకు పూర్వమే, అతని వంశం వారెవరో ఉత్తర దేశం నుండి, ఆంధ్ర దేశానికి వచ్చి, సామంతులుగనో, రాజ్యాధిపతులుగనో ఉండి, తెలుగువారిలో కలిసిపోయి స్థిరపడి యుండవచ్చు. లేకున్న, ఇలాంటి దేశీయ పదాలతో కూడిన పేర్లు ఉండవు. కారణాంతరాలవల్ల వారి రాజ్యాలు పరాధీన మవటంతో; మధ్యలో మరో ప్రాంతానికి వలస

వెళ్ళి యుండవచ్చు. తిరిగి తన రాజ్యాన్ని సంపాదించుకోవాలనే కోరికతో, కపటవ్యూహం పన్ని, తీర్థయాత్రలనే సాకును పనిముట్టుగా ఉపయోగించుకుంటూ సర్వసైన్య సమేతుడై సచివులూ, సైన్యాధిపతులతో సహా బయలుదేరి, ప్రతీకార సాధనకై గోప్యంగా వచ్చిన ఎత్తుగడ తప్ప మరేమీ కాదు. నిజానికి అనుగురాజు, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాలైన ద్రవిడ కర్ణాటకం నుండి కానీ, లేక తెలంగాణా ప్రాంతం నుండి కానీ వచ్చియుండవచ్చు.

చరిత్రకారుల నిర్ణయాన్ని బట్టి, పల్నాడును పరిపాలించిన హైహయరాజులు ఆరుగురని తెలుతుంది. వీరిలో ఈ అనుగురాజుకు ముందే ముగ్గురు హైహయ రాజులు పరిపాలించినట్లు విదితమౌతుంది.

దీనికి సంబంధించిన రెండు శాసనాలు మాచెర్ల చెన్నకేశవస్వామి దేవాలయంలోని ఆవరణలోనున్న 'నాగ స్తంభం' మీద ఉన్నాయి. స్తంభం మూడవ ప్రక్కనున్న ఒక శాసనంలో శక సం॥ 1034 లేక క్రీ.శ. 1113 లో మేడాంబిక కుమారుడు వీరకాముని పరిపాలన కాలంలో ఆదిత్యుడను నాతడు ఈ నాగ స్తంభాన్ని ప్రతిష్ఠించాడని వుంది.

ప్రధాన నాగ స్తంభం ముందర భాగంలో మరొక 94 పంక్తుల పెద్ద శాసన ముంది. అందులో.... శ్రీధరుని కుమారుడు 'ఆదిత్యుడు' 'మహాదేవి తటక' ముఖ్య పట్టణంలో నిర్మించిన ఆదిత్యేశ్వర దేవాలయానికి 'పల్లిదేశ 300' లోని సబ్బియపల్లి గ్రామంలో 200 నివర్తనాల భూమిని, మొదటి చాగి బేతరాజు కానుకగా ఇచ్చినాడని వుంది. అదే దేవాలయానికి పెక్కుమంది ఇతరులు యిచ్చిన కానుకలుగూడా దానిలో పేర్కొనబడ్డాయి. దాని నిర్మాత 'టిప్పోజు'కు యివ్వబడిన కానుక గురించి కూడా ఉదహరించబడింది. ఆతని వంశక్రమం కూడా అందులో వుంది. బేత వీరకాముని కుమారుడు, బేత వీరకాముని మనుమడు, అదే నాగ స్తంభం యొక్క వేరువేరు ప్రక్కలమీద ఉదాహరించబడ్డాయి. ఇప్పటికీ వున్న ఆ రెండు శాసనాలనూ కలిపితే మనకు ముగ్గురు రాజుల వంశక్రమం తెలుస్తుంది.

చాగి బేతరాజు-మేడాంబికను వివాహం చేసుకున్నాడు.
|
వీరకామ

చాగి బేత—2

ఆ పైన రెండవ శాసనంలో శ్రీధరుని కుమారుడు ఆదిత్యుడు మహాదేవి తటక (నేటి మాచెర్ల) ముఖ్య పట్టణంలో ఆదిత్యేశ్వరాలయాన్ని నిర్మించినట్లు చెపుతుంది. దీని తేదీ శక సం. 1033 లేక క్రీ.శ. 1111. ఇక మళ్ళీ మొదటి శాసనంలో శక సం. 1035 లో లేక క్రీ॥ శ॥ 1113 లో ఆదిత్యుడు నాగ స్తంభాన్ని ప్రతిష్ఠించి నట్లుంది.

దేవాలయ ప్రతిష్ఠాపకునికి 'ప్రభువు' అనే అర్థంలో తాను నిర్మించిన ఆలయం పేరును, ఆ ప్రభువు పేరుతోనే దేవుని పేరుకూడా కలిపి ఆదిత్యేశ్వరుడని పిలువబడటం సాధారణమే. కాబట్టి 'ఆదిత్యేశ్వ రాలయం' క్రీ.శ. 1111 లోనూ, నాగ స్తంభం క్రీ.శ. 1113 లోనూ ప్రతి ష్ఠించడం జరిగాయి. కనుక దేవాలయం క్రీ.శ. 12వ శతాబ్దపు తొలి భాగంలో నిర్మించబడి వుండాలి. ఇది దేవాలయపు నిర్మాణపు రీతిలో సరిపోతున్నది కూడా. ఒక్క పల్నాడు ప్రాంతంలోనే కాక, ఆంధ్రలో అచ్చటచ్చటా ప్రభువులు కట్టించిన ఆలయాలకు ఆ ప్రభువుల పేర్లు ముందుంచి పిలవటం ఆనాటి ఆనవాయితీ కావచ్చు. మాచెర్లలోని 'రామప్పగుడి' (శివాలయం) జిట్టగామాలపాటిలోని 'నాయకురాలి గుడి' (శివాలయం) అలాంటివే.

ఇక రెండవ బేతరాజుకు 'బిరుదాంక రుద్ర' అన్న బిరుదు వున్నట్లుగా సత్తెనపల్లి తాలూకాలోని 'బూరుగు బండ' శాసనం వల్లనూ, గురిజాలలోని త్రిమూర్తి దేవాలయంలో క్రీ.శ. 1127 లో వున్న శాసనం వల్లనూ తెలుస్తుంది. ఈతని కాలమైన క్రీ.శ. 1118 లో కులోత్తుంగ మహారాజు మరణించాడు. దానితో అతని కుమారుడు పరాంతకుడు వేంగి దేశం నుండి హడావిడిగా దక్షిణానికి వచ్చాడు. ఆ తొందరలో వేంగిలోని

చోళ స్థావరాన్ని సంఘటిత పరుచుకోవటం మరిచిపొయ్యాడు. అప్పుడు వేంగిదేశానికి అధిపతి లేనికొరత యేర్పడింది.

పశ్చిమ చాళుక్యరాజు 'త్రిభువన మల్ల' తన చిరకాల శత్రువైన కులోత్తుంగ చోళునిపై పగ తీర్చుకొనటానికి–అప్పుడు మంచి అవకాశ మేర్పడింది. ఈ త్రిభువనమల్లకే 'విక్రమాదిత్య'అను మరొక పేరుంది. సమర్థుడైన ఈ యోధుడు ద్విముఖమైన దండయాత్ర జరిపినట్లు 'విక్ర మాంక దేవ చరిత్రం' నుండి తెలుస్తుంది. ఈ ద్విముఖ భాగంలో ప్రధాన భాగమైన చోళమండలం మీదికి స్వయంగా తాను దండెత్తి; ఇక రెండవ భాగమైన వేంగి మీదికి, తన సేనాధిపతులలో మహా సమర్థుడైన మహా ప్రధాని అనంతపాలుణ్ణి పంపించాడు.

ఈ వేంగి దండయాత్ర పల్నాటి మీదుగా జరిగింది. రెండవ చాగి బేతరాజు (బిరుదాంక రుద్ర) రాజద్రోహంచేసి శత్రుకూటంలో చేరి పొయ్యాడు. కాని, ఇది చాలా స్వల్పకాలం.

పశ్చిమ చాళుక్యులు తీవ్రంగా ఎదుర్కొనబడి ప్రతిఘటనకు తట్టుకోలేక వెనుకకు మళ్ళిపొయ్యారు. యుద్ధకాలంలో రెండవ బేతరాజు నశించి వుండాలి. లేదా ఆతని రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్న కులో త్తుంగ చోళులు ఈ రెండవ బేతరాజును బహిష్కరించియైనా వుండాలి. బహిష్కారానికి లోనైన ఈ రెండవ బేతరాజు పశ్చిమ చాళుక్యుల అండజేరి యుండవచ్చు. రెండవ బేతరాజును గురించి, ఆతని తర్వాత శాసనాలేమీ లేక పోవటానికి ఇదే కారణం కావాలి. హైహయ వంశానికి చెందిన తరువాతి పలనాటి రాజుపేరు అనుగురాజు లేక అలుగ్‌రాజు.[1]

ఈ విధంగా పల్నాటి హైహయ వంశాన్ని గురించి తెలుసుకోవ టానికి 'నాగస్తంభం' పై గల శాసనం చాలా ప్రాముఖ్యంవహిస్తుంది. ఈ 'నాగస్తంభం' స్థానిక పాలకుల వంశవృక్షం తెలుసుకోవటానికి మిక్కిలి కీలకమై ఉపకరిస్తుంది.

---

1. గుంటూరు మండల సర్వస్వం – ద్వితీయ ముద్రణ – వ్యాసకర్త – శ్రీ యస్. రమేశన్, ఐ.ఎ. యస్.
సంపాదకులు దరువూరి వీరయ్య – పుటలు 270–271. గుంటూరు

ఈ నాగస్తంభ శాసనాధారం ప్రకారం అనుగురాజుకు ముందే అతని వంశజులైన హైహయరాజులు పలనాడును పాలించినారనేది స్పష్టం.

దీనినిబట్టి పలనాటి చరిత్రను వెల్లడించిన కావ్యాల్లో ఉన్నట్లు అనుగురాజు ఉత్తరదేశం నుండి రాలేదని పూర్తిగా విదితమౌతుంది. దేశ బహిష్కృతుడైన తన అన్న రెండవ చాగి బేతరాజుతోపాటు, అనుగు రాజుకూడా పశ్చిమ చాళుక్యులతో కలిసిపోయి, వారి ఆదరణలో కొంత కాలముండి, క్రమంగా సొంతబల మేర్పరుచుకుని, స్వరాజ్య సాధనకై కపట వ్యూహం పన్ని, నల్గురినీ నమ్మించటానికి తీర్థయాత్రలనే మిషతో సాధువర్తనునిలా బయలుదేరి గతం గుర్తుకు రాకుండా, వారు కదలి వచ్చిన గ్రామ నామాన్ని కూడా మార్చుకుని, అకస్మాత్తుగా చందవోలు రాజైన దుర్జయ రెండవ గొంకరాజుపై దాడి జరిపి; ఓడించి యుండ వచ్చు. సంధి షరతుగా గొంకరాజు కూతురైన మైలమదేవిని వివాహ మాడి, గొంకరాజుకు స్వతంత్రాధిపత్యంగా నున్న పలనాడును అరణంగా పొంది యుండవచ్చు. ఇది యధార్థమనటంలో సందేహం లేదు.

విక్రమాదిత్యుని దండయాత్ర విఫలమైన కారణంగా, పల్నాటిని స్వాధీనం చేసుకున్న మొదటి కులోత్తుంగ రాజేంద్రచోడయ కుమారుడే ఈ రెండవ గొంకరాజు. తండ్రి అనంతర మితడే రాజ్యాభిషిక్తు డయ్యాడు. ఇతను సింహాసనాసీనుడైన తొలి రోజుల్లోనే అనుగురాజు దండయాత్ర జరిపి పల్నాటిని తిరిగి స్వాధీనం చేసుకున్నాడు.

నాకు లభించిన గ్రంధాలు, శాసనాధారాలను బట్టి **పల్నాటి హైహయ రాజవంశ క్రమం.**

కార్తవీర్యార్జునుని సంతతివారు - ఆత్రేయ గోత్రజులు.

ఇంటి పేరు : చాగివారు లేక సాగివారు.

మూల పురుషుడు : చాగి బేతరాజు, భార్య మేడాంబిక.

లేక

మొదటి బేతరాజు : క్రీ.శ. 1100-1111.

- మొదటి వీరకాముడు క్రీ.శ. 1111-1118. — ఈతని కాలమైన క్రీ.శ. 1111 లో ఆదిత్యేశ్వరాలయం, క్రీ.శ. 1113 లో నాగస్తంభ ప్రతిష్ఠ జరిగింది. ఆలయ స్థాపకుడు శ్రీధరుని కుమారుడు ఆదిత్యుడు.
  - రెండవ బేతరాజు క్రీ.శ. 1118-1127 (బిరుదాంక రుద్ర) సంతానం లేదు.
  - అనుగురాజు క్రీ.శ. 1132-1147 ముగ్గురు భార్యలు
    - పెంపుడు కుమారుడు పెద్దన్న లేక బాదరాజు లేక బాదమరాజు (మంత్రి దొడ్డనాయని పెద్దకుమారుడు)
    - మైలమదేవి
      - నలగామరాజు క్రీ.శ. 1147-1182 — రెండప వీరకాముడు, అనుగు కామరాజు, మైలమ కామరాజు } బిరుదులు
      - నరసింగరాజు
    - భూరమదేవి
      - కామరాజు
      - ఝుట్టిరాజు
      - పెదుమాళ్లరాజు
    - విద్యలదేవి, వీరవిద్యలదేవి, విజ్జలదేవి
      - పెదమలి దేవరాజు, భార్య : సిరాదేవి
      - పినమలి దేవరాజు
      - బాలమలి దేవరాజు
  - బిరుదురాజు
  - అర్థరాజు
  - తెప్పలిరాజు
  - తేజస్సురాజు

# అనుగురాజు, తెలంగాణంలోని పాలమూరు ప్రాంతంనుండి పల్నాడుకు రాక.

పశ్చిమ చాళుక్య 'త్రిభువన మల్ల' ఆరవ విక్రమాదిత్యుడు క్రీ.శ. 1127 లో వేంగిదేశం మీదికి దండయాత్ర సాగించి విఫలుడై వెనుదిరిగిపోతూ, యుద్ధ కాలంలో తనకు అండగా నిలిచి, దేశ బహిష్కృతుడైన పల్నాటి ప్రభువు రెండవ సాగి బేతరాజునూ, అతని కుటుంబాన్నీ, పరివారంతో సహా వెంటబెట్టుకుపోయి, తనకు సామంతులైన కందూరు చోడరాజుల అండజేర్చి పాలమూరు (మహబూబు నగరు) లో ఆశ్రయం కల్పించాడు. కాని, అనతి కాలంలోనే బేతరాజు మరణించాడు. అతని మరణానంతరం, అతని తమ్ముడైన అనుగురాజును, సచివులూ సైన్యాధిపతులూ కలిసి తమ ప్రభువుగా ఎన్నుకున్నారు. పూర్వపు ఏరువచోడులే ఈ కందూరు చోడులు.

కృష్ణానదికి దక్షిణాన వున్న కర్నూలు జిల్లాలోని ఆత్మకూరు, ప్రకాశం జిల్లాలోని కంభం, మార్కాపురం, దోర్నాల ప్రాంతాలు; ఇక కృష్ణానదికి ఉత్తరాన వున్న మహబూబునగరు, నల్లగొండ, ఖమ్మం మండలంలోని కొన్ని భాగాలు ఏరువసీమలో ఉండేవి. వీటితోపాటు, ఏరువ రెండవ భీమరాజు (క్రీ.శ. 1065-1077) కల్యాణి చక్రవర్తి ఆరవ విక్రమాదిత్యునికి యుద్ధాల్లో సహకరించి, మహబూబునగరు జిల్లాలోని కందూరునాడును బహుమానంగా పొందాడు. ఆ విధంగా ఏరువ చోడులకు చరిత్ర ప్రశస్థి నేర్పరచిన మొదటి చోడరాజే, రెండవ భీమరాజు. ఏరువసీమ 7000 లతో పాటు, కందూరు సీమలోని 1100 లూ కలిపి, కందూరును రాజధానిగా చేసుకుని ఈ రెండవ భీమరాజు పరిపాలన సాగించాడు. కందూరొక గిరిదుర్గం.

కందూరు రెండవ భీమచోడుని పట్టమహిషి గంగాదేవి. పూర్వ నామమైన 'త్రైలోక్యమల్ల కేశవపురం' అను గ్రామాన్ని ఈ గంగాదేవి పేరు మీదుగా 'గంగాపురం' అని మార్చటం జరిగింది. ఈ గంగాపుర

మొక స్థల దుర్గం. చరిత్ర ప్రసిద్ధమైన ఈ గంగాపురం, మహబూబు నగరు జిల్లాలోని జడ్చర్ల (బాదేపల్లి) నుండి దేవరకొండకు వెళ్ళే మార్గంలో, జడ్చర్లకు 6 కిలోమీటర్ల దూరంలో వుంది. అక్కడొక సుప్రసిద్ధమైన చెన్నకేశవ దేవాలయముండి. అదొక అపూర్వ శిల్పకళా శోభితం. ఆ ఆలయ నిర్మాణానికి వివిధ ప్రాంతాల నుండి, కొన్ని వేల సంఖ్యలో శిల్పులు తరలివచ్చి విగ్రహాలను చెక్కడమే ఒక పరిశ్రమగా నిర్ణయించుకుని, వారివారి ప్రతిభా పాటవాలనూ, శిల్పకళా నైపుణ్యాన్ని తీర్చిదిద్దారని జనశ్రుతి. ఆలయంలోని ప్రతి అంగుళం మేర, రమణీయమైన శిల్పాకృతితో విరాజిల్లుతుంది. ఆలయంలో, గర్భగుడి, ముఖమండపం, అంతరాళ మండపం, రంగ మండపాలతో కూడి, దక్షిణదిశగా ఆలయ కుడ్యాన్ని ఆనుకుని రాజ నర్తకులు నర్తించే రంగస్థల నాట్యవేదిక కూడా నిర్మితమై యుంది. ఆలయ ఆవరణ ప్రాంగణంలో ఈశాన్య దిశగా ఒక పెద్ద బావి, చతురస్ర, దీర్ఘచతురస్రాకారపు నునుపైన రాళ్ళతో, లోతట్టు ప్రాంతమంతా గట్టిగా కట్టబడి ఒక కోనేరులా కనిపిస్తుంది. ఆలయ ప్రాకారమంతా ఎత్తైన కోట గోడలతో, ఆరు కోట బురుజులతో ఆవృతమై, ఆనాటి కందూరు చోడుల శౌర్య పరాక్రమాలకు వెలలేని కీర్తి తోరణంగా నిలిచి, వారి ప్రతిభా పాటవాలకు దర్పణమై, దర్శనీయమై నేటికీ శిథిల రూపంలో దర్శనమిస్తుంది. ఏది ఏమైనా, అది జైనాలయంగా కనిపిస్తుందేకాని, వైష్ణవాలయంగా ఏ కోణంలోనూ కనిపించదు. ఆలయానికి లోపల, వెలుపల అమర్చిన ప్రతి చిన్న రాతిని పరిశీలించినా జైన శిల్పమే. ఇక గర్భగుడిలోని మూల విరాట్టు కూడా పానవట్టంలో అమర్చబడి జైన తీర్థంకర విగ్రహంలా గోచరిస్తుంది. అసలు విషయం ఆలయ పాలకులకే తెలియాలి.

పశ్చిమ కల్యాణి చాళుక్యులలో మొదటి తరాలవారు జైన మతానుయాయులు. వారి పాలనలో నున్నప్పుడా ప్రాంతమంతా జైన బసదులతో, తీర్థంకరుల ఆలయాలతో విలసిల్లింది. ఆ గంగాపురానికి చేరువలో నున్న ఆల్వాన్‌పల్లి ప్రాంతాలలో పురాతత్వ పరిశోధక శాఖ వారు త్రవ్వకాలు జరుపగా, ఎన్నో జైన శిల్పాలు, శిల్ప కళాఖండాలు,

జైనాలయాలు బయటపడ్డాయి. ఒకప్పుడా ప్రాంతమంతా శ్వేతాంబర జైనమతం విస్తారంగా వుండేదని చరిత్రకారుల నిర్ణయం, కనుక పశ్చిమ చాళుక్యుల కాలంలోగానీ, అంతకు పూర్వంగానీ నిర్మితమైన ఈ గంగాపురపు చెన్నకేశవాలయం, ఒకనాటి జిననాథ ఆలయమే కావచ్చు. పైగా గర్భగుడిలోని మూల విరాట్టు పానవట్టంలో ఉండటంచేత, పూర్వమది జైనాలయమని చెప్పుకొనటంలో ఆశ్చర్యం లేదు. తీర్థంకరుడు (తీర్థకరుడు) తీర్థాభిషేకంచే మోక్షాన్ని పొందినవాడు అగుటవల్ల అభిషేకానికి పానవట్టం ఎంతో అవసరం కదా!

ఇలాగే, ఆనాటి జైన సాంప్రదాయాన్ని ఈ నాటికీ మనకు తెలియకుండానే మనమాచరిస్తూనే వున్నాం. జైనులకు, కూష్మాండినీదేవి ఆరాధ్య దైవం. జైన మతం సన్నగిల్లి శతాబ్దాలు మారి, ఆ తర్వాత ఏన్నో మతాలు పుట్టినా, ఆనాటి జైన సంస్కారం ఈ నాటికీ పోలేదు. తీర్థంకర పీఠాలైన పానవట్టాలు, లింగ పీఠాలయ్యాయి. ఆ పీఠాల్లోనే కేశవ విగ్రహాలూ చేర్చబడ్డాయి. ఎవరెన్ని భాష్యాలు చెప్పినా ఈ నాటికీ నూతన గృహాలముందు బూడిద గుమ్మడికాయను (కూష్మాండ ఫలం) కట్టటం జైన సంప్రదాయమే. అలాగే కొబ్బరికాయను కట్టటం శైవ సంప్రదాయం.

అసలీ గంగాపురానికి 'త్రైలోక్యమల్లకేశవపురమ' ని పిలవటానికి కూడా కారణం లేకపోలేదు. పూర్వం కల్యాణీ చాళుక్యుల వంశంలో ఒకటవ సోమేశ్వర దేవుని (క్రీ.శ. 1040-1063) కి త్రైలోక్యమల్ల, ఆహవమల్ల; అను బిరుదులున్నట్లు శాసనాధారాలవల్ల తెలుస్తుంది. ఒకటవ సోమేశ్వరుడు వైదికమత నిరతుడైనా, విష్ణు భక్తుడు. కనుక, అతని కాలంలో, తన విజయ చిహ్నంగా ఆ గ్రామానికి త్రైలోక్యమల్ల కేశవపురమని స్థిరపరచటం జరిగియుండవచ్చు. అతని కుమారుడే త్రిభువనమల్ల ఆరవ విక్రమాదిత్యుడు. ఆ విక్రమాదిత్యుని మూలంగానే కందూరునాడును పొందిన రెండవ భీమరాజు, అతని భార్య గంగాదేవి పేరుమీదుగా, కేశవపురాన్ని గంగాపురంగా మార్పు చేయటంలో కూడా

ఆశ్చర్యం లేదు. అలా గ్రామాల పేర్లు మార్చిన సంఘటనలు కందూరు చోడుల కాలంలో, యింకా కొన్ని లేకపోలేదు.

కల్యాణి చాళుక్యుల ద్వారా కందూరునాడును పొందిన రెండవ భీమ చోడుని తర్వాత, అతని కుమారులైన తొండయ, ఇరుగణ, కొండయ, మల్లికార్జున చోడుల అనంతరం, తొండయ చోడుని కుమారులైన ఉదయన, భీమదేవ, గోకర్ణదేవ చోడులు రాజ్యానికి వారసులయ్యారు. వారిలో ఉదయనుడు బాల్యంలోనే గతించాడు. అతని తర్వాతి వాడైన భీమదేవచోడుడు (క్రీ.శ. 1101-1109) రాజయ్యాడు. ఇతడు గొప్ప పరాక్రమశాలి. ఎలేశ్వరంలోని ప్రయాగ మాధవుని ఆలయం ఇతను నిర్మించిందేనని జన శృతి. అందువల్లనే ఈతనిని ప్రయాగ భీమరాజు అని పిలవటంకూడా కలదంటారు. ఈతని తల్లి మైలాంబిక, ఈతని యసస్సునుగోరి క్రీ.శ. 1124 లో నల్లగొండ జిల్లాలోని పిట్టంపల్లి గ్రామాన్ని 108 మంది బ్రాహ్మణులకు అగ్రహారంగా యిచ్చి, ఆ గ్రామానికి చోడ భీమనారాయణ పురమని నామకరణ మొనర్చింది. ఇతడు కందూరు చోడులలో మూడవ భీమదేవ చోడుడు. ఇతనికింకా నల్లభీమదేవ చోడుడనీ, భీమనారాయణుడని కూడా వ్యవహార నామాలున్నాయి. కనుక, పల్నాటి చరిత్ర కావ్యాల్లో, జానపదుల గాథల్లో చెప్పే గయభీమరాజు ఇతడే కావచ్చు. ఆనాటి పల్నాటి యువరాజైన అనుగురాజు మొదటి భార్యకు సంతానంలేని కారణంగా, ఈ భీమదేవుని కూతురు భూరమాదేవినే రెండవ భార్యగా వివాహం చేసుకున్నాడని చెప్పటంలో కూడా ఆశ్చర్యంలేదు.

కందూరి మూడవ భీమచోడుని పరిపాలనా నంతరం, అతని తమ్ముడు గోకర్ణదేవచోడుడు (క్రీ. శ. 1109-1136) రాజ్యపాలనకు వచ్చాడు. ఈతని కాలంలోనే కందూరు చోడరాజుల అండజేరిన పల్నాటి ప్రభువు వేలరాజు మరణంతో, పలి ప్రభువుగా ఎన్నుకున్న అనుగురాజుకు ఈ గోకర్ణ దేవచోడుడు గంగాపురాన్ని స్థావరంగా ఏర్పాటు చేశాడు. అనుగురాజు, గంగాపురంలో ఉంటూ, తన యిష్టదైవమైన చెన్నకేశవస్వామిని ఆరాధిస్తూ ఉండేవాడు. కానీ, పల్నాటిని ఎలాగైనా

సరే తిరిగి స్వాధీనం చేసుకోవాలనే పట్టుదల మిక్కుటమైంది. ఆ దీక్ష తోనే కృష్ణాతీరానికి ఉత్తరంగా, కందూరు చోడుల ఆధీనంలోవున్న రాయలగండి అడవుల్లో, తన పరివారానికి, బంధుజనానికి స్థావరమేర్పరి చాడు. పినమామ గోకర్ణ దేవచోడుని సహాయంతో రాయలగండి కొండ మీద ఒక చెన్నకేశవాలయాన్ని కూడా నిర్మింపచేశాడు. ఈ రాయల గండికి పూర్వనామం రాయిడిగండి. ఇది అచ్చంపేట తాలూకా అమరా బాదు మండలంలోని మాధవానిపల్లెకు మూడు కిలోమీటర్ల దూరంలోనూ, కృష్ణానదికి ఉత్తరంగా ఇరవైయైదు కిలోమీటర్ల దూరంలోనూ ఉన్న ఒక కొండ. ఇదే అనుగురాజుకు ఆనాటి రహస్య స్థావరమై విషయ సేకరణకూ, వినియుక్త దాడికీ ఆయువుపట్టు అయింది.

రాయలగండి కొండమీద విశాలమైన ప్రదేశంలో కట్టబడిన ఈ చెన్నకేశవాలయం, కొద్దిపాటి శిల్పంతో సుందరంగా ఉంటుంది. ఆలయంలోని గర్భగుడి, ఆ గర్భగుడికి ఎడమవైపున లక్ష్మీదేవి అమ్మ వారి గుడితో కలిపి, ఆలయనిర్మాణం జరిగింది. ఆలయంలో అంతరాళ మండపం, ముఖ మండపంతోపాటు ఉత్తర దక్షిణాలుగా ప్రవేశద్వారాలు కలిగి ఆ కొండకే అలంకార ప్రాయంగా వుంటుంది. యాత్రికుల సౌకర్యార్థం, ఆలయ ప్రాకార ఆవరణలోనే, ఆలయానికి చుట్టూ వసతి మండపాల నిర్మాణం కలిగి భక్తులకు ప్రశాంతి నిలయంగా వుంటుంది. ప్రతి సంవత్సరం ఫాల్గుణ పంచమిరోజు చెన్నకేశవుని తిరునాళ్ళ మొదలై మూడు రోజులపాటు జరుగుతుంది. ఆలయానికి అర్చకులు హరిజనులు (మాలలు) వీరిన్ని అర్చక గురువులని పిలుస్తారు. ఇప్పుడున్న అర్చకునిపేరు శ్రీ దాశరథి సుధాకరయ్యగారు. వీరు అర్చకులేకాక, ఆ ప్రాంతపు చుట్టుపక్కల గ్రామాలలో వున్న హరిజనులకు అందరికీ పురోహితులు, వైద్యులు కూడా. వీరిది పండిత కుటుంబం. భాషాపాటవ మెరిగిన వీరు, గొప్ప పండితులు. వీరికున్న పురాణ పరిచయం గొప్పది. వీరి పూర్వులు మొదట, పల్నాడు తాలూకాలోని మాచెర్లకు ఉత్తరంగా రెండు కిలోమీటర్ల దూరంలోవున్న జమ్మలమడక గ్రామ వాసులనీ, ఆ తర్వాత కొంతకాలానికి అదే తాలూకాలోని యత్రబాలెం

గ్రామంలో స్థిరనివాస మేర్పరుచుకున్నారనీ, వారుకూడా సంగీతంలోనూ, సాహిత్యంలోనూ విద్వాంసులై పూర్వకాలంలో చెన్నకేశవ ఆలయాలకు అర్చకులుగా ఉండేవారని చెపుతుండేవారట. ఈ సుధాకరయ్యగారికి సంగీత పరిచయంకూడా లేకపోలేదు. జమ్మలమడక అనే గ్రామం, పూర్వమెనాడో మాచెర్ల చెన్నకేశవస్వామికి అగ్రహారంగా యివ్వబడిన గ్రామం. ఈ దాశరథి సుధాకరయ్యగారికి ఇప్పటికీ పల్నాటి బాంధవ్యం మాచెర్ల సమీపాల్లోని కోలగుట్ల, యర్రబాలెం గ్రామాల్లో కొనసాగుతూ వుంది. ప్రస్తుతం వీరి నివాసం రాయలగండి కొండ సమీపంలోని మాధవాని పల్లె. ప్రస్తుతమీ మాధవానిపల్లెలో మూడు వందలకు పైగా హరిజన (మాల) కుటుంబాలున్నాయి. వీరందరికీ కలిపి ముప్పైదాకా గృహనామాలున్నా, అందరిదీ బ్రహ్మనాయని గోత్రమైన రేచర్ల గోత్రమే.

ప్రస్తుతమీ రాయలగండి చెన్నకేశవాలయం జీర్ణమై శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఆలయానికి అగ్రవర్ణాల సహకారం కొంతైనా లేదు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ మల్లు అనంతరాములు గారి సారథ్యంలో, ఆనాటి మహబూబునగరు జిల్లా కలెక్టరుగారి అధ్యక్షతన ఈ రాయలగండి చెన్నకేశవాలయానికి ఒక పునరుద్ధరణ కమిటీ యేర్పాటైంది. కానీ, అనంతరాములుగారి మరణంతో అదికూడా కుంటుబడి పోయింది.

పూర్వమెప్పుడో రాయలగండి చెన్నకేశవస్వామికి 50 ఎకరాల మాన్యపు భూమి; ఆ కొండ ప్రాంతంలోనే ఉండేదనీ; అనుగురాజు పల్నాటి పరిపాలనకాలంలో, ఆ హరిజనులూ, అర్చకులూ అంతా పల్నాడు చేరారనీ, తిరిగీ పల్నాటి యుద్ధానంతరం అదే హరిజన కుటుంబాలకు జీవనభృతి లోపించి తలకొకదారిని పోగా, కొందరు వారి పూర్వ స్థావరమైన ఆ రాయలగండి ప్రాంతాలకే వెళ్ళారనీ జనశృతి. కాని, అప్పటికే దిక్కులేక ఎన్నో దశాబ్దాల తరబడి చెన్నకేశవ స్వామికి అర్చనలేని కారణంగా, ఆ మాన్యపు భూమి 50 ఎకరాలనూ అటవీశాఖ (రిజర్వు ఫారెస్ట్) లో విలీనం చేయటం జరిగింది. మాన్యం లేక

పోయినా, చివరకు చెన్నకేశవస్వామి ఆలయానికైనా సమర్పించమని ప్రాధేయపడితే, అతి ప్రయాసమీద వారికోరిక మన్నించి, అనాది పాలకులు చెన్నకేశవ ఆలయం వరకే వారికిచ్చారని, ఆలయార్చకులు దాశరథి సుధాకరయ్యగారు చెప్పారు. 'అనాటి నుండి ఈనాటి వరకు ఎందరు రాజులు మారినా, ఎన్ని ప్రభుత్వాలకు వినతి చేసుకున్నా, మా మొరవినే నాథుడే లేక ఆ మాన్యపు భూమిని సాధించుకొనలేక పోయ్యామనీ, పైగా ఆలయానికి ఇతరత్రా వివిధమైన రాబడి లేకపోవటంతో స్వశక్తిమీదనే ఆధారపడుతూ, మిత్రులైన బొటా రామకోటి, చవ్వా బాలచంద్రయ్యల సహకారంతో ప్రతి సంవత్సరం తిరునాళ్ళ మాత్రం జరుపగలుగుతున్నామనీ, చివరికదికూడా శక్తికి మించిన భారమైంద'ని అర్చకులు ఎంతో బాధను వ్యక్తం చేశారు.

మహబూబునగరు (పాలమూరు) జిల్లాలోని గంగాపురం గ్రామంలోనూ, రాయలగండి కొండమీదనూ సుస్థిర స్థావరాలేర్పరచుకున్న అనుగురాజుకు, మంత్రి దొడ్డనాయుడూ, అతని రెండవ కుమారుడు బ్రహ్మనాయుడూ, సైన్యాధిపతి తెప్పలి నాయుడూ కలిసి పలనాటిపై దండెత్తటానికి తగినంత బలం సమకూర్చారు.

క్రీ. శ. 1127 లో పల్నాడును స్వాధీనం చేసుకున్న మొదటి కుళోత్తుంగ రాజేంద్ర చోడయ క్రీ.శ. 1132 లో గతించాడు. వెంటనే అతని కుమారుడు రెండవ గొంకరాజు (క్రీ.శ. 1132-1161) సింహాసనాధిష్ఠితు డయ్యాడు. కాని, రాజ్యపాలనలో అనుభవ లోపంవల్ల పరిపాలన కొంతవరకు కుంటుపడింది. అదే అదనుగా భావించిన అనుగురాజు, రాయలగండి ప్రాంతంలో వున్న తన పరివారాన్ని సన్నద్ధం చేశాడు. తన పినమామ కందూరు గోకర్ణచోడుని సహాయంతో కొంత సైన్యాన్ని పొందాడు. అయినా గొంకరాజును స్వయంగా ఎదుర్కొనే ధైర్యం చాలక, తీర్థయాత్రలనే నెపంతో సాధుశీలిలా బయలుదేరి ఊహించని రీతిలో యుద్ధంచేసి పల్నాడును స్వాధీనం చేసుకోవాలనుకున్నాడు. తీర్థయాత్రలకేనని నమ్మించడానికి అప్పటికప్పుడు బ్రహ్మనాయని ద్వారా కనకాద్రివల్లె సమీపంలో, ఒక చెన్నకేశవ విగ్రహాన్ని

రహస్యంగా తెప్పించి రాయులగండి కొండమీద భద్రపరిచాడు. తాను బయలుదేరుతున్న గంగాపురం గ్రామానికి పాలమాచాపురియని పేరు మార్చాడు.

ఈ గంగాపురానికి మాయాపురమనీ, మత్స్యపురమనీ, దురిత కోలాహలమనే పేర్లు ఉన్నట్లు 'గంగాపుర మాహత్మ్యం" అనే గ్రంథంలో పొందుపరచ బడ్డాయనీ, అలాంటివే యింకా ఎన్నో విచిత్రమైన విషయాలుకూడా అందులో విపులీకరింప బడ్డాయనీ, గంగాపురంలోని చెన్న కేశవస్వామి అర్చకులు శ్రీపంగపురం వేంకటాచార్యులు గారు వివరించారు. కాని, ఆ గ్రంథం నేడు అలభ్యం. భావి పరిశోధకులు శ్రమకోర్చియైనా ఆ గ్రంథాన్ని సాధించి, వెలుగులోనికి తెచ్చి, పల్నాటికి సంబంధించిన మరికొంత చరిత్రను బహిర్గతం చేస్తారని ఆశిస్తాను. ఆ గ్రంథకర్త రెడ్డిరెడ్డి మల్లారెడ్డి.

ద్విపద కావ్యాల్లోనూ, జానపదుల కథల్లోనూ, అనుగురాజు బయలు దేరిన గ్రామం 'పాలమాచాపురి' అని ఉండటంతో, ఈనాటి వరకూ పరిశోధనలకది దురవగాహమైంది. చివరకు పండిత ఉమాకాన్త విద్యా శేఖరులుగారు, ఈ పాలమాచాపురికి అవికృతనామ మేదో చెప్పజాల నంటూ, మత్స్యపురియని ఊహిస్తే అది ఉత్తర భారతదేశంలో, హైహయులకు పూర్వస్థావరమైన నర్మదానదీ తీర ప్రాంతమండలి చేది దేశంలో ఉన్నదని నిశ్చయింపలేము. పైగా పాలమాచాపురియను పదం కేవలం దేశీయం. దీనికి ప్రకృతిమైన పేరుగల మరొకపదమా... లేదు. అంటూ పాలమాచాపురికి ప్రకృతియైన పేరుగల మరొక స్థలంలో కూడా వారు నివసిస్తుండి వుండవచ్చు.[1] అన్నారు. పండిత ఉమాకాన్త విద్యాశేఖరులుగారు సమాగత పదమని ఊహించిన 'మత్స్యపురి' అను పదం ఈ గంగాపురం గ్రామానికే వుందని చెన్నకేశవస్వామి అర్చకులు ఆచార్యులుగారు చెప్పటం వల్ల; అనుగురాజు బయలుదేరుతూ మారు

1. పల్నాటి వీరచరిత్ర-ద్వితీయ భూమిక-పండిత ఉమాకాన్త విద్యాశేఖరులు - పుట 74.

పేరుగా ప్రయోగించిన పాలమాచాపురి, ఈ గంగాపురమేనని నిశ్చయించ టంలో పొరపాటు లేదు.

ఇక అనుగురాజు తన పరివారంతో సహా రాయలగండిచేరి అక్కడ కొండమీద, కనకాద్రిపల్లె నుండి బ్రహ్మనాయుడు తెచ్చి భద్రపరచిన చెన్నకేశవస్వామి పీఠాన్ని ఎత్తించి, ఒక శకటంపై అమర్చి, సమస్త బంధువులూ, సాయుధులైన సైన్యమూ అంతఃపుర వాసులూ, చివరకు వారికున్న గోసంపదతో సహా బయలుదేరి వంకేశ్వరంలో మజిలీచేశాడు. పద్య కావ్యంలో వాగు వాగేశ్వరపట్టణం అని వుంది.[2]

ఆ తర్వాత ప్రయాణం సాగించి, కృష్ణాతీరం ఉత్తరం వైపున ఉన్న అరణ్య ప్రాంతంలోని దేవాలయాలను దర్శిస్తూ, దొన్మర్లగొంది, జెండాపెంట, యలకలగొంది, కసువులపెంట, పెదదూకుడు, చినదూకుడు, మొరసపెంట రేవులను పరీక్షిస్తూ, కృష్ణానది దక్షిణతీరం చేరటానికి అనువైన రేవు లభించక చివరకు మల్లవ్వఘట్ట సమీపంలోని కృష్ణపాయ రేవును అనువైనదిగా ఎంచుకుని, ఆరేవు ద్వారా సమస్తాన్నీ దక్షిణంతీరం చేర్చి అక్కడే గుడారాల నెత్తించి విడిది చేయించాడు. వెంట తీసు కెళ్ళిన కరితురగాలకు, పశువులకు మేతకోసం మంత్రి దొడ్డనాయడు కొన్ని వాహనాలతో బయలుదేరి ఆ పరిసర ప్రాంతాల్లోని పల్లెల్లో మేత కొని, ఏనుగుల కెత్తించి తిరుగుముఖం పట్టాడు. దారి మధ్యలో అర్ల గొంద గ్రామ సమీపంలోని ఒక జొన్న చేనును సమీపించాడు. ఆ ఆర్భాటమంతా తిలకించిన ఆ చేనుకాపు, మర్యాదకోసం కొన్ని లేత జొన్న కంకుల్ని కోసి, అప్పటికప్పుడు ఊచబియ్యం తయారుచేసి పెట్టాడు. దొడ్డనాయడా ఊచబియ్యాన్ని తీసుకుపోయి, అంతఃపుర స్త్రీలతో సహా అక్కడున్న కొందరికి పంచిపెట్టాడు. ఊచబియ్యం రుచిమరిగిన అంతఃపుర స్త్రీలు, ఆ జొన్నచేను పంట మొత్తాన్నీ వెలకైనా కొని తెప్పించ మన్నారు. ఆ పనికి సైన్యాధిపతి తెప్పలినీడును నియోగించగా,

2. పల్నాటి వీర చరిత్ర-పదకావ్యం-పింగళి లక్ష్మీకాంత - పుట 18


తెప్పలినీడు కొంత పరిజనంతో బయలుదేరి వెళ్ళాడు. తన ఉద్దేశాన్ని ఆ చేనుకాపుకు వివరించాడు. అందుకా కాపు తిరస్కరిస్తూ 'పాడిమంత్రకు వచ్చి బర్రె నడిగినట్లుంద'ని చెపుతూ

ఆ : దొడ్డవారనుచును తొలి ఫలంబంచును
లేతఁద్రాలు మీకుఁ బ్రీతితోడ
నిచ్చినందులకునొ మెచ్చి మా చేనెల్లఁ
గొల్లఁ బుచ్చఁ దలచు కొనుటలెల్ల.


ఆ : ఊచ బియ్యమునకు వాచవిగొని మీర
లూచకోతఁ గోయఁ జూచుటెల్ల
'నిట వసించుమన్న నిల్లావరించిన
చందమయ్యె నింకఁ జాలుఁ బొమ్ము.[1]

అన్నాడు. అందుకు కోపోద్రిక్తులైన గోసాయులు (ఆలకాపరులు కావచ్చు) ఒక్కుమ్మడిగా చేనుమీదపడి కోయటం మొదలుపెట్టారు. గత్యంతరంలేని ఆ చేనుకాపు వెంటనే, ఆ సమీపంలోని గంద్రకోట గ్రామం వెళ్ళి, దుర్జయరాజుల రాజప్రతినిధియైన ఊరపేరమరాజుకు మొరపెట్టుకున్నాడు. వెంటనే ఊరపేరమరాజు తన పరివారంతో బయలుదేరి పోరుసల్పి చివరకు తెప్పలినీని చేతిలో నిహతుడయ్యాడు. ఆ విషయం తెలుసుకున్న వెలనాటి మహీపతి వెండవ గొంకరాజు హఠాత్తుగా కొంత సేనతో బయలుదేరి, అనుగురాజు సేనను ఢీకొన్నాడు. కాని, చివరకు దొడ్డనాయని కుమారుడైన పేర్నీడు చేతిలో పట్టుబడి బందీయయ్యాడు. బందీయైన గొంకరాజు, అనుగురాజుతో సంధిచేసుకుని, సంధి షరతుగా, తన కూతురు మైలమదేవిని అనుగురాజు కిచ్చి పెండ్లి చేశాడు. ఆమెకు అరణంగా పల్నాడు రాజ్యాన్ని ధారాదత్తం చేశాడు. గంద్రకోట రాజప్రతినిధియైన ఊరపేరమరాజు ఈ గొంకరాజు తమ్ముడే నని కథకులు చెపుతారు.


1. వీర భాగవతము-ముదిగొండ వీరభద్రకవి - పుట 59



మహబూబ్‌నగర్ జిల్లా, అమరాబాద్ మండలంలోని
రాయలగండి కొండమీదనున్న
చెన్న కేశవస్వామి ఆలయం



మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం
గంగాపురంలోని చెన్న కేశవస్వామి ఆలయం



మహబూబ్‌నగర్ జిల్లా, అచ్చంపేట తాలూకా,
అమరాబాద్ మండలంలోని
రాయలగండి చెన్నకేశవస్వామి అర్చకులు
శ్రీ దాశరథి సుధాకరయ్య గారితో రచయిత.



మహబూబ్‌నగర్ జిల్లా,
గంగాపురం చెన్నకేశవస్వామి ఆలయార్చకులు
శ్రీ పంగిపురం వెంకటాచార్యులు గారితో రచయిత

ఆ విధంగా అనుగురాజు కందూరుబోడుల ప్రాపకంతో రహస్య జీవితం సాగించి, చివరకు మోసపు ఎత్తుగడలతో, కపటవ్యూహంపన్ని, మాయమాటలతో, మారుపేర్లతో కృష్ణానది ఉత్తర ప్రాంతం నుండి దక్షిణ ప్రాంతానికి వచ్చి హఠాత్తుగా గొంకరాజుపై దొంగదెబ్బతీసి, తమ పూర్వపు రాజ్యమైన పల్నాడును తిరిగి స్వాధీనం చేసుకోగల్గాడు.

అనుగురాజావిధంగా కృష్ణానది ఉత్తర తీరంనుండి దక్షిణతీరంచేరి పల్నాడును సాధించుకున్నాడేకాని, కావ్యాల్లోనూ, గాథల్లోనూ వివరిస్తున్నట్లు ఉత్తరభారతం నుండి దక్షిణ భారతానికి వచ్చాడనేది నిజంకాదు. పల్నాడును తిరిగి సాధించుకోవటానికి అనుగురాజు చేసిందంతా రహస్య ప్రయత్నం. కనుక బహిరంగ విషయాలిందులో చోటు చేసుకొనవు. ఆనాటి జానపదులకు కూడా, అసలు విషయం గోచరం కాని 'అనుగురాజు పల్నాటి రాజ్య సంపాదన' అనేక మార్గాల్లో అల్లిన కథ కావచ్చు. రకరకాల పోకడలు చొప్పించి గానంచేసే జానపదుల గాథల్ని ఆసరా చేసుకుని, భావోద్రేకానికి లోనై అక్షరరూపం కల్పించిన ఆదికవి ఎవరో? వినోదం కోసమే వ్రాశాడుకాని, చరిత్రకోసం కాదుగదా! అసలు పాలమాచాపురియను గ్రామమే ఉత్తర భారతంలో లేనప్పుడు, దానికి సామాంతరంగా, విడ్డూరంగా వినిపించేరీతిలో జంభనాపురియనో, కనక జంభనాపురియనో పేర్లుండుట మేమిటి?

'కనకజంభనాపురి ఘనమెట్ల'టన్న అని వున్న ద్విపద పంక్తుల్లోని వాక్యాల్ని ఆధారం చేసుకుని, ఒకరు సంబల్‌పూరు అనీ, మరొకరు జబలాపురమనీ, ఇంకొకరు జబల్‌పూర్ అనీ వూహించి వ్రాయటంలోని ఆంతర్యం, జానపదుల గాథల్నీ, వాటి తర్వాత వచ్చిన ద్విపదకావ్యాల్నీ కాదనలేకనే.

ఏది ఏమైనా, ఎంత రహస్యంగా బయలుదేరినా, అనుగురాజు కదలి వచ్చిన గ్రామానికి పాలమాచాపురియని అనటంలోనైనా కొంత ఔచిత్యముందేమోకాని, జంభనాపురియని చెప్పటంలోని ఆంతర్యమేమిటో దురవగాహం. 'జంభనం' అంటే సంభోగమనికదా అర్థం. సోదర

చంద్రిక) ఎక్కడైనా భోగపురి ఉంటే ఉందేమోకాని, సంభోగపురి ఉండగలదాయని నా అనుమానం. అయినా మొగుళ్ళపల్లి, లంజె కోట, లంజెదిబ్బ అనే గ్రామాలు ఈనాటికీ వున్నాయి కదా! ఏదిఏమైనా ఈ జంఘనాపురి యనుపదం కేవలం అనుగురాజు పల్నాడును స్వాధీనం చేసుకున్న తర్వాత, విజయ గర్వంతో ఉన్మత్త ప్రేరితులైన పరివారం లోని కొందరు విహ్యాభావంతో పరిహాసంగా చెప్పుకున్న పేరేకాని, అసలు నిజమైన పేరుకాదని నా విశ్వాసం.

ఏదిఏమైనా, అనుగురాజు అన్న బేతరాజు, తండ్రి వీరకాముడు, తాత బేతరాజు మొదలైన పూర్వులంతా పల్నాడును పరిపాలించిన వారైనప్పుడు, వీరందరికన్నా చివరివాడైన అనుగురాజు ఉత్తరదేశంలో పరిపాలన సాగిస్తూ దక్షిణదేశానికి వచ్చి పల్నాడును ఆక్రమించాడనటం సమంజసం కాదు. కావ్యాల్లో తప్ప, శాసనాల్లో అవిధంగా వుండినట్లు కనిపించదు. పైగా పాపవిముక్తికోసం తీర్థయాత్రలకే వస్తే; రథ గజ తురగ పదాతి సేనతో సమస్తాన్నీ కూడగట్టుకుని, అంతఃపురవాసులతో సహా ఎవడూ కదిలిరాడు. అలా భక్తిపెంపున వచ్చినవాడు కేవలం జొన్న కంకులకోసం యుద్ధం చేయడు, రైతులను పరిమార్చడు. ఎలా గైతేనేం అనుగురాజు, కపటవ్యూహంతోనే పల్నాడుచేరాడు. గొంకరాజుతో యుద్ధంచేసి ఓడించి క్రీ.శ. 1127లో పోగొట్టుకున్న పల్నాడు రాజ్యాన్ని తిరిగి క్రీ.శ. 1132లో సాధించుకున్నాడు. ఆ విధంగా పూర్వార్జిత కర్మ తొలగి, పరాధీనమైన పల్నాటిని తిరిగి చెపట్టిన కారణంగా మాచెర్ల చంద్రవంక నదిలోనే స్నానంచేసి విముక్తుడుకూడా అయివుండవచ్చు.

ఈ విషయంలో ఇంకా శ్రద్ధవహించి పరిశోధన చేయదలచినవారికి నాదొక చిన్నకోరిక. మహబూబునగరు జిల్లా జడ్చర్ల మండలంలోని గంగాపురం చెన్నకేశవాలయపు దక్షిణ కుడ్యంలో అమర్చబడిన శిలా శాసనం, అచ్చంపేట తాలూకా అమరాబాదు మండలంలోని రాయలగండి కొండమీదనున్న చెన్నకేశవాలయ ప్రాంగణంలో ఈశాన్యదిశగా క్రింద పడియున్న శిలాశాసనం. (ఈ శాసన శిలకు నాలుగువైపుల శాసనం చెక్కబడి వుంది.) విషయాలను శ్రమకోర్చి ఆమూలాగ్రం గ్రహిస్తే

మరికొంత సమాచారం రాబట్టగలరని ఆశిస్తున్నాను. ఈ రెండు శాసనాలూ తెలుగు-కన్నడ లిపి మిశ్రమంతో చెక్కబడినట్టివి. ఈ శాసనాలతోపాటు 'గంగాపుర మాహాత్మ్యం' అనే కావ్యంగూడా పల్నాటి చరిత్రాంశాలకు మిక్కిలి కీలకమైనవిగా భావించాను. కాని, వాటిని సాధించటంలో ప్రభుత్వ సహకారంగానీ, పెద్దల ప్రోత్సాహంగానీ లేక, కేవలం స్వశక్తిమీదనే ఆధారపడి పరిశోధించిన నాకు తలకుమించిన భారమై వదలి వేయటం జరిగింది. భావి పరిశోధకులైనా పరిశ్రమించి చరిత్రను వెలికి తీయగలరని నా ఆకాంక్ష.

# పల్నాడు అనే పదమెలా వచ్చింది ?

ఈ పల్నాడనునది ప్రాచీన పదమైన 'పల్లి' శబ్దంతో సంబంధం కలదనియు, ఈ 'పల్లి' అను పదానికి బౌద్ధ లేక జైన నివాస స్థలమని అర్థమనియు; తన 'ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళం'లో శ్రీ కుందూరి ఈశ్వరదత్తుగారు చర్చించారు. అసలు భారతదేశంలో వైదికమతం తర్వాత అతి ప్రాచీనమైన మతం.... జైనమతం. ఆ తర్వాతనే బౌద్ధం.

జైన తీర్థంకరులలో మొదటివాడైన ఋషభదేవుడు, జంబూద్వీపం లోని హిమాలయాల దక్షిణ ఖండానికి అధిపతి. ఈతని కుమారుడే భరతుడు, వృషభుని తర్వాత, ఈ భరతుడు పాలించుట చేతనే.... మన దేశానికి భరతవర్షమనీ, భరత ఖండమనీ పేర్లు వచ్చాయి. ఇది జైన సంప్రదాయం. ఇది నిజమని నిరూపిస్తూ మార్కండేయ పురాణంలో

గీ॥ హిమనగేంద్ర దక్షిణ వర్షమేలు నాభి
యాత్మ నందను ఋషభుని నధిపుజేసి
యరిగె గానకు నతడు నిజాత్మ జన్ము
డైన భరతు పట్టముగట్టి యడవి కరిగె.

ఆ భరతుని పేర నివ్వర్షంబు భారత వర్షంబన బొగడొందె.
(వావిళ్ళ ప్రచురణ-మార్కండేయ పురాణం-ఆశ్వా-4. ప. 123 మారన.)

ఈ జైనమతం వేదాలనూ, వర్ణవ్యవస్థనూ, యజ్ఞాలనూ నిరసించి; జంతుబలిని ఖండించి, అహింసను కఠినంగా ఆచరించింది. కర్మ సిద్ధాంతాన్ని అంగీకరించి, భగవంతుణ్ణి నిరాకరించి, విధివ్రాతను విశ్వసించక, స్వయంకృషికి ప్రాధాన్యమూ, ప్రోత్సాహమూ యిచ్చింది. ప్రపంచ మంతా అణుకల్పితం. భౌతిక ప్రపంచ పరివర్తనలన్నీ అణువుల సంయోగ వియోగాలచే జరుగుతున్నవనేది ఈ మత సిద్ధాంతం. మానవుని అజ్ఞానంవల్ల కోరికలూ, కోరికలవల్ల కర్మలూ, కర్మలవల్ల పాపపుణ్యాలూ, వానివల్ల పునర్జన్మలో కష్టసుఖాలూ కలుగుతాయనేది జైనుల నమ్మకం.

పూర్వార్జిత కర్మను ఆత్మసంస్కారమనే తపస్సుచే నాశనంచేస్తే; జీవుడు ముక్తుడౌతాడు. ఉపవాసము, నగ్నత, శీత ఆతపాలకు తట్టుకుని

ఏకాగ్రతతో, ఆమరణ నిరాహారదీక్షా నియమంతో తపస్సుచేసి ఆత్మ సంస్కారాన్ని సాధిస్తే.... అది జన్మ రాహిత్యానికి మార్గమన్నారు జైనులు. అదే కైవల్యం. జైనుల కైవల్యానికీ, హిందువుల మోక్షానికీ పెద్ద తేడాలేదు. కైవల్యమంటే.... అనంత సౌఖ్యమని జైనుల భావం.

ఈ జైన మతాచార్యులను తొలిరోజుల్లో 'నిగ్రంధులు' అని పిలిచేవారు. ఆ తర్వాత వారినే 'తీర్ధంకరులు' అనటం జరిగింది. తీర్ధంకరుడంటే జీవన ప్రవంతిని దాటటానికి సేతువునిల్పి తీర్థాభిషిక్తుడై మోక్షాన్ని పొందిన వాడని అర్ధం. ఈ జైన మతానికి మొదటి తీర్థంకరుడు వృషభదత్తుడు. (వృషభ దేవుడు)

జైన కల్ప సూత్రాల ప్రకారం, జైన మతప్రబోధకుడూ, ఆరవ మత గురువూ అయిన 'భద్రబాహునుడు' 'గోడస' అను తన శిష్యుణ్ణి దక్షిణ భారతదేశానికి జైనమత ప్రచార నిమిత్తం పంపించాడు.[1]

దక్షిణాది రాష్ట్రాల్లో బౌద్ధమతం విస్తరించినంత గొప్పగా, జైన మతం విస్తరించక పోయినప్పటికీ; తమిళనాడు, కర్ణాటకలోనూ, ఆ తర్వాత ఆంధ్రలో అక్కడక్కడా జైనమతం కూడా విస్తరించిందని చెప్పక తప్పదు.

దక్షిణ భారతదేశంలో జైనమతానికి మూల సంఘంగా. ముందు కర్ణాటకలోని శ్రవణ బెళగోళలో నెలకొల్పబడింది. ఇది కాలక్రమేణా దక్షిణాది కంతకూ మూలస్థానమై ఖ్యాతిగాంచింది. దిగంబర జైనాచార్యులైన ఆచార్య సింహనంది పూజ్యపాద, కుండకుండాచార్య మొదలైన సిద్ధులు రాజవంశాలకు గురువులై, మత ప్రచారాన్ని నలుమూలలా వ్యాపింపజేశారు. మూల సంఘమైన శ్రవణ బెళగోళ నుండి ఉప సంఘాలుగా, గణాలుగా యేర్పడి దిగంబర జైనంగా ఆంధ్ర ప్రాంతం చేరింది.[2] క్రీ.శ. 6-7 శతాబ్దాల కాలాల్లో తూర్పు చాళుక్య వంశజుల ద్వారా వచ్చిన జైనమతం; క్రీ.శ. 12వ శతాబ్దం వరకూ ఆంధ్రలో అన్ని జిల్లాల్లోనూ వ్యాపించిందని ఆంధ్ర చరిత్ర కారుడైన రాబర్ట్ సీవెల్

తన చారిత్రక నివేదికలో పేర్కొన్నాడు.[3] కాని, కొన్ని కొన్ని సంఘటనలను పురస్కరించుకుని చూస్తే, కాకతీయుల కాలమైన క్రీ.శ. 13వ శతాబ్దంలో కూడా శైవమతానికి ప్రత్యర్థిగా నిలిచిందని చెప్పవచ్చు.

మొదట కృష్ణానదీ తీరాన దిగంబర జైనం ప్రవేశించిన రోజుల్లో, పలనాడును పల్లవులు పాలించేవారు. ఈ దిగంబర జైనులు సన్యాసి జీవితాన్ని సాగిస్తూ, కఠోర నిష్ఠతో, యోగ ధ్యాన నియమంతో మానసిక పూజ చేస్తూ; కేవలావస్థకు (మోక్షానికి) చేరటం, విధిగా పాటించేవారు. దీనినే శుద్ధశీల అనికూడా అంటారు. దీని కనుగుణంగానే, మానవ సంచారాలకు దూరంగా, సెలయేరులు ప్రవహించే స్థలాలకు చేరువలోనున్న అడవుల్లో, నిత్యమూ నీరుండే పెద్దపెద్ద నీటిమడుగుల సమీపాల్లో, ప్రకృతి ప్రసాదించిన గుహలలో, బిలములలో ఎండా వానలకు తప్పుకుని తల దాచుకునేలా వసతు లేర్పరుచుకునేవారు. మొదటి రోజుల్లో వారికి గుహలే గృహాలు. ఆ గుహల్లోనే రాతిపడక లేర్పరుచుకుని, వాటిపై సల్లేఖన వ్రతం పాటించటమంటూ, నిరాడంబర జీవులై, యోగ ధ్యాన నిరతులై, ఉపవాస దీక్షతో శరీరాన్ని కృశింపజేసుకుని సమాధిమరణం పొందేవారు. ఆ ప్రాంతాలనే మనమిప్పుడు, మునుల గుట్టలనీ, సన్యాసుల గుహలనీ, యతీశ్వరుల బిలములనీ, రాక్షస గుళ్ళనీ పిలవటం జరుగుతుంది.

అలాంటిదే పల్నాడులోని గుత్తికొండ (గుచ్ఛాద్రి) గ్రామానికి దక్షిణంగా 8 కిలోమీటర్ల దూరంలోని అడవుల్లో నాగాద్రి అనే కొండలో వున్న బిలం. కొండ మధ్యలోనున్న ఆ బిలం నుండి 300 మీటర్లు లోపలికి ప్రవేశిస్తే, ఒక పెద్ద నీటిమడుగు కనిపిస్తుంది. ఆ మడుగు లోతును కనుగొన్న వారెవరూ లేరు. అందులోని నీరు స్వచ్ఛంగా, నిర్మలంగా వుంటుంది. జాగ్రత్తగా పరిశీలించి చూస్తే, ఆ నీటిపై యిసుక రేణువులు తెలుతున్నట్లు కనిపిస్తుంది. అక్కడ నిలుచుని ఆలకిస్తే, నీరు ప్రవహిస్తున్నట్లొక శబ్దంకూడా గోచరిస్తుంది. ఆకొండలో అంతర్వాహిణియైన ఒక నది వుందని జనవ్యవహారం. పూర్వమా బిలం లోపలికి వెళ్ళటానికి చాలా కష్టంగా వుండేది. యాత్రికుల సౌకర్యార్థం

కొండలోవున్న నీటిమడుగు వరకు, యిప్పుడు విశాలమైన దారి యేర్పరి చారు భక్తులు. కానీ, ఏదో ఒక వెలుతురు ఆధారం లేకుండా గుహ లోపలికి వెళ్ళటం అసాధ్యం. అంతా కటిక చీకటి! ఆ బిలం మధ్యనుండి కొండలో అన్ని వైపులా ఎన్నో గుహలున్నాయి. ఒక్కొక్క గుహను, ఒక్కొక్క పురాణపురుషుని పేరుతో అక్కడివారు పిలుస్తుంటారు. ఆ గుహ లెంత దూరం వరకు ఉన్నాయో, ఇప్పటికీ పరిశీలించిన వాలెవ్వరూ లేరు.

పూర్వమా బిలంలో ముచికుందుడనే నగ్న ముని తపస్సు చేశాడనీ, ఆ బిలం లోపలినుండి పడమరగా ప్రయాణిస్తే, శ్రీశైలంలోని నృసింహ బిలానికి చేరవచ్చుననీ అంటారు. కాని, అది ఎంతవరకు హేతుబద్ధమో, పరిశీలకులే నిర్ణయించాలి. అక్కడ శ్రీశైలంలోకూడా నృసింహబిలం సమీపంలో జైన స్థావరాలైన మునుల గుట్టలున్నాయి. కనుక, బిలం నుండి రాకపోయినా, ఆ కొండ పైభాగం నుండి పడమరగా అడవుల్లోనే ప్రయాణించి శ్రీశైలంలోని నృసింహబిలానికి చేరవచ్చు. దారి మధ్యలో గ్రామాలేవీ తగులకుండా అక్కడికి వెళ్ళే మార్గాలు, ఆనాడేకాదు, ఈనాడు కూడా లేకపోలేదు.

కోడివందెంలో రాజ్యాన్ని కోలుపోయి, వలస జీవితం దుర్భరంగా అనుభవిస్తున్న రోజుల్లో, బ్రతుకుదెరువు కోసం; అనాడు శ్రీశైలంనేలు హొయసల మాకరాజు నాశ్రయించిన బ్రహ్మనాయుడు, తన వీరఖడ్గమైన నృసింహకుంతాన్ని తాకట్టుపెట్టి ఇరవైరెండు గ్రామాలను అద్దెకు తీసు కుంటే; మాకరాజు, ఆ నృసింహకుంతాన్ని భద్రపరచింది శ్రీశైల ప్రాంతంలోని ఆ నృసింహబిలంలోనే.[4] పల్నాటి యుద్ధంలో తనవారి నందరినీ కోలుపోయి, ఆత్మ సంస్కారం కోసం తపస్సుకై గుత్తికొండ బిలంలో ప్రవేశించి, బ్రహ్మనాయుడు మోక్షప్రాప్తి పొందాడని జన వాక్యమేకాక, అనేక కావ్యాల్లో కూడా రచించటం జరిగింది. దీనినిబట్టి, గుత్తికొండ బిలానికీ, శ్రీశైలంలోని నృసింహబిలానికి అనుబంధమూ, అనుసంధానమూ కలదని మనమూహించటంలో పొరపాటులేదు. ఇలాగే, పూర్వం చంద్రగుప్తమౌర్యుడు తన రాచరికపు చివరిదశలో రాజ్యత్యాగం

'మాదిరాజుపాడు' అనే గ్రామం. ఇది మాచెర్లకు పది కిలోమీటర్లు తూర్పుగా, దుర్గి గ్రామానికి మూడు కిలోమీటర్లు ఉత్తరంగా, బుగ్గవాగు నది ఒడ్డున ఉండేది. కాని, ఆ గ్రామమెప్పుడో శిథిలమైపోయింది. నాగార్జున సాగర్ నిర్మాణంతో ఇప్పుడీ బుగ్గవాగు ఒక జలాశయంగా మారింది. ఈ జలాశయంలో ఎన్నో ఓటిగుళ్లు మునిగిపోగా, ప్రస్తుతం రెండు ఓటి గుళ్ళు మాత్రం 'మేమున్నాం' అన్నట్లు మనకిప్పుడు దర్శనమిస్తాయి.

పూర్వమిలాంటి ఓటిగుళ్ళు పల్నాడు ప్రాంతమంతటా విరివిగా చాలా గ్రామాల్లో ఉండేవి. కాని, యిప్పుడు బుగ్గవాగు, గుళ్ళపల్లి, చెర్లగుడిపాడు, పల్లిగుంత (పల్లికొండ) పొందుగుల, గోలి, మాచెర్ల, పోలేపల్లి గ్రామాల్లో కనిపిస్తాయి.

పొందుగులకు ఐదు కిలోమీటర్ల దూరంలోవున్న అయ్యగారి పాలెంలోని ఒక శిథిలమైన జలపేశ్వరస్వామి ఆలయం క్రీ. శ. 7-8 శతాబ్దాల కాలంలో నిర్మించిన జైనాలయం. దీన్ని పల్లవరాజైన రెండవ మహేంద్రవర్మ కాలంలో నిర్మించటం జరిగింది. ఆ తర్వాత కొంతకాలానికి శివాలయంగా మార్చారని చారిత్రక పరిశోధకులు ఇంతకు ముందే నిర్ణయించారు.[7] ఇక గురిజాలకు తూర్పుగా రెండు కిలోమీటర్ల దూరంలో వున్న పల్లిగుంతలోని రామలింగేశ్వరస్వామి ఆలయం కూడా ఈ కోవకు చెందిందే.

జైనుల్లో దిగంబరులూ, శ్వేతాంబరులూ అని రెండు శాఖలుండేవి. దిగంబరులు వివస్త్రులు, శ్వేతాంబరులు తెల్లని గుడ్డలు ధరించేవారు. దిగంబరుల్లో పురుషులు మాత్రమే సన్యాసం పుచ్చుకుంటారు. శ్వేతాంబరుల్లో స్త్రీ పురుషు లిర్వురూ సన్యాసం పుచ్చుకోవచ్చు. ఈ శ్వేతాంబర జైనుల్లో నాలుగు వర్గాలు. వీరు సన్యాస సన్యాసినులు, శ్రావిక శ్రావకులు, శ్రావిక శ్రావకులంటే, సన్యాసం స్వీకరింపక కేవలం జైన ధర్మ బోధలతో ఉంటూ జీవితం గడిపేవారు. ఈ శ్రావిక శ్రావకుల

7. Journal of Telugu Studies Vol No. 1 Book No. 1 Page 37

రూపాలు గల చిత్రాలను జైనాలయాల ముఖ ద్వారాలకు, ద్వార పాలురుగా మలచటం జరిగేది. ఆ విధంగా ఆలయ ప్రవేశద్వారానికి కుడివైపు పురుషుణ్ణి (శ్రావకుడు) ఎడమవైపు స్త్రీని (శ్రావిక) అభయహస్త ముద్రికలతో వున్నట్లు చిత్రాలు మలచబడ్డాయి, ఈ రామలింగేశ్వర స్వామి ఆలయానికి. అంతేకాక, జైన సంప్రదాయమైన నాగబంధ శిల్పంకూడా ముఖద్వారానికి పూర్తిగా చెక్కబడి వుంది.

ఇలా ఆలయ ముఖద్వారాలకు, ఒకవైపు స్త్రీ రూపాన్ని, మరో వైపు పురుషరూపాన్ని ద్వార పాలురుగా చిత్రించటం, హిందూ దేవాలయాల్లో మనకెక్కడా కనిపించదు. ఈ పద్ధతి జైనుల ఆలయాలకే కాక, జైన తీర్థంకరుల శిల్పాలకుకూడా, దిగువ భాగంలో, కుడిఎడమల స్త్రీ పురుష (శ్రావక శ్రావిక) రూపాలను చిత్రించటం మనకు కనిపిస్తుంది. కనుక, దీనినిబట్టి పల్లిగుంత గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం పూర్వమొకప్పుడు జైనాలయ మనటంలో సందేహం లేదు.


ఇక 'గోలి' అనే గ్రామాన్ని (పాతగోలి) గోపాలరాజు అనే జైనుడు కట్టించాడని జనవాక్యం. గోపాలరాజు, మోహనరాజు అనే యిద్దరు జైనులు కుష్టువ్యాధి పీడితులై ఉత్తరాది నుండి అనేక తీర్థ యాత్రలు చేస్తూ గుంటూరు వచ్చి, గుండువద్ద యర్ర చెరువులో స్నానం చేయగా, వ్యాధి కుదిరిందనియూ, వారక్కడే వుండి, ఆ ప్రాంతంలోని అగస్త్యేశ్వరస్వామికి మంటప ప్రాకారాలు కట్టించి ధనాన్ని వినియోగించారని కొండవీటి దండ కవిలెలో వ్రాయటం జరిగింది.[8] దీనిని బట్టి దండ కవిలెలో వ్రాయబడిన గోపాలరాజే ఈ గోలి గ్రామాన్ని కట్టించాడనటానికి అవకాశం లేకపోలేదు. ఈ గోలి గ్రామంలోని నాగమయ్య గుడి జైనులచే నిర్మితమైందే, అక్కడున్న వినాయకునిగుడి కూడా జైన నిర్మితమే. ఇక్కడ ఒక కోటగూడా శిథిలమై వుంది. ఈ కోట పల్లవ రాజులచే నిర్మింపబడిందనీ, పల్లవులు, వారి రాజ ప్రతినిధుల ద్వారా

8. వల్నాటి వీరచరిత్ర-పండిత ఉమాకాన్త విద్యా శేఖరులు-
ప్రథమ భూమిక-పుట 42

పల్నాడు రాజ్యాన్ని; ఈ గోలి గ్రామాన్నే ముఖ్యపట్టణంగా చేసుకుని, ఇక్కడనుండే పాలించారనీ, వారిలో మురహరిఅనే రాజప్రతినిధి చాలా ప్రముఖుడనీ ప్రతీతి. పల్లవ రాజులు హిందువులైనా, ఆకాలంలో ప్రజలు చాలావరకు జైన మతస్తులే. ఈ జైనులకు పల్లవ రాజుల ప్రోత్సాహం కూడా వుండేది. అదే వారి మత సహనాన్ని సూచిస్తుంది.

ఇక పూర్వమున్న మాచెర్ల (మహదేవి చెరువు)కు దక్షిణంగా ఒక్క కిలోమీటరు దూరంలోవున్న మాలపల్లి (ఇప్పటి మాచెర్ల)కి చుట్టూ ఎనిమిది దిక్కుల ఎనిమిది ఓటిగుళ్ళు వుంటూ, మధ్యలోకూడా కొన్ని వట్టి గుళ్ళు వుండేవి. వాటిలో కొన్ని శిధిలమైపోగా, కొన్ని శివాలయాలుగా మరికొన్ని వైష్ణవాలయాలుగా మార్చబడ్డాయి. ఒక్క సంవత్సరం క్రితమే శివాలయంగా మార్చబడిన చిన్న ఓటిగుడికాక, ప్రస్తుతం ఒక్క ఓటిగుడి మాత్రం శిధిలమై కనిపిస్తుంది. దీన్ని యిప్పటికీ పెద్ద ఓటిగుడి అంటారు. దీని శిధిలావస్థకు ముఖ్య కారణం ఈ గుడి ప్రక్కనే వున్న సిమెంటు ఫ్యాక్టరీ గనిలో సంభవించే విపరీతమైన ప్రేలుడు శబ్దాలె. ఈ ఓటిగుడి ప్రాంతంలోని ఒక చెరువునుగూడ 'దేవలం చెరువు' అని ఈ గుడిపేరుమీదనే యిప్పటికీ పిలుస్తారు. దీనినిబట్టి, ఈ జైనాలయానికి, పూర్వమున్న ప్రాశస్త్యాన్ని మనం గమనించవచ్చు.

ఈ పెద్ద ఓటిగుడికి ఉత్తరంగా కొద్దిదూరంలో ఉన్న 'కంభాళ మఠం'అని పిలువబడే 'శైవాశ్రమం'లోని సమాధుల దొడ్డిలో జైనవిగ్రహమొకటి, పూర్వపు సమాధికి ఆనించబడి వుంది. పూర్వమెప్పుడో సమాధి కోసం మట్టి త్రవ్వుతుండగా, ఆ జైన విగ్రహం బయట పడిందట. జైన తీర్థంకరులలో ఇరవైమూడవ వాడైన పార్శ్వనాధుని విగ్రహమది. విగ్రహాని కిరువైపుల, శిరోపరితలం మీద, యోగనిష్ఠలో వున్న జైన మునుల శిల్పాలుకూడా, అందులో మలచబడ్డాయి. విగ్రహానికి దిగువ భాగంలో పాదాల కిరువైపుల ద్వార పాలకుల్లా, కుడివైపు పురుషుడు, ఎడమవైపు స్త్రీ (శ్రావక శ్రావికులు) మూర్తుల శిల్పాలుకూడా మలచబడ్డాయి. ఇవి చూపరులకు అభయమిస్తున్నట్లు చిత్రించబడ్డాయి.



పూదిరాజుపాడు శిథిలమైపోగా
బుగ్గవాగు జలాశయంలో మునిగిపోయిన
ఓడిగుళ్ళ (జైనాలయాలు)



మునిమాణిక్యంలోని ఓడిగుళ్ళు
(జైనాలయాలు)
నల్లగొండ జిల్లా



పల్లిగుంత రామలింగేశ్వర ఆలయ
ప్రవేశద్వారానికి ఉన్న ద్వారపాలురు
(శ్రావక, శ్రావికలు)
జైనవిగ్రహాలు



గుత్తికొండబిలం సమీపంలోని
అడవుల్లో లభ్యమైన
జైనవిగ్రహం
"పల్నాడు"

విగ్రహం పూర్తిగా నాగుల రక్షణలో ధ్యాన నిమగ్నుడై యున్నట్లు మలచబడింది.

క్రీ. శ. 12వ శతాబ్దంలో పల్నాటిని పరిపాలించిన హైహయ రాజుల్లో కలిగిన అన్నదమ్ముల కలహకారణంగా, పల్నాడును రెండుగా విభజించి, అందులో మాచెర్లసీమను పంచుకున్న రోజుల్లో బ్రహ్మనాయడు, మాలలకు కొట్టాలు కట్టించి, ఆ కొట్టాలను అనుకుని దక్షిణంగా, తన సైన్యాధిపతీ, తనకు పెద్దకుమారుడైన మాల కన్నమదాసుకు కట్టించిన ఒక పెద్దకొట్టమే, ఇప్పుడున్న కంభాళమఠం కావచ్చు. మాలపల్లిలో ప్రస్తుతమున్న చెన్నకేశవ ఆలయం నుండి ఈ కంభాళమఠం వరకూ ఉన్న ప్రాంతాన్ని "కొట్టాలమెట్ట" అని యిప్పుడు కూడా పిలుస్తారు. ఈ విషయాన్ని శ్రీమండిగొండ వీరభద్ర కవిగారు తన వీరభాగవతంలో (క్రీ. శ. 1892)

గీ॥ రమణ మాచెర్ల సవిధ ధరాతలమున
తాలితద్యుతి వెలియ కొట్టాలమెట్ట
నూని కట్టిన కన్నమనేని హేమ
ధామ మెన్నంగ నరిది పోలేమి చెప్ప? (పుట 86)

అని వివరించారు.

ఈ చెన్నకేశవాలయానికి పడమరగా ఈ మధ్య కట్టించిన కాలనీ పునాది త్రవ్వకాలలో, ఎన్నో జైన శిల్పఖండాలు ముక్కలై బయట పడ్డాయి. దీనినిబట్టి చూస్తే, మాచెర్ల (మహాదేవి చెరువు)కు సమీపం లోని మాలపల్లి వాసులంతా, ఆనాడు జైన మతస్థులనటంలో సందేహం లేదు. పూర్వ మొకనాడు వారు నిర్మించుకున్న జైనాలయాలే, ఈనాడు ఈ ప్రాంతంలో వున్న ఓటిగుళ్లు. దీనికి "చెన్నకేశవ స్వామి- హరిజ నార్చకులు" అనే గ్రంధంకూడా సాక్ష్యమిస్తుంది. అసలానాడు జైన మతాన్ని స్వీకరించిన వారిలో ఎక్కువ భాగం నిమ్నజాతులే. (దీని దశ లోని జాతులు) కనుకనే పూర్వమున్న మాచెర్లలో జైనమతానికి సంబం ధించిన ఏ అవశేషమూ లభించక, దాని సమీపంలోని మాలపల్లిలో ఇన్ని

జైనాలయాలు, శిల్పాలు బయటపడటమే దీనికి ప్రబల తార్కాణం. అందువల్లనే 'మహా దిగంబర" అనే శబ్దం, క్రమంగా 'మాదిగ' అను శబ్దంగా రూపాంతరం చెందిందని చరిత్రకారుల నిర్ణయం.[9]

కులం మతంలేని ఆదిమదశను దాటి, అరుంధతీయులుగా చిత్రింప బడి, ఆ తర్వాత ఆది ఆంధ్రులుగా చెలామణియై, జైనమత ప్రమేయంతో మహా దిగంబరులుగా మారి, దానితో 'మాదిగ' అను శబ్దానికి రూపాంతరం చెంది, కాలచక్ర గమనంలో నిలకడలేక ఆర్థికంగా చితికి పోయి, నిమ్న జాతిగా పరిగణింపబడి సమాజ ఆదరణకు దూరమై, ఆనాటి అగ్రవర్ణాల అసహనంవల్ల వెలివేయబడి శాక్తేయులై, పంచములుగా భావింపబడి, దానితోపాటు అస్పృశ్యులుగా అనాదరణకు గురియై, చివరకు గాంధీ మహాత్ముని దివ్యబోధతో, ఆయన ఆశయ సాధనతో హరిజనులై, కొంతవరకైనా ఈనాడు సమాజ ఆదరణకు నోచుకున్నారనటంలో సందేహం లేదు.

కాకతీయుల కాలానికి ముందున్న శాతవాహన, ఇక్ష్వాక, పల్లవ, చోళ, చాళుక్య, హైహయ, హొయసల, దుర్జయ శాఖలన్నీ నిర్వీర్యమై పూర్తిగా అంతరించి పొయ్యాయి. ఆయాశాఖల్లో ఆనాడు కొన్ని టికున్న ప్రాముఖ్యతనూ, ప్రాశస్త్యాన్నీ పురస్కరించుకుని, వాని స్థానంలో ఏదో రూపంలో గొప్పకోసం అతికించుకున్నవే కాని, అసలు కొంతైనా మిగిలిన శాఖంటూ ఒక్కటీలేదు. చివరకు కాకతీయుల కాలమైన క్రీ.శ. 12వ శతాబ్దంలో, ఆ అంతరించిన శాఖల స్థానంలో ఎన్నో కులాలు అవతరించాయి.

కాకతి గణపతి దేవుడు తన రాజ్య విస్తరణ కోసం, కేవలం సైనిక బలం మీదనే ఆధారపడక; తాను సూర్యవంశ క్షత్రియుడని చెప్పుకున్నా, వివిధ కులాల వారితో సంబంధ బాంధవ్యాల నేర్పరుచుకున్నాడు. తన కూతురు రుద్రమ దేవిని చంద్రవంశస్థుడైన చాళుక్య వీరభద్రరాజుకు;

9. చెన్నకేశవస్వామి-హరిజనార్చకులు-గంధం నాగేశ్వరరావు-పుట 179

తన రెండవ కుమార్తె గణపాంబను కోట వంశజుడైన బేతరాజుకు (వీరు తెలుగు చోడులు. క్రమంగా తెలగాలుగా మారారు) తన సోదరి మేలాంబికను మధిర రాజైన రుద్రరాజుకు యిచ్చి వివాహాలు జరిపాడు. తాను స్వయంగా కమ్మనాటి (వెలనాడు) ప్రభువైన జాయపసేనాని యిద్దరు చెల్లెళ్లైన నారమ్మ పేరమ్మలను వివాహం చేసుకుని, జాయప సేనానిని గజసైన్యాధ్యక్షునిగా నియమించాడు. ఆ తర్వాత కాకతి రుద్రమదేవి తన రెండవ కూతురైన రుయ్యమ్మను, తన మంత్రులలో ఒకరైన ఎండపూడి అన్నయ్య అనే బ్రాహ్మణునకిచ్చి వివాహం చేసింది.[10] కొందరు చరిత్రకారులు బ్రాహ్మణుడైన ఇందులూరి అన్నయ్య కంటారు.

ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగానైనా, కుల భేదాల నిర్మూలనానికి, ఈ విధంగా కాకతీయులు కొంతవరకైనా దారిజూపారు. అయినా, దాని ఉద్ధృతి మాత్రం చాపక్రింది నీరులా ప్రవహించి, ఆంధ్ర దేశమంతా వ్యాపించింది. అలా ఆ రోజుల్లో ప్రత్యేకంగా యేర్పడిందే బ్రహ్మనాయని వంశస్తులైన 'పద్మనాయక వెలమలు' అనే మరోకులం.[11] ఇలా కొత్తగా అవతరించిన కులాలు మిక్కుటమైంది కూడా కాకతీయుల కాలంలోనే. ఆ విధంగా కులాల నిర్మాణం పూర్తిగా అమలు జరిగి, చివరకు ఐదవ జాతి నొకదానిని తయారు చేయటం జరిగింది. అంతకుముందు పురాణకాలంలో సృష్టించుకున్న నాలుగు జాతులతో జతకలుపుతూ ఈ ఐదవ జాతిని పంచమ జాతిగా నిర్ణయించటం జరిగింది. ఈ ఐదు జాతుల్లో కూడా ఉపశాఖలేర్పడి ఏజాతి ఆజాతి గొప్పగా భావించుకుంటూ, వారివారి ప్రత్యేక ప్రతిపత్తి కోసం ప్రాకులాడుతూ; పూర్వకాలంలో ఎవరు గొప్పగా ప్రభావితులయ్యారో 'వారుమావారే' అని విపరీతంగా చాటుకుంటూ, ప్రత్యేక సాంఘికాచారాలు నిర్ణయించుకుని జీవనాలు సాగిస్తూ ఉండటంతో, మానవ సమాజంలో ఈ నాటికి మర్రి ఊడల్లా కులాలు పాతుకుపోవటం జరిగింది కూడా ఆ కాకతీయుల కాలం నుండే. పూర్వమున్న ఆ గొప్పవారు 'మావారే'

---

10. ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర-ఏటుకూరు బలరామమూర్తి - పుట 110
11. ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర-ఏటుకూరు బలరామమూర్తి - పుట 114

అని చెప్పుకునే ప్రబుద్ధులు, ఆ జాతి నామంతోనే వ్యవహరింపబడక, నేడు మరో పేరుతో వ్యవహరింపబడుతున్న ఈ జాతుల పేర్లు, మధ్యలో ఎందుకు తగిలించుకున్నారో, ఎలా తగిలించుకున్నారో, మధ్యలో పెట్టుకున్న ఈ పేరును అల్పంగా ఎందుకు భావించుకుంటున్నారో, దానికి తోడు మళ్ళీ ఆ పురాతన నామానికే ఎగబడి ఎందుకు యిరికించు కుంటున్నారో, వారికే తెలియాలి! చేతల్లోలేని గొప్పతనం, చెప్పుకుంటే ఎంతకాలం నిలుస్తుందో కూడా వారే ఆలోచించాలి. ఇదీ.... ఈనాటి సమాజ ప్రత్యేకత! చెట్టుపేరు చెప్పి కాయలమ్ము కోవటమంటే యిదేనేమో!

కాకతీయులు కూడా, ప్రారంభంలో జైన మతావలంబులే. వీరశైవం ఆంధ్రలో వ్యాపించక పూర్వం, ప్రజాసామాన్యంలో దాదాపు అన్ని కులాలవారూ ఎక్కువ మంది జైన మతస్థులే, కాని, మత ద్వేషాలతో, కుల మౌఢ్యాలతో కుతకుతలాడుతున్న తనదేశాన్ని నాశనం పాలు చేయకుండా చూడాలంటే; ఆనాటి పాలకుడైన కాకతీయ రెండవ ప్రోలరాజు (బిజ్జలుని సమకాలికుడు) ఉప్పెనలా వస్తున్న శైవ మతోద్యమానికి తలవంచక తప్పలేదు. ఆనాటి నుండే కాకతీయులు శైవులయ్యారు.

క్రీ. శ. 12వ శతాబ్దపు ప్రారంభంలో కల్యాణ కలచూరి వంశజుడైన బిజ్జలుడు, కల్యాణి చాళుక్యుల నోడించి సామ్రాజ్యాధీశుడయ్యాడు. అతనిమంత్రి బలదేవుడు. బలదేవుని మరణానంతరం, ఆతని మేనల్లుడైన బసవనికి మంత్రిత్వమప్పజెప్పాడు, బిజ్జలుడు. ఆ బసవడు యజ్ఞోప వీతాన్ని పరిత్యజించి, శైవాగమ పండితుడై శైవమతాన్ని స్థాపించాడు. ఆ బసవని తర్వాత, ఆతని మేనల్లుడైన చెన్నబసవడు, నూతన శైవమత ప్రచారాన్ని తన మేనమామకంటే కఠోరదీక్షతో సాగించాడు. ఈ వీరశైవ మత ప్రభావానికి నిలువలేక ఘోరంగా దెబ్బతిన్నది జైనమతం. జైనాలయాలు చాలా వరకు శివాలయాలుగా మార్చబడ్డాయి. వీరశైవ మానాడు ఎంత కఠోరంగా విజృంభించిందో బసవపురాణంలోని ఈ క్రింది పంక్తులు వివరిస్తాయి.

ద్వి॥ జిన సమయస్థుల శిరములు దునిమి
మును విష్ణుసమయుల ముక్కులు గోసి
అద్వైతులను హతహతము గావించి
విద్వేష బౌద్ధుల విటతటమాడి
చార్వాక వాదుల గర్వంబులణచి.

ఇలా విజృంభిస్తున్న వీరశైవ మత విహారాన్నిచూసి, దానితో పోటీపడాలని క్రీ. శ. 11వ శతాబ్దంలో వచ్చిన రామానుజా చార్యులవారి బోధలతో ఉత్తేజితమై, అప్పటికే స్థిరత్వమేర్పరుచుకున్న వీరవైష్ణవం కూడా, వీరశైవ మార్గాన్నే అనుసరించటానికి సిద్ధమైంది. మత పోరాటాలతో ఆంధ్ర దేశమానాడు అట్టుడికి పోయింది. వీరశైవ ప్రాబల్యానికి చెన్న బసవడు ప్రముఖుడు కాబట్టి, ఆ 'చెన్న' అనే పదాన్ని వైష్ణవులు కూడా, వారి యిష్టదైవమైన కేశవ స్వామికి జోడించి, 'చెన్నకేశవస్వామి' అని పెరుపెట్టి, కొన్ని జైనాలయాలలో విగ్రహ ప్రతిష్ఠలు చేశారు.[12] చెన్న అంటే అందమైనవాడు అని అర్థం.

మత ప్రభావమానాడు చరిత్రపై చెరగని ముద్రవేసింది. పెట్టుబడిదారీ విధానానికీ, సామ్రాజ్యాధిపత్యానికీ. ఆనాడు మతమే మూలమైంది. రాజులు దైవాంశ సంభూతులనే సిద్ధాంతంతో సామ్రాజ్య వాదం మొలకెత్తింది. శాస్త్రీయం అందుబాటులో లేక, దానికి తోడు అక్షరజ్ఞానం కొరవడి; జాతి పురోగమనానికీ, జీవన విధానానికీ మార్గం దొరకక ప్రజలంతా సతమతమయ్యేవారు. సమస్యలకు పరిష్కారం దొరకక విధిగా దేవుని మీద భారంవేసి, మతం మార్పిడి జరిగేది. పోషకులు కరువు కావటంతో పెట్టుబడిదారీ విధానానికి పూర్తిగా దాసోహమన్నది మతం.

రాజరాజ నరేంద్రుడు (క్రీ. శ. 1019–1061) మరణించిన తర్వాత వేంగిదేశం బలహీన పడింది. అప్పటినుండి వేంగిదేశాన్నాక్రమించాలని పశ్చిమ చాళుక్యులకు, (కర్ణాటకలోని కల్యాణి చాళుక్యులు) తూర్పు

12. చెన్నకేశవస్వామి–హరిజనార్చకులు–గంధం నాగేశ్వరరావు–పుట 29

చాళుక్య చోళులకు తరచూ యుద్ధాలు జరుగుతుండేవి. ఆ రోజుల్లో పల్నాడును పాలించే హైహయులు, పశ్చిమ చాళుక్యులకు; దాని ప్రక్కనేవున్న వెలనాడును (చందవోలు రాజధానిగావున్న రేపల్లె, బాపట్ల, తెనాలి ప్రాంతాలు) పాలించే దుర్జయ గొంకరాజులు, తూర్పు చాళుక్య చోళులకు సామంతులు. వేంగిదేశాన్ని ఎలాగైనాసరే ఆక్రమించాలని క్రీ. శ. 1127లో పశ్చిమ చాళుక్య ప్రభువైన ఒకటవ సోమేశ్వర దేవుని కుమారుడు ఆరవ విక్రమాదిత్యుడు. (క్రీ. శ. 1076-1127) వేంగిపై దండయాత్రచేసి పరాభూతుడయ్యాడు. ఇతను బహుభార్యా సమేతుడు. సోదరునే రాజ్యభ్రష్టుని చేసిన ప్రతాపశాలి. కలి విక్రముడు, పెరుమాడి రాయులు, త్రిభువనమల్ల, చాళుక్యాభరణ అనే బిరుదులు కల్గి; నిరంకుశుడైన ఈ విక్రమాదిత్యుడు చాళుక్య విక్రమ శకకర్త. ఈతనికి సామంతుడై వేంగీ యుద్ధంలో సహకరించిన పల్నాటి హైహయ ప్రభువు రెండవ దాగి బేతరాజు (బిరువంకరుద్ర). మొదటి వీరకాముని కుమారుడు. (క్రీ. శ. 1110-1127) కూడా పల్నాటిని కోల్పోయాడు. ఓటమి చెందిన విక్రమాదిత్యుడు తన స్వదేశమైన కల్యాణపురికిపోతూ, తనకు యుద్ధంలో సహకరించిన పల్నాటి ప్రభువైన రెండవ బేతరాజుకు; తన పాలనలో మన్న పాలమూరు (మహబూబ్ నగర్)లో ఆశ్రయమిచ్చాడు. ఆ పాలమూరు సంస్థానంలోని గంగాపురం (ఇది జడ్చర్లకు ఈశాన్యంగా ఆరు కిలోమీటర్ల దూరంలో దేవరకొండకు వెళ్ళే మార్గంలోవుంది) గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని, తన అనుచరగణంతో ఉండేవాడు రెండవ బేతరాజు. పల్నాడు పూర్తిగా వెలనాడును పాలించే దుర్జయ రాజైన మొదటి కులోత్తుంగ రాజేంద్ర చోడయ (క్రీ. శ. 1108-1132)కు సర్వస్వతంత్రాధిపత్యం గల రాజ్యంగా స్వాధీనమైంది.

గంగాపురం స్థావరంగా ఏర్పరుచుకున్న రోజుల్లోనే, రెండవ బేతరాజు మరణించాడు. ఈ బేతరాజుకు సంతానం లేని కారణంగా వెంటనే, తన మంత్రి దొడ్డనాయడూ, సైన్యాధిపతి తెప్పలి నాయడూ కలిసి బేతరాజు తమ్ముడైన అనుగురాజును తమ ప్రభువుగా ఎన్నుకున్నారు. ముగ్గురూ కలిసి, మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట

తాలూకాలోని మాధవానిపల్లె సమీపంలోని రాయలగండి అనే కొండపై వారి యిష్టదైవమైన చెన్నకేశవస్వామి ఆలయాన్ని కట్టించారు. ఈ రాయలగండి అమరాబాదు మండలంలోని మాధవానిపల్లెకూ, 'పదర' అనే గ్రామానికి మధ్యలోవుంది. ఈ ప్రాంతమంతా, గంగాపురం వరకు కల్యాణి చాళుక్యుల సామంతులైన కందూరు చోడుల పాలనలోనిది.

హైహయుడైన అనుగురాజు పట్టపురాణి వీరవిద్యాదేవికి, కూర్మి వంశీయుడైన మంత్రి దొడ్డనాయని భార్య శీలమ్మకూ; వారిద్దరు పల్నాటిలో వున్న రోజుల్లో వారివారి మధ్య జరిగిన మాటవట్టింపు ఫలితంగా, దొడ్డనాయని మొదటి కుమారుడైన బాదన్న లేక పెద్దన్నను అనుగురాజు దత్తత తీసుకోవటం జరిగింది. బాదన్న, బాదరాజు లేక బాదమరాజయ్యాడు. కులాలు వేరు కావటంతో బాదరాజుకు, రాజవంశాల్లో; తెలిసిన వారెవ్వరూ పిల్లనిచ్చేవారు లేక పొయ్యారు. చివరకెలాగో, బాదరాజు రాజకుమారుడేనని అసత్యమాడి మోసపుదెత్తుగడలతో వినుకొండ సమీపంలోని కంచెర్లనేలు కృష్ణ గంధర్వుని నమ్మించి, ఆయన కూతురు లఘువమ్మ (ముక్తాలవాంబ)ను యిచ్చి పెండ్లి జరపటంతో, కొన్ని సందర్భాలను పురస్కరించుకుని బాదరాజు కంచెర్లలోనే వుండిపొయ్యాడు. ఇక రెండవ కుమారుడైన బ్రహ్మనాయుడు, కల్యాణపురి సమీపాన భీమరథి నదివొడ్డున కృష్ణాసంగమం దగ్గరవున్న కొల్హాపూరు దత్తాత్రేయ పీఠాధిపతి వద్ద, గురుకులంలో విద్యనభ్యసిస్తూ ఉండేవాడు. ఈ దత్తాత్రేయ గురువే, బ్రహ్మనాయని కోరిక మేరకు మాచెర్ల వచ్చి మలిదేవరాజుకు పట్టాభిషేకం చేశాడు. పల్నాటి విభాగాలనంతరం, అప్పటి వరకూ మలిదేవరాజు పక్షాన (క్రీ. శ. 1157-1172)—మాచెర్లను బ్రహ్మనాయడే పాలించేవాడు.[13]

పల్నాటివారు పాలమూరు సంస్థానంలోని గంగాపురం ప్రాంతంలో ప్రవాసంగా ఐదు సంవత్సరాలు జీవితాన్ని గడిపారు. తిరిగి పల్నాడును స్వాధీనం చేసుకోవాలనే కోరిక అనుగురాజుకు, అతని సహచరులైన

13. పల్నాటి వీరకథా చక్రము-తంగిరాల వెంకట సుబ్బారావు-పుట 211

మంత్రి దొడ్డనాయుడికీ, సైన్యాధిపతియైన తెప్పలి నాయుడికీ; కలిగింది. పల్నాడును స్వాధీనం చేసుకున్న చందవోలురాజుపై యుద్ధం ప్రకటించి ఎదుర్కొనే ధైర్యం చాలక, మరో రూపంలో దొంగదెబ్బ తీసి సాధించాలనుకున్నారు. దాని కనుగుణంగానే యుద్ధమని ప్రకటింపక తీర్థయాత్రలనే నెపంతో బయలు దేరిపోయి, అకస్మాత్తుగా దండయాత్ర చేసి పల్నాడును స్వాధీన పరుచుకోవాలనుకున్నారు. తగిన సమయం కోసం కాచుకున్నారు.

తీర్థయాత్రలకు పూజా విగ్రహ మొకటి కావలసివచ్చింది. దాని కోసం బ్రహ్మనాయనను నియమించారు. బ్రహ్మనాయుడు కొంత సైన్యంతో బయలుదేరి దొమ్మర్ల గొంది దగ్గర కృష్ణానదినిదాటి, వెలుగోటి కనుమ ద్వారా ప్రయాణం సాగించి, అర్థవీడు (ఇది ప్రకాశం జిల్లాలోని కంభం అనే గ్రామానికి పడమరగా 42 కిలోమీటర్లు; కర్నూలుజిల్లా వెలుగోడుకు తూర్పుగా 60 కిలోమీటర్లు దూరంలోవుంది.)లోని చెన్న కేశవ ఆలయంలో వున్న విగ్రహాన్ని తొలిగించి తీసుకుపోవాలని ప్రయత్నించాడు. అది గ్రహించిన ఆనాటి అర్థవీడురాజు, గిరిజన నాయకుడు వీధుల పాపినీడు (పాపినాయుడు) బ్రహ్మనాయనిపై యుద్ధం చేసి నిహతుడయ్యాడు. పాపినాయని కుమారులు వీధుల పల్నీడు (ఇతడే పల్నాటి చరిత్రలో మండాదిలో జరిగిన మందపోటులో మరణించినవాడు.) ఇతని తమ్ముడు నాగినీడులు తీవ్రంగా ఎదుర్కోవటంతో, బ్రహ్మనాయుడు విఫలుడై వెనుదిరిగి పోయ్యాడు. పోతూ, కల్వరాజ్యాధిపతియైన కల్వరాయుని ఆధీనంలో వున్న కనకాద్రి పల్లె (బనగానిపల్లె దగ్గర) సమీపాన చెన్నకేశవ ఆలయంలోని విగ్రహాన్ని గోప్యంగా తొలిగించి తీసుకుని గంగాపురం చేరాడు. ఈ కల్వ అనే ప్రదేశం కర్నూలుజిల్లా నంద్యాలకు 33 కిలోమీటర్ల దూరంలో వుంది. ఈ కల్వరాయుడే, పల్నాటి యుద్ధ సమయంలో నలగామరాజుకు ఆనాడు సహాయంగా వచ్చాడు. పల్నాటి యుద్ధ సమయంలో నలగామరాజు, తనకు సహాయులై సేనా సమేతంగా రమ్మంటూ నానా దేశాధీశులకు పంపిన లేఖల్లో ఈ ప్రస్తావన ఇలావుంది.

"హొన్నాళ్ళ భూపతి పొదిలె రాజులకు
కటకాధిపతికిని కల్బురాయనికి
దేవాద్రిసేలెడు తెలుగు బిడ్డలకు
.... .... .... .... .... ....
తనకు సహాయులై తరలి రండంచు
నయలేఖలంపెను నలగామరాజు"14

ఈ విధంగా బ్రహ్మనాయడు దొంగతనంగా తీసుకెళ్ళిన విగ్రహానికి, కనకాద్రి చెన్నుడనే పేరుపెట్టి తన ఇలవేల్పుగా ప్రకటించుకున్నాడు. అనుగురాజు, తీర్థయాత్రల పేరుతో బయలుదేర సిద్ధమై సమయం కోసం నిరీక్షిస్తున్న అనుగురాజు శౌర్యపరాక్రమాలనూ, శక్తి సామర్థ్యాలనూ గమనించిన కందూరి గోకర్ణదేవ చోడరాజు; తన అన్న కందూరి మూడవ భీమదేవ చోడునకు, అనుగురాజు అల్లుడైన కారణంగా, తనసైన్యాన్ని కొంత అనుగురాజుకు అప్పజెప్పాడు. ఆదే సమయంలో (క్రీ. శ. 1127) పల్నాటిని స్వాధీనం చేసుకున్న చందవోలు రాజైన మొదటి కుళోత్తుంగ రాజేంద్ర చోడుడు కూడా గతించాడు. అతని కుమారుడు రెండవ కుళోత్తుంగ చోడ గొంకరాజు (క్రీ. శ. 1132-61) చందవోలు సింహాసన మధిష్ఠించాడు. కాని, రాజ్యపాలనలోనూ, సామంతులను చక్కబెట్టు కోవటంలోనూ ఒక అవగాహనకు రాలేని రెండవ గొంకరాజు, సింహాసనా సీనుడు కాగానే, అతని దేశంలో అనిశ్చిత పరిస్థితి యేర్పడింది. దాన్ని చక్కదిద్దు కోవటంలోనే తలమునకలై పోయ్యాడు. అదే అదనుగా భావించిన అనుగురాజు; తన పూర్వీకుడైన కార్త వీర్యార్జునుడు చేసిన బ్రహ్మహత్యాపాతకం తన నంటుకుని పీడించగా, ఆ పాప విముక్తి కోసమే తీర్థయాత్రలని చెప్పి, తన బంధువులనూ, ఆప్తులనూ, సచివులనూ, సైన్యాధిపతులనూ రావించాడు. తాను బయలుదేరుతున్న గ్రామాన్ని పాలమాచాపురిగా పేరుమార్చాడు. ఇలవేల్పుగా ప్రకటించుకున్న చెన్నకేశవ విగ్రహాన్ని ఒక దేవతార్చనా శకటంపై

---

14. పల్నాటి వీరచరిత్ర - పండిత ఉమాకాన్త విద్యాశేఖరులు- పుటలు 26-27

అమర్చాడు. ఆ శకటానికి అధిపతిగా, విగ్రహాన్ని తెచ్చిన బ్రహ్మనాయననే నియమించాడు సర్వసైన్యమూ, సమస్త సంపదలూ, చివరకు అంతః పురకాంతలు సైతం వెంటరాగా; తాను నీలికోకలు (మలినవస్త్రాలు) గట్టి బయలుదేరి, చివరకు కృష్ణానది సమీపంచేరి కృష్ణ పాయరేవు దాటి అక్కడే విడిదిచేశాడు. ఆ ప్రాంతంలోనే జొన్న కంకుల కోసం ఒక రైతుతో వివాదం పెంచుకున్నాడు. ఈ వార్తవిని, ఆ రైతుకు అండగా హఠాత్తుగా వచ్చిన పేరమరాజును, అనుగురాజు సైన్యాధిపతి తెప్పలినాయుడు హతమార్చాడు. అది తెలిసిన రెండవ గొంకరాజు, తన రాజప్రతినిధియైన ఊర పేరమరాజు హత్యకు ఎదురు దెబ్బ తీయాలనుకున్నాడు. వెంటనే బయలుదేరి అనుగురాజు సైన్యంతో ఢీకొన్నాడు. కాని, యుద్ధంలో పరాజయం పాలై చేసేది లేక, తన కూతురు మైలమదేవిని అనుగురాజు కిచ్చి, దానితో పాటు పల్నాటి రాజ్యాన్ని కూడా అరణంగా యిచ్చి సంధిచేసుకున్నాడు. ఆ విధంగా అనుగురాజుకు క్రీ. శ. 1132లో స్వతంత్ర రాజ్యంగా పల్నాడు స్వాధీనమైంది. గురిజాలను ముఖ్య పట్టణంగా చేసుకుని పాలన సాగించాడు అనుగురాజు.

ఆ తర్వాత బ్రహ్మనాయుని కోరిక మేరకు 'మహాదేవి చెరువు' (మాచెర్ల)కు సమీపంలో దక్షిణ దిశగానున్న గోసంగుల (మాల)వాడలో చంద్రవంక నదికి దక్షిణ తీరాన ఉన్న ఒక దేవాలయాన్ని చెన్నకేశ వాలయంగా మార్చి, అందులో కనకాద్రిపల్లె నుండి తెచ్చిన చెన్నకేశవ విగ్రహాన్ని ప్రతిష్ఠింప ప్రయత్నించాడు. కాని, ఆనాడు పల్నాడులో నిమ్న కులజులు, గోసంగులు జైన మతస్థులైనా, తక్కిన వర్ణాలవారు చాలా వరకు శైవులు. వారంతా శైవమతం స్వీకరించిన తొలిరోజుల్లోనే, అక్కడున్న జైనాలయాలను చాలా వరకు శివాలయాలుగా మార్చి వేశారు. ఆ పని చాగి మొదటి బేతరాజు (క్రీ. శ. 1100-1111) అతని కుమారుడు వీరకాముడు (క్రీ. శ. 1111-1118) కాలాల్లోనే జరిగి పోయింది. అలా నిర్మించిన వానిలోనిదే ఆదిత్యేశ్వరాలయం. ప్రస్తుతం దాని ఉనికిని సూచిస్తున్న నాగస్తంభ శాసనం తప్ప, ఆ ఆలయం

మాత్రం ఎక్కడవుందో ఎవరికీ తెలియదు. కాని, అదే యిప్పుడు మనకు మరో రూపంలో దర్శనమిస్తున్న చెన్నకేశవాలయం.

అనుగురాజుకు పూర్వం శైవమతం స్వీకరించిన వారంతా, ఆ చెన్నకేశవ విగ్రహ ప్రతిష్ఠను వ్యతిరేకించారు. ఆ విజృంభణను తప్పించటానికి, ఆ ఆదిత్యేశ్వరాలయానికి కుడిపైపున వున్న మరో జైనాలయాన్ని శివాలయంగా మార్చి, శ్రీ గిరీశ్వరాలయమని నామకరణం చేసి; వారు ముందుగా నిర్ణయించుకున్న దేవాలయంలోనే చెన్న కేశవుని ప్రతిష్ఠించారు. అలా వైష్ణవాలయానికి కుడిపైపున శివాలయం ఉండుటచే, వైష్ణవాలయం పుణ్యక్షేత్రంగా రూపుదిద్దు కుంటుందనీ, అప్పుడు శివాలయానికి కూడా ప్రాముఖ్యత పెరుగుతుందనీ వివరించి, ఒప్పించి, ఆ విధంగా శైవులను సంతృప్తి పరిచి, వారి కోరిక మేరకు చెన్నకేశవస్వామిని ప్రతిష్ఠించాడు అనుగురాజు.

కొంత కాలానికి అనుగురాజుకు మైలమదేవివల్ల కలిగిన మొదటి కుమారుడైన నలగామరాజు, రాజ్యవ్యవహారాలలో కూడా పాలుపంచుకుంటూ క్రీ. శ. 1142లో ఆ చెన్నకేశవాలయానికి ఎదురుగా వున్న స్థలాన్ని స్వామివారి పూలతోటకై యువరాజుగా సమర్పించాడని ఈ క్రింద నుదహరించిన శాసనం వల్ల తెలుస్తుంది. అందువల్లనే ఈతనికి అన్గంకామరాజనే పేరు వ్యవహృతమైందని చరిత్ర కారులు చెపుతారు.

స్వస్తిశ్రీ శకాబ్దంబులు 1064 (క్రీ. శ. 1142) అగు నేటి దుందుభి సంవత్సర శ్రావణ శుద్ధ ఏకాదశి గురువారమున శ్రీ మన్మహామండలేశ్వర అన్గుకామరాజులు యూరియు కామిశెట్టి శ్రీ చెన్నకేశవ దేవరకు ఇచ్చినతోట.[15]

క్రీ. శ. 1147లో అనుగురాజు, ఆయన మంత్రి దొడ్డనాయుడు, వీరిద్దరూ బ్రహ్మనాయని కుట్ర ఫలితంగా ఒకేసారి మరణించారు. వారి అనంతరం, అనుగురాజు పెద్ద కుమారుడైన నలగామరాజును పల్నాటికి

15. వీరభాగవతము-అవతారిక-మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ - పుట 4

పట్టాభిషిక్తుని జేసి, తాను మంత్రిగా ప్రకటించుకున్నాడు బ్రహ్మనాయుడు. కాని, కొంత కాలానికి ఆరవెల్లి నాగమ్మ (నాయకురాలు) మంత్రిత్వాన్ని చేపట్టటంతో, బ్రహ్మనాయునకు అధిపత్యం లోపించింది. 'పట్టపురాణి బిడ్డలైన మలిదేవుల కోసం' అనే ఎత్తుగడతో, పల్నాటిని విభజించి, మలిదేవులు పసిపిల్లలనే సాకుతో, వారి పక్షాన బ్రహ్మనాయుడే 15 సంవత్సరాలు మాచెర్ల సీమను పాలించాడు. వీరశైవ, వీరవైష్ణవ మతాల ఘర్షణకు నలిగిపోతూ, జైన మతం నుండి ఆదరణ కరువైన గోసంగులు సతమత మగుతూ ఆదరువు కోసం అర్రులు చాస్తున్న రోజులవి. అది గమనించిన బ్రహ్మనాయడు, వారిని చేరదీశాడు, వారికి వైష్ణమిచ్చాడు. తనూ, తన బంధువులతో సహా వారిలో కలిసిపోయి 'మాలలు' అనే ఒక కొత్త కులాన్ని సృష్టించుకున్నాడు. అందులో ఒక వర్గాన్ని దాసులుగా యేర్పరిచి, వారికి మాచెర్ల చెన్నకేశవ ఆలయాన్ని అంకితమిచ్చి, అర్చకులుగా నియమించాడు. మరి కొందర్ని 'వీర విద్యావంతులు' అనే పేరుతో తన గొప్పను ప్రశంసిస్తూ, అనాటి పల్నాటి కథను చెప్పటానికి నియమించాడు. ఈ నాటికీ పల్నాటి చరిత్రను గానం చెయ్యటానికి వారే హక్కుదారులు. పన్నెండవ శతాబ్దంలో జరిగిన ఈ చరిత్రను; కథ పుంజు కోవటం కోసం, ఎన్నో ట్రిక్కులూ చమక్కులూ జోడించి, అతిశయాల అల్లికతో నింపించి, పురాణపోకడ జొప్పించి గానం చేస్తూ పారం పర్యంగా వస్తున్న ఆ గీతాలనే విని, శ్రీ నాధుడు ఈ పల్నాటి చరిత్రను మంజరీ ద్విపద రూపంలో ప్రబంధంగా పదిహేనవ శతాబ్ది పూర్వార్ధంలో వ్రాశాడు. ఆ తర్వాత కొండయ్య మల్లయ్యలు కూడా, ఆ చరిత్రనే ద్విపద కావ్యాలుగా వ్రాశారు. గత శతాబ్దం చివర (క్రీ. శ. 1862)లో సత్తెనపల్లి తాలుకా నందిగం వాస్తవ్యులు శ్రీ ముదిగొండ వీరభద్రకవిగారు పద్యకావ్యంగా వ్రాశారు. కాని వారంతా బ్రహ్మనాయనను అవతార పురుషునిగా చిత్రించి మానవాతీత సంఘటనలతో, మహిమలూ వరాలూ కల్పిస్తూ పురాణ పద్ధతినే మలచి రచించాడు.

అలా పెట్టుబడిదారీ విధానంతో తన బలాన్ని పెంచుకున్న బ్రహ్మనాయుడు, సైన్యాధిపతియైన తెప్పలనీని భార్య పెమ్మసానెమ్మ నల్లి, పూర్వం తనకు కల్గిన కన్నమను సైన్యాధిపతిగా నియమించాడు. మాచెర్ల గోసంగులవాడ (మాలపల్లి)లోని ఒకనాటి జైనాలయాన్ని చెన్నకేశవ ఆలయంగా మార్చిన దోష నివారణార్థం; జైనమత ప్రముఖుడైన వర్ధమాన మహావీర తీర్థంకరుని జయంతిరోజు, అనగా చైత్ర శుద్ధ త్రయోదశినాడు, చెన్నకేశవస్వామికి వార్షికంగా తిరునాళ్ళ మొదలయ్యేలా అంకురార్పణ చేశాడు. ఆ పద్ధతినే ఈనాడు కూడా కొన సాగిస్తున్నారు. కాని, జైన శైవాల సంబంధమైన 'ఆగమం' పోయింది. వైష్ణవ విధానమైన 'ఆహ్నికం' వచ్చింది.


ఈ చెన్నకేశవ విగ్రహం ఒక పానవట్టంలో అమర్చబడివుంది. జైన తీర్థంకరుల విగ్రహాలు, ఆచ్ఛాదనం లేని నగ్నశిల్పాలు. కాబట్టి, వాటిని నీటితో శుభ్రపరచటానికి వీలుగా పానవట్టంలో ప్రతిష్ఠిస్తారని; ఈనాడున్న కంఖాళమఠమే, ఆనాటి కన్నమదాసు యిల్లుకనుక, ఈ పానవట్టంలో తొలిగించిన పార్శ్వనాథుని విగ్రహాన్ని, ఆ కన్నమ యింట్లో రహస్యంగా పాతి, దాని స్థానంలో చెన్నకేశవ విగ్రహాన్ని నిలిపారని కొందరంటారు. ఆనాటి శైవుల వ్యతిరేకతకు తట్టుకోలేక, శివాలయంగా మార్చుతున్నట్లు నటించి, ముందుగా పానవట్టం బిగించి, వీలునుబట్టి దానిలో చెన్నకేశవ విగ్రహాన్ని నిలిపారని కొందరూ, అసలంతకు పూర్వమే అక్కడున్న దగ్ధశిలలోని విగ్రహాన్ని వెనుకకు జరుప ప్రయత్నిస్తేనే, పనివారు మూర్ఛాగతులై పోవటం గ్రహించి, యథాతీతిని పూర్వ విగ్రహాన్నేవుంచి, ఆలయాన్ని పునరుద్ధరించారని 'చెన్నకేశవస్వామి క్షేత్రమాహాత్మ్యం' అనే ఒక పుస్తకంలో సూరపరాజు వెంకట్రామయ్యగారు పొందుపరిచారు. అలా జరగటం వల్లనే బ్రహ్మనాయుడు తెచ్చిన కనకాద్రి చెన్నకేశవ విగ్రహాన్ని, ఆ ఆలయ గర్భగుడికి ఉత్తరంగావున్న ఒకగోడవెలుపలస్థాపించారనికొందరంటారు. ఇప్పుడొక చెన్నకేశవ విగ్రహం మాత్రం, ఆ ఆలయానికి ఉత్తరంగా నున్న గోడకు బిగించి వున్నట్లు, ఆలయానికి వెలుపల నుండి చూస్తే ఆ

చెన్నకేశవ విగ్రహం మనకూ కనిపిస్తుంది. చివరకు ఔరంగజేబు కాలమున ఈ పల్నాడును రామరాజు మంత్రప్పను వారసత్వపు దేశముఖుగాను, కుమారవారి వంశంలో మరియొకరిని దేశపాండ్యగాను, నియమించాడు.[16] ఆనాటి నుండి, ఈ ఆలయానికి మాలల అర్చకత్వం పోయియుండవచ్చు.


చివరకు చెన్నకేశవస్వామి ప్రతిష్ఠ విషయంలో ఎవ్వరేమి చెప్పినా, అభిషేక ప్రియుడైన శివుడు ఉండవలసిన పానవట్టంలో, అలంకార ప్రియుడైన చెన్నకేశవుడు, యిప్పుడు కూడా మనకు దర్శనమిస్తాడు. ఆ అలంకారాల మాటున ఏ విగ్రహం దాగివుందో పరిశీలకులే తెలుసుకోవాలి. ఏది యేమైనా అదొకనాడు జైనాలయమని చెప్పటానికి ముఖ్యంగా మనకు, ముందు కనిపించే గుర్తుగా ఆ ఆలయానికెదురుగానున్న జైన సూచ్యగ్ర శిలాస్తంభం మాత్రం, గతకాలపు ప్రతినిధిగా నిలిచి ఈ నాటికీ కనిపిస్తుంది.

ఈ చెన్నకేశవాలయంలోనే లక్ష్మీదేవి అమ్మవారి గుడి దక్షిణ ముఖమైవుంది. ఈ గుడి ముఖద్వారాని కిరుపైపులా; పైభాగంలోనూ రెండు వరుసలుగా ద్వార బంధపురాళ్ళు అమర్చబడ్డాయి. వీటి రెండింటికీ రెండు పద్ధతుల్లో శిల్పనిర్మాణం జరిగింది. మొదటి పంక్తి పూర్తిగా పూర్ణకుంభాలతోనూ, రెండవ పంక్తి నాగబంధ శిల్పంతోనూ ఆవృతమైవున్నాయి. ద్వార బంధపు శిరోభాగాన జైన శ్రావికల చిత్రాలు కూడా చెక్కబడ్డాయి. దీనిని బట్టి పూర్వమదొకప్పుడు జైన దేవాలయమనటంలో సందేహంలేదు. అంతేగాక ఈ రెండు పంక్తులూ విడివిడిగా రెండు ద్వారబంధాలు. వీటిని రెండు జైనాలయాలనుండి సేకరించబడి, ఈ లక్ష్మీదేవి అమ్మవారి గుడికి ఒకే ద్వార బంధంగా అమర్చబడ్డాయి. మరొక విశేష మేమిటంటే, ఈ చెన్నకేశవ ఆలయానికి ప్రక్కనే వున్న వీరభద్రాలయ ఆవరణలోని నాగమయ్య గుడి కూడా జైన నిర్మితమే. జైనులు నాగులను పితృదేవతలుగా ఆరాధిస్తారు. కనుకనే జైన

16. వీరభాగవతము-అవతారిక-మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ - పుట 5



మాచెర్లలోని పెద్ద ఒడిగుడి
(జైనాలయం)



మాచెర్ల రంథాళ మఠం
సమాధుల దొడ్డిలో బయుల్పడ్డ
పార్శ్వనాధ జైనవిగ్రహం

మాచర్ల
చెన్న కేశవ ఆలయానికి
ఉత్తరపు గోడకు అమర్చిన
చెన్న కేశవ విగ్రహం





మాచర్ల
చెన్న కేశవాలయం ముందున్న
జైనసూచ్యగ్ర స్తంభం

తీర్థంకరుల విగ్రహాలకు కూడా, చుట్టూ నాగశిల్పం మలచబడి, ఆ నాగుల రక్షణలో ధ్యానిస్తున్నట్లు మనకు దర్శన మిస్తాయి. నాగులూ, వృషభాలూ, జైనులకు దైవతుల్యాలు.

జైన మతం నుండి వైష్ణవ మతానికి మార్చబడ్డ మాలలు, పల్నాటి యుద్ధానంతరం, పల్నాడు శిథిలమవటంతో, బ్రతుకు దెరువు కోసం వివిధ ప్రాంతాలకు వలసవెళ్ళారు. అలా వలసవెళ్ళిన హరిజనులు, వారున్న ప్రాంతాల్లోనే చెన్నకేశవాలయాలు నిర్మించుకుని ఆనాటి నుండి ఈనాటి వరకూ వంశాను క్రమంగా ఆ హరిజనులే అర్చకులుగా కొనసాగుతున్నారు.[17] అలా యీ నాటికీ చెన్నకేశవస్వామికి హరిజనార్చకులున్న దేవాలయాలు, పశ్చిమ గోదావరిజిల్లా భీమవరం దగ్గర ఉప్పులూరు. పాలమూరు (మహబూబ్ నగర్) జిల్లా అచ్చంపేట తాలూకాలోని మాధవానివల్లె దగ్గరున్న రాయలగండి, కడప జిల్లాలోని మారేపాడు ప్రాంతాలు.

ఈ విధంగా క్రీ. శ. 7వ శతాబ్దం నుండి 11వ శతాబ్దం వరకు పల్లవుల పాలనలోవున్న పల్నాడంతటా స్వేచ్ఛగా విస్తరించిన జైనుల గ్రామాలు, ఆలయ స్థూపాలు, ఆలయాలు, శిలావిగ్రహాలు, మత మౌఢ్యుల అకృత్యాలకు బలిమై, కాల గర్భంలో కలిసిపోయినా, అక్కడక్కడా యీ నాటికీ అవశేషాలుగా దర్శన మిస్తూనే వున్నాయి. ఇక జైన వాఙ్మయంలో జనించి, అనేక రూపాంతరాలుచెంది, చివరకొక అవశేషంగా మిగిలి, ఇప్పటికీ వాడుకలో ఉచ్చరింపబడుతున్నది పల్నాడు, పలనాడు అనే పదాలు మాత్రమే.

'పాలి' 'పల్లి' అనే ఈ రెండు పదాలు, జైన శాసనాల్లో విస్తారంగా వేరువేరు అర్థాలతో వాడేవారు. 'పాలి' అంటే జైనుల విశ్రాంతి స్థలమనీ, 'పల్లి' అంటే జైనులువారి నివాస స్థలాలకు వసతులేర్పరుచుకుని, అందులో వారి జీవనానికి కావలసిన, ఆహార విహార వినియోగ వస్తువులను

17. చెన్నకేశవస్వామి-హరిజనార్చకులు-గంధం నాగేశ్వరరావు-పుట 92

భద్రపరుచుకునే స్థలాలనీ వాడబడేవి.[18] ఎవరెన్ని రూపాలుగా భాష్యాలు వల్లించినా ఈ 'పల్లి' అను పదమే రూపాంతరం చెంది నేటికి 'పల్నాడు' 'పలనాడు' అని పిలువబడుతూవుంది. దీనికి క్రింద ఉదహరించిన శాసనాలే మనకు ముఖ్యమైన ఆధారాలు.

1) క్రీ. శ. 669లో పూర్వ చాళుక్య ప్రభువైన రెండవ విష్ణు వర్ధనుని 'కోనెకి' శాసనంలో....
"విష్ణువర్థన మహారాజాః 'పల్లిరాష్ట్రి' కోణెకినామ గ్రామం"

2) క్రీ. శ. 1111లో మాచెర్ల ఆదిత్యేశ్వరాలయంలోని చాగి బేతరాజు శాసనంలో
"ఖరాభిదానే కార్తిక శుద్ధ ద్వాదశ్యాం 'పల్లిదేశ' శతత్రయాంతర్వర్తి"

3) క్రీ. శ. 1118లోని భృగుబండ శాసనంలో
"పల్లినాటి'లోని బక్కిబండ"

4) క్రీ. శ. 1147లో కులోత్తుంగ చోడగొంకరాజు వేయించిన కొధమగూడ (కొదమగుండ్ల) శాసనంలో
ముదిసెలి యీసన పెగ్గడ 'పల్లినాంటి' లోనుం దమకు నదచెడు వడ్డవరాళము పొలును

5) తేదీలేని ద్రోణాది కేశవ దేవుల శాసనంలో
'పల్లినాంటి' వీరుండు అనుంగుదేవ మహారాజుల పలికి'

6) క్రీ. శ. 1251లోని దుర్గి శాసనంలో
మహిష పతిదిశః కృష్ణవేదీ తటిన్యాః 'పల్లినాంటి' లోని దుగ్యపట్టణము

---

18. Journal of Telugu Studies Vol. No. 1. Book No. 1 Pages 34-35

7) క్రీ.శ. 1259లోని మార్కాపురం తాలూకా త్రిపురాంతకం శాసనంలో
"స్వస్తిశ్రీ త్రిపురాంతక దేవర అంగరంగ భోగాలకు 'పలినాంటి' లోని గంద్రకోట అనుంగురాజుపల్లి"
ఈ గంద్రకోట (గండ్రకోట) గ్రామమే నేడు కొత్తపల్లిగా ఎత్తి కట్టబడింది.

8) క్రీ. శ. 1269లో కాకతి రుద్రమదేవి దుర్గి శాసనంలో
"కరణం నామయ 'పల్లినాంటి' లోని దుగ్యపట్టణమునందు గోపీనాథ దేవరం బ్రతిష్ఠసేసె"[19]

9) కారెంపూడి వీరాలయంలోని నల్లాం చక్రవర్తుల శాసనంలో
"పలినాటి వారు"[20]

పల్నాటికి సంబంధించిన ఈ శాసనాలన్నీ 'పల్లి' 'పలి' అను పదాలనే సూచిస్తున్నాయి. కాని, ఒక్క అమరావతిలోని కుళోత్తుంగ చోళుని పదారాధకుడగు కొమ్మనాయకుని శాసనంలో....

"స్వస్తిశ్రీ శకవర్షంబులు 1077 క్రీ శ. 1155 అగునేటి విషుక్రాంతి నిమిత్తమును 'పలనాడు' మహీమండల మండనంబైన దామలూరి విభుండును" అనివుంది.

ఈ శాసనంలోని 'పలనాడు' అను పదం కూడా 'పలినాడు' అను పదాన్నే స్థిరపరుస్తుంది. 'ళి' 'ల' కారమును గూర్చి ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక 1వ సంచిక 48వ పుటలో శ్రీ జయంతి రామయ్య పంతులుగారు తెలియ పరిచారు. ఆయనే అందుకొక ఉదాహరణ

---

19. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము-కుందూరి ఈశ్వరదత్తు పుటలు 201-202

20. పల్నాటి వీరచరిత్ర-పండిత ఉమాకాన్త విద్యా శేఖరులు- ప్రథమ భూమిక-పుట 9

నిస్తూ, నన్నయ భట్టారకుని నందంపూడి శాసనంలో 'పొలిగరుసు' అనుటకు బదులు 'పొలగరుస'ని లేఖక దోషం పడిన రీతిగా, పై శాసనంలో కూడా 'పలినాడు' అనుటకు బదులు 'పలనాడు' అని వ్రాయబడి యుండవచ్చునని అన్నారు.[21]

అలాంటప్పుడు పల్లి, పలి, అను పదాల్ని ప్రమాణంగా తీసుకొనక; ఆ శాసనాల తర్వాత, ఏ రెండూ లేక మూడు వందల సంవత్సరాలకో వచ్చిన కావ్యాల్లో, చాటువుల్లో, వారివారి సొంత ఊహలతో ఉటంకిస్తూ, చరిత్రను తడవక, ఐతిహాసికరూపంలో పూరించిన పదాలను ఆధారం చేసుకుని పల్నాటి శబ్దోత్పత్తిని నిరూపిస్తూ భాష్యం చెప్పటం భావ్యం కాదేమో! అలా వ్రాసిన కవుల వ్రాతల్లోనూ కూడా మనకు భిన్నస్వరాలు గోచరింపకపోవు. ఉదాహరణకు శ్రీనాథుడు వ్రాసిన పల్నాటి వీరచరిత్ర ద్విపద కావ్యంలో

'విలసిల్లు పలనాటి వీరుల చరిత
జనులెల్ల భక్తిచే చదువుట కొరకు'

ఇక శ్రీనాథ కృతమని చెప్పబడు చాటువుల్లో

ఆ. వె. - చిన్న చిన్నరాళ్ళు చిల్లర దేవుళ్ళు
నాగులేటి నీళ్ళు నాపరాళ్ళు
సజ్జ జొన్నకూళ్ళు సర్పంబులును తేళ్ళు
పల్లెనాటి సీమ పల్లెటూళ్ళు.

కం:- జొన్నకలి జొన్నయంబలి
జొన్నన్నము జొన్న పిసరు జొన్నలు తప్పన్
సన్నన్నము సున్నసుమీ
పన్నుగ పలినాటిసీమ ప్రజలందరకున్.

21. వీరభాగవతము-అవతారిక-మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ-పుట 3

ఉ:- వీరులు దివ్యలింగములు, విష్ణువు చెన్నుడు, కల్లిపోతరా
జారయ కాలభైరవుడు, నంకమ శక్తియె యన్నపూర్ణయున్,
గేరెడు గంగధార మడుగే మణి కర్ణికగా జెలంగు నీ
కారెమపూడి పట్టణము కాశిగదా పలినాటి వారికిన్-

కం:- రసికుడు పోవడు పల్నా
డెసగంగా రంభయైన నేకులె వడకున్
వశుధేశుడైన దున్నును
కుసుమాస్త్రుండైన జొన్నకూడే కుడుచున్-

ఉ:- అంగడి యూరలేదు. వరియన్నములేదు. శుచిత్వమేమిలే
దంగన లింపులేదు. ప్రియమైన వనంబులు లేవు-నీటికై
భంగ పడంగ బాల్పడు కృపావరు లెవ్వరులేరు. దాతలె
న్నంగను సున్న కాన పలినాటికి మాటికి బోవనేటికిన్-

ఇక పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నంలో

ఉ:- రంగుగ గౌతమీ పరిసరంబుల కృష్ణ కెలంకులన్ ఘనుల్
పింగళి రామయాదులు లలిం బలినాటను పాకనాటనుం
బింగళిగా దయాదులిట బెంపు వహించిన యస్మదాదులో
పింగళి గోకమంత్రి యిలుపేరనె చాల ప్రసిద్ధులెల్లచోన్-

ప్రబంధరాజ వెంకటేశ్వర విజయ విలాసంలో గణవవరపు వేంకటకవి
'పలనాటి గొల్లల పాటజాతి'

వినుకొండ వల్లభరాయకృత క్రీడాభిరామంలో

గీ:- విప్రుడీక్షించె పలినాటి వీరపురుష
పరమ దైవత శివలింగ [illegible]

[illegible]

ఆ. వె:- కులము దైవతంబు గురిజాల గంగాంబ
కలని పోతులయ్య చెలిమి కాడు
పిరికి కండలేని యరువదియేగురు
పల్లెనాటి వీర బాంధవులకు.

ఆ. వె:- ఆరువల్లినాయి నారి దుర్మంత్రంబు
కోడిపోరు చాపకూటి కుడుపు
ప్రథమ కారణములు పల్నాటి యేకాంగ
వీరపురుష సంప్రహారమునకు.

సీ:- ఇచ్చోట భుజియించి రేక కార్యస్థులై
సామంత నృపతులు చాపకూడు
ఇచ్చోట జింతించె నిచ్ఛ నుపాయంబు
నలినాక్షి యార్వెల్లి నాయురాలు
నిజమను శుద్ధికై నిప్పుల యేటిలో
నోలాడి నిచ్చోట బీలసాని
ఇచ్చోట బోరిరి యిల పణంబుగ గొల్ల
సవతి తల్లుల బిడ్డ లవనిపతులు

గీ:- ధీరులగువార లేపురు వీరపురుష
లై మదోద్ధతి నిచ్చోట నాజి బడిరి
యనుచు జెప్పుదు రైతిహ్య మచట నచట
జనుప పెద్దలు పల్లెదేశమ్ములందు

కం:- నల్లగొండయు, నాగరి
కల్లును ధరణీస్థలిం బ్రగల్భ స్థలముల్
పల్లేరు నాగులేరును
పలెక్ష్మాక్రాంత యెల్ల ప్రారంభంబుల్-

చందవోలురాజు తన కూతురైన మైలమదేవిని చాగి అనుగురాజు వివాహమాడు సందర్భంలో పల్నాడును అరణంగా యిస్తున్నట్లు చెప్పే సమయంలో వీరభాగవత రచయిత శ్రీ ముదిగొండ వీరభద్రకవి చెప్పిన పద్యంలో....

శా: నానా చిత్ర పటు ప్రతానములు రత్న స్వర్ణ భూషావళుల్
ధేను వ్రాతమి భాశ్వసంఘ మతి భక్తి స్ఫూర్తిగా గన్యకా
దాన ప్రోత్సవ వేళ నల్లునకు జేతః ప్రీతిగానిచ్చె స
న్మానం బొప్ప నొసంగె బుత్రికకు పల్నాడైదు దేశంబులున్-

ఆ కవిగారే అదే కావ్యంలో నాయకురాలు నాగమ్మ జన్మ ప్రకారాన్ని తెలుపుచూ

సీ:- పెనుపొంద పల్నాటి జన పదంబున
గామాలపాడు నా గలుగునూర

ఇక అప్పకవీయంలో అప్పకవి

గీ:- పల్లెనాటను నూట తొంబదియు నాల్గు
గ్రామముల నీడుగానక కాకనూరి
వెంగనార్యుండు వేద వేదాంగములను
బ్రస్తుతికి నెక్కె మారట బ్రహ్మయనగ.

ఇంతేగాక పల్నాటి శబ్దోత్పత్తిని గూర్చి శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు తమ 'ఆంధ్రుల చరిత్రము' 2వ భాగం 185వ పుటలో; ఈ దేశము పల్లవుల స్వాధీనమైనందున 'పల్లవనాడ'ని పేరొంది, తరువాత 'పలనాడు' అయి; పల్నాడుగా మారిందని వ్రాశారు.[22] ఇక మెకంజీ దొరగారు, పల్లెలుండుటచే 'పల్లెనాడు' అని వచ్చిందనియు; మరియు అచ్చట దొరకు పాలరాతిని బట్టి 'పాలనాడు' అయిన దనుట ఇంకా

22. వీరభాగవతము-అవతారిక-మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ-పుట 3

సమంజసమని అభిప్రాయపడ్డారు.[23] శ్రీ పండిత ఉమాకాన్త విద్యాశేఖరులుగారు, వీటినన్నిటినీ త్రోసిపుచ్చుతూ, ఈ 'పలినాడు' అనే పదం కూడా 'పలనాడు' యొక్క వికృత రూపమేనంటూ; ఏ శాసనాల్లోనూ, కావ్యాల్లోనూ మచ్చుకైనా కనబడక, జానపదుల గాథల్లో సైతం వినబడక తనకు తానుగా ఊహించుకున్న 'పల్లునాడు' అనే శబ్దాన్ని తీసుకుని, చుట్టూ ఎత్తైన కొండలుండి మధ్యలో పల్లముగా నుండు ప్రదేశమగుటచే 'పల్లునాడు'గా పేరొంది, ఆ తర్వాత జడ్డకు లోపం జరిగి 'పలునాడై' క్రమంగా వాడుకలో 'పలనాడు' 'పల్నాడు' అయిందని నిర్ణయించారు.[24] కాని, ఎక్కడా కనిపించని ఈ 'పల్లునాడు' అను పదాన్ని ఊహించి తీసుకుని ఎందుకు ఈ రూపాన్ని నిర్ణయించారో తెలియరాదు. ఈయన సృష్టించిన ఈ 'పల్లునాడు' శబ్దాన్నే ముఖ్యమైన ఆధారంగా తీసుకుని, శ్రీ మద్దికర మల్లారెడ్డిగారు, మరి కొందరు వారివారి సొంత ఊహలతో మరో నిర్ణయాన్ని ప్రతిపాదిస్తున్నారు. అదేమిటంటే.

క్రీ. పూ. 3వ శతాబ్దంలో అశోక చక్రవర్తి కళింగయుద్ధానంతరం బౌద్ధమతాన్ని స్వీకరించి, తన సామ్రాజ్యంలోని యేడు బౌద్ధస్థూపాలను తెరిపించి, వానిలోని బుద్ధుని ధాతువులను వెలికి తీయించి, వాటిని 8400 ముక్కలు చేయించి, బౌద్ధమత ప్రచార నిమిత్తం, ఒక్కొక్క ధాతువు పాతిన ప్రదేశంలో ఒక్కొక్క స్థూప నిర్మాణం జరిపి, అక్కడ బౌద్ధారామాలను నెలకొల్పటం జరిగిందనీ, ఆ ధాతువుల్లోని ఒక పల్లును (దంతం) 'అంటోలో పోలోమోలోకిలి' (ఆంధ్రలో చుట్టూ కొండలుండు) 'భ్రమరగిరి' ప్రదేశంలో, "సంమాసం బుధస ధాతువార పరిగహితస" (ప్రీతితో పరిగ్రహించిన బుద్ధుని పల్లును నాటి) బౌద్ధారామం నెలకొల్పటం జరిగిందనీ, అప్పట్లో నాగార్జునుడు లేడు కాబట్టి, ఆ ప్రదేశం భ్రమరగిరి అని పిలువబడిందనీ, కొంత కాలానికి ఆ ఆరామం శిథిలమవగా, మరికొన్ని శతాబ్దాలకు.... అంటే క్రీ. శ. రెండవ శతాబ్దంలో,

---

23. పల్నాటి వీరకథా చక్రము-తంగిరాల వెంకట సుబ్బారావు-పుట 109

24. పల్నాటి వీరచరిత్ర-పండిత ఉమాకాన్త విద్యాశేఖరులు-ప్రథమ భూమిక-పుట 9

ఆ స్థూపాన్ని పునరుద్ధరించి, ఇక్ష్వాకు వంశపురాణి ఛాంతిశ్రీ "అపర మహావినశల్య" అనే బౌద్ధ సంఘానికి దానం చేయటం జరిగిందనీ, అప్పటి నుండి ఆ ప్రాంతం బౌద్ధ నివాసుల కాటపట్టుగా నిలిచి బౌద్ధమత వ్యాప్తికి దోహదమై దినదినాభివృద్ధి చెంది, క్రీ. శ. 5వ శతాబ్దారంభంలో అక్కడే.... ఆ భ్రమరగిరిలోనే ఆచార్య నాగార్జునునిచే, రసాయనశాస్త్ర విశ్వవిద్యాలయం స్థాపింపబడి, పాహియాన్ లాంటి (క్రీ. శ. 355-4'4) విదేశీయులకు గూడా విద్యగరిపి, విశ్వవిఖ్యాతి నార్జించింది. ఇంత చరిత్ర కల్గిన ఈ ప్రదేశంలో బుద్ధుని పల్లునాటి బౌద్ధారామం నెలకొల్పటం చేతనే, మొదట్లో అరణ్య ప్రాంతంగావున్న ఈ ప్రదేశాన్ని 'పల్లునాడు' (దంతాన్ని నాటిన స్థలం) అని పిలువబడుతూ క్రమంగా శబ్దసాదృశ్యంచే 'పలునాడు' గామారి, వాడుకలో 'పలనాడు' "పల్నాడు"గా రూపాంతరం చెంది వ్యవహరింపబడుతూ ఉందంటారు.[25]

కానీ, ఆ నాగార్జున కొండలోనే అక్కడ లభించిన ఒక ప్రాకృత శాసనంలో 'విజయపురి యపువది సాబాగె విహారెచుల దమ్మగరీయమ్ చెతియ ఘరమ్' అని పేర్కొన బడింది. అంటే, ఇది విజయపురమున శ్రీ పర్వతమునకు తూర్పు విభాగమున చిన దమ్మగిరిలోని 'చైత్యాగారం' అనే అర్థాన్ని సూచిస్తుందని శాసన పరిశోధకులు నిర్ణయించారు.[26] కాబట్టి, నాగార్జునా చార్యునికి పూర్వ మీ ప్రాంతాన్ని విజయపురిలోని శ్రీ పర్వతమని వ్యవహరించటం జరిగింది. అందువల్లనే ఈ శ్రీగిరికి పాదభూమిపై ఏనాడో కట్టబడిన ఒక గ్రామాన్ని శ్రీగిరిపాదు (శ్రీగిరిపాడు) అని ఈ నాటికీ పిలువబడుతూవుంది.

దీనిని బట్టి క్రీ. పూ. 3వ శతాబ్దం నుండి క్రీ. శ. 5వ శతాబ్దారంభం వరకూ ఈ నాగార్జున కొండ ప్రాంతాన్ని శ్రీపర్వతమనీ, దాని రాజధాని విజయ పురియనీ పిలువబడుతూ వుండేవి. ఇక నాగార్జునా చార్యుని

---

25. మద్దికర మల్లారెడ్డి-మాచెర్ల-ముఖాముఖి
26. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము-కుందూరి ఈశ్వరదత్తు-
పుటలు 312-313

కాలంనుండి 'నాగార్జున కొండసీమ' అని పిలువబడుతూ, పల్నాటిలో ఆనాడున్న సీమల్లో ఇది కూడా ఒకటిగా అంతర్భాగమై యుండేది. ఈ ప్రాంతాన్ని నాగార్జున కొండసీమ అని పిలుస్తూ ఉండేవారనటానికి శ్రీకృష్ణ దేవరాయల కాలం నాటి ఈ రెండు శాసనాలు మనకు ముఖ్యమైన ఆధారాలు.

1. 'శ్రీకృష్ణదేవరాయల వారివల్ల యల్లరి నాయకుని కుమారుడు తిమ్మరి నాయకుడు "నాగార్జున కొండసీమను" నాయంకరముగా బడసి, ఆ సీమలోని రాముడికె గ్రామమును మాచెర్లలోని చెన్నకేశవస్వామికి దానము చేసె'

అని, రాముడికెలోని కన్నడ - తెలుగు భాషా మిశ్రమంలో ఉన్న ఒక శాసనం.

2. 'శ. సం. 15[illegible]9లోని కోలగుట్ల శాసనంలో (క్రీ. శ. 1697) ఘంటా ధర్మారాయనింగాడు. "నాగార్జున కొండసీమ"లోని కోలగుట్లలో కొంతభూమిని యొక బ్రాహ్మణునకు దానమిచ్చె'.[27]

ఆ తర్వాత శ్రీకృష్ణదేవరాయల అనంతరం ఈ పల్నాటిని పాలించిన ఆర్కాటు నవాబుల కాలంలో (క్రీ. శ. 17[illegible]4) నాగార్జున కొండసీమను మాచెర్ల సీమలో కలిపి, మొత్తం పల్నాటిని ఐదు సీమలుగా విభజించినట్లు శ్రీ మద్దులపల్లి గురుబ్రహ్మశర్మగారు 'వీరభాగవతము' అవతారికలో పొందుపరిచారు. ఈ సీమల ఆధిపత్యానికి కూడా కొందరిని దేశపాండ్యలుగా, దేశముఖులుగా నియమించినట్లు క్రీ. శ. 1783 లోని మాచెర్ల, చింతల రామేశ్వరంలో గల రెండు శాసనాల్లో వివరంగావుందని వ్రాశారు. ఆ శాసనాల ఆధారంతోనే నేమో, శ్రీ ముదిగొండ వీరభద్రకవి (క్రీ. శ. 1862)గారు తన 'వీరభాగవతము' అనే గ్రంథంలో....

'సన్మానంబొప్ప నొసంగె బుత్రికకు పల్నాడైదు దేశంబులన్'

---

27. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము-కుందూరి ఈశ్వరదత్తు- పుటలు-188-189

అని వ్రాయటం జరిగింది. ఈ పై విషయాలను పురస్కరించుకుని 'నాగార్జున కొండసీమ' పల్నాటి సీమల్లోని అంతర్భాగమేనని చెప్పటంలో సందేహం లేదు. కనుక, వల్లు (దంతం) (నాడు) (అర్థాను స్వారంలేదు) నాటుటచే వల్లునాడుగా పిలువబడిందనేది సమంజసం కాదు.

ఇప్పటికి మనకు లభించిన ప్రయోగాలన్నిటిలోనూ క్రీ. శ. 669 లోని కోనంకి శాసనంలో వున్న 'పల్లి రాష్ట్రము' ఇక మాచెర్ల ఆదిత్యేశ్వరాలయంలోని (క్రీ. శ. 1111) 'పల్లిదేశము', క్రీ. శ. 1118 భృగుబంద శాసనంలోని 'పల్లినాడు' శబ్దాలు మిక్కిలి ప్రాచీనమైనవి. వాటిలోని "పల్లి" అనుపదానికి తద్భవ రూపమైన "పల్లె" అను పదాన్ని తీసుకుని శ్రీ రావిపాటి లక్ష్మీనారాయణగారు "పల్లెనాడు" అయిందంటారు. అసలు దానికున్న రూపాన్ని వదలిపెట్టి, తద్భవ రూపాన్ని తీసుకోవలసిన అవసరమేమిటి? కాబట్టి, జైన సంప్రదాయంగా శాసనాల్లో వివరించిన "పల్లి" "పలి" అను పదాలే మనకు ముఖ్యమైన ఆధారాలు. వీటి ప్రయోగాలతో పిలువబడినదే "పల్లినాడు" ఈ పదానికి కొన్ని కావ్యాలుగూడా, సాక్ష్యంగా నిలువకపోలేదు. వీటినన్నిటినీ క్రోడీకరించి పల్నాటి చరిత్రను వ్రాసిన రాబర్ట్ సీవెల్ తన చారిత్రక నివేదికలో....

> Mr. "Brown gives Pallinadu as the Corrcet spelling for the name of the whole traet." The oficial spelling as Palanadu in Telugu and Palnad in English అని వ్రాయటం జరిగింది.[28]

కనుక, "పల్లి" "పలి" అని ప్రాచీన శాసనాల్లో వున్న పదాలనే ముఖ్య ఆధారంగా తీసుకుని, పలనాటి పదవ్యుత్పత్తిని నిర్ణయించటం సమంజసం, సమయోచితమని కూడా నా యుద్దేశం.

దాదాపు వేయిసంవత్సరాల క్రితంలోని, జైన ఆలయాలు, వాఙ్మయ రూపాలు ఇప్పటికీ పల్నాడు ప్రాంతమంతా అక్కడక్కడా

---

28. వీరభాగవతము-అవతారిక-మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ-పుట 2

అవశేషాలై కనిపిస్తూ వున్నాయంటే; ఆనాడు జైనులు ఈ ప్రాంతంలో విస్తారంగా నివసించి ఉండబట్టేకదా! అందువల్లనే ఈ ప్రాంతానికి ఆనాడు "పల్లినాడు" అనే పేరువచ్చింది. కనుక జైన సాహిత్యం నుండి వచ్చిన ఈ "పల్లి" అను శబ్దానికి "నాడు" (దేశం) జత కలిపి, పల్లినాడుగా మారి, వాడుకలో "పల్లి" అను శబ్దం.... తల్లి, తొల్లి, పెల్లి, పుల్లిరుసు శబ్దాల్లా జడ్డకు లోపం జరిగి, పలినాడుగా రూపాంతరం చెంది, చివరకు "పలనాడు" "పల్నాడు"గా వ్యవహరింపబడుతూ, ప్రస్తుతమీ రెండు పదాలు రూఢమై ఉచ్చరింప బడుతున్నాయని నా యభిప్రాయం.

కాలం వక్రించింది. జైనమత మీ ప్రాంతంలో పూర్తిగా తుడుచుకు పోయింది. దానికి కారణం? ఆర్థిక లోపంతో అణగారుతూ సంఘంలో, ప్రతి అంగంలో నలుగుతున్న నిమ్నజాతులే ఎక్కువగా జైనులై మతాన్ని అభివృద్ధి చేసుకోలేక, చివరకు పెట్టుబడిదారీ విధానానికి లొంగి పోవటం వల్లనే. కాని, జైనమత జ్ఞాపక చిహ్నంగా, ఎన్నో రూపాంతరాలు చెంది, చివరకొక అవశేషంగా ఈ నాటికీ వాడుకలో అందరి నోట వినిపించేది "పల్నాడు" అను పదం మాత్రమే. పూర్వ కాలంలో ఎన్నో నాడులు వెలసి, ఎంతో కీర్తినార్జించి, చివరకీనాటికి ఆ "నాడు" లన్నీ తెరమరుగై కాలగర్భంలో కలిసిపొయ్యాయి. కాని, 'పల్నాడు' అనే పదం మాత్రం చిరాయువు కల్గి, ఈ నాటికీ వ్యవహార నామంగా ఉచ్చరింపబడుతూ ఉన్నదంటే.... అది జైనుల పుణ్యఫలమే.

పలి, పల్లి అనుపదాలకు ఇంతటి ప్రశస్తమైన పూర్వ చరిత్ర వుంటే, ఆ చరిత్ర నేమాత్రం తడవక, శ్రీనాధుడు చెప్పిన చాటువుల్లోని, 'జొన్నకలి జొన్నయంబలి' అను పద్యంలో, పలనాడును పలినాడును పలినాటిసీమ అనటం నిందావాచకమని పరిగణించారు; 'కాకతీయుల కాలంనాటి సామాజిక జీవితం' అనే కావ్యంలోని 19 పుటలో, మలయశ్రీగారు. ఇది ఆలోచనా రహితమైన మాట. ఒక్క శ్రీనాధుడే

కాక పింగళి సూరన, వినుకొండ వల్లభరాయడు కూడా 'పలినాడు' అను పదాన్నే ప్రయోగించారు. ఇవేగాక, అంతకుముందున్న శాసనాల్లో కూడా 'పలినాడు' అని స్పష్టంగా తెలుపబడింది. ఇవి కూడా నిందావాచకాలేనా! శ్రీనాధుడు ఆనాడు పల్నాటిలో అనాదరణకు గురియై ఈ విధంగా వ్రాశాడని ఊహించుకుంటే, ఆయనకు ముందుగనే వ్రాసిన వారి సంగతేమిటి? నిజంగా శ్రీనాధుడా ఊహతోనే ప్రయోగించాడనుకుంటే; అసలు పల్నాటి చరిత్రను వ్రాసేవాడే కాదు. నిజంగా శ్రీనాధుడానాడు పల్నాటిలో నిరాదరణకు గురికాలేదు. పల్నాటిలో ఆనాడున్న సాంఘిక పరిస్థితినే వివరించాడు అంతేకాని, మరో విధంగా ఊహించటం కేవలం పొరపాటు.

# నాయకురాలు నాగమ్మ పుట్టు పూర్వోత్తరాలు:-

పలనాటి చరిత్రలో అసహజంగా, అల్పంగా చిత్రీకరింపబడిన నాయకురాలు నాగమ్మ జనన మరణ వృత్తాంతాలు, యిప్పటి వరకూ ఏ పరిశోధకుడూ అందుకొనని రహస్యంగా, అభూత కల్పనలతో నిండిన వర్ణనలతో కలిసి అగుపిస్తాయి. కరీం నగరు జిల్లా (సబ్బిమండలం)లోని బుడిగి జంగాలు (మాలజంగాలు) తదితర పెద్దలు కథలుగా చెప్పుకునే బల్మూరు కొండలరాయని కథలోని చివరి భాగం, నాయకురాలి జనన మరణ విషయాలుగా విలువైన సమాచారాన్ని ఇస్తున్నాయి. ఈ కథలోని అంశాలు వాస్తవికమైనవనే భావన కూడా యేర్పడుతుంది.

మూడు రాత్రులు కథగా చెప్పుకునే ఈ కొండలరాయని కథలో చివర, నాయకురాలి వృత్తాంతం పది నిముషాలపాటు వస్తుంది.

—: కథాక్రమం ఇది :—

ఈ బల్మూరు కొండలరాయడొక పెద్ద బందిపోటు గజదొంగ. ఈతని అనుచరులు మహాపరాక్రమ శాలురు. రాత్రి సమయాల్లో గుర్రాల మీద బయలుదేరి, ఎక్కడెక్కడో ఊళ్ళకు ఊళ్లు దోచుకోవటం ఈ ముఠా చేసేపని. కథంతా ఈ కొండలరాయడి పరాక్రమాలతో, శౌర్య సాహసాలతో, ఒకవేళ ఎదురుదాడి జరిగితే తప్పించుకునే చాతుర్యంతో నిండి వుంటుంది. అనుచరులతో ఇతడొక కొండ శిఖరం (కొండగట్టు)పై నివసిస్తుంటాడు. సామాన్యులెవ్వరూ ఆ కొండమీదికి ఎక్కలేరు. కాని, అతని అనుచరులు గుర్రాల మీదనే కొండ శిఖరం మీదికి చేరుకోగలరు అంతటి శిక్షణ ఆ గుర్రాల కిచ్చాడు. కొండ శిఖరం మీదినుండి ఒకే దూకుతో గుర్రాన్ని కిందికి దూకించిన ఘనత ఈ బల్మూరు కొండలరాయడి కున్నట్లు వర్ణించబడింది. ఆ కొండ క్రిందిభాగాన గుర్రపు డెక్కలు లాగా అడుగులోతులో విడివిడిగా కనిపించే ఒక పెద్ద బండవుంది, ఈ కొండల రాయడు తన గుర్రాన్ని దూకిస్తే పడిన గుర్తుగా, దాన్ని ఆ ప్రాంత వాసులు చూపిస్తున్నారు.

ఆ ప్రాంతంలోనిదే అరవెల్లి గ్రామం. కొండలరాయుని ముఠా ఎప్పుడు అకస్మాత్తుగా విరుచుకు పడుతుందోనని ఆ గ్రామ ప్రజలంతా భయంతో నివసిస్తూంటారు.

ఒకరోజు ఒంటరిగా ఒక వృద్ధస్త్రీ ఆవూరు చేరింది. యుద్ధం నుండి వచ్చిన వీరవనితలా గుర్రం మీద వచ్చింది. గుర్రపు జీనుకు ఒకవైపు పొడవాటి ఖడ్గమూ, ఈటె మొదలైన పరికరాలు అమర్చబడ్డాయి. వృద్ధురాలైనా, ఆమె తేజస్సు మహిషాసురుని మర్దించిన భవానిలా వెలుగొందుతుంది. ఆమె ఎవరో తెలియక, ఊరి వారంతా అనుమానంగా దూరదూరంగానే వున్నారు. అసలే కొండలరాయుడి అగడాలకు అరచేత ప్రాణాలు పట్టుకుని భయంతో జీవిస్తున్నారు, వారు. దానికి తోడివొక భయసంఘటన.

వాళ్ళలా భీతితో ఉండటాన్ని గ్రహించి, ఆ వృద్ధవనిత గ్రామ పెద్దల్ని పిలిపించింది. కాని, ఎవ్వరూ దాపుకు చేరలేదు. రెండు మూడు రోజుల్లో సానునయంతో కొందరు స్త్రీలను దగ్గరకు చేర్చుకో గలిగింది. వారి ద్వారా, ఆవూరి విషయాల్ని, వారి బాధల్ని ఆకళింపు చేసుకుంది. తనది ఆవూరేనని చెప్పుకుంది. తనను నాయకురాలని పిలుస్తారన్నది. పూర్వం మీ గ్రామంలో తరచూ వ్యాపించే కలరా మహామారి వ్యాధులకు తట్టుకోలేక, తనతల్లి గతించటంతో, తనకు యేడేండ్ల ప్రాయమప్పుడు తన తండ్రితోపాటు, తన మేనమామలతో సహ ప్రవాసంగా వెళ్ళానన్నది. ఆ ప్రవాస ప్రాంతంలోనే తనవారి నందరినీ పోగొట్టుకుని ఒంటరి దాన్నయ్యానన్నది. అయినా, తన శక్తిమేరకు, తానున్న దేశంలోని ప్రజలకు మేలే చేశానన్నది. చివర కక్కడ సంభవించిన ఒక మహాయుద్ధంలో, ఒక శూరుణ్ణి అశక్తుణ్ణి చేశానన్నది. "నా వారెవ్వరూలేని ఆ ప్రదేశంలో నేనుండి ఏంచెయ్యాలి? నా శేష జీవితాన్ని నాజన్మ స్థలంలోనే గడపాలనే వుద్దేశంతో ఈవూరు చేరా"నన్నది. అందరూ ఏకమై ప్రతిఘటిస్తే, ఆ కొండలరాయుడి అగడాల నరికట్ట వచ్చునని విపులీకరించింది. అందుకు తానూ సహకరిస్తానంటూ ఉత్తేజపరిచింది. ఆ మాటలు ఆవూరి వారికి చలనం కలిగించాయి. తనను గురించి ఆమె

చెప్పుకున్న వివరం, అందరికీ, అవగతమైంది. ఆమె చెప్పిన హితవూ నచ్చింది. కడారి జింకడనే వీరుడు, తన మాలవాడనంతా ఏకంచేసి ముందుగా ఆమెకు బాసటగా నిలిచాడు. ఎందరో స్త్రీలు ముందుకు వచ్చి ప్రతిఘటనకు సిద్ధమై ఆమెనే నాయకురాలిగా ఎన్నుకున్నారు. క్రమ క్రమంగా గ్రామ ప్రజలంతా సంఘటితమై కొండలరాయుని తరిమి కొట్టాలని శపథాలు చేశారు. ఆమె నాయకత్వంలోనే శిక్షణ పొందారు.

కొద్దిరోజుల్లో అరవెల్లి గ్రామాన్ని దోచుకోవటానికి కొండలరాయుని దండురానే వచ్చింది. అనుకున్న రీతిగా అందరూ ఏకమై దండును ఎదుర్కొన్నారు. కడారి జింకడు ఒక్కడే కొండలరాయుని ఢీకొని, వీరోచితంగా పోరాడి, చివరకు వీరమరణం పొందాడు. దానితో ప్రజలు మరీ రెచ్చిపోయి, భయంకరంగా పోరాడి దండును తరిమి కొట్టారు. ఆ సమయంలో కొండలరాయుడిని స్వయంగా నాయకురాలే ఎదుర్కొన్నది. స్త్రీలందరూ ఆమెకు అండగా నిలిచారు. పోరు విపరీతంగా సాగింది. అనుచరులు పారిపోవటంతో ఆవేశం పెల్లుబికిన కొండలరాయుడు, విజృంభించాడు. తన గుర్రాన్ని ఉసిగొల్పి నాయకురాలి మీదికి దుప్పించి దూకించాడు. ఆ దెబ్బతో నాయకురాలు అనుచర స్త్రీలతో పాతాళానికి తొక్కబడింది. కొండలరాయుడు వికటంగా నవ్వాడు. ఆ నవ్వుతోనే తన గుర్రం మీద పడిపోయ్యాడు. గుర్రం అతివేగంతో పరుగెత్తి కొండ శిఖరం చేరుకుంది. తర్వాత మూడు రోజులకు కొండలరాయుడు మరణించాడని తెలుసుకున్నారు, అరవెల్లి గ్రామవాసులు.

కొండలరాయునిచే నాయకురాలు తొక్కబడలేదనీ, తన స్థావరంలో తనముందా ఎదురు తిరగటంతో, కొండలరాయుడు ఆత్మహత్య చేసుకున్నాడనీ, అతని మరణానంతరం నాయకురాలు, ఆమె అను చర స్త్రీలలో దీప సమాధైందనీ కొందరు చెప్తారు.

ఇదీ సంక్షిప్తంగా కథ:-

ఏది యేమైనా అరవెల్లి గ్రామాన్నే కాక, ఆ ప్రాంతాన్నంతా బందిపోటు వారినుండి శాశ్వత రక్షణ కల్పించిన నాయకురాలికీ, ఆమె పాతాళం తో చేరిన స్థలంలోనే (భూగర్భంలో) ఆమెపేర గుడి కట్టించారు. అనాటినుండి ఈ నాటివరకూ అరవెల్లి గ్రామంలో గ్రామ దేవతలాగా పూజలు అందుకుంటూనే వుంది. ఐదు సంవత్సరాల కొకమారు కొలుపులూ జరుపుకుంటూనే వుంది. ఆ గుడిలో లభించే తీర్థం తీసుకెళ్ళి, ఆ ప్రాంత వాసులంతా పంటపొలాలపై పొలికలగాలని చల్లుకుంటారు. ఆ గుడికి తూర్పు వైపున వున్న ఒకపెద్ద వాగును నాయకురాలివాగు అనీ, ఆ వాగులోని ఒకపెద్ద నీటి కొలనును నాయకురాలి మడుగు అనీ పిలుస్తారు. ఆ వాగుకు ఇరువైపుల జరిగిన యుద్ధమే నాయకురాలి యుద్ధం. ఆ గుడి కెదురుగానున్నదే, పూర్వపు అరవెల్లి గ్రామం.

కరీం నగరునుండి జగిత్యాల వెళ్ళే మార్గంలో నలభై రెండు కిలోమీటర్ల దూరంలో మల్యాల జంక్షన్ వుంది. అక్కడ నుండి మల్యాల మీదుగా పదిహేను కిలోమీటర్ల దూరం కాలినడకనగానీ, సైకిళ్ళ మీదగానీ ప్రయాణిస్తే అరవెల్లి గ్రామం వస్తుంది. ఇది మల్యాల తాలూకా పెగడపల్లి మండలంలోనిది. ఈ అరవెల్లి ఒకనాడు చాలా పెద్ద గ్రామం. ఆ రోజుల్లో ఆర్థికంగా, అధికారికంగా నిండుకున్నదే. మద్దులపల్లి, సుద్దపల్లి, దోమలకుంట దీనికి సివారు గ్రామాలుగా వుండేవి. కాని, వూరంతా యేనాడో పాడుబడిపోయింది. ఎటు జూసినా ఒకమైలు పొడవున శిథిలమైన దేవాలయాలతో, పాడు బడిన మొండిగోడలతో, సేద్యపు పొలాలతో మనకిప్పుడు దర్శన మిస్తుంది. ఊరు శిథిలమవటంలో, దానికి ఉత్తరంగా ఒక ఫర్లాంగు దూరాన ఇప్పుడు వున్న అరవెల్లి కనిపిస్తుంది. ఇప్పుడున్న గ్రామంలో దాదాపు మూడు వందల కుటుంబాలున్నాయి. పాత అరవెల్లిలోని నాయకురాలి గుడి దగ్గర, ఆ గుడి ఆధారంతో బ్రతికే ఓ పది తంబళ్ళవారి కుటుంబాలున్నాయి. భూగర్భంలోని నాయకురాలి గుడి ఉపరితలాన్ని ఎవరూ తొక్కకుండా, పెంకుతో కుటీరం కట్టించారు. ప్రతి బుధ శుక్రవారాలు పూజ జరుగుతుంది. గుడికి అర్చకులు తంబళ్ళవారే. గుడిలో నాయకురాలి మూల విగ్రహం, భూమిలో సగం వరకు పాతిపెట్టబడివుంది.

మూల విగ్రహానికి ఎడమ పైపు ఆమె అనుచర వీరవనితల విగ్రహాలు కూడా అలాగే వుంచబడ్డాయి.

ఉపచేతల ద్వారం నుండి భక్తులు చూడటానికి వీలుగా చెక్కతో తయారుచేసిన, ఒకపెద్ద నాయకురాలి విగ్రహం పానవట్టంలో నిలబడి గంభీరాకృతితో వుంటుంది. గుడి కెదురుగా వున్న ఒక మర్రిచెట్టు క్రింద, అరుగుపై కొన్ని శిల్పాలున్నాయి. అందులో ఒకటి కడారి జింకడు, మరొకటి అతని భార్య (నాయకురాలి అనుచరురాలు)వని ఆ ప్రాంతవాసులు చెపుతారు.

ఆ శిల్పాలకూ, పల్నాటి యుద్ధ కాలంలోని శిల్పాలుగా చెప్పబడే మాచెర్ల, గుత్తికొండ, చెర్లగుడిపాడు ప్రాంతాల్లోని శిల్పాలకూ చాలా దగ్గరి పోలికలున్నాయి.

ఈ కథను అరవెల్లి గ్రామ పెద్ద శ్రీ కస్తూరి మల్లేశంగారు, నూకపల్లి వాస్తవ్యులు శ్రీ బండారు కేశవరావుగారు, నుస్తలపూర్ తెలుగు పండితులు శ్రీ సన్నపరాజు హనుమంతరాజుగారు, గుడి అర్చకుడు శ్రీ నగునూరి వెంకటయ్యగారు మొదలైన పెద్దలు చాలామంది చెప్పారు. ఎవరు చెప్పినా, నాయకురాలి కథ స్థూలంగాయిదే.

కొండలరాయని స్థావరమైన కొండగట్టు, ఇప్పుడొక యాత్రా స్థలమైంది. కొండలరాయని అనంతరం, అక్కడ వెలసిన ఆంజనేయస్వామి భక్తులకు ప్రీతి పాత్రుడయ్యాడు. ఆ గట్టుపై పోలీసురాణావుంది. వైర్‌లెస్ కూడా అమర్చారు. ఆ కొండగట్టుకూ, అరవెల్లి గ్రామానికీ మధ్య దూరం ఇరవై యైదు కిలోమీటర్లు ఉండవచ్చు.

ఈ కొండలరాయని కథను, జానపదులలో తరచూ వినిపించే అభూత కల్పనలతో కలిపి ఆ ప్రాంతం బుడిగిజంగాలు. (మాలజంగాలు) అప్పుడప్పుడూ చెపుతూ యాచిస్తూ వుంటారు. ఈ కథకు సంబంధించిన ఏ విధమైన తాళపత్ర గ్రంథాలుకానీ, వ్రాత ప్రతులుగానీ, మరేవిధమైన

నాయకురాలు సహచరులు

కరాటి పెంటడు అతని భార్య

"అరెపల్లి" (కరీంనగర్ జిల్లా)

శాసనాలుగానీ అక్కడ లభించవు. బుడిగి జంగాలు వంశానుగతంగా పాడుకొనుకథే మనకు ఆధారం. మధ్యమధ్య విపరీతమైన వ్యాఖ్యలతో, బుర్రకథల్లోని రగడల్లాగా కథ ఈ విధంగా సాగుతుంది.

రాయుడే....కొండలా రాయుడా
నా రాయుడే....కొండలా రాయుడా....హాయ్
రాయుడా బల్మారీ....రాయుడా....హాయ్
.... .... .... .... ....
ఏడేండ్ల పాయంల ఎగిసిపోయిన సిల్క
యాడుండొ యేమైందో ఎరికలేకాయరా
ముసిద్దై వొచ్చింది అమ్మోరి తీర్న
అందర్ని పసిగట్టి అడిగించినాది
నాయకురాలై నడిపించినాది
ఉసిగొల్పి జగడంల కమ్మించినాది
గుబ గుబా రకతమే గుబ్బలేసింది....హాయ్
కొండల రాయుడే అశ్వంతొ తొక్కిస్తె
పాతాల లోకంల కూర్కపోయిందీ....రాయడే

కథలోని నాయకురాలి విశేషాల్ని, అక్కడ లభించే శిల్పాకృతుల పోకడల్ని పరిశీలించి చూస్తే; ఈకథ పల్నాటియుద్ధం జరిగిన పన్నెండవ శతాబ్దానికి చెందినదై వుంటుందని నా ఊహ.

దీనినే కీ. శే. శ్రీ కలవల వెంకట సుబ్బారావుగారు తన "భక్త పలనాటి వీరచరిత్ర"లో నాయకురాలు నాగమ్మ కరీం నగరు (సబ్బిమండలం)జిల్లాలోని అరవెల్లి గ్రామానికి చెందినదై ఉంటుందని సూచించారు. డాక్టర్ తంగిరాల వెంకట సుబ్బారావుగారు, తన పరిశోధన గ్రంథం "పలనాటి వీరకథా చక్రము"లో అది సమంజసమనే భావించారు. కాని, వీరిద్దరూ అరవెల్లి గ్రామం వెళ్ళినవారు కారు.

దీనిని బట్టి పల్నాటి వీరగాథలలో తెలిపినట్లు, చౌదరి రామిరెడ్డి అనపత్యుడూకాదు, నాగమ్మ నాగులేటి తీరాన లభించిందీకాదు. రామిరెడ్డికి కన్నకూతురే నాగమ్మ. ఆరవెల్లి అన్నది, నాగమ్మకు పుట్టినింటి పేరూకాదు. అత్తవారింటి పేరూకాదు. అది గ్రామ నామం మాత్రమే.

చౌదరి రామిరెడ్డి ఆనాడు ఆరవెల్లిలో తరచూ సంభవించే భయంకర వ్యాధులకు తట్టుకోలేక, ఆరవెల్లి నుండి పల్నాడులోని జిట్టగామాలపాడు గ్రామానికి వలస వచ్చి స్థిరపడినవాడే. అప్పటికే తనభార్య గతించటంతో భయపడి పసిపాపయైన తనకూతురు నాగమ్మను, ఆమె మేనమామ మేకపోతుల జగ్గారెడ్డి సంరక్షణలో వుంచి, తానొక్కడే ముందుగా జిట్టగామాలపాటికి చేరియుండవచ్చు. స్థిరత్వమేర్పడిన తర్వాత, తన కూతురు నాగమ్మతో సహా, ఆమె మేనమామ సంసారాన్ని కూడా జిట్టగామాలపాటికి చేర్చియుండవచ్చు. స్థిరత్వమేర్పడటానికి కనీసం ఐదు సంవత్సరాల కాలం పట్టియుండవచ్చు. ఈ మధ్యకాలంలో చౌదరి రామిరెడ్డి ఒక్కడే జిట్టగామాలపాటి వాసులకు పరిచయమయ్యాడు.

'చౌదరి' అనే పదం రెడ్లలో ఒక శాఖానామం. ఈ శాఖవారు పల్నాటిలో ఆ రోజుల్లోనే కాదు, ఈనాడు కూడాలేరు. కాబట్టి, కొత్తగా పరిచయమైన రామిరెడ్డికి; పల్నాటి ప్రాంతవాసులకు విచిత్రంగా వినిపించిన శాఖానామం చేర్చి 'చౌదరి రామిరెడ్డి' అని పిలవటం సహజం. రెడ్లలో ఈ చౌదరి శాఖవారు కరీం నగరు జిల్లాలో యిప్పటికీ విస్తారంగా వున్నారు. ఈ శాఖవారు వరంగల్, నిజామాబాదు, నల్గొండ జిల్లాల్లోనూ అక్కడక్కడా కనిపించినా; వారంతా ఏదో ఒకరూపంలో వలస వెళ్ళినవారే నంటారు. అంతకు తప్ప ఆంధ్రలో మరెక్కడా కనిపించరు. కాబట్టి, పల్నాటి వీరగాథలో తెలిపినట్లు రామిరెడ్డి పంటరెడ్డికాదు. కీ.శే. ముదిగొండ వీరభద్రకవిగారు తన 'పల్నాటి వీరభాగవతం' అనే పద్యకావ్యంలో తెలిపినట్లు పాకనాటిరెడ్డికాదు. అసలైన చౌదరిశాఖకు చెందినవాడు. కనుకనే 'చౌదరి రామిరెడ్డి' అని పిలువబడ్డాడు.

ఈ చౌదరి రామిరెడ్డి జిట్టగామాలపాడు చేరిన ఐదు లేక ఆరు సంవత్సరాలకు, తనకూతురు నాగమ్మ, ఆమె మేనమామ మేకపోతుల జగ్గారెడ్డి ఆరవెల్లి నుండి రావటంతో, ఆరవెల్లి నాగమ్మ అని పిలవటం కూడా సహజమే. ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతం చేరి స్థిరపడిన వారిని, వారు వచ్చిన గ్రామం పేరుతో జతజేసి పిలవటం ఇప్పటికీ జరుగుచున్నదే. కనుక, నాగమ్మ 'ఆరవెల్లి నాగమ్మ'గా వ్యవహృతమైంది. పల్నాటిలో 'నాయకురాలు' అని ఆమెకున్న అన్వర్థనామానికి కూడా, అదే గ్రామనామాన్ని జత కలిపి 'ఆరవెల్లి' 'నాయకురాలు' అని పిలవటం సహజం. తల్లిలేని కారణంగా, తన మేనమామ మేకపోతుల జగ్గారెడ్డి పెంపకంలో ఉండటం మూలాన జగ్గారెడ్డికి పెంపుడు కూతురుగా కూడా వాడుకపడి యుండవచ్చు. కాని, నాగమ్మ చౌదరి రామిరెడ్డి సొంతకూతురే.

ఈ విషయంలో డాక్టర్ తంగిరాల వెంకట సుబ్బారావుగారి పరిశోధన గ్రంథం 'తెలుగు వీరగాథా కవిత్వం' రెండవ సంపుటంలోని 204వ పుటలో ముద్రించిన ద్విపద వాక్యాలే నిజమని నిరూపిస్తున్నాయి.

తన పొలంలో చౌదరి రామిరెడ్డి అరక తోలుతుంటే, నాగులేటి తీరాన జిల్లేడుపొదలో దొరికిన శిశువును తెచ్చుకుని పెంచాడని, నాగమ్మ పుట్టుకను గురించి గుడ్డిగా నమ్మేవారికి ఈ విషయం కనువిప్పు కలిగిస్తుందని నా ఉద్దేశం.

పలనాటి వీరగాథలన్నీ రకరకాల జన శ్రుతుల ననుసరించి మలచబడినవే. కనుక, నాగమ్మ (నాయకురాలు) జనన మరణ వృత్తాంతాలలో ఎన్నో పొకడలుండవచ్చు. అలాగే బ్రహ్మనాయుడు, బాలచంద్రుడు, వీరి జననాలు కూడా హేతువు కందని రీతిలో అతిశయాలతో, అభూత కల్పనలతో మలచబడినవే.

Journal of Telugu Studies
Research quarterly. 2 July 1988.

# నాగమ్మ సాధించిన పల్నాటి నాయకత్వం :-

కరీంనగర్ జిల్లా (సబ్బిమండలం) మల్యాల సంస్థానంలోని ఆరవెల్లి గ్రామం నుండి ప్రవాసంగా పల్నాడు చేరిన చౌదరి రామిరెడ్డి, జిట్టగామాలపాడు గ్రామంలో స్థిరత్వమేర్పరుచుకున్నాడు. తనతోపాటు తన బావమరిది మేకపోతుల జగ్గారెడ్డి (వీరజగ్గారెడ్డి)ని కూడా గామాలపాడు చేర్చి స్థిరత్వమేర్పరిచాడు. ఇద్దరూ ఆరవెల్లి నుండి ఎంతో గోసంపదతో వచ్చారు. వారు తెచ్చుకున్న ధనంతోనే, ఆ గోగణానికి సరిపడేంత భూమిని కూడా గామాలపాటి ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్నారు. ఇద్దరూ లంకంతలోగిళ్ళు నిర్మించుకున్నారు. విశాలమైన వారి గోశాలల్లో ఖణిఖ్మన రంకెలువేసే వృషభరాజాలు, గాళ్ళకు కట్టబడి బారులుతీరి వుండాయి. ఏవోపనుల మీద ఆ ప్రాంతానికి వచ్చిపోయే వారికి నిరతాన్నదానం సలుపుతూ ఉండటం వల్ల; ఆ చుట్టు పక్కల గ్రామాలన్నిటికీ వారే పెద్ద దిక్కుగా పరిగణింపబడ్డారు.

చౌదరి (చేవుదరి) రామిరెడ్డి ఏకైక పుత్రికయైన నాగమ్మకు, తల్లిలేని కారణంగా, ఆమె మేనమామ వీరజగ్గారెడ్డి పెంచుకుంటూ, ఆమెకు ఎనిమిదవయేడురాగానే, తన కుమారుడైన సింగారెడ్డికిచ్చి ఘనంగా పెండ్లి జరిపించాడు. ఆ రోజుల్లో బాల్యవివాహలే శాస్త్ర సమ్మతాలు.

ఈ నాగమ్మ భర్త విషయాన్ని ప్రస్తావిస్తూ శ్రీ కంభాళమఠం బసవలింగ దేవరగారు, తన 'వీరభూమి' అను బుర్రకథా పుస్తకంలో, మాచెర్ల నివాసియగు ఓబళరెడ్డి కుమారుడు సింగారెడ్డికిచ్చి, నాగమ్మకు పెండ్లి జరిపించారని పొందుపరిచారు. ఇది విచారించదగ్గ విషయం.

పూర్వం నుండీ రెడ్లలో శాఖలు లెక్కకు మిక్కుటం. ఈ శాఖలు 11వ శతాబ్దం నుండి బాగా ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది. బిచ్చకుంటివారు చెప్పే అమ్మోజమ్మ తిమ్మోజమ్మకథలూ, ఇంకా రెడ్ల కథలూవింటే, రెడ్లలోని శాఖలు చాలావరకు తెలియగలవు. పూర్వపు రోజుల్లో ఈ బిచ్చకుంటివారు, రెడ్ల కథల్ని గానంచేస్తూ, రెడ్లనేయాచిస్తూ బ్రతికేవారు.

మొదట్లో ఈ పెద్దశాఖల నిర్మాణం ఎలా జరిగినా, రానురాను అర్థబలం, అధికార బలం, సంఖ్యాబలం గలవారంతా వారివారి శాఖలనే ప్రథమ శాఖలుగా నిర్ణయించుకుంటూ, తక్కిన శాఖల వారిని తక్కువ చూపుతో చూడటం మొదలు పెట్టారు. అలా చూడటంతో, కొంతకాలానికి ఈ శాఖాభేదాలు పటిష్ఠమయ్యాయి. దీనితో పరస్పర శాఖల మధ్య అన్యోన్యత అంతరించి వైమనస్యభావం పొడసూపింది. చివరకు ఎవరికి వారు తమశాఖనే గొప్పగా సృష్టించుకుంటూ వచ్చారు. ఎవరి శాఖకు వారే ప్రత్యేక సాంఘికాచారాలు కూడా నిర్ణయించుకున్నారు. ఒక శాఖవారు మరొక శాఖవారితో వియ్యపు పొత్తు కాదుగదా, కనీసం వివాహ సందర్భాల్లో వధూవరులకు నలుగు పెట్టటానికి కూడా రానిచ్చేవారుకాదు. ఇక కంచపు పొత్తు, ఏ కొద్ది శాఖల్లోనో తప్ప చాలా వరకు మృగ్యమైనట్లే.

రానురాను ఈ శాఖల్లో కూడా వర్గాలు ఏర్పడ్డాయి. కొన్ని వర్గాలు తాళిబొట్టు (మంగళ సూత్రం)ను నిరాకరించి 'పుస్తెబొందు' అనే పేరుతో నూటా ఒక్క నూలుపోగును దండగా చుట్టి, పసుపు నీటిలో తడిపి, కంఠ సూత్రంగా వధువుకు వేసేవారు. కొన్ని వర్గాలు వివాహ సందర్భాల్లో వధూవరులను పచ్చల పల్లకిలో కూర్చోబెట్టి, పగటిదివిటీల వెలుతురులో ఊరేగింపు జరిపేవారు. ఇలా డాంబికంగా, కలిగినవాడు కలిగినట్లు సాగించుకుంటూ, చివరకు వాటినే ఆచారంగా నిర్ణయించుకున్నారు. కొన్ని వర్గాలు రామానుజమతం స్వీకరించి వైష్ణవనామం (ఊర్ధ్వపుండ్రం) ధరిస్తే; మరికొన్ని వర్గాలు లింగధారణ చేసి త్రిపుండ్రం తీర్చేవారు. ఇంకాకొన్ని వర్గాలు శాక్తేయులై, జాతరల పేరుతో శక్తి ఆరాధనకు జంతు బలులను పాటించేవారు. ఈ వర్గాలన్నిటికీ స్మార్తులు పౌరోహిత్యం నెరపినా; రామానుజమతస్థులకు చాత్తాత వైష్ణవులూ, (సాతానివారు) శైవ మతస్థులకు జంగం వారూ శ్రాద్ధకర్మలను నెరపేవారు, కొన్ని వర్గాలు మృతులను భూమిలో పూడ్చిపెట్టి, దానిపై సమాధి నిర్మాణం జరిపితే; కొన్ని వర్గాలు దహనం చేసేవారు. ఇదీ, వర్గసృష్టి.

అసలు రెడ్లలో శాఖా నిర్మాణాలు జరిగిన తొలి రోజుల్లోనే దేశముఖిరెడ్లు, దేశపాండ్యరెడ్లు, చౌదరి రెడ్లు, సామంతలుగా, మాండలీకులుగా, స్థానిక పరిపాలకులుగా కొనసాగుతూ ప్రముఖ స్థానం వహించి, ప్రథమ శాఖలుగా తొలిరోజుల్లోనే నిర్ణయించుకున్నారు. ఈ శాఖలవారు కరీంనగరు (సబ్బిమండలం) ఆ పరిసర ప్రాంతాల్లో తప్ప తక్కిన ఆంధ్రలో ఆనాడేకాదు, ఈనాడుకూడా లేరు.

ఈశాఖల్లో దేశముఖి, దేశపాండ్యలను, A recorder, the higher revenue officer, A superintendent అనీ; చౌవుదరులను The headman of a village or district అనీ C. P. Brown గారి నిర్వచనం.

ఇలాంటి శాఖల్లో, అనాడు నాగమ్మ చవుదరి శాఖకు చెందిన ఆడపడుచు. రెడ్లలో ఏశాఖకు ఆశాఖ, ఏవర్గానికి ఆవర్గం విడివడి, ఎవరికి వారు ప్రత్యేక సాంఘికాచాల్ని నిలుపుకుంటూ, తక్కిన శాఖలతో విభేదించి, విపరీతమైన ఆచార కట్టుబాట్లతో వ్యవహరిస్తూఉన్న ఆరోజుల్లో, ఉన్నతమైనదిగా చెప్పుకునే చౌదరిశాఖలో జనించిన నాగమ్మను, పల్నాటిలోని మరోశాఖవారికిచ్చి పెండ్లి జరిపించారనేది నమ్మశక్యం కానివిషయం. కనుక సొంతమేనమామ మేకపోతుల వీరజగ్గారెడ్డి కుమారుడైన సింగారెడ్డికే యిచ్చి నాగమ్మకు పెండ్లి జరిపించారనటంలో సందేహంలేదు.

ఏది ఏమైనా శ్రీ కంభాళమఠం బసవలింగదేవరగారు వ్రాసినట్లు నాగమ్మ భర్తపేరు సింగారెడ్డి అనునది మాత్రం స్పష్టం. అదిలోనే వర్గసృష్టి జరిగిపోయి, అది చిగురించి, శాఖోపశాఖలుగా విస్తరిల్లి, విపరీతమైన కట్టుబాట్లతో విభాజితమైన ఈసమాజం, ఇప్పుడిప్పుడే వాటిని సడలించుకుని, అంతా ఒకటే మూలమని చేరువయగుచున్నారు. ఇది శుభపరిణామం. ఎంతో మెచ్చుకోదగ్గ విషయం.

ఎనిమిదేండ్ల ప్రాయంలో వివాహం చేసుకున్న నాగమ్మకు విధి వక్రించింది. పెండ్లి జరిగిన నాల్గవ (నాగవల్లి) రోజే భర్త సింగారెడ్డి మరణించాడు. వితంతువైన నాగమ్మ, విరాగి యౌతుందేమోనన్న భావంతో, సకల విద్యా పారంగతుడైన గోవన్న మంత్రివద్ద విద్యాభ్యాసానికి కుదిర్చాడు, జగ్గారెడ్డి. పుట్టుకతోనే వివేకమూ, ధైర్య సాహసాలూ పుణికిపుచ్చుకున్న నాగమ్మ, చదువులతోపాటు సాముగరిడీలు, అశ్వశిక్షణ, అస్త్రశస్త్రాది విద్యల్లో అనుపమాన ప్రావీణ్యం సంపాదించుకుంది.


మరికొంతకాలానికి ఆమె మేనమామ జగ్గారెడ్డి, ఆయన కుటుంబం కూడా గతించింది. విధి బలీయమని తెలుసుకున్న నాగమ్మ తండ్రి రామిరెడ్డి, శివభక్తురాలైన నాగమ్మకు ఒక చిన్న శివాలయాన్ని నిర్మించాడు. ఆ ఆలయానికికెదురుగా శివపూజార్థం పూలతోటకు కొంత పొలాన్ని కేటాయించాడు. ఇందరి ఆప్తుల మరణాలతో విరాగినియైన నాగమ్మకు, తన తండ్రి చూపించిన మార్గం కొంత ఊరటకల్గించింది. పరమేశ్వరుడు ప్రసాదించిన భస్మరాశినే ఐశ్వర్యంగా స్వీకరించి, భక్తితోపాటు మేధస్సునుకూడా పెంచుకుంది.

మరికొంత కాలానికి పల్నాటిలో నీటికరువు ఏర్పడింది. పశుగణానికి నీటికోసం, రామిరెడ్డి పొలంలో చెరువును నిర్మించాలనే ప్రభుత్వ ప్రయత్నాన్ని ప్రతిఘటించిన రామిరెడ్డిని; ఎవరికీ తెలియకుండా, రాత్రికి రాత్రే పొందుగుల అడవులకు తీసుకెళ్ళి ఉరితీయించాడు బ్రహ్మనాయుడు. తండ్రి మరణంతో రెండు కుటుంబాల ఆస్తులనూ నాగమ్మే చూసుకోవలసిన పరిస్థితి యేర్పడింది. దానితోపాటు, తన తండ్రిని తెగటార్చిన బ్రహ్మనపై శత్రుభావం అంకురించింది. అందువల్ల ఈశ్వర భక్తితోపాటు, లౌకిక వ్యవహారాల్లోకూడా పాలు పంచుకొనవలసి వచ్చింది.

ఒకనాడు, పల్నాటి ప్రభువు అనుగురాజు, మంత్రి దొడ్డనాయనితో సహా, సపరివారంగా పొందుగుల అడవులకు వేటకు వెళ్ళాడు. అది గురిజాలనుండి జిట్టగామాలపాడుమీదుగా వెళ్ళే మార్గం. ఆవిషయం


నాగమ్మకు తెలిసింది. రాజుగారు రాజధానికి తిరిగివచ్చే సమయంలో ప్రసన్నుని చేసుకోవాలని సంకల్పించింది. వెంటనే దారిపొడవునా చలువపందిళ్ళు వేయించింది. రకరకాల పిండివంటలతో భోజనాలు తయారు చేయించింది. వేటకు వెళ్ళిన అనుగురాజు, అలసిపోయి తిరుగు ప్రయాణమయ్యాడు. జిట్ట గామాలపాడు చేరేసమయానికి, నాగమ్మ ఎదురేగి స్వాగతం పలికింది. తాను యిచ్చే ఆతిధ్యాన్ని స్వీకరించమని ప్రార్ధేయపూర్వకంగా సమస్కరించింది. అనుగురాజు నాగమ్మ కోర్కెను మన్నించాడు. అందుకు సంతసించిన నాగమ్మ, అనుగురాజుకూ, ఆయన పరివారానికీ షడ్రసోపేతమైన భోజనాలు పెట్టించింది. విందుఅనంతరం, నాగమ్మ ఇచ్చిన ఆతిధ్యానికి సంతసించిన అనుగురాజు, అందుకు ప్రతిఫలంగా నాగమ్మను ఏదైనా వరం కోరుకోమన్నాడు. అప్పుడు నాగమ్మ చేతులుజోడించి, "మహారాజా! మీ దయవల్ల నాకు ఏకొరతాలేదు; అయినా మీరు కోరుకోమన్నారు కాబట్టి, ప్రభువుల మాటను తిరస్కరించటం భావ్యంకాదు. కనుక నా ఉద్దేశం వివరిస్తాను. పల్నాటి ప్రభువులచెంత ఏడుఘడియలకాలం మంత్రిత్వం నెరపాలని వుంది. తగినసమయంలో ఈకోర్కెను తీర్చమని అడుగుతాను. మీకు అభ్యంతరం లేకపోతే ఈ చిన్న కోర్కెను తీర్చండి." అని అడిగింది. అలాగే అన్నాడు అనుగురాజు. ఆవిధంగానే నాగమ్మకు యిష్టం వచ్చినప్పుడు, ఏడు ఘడియలకాలం మంత్రిత్వం చేసేవిధంగా పత్రం వ్రాసియిచ్చాడు. ఆతర్వాత ప్రయాణమై గురిజాల చేరాడు.

అది మొదలు నాగమ్మ గురిజాల కొలువుకూటానికి వస్తూపోతూ వుండేది. అనుగురాజుకూడా ఆమెను సాదరంగా ఆహ్వానించేవాడు. అది గమనించి, కొలువులోని నాయకులుకూడా ఆమెను గౌరవిస్తూ ఉండేవారు. ఆసమయాల్లో రాజుగారి కొలువులోని లోటుపాట్లు, అంతఃపుర వివరాలు ఆకళింపు చేసుకుంది నాగమ్మ. బ్రహ్మనాయుడు మాత్రం ఆడది అనే అహంకారంతో, ఎడముఖం పెడముఖంగానే ఉండేవాడు. ఆ విధమైన బ్రహ్మనాయని నిర్లక్ష్యం, నాగమ్మకు మరో కోపకారణమైంది. దానితో పంతం పెరిగింది. అవకాశం కోసం ఎదురుచూసింది. అప్పటికి



నాయకురాలు

గుత్తికొండ బిలం, గుంటూరు జిల్లా.



పల్నాడు తాలూకా, చిట్టగామాలపాడులో
నాయకురాలు పూజించే శివాలయం.

బ్రహ్మనాయని తండ్రి దొడ్డనాయడే ప్రధానమంత్రి. దొడ్డనాయడు రాచకార్యాల్లో తప్ప, ఇలాంటి చిల్లర విషయాలేవీ పట్టించుకునేవాడు కాడు.

అనుగురాజుకు మొదట్లో పిల్లలులేని కారణంగా, మంత్రి దొడ్డనాయని పెద్ద కుమారుడైన బాదన్నను దత్తత తీసుకున్నాడు. ఆనాటి నుండే బాదన్న బాదమరాజుగా వ్యవహరింపబడ్డాడు. బ్రహ్మనాయడు దొడ్డనాయని రెండవ కుమారుడు. దత్తత కారణంగా ఏనాటికైనా పల్నాటి రాజ్యం, తన అన్న బాదమరాజు హస్తగత మౌతుందేమోనన్న తలంపు, బ్రహ్మనాయనకు కలిగింది. సమయం చూసుకుని, ఒకనాడు కొలువుకూటంలోనే, అనుగురాజుపై హత్యాప్రయత్నం చేశాడు. అందు కభ్యంతరం చెప్పిన, తన తండ్రినీ హతమార్చాడు. ఆ తర్వాత అనుగురాజు సంతానంలో పెద్దవాడైన నలగామరాజును గద్దెనెక్కించి తాను మంత్రిగా ప్రకటించుకున్నాడు.

అసలు బ్రహ్మనాయడాసమయంలోనే రాజుగా ప్రకటించుకొనేవాడు కాని, పల్నాటిలో ఆనాటి ప్రజాభీష్టం అందుకు వ్యతిరేకంగా వుంది. అప్పటికే ఉద్రిక్తత పెంచుకున్న పల్నాటి ప్రజ, ఒక్కసారిగా పేట్రేగి విప్లవమార్గాన్ననుసరిస్తే, అసలుకే మోసం జరుగవచ్చునన్న భయంతో, అప్పటికామంత్రిపదవితోనే సరిపెట్టుకుని, భావికాలంలో రాజ్యాన్ని హస్తగతం చేసుకోవడానికి బాటలు వేయసాగాడు.

అలా జరుగుతూ వస్తూవున్న విషయాలన్నీ తెలుసుకుంటున్న నాగమ్మ, ఒకనాడు నలగామరాజు కొలువులో ప్రవేశించింది. పూర్వం అనుగురాజు ఆమెకు వ్రాసియిచ్చిన శాసనపత్రాన్ని నలగామరాజుకు చూపించింది. తండ్రిఆనతి, తనకు శిరోధార్యమంటూ, ఏడు ఘడియల కాలం మంత్రాంగానికి అనుమతియిచ్చాడు నలగామరాజు. ఆడది ఏడు ఘడియలలో ఏం సాధించగలదనే నిర్లక్ష్యంతో, బ్రహ్మనాయడుకూడా అందుకు సమ్మతించాడు. సభాముఖంగానే, మంత్రి లాంఛనాలైన ధర్మదండమూ, అంగుళీయకమూ నాగమ్మపరంచేసి, సభనుండి వెళ్ళి

పోయ్యాడు. వెంటనే నాగమ్మ తానుచేయబోయేకార్యానికి రాజానుమతి గైకొంది. ముఖ్యమైన సైనికాధికారులనూ, మరికొంత సైన్యాన్నీ వెంటబెట్టుకువెళ్ళి, బ్రహ్మనాయుడి చెలికాండ్ర ఇండ్లలోనూ, ఆ ఇండ్లలోని నేలమాళిగల్లోనూ, గుప్తంగా దాచిన ధనాన్నంతా తెప్పించి రాజస్థానంలో రాశిపోయించింది. ఆ ధనరాశిని నలగామరాజుకు చూపిస్తూ ''ప్రభూ! నేను ఆదాయ వ్యయపట్టికలు చూశాను. ప్రభుత్వానికి ఏటా వచ్చే ఈ హెచ్చుధనం, బ్రహ్మనాయుడు తన చుట్టాలఇండ్లకు తరలిస్తున్నాడు. ఇది స్వామిద్రోహం, ప్రజాద్రోహంకూడా! కాకపోతే ఒకే ఉద్యోగంచేస్తూ ఒకే జీతం పుచ్చుకుంటున్న రాజోద్యోగుల్లో ఈవ్యత్యాసాలేమిటి? ఒకరు ధనవంతులైతే మరొకరు సామాన్యులెలాఔతారు? ఎక్కడినుండి వచ్చింది. వీరికిహెచ్చుధనం? ఇదెలా సంభవం?'' అన్నది. నలగామరాజు ఖిన్నుడయ్యాడు. తీవ్ర ఆలోచనానంతరం, నాగమ్మ చెప్పిన మాటలలో, కొంతైనా నిజం లేకపోలేదని గ్రహించాడు. అయినా, బ్రహ్మనాయుని తంత్రజ్ఞత యేమిటో నలగామరాజుకు అర్థంకాలేదు.

నలగాముని వంశానికీ, బ్రహ్మనాయనీ వంశానికీ తరతరాల అనుబంధముంది. పైగా అది బాంధవ్యంలాగానే పాతుకుపోయింది. బేతరాజు కాలంనుండి, నలగామరాజు కాలంవరకూ ఆ రెండుకుటుంబాల మధ్యనఉన్న స్నేహం, ఆప్యాయత అప్రతిమానమైంది. ఆనాడు బ్రహ్మనాయుడు అనుగురాజును నిండు సభలో హత్య చేసినతీరు ఒక ప్రహసనంగా మారి, రాచపుండుగా అభివర్ధింపబడింది. నిజం బైట పడితే ఎందరి నిండుప్రాణాలు, బ్రహ్మనాయుని చుట్టాలైన పన్నెండిండ్ల వారి శరఘాతాలకు బలియై పొయ్యాయో! అందుకే ఆ హత్య ఆనాడు పసిపిల్లలైన నలగామ రాజాదులకుకూడా తెలియకుండా పోయింది. కాల గమనంలో ఆ గాస్తా మాసిపోయి ఒడుదొడుకులు లేకుండా సాగిపోతూనేఉంది. బ్రహ్మనాయుడీనాటి వరకూ రాజకుటుంబానికి పితృతుల్యుడుగానే పరిగణింప బడుతున్నాడు.

బ్రహ్మనాయునిపై ఇంత వాత్సల్యం నిండుకున్న రాజ కుటుంబానికి, కేవలం నాగమ్మ, కొద్దిసేపు కొండెములు చెప్పినంత

మాత్రాన, వారి వారి కుటుంబాల మధ్యనఉన్న తరతరాల అనుబంధాన్ని ఏ ఆలోచనలేకుండా తెంచివేయగలడనేది, అర్థంలేని పిడవాదనే. అయినా నలగామరాజు తీవ్రంగా ఆలోచించి, "బ్రహ్మనాయడింత ధనరాశిని ఆయన బంధువులఇండ్లలో ఎందుకుదాచాడ"ని నాగమ్మను ప్రశ్నించాడు. అందుకు సమాధానంగా నాగమ్మ, "ప్రభూ! ఏనాటికైనా విద్యలదేవి కుమారులైన మలిదేవాదులకు ఈరాజ్యాన్ని అప్పజెప్పి, వారు పసిబాలురనే సాకుతో తానే రాజుగా వ్యవహరించి, చివరకు పల్నాటిని తానే సొంతం చేసుకోవాలనే కోరిక బ్రహ్మనగారికుంది. అందుకోసమే ఈధనార్జన" అని వివరించింది. ఈ విషయం విన్న నలగాముని కండ్లలో రక్త నాళాలు పొంగాయి. దాని పర్యవసానంగానే మలిదేవాదులు చెరసాలలో బంధింపబడ్డారు. ఈచర్యతో రాజద్రోహులంతా తలలు దించుకున్నారు.

నాగమ్మ తెచ్చిన ఈ అభియోగాన్ని అడ్డుకునే ధైర్యంచాలని బ్రహ్మనాయుడు, కన్నమదాసును పంపి, చెరసాలగోడకు కన్నమువేయించి, మలిదేవాదుల్ని బయటకు తెప్పించాడు. వెంటనే కన్నమ దాసుద్వారా తన అనుయాయులతో గురిజాలను దిగ్బంధం చేయించి, కోటపై ముట్టడి చేయించాడు. నలగామరాజుపై ఆవిధంగా ఒత్తిడితెచ్చి, భయపెట్టి, చివరకు పల్నాటిని రెండుగా విభజించి, విద్దెలదేవి కుమారులైన మలిదేవులకు మాచెర్లసీమను పంచాడు. మలిదేవులు పసి పిల్లలనే సాకుతోనే, బ్రహ్మనాయుడు పదిహేను సంవత్సరాలు మాచెర్లసీమను పాలించాడు. నాగమ్మ చెప్పిన విషయాలలోని నిజాన్ని తెలుసుకున్న నలగామరాజు, నాగమ్మను శాశ్వతమంత్రిణిగా నియమించాడు. నాగమ్మ నాయకురాలనే బిరుదు వహించి గురిజాలనేలు నలగామరాజుకు శాశ్వతమంత్రిణిగా కొనసాగింది.

# హైహయ రాజుల కాలంలో
# పల్నాట కులాలు, మతాలు, సాంఘిక జీవనాలు

ఆనాడు పల్నాటి ప్రజాసామాన్యంలో జైనమతం శైవమతం సమానస్థాయిల్లో ఉండేవి. వైష్ణవం చాలా తక్కువ. జైనులలో స్వర్ణకారులు, వృత్తికార్మికులు, గోసంగులు ఎక్కువ. ఇక శైవులలో వ్యవసాయదారులు, కొన్ని సంచారజాతులు, బ్రాహ్మణవర్గంలో కొంత భాగం వుండేది.

శైవుల విజృంభణకు తట్టుకోలేని జైనం, ఇతరత్రా ఆదరణలేని కారణంగా క్రమక్రమంగా క్షీణించటం మొదలైంది. అలా శైవుల మితిమీరిన విజృంభణకూ, వీరవిహారానికీ తట్టుకోలేకనే, జైనమతస్తుడైన కాకతి ప్రోలరాజంతటివాడు శైవమతాన్ని విధిగా స్వీకరించాడంటే, ఆ శైవమతధాటి ఎంత ఉద్ధృతమో ఊహించవచ్చు. ఆస్థితిలో ఉప్పెనలావస్తున్న శైవమతోద్యమానికి భీతిల్లి, సామాన్య జనులుకూడా శైవానికి తలవంచక తప్పలేదు.

అలా పెరిగిపోతున్న శైవమత వీరవిహారాన్ని చూసి, దానికిపోటీగా వైష్ణవమతంకూడా విజృభించింది. ఆ రెండుమతాల తాకిడికి తట్టుకోలేకనే, పల్నాటిలో జైనమతం పూర్తిగా క్షీణించిపోయింది. జైనులంతా వారివారి అనుకూలాన్నిబట్టి కొందరు శైవంలోనూ, మరికొందరు వైష్ణవం లోనూ చేరిపొయ్యారు.

వీరశైవులు జైనులపై మాత్రమే హింసాకాండ జరిపినట్లుంది. కాని, బ్రాహ్మణ మతస్తులమీద జరిపినట్లు కనిపించదు. అలాగే వైష్ణవులుకూడా, శైవులపై దాడిచేయక జైనులనే నిరసించటం జరిగింది. కనుక అటు శైవుల్లోనూ, ఇటు వైష్ణవుల్లోనూ విపరీతమైన స్వమతాభిమానమున్నా, పరస్పర మతద్వేషాన్ని పాటించేవారుకాదు. దాదాపు ఈరెండుమతాలకూ ప్రధానశత్రువు జైనమే.

జైనుల్లోవలె వీరశైవ వీరవైష్ణవ మతాల్లోకూడా కులాలుండేవి. కాని, కులభేదాలను ఈ మూడు మతాలవారూ నామమాత్రంగానైనా

పాటించేవారుకాదు. ఒక మతంనుండి మరోమతానికి; ఒక కులంనుండి మరోకులానికి మారటంకూడా జరిగేది. దాదాపు కులాలన్నీ వారి వారి వృత్తులనుబట్టి నిర్ణయించినవేకాని, ఈనాటివలె పుట్టుకనుబట్టి కులాలు నిర్ణయించటం ఆనాడు జరుగలేదు. ఆనాడు సమాజంలో అన్నికులాల వారికీ సమానగౌరవముండేది. వీరశైవులకు నాయినార్లూ, ఆరాధ్యులూ, దేవరలూ గురువులైతే; వీరవైష్ణవులకు ఆళ్వార్లు గురువులు. ఇదేపద్ధతి ఆనాడు పల్నాడులోగూడా ఆచరించటం జరిగింది. ఊరేగింపులు, ఉత్సవాలు; దైవప్రార్థనలు మొదలైనవన్నీ సమస్త జాతులూ కలిసి సమిష్టిగా జరుపుకునేవారు. సాంఘిక సాంస్కృతిక రంగాల్లో కూడా అన్ని కులాలకూ సమాన ప్రాతినిధ్యం ఉండేది. వృత్తులనుబట్టి కులాలు యేర్పడినా, అందరి ప్రధానవృత్తి పశుపోషణ. పేరుకుమాత్రమే కులాలు. కాని, పెత్తనమంతా వారివారి యోగ్యత, అర్హత ప్రతిభలనుబట్టి సాగుతుండేది. కాని, కొన్నికొన్ని సందర్భాల్లో బ్రాహ్మణులకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించబడేది. అగ్రవర్ణస్థులైన బ్రాహ్మణులకు, రాజుల అండదండలుండేవి. పలనాట ఆనాటి కులాచారం ఆవిధంగానే కొనసాగింది.

వృత్తినిబట్టి నిర్ణయించుకున్న కులాలేకాక, ఆనాడు పల్నాడులో మరికొన్ని కొత్తకులాలుకూడా ఆవిర్భవించాయి. దక్షిణాదిన శైవమత వ్యాప్తికోసం ప్రచారం చేస్తూ కులభేదాలను రూపుమాపటానికి పూనుకున్న జంగములు (లిరుగువారు) తామొక ప్రత్యేక కులంగా యేర్పడ్డారు. అలాగే వైష్ణవమత వ్యాప్తికోసం ప్రచారంచేస్తూ ద్రావిడదేశంనుండి వచ్చిన 'చాత్తాతవర్' (సాతాను)లు. తామొక ప్రత్యేక కులంగా యేర్పడి, కులభేదాలను రూపుమాప యత్నించారు. శైవంలో తంబళులు అనే శివబ్రాహ్మణుల కులం జనించినట్లు, వైష్ణవంలో ఈ సాతానులు (శ్రీ వైష్ణవులు లేక శిఖాయజ్ఞోపవీతంలేని విష్ణు భక్తులు) కూడా ఆరోజుల్లో ఒక కులంగా జనించినవారే.

పల్నాటిలో గురిజాలనేలు నలగామరాజుగానీ, మాచెర్ల ప్రభువు మలిదేవరాజుగానీ పేరుకు మాత్రమే రాజులు. కాని, పెత్తనమంతా

వారివారి ప్రధాన మంత్రులదే. అందుకే వారు సచివాయత్త సిద్ధులుగా వ్యవహరింపబడ్డారు. అయితే, ఈ ప్రధాన మంత్రులు కూడా బ్రాహ్మణుల ఆనతినీ, వినతినీ తిరస్కరించక పూజ్య భావంతో ఉండేవారు.

పల్నాట ఆ రోజుల్లో బహుభార్యాత్వం ఒక్కరాజవంశాల్లో తప్ప తక్కినవారిలో వున్నట్లు లేదు. దాదాపు అన్ని కులాల్లోనూ బాల్య వివాహాలే. సహగమనమానాడు రాజవంశాల్లోనూ, బ్రాహ్మణ వంశాల్లోనూ, ఉన్నట్లుంది. కాని, అదికూడా ఐచ్ఛికమే. రాజకీయ పోరాటాలు మిక్కుటం. ఆర్థిక సాంఘిక సాంస్కృతిక రంగాల్లో పురోగతిలేదు. కళలూ సాహిత్యమూ భాషాపోషణ విషయాల్లో పరిపాలకులకే శ్రద్ధలేదు. చెరువులూ కుంటలూ కొంత వరకు యేర్పడ్డాయి. నాగమ్మ గురిజాలలో దూవచెరువును నిర్మిస్తే; బ్రహ్మనాయడు తేరాలలోని మహాదేవి చెరువును బాగుచేయించాడు. ఇరు వర్గాల్లోనూ చిన్నచిన్న దేవాలయాల నిర్మాణాలు సాగి, వాటికి యినాములూ, మాన్యాలూ యివ్వబడ్డాయి. కాని, చాలా స్వల్పం. నాగమ్మ నాట్యకళను కొంతవరకు పోషించింది. బ్రహ్మనాయడు, మాలల్లో 'వీరవిద్యావంతులు' అనే ఒక శాఖను సృష్టించి, తనకు సంబంధించిన ఆనాటి పల్నాటి కథను గానం చెయ్యటానికి నిర్ణయించాడు.

ఆనాడు సర్వ ప్రజలకూ ముఖ్యమైన జీవనాధారం పశుసంపద. అడవులను నరికి, భూమిని సాగులోనికి తెచ్చి వ్యవసాయం సాగించటం, పండిన పంటలో నాలుగుపాళ్ళు ప్రభుత్వానికి పన్నుల రూపంలో యివ్వాలి. ప్రభుత్వ పొలంలోనూ, అడవుల్లోనూ, ఆడూ గడ్డిమేసినందుకు పుల్లరి చెల్లించాలి. ఇంకా ఆదాయపు పన్నులుండేవి. నేరం చేసిన వారికి జరిమానాలు శిక్షలు విధించబడేవి. వీటిని అమలుపర్చటంలో బ్రహ్మనాయడు మెతక వైఖరి అవలంభించినా, నాగమ్మ మాత్రం కఠినంగా అమలు జరిపింది. ప్రజల్లో రాజభక్తి ఎక్కువ. దానితోపాటు

సైనికతత్వం వీరావేశం. మిక్కుటం. క్షుద్రవిద్యలూ, జాతరలూ, జంతు బలులూ విపరీతం, మంత్రాలు, మాయలు మొదలైన అంధవిశ్వాసాలు ప్రజల్లో వెర్రితలలు వేశాయి. అభూత కల్పనలను అసక్తితో నమ్మేవారు. బ్రహ్మనాయుడు, తాను ఎవరికైనా నమస్కారం చేస్తే; వారు చస్తారని చెప్పినా, చచ్చిన వారిని బ్రతికించి, వారి అభీష్టాలమేరకు పరలోకాలకు సాగనంపినాడన్నా; ఆలోచన లేకుండా అందరూ నమ్మారు. అలాంటి మూఢ నమ్మకాలను ప్రజల్లో బాగా పాతుకుపొయ్యేలా చేసి, తననొక అవతార పురుషునిగా సొమ్ము చేసుకోవటానికి ఎన్నో గారడీలు చేసి చూపెట్టాడు బ్రహ్మనాయడు. అదంతా నిజమేనని ప్రజలు మూర్ఖంగా, గాఢంగా నమ్మారు.

# బ్రహ్మనాయుని కులం, గోసంగులతో అతని అనుబంధం

రామానుజ మతం స్వీకరించి, మాల మాదిగలను సైతం తమ తమ కులాలలో చేర్చుకుని బ్రహ్మనాయుడు మున్నగువారు వేరై పోయి వెలమ వారని ప్రసిద్ధి జెందిరి. అప్పటివరకూ కమ్మవారిలో నుండిరి. అని కొత్త భావయ్యచౌదరిగారు "కమ్మవారి చరిత్రము"లో పేర్కొన్నారు. (పుట 41) కాని, యిది సందేహాస్పదము. బ్రహ్మనాయుడు 12వ శతాబ్దపు తొలిదశనుండీ వున్నవాడు. 12వ శతాబ్దానికి పూర్వం, కమ్మరాష్ట్రము, కమ్మవాడుల పేర్లే శాసనాలలో కనిపించాయి. కాని, కమ్మకులంపేరు వాఙ్మయంలో కనిపించదని కొడాలి లక్ష్మీనారాయణగారు 'విస్మృతాంధ్ర నాయకులు' అన్న గ్రంథంలో పేర్కొన్నారు. దీనినిబట్టి బ్రహ్మనాయడు రామానుజమతం స్వీకరించకముందు, అతనికులం కమ్మకులం కాదని తేలుతుంది. అదేగ్రంథంలో మరోచోట, 12వ శతాబ్దానికి పూర్వం, అంటే బ్రహ్మనాయనికి పూర్వం కులాలు స్థిరపడకపోవటంచేత వారివారి నామాంతాల్లో నాయకశబ్దమైన నాయడు (నీడు) అని పిలువబడేవారంతా ఉత్తరప్రాంతవాసులైన 'మిశ్ర' జాతివారై యుండవచ్చునని ఆంధ్ర చరిత్రకారుడు చెప్పినట్లు పొందుపరచబడింది. ఇది కొంతవరకు నిజం కావచ్చు.

సంస్కృతంలోని 'నీ' అనుధాతువునుండి 'నాయ' శబ్దం ఉత్పన్నమైనదనీ, 'నాయ' అనగా నీతిగలవాడనీ, ఈ 'నాయ' అను శబ్దము నుండే 'వాయడు' 'నీడు' అనే దేశీయాలు యేర్పడి యుండవచ్చునని పండిత ఉమాకాన్త విద్యాశేఖరులవారి ప్రతిపాదన. దీనినిబట్టి నామాంతమున వాయడు, నీడు, అను శబ్దంగలవారంతా, మొదట ఉత్తర ప్రాంత వాసులై యుండి దక్షిణాదికి చేరారనేది స్పష్టం. దీనికితోడు బ్రహ్మనాయని పూర్వీకులంతా ఉత్తరదేశంనుండి దక్షిణాదికి వచ్చారని వల్నాటి చరిత్రకూడా చెపుతుంది. కనుక, నాయడు అను శబ్దం నామాంతమున నున్న బ్రహ్మనాయడు; ఆతని తండ్రీ అనుగురాజు మంత్రీ అయిన దొడ్డనాయడు, సైన్యాధిపతియైన తెప్పల నాయడు మొదలైన వారంతా పూర్వపు రోజుల్లో ఒకే కుదురులోని వారనుట నిజం. కనుక వీరంతా ఒకేజాతి అంటే మిశ్రాజాతి వారనటంలో సందేహం లేదు.

ఇప్పటికీ నామాంతమున 'మిశ్రా' అనుశబ్దం ఉన్నవారెందరో ఉత్తర భారతంలో ఉన్నారు. (ఉదా: చీఫ్ జస్టిస్ రంగనాథమిశ్రా) వీరంతా మొదట నాయకత్వం చేపట్టడంవల్ల సామర్థ్య చిహ్నంగా, నామాంతాన 'నాయుడు' అను పదం, దక్షిణాదికి వచ్చినతర్వాత పెట్టుకుని యుండవచ్చు.

ఇలాగే పూర్వం క్రీ. శ. 9-10 శతాబ్దాలలో ఉత్తరదేశంనుండి వచ్చారు, గోసంగులు. వీరు గొప్ప సంగీత విద్వాంసులు, నృత్య కళాకారులు, యుద్ధకళాప్రవీణులు. వీరి జైనమతం. వీరిలో సంగీతనృత్య కళాకారులైన తుండవ, ఆమె కుమారుడు మల్లవ, అతనికుమార్తె చల్లవ చాలా ప్రసిద్ధులు. ఈ తుండవకు తూర్పు చాళుక్య చక్రవర్తి ఒకటవ భీమ; ఆయన పట్టాభిషేక మహోత్సవ సందర్భంలో అత్తిలి జైనబసతికి తూర్పుగా ఎనబైయకరాల భూమినీ, ఒక నివేశస్థలాన్నీ దానంచేశాడు. అలాగే అత్తిలి జైనబసతికి మఠాధిపతియైన అర్హనందమునికి శిష్యురాలైన చామెకాంబ కంచుమర్రు అనే గ్రామాన్ని ఆజైనబసతికే దానంచేసింది. అంతేకాక కటకాధిపతి దుర్గరాజుచేకూడా మల్లెపూడి అనే గ్రామాన్ని దానం చేయించింది.[1] పల్నాటి యుద్ధసమయంలో తనకు సహాయంగా రమ్మంటూ వివిధ దేశాధిపతులకు నలగామరాజు వ్రాయించిన లేఖలలో ఉన్న కటకమేయిది. ఒకనాడు గజపతిరాజుల ముఖ్యపట్టణంగా యిది రూపుదిద్దుకుంది.

ఈ గోసంగులు కడప జిల్లా మాలేపాడులో స్థిరనివాసమేర్పరుచుకుని, చివరకక్కడ వారిమతమైన జైనానికి ఆదరణ లేకపోవటంతో ఎక్కువగా గోదావరి తీరప్రాంతాలకు వలస వెళ్ళారు. ఆ వలసల ప్రవాహంలో ఒక తెగ పల్నాడు చేరి జైనమతాన్నే ఆచరిస్తూ వుండేది. పల్నాడులోవున్న ఆ గోసంగులను బ్రహ్మనాయుడు చేరదీసి, వారికి వైష్ణవమిచ్చాడు. వారి పూర్వస్థావరమైన మాలేపాడు ఆధారంతో వైతేనేమి, తాను మాలిమి

1) చెన్నకేశవస్వామి-హరిజనార్చకులు - గంధం నాగేశ్వరరావు పుటలు 106-107

గొన్న కారణంగా నైతేనేమి, వారిని మాలలంటూ ఒకకులాన్ని నిర్ణయించి, తానుగూడా తనవారితో ఆకులంలోనే కలిసిపోయ్యాడు.

మళ్ళీ కొంత కాలానికి, కాకతి మొదటి ప్రతాపరుద్రుని కాలం (క్రీ. శ, 1 53-1158)లో ఈమాలలనుండికూడా విడిపోయి, తనకు సమీప బంధువులైన పన్నెండిండ్లవారిని కలుపుకుని, తనకుతానుగా 'పద్మనాయక వెలమలు' అనే ఒక కొత్తకులాన్ని సృష్టించుకున్నాడు, బ్రహ్మనాయుడు.

దీనినిబట్టి తనతోపాటు తెచ్చుకున్న పన్నెండిండ్ల 'పద్మనాయక వెలమ'కులానికి బ్రహ్మనాయుడే ప్రారంభోత్సవకర్త. అంతేకాక, ఆంధ్రదేశంలోని వెలమ కులజులందరికీ మూలపురుషులు ఈ పద్మనాయక వెలమలే. [1]

మెకంజీదొరగారు సేకరించిన లిఖిత గ్రంధాలను విమర్శించిన విల్సన్ ఈ పల్నాటి చరిత్రను గురించి వ్రాస్తూ

Account of Seven years war from 1080 A. D. to 1087, wh ch was carr ed on by Brahmanayudu and Twe ve other Land ho ders and graz ers aga nst Two Towns Guraza a and Macher a n Pa nad Country and w ı ch Or g nated n a d spute at a cock f ght (బ్రహ్మనాయుడు మరి పన్నెండుమంది భూస్వాములు, మరియు పశువుల మేపరులు కలిసి పల్నాటిలోని మాచెర్ల, గురిజాల అనే రెండు పట్టణాల మీద యుద్ధం చేశారు. కోడిపందెంలో సంభవించిన కలహమే ఈ యుద్ధానికి కారణం) అని వివరించారు. [2]

---

1) ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర - ఏటుకూరు బలరామమూర్తి - పుటలు 114-14

2) పల్నాటి వీరచరిత్ర - ప్రథమభూమిక - పండిత ఉమాకాన్త విద్యాశేఖరులు పుట 2

మాలల నుండి విడిపోయి ప్రత్యేకంగా ఒక కొత్తకులాన్ని ఏర్పరుచుకున్న ఈ పన్నెండుమంది భూస్వాములే బ్రహ్మనాయని పన్నెండిండ్ల పద్మనాయకులు. వారి భృత్యులైన వీరనాయకులు, పోటుమన్నీలు మొదలైనవారే పశువుల కాపరులు. కానీ, విల్సన్‌గారు చెప్పినట్లు పల్నాటి యుద్ధం క్రీ. శ, 1080-1087 మధ్యకాక; (ప్రాచీన భారత చరిత్ర) Early History of India వ్రాసిన స్మిత్‌గారి అభిప్రాయం ప్రకారం క్రీ. శ. 1181 లోనే జరిగియుండవచ్చు.[3] ఇదే నిజమని నిరూపించారు పండిత ఉమాకాన్త విద్యాశేఖరులు.

పూర్వమలా మాలల నుండి విడిపోయిన బ్రహ్మనాయడు, తనకు పెమ్మసానివల్ల కలిగిన కన్నమనీడును మాత్రం వేరుచేసి ఆధిపత్య పటుత్వంకోసమంటూ ఆమాలల్లోనే వుంచాడు. కాని, పూర్వమతడుకూడా 'మిశ్రా' జాతివాడే. కాని, గోసంగికాదు. కాలగమనంలో కలిమిలేములను పురస్కరించుకుని, అధికార అనధికార వ్యత్యాసాలతోనో, రాజాస్థానంలోని ఆధిపత్య తారతమ్యంవల్లనో, అధికారం అంతరించి అనాధలగుటవల్లనో భేదభావం ఉత్పన్నమై చివరకు కులాలు ఏర్పడే సమయానికి, అంటే బ్రహ్మనాయని కాలానికి స్థాయీభేదం పొడసూపి, హెచ్చు తగ్గులు పరిగణింపబడి, పూర్వపు మిశ్రాజాతి అంతా దక్షిణదేశంలో మాలలుగా బ్రహ్మనాయనితోసహా ఉండి, అందులో ఒక తెగను పద్మనాయక వెలమలు అనే పేరుతో వేరుపడి, ఉన్నతస్థానమాక్రమించి, మరోతెగను మాలలుగనే ఉంచి క్రిందిస్థాయికి చేర్చటం ఆనాడు బ్రహ్మనాయడి మూలంగానే జరిగింది. ఈవిధంగా ఆనాడు కొందరికి సంక్రమించిన దుర్గతి.

నిజానికి పల్నాటి చరిత్రలో మొదట సైన్యాధిపతిగానున్న తెప్పలనాయుడు, బ్రహ్మనాయనితోపాటు మిశ్రాజాతివాడేకదా! అతడు సజీవంగా ఉన్నంతకాలంలోనే వ్యత్యాసం, ఆతని మరణానంతరం ఆతని

---

3) పల్నాటి వీరచరిత్ర - ప్రథమభూమిక - పండిత ఉమాకాన్త విద్యాశేఖరులు పుట 37

కుమారుడైన కన్నమనీడుకు సైన్యాధిపత్యమిచ్చినా; గోసంగి కన్నమ అనీ, మాల కన్నమ అనీ పల్నాటి చరిత్రలో సంబోధించటం జరిగింది. దీనికి కారణం, ఆ సంసారగమనంలో మధ్య కొంత కుంటుపడి అధికారం అస్తవ్యస్తమగుటవల్ల, కులాలు యేర్పడే సమయానికి మాల కన్నమ అయ్యాడు. ఆమాలల్లో నుండి చీలిన బ్రహ్మనాయుడు అధిపత్యం చెలాయించి పద్మనాయక వెలమ అయ్యాడు. ఇదీ బ్రహ్మనాయని కులనిర్వాహకం!

అలా పద్మనాయక వెలమలుగా మారినవారికి మరికొన్ని యితర కులాలకు గోత్రనామాదులను క్రీ. శ. 1171 ఖరనామ సంవత్సర ఫాల్గుణ బహుళ పాడ్యమి సోమవారమున కాకతి మొదటి ప్రతాపరుద్రుడే స్థిరపరచినట్లు పద్మనాయక చరిత్రలోని ఈక్రింది పద్యాలవల్ల తెలుస్తుంది. మాచెర్లసీమకు మలిదేవరాజును పట్టాభిషిక్తునిచేసిన తొలిరోజులవి.

గీ॥ నరదళ విభాలుడా పద్మనాయకులకు
కొలది గోత్రాది బిరుదముల్ కుదురువరచి
కవిత వర్ణ క్రమాచార గతులు దెలియ
పలికె నిపుణత సంధాన కలితమతిని.

గీ॥ కులము వెయ్యేండ్లదనుకను కుదురుపరచి
యునిచి నియమించి పలికెను ఘనతజెలగి
లక్షణవిధుండు శుభచిహ్న లక్షణుండు
చండ శౌర్యుండు రుద్ర భూమండలుండు.

ఇలా వెలమలుగా మారిన బ్రహ్మనాదులు కూర్మఋషి సంతతి వారగుటచే వీరిని మొదట కూర్మివంశీయులుగా పరిగణించారు. వీరికి బేతాళనాయుడు (కథకుల కథనం బేతినాయుడు) మూలపురుషుడు. ఇతను బహుభార్యాసమేతుడు. తన వంశవాచకాన్ని వదలి, రాచరికాన్ని సూచించే విధంగా రేచెర్ల బేతిరెడ్డియని పేరుపెట్టుకున్నాడు. ఆ తర్వాత

మొదటి ప్రతాపరుద్రునికి భృత్యుడై జేతాళ నాయదయ్యాడు.[1] ఈ రేచెర్ల అనుపదం గ్రామనామమై యుండవచ్చునని పండిత ఉమాకాన్త విద్యాశేఖరులవారు, పల్నాటి వీరచరిత్ర ప్రథమభూమికలో సూచించారు. (పుట 43) ఈపై విషయాలను పురస్కరించుకుని; రేచెర్ల గ్రామాన్ని రేచెర్ల గోత్రంగా, బేతిరెడ్డి పేరులోని 'రెడ్డి' అనుపదం ఆధారంగా, రెడ్డి భూమికులమనీ, కూర్మఋషి సంతతివారగుటచే, కూర్మయ్య గురువనీ, చెన్నుని భక్తులగుటచే చెన్నయ్య దైవమనీ నిలిపి, ఈనాల్గింటినీ కలిపి గోత్రనామాదులుగా, మొదటి ప్రతాపరుద్రుడు బ్రహ్మనాయనకు స్థిర పరచటం జరిగింది. ఈ నాలుగుసూత్రాలనే రేచెర్ల గోత్రంలోని మాలలకుకూడా సంక్రమింపజేశాడు, బ్రహ్మనాయడు. ఈపద్ధతి ఈనాటికీ కొనసాగుతూవుంది.

మహబూబ్ నగర్‌నుండి వనపర్తికి వెళ్ళేమార్గంలో, మహబూబ్ నగర్‌కు 30 కిలోమీటర్ల దూరంలో ఒక గుట్టమీద కూర్మయ్య (కూర్మ మూర్తి) గుడివుంది. ఈ కూర్మమూర్తికి ప్రతిసంవత్సరం కార్తీక పౌర్ణమిరోజు తిరుణాళ్ళ (జాతర) జరుపుతారు. యాత్రికులంతా, పసి పాపలు మొదలు పండు ముదుసలులదాకా, ఎవరికివారు మెడలో పూల మాల వేసుకుని యాత్రకు వెళ్ళాలి. పౌర్ణమిరోజు "దాసంగం" అనే పేరుతో ఆ యాత్రాస్థలంలోనే నైవేద్యం వండి, దానిని ముందుగా మాలలకు పెట్టి, వారి ఆశీర్వాదం పొందాలి. మాల ధరించటం, మాలలకు నైవేద్యం పెట్టటం, ఆ జాతరలో విధిగా పాటించినవారికే ముక్తి లభిస్తుందని గట్టినమ్మకం. అక్కడికి వెళ్ళే మాలల్లో చాలామంది మాలివీణె (కిన్నెర) మీటుతూ, కూర్మయ్యను గానంచేస్తూ వుంటారు.

అలాగే మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లకు సమీపంలోనున్న గంగాపురంలో, మాఘ శుద్ధ పాడ్యమినాడు మొదలయ్యే చెన్నకేశవస్వామి

---

1) గుంటూరు మండల సర్వస్వం–ద్వితీయ ముద్రణ–
పుటలు 185–187–188–191

తిరునాళ్ళ సందర్భంలోనూ, అదే గ్రామంలోవున్న కూర్మయ్య పండుగ రోజుకూడా ఇదే ఆచారాన్ని పాటిస్తారు.

మాలవారిలో దాసులు అనే ఒక శాఖకూడా వుంది, ఈదాసులు అర్చకులుగా, కులగురువులుగానేకాక, కొందరు సాహిత్య సంగీత నృత్య కళల్లో ఉపాసకులుగా వ్యవహరిస్తారు. అసలు ఆంధ్రలో వీధినాటకాలకు ఈమాలదాసులే ఆద్యులని చెప్పేవారుకూడా లేకపోలేదు. ఏది ఏమైనా, ఈమాలదాసులు ప్రదర్శించిన వీధినాటకాలు రసభరితాలై చాలా కాలాలపాటు ప్రజారంజకంగా వెలుగొందాయనటంలో సందేహంలేదు. పల్నాటిలో మాచవరం దాసులు వీధినాటక కళల్లో నిష్ణాతులు.

దాసరయ్య అంటే తాబేలు (కూర్మము) అని అర్ధమేకాక, జ్ఞాని యనీ, దానపాత్రుడు అనే అర్థాలుకూడా వున్నాయి. పై విషయాలను పరిశీలించి చూస్తే, మాలలు కూర్మివంశీయులనటం నిజమేనని తేలుతుంది.

పూర్వం పల్నాడు రాజ్యం, చందవోలు గొంకరాజుల స్వాధీనమైన రోజుల్లో, పల్నాటిరాజులు కందూరుచోడుల ఆశ్రయంలో వున్నారు. ఆరోజుల్లోనే కూర్మఋషి వంశీయులైన బ్రహ్మనాయని పూర్వీకులు, ఈకూర్మమూర్తి విగ్రహాలను నెలకొల్పియుండవచ్చు. అందువల్లనే ఒక్క పాలమూరు (మహబూబ్‌నగర్) ప్రాంతాల్లోతప్ప, మరెక్కడా ఈకూర్మమూర్తి విగ్రహాలు కనిపించవు. పల్నాటిరాజులు తిరిగిపల్నాడును స్వాధీనం చేసుకున్నతర్వాత బ్రహ్మనాయుడు తననుండి వేరుచేసిన మాలలకు ఈకూర్మమూర్తుల్ని ప్రసాదించి యుండవచ్చు. అప్పటి నుండే ఈకూర్మమూర్తుల జాతర్లలోనూ. గంగాపురం చెన్నకేశవ ఆలయ తిరునాళ్ళలోనూ ఈవిధానం నిర్ణయింపబడి ఈనాటికీ కొనసాగుతూ వుండవచ్చు. ఇంతేగాక, గంగాపురం చెన్నకేశవ ఆలయద్వారానికి ఎడమవైపు ఒక గవాక్షం అమర్చబడివుంది. ఇది కేవలం మాలలు, స్వామిని దర్శించటానికి పూర్వమెప్పటినుంచో ఉన్నదని చెపుతారు.

ఇదంతా విషయపరిశీలనచేస్తే రేచెర్ల గోత్రంలోని వెలమలకూ, మాలలకూ ఉన్న సన్నిహిత సంబంధాల్ని గట్టిగా రుజువుపరుస్తున్నాయి.

ఈ సన్నిహితసంబంధమే రేచెర్ల గోత్రంలోని వెలమవారి పెండ్లిండ్లలో, అదేగోత్రమున్న మాలవారిని చేరదీసి, వారి ఆశీర్వాదం పొందటం ఒక ఆచారంగా ఈనాటికీ చాలా ప్రాంతాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తూవుంది.

తనకు 1వ ప్రతాపరుద్రునిద్వారా సంక్రమించిన రేచెర్ల గోత్రం, రెడ్డిభూమికులం. కూర్మయ్య గురువు. చెన్నయ్య దైవం అనే పరుసక్రమాన్ని మాలలకు యివ్వటమేకాక; రాజ్యాంగంలో ఉన్నత పదవుల్లో కొందరినీ, వైష్ణవార్చకులుగా మరికొందరినీ, తన గొప్పను తెలియపరుస్తూ గానంచెయ్యటానికి వీరవిద్యావంతులనే పేరుతో కొందరినీ నియమించి జీవనభృతి కల్పించాడు బ్రహ్మనాయుడు. పల్నాటి యుద్ధానంతరం మళ్ళీ జీవనభృతికరువైన ఈమాలలు రకరకాలుగా వలసపోయి, వారున్న ప్రాంతాల్లో చెన్నకేశవాలయాలు నిర్మించుకుని వైష్ణవార్చకులుగా యీ నాటికీ కొనసాగుతూ వున్నారు. అట్టి వారిలో భీమవరం (పశ్చిమ గోదావరిజిల్లా) దగ్గరున్న ఉప్పులూరు గ్రామం చేరినవారు; తమ పూర్వాశ్రయమైన మహబూబ్‌నగర్ జిల్లా, మాధవానిపల్లె, రాయలగండి చేరినవారు; కడపజిల్లా ప్రొద్దుటూరు సమీపంలోని మాలేపాడు చేరినవారు ముఖ్యులు.

అలా బ్రహ్మనాయుడిచ్చిన గోత్ర నామాదుల్లోని కూర్మయ్యను గురించి క్లుప్తంగా తెలిపే పాటను, పాలమూరు జిల్లా, అచ్చంపేట తాలూక, సిద్దాపురం వాస్తవ్యుడు గువ్వల మల్లయ్య పాడిన పాటవింటే; కొంత వరకు బ్రహ్మనాయుని వలస జీవితం కూడా అవగాహం కాకపోదు. ఆ పాటయిది.

కూర్మయ్య సెన్నయ్య వారన్న దమ్ములూ
ఆదిలో జన్మెత్తి నారయ్యా
బెమ్మయ్య జెప్పినా ఈ తెరుగు జేస్తేను
దోసమే మనకంట రాదయ్యా.... ॥కూర్మ॥

మనుబోతు శర్మంబు మోగెనే నాగార (నగారా)
మోగెనే కూర్మయ్య తిరనాలకూ
కూర్మయ్య గుడిమీద దీపరాజన జేస్తె
ఆకాశమే ఎలుగొంది వాదయ్యా
కలిసి మెలిసిపోయి కార్యాలు సేయిస్తె
అంటు పొంటూ మాయమైనాదయా.... ॥కూర్మ॥

గురుగుల్లో నేతులూ గుమ్మడీ కాయలూ
తెచ్చిరే కూర్మయ్య తిరనాలకూ
పడమటి మందంత పత్తిపూవర్నాలు
వొచ్చిరే కూర్మయ్య నీ సేవకూ
ఉత్తరం మందంత ఉల్లిపూవర్నాలు
వొచ్చిరే కూర్మయ్య నీ సేవకూ
తూరుపూ మందంత తుమ్మపూవర్నాలు
వొచ్చిరే కూర్మయ్య నీ సేవకూ
దచ్చినం మందంత దంతిపూవర్నాలు
వొచ్చిరే కూర్మయ్య నీ సేవకూ.... ॥కూర్మ॥

కూర్మయ్య జాతరే ఆర్నెల్లుండంగ
కోడెనే పులిబట్టి నాదయ్యా
పెందోట గుడికాడ పెద్దపులి లేవంగ
బెమ్మయ్య బరిగీసి నాదయ్యా
వరవీర కొంతాన్ని గురిబెట్టి ఏయంగ
కరమొండెమై కూలి నాదయ్యా
గుండు గుమ్మడికాయ బండగల పట్టుక
బండపై బౌజేరి నారయ్యా.... ॥కూర్మ॥

నల్లగుర్రాన్నెక్కినాడు కూర్మయ్య
నమిలి కల్లెంబట్టినాడు కూర్మయ్య
యఱ్ఱగుర్రాన్నెక్కినాడు కూర్మయ్య
యేదు కల్లెంబట్టినాడు కూర్మయ్య
పచ్చగుర్రాన్నెక్కినాడు కూర్మయ్య
పమిడి కల్లెంబట్టినాడు కూర్మయ్య
యల్లగుర్రాన్నెక్కినాడు కూర్మయ్య
యెండి కల్లెంబట్టినాడు కూర్మయ్య ॥కూర్మ॥

పై పాటలో నరవీరకొంతము అనే ఆయుధముంది. ఇది బ్రహ్మనాయని ఆయుధమైన "నృ సిం హ కుం త ం" అనటంలో సందేహంలేదు. కథకులుకూడా 'నరవీరకొణతము' అని అంటారు. ఈపాటను వారువేసే కోలాటం సందర్భంలో ఉసెత్తుకు పాడేవారని చెప్పాడు.

ఈపాట రేచెర్ల గోత్రంలోని మాలలకు, వెలమలకు ఉన్న దగ్గర సంబంధాన్ని, ఆతర్వాత వారి గురువులూ దైవాలూ అయిన కూర్మయ్య చెన్నయ్యలకుగల బాంధవ్యాన్నికాక, బ్రహ్మనాయుడు వలస ప్రారంభించిన మొదటిరోజులలో; పెందోటలో, చెన్నకేశవస్వామి భూషణాలుమోసే కంట్లపుకోడెను పట్టిన పెద్దపులి మరణవృత్తాంతాన్ని; ఆతర్వాత ఏలేశ్వరం రేవులో కృష్ణానదిని దాటుతుండగా, బ్రహ్మన్నను పట్టిన కారుమొసల్ని అలరాజు చంపగా, బ్రహ్మన్న నీటినుండి బయటకి వచ్చి ఆ సమీపంలోని ఒక పెద్ద రాతిగుండుపై చేరి, తడిసిన తల వెంట్రుకల్ని విదిలించుకుని ఆర్పుకున్న విషయాన్నికూడా లీలగా గుర్తుచేస్తుంది.

ఏలేశ్వరం రేవుకు పల్నాటివైపు కృష్ణాతీరాన వున్న ఈబండను 'బ్రహ్మనాయుడిగుండు' అని పిలిచేవారు. ఈబండను నేను 1964వ సంవత్సరంలో చూశాను. ఇది గుమ్మడిపండు ఆకారంలోనూ, రంగులోనూ వుండి; ఒకవైపు ఒకపెద్ద వైష్ణవనామం (నిలువుబొట్టు) మలచినట్లుగా కనిపించేది. నాగార్జునసాగర్ నిర్మాణంతో ఆప్రాంతమంతా జలాశయంగా

మారటంచేత ఆబండ అందులో మునిగిపోయింది. పాటలోని 'గుండు గుమ్మడికాయ బండ' అంటే యిదేకావచ్చు. దీనినే 'గర్దగుండు' అనికూడా పిలిచేవారు.

ఇలా పల్నాటి చరిత్రపై ఇంత నిగూడార్థాన్ని వివరించే ఎన్ని పాటలు జానపదుల గానవాహినులనుండి జాలువారి, అమృతం చిందించి, చివరకు కాలప్రవాహంలో కొట్టుకుపొయ్యాయో ఊహాతీతం!

పై విషయాలను బ్రహ్మనాయుడు పురస్కరించుకొని తనమూలంగా రేచెర్ల గోత్రనామాదులు సంక్రమించినమాలలకు అగ్రతాంబూలమిస్తూ వివాహాది శుభకార్యాల్లో, ఇదే గోత్రనామాదులున్న పద్మనాయక వెలమలను అదే గోత్రమున్న మాలలకు, ముందుగా పెండ్లిజరిపి, ఆ తలంబ్రాలతోనూ వారి కట్టుగుడ్డలతోనూ వివాహాలు జరుపుకోవాలని శాసించాడు. ఈతంతు రేచెర్ల గోత్రమున్న పద్మనాయక వెలమల పెండ్లిండ్లలో చాలా పద్ధతితో జరుగుతుంది. ఈతంతును ఇక్కడ పొందుపరచటం అంత ముఖ్యం కాదేమో. అయినా యిప్పటికీ ఈఆచారాన్ని వెంకటగిరి అద్దంకి ప్రాంతంవారు మహబూబ్ నగర్ జిల్లా గుడ్లనరవ ప్రాంతంవారు ఇంకా అక్కడక్కడా పాటిస్తూనే ఉన్నారు. [1] కాని, రేచెర్ల గోత్రజులైన వెలుగోటి వెలమ వెంకటగిరి సంస్థాన వంశ చరిత్రమునందు వారి వంశ కథనం చేవిరెడ్డి వద్దనుండి వచ్చిందని చెప్పబడింది.

చేవిరెడ్డియు మరొక మాలయు పొలముదున్నుచుండగా ధనము దొరికినదనియు, ఆ ధనమునకు ఆమాలకులజుని బలియిచ్చి, వాని యభీష్టము మేరకు చేవిరెడ్డి తనగోత్రనామాన్ని రేచెర్లగా మార్చెననియు

---

1) కొండూరి కాశమ్మ - గోపాలపురం - పామూరు - కనిగిరి తాలూకా ప్రకాశం జిల్లా, సురభి

(అల్లం) కొండలరావు-గుండ్లనరవ-బిజినేపల్లి మండలం- మహబూబ్ నగర్ జిల్లా,

మరియు మాదినేని రాధాకృష్ణమూర్తి-మాచెర్ల-గార్లతో ముఖాముఖి.

ఆ చరిత్రలో వ్రాయబడివుంది. ఈ చేవిరెడ్డి కాకతీయ గణపతిదేవుని కాలములోని వాడైనట్లు ఆ సంస్థానచరిత్రలో తెలియగలదు. గణపతి దేవుడు క్రీ. శ. 13వ శతాబ్దియందు ఉండినవాడు. కనుక వెంకటగిరి సంస్థానాధిపతులు 13వ శతాబ్దమునుండియే రేచెర్ల గోత్రంవారైనారని తెలుతుంది. కాని, వెలమయు రేచెర్ల గోత్రజుడైన బ్రహ్మనాయుడు, 13వ శతాబ్దానికి పూర్వమే యుండుటచేత పైని చెప్పబడిన చేవిరెడ్డి కథయొక్క యదార్థమును సంశయింపవలసియున్నది. కనుక, వెలుగోటి వారి రేచెర్ల గోత్రనామము చేవిరెడ్డివద్ద నుండికాక అంతకుముందే వున్నదని నమ్మవలెను. [2] దీనినిబట్టి పద్మనాయక చరిత్రములోని కథాంశమే నిజమనియు, ఈరేచెర్లగోత్రం 13వ శతాబ్దినుండికాక 12వ శతాబ్దిలోనే బ్రహ్మనాయనిద్వారా సంక్రమించిందని చెప్పక తప్పదు.

ఇక బ్రహ్మనాయడికి యింటిపేర్లుగా 'శీలం' 'బాదం' అని రెండు విధాలుగా పల్నాటి చరిత్రలో వ్రాయబడివుంది. ఇవి, తన తల్లి శీలమ్మ పేరుమీదుగా ఒకటి; తన అన్న బాదమరాజు పేరుమీదుగా మరొకటి, వారిని తృప్తి పరచటానికి ఇంటిపేర్లుగా నిర్ణయించినవే కాని వేరుకాదు. అలాగే మాలల్లో వీరవిద్యావంతులు అని విభజించటం కూడా అనుగురాజు పట్టపురాణియైన వీరవిద్యాదేవి బ్రహ్మనాయనను మొదట బలపరిచింది కనుక, ఆమె సంతృప్తికోసం వారికాపేరు నిర్ణయించినదే కాని, బ్రహ్మనాయనకు, కన్నమదాసుకు, ఆనాడు గృహవామాలు స్థిరపరచలేదు.

ఈవిధంగా వల్నాడులో అనాడున్న కొన్ని కులాలతోపాటు మరి కొన్ని కొత్తకులాలుకూడా పుట్టినాయనేది సత్యం. కాని, కుల వ్యవస్థ మాత్రం ఈనాడున్నంత కఠినంగా అనాడుండేది కాదు. అందరూ ఏక కుటుంబంగానే జీవించేవారు. ఒక మతంనుండి మరోమతానికి మారినట్లు; ఒక కులం నుండి మరోకులానికి మారినా, వ్యత్యాసం అంతగా వుండేది కాదు.

---

2) వల్నాటి వీరచరిత్ర-ప్రథమభూమిక-పండిత ఉమాకాన్త విద్యాశేఖరులు పుటలు 42-43

భాస్కరాచార్య విరచితమైన కన్యకా పురాణము (వైశ్యపురాణము) లోని ఈ పద్యాన్నిబట్టి 'రాజమహేంద్రవరము" పాలించిన మూడవ విష్ణువర్ధన మహారాజుయొక్క దాడికి భయపడి 612 గోత్రాల వైశ్యులు పారిపొయ్యారనీ, అందు 200 గోత్రాలవారు కమ్మవారిలోనూ, 300 గోత్రాలవారు గొల్లవారిలోనూ, తక్కినవారు తూర్పు ఉత్తర దిశలకు పారిపోయి ఆయాకులాలలో చేరినట్లు తెలుస్తుంది.

సీ॥ కమ్మట వారని కమ్మవారనుచేరి
రిన్నూరు గోత్రాల హీనమతులు
గోల గొల్లలమంచు గోపులై మున్నూరు
గోత్రాల వారేగిరాత్రపడుచు
బడమటికేగిరి భగ్నమై దుష్టత
దూరి పారుటచేసి తూర్పులనగ
దూరుపునాటికి దుర్మార్గులైయేగి
రెనుబదిగోత్రాల హీనమతులు
గీ దక్షిణంబున చెడసెను ధరణియనుచు,
నోడి వొదివోట ముప్పదిమూడుగోత్ర
ముల దురాత్ములుత్తరమున కెలమితోడ
పాత్రణభయమున నంతంత బరుపులిడుచు (8 ఆశ్వా. 22)[1]

వైశ్యులకు పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ కేంద్రం, 714 గోత్రాల వైశ్యులున్నట్లు వైశ్యపురాణం తెలియజేస్తుంది.[2] దీనినిబట్టి ఆనాడు కులాలలో ఈనాడున్నంత వ్యత్యాసం లేకపోవుటవల్లనే ఈచేర్పులు, మార్పులు జరిగాయనటంలో సందేహంలేదు.

---

1) గుంటూరు మండల సర్వస్వము. ద్వితీయముద్రణ
సంపాదకులు దరువూరి వీరయ్య పుట 193

2) ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర–ఏటుకూరు బలరామమూర్తి పుట 91

రానురాను సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలు మిక్కుటమయ్యాయి. అర్ధబలం, అంగబలం కలవారికి రాజాదరణ లభించింది. దానితోపాటు, మేధావి వర్గపు మెప్పుకుకూడా పాత్రులయ్యారు. తక్కిన తెగలవారిని తమకన్న తక్కువ జాతులుగా పరిగణించారు. ఈవిధానమే కులాల హెచ్చుతగ్గులకు మూలమై సమాజాన్ని క్లిష్టపరిచింది. ఇది బాధాకరమైన విషయం.

# నాగమ్మ శివభక్తి, మతసహనానురక్తి

నాగమ్మ శైవమతావలంబిని, బ్రహ్మనాయుడు వైష్ణవమతస్థుడు. పల్నాటి చరిత్రలో వీరిద్దరూ పరస్పర రాజకీయ ప్రత్యర్థులు. అయినా వారివారి మతాలను రాజకీయ కార్యకలాపాలకు ఉపయోగించుకున్న వారుకాదు. వారికున్న మతం కేవలం వ్యక్తిగతం. కనుక ఆనాడు జరిగిన పల్నాటి యుద్ధం శైవ వైష్ణవ మతాల ఘర్షణ కానేకాదు.

నాగమ్మ తండ్రి చౌదరి రామిరెడ్డి. ఇతను సబ్బిమండలం (కరీంనగర్ జిల్లా) మల్యాల దుర్గంలోని అరపెల్లి గ్రామంనుండి వలసవచ్చి పల్నాడులోని 'జిట్టగామాలపాడు'లో స్థిరత్వమేర్పరుచుకున్నవాడు. కనుక నాగమ్మ స్వగ్రామం జిట్టగామాలపాడు. ఆరోజుల్లో తరచూ సంభవించే బందిపోటు దొంగల ఆగడాన్ని ఎదుర్కోవటానికి కొంతమంది జెట్టీల (శూరులను తయారుచేసి, వారిద్వారా దొంగల్ని పారదోలించేదట, నాగమ్మ. అందువల్లనే ఆగ్రామానికి 'జెట్టిగ్రామం' అనిపేరువచ్చిందనీ, వాడుకలో అది క్రమంగా ఎన్నో రూపాంతరాలు చెంది చివరకు జెట్టిగామాలపాడు, జిట్టగామాలపాడు అనేపేర్లు నిశ్చయ మయ్యాయని జనశ్రుతి. మరి నాగమ్మ రాకకు పూర్వం ఆగ్రామానికున్న పేరేమిటో పరిశీలకులు నిర్ణయించాలి.

శైవమతస్తురాలైన నాగమ్మ శైవమతవ్యాప్తికోసం ఇతరులెవ్వరికీ శైవమతదీక్షలు యిచ్చిన సందర్భాలు పల్నాటి చరిత్రలో లేనేలేవు. తీరిక సమయాల్లో శివధ్యానంచేస్తూ మానసికశాంతిని పొందేది. అందుకోసమే తన స్వస్థలమైన జిట్టగామాలపాటిలో ఒక చిన్న శివలయాన్నీ, దాని చుట్టూ ఒక ఆశ్రమాన్నీ నిర్మించుకుంది. ప్రస్తుతం శిథిలమైపోయిన ఆగుడిని నాయకురాలిగుడి అని పిలుస్తారు. శివార్చనకోసం ఆగుడికెదురుగా ఒక పూలతోటనుకూడా యేర్పాటు చేసుకుంది. ఇప్పుడా ప్రాంతమంతా మాగాణిగా మారిపోయినా, పూలతోట అనే ఆప్రాంత వాసులు పిలుస్తారు. శివాభిషేకానికి ఆప్రాంతంలోనే ఒక భావినికూడా త్రవ్వించింది. ఆ భావిలోని నీరు, ఇప్పటికీ స్వచ్ఛంగావుంది అడుగు

భాగంకూడా కనిపిస్తుంది. ఈనాగమ్మ గోపన్న మంత్రివద్ద శాస్త్ర విద్యలతోపాటు సాముగరిడీలు, అశ్వశిక్షణ నేర్చుకుందని జనవాక్యం.

శివభక్తురాలైన నాగమ్మకు, వైష్ణవద్వేషంలేదు. హరిదాసులనూ, తంబళ్ళవారినీ సమాదరించింది. సమానంగా గౌరవించింది. మంత్రిత్వం చేపట్టిన తర్వాతకూడా, అన్ని మతాలవారినీ సమంగా చూసింది. వారి వారి చాకిరినిబట్టి యినాములు, మాన్యములుకూడా యిచ్చింది. నేర ప్రవృత్తి కలిగినవాడు ఏమతంవాడైనా, తరతమభేదంలేకుండా శిక్షించింది. గజదొంగయైన కొమ్మడు శైవుడైనా, గురిజాలసమీపంలోని రేవంతు బయళ్ళలో కొరతవేయమని కఠినశిక్ష విధించింది. ఈ నాగమ్మ క్షుద్రదేవతలను ఆరాధించినట్లు కానీ, జంతుబలులను సమర్పించినట్లుకానీ, లేక, ఈమే స్వయంగాబలుల్ని సమర్పించినట్లుకానీ పల్నాటి చరిత్రలో ఉన్న సందర్భం ఒక్కటీలేదు. అన్నివేళలా శంకరుడే ఆమెకు ఆరాధ్యదైవం.

నాగమ్మ మంత్రిణియైన తర్వాతకూడా, గ్రామాలకు గ్రామాలను దోచుకునే బందిపోటు దొంగల్ని పారదోలటానికి, గ్రామాల్లో రక్షణదళాల నేర్పరిచి, సాముగరిడీలు, కత్తియుద్ధాలు నేర్పించి, అశ్వశిక్షణ నిప్పించి దోపిడీమూకల్ని ఎదుర్కొనజేసి పారద్రోలించేది అందుకే ఈమెకు నాయకురాలు అనేపదం అన్వర్థమైంది.

ఈమె స్వయంగా ఖడ్గంచేతబూని, అశ్వారూఢయై రణభూమిలో దూకించి, శత్రువర్గంపై తలపడి వీరవిహారంచేసిన వీరనారి. అత్యంత సాహసురాలు. తనకోసంకాక, తనను నమ్మినవారికోసం బ్రతుకును త్యాగమయంచేసి, తుదివరకూ ఆదేధ్యేయంతో నిలిచిన నియతిశీలి, ధీరురాలు. తనకు 'తన' అనేవారెవ్వరూ లేనికారణంగా ప్రతిఫలాపేక్షకై యత్నించే అవసరంకూడా ఈమెకు లేకుండా పోయింది. బుద్ధిసునితం, దృష్టివిశాలం.

నాగమ్మలో మతద్వేషం మచ్చుకైనా కనిపించదు. పైగా మత సహనాన్ని పాటించి అందరి మన్ననలకూ పాత్రమైంది. నలగామరాజు గారి సైన్యంలో అన్ని మతాలవారికీ ప్రాతినిధ్యం యిచ్చింది. విష్ణు భక్తుడూ, పరమ నైష్ఠికుడు అయిన చింతపల్లిరెడ్డి (చింతపల్లి వీరారెడ్డి)ని

నలగామరాజు సేనకు సర్వసైన్యాధిపతిగా నియమించింది. ఈతనిచేతనే కారెమపూడి రణరంగానికి రణవ్యూహరచన చేయించింది.

పచకుల బ్రహ్మన్న అనేవీరుడు విష్ణుభక్తుడేకాక బ్రహ్మనాయని సహాధ్యాయుడు. ఒకప్పుడీబ్రహ్మనలిద్దరూ ఒకే ఆచార్యునివద్ద, ఒకే గరిడిలో సాముసేర్చుకున్నవారు. బ్రహ్మనాయనితో పచకుల బ్రహ్మన్న కింత సహచర్యమున్నా; నలగామరాజువద్ద ఈతనినే అంగరక్షకునిగా నాయకురాలు నియమించి చాణక్యనీతిని ప్రదర్శించింది. ఈతని బ్రహ్మ నాయనిమీదికే యుద్ధానికంప నిశ్చయించి

నాయకురాలుబ్బుచు నలగాముచేరి
విజయమ్ము మనదేను వీరపుంగవుడ
బ్రహ్మన్న యొక్కడే బ్రతికియున్నాడు
బంధించి యాతని పట్టితెచ్చుటకు
పచకులబ్రహ్మినే పంపగావలయు.

అని చెప్పి, బ్రహ్మన్ననోడించి బందెపెట్టుటకు నీవె చాలుదువయ్య నిఖిలైకవీర. [1] అని చాటింది.

ఇది నాగమ్మ ఉదారస్వభావానికి మచ్చుతునక. కన్న తండ్రిని చంపించి, కడగండ్లపాల్జేసి, పురుషాధిక్యతతోవిర్రవీగు ఈ ప్రపంచంలో అబలయైన నాగమ్మను ఏకాకినిజేసిన బ్రహ్మనాయడు; చివరకు తానూ రణరంగంలో అందరినీ పోగొట్టుకుని ఏకాకిగానే నిలిచాడు. అయినా, నాగమ్మ తన తండ్రి హత్యకు ప్రతిచర్యగానైనా హత్యచేయమని ఆదేశమివ్వక; కేవలం రాజ్యలోభంతో బ్రహ్మనాయడు యుద్ధాన్ని ప్రకటించాడన్న కారణంగా, బందీగా పట్టుకురమ్మన్నదేకాని, హత మార్చమని ఆదేశించలేదు. మంత్రిణిగా నాయకురాలు చూపిన ఈ ఔదార్యం ఆమె రాజకీయ ప్రతిభకు కీర్తిపతాక. వ్యక్తిగత కక్షకు పాల్పడక కేవలం రాజకీయంగానే చివరివరకూ పోరాడి విజేతయనిపించు కున్న నాయకురాలి సునిశితమేధాసంపత్తి, ప్రజ్ఞాపాటవం గర్వించదగ్గది.

---

1) పలనాటి వీరచరిత్ర–పింగళి లక్ష్మీకాంతం–పుట 59

# బ్రహ్మనాయుని వైష్ణవ మతయుక్తి; శైవ విగ్రహాలపై ఆసక్తి.

బ్రహ్మనాయుడు విష్ణుభక్తుడైనా శివుణ్ణికూడా ఆరాధించాడు. మాచెర్ల చెన్నకేశవస్వామిని కొలిచినట్లే, శ్రీశైల మల్లికార్జునస్వామినీ సేవించాడు. గురిజాల కామేశ్వరుని బంగారు పుష్పాలతో అభిషేకంచేసి కొనియాడాడు. అయినా, బ్రహ్మనాయుడు వైష్ణవ మతదీక్షలు యిచ్చిన సందర్భాలున్నాయి. మాచెర్లలోని జైనమతస్థులైన గోసంగులందరికీ వైష్ణవమిచ్చి, హరిజనులుగా, మాలలుగా మార్చి తానుగూడా ఆమాలల్లో కలిసిపోయ్యాడు. ఆతర్వాత తాను స్వయంగా సృష్టించుకున్నదే 'పద్మనాయక వెలమ' కులం.

శివభక్తి తత్పరుడై సిరాదేవి (మలిదేవరాజు భార్య)తో పాటు అరణంగా వచ్చిన ముగ్గురు గొల్లయోధులలో ఒకడైన చెవుల గోవన్న (బాలగోవన్న)కు మాడుగుల గ్రామంలో వైష్ణవమిచ్చి, ఆ తర్వాత అతని చేతనే కోడిపందె మాడించాడు. మందాది మందపోటు (గోగ్రహణం) అనంతరం రోషించి, గురిజాలను కుంతంతో పొడవాలని, గురిజాలపై దాడిచేయటానికి బయలు దేరిన బ్రహ్మనాయుడు, గురిజాల సమీపంలోని రేవంతు బయళ్ళలో నాగమ్మచే కొర్రు శిక్షకు గురియైన గజదొంగ కొమ్మనకు వైష్ణవమిచ్చి, తిరుమణి తీర్చి, తిరుమంత్రముపదేశించి, గోపాల దాసిగా పేరుమార్చి కొత్తి వీరునిగా తన బలంలో చేర్చుకున్నాడు. చివరకు పల్నాటియుద్ధ సమయంలో కూడా; శివారాధకుడే కాక పరమ శైవుడైన అలరాజు తండ్రి కొమ్మరాజును ఎన్నో యిబ్బందుల పాలుజేసి, చివరకు వైష్ణవమిచ్చి, నారాయణ మంత్రమువదేశించిన తర్వాతనే యుద్ధ భూమికి పంపాడు. నాయకురాలు నాగమ్మ బ్రహ్మనాయునిపై జోదుల సోమశేఖరుని యుద్ధానికి పంపుతుందని తెలుసుకున్న తర్వాత విధిలేకనే ఈకొమ్మరాజును యుద్ధానికి పంపాడు, బ్రహ్మనాయుడు.

కురుపాండవులకు ద్రోణాచార్యుడెలాగో, అలాగే పల్నాటి రాజ వంశానికి ఈ జోదుల సోమశేఖరుడు రాజగురువు. అనుగురాజు

పుత్రులైన నలగామరాజాదులెనమండుగురికీ ధనుర్విద్య నేర్పిన ఆచార్యుడితడు. ఇంతటి వానిని యుద్ధంలో జయించటం, ఒక్క కొమ్మరాజుకు తప్ప ఇతరు లెవ్వరికీ సాధ్యం కాదని తెలుసుకున్న బ్రహ్మనాయుడు, కొమ్మరాజును విశేషంగా కీర్తించి, శంఖుతీర్థమూ, వీరతాంబూలమూ యిచ్చి యుద్ధానికి పంపాడు.

ఆ తర్వాత తాను యుద్ధానికి బయలుదేరిన సమయంలో కూడా వైష్ణవుడైన పచకుల బ్రహ్మన్నను, తన మీదికి యుద్ధానికి రాకుండా నివారించటానికి, తాను పంపిన అడప కేశవదాసిని పచకుల బ్రహ్మన్న హతమార్చటంతో, అతనిపై బ్రహ్మనాయనకు యుద్ధం చేయక తప్పలేదు. అయినా, సహాధ్యాయునితో సమరం చేయటం సమంజసం కాదని పచకుల బ్రహ్మన్నను వారించినా వినకపోవటంతో, అతని కోరికమేరకే యుద్ధం చేసి హతమార్చాడు. ఇలా వైష్ణవుని చంపిన దోషనివారణార్థమే యిప్పటికీ కారెమపూడి వీరుల జాతర సందర్భంలో, ఈ పచకుల బ్రహ్మన్న పేరుమీద మొట్టమొదటి వీరగంధమివ్వటం ఈ నాటికీ ఆచారంగావుంది.

ఇక ఈతని తర్వాత బ్రహ్మనాయునితో తలపడినవాడు చింతపల్లి రెడ్డి. ఇతనూ వైష్ణవుడే. విష్ణు భక్తులను చంపటం యిష్టంలేక ఇతనినీ యుద్ధం నుండి తప్పుకోమన్నాడు. ఈతను బ్రహ్మనాయుని మాటలను లక్ష్యపెట్టక బ్రహ్మనాయునిపై యుద్ధానికే తలపడ్డాడు. చేసేదిలేక బ్రహ్మనాయుడారెడ్డితో హోరాహోరి పోరాడి చివరకు మూర్ఛాగతుని చేశాడేకాని, చంపలేదు. బ్రహ్మనాయుని వైష్ణవ తత్వం ఈ విధంగా అంతర్యంలో అంతర్లీనమై గూడు కట్టుకు పోయినా, దానిని వ్యక్తిగతంగానే ఉంచాడుకాని, రాజకీయ కార్యాలకు, ప్రతిఘటన సాధనకు యేమాత్రం ప్రయోగించలేదనేది పల్నాటి చరిత్ర చెపుతున్న సత్యం.

ఇక తనకు నమ్మకంకల్గిన శైవ విగ్రహాలను దౌర్జన్యంగా తరలించటం, బ్రహ్మనాయనకు మొదటినుంచీవున్న అలవాటు. తనతండ్రి

దొడ్డనాయని కాలంలో దుర్జయగొంకరాజుల స్వాధీనమైన పల్నాడును తిరిగీ సాధించాలని, తీర్థయాత్రా నెపంతో బయలుదేరిన అనుగురాజుకు, కనకాద్రి చెన్నకేశపుని విగ్రహాన్నితెచ్చి, పల్నాటిని సాధించటంతో, దైవ విగ్రహాలమీద నమ్మకంకల్గిన బ్రహ్మనాయడు, విగ్రహాలనుతేవటమే ఆచారంగా పెట్టుకున్నాడు. పెదమలిదేవరాజు పెండ్లికోసం కల్యాణపురి (ఇది బీదరుకు యాభైయారు కిలోమీటర్ల దూరంలోవుంది) వీరసోమునికి సహాయంగా శివపురిమీదికి దండెత్తిపోయి, ఆ శివపురికోటను విధ్వంసం చేసి అక్కడున్న "భూతరాట్కంబం" (మహంకాళిపీఠం)ను పెకలించుకుని తెచ్చి, మొదట త్రిపురాంతకంలో (వినుకొండ నుండి శ్రీశైలంపోవు మార్గంలో వుంది) ప్రతిష్ఠించాడు. ఆతర్వాత పల్నాటి యుద్ధసమయంలో అదే భూతరాట్ స్తంభాన్ని త్రిపురాంతకంనుండి తెచ్చి, రణరంగానికి సాక్షీభూతంగా కారెమపూడి యుద్ధభూమి నడిబొడ్డున నాటాడు. (ఈ విగ్రహం పోతురాజు అనేపేరుతో పిలువబడుతూ యిప్పటికీ వుంది.)

యుద్ధంలో తనకుమారుడు బాలచంద్రుడు, తన అన్న బాదమరాజు కూలిపోవటంతో నిరాశచెందిన బ్రహ్మనాయడు; కాల్యాణపురిలోని అంకాళ దేవతను, అప్పటికప్పుడు కొమ్మరాజుచే తెప్పించి, కారెమపూడి గ్రామంలో ప్రతిష్ఠించి; అదీచాలక, శివభక్తి తత్పరుడైన కొమ్మరాజుకు వైష్ణవమిచ్చి, తిరుమంత్రముపదేశించి యుద్ధానికి పంపాడు. (ఈవిగ్రహం కారెమపూడిలో యిప్పటికీ పూజలందుకుంటూవుంది. కల్యాణ పురి నుండి మొదటతెచ్చినప్పుడీవిగ్రహానికి వజ్రకవచ ముండేదని వ్రాయబడింది.)

ఇలా కల్యాణపురినుండి తెప్పించిన ఈ అంకాళశక్తి, కారెమపూడి రణభూమిలో తన భక్తులంతా హతమైపోయారన్న బాధతో, బ్రహ్మ నాయని నిర్దయతను, దుర్మార్గాన్ని ఎత్తిచూపిస్తూ విలపించింది. దీనురాలై ఆదేవత చెప్పిన పల్కులిలావున్నాయని పదకావ్యంలో ఉంది.

శీలము రఘురామ చెప్పెద వినుము
మావారు కల్యాణమందుననుండి
ఘనరాజ్య సంపదల్ కడకుపోద్రోసి
హాలుపొంద నీవిష్ణు పోరుకందరము
లోనుగావ స్తిమి లోకంబులెరుగ
నీవుబెట్టినచిక్కు నీవెరుంగుదువు
అందరి నీమాయ హతమజేసితివి
.... .... .... ....
నినునమ్మినందుకు నీవు మామీద
దయయుంచవైతివి దానవారాతి.[1]

దీనినిబట్టి బ్రహ్మనాయని విగ్రహాల తరలింపును; చివరకు తనను నమ్ముకుని వచ్చినవారినికూడా తన స్వార్థంకోసం బలిచేశాడనేవిషయాన్ని విపులంగా తెలుసుకోవచ్చు.

1) పలనాటి వీరచరిత్ర-పదవాక్యము-పింగళి లక్ష్మీకాంతం-
పుటలు 492-493.

# బ్రహ్మనాయుని క్షుద్రదేవతారాధన:

## అలరాజు హత్యకు కుట్ర

బ్రహ్మనాయుడు వైష్ణవభక్తుడైకూడా క్షుద్రదేవతల్ని ఆరాధించాడు. వాటికి జంతుబలులను ప్రోత్సహించటమేకాక, తాను స్వయంగా ఆదేవతలకు జంతుబలులను సమర్పించిన సందర్భాలు అనేకమున్నాయి.

శత్రువిజయ చిహ్నంగా శివపురినుండి తెచ్చిన భూతరాట్ స్తంభానికి, మొదట పెకలించినప్పుడు శివపురిలోనూ, ఆతర్వాత మొదటిసారిగా ప్రతిష్ఠించిన త్రిపురాంతకంలోనూ, యుద్ధానికి తరలివస్తూ అదే భూతరాట్ స్తంభాన్ని మళ్ళీ పెకలించటానికి త్రిపురాంతకంలోనూ, పునఃప్రతిష్ఠ జరిగిన కారెమపూడి కదనభూమిలోనూ కలిపి, నాలుగుమారులూ మేకపోతుల్ని గావుచెల్లించాడు. దున్నపోతుల్ని బలియిచ్చుకుంటూ వచ్చాడు. అంకంబానికి నాలుగు ప్రాంతాల్లోనూ కుంభాన్నీ వేపరొట్టెల్నీ నైవేద్యంగా సమర్పించాడు. రక్తంతో సంప్రోక్షణ చేశాడు. ఆ తర్వాత యుద్ధసమయాన కొమ్మరాజుచే తెప్పించిన అంకాళదేవతకుకూడా ఆవిధంగానే బలిసమర్పణ చేశాడు. అలరాజుకూ, బ్రహ్మనాయునిఅన్న బాదన్నకూ మాచెర్ల పచ్చగడ్డలమీద జరిగిన కలహకారణంగా, అలరాజు ఖడ్గాన్ని ఉపశమింపజేయటానికి ఎన్నో దున్నపోతుల్ని బలియిచ్చాడు. ఆ బలిసమర్పణ సమయంలో, అవమానానికి గురియైన బ్రహ్మనాయుడు, అసలు అలరాజునే అంతం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఆకథ యిలావుంది.

వారివారి అశ్వికుల కలహకారణంగా రోషాలు పెంచుకున్న కొమ్మరాజు కుమారుడు అలరాజుకూ, బ్రహ్మనాయని అన్న బాదమరాజుకూ మాచెర్ల చంద్రవంకతీరాన, గుర్రాలమడుగు (ఇది యిప్పటికీ ఈ పేరుతోనే పిలువబడుతుంది.) దాపున పచ్చ గడ్డల మీద యుద్ధం సంభవించింది. ఆ పోరును నివారించటానికి, బ్రహ్మనాయుడడ్డరిని ప్రతిమాలాడు. బాదన్న వెంటనే ఆగిపొయ్యాడు. కానీ, అలరాజు ఖడ్గం [illegible]

ACN 24(091

వేగాన్ని పుంజుకుంది. దానికి కారణమడిగాడు, బ్రహ్మన్న. తన ఖడ్గానికి తగిన ఆహారం లేనిదే ఉపసంహణ జరగదన్నాడు, అలరాజు. అప్పుడాయన కోరిక మేరకు దున్నపోతుల్ని ఆ ఖడ్గానికి బలియిచ్చి యుద్ధాన్ని నివారించాడు, బ్రహ్మన్న. కాని, బలిసమర్పణ సమయంలో దున్నపోతు కంఠాన్ని తెంచిన కత్తి, నేలకు గుచ్చుకుపోయింది. ఆ కత్తిని పైకిలాగే సమయంలో మట్టికూడా పైకెగసి బ్రహ్మనాయని ముఖం మీద పడటంతో నెత్తురు కారింది. ఆ దృశ్యాన్ని చూసి అలరాజు నవ్వాడు. దానికి కోపించిన బ్రహ్మనాయడు....

ఆ: వె: ఇట్లు లోష్ట శకల మెగసి పైఁబడఁజూచి
నగియె ధారుణీశ నందనుండు
కనలి నాయుడట్టి కారణంబున రాచ
మల్లునంపె సంధి మార్గమునను-

కం మాయన్న చెలిమి కలుగునె
నీ యలరాజునకు నితని నిర్జించెద నం
చాయక కావట్యంబునఁ
బాయక నాయుండు రాయబారం బనిచెన్-[1]

ఇదే ప్రస్తావన సందర్భంలో తాను సేకరించిన తాళపత్ర ప్రతులలోని కొన్ని వాక్యాలను పొందుపరుస్తూ డా॥ తంగిరాల వెంకట సుబ్బారావుగారు తన పరిశోధన గ్రంథం, తెలుగు వీరగాథా కవిత్వం రెండవ సంపుటంలో, బ్రహ్మనాయుడనిన వాక్యాల్ని యీ విధంగా చూపించారు.

అరెరె! ఇది పెడము మించిన వల్లు
ఇతను నన్ను కాచేవాడు కాదు
ఏ ఒక్క నేర్పుతో నైన
ఈ పందిని ఊద బీకించవలె!

1) వీరభాగవతము-పద్యకావ్యము-ముదిగొండ వీరభద్రకవి-పుట 153

ఇదే, అలరాజుపై బ్రహ్మనాయుడు చేసిన శపథం ఈ పచ్చగడ్డల కలహం నాటినుండే, బ్రహ్మనాయుడు అలరాజుపై కక్షబూనాడు, కసిపెంచుకున్నాడు. చివరకి చంద్రవంక పచ్చగడ్డల కలహం అలరాజు మరణానికే దారితీసింది.

మొదటి నుండీ బ్రహ్మనాయుని దృష్టిలో అలరాజు మహాదురంహకారి. దానికి తోడు గురిజాలనేలు నలగామరాజు ఏకైక పుత్రికయైన రత్నాల పేరమ్మను పెండ్లి చేసుకున్న కారణంగా, అలరాజు వల్నాటికి వారసుడయ్యాడు. ఇప్పుడే, ఈ విధంగా గర్వించిన అలరాజు, యికముందు ముందు గురిజాలకు రాజైతే, తనను గౌరవప్రదంగా చూడగలడనే నమ్మకమేమిటి? కనుక, అలరాజు నెలాగైనా అంతం చేయాలని భావించి, అందుకు తగిన సమయం కోసం నిరీక్షించాడు బ్రహ్మనాయుడు.

కాని, అలరాజు మహాశౌర్య సంపన్నుడు. కనుకనే అతనికి రాచమల్లు అనే బిరుదువచ్చింది. అతని పేరుమీదుగా నిర్మితమైనదే నేటికీ వల్నాటిలో మండాది సమీపాన ఉన్న రచ్చమల్లపాడు అనే గ్రామం. అంతటి సమరభీకర శత్రుసంహారుడైన అలరాజును అంతం చేయాలంటే, అసమాన్యం. పైగా అలరాజు తండ్రి కొమ్మరాజు, గొప్ప విలువిద్యానిపుణుడు. కనుక అలరాజుపై ఏ విధమైన చర్య తీసుకున్నా, నిగూఢంగానే జరిగిపోవాలి. అంతటి పరాక్రమశాలియైన అలరాజును అంతం చేయాలంటే అతనితోపాటు, సిరాదేవికి అరణంగా కల్యాణపురినుండి వచ్చిన ముగ్గురు గొల్లయోధుల్నీ, వారితోపాటు శివపురినుండి తాను తెచ్చుకున్న రాజకుమారుడు లంకన్ననూ అలరాజు దూరం చెయ్యాలి. వీరంతా అలరాజు మేనత్త సిరాదేవితోపాటు కల్యాణ పురినుండి వచ్చారు. కనుక, ప్రాంతీయాభిమానంతోగాని, లేక పూర్వ సహచర్యాన్ని ఆసరా చేసుకునిగాని, అలరాజు పక్షమే వహించవచ్చు కాబట్టి, ముందుగా ఆ నలుగురినీ అంతం చేస్తే, ఆ తర్వాత అలరాజును హతమార్చటం సులభమనుకున్నాడు, బహ్మనాయుడు. తన అన్న

సిద్దన్న బాదరాజుతో సంప్రదించాడు. ఇద్దరూ కలిసి వారిహత్యల కోసం తగిన పథకాలు సిద్ధం చేసుకున్నారు.

సింగన రాయబోయుడు, రాయవీరపడాలు (రావీరవరాలు, రావీరపడాలు) బాలగోపన్న లేక చెవులగోపన్న మీరు ముగ్గురూ చెవుల దారమ్మ కుమారులు. వీరితండ్రి గుండుబోయుడు. ఈముగ్గురే సిరాదేవితో పాటు అరణంగావచ్చిన యర్రగొల్లయోధులు, వీరిలో రెండవవాడైన రావీరవరాలు మహాబలశాలి. ఇతడు సిరాదేవి పెండ్లిసందర్భంలో, భోజనాలసమయాన పంతమాడిన పల్నాటి జెట్టిలలో బలోపేతుడైన జగజెట్టి భీమన్నను చిత్తుచిత్తుగా ఓడించిన మహావీరుడు.

ఈ రావీరవరాలును కోడిపందెమాడబోవుసమయాన, బాదన్న సలహామేరకు, పందెపుకోడికోసం పానగల్లు (నల్గొండ) పంపటానికి నిశ్చయించాడు, బ్రహ్మనాయుడు. మండాదిలో గొర్రెలుకాస్తున్న ఈవరాలును పిలిపించి పానగల్లులోని కోడిని తెమ్మని ఆజ్ఞాపించాడు. 'చీటికి ప్రయాణం, చిల్లరప్రయాణం చేసేవాడ్డికాదు. అయినా, నీవు కోరావుకాబట్టి, నీ ఆయుధంతోనేపోయి అడ్డువచ్చినవారిని హతమార్చి కోడిని తెస్తా'నన్నాడు. ఈవిధంగా బ్రహ్మనాయుడు ధరించే నరసింహ కుంతాన్ని కోరాడు. అందు కభ్యంతరము చెపితే, అసలు ప్రయాణమే చేయడేమోనని సంశయించిన బ్రహ్మనాయుడు, చెరకు చేదైనా, ఉప్పు చప్పనైనా, తన ఆయుధాన్ని మరొకరికి యిచ్చే ప్రసక్తి లేదన్నాడు. అయినా, పరాక్రమశాలివీ, బలోపేతుడవైన నీవు, ఎన్ని అవాంతరాలెదురైనా అధిగమించి విజయుడవై కోడిని తేగలవనే నమ్మకంతో ఈనాడు 'నా ఖడ్గాన్ని నీకిస్తున్నాను. తీసుకో'మని తన నృసింహ కుంతాన్ని రావీరవరాలుకిచ్చాడు. ఏటుమారినా మాటతప్పదంటూ, నృసింహకుంతాన్ని చేతబట్టిన రావీరవరాలు, చిట్టిలదేవుదాటి హుటాహుటి పానగల్లు చేరాడు. (ఇది నల్గొండ పక్కనే వుంది). అక్రమంగా ఆకోడిని తెచ్చే సమయంలో, కోడికి కావలావున్న మాస్టీలతో తలపడ్డాడు. మూడువందలమంది మాస్టీలను ముప్పతిప్పలుపెట్టి, వారు పొడిచిన బరిసె పోట్లనుకూడా లెక్కచేయక, కోడినిపట్టి తిరుగుముఖమయ్యాడు. కొద్ది

దూరం రాగానే దూలాల పోతిరెడ్డి దూలాలతో తారసిల్లాడు. ఆ దూలాలను తునియలుచేసి, పోతిరెడ్డిని హతమార్చి, ప్రాణాపాయస్థితిలో కోడిని తీసుకుని మాచెర్ల చంద్రవంక దరికి చేరాడు. నాసాపుటాలు బిగబట్టి ఒక్క ముక్కు ముక్కాడు. మొనలు విరిగి శరీరంలోనే ఉండిపోయిన బరిసెముక్కలన్నీ ఒక్క పెట్టున బయటపడ్డాయి. కాని, అక్కడే నేలకొరిగి ప్రాణం విడిచాడు. ఆసమయాన చంద్రవంక నదినుండి నీళ్ళు తేవటానికి వెళ్ళిన మాచెర్ల మల్లారెడ్డి కోడళ్ళు ఐదుగురూ, ఆదృశ్యాన్ని చూచివచ్చి, విషయాన్ని బ్రహ్మనాయునకు తెలియపరిచారు. వెనువెంటనే బ్రహ్మనాయ డక్కడకువెళ్ళి కోడిని తెచ్చుకుని రాయవీరపడాలకు అంత్యక్రియలు జరిపాడు. ఆకోడిపేరే చిట్టిమల్లు. ఇది ఒక రాత్రికథగా చెప్పుకునే చరిత్ర.

అడుగడుగునా ఉత్కంఠను కలిగిస్తూ, రౌద్ర భీభత్స విషాద రసాలు ఉప్పొంగి పొంగే ఈవీరగాథను, భావోద్వేగంతో అభినయిస్తూ, చేతిలోని కత్తిని ఝళిపించి హుంకరిస్తూ కథాగానంచేసే గణేశునిపాడు, జక్కంపూడి అయితం నిజంగా కృతార్థుడు. జానపద కళల్లో ఇంత భావాభినయం, గొప్పతనం ఉందా అనిపించేది. కాని, ఆకళాకారులేరీ? ఈకథను జానపదులు 'రావీరపడాలు కోడినితెచ్చే కొండ' అంటారు.

ఇక అలరాజునుండి దూరంచేయాలనుకున్న రెండవవాడు చెవుల గోవన్న (బాలగోవన్న) ఇతనూ బలశాలి, స్వాభిమానధనుడు. ఇతను గొట్టిపాళ్ళలో (ఇది మాచెర్లకు దక్షిణంగా 30 కిలోమీటర్ల దూరంలోవుంది.) గోవుల కాస్తూ వుండేవాడు, వీరభద్రకవిగారు రేమిడిచెర్ల అని వ్రాశారు. కోడివందెములో కోడినిపట్టటానికి వీరనాయకులతోపాటు ఈగోవన్ననూ పిలిపించాడు, బ్రహ్మనాయుడు. అందరినీ కూర్చోబెట్టి; వందెపుకోడి ఎవరిదగ్గరకు వెళితే వారే, కోడినిపట్టి వందెమాడాలంటూ, వారిమీదికి కోడిని వదిలాడు. ఆసమయంలో అందరూ

గీ॥ ధౌత వాసఃకుటీరులై తలఁపులందుఁ
జెన్నరాయనినిల్పి కూర్చున్నవేళ
నిలిచి కూయుచుఁబోయి మన్నీల విడిచి
నిక్కి గోవన్నతొడ సెక్కెఁ గుక్కుటంబు-[1]

ఇక గోవన్నకు పందెంలో కోడినివట్టటం తప్పలేదు. అయినా, మొదటిపందెంలో ఆకోడి గెలిచింది. కాని పైపందెం లేకుండా పందెమేమి టంటూ పట్టుబట్టిన బ్రహ్మనాయనను, ఎదిరించే ధైర్యంలేని గోవన్న మలివందెమాడటానికి ఒప్పుకున్నాడు. ఒకసారి పందెమాడి ప్రయాస పడిన కోడిని, వెంటనే రెండవ పందెమునకు విడిస్తే సత్తువ క్షీణించి ఓడిపోతుందని గోవన్నకు తెలుసు. కాని, యేంచేయగలడు? నాయని ఆజ్ఞ నారాయణాజ్ఞకదా! ఇక బ్రహ్మనాయనకు కావలసిందా, గురిజాలపై ఆధిపత్యమేకదా!

రెండవ పందెంకూడా గోవన్నచేతనే వేయించాడు బ్రహ్మనాయుడు. కాని, ఓడిపోయింది. కుట్రచేతనే అపజయం సంభవించిందని అన వసరంగా యుద్ధాన్ని ప్రకటించాడు బ్రహ్మనాయడు. ఆయుద్ధంలో స్వాభిమానధనుడైన బాలగోవన్న; పందెమోడిన తనబ్రతుకు నిరర్థక మనుకుని నిశ్చయించుకున్నాడు. ఆరె జోగన్నచే (కథకుల కథనం) అస్త్రాలు వేయించుకుని చచ్చాడు. వీరభాగవతంలో మువ్వల భీమునిచే చంపించుకున్నాడని తెలుపబడింది.

ఏదియేమైనా ఈచచ్చిన బాలగోవన్నకు, అంతకు ముందే వివాహం జరిగింది. పసుపుగుడ్డలుకూడా విడువని ఈగోవన్నను, తల్లి దారమ్మ కోడిపందెమునకు వలదని ఎంతో వారించింది. అయినా బ్రహ్మన్న ఆజ్ఞ మీరరానిదికదా! పసుపుగుడ్డలతోనే పందెమాడాడు. పరలోకానికి వెళ్ళిపొయ్యాడు.

---

1) వీరభాగవతము-ముదిగొండ వీరభద్రకవి-పుట 128

ఇక మూడవవాడైన సింగనరాయబోయడు మండాది మందపోటు (గోగ్రహణం)లో శత్రువర్గంతో హోరాహోరిపోరాడి చివరకు దొమ్మి యుద్ధంలో అస్తమించాడు.

నాల్గవవాడైన రాకుమారుడు, లంకపోతన్న. మహా క్షాత్ర సంపన్నుడూ, విలువిద్యాప్రవీణుడు, కోడిపందెంలో ఓడిపోయి వలస వెళ్ళేసందర్భంలో, చెన్నకేశ్వరస్వామి భూషణాలన్నీ ఒలిచి ఒక కంట్లపు కోడెకెత్తి ప్రయాణమై పోతూ, ఆకోడెకి లంకన్ననే కాపుగా వుంచాడు, బ్రహ్మనాయడు. ఆకోడెను పెందోటలో బెబ్బులిపట్టింది. లంకన్న ఆపులినిచంపటంలో విఫలుడయ్యాడనికోపించిన బ్రహ్మనాయడాలంకన్నను తిట్టి, ఆడకట్టుకట్టి, జడకొప్పుపెట్టి, ఆడదానిలా ఆవులగాయమని కఠినంగా శాసించాడు. ఎదురుపలికే ధైర్యంచాలక, అవ్యక్తస్వరూపుడై ఆడకట్టుతోనే నాలుగేండ్లు మండాదిలో ఆలమందను కాపాడాడు. అలా వ్యధిత హృదయుడైన లంకన్న, తనకావిధంగా సంక్రమించిన దురవస్థకు దురపిల్లుతూ, చివరకు మందపోటు సమయంలో గోవుల పాలు పితుకుతుండగా, శత్రువర్గంవేసిన శరఘాతాలకు తట్టుకోలేక బెదిరిపోయిన ఆ ఆవుల తొక్కిడితోనే అసువులు వీడాడు లంకన్న. [1]

కీలక స్థానాల్లో తనవారి నెవ్వరినీ నియమించక, సాహస కార్యాల్లో సమర్థులంటూ, మధ్యలో వచ్చిన ఈ నలుగురినే నియమించి కపటవ్యూహాలతో కాటికి పంపించాడు బ్రహ్మనాయడు.

---

1) వీరభాగవతము-ముడిగొండ వీరభద్రకవి-పుట 140

# అలరాజు హత్యకు బ్రహ్మనాయుడే కారణం.

అలరాజును అంతం చేయటానికి బ్రహ్మనాయుడు పన్నిన కుట్ర మరీ నిగూఢం. పైగా హృదయ విదారకం. వనవాసం పూర్తైన తర్వాత మేడపి (ఇది వినుకొండ తాలూకాలోనిది. వలస చివరి రోజుల్లో బ్రహ్మనాయనాదులు మూడేండ్లు ఇక్కడే కాలం గడిపారు.) నుండి గురిజాలకు రాయబార మంపటానికి బ్రహ్మనాయుడీ అలరాజునే నిర్ణయించాడు. అసలు రాయబారమే వద్దన్న మలిదేవరాజుకు మాయ మాటలు చెప్పి ఒప్పించాడు. స్వయంగా తామే వెళ్ళేదమన్న గండుకన్నమలాంటి వీరులైన కార్యపురుషుల మాటలు త్రోసిపుచ్చాడు. రాయబారానికి పంపవద్దన్న అలరాజు తండ్రి కొమ్మరాజును బలవంతం చేసి; అలరాజుకు బదులు తన కుమారుడైన బాలచంద్రుణ్ణీ యిల్లడ పెట్టినట్లు మభ్యపెట్టి, చివరికెలాగో ఒప్పించాడు. తీవ్ర అభ్యంతరం చెప్పిన అలరాజు తల్లి చెల్లమదేవిని ఒప్పించటానికి, మహావీరుడైన తన పెద్దకొడుకు కన్నమదాసును, అలరాజుకు అంగరక్షకునిగా పంపుతున్నట్లు చెప్పి, అతి ప్రయాసతో ఆమెను కూడా ఒప్పించాడు. చివరకు అలరాజు కన్నమదాసులు ప్రయాణమై వెళుతున్న సమయంలో, ఆ యిద్దరినీ చెల్లమదేవి దగ్గరకు చేర్చాడు. ఇద్దరినీ దీవించాడు. ఆ దీవెనలోని అంతర్యాన్ని, కపటాన్ని గ్రహించిన చెల్లమదేవి, బ్రహ్మనాయునితో అతని పూర్వపు కుట్రను బయట పెట్టింది. పాతపగలు, అంటే అలరాజూ, బాదన్నా చేసిన, మాచెర్లలోని పచ్చగడ్డల మీది చంద్రవంక యుద్ధం ముగిశాక, బ్రహ్మనాయుడు చేసిన ప్రతిజ్ఞను గుర్తుకు తెచ్చి; ఆ పూర్వపు పగను సాధించటానికి వేసిన ఎత్తుగడే యిదియని నిష్కర్షగా చెప్పి బ్రహ్మనాయనను ఈ విధంగా హెచ్చరిస్తూ....

ఓయన్న నాయడా! ఓ నీలవర్ణ
కపట నాటక సూత్రధారీ! కార్యవేది
కపట బుద్ధులు నీవు ఏలగైకొంటివయ్యా?
నాయడా బ్రహ్మ నీవు
కొమ్మన్న వారికి పోకటే నిజము

రమ్మన్న వారికి రాకటే నిజము
నా కొమారుని పొమ్మంటివి
నీ కొమారుని పోయి రమ్మంటివి
నా కుమారునిబంప నాయము గాదయ్య
నాయద బ్రహ్మ. [1] అని వాపోయింది.

రాయబారానికి వెళ్ళేవారినిద్దరినీ ఒకేవిధంగా దీవించక, వేరు వేరు భావాలతో దీవించిన బ్రహ్మనాయని కుట్రను ఈవిధంగా బహిర్గతంచేసిన ఆ చెల్లమదేవిని, తాను మళ్ళీ సమాధానపరచటానికి, మరో ఎత్తువేశాడు బ్రహ్మనాయడు. ఒక తులసిమాలను తెచ్చి, అది శత్రువిజయ సాధకమన్నాడు. ఆమాల మెడలో ఉన్నంతవరకూ, అలరాజుకు ఏ అపాయం సంభవించదంటూ దేవునిపై భారంవేసి, ఆదండను అలరాజు మెడలో అలంకరించాడు. సనాతన ఛాందసభావాలలో విశ్వాసమున్న అమాయకురాలు చెల్లమదేవి. ఆయినా అతికష్టంమీదనే ఒప్పుకుంది.

అలా తల్లిదండ్రుల్ని ఒప్పించిన బ్రహ్మనాయడు, అత్తగారిల్లైన నలగామరాజు యింట్లో అడుగుపెట్టవద్దని అలరాజుకు ఆంక్ష విధించాడు. అలరాజూ, కన్నమదాసులు రాయబారం వెళ్ళినతర్వాత, తన కొడుకు బాలచంద్రుణ్ణి చేరబిల్చి, ఎలాగైనాసరే మాయోపాయంచే ఆ తులసి మాలను తీసుకురమ్మని రహస్యంగా చెప్పాడు, ఇదే విషయాన్ని శ్రీ ముదిగొండ వీరభద్రకవి తన వీరభాగవతంలో ప్రస్తావిస్తూ....

మ॥ అలరాజేగిన నాయుఁడాత్మజుని యుద్యత్ప్రీతినీక్షించి "యో
అలనామన్మథ! సత్కుమారవర! యుల్లాసంబునన్ గొమ్మ భూ
వలయాధీశ్వరు సూతిఁజేరఁజని నీపై దగ్గిచేఁ దగ్గళ
స్థలి నొప్పారెడి మామకీయ తులసీదామమ్ముఁ దేఁజూచెదన్".

---

1) ఆంధ్రపత్రిక-దినపత్రిక-బ్రహ్మనాయని రాజనీతి-
డా॥ తంగిరాల వెంకటసుబ్బారావు-ది 29-6-69

కం॥ అలరాజు చిన్నఁబో నీ
బలము ప్రకాశింపనీక పటుతర మాయా
కలితోపాయంబుల నా
తులసీ దామంబుఁదిమ్ము తూర్ణత దనరన్.

ఆ॥ నాయఁడిట్లు పలుక నగుచు నబ్బాలుండు
తాక వాక్యసరణిఁ దగదు నెక్కి
నవ్యరత్న భూషణశ్రేణి విలసిల్ల
నతనిగూడఁ జనియె నగ్నివోలె॥ [2]

అలా బాలచంద్రుడు తన గజ్జెలబొల్లనిపై స్వారీచేస్తూ వెళ్ళాడు.

మేడపినుండి రాయబారానికి వెళ్ళిన అలరాజు, కన్నమదాసులిద్దరూ ఆ రాత్రికి కంభంపాడు చేరారు. (ఇది మాచెర్లకూ, గురిజాలకూ మధ్య, మాచెర్లకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఈశాన్యంగా వుంది.) అక్కడే రైతుల కోరికమేరకు బసచేశారు. మరురోజు రాయబారం అనంతరం బ్రహ్మనాయని కోరికమేరకు గురిజాలలో ఉండరాదు కనుక, మరురోజు విడిది యేర్పాట్లు అనే నెపంతో, కన్నమదాసు రాత్రికి రాత్రే మాడుగుల మీదుగా చెర్లగుడిపాడు చేరాడు. (ఈ చెర్లగుడిపాడు గురిజాలకు, బొరెమపూడికి మధ్యలో వుంది.)

మరురోజు ఉదయమే తన జవనాశ్వంపై కంభంపాడు నుండి బయలుదేరిన అలరాజు సెంటాల (ఇది కంభంపాడుకు ఎనిమిదికిలోమీటర్ల దూరంలో ఈశాన్యంగా వుంది.) దాటి, లేడివాగు దాపుకు చేరాడు. దరులుతన్ని ప్రవహిస్తున్న ఆ వాగునుచూసి తన సవరాలగోడిగ (ఇది అలరాజు ప్రయాణించే గుర్రానికి పేరు. దీనికి సవరాం బొమ్మడు అనే మరొకపేరుకూడా వుంది.)ను అక్కడేఆపి విశ్రాంతితీసుకుంటున్నాడు. ఈలోపు బాలచంద్రుడు తన గజ్జలబొల్లని (ఇది బాలచంద్రుడువయునించే

2) వీరభాగవతము-పంచమాశ్వాసము-
ముదిగొండ వీరభద్రకవి-పుట 158

వాహనానికి పేరు. తగరుగుర్రము అనేపేరుకూడా దీనికుంది.) పై అక్కడకు చేరాడు. నవ్వులాటగా ఆ వాగును, తమతమ వాహనాలతో దూకించటానికి, అలరాజు బాలచంద్రులిద్దరూ పందెమొడ్డుకున్నారు. ఓడినవారు గెల్చినవానికి, అతని ఆభరణాలను నిలువుదోపిడిగా యివ్వాలి. ఇది పందెపునియమం. అలరాజు తనగుర్రాన్ని ఒక్కదూకుతో నదినిదాట దూకించాడే కాని, గుర్రం వెనుకకాళ్ళు, నది ఆవలిఒడ్డు నీళ్ళను తాకి లేచింది. ఆతర్వాత బాలచంద్రుని గజ్జలబొల్లడు ఒకే దూకుతో ఆవలకు దూకింది. అలరాజు ఓడిపొయ్యాడు. ఓడిన కారణంగా, తననగలన్నీ ఒలిచి బాలచంద్రునికిచ్చాడు. బాలచంద్రుడానగలలోని తులసిమాలను మెలుకువగా తప్పించాడు.

ఇదే కథను ఉటంకిస్తూ శ్రీ ఏటుకూరి వేంకటనరసయ్య తన "మగువమాంచాల" అనే పద్యకావ్యంలోని 16వ పుటలో....

కం॥ తలసీదామము మాత్రము
మేలపున మాటుకొని తక్క మేలిమిసొమ్ముల్
అలరాజున కీఁదలఁచుచుఁ
బలికెన్ బాలుండు బంధు భావము గదురన్-

ఆ॥ ఎంత చెడిన బావ విదిగాక నేరుగా
అత్తవారియింటి కరుగుచుంటి
వింతగలుఁగు వాఁడ విట్లేఁగఁ జెల్లునా?
కుఱుచసేయ కివ్వి కొంచుఁ బొమ్ము.

కం॥ అని యొడఁబడ కున్నను వి
న్నను వొప్పఁగఁ గట్టబెట్టినన్ మల్లుండా
తని సైపుణ మగ్గించుచుఁ
జనియెన్ గురిజాల కుభయ సంధాయకుడై.

తులసిమాలను తప్పించిన బాలచంద్రుడు తక్కిన నగలన్నీ అలరాజుకిచ్చాడు. 'ఇదేదోమాటవరుసకు జరిగిందేకాని, పందెమనుకోవద్దు'గ

అలరాజుకు నచ్చజెప్పి, వెనుదిరిగి చూడకుండా వెళ్ళిపొమ్మన్నాడు. ఆ తులసిమాలను బాలచంద్రుడావిధంగా చాకచక్యంతో సంపాదించి, మేడపిచేరి బ్రహ్మనాయనికిచ్చాడు. అలాబ్రహ్మనాయని కప్పజెప్పటంతో, తనకున్న అనుమానాన్నికూడా బాపుకున్నాడు బ్రహ్మన్న.


అలరాజు రాయబారసమయంలో ఈవిషయాలు, ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు సేకరించి పరిష్కరించిన పల్నాటి వీరచరిత్రలోలేవు. పల్నాటి వీరచరిత్రలో ఒక్క బాలచంద్రుని యుద్ధంతప్ప తక్కిన కథ లేవియూ ఇంతవరకూ తెలుగుసాహిత్యలోకంలో సమగ్రంగా రూపు దిద్దుకొనలేదు. అలరాజు హత్యకు బ్రహ్మనాయుడే కారణమను ఈకథల్ని కొంతవరకైనా సేకరించి తన వీరభాగవతంలో పొందుపరిచారు శ్రీ ముదిగొండ వీరభద్రకవిగారు

(క్రీ. శ. 1862) పుటలు 150-158-159)

విడిది యేర్పాట్లనే నెపంతో చెర్లగుడిపాడు చేరిన కన్నమ, అలరాజు మరణానికికూడా అన్ని ఏర్పాట్లుచేయించి, రాయబారసమయానికి అలరాజుతోపాటు గురిజాలలో ప్రత్యక్షమయ్యాడు. రాయబారం అనంతరం చెర్లగుడిపాడు చేరిన అలరాజు, తంబళ్ళ కొమ్మజియ్యారిచ్చిన విషపుష్పాల నాఘ్రాణించి, అంతిమదశకుచేరాడు. తనకూ, కన్నమద్వారా నైనా మరణం తప్పదని తెలుసుకున్న ఆకొమ్మజియ్యరు, వెంటనేవెళ్ళి ఆ విణపుష్పాలనే వాసనపీల్చి కొద్దిదూరంలో అతనూ చనిపొయ్యాడు. అలరాజుకు అంగరక్షకుడుకదా, కన్నమదాసు; తన ఎదుట ఇంత జరుగుతున్నా పూలుతీసుకోవద్దని అలరాజును వారించాడేకాని, పుష్పాల నిస్తున్న కొమ్మజియ్యరును వారించకపోవటంలోని ఆంతర్యమేమిటి? అలరాజు హత్యలో తనప్రమేయంకూడా ఉంది కాబట్టే ఆపని చేయలేక పోయాడు.

అలా చనిపోయిన, అలరాజు, కొమ్మజియ్యరుల పేర్లతోవున్న శిల్పాలు ఇప్పటికీ చెర్లగుడిపాడులో వేరు వేరు ప్రదేశాల్లో పాతిపెట్టబడి వున్నాయి.

"అలరాజు ఒడుగురాయి"
చెర్లగుడిపాడు
(గుంటూరు జిల్లా)





తంబళ్ళ కొమ్మ జియ్యారు
(తంబళ్ళ పెద్దు)
విగ్రహం
చెర్లగుడిపాడు
గుంటూరు జిల్లా)

విషపుష్పాల నాఘ్రాణించి చివరిదశకు చేరిన అలరాజు ఆనతి మేరకు కన్నమదాసు గురిజాలకుపోయి, అలరాజు భార్య పేరమ్మను తీసుకొచ్చాడు. మరణానంతరం అలరాజు శవంతోపాటు, పేరమ్మను కూడా మేడపి చేర్చాడు. నలగామరాజు తమ్ముడైన నరసింగరాజే నాగమ్మ ప్రోద్బలంతో, అలరాజును చంపించాడని చెప్పి మేడపిలోని పెద్దలందర్నీ ఒప్పించాడు, కన్నమ. మాచెర్ల పచ్చగడ్డల కలహంలో ఒకనాడు అలరాజును నిర్జిస్తానని బ్రహ్మనాయడు చేసిన తన శపథాన్ని ఈవిధంగా తీర్చుకున్నాడు.

మేడపిలోనివారంతా, నాగమ్మ నరసింగరాజుచే అలరాజుకు విష ప్రయోగం చేయించిందని పలుకుతుంటే; అక్కడ గురజాలలో, బ్రహ్మ నాయడే కన్నమద్వారా విషప్రయోగం చేయించాడనే వార్తలు మిక్కుటమయ్యాయి. వాద ప్రతివాదాల్నీ వినిన బ్రహ్మన్న; ధర్మ నిర్ణయం చేయిస్తే తనగుట్టు బయటపడుతుందని జంకాడు. ఆలస్యం చేస్తే ఆలోచనలకు తావులభిస్తుందని భావించాడు. అలరాజు అంత్యక్రియల అనంతరమే మరునిముషంలోనే గురిజాలపై యుద్ధాన్ని ప్రకటించి, దండుతోసహా కారెమపూడికి కదలివెళ్ళాడు. ఆ వెంటనే కారెమపూడినుండి విద్యాధర వీరరాఘవభట్టు (ఈతని బిరుదునామం రణభట్టు)ను రాయబారమంపి నలగామరాజుకు సైతం న్యాయ నిర్ణయాన్ని చేసే అవకాశమివ్వకుండా, యుద్ధానికే రెచ్చగొట్టాడు, బ్రహ్మనాయడు.

ఈ ఐదుహత్యలూ జరిగేవరకూ కడుపులో కాలకూటవిషమున్నా, పెదవులమీద తేనెలొలుకు పదాలను చిందిస్తూ వచ్చాడు, బ్రహ్మన్న. అలరాజు హత్యానంతరం, తాను ముందే అల్లుకున్న పథకం ప్రకారం ఆ నెపాన్ని నరసింగరాజుకు అంటగట్టి, చివరకు రాజవంశ వినాశనానికి, పలనాటి విచ్ఛిత్తికి మూలకారకుడైనాడు. హత్యారాజకీయాల్లో ఆరితేరిన బ్రహ్మనాయడు, అలరాజును చంపించి రెచ్చగొట్టకపోతే, అసలు పలనాటి యుద్ధమే జరిగేదికాదు. ఆఉద్దేశం వల్నాటి రాజు లిద్దరిలో ఏఒక్కరికీ లేదు.

ప్రత్యక్షంలో స్తోత్రపాఠాలు వల్లించటం, పరోక్షంలో బలిపీఠాలు సిద్ధం చేయటంలో సిద్ధహస్తుడు బ్రహ్మనాయుడు. తనకు ఉపయోగకారులుగా వున్నంతకాలం దగ్గరకుచేర్చి భజించటం, అవసరం తీరగనే ప్రతికూలురౌతారని భావించి నిర్జించటం, బ్రహ్మనాయునకు వెన్నతో పెట్టినవిద్య. పల్నాటి యుద్ధంవరకూ సాగిన కథలనన్నిటినీ సేకరించి లోతుగా పరిశీలించి చూస్తే, మధ్యలో చనిపోయినవారు; అలరాజు, ఆయననుసరించివచ్చిన కల్యాణపురి, శివపురి యోధులుతప్ప మరొకరు లేనేలేరు. బ్రహ్మనాయుని అనుచరగణంలో ఏఒక్కడూ మధ్యలో గతించలేదనేది పల్నాటి చరిత్ర తెలుపుతున్న నగ్నసత్యం.

# బ్రహ్మనాయుని వరకట్నదాహం

మాచెర్లనేలు మలిదేవరాజు భార్య సిరాదేవి అత్తవారింటికి వచ్చు సందర్భంలో బ్రహ్మనాయుడడ్డుపడి, అరణంగా పెయ్యిగోవుల్ని, పెయ్యి గొర్రెల్ని, వాటితోపాటు ఆ మందల్ని కాసే గొల్లబంట్లనూ తెమ్మని ఒత్తిడిచేశాడు. సిరాదేవికి తప్పలేదు. ఆవిషయమిలావుంది.

వినుము సిరాదేవి విశదంబుగాను
నీతండ్రి సోముడు నిన్నంపునపుడు
అరణంబులిచ్చెడు అత్యాదరమున
గొల్లబంటుల చాల కోరితేవలయు
అనియిట్లు బ్రహ్మన్న అతివకు చెప్పె-[1]

అప్పుడు సిరాదేవి తండ్రిదగ్గరకు పోయి

అడిగె సిరాదేవి యరణమ్ములిట్లు
గుండుబోయని సుతులు గురుతైనవారు
రాయబోయండును రాయపడాలు
పడవాలు తమ్ముడు బాలగోవన్న
వారుముగ్గురుకూడి పరుసగాకాచు
గోవులుపెయ్యియు గొర్రెలుపెయ్యి
అల్లబోయలతోడ నరణంబు నాకు
నిచ్చివంపించుమీ యినకులేశ్వరుడ-[2] అని అడిగింది.

ఇదేవిషయాన్ని సిరాదేవితో పాటువచ్చిన ముగ్గురు గొల్లబంట్లలో ఒకడైన చెవులగోవన్న, కోడిపందెమునకు వెళ్ళే సమయంలో బ్రహ్మ

---

1) పలనాటి వీరచరిత్ర-పదకావ్యం-పింగళి లక్ష్మీకాంతం-పుట 68

2) పల్నాటి వీరచరిత్ర-పదకావ్యం-పింగళి లక్ష్మీకాంతం-పుట 69

నాయనకు, కల్యాణపురినుండి తామేవిధంగా సిరాదేవితోపాటు మాచెర్లకు వచ్చిందీ, ఆసమయంలో సిరాదేవిని బ్రిహ్మనాయడెలా బెదిరించిందీ వివరించాడు.

శ్రీ సిరాదేవికి చెప్పితివిట్లు
అరణంబు లిచ్చుచో నవనీశునడిగి
వస్తు వాహనతతుల్ వలదని నీవు
గొల్లబంటుల చాల కోరితేవలయు
తేకుంటివేన్ మలిదేవరాజునకు
పెక్కండ్రు దేవుల పెండ్లిండ్లుచేసి
నీమీద కృపమాన్పి నినుతలగింతు
అని బెదిరించిన నా సిరాదేవి
కడకునేతెంచిన కనుగొనియతడు-[1]

ఆరోజుల్లో రాజులెవరైనా స్వచ్ఛందంగా యిచ్చిన కట్నాలుంటే ఉన్నవేమోగాని, ఇలా బ్రహ్మనాయనిలా ఆడపిల్లల్ని పీడించి, బెదిరించి భయపెట్టి దౌర్జన్యంగా కట్నాలు గుంజినవారెవరూ, ఆనాడున్న ఏదేశ చరిత్రిలోనూ, కనిపించరు. కనుక కర్కశంగా రాక్షసంగా వ్యవహరించి ఆడపిల్లలచే కట్నాలు తెప్పించిన ప్రిబుద్ధులలో ఆంధ్రిదేశ చరిత్రిలో బ్రిహ్మనాయడే ప్రిథముడు. ఈకట్నపిశాచి ఈనాడింతగా గజ్జెకట్టి, అన్ని యిండ్లలోనూ వి ల య తా ం డ వ ం చేస్తున్నదంటే, దీనికి ప్రారంభోత్సవకర్త బ్రహ్మనాయడే!

ఇక తనకుమారుడు బాలచంద్రినికి మాంచాలనిచ్చి పెండ్లిచేసే సందర్భంలో వారి వంశాచారప్రికారం "ఓలి" (కన్యాశుల్కం) రెండు తూముల (కొ ల త లో తూ ము అ ం టే పదహారు మానికలు)

1) వలనాటి వీరచరిత్రి పదకావ్యం-పింగళి లక్ష్మీకాంతం-పుట 102

మాడలు(మాడఅంటే రెండురూపాయలు-అరవరహా) ఇచ్చేటట్లుముందుగా ఒప్పుకున్నాడు బ్రహ్మనాయడు. కాని, తీరా ఓలియిచ్చే సమయంలో నిజమైన తూముతో కొలిసి రాసిపోసిన రూకల్ని తూర్పారబట్టాడు. చిందిపోయిన రూకలన్నీ తాలూ, పొల్లూ అంటూ తానే తీసుకుని, చివరకు కర్రలేని గొడ్డల్ని తెప్పించి, ఆగొడ్డలి తూముతో రెండుసార్లు తలగొట్టి యిచ్చాడు. ఇదీ ఆనాటి బ్రహ్మనాయని ఔదార్యం. మాంచాలతండ్రి తనకెంత బావమరిది అయితేమాత్రం ఇంత లోభితనమా! దీన్ని అమోఘమైన చాతుర్యమని వర్ణిస్తారు పెద్దలు.

# నాయకురాలు నాగమ్మ కళాపోషణ

అల్లుడు అలరాజు అకాలమరణానికీ, కన్నకూతురు రత్నాలపేరమ్మ ప్రాణత్యాగానికీ, కుమిలిపోతున్న నలగామరాజుకు ఉపశమనం కలిగించటానికి, గురిజాల దర్బారులో నాయకురాలు నాగమ్మ నాట్య ప్రదర్శన ఏర్పాటు చేయించింది.

పండిత ఉమాకాన్త విద్యాశేఖరులవారు సేకరించిన పల్నాటి వీరచరిత్రలోని 72 పంక్తులసారాంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తె, నాగమ్మ పోషించిన కళోద్ధరణ; సంగీత సాహిత్య వికాసాలకు ఆమెచూపిన ఆదరణ ఎంత ఉన్నతమైనదో పూర్తిగా తెలియగలదు.

అన్నికులాలవలె ఆనాడు పల్నాటిలో వేశ్యాకులంగూడా వుంది. వారే రాజనర్తకులు. నర్తకీమణులైన వేశ్యలకు యినాములు, మాన్యాలు, రాజులు సమకూర్చేవారు. అంతేకాక ఈరాజనర్తకులకు ప్రదర్శన సమయాల్లో ప్రత్యేక గౌరవంతోపాటు బహుమతులు కూడా ఉండేవి.

వేశ్యల్ని తొమ్మిది భాగాలుగా విభజించాడు వాత్స్యాయనుడు. అవి 1. కుంభదాసి (అంట్లు తోమటంవల్ల జీవించే దాసి) 2. పరిచారిక (ఇంట్లో ఊడిగం చేసేది.) 3. కులట (భర్తనుకానకుండా వ్యభిచరించేస్త్రీ) 4 స్వైరిణి (భర్తను తిరస్కరించి వ్యభిచరించేది) 5. నటి (రంగస్త్రీ) 6. శిల్పకారిక (రజతతంతువాయాదిభార్య) 7. ప్రకాశవినష్ట (భర్త బ్రతికివున్నా గతించినా, అతనిని వదలి బహిరంగంగా అన్యసంగత యైనది.) 8. రూపాజీవ (రూపంమీద ఆధారపడి జీవించే వేశ్య.) 9. గణిక (రూపవతి, విద్యావతి, ధనవతి, కళాప్రవీణయైన వేశ్య.) [1]

అలరాజు మరణించిన మరునిముషంలోనే అంత్యక్రియలు జరిపించిన బ్రహ్మన్న వెంటనే మేడపినుండి పరిజనంతో బయెలుదేరి కారెమపూడి

---

1) పల్నాటి వీరచరిత్ర-పండిత ఉమాకాన్త విద్యాశేఖరులు-
ద్వితీయ భూమిక-పుట 60

కదనభూమికి చేరాడు. ఆ వెంటనే రణభట్టును చేరబిల్చి, గురిజాల నలగామరాజువద్దకు రాయబారమంపాడు. రణభట్టు గురిజాల చేరే సమయంలో; అక్కడ నలగామరాజు దర్బారులో రాజనర్తకులు నాట్యం చేస్తున్నారు. వారుచూపిన సంగీత నాట్యకౌశలం అనుపమానం. వారుచేసిన పేరణి, దేశిని, ప్రేంఖణ మొదలుగాగల సప్తతాండవాలు, ఆ సభను మంత్రముగ్ధుల్ని చేశాయి. శివారాధనకు చూపించు నర్తనాలను, విష్ణుపూజకు చూపించు అభినయాలనూ ప్రదర్శించి, ఆసభను ఆశ్చర్యపరిచారు. సంస్కృతాంధ్ర సమ్మిళతమైన గీతాలను, శృతివాక్యమైన గాత్రాలతో గొంతులెత్తి పాడుతుంటే, ఆపాటకు పరవశించి, లయవిన్యాసం చేస్తూ నర్తకీమణులు చేసిన నృత్యం ఆదర్బారుకెంతో శోభనిచ్చింది. వేశ్యావర్గంలోని కళాప్రవీణులైన ఈ "గణిక"లనే నాగమ్మ చేరదీసి ఆదరించింది. కాని శాసనోల్లంఘం చేసిన వేశ్యలను, విటులను కఠినంగా శిక్షించింది. పరమ వ్యభిచారియై, గజదొంగయై, తాను దోచినధనాన్ని కేవలం వేశ్యలకేయిచ్చే కొమ్మనికి రేవంతు బయళ్ళలో కొర్రుశిక్షను కఠినంగా విధించింది నాగమ్మ. ఇక బ్రహ్మనాయుడు మందాది మందపోటు అనంతరం గురిజాలపై తానొక్కడే దాడిచేయటానికి బయలుదేరిన సమయంలో, గురిజాల సమీపంలోని రేవంతు బయళ్ళలో కొర్రుశిక్షకు గురియైన ఈకొమ్మనను శిక్షకు గురికాకుండాచేసి, వైష్ణవమిచ్చిపంపాడు.

# వ్యభిచారాన్నీ చౌర్యాన్నీ విచ్చలవిడిగా సాగించిన బ్రహ్మనాయఁడు

బ్రహ్మనాయనకు కళలూ సాహిత్య పోషణలూ, శాస్త్రాలూ రుచించవు. వేశ్యామైత్రి ఆయనకు న్యూనతగా కనిపించలేదు. అసలీ ప్రవృత్తికి జీవంపోసి పెంచినవాడు; పల్నాటి చరిత్రలో మొదటివాడు బ్రహ్మనాయడే.

బ్రహ్మనాయనకు పెమ్మసాని ప్రియురాలు. అనుగురాజు కాలంలో సైన్యాధిపతియైన తెప్పలినాయడు, ఈ పెమ్మసానికి మగడు. ఇతనూ అనుగురాజు పూర్వులతోపాటు ఉత్తరదేశం నుండి దక్షిణాదికి వచ్చినవాడే. కాక ఈతని భార్యయైన పెమ్మసాని కొడుకే కన్నమదాసు. ఈ కన్నమదాసు బ్రహ్మనాయనకు దత్తపుత్రుడని ఒకరు, కరుణతో పుట్టాడని మరొకరు. కనుదృష్టితో పుట్టాడని యింకొకరు. బ్రహ్మనాయని ఔరసపుత్రుడని వేరొకరు; ఇలా ఎవరికి నచ్చిన భాష్యాన్ని వారు కల్పించారు. వీరంతా, బ్రహ్మనాయడు విష్ణ్వంశ సంభూతుడనే సంప్రదాయాన్ని కాదనలేక, భావదాస్యానికిలోనై, అసలు విషయాన్ని మరుగు పరచారు. అవతారపురుషుడని చెప్పుకుంటూ, లోలోపల బ్రహ్మనాయడు చేసే అక్రమ ప్రవర్తనల్ని బహిర్గతం చేయలేక భావదరిద్రులై పోయ్యారు. అయినా, అవతార పురుషులకు కూడా ఉంపుడు కత్తెలున్నారు కదా!

కన్నమదాసు జన్మరహస్యాన్ని గురించి, వీరభాగవత గ్రంథకర్త శ్రీ ముదిగొండ వీరభద్రకవిగారు (క్రీ. శ. 1862) కూడా చెప్పలేకనే ఈ విధంగా నిజం చెప్పారు.

కం॥ తెప్పల నాయుఁడనంగా
నొప్పు సమగ్ర ప్రతాపుఁడు రుబలుఁడని రా
జెవ్వడు మన్నించును బైఁ
గప్పిన కులమేల? బలము గలిగినఁజాలున్.

గీ॥ ఆ దివాకీర్తి కులజుని యగ్రమహిషి
ధర్మ గుణ సీమ పతిదేవతా లలామ
యఖిల కల్యాణ గుణధామ యఘ విరామ-
దళిత దుష్కర్మ కామ మాతంగ ధామ-

కం॥ చేడియ ఋతుమతియై పతిఁ
జూడక మూణ్ణాళ్ళు నుండుచో సిబ్బితిచేఁ
దోడుగ వసించి నాల్గవ
నాఁడుదకములాడి కోరె నాథుని జూడన్.

కం॥ అతరి బ్రహ్మనాయుం
డేతేరగ దైవఘటన మిదియని సంతో
షాతిశయంబున జేతః
ప్రీతిమెయింజూచె సుందరీమణి తొలుతన్.

తదనంతరంబ

కం॥ తొల్లిఁటివలెఁ బతితో న
వ్పల్లవ మృదుపాణి పంచ బాణాగమ ధ
ర్మోల్లాస మొప్ప రతులన్
గొల్లఁగ నోలాడెఁ దనదు కోరికదీరన్.

కం॥ ఆనాతి దౌహృదంబున్
బూని సులగ్నమునఁ గేంద్రమున గురుఁడుండన్
సూనునిగనెఁ బ్రాగ్దిక్పతి
భానుని గనుపగిది నెల్ల బాంధవు లలరన్.

కం॥ కన్నసుతుఁ బెన్నిధానముఁ
గన్న దరిద్రపతివోలెఁ గనుగొని యిఁక నా
కన్న సుభాగ్యులు లేరని
కన్నమనీడనెడు పేరుఁ గావించెదయన్. [1]

1) వీరభాగవతము-పద్యకావ్యము-మః దిగొండ వీరభద్రకవి-
ద్వితీయాశ్వాసము-పుటలు 55-56

ఇదీ బ్రహ్మనాయని నైతికప్రవర్తన. పూర్వకవుల వ్రాతల ప్రకారం, నిజంగా బ్రహ్మనాయని వరప్రభావంచేతనే పెమ్మసానికి సంతానం కలిగినప్పుడు, తన సొంతభార్యయైన ఐతమ్మ; సంతానంకోసం ఎన్ని నోములు నోచిందో, ఎందరి దేవతలను ఆరాధించిందో, ఎంతమంది పేద విప్రులకు పెళ్ళిళ్ళు చేసిందో....పాపం! పన్నెండేండ్లు ఆవిధంగా శ్రమ పడవలసిన పనేమిటి? ఆ వర మే దో బ్రహ్మనాయుడు ఆమెకు కూడా ప్రసాదిస్తే; ఆకాస్తకోరికా ఆమెకు కూడా తీరిపోవుగదా! సొంతయిల్లాలికి ఆమాత్రం కూడా ప్రసాదించలేకపొయ్యాడా, బ్రహ్మనాయుడు?

అయినా, ఐతమ్మ పట్టువీడక, అత్త శీలమ్మ ప్రోద్బలంతో, తోటి కోడళ్ళు సంతానం లేనివారై కూడా నిరాకరించినా, ఒక్కసంవత్సరంపాటు గజనిమ్మ వ్రతంచేసి, చివరికెలాగో చెన్నకేశవస్వామి దయవల్ల బాలచంద్రుణ్ణి కంటే, దానికి అనుమానం కలిగిందీబ్రహ్మనాయనకు. గండాన పుట్టినవాడు ఉండకూడదంటూ, బ్రాహ్మణులెవరో చెప్పారని, ఆబాలుణ్ణి ఒక పెట్టెలోపెట్టి, ఎవరికీ తెలియకుండా, చందవోలు దగ్గర సముద్రంలో పడవేసిరమ్మని, అర్ధరాత్రి తనపెద్దకొడుకు కన్నమదాసునే పంపాడు.

శిశుహత్య మహాపాపమని, అవతారపురుషుడైన ఆబ్రహ్మనాయనకు తెలియదా! ఇంతెందుకు? అసలావిధంగా చెప్పిన ఆబ్రాహ్మణులచేతనే శాస్త్రోక్తంగా శాంతియజ్ఞం చేయించి, ఆకాస్తకీడూ తొలగించవచ్చుగా, కీడు కలుగుతుందనిచెప్పే శాస్త్రమున్నప్పుడు, ఆకీడును తప్పించి విముక్తి కలిగించే శాస్త్రంకూడా ఉండవచ్చుగదా! దీనికి తనకేదో భార్యపై అనుమానముండి, అనవసరంగా బ్రాహ్మణులను రచ్చకీడ్చి, పసిబాలుని చంపవలసిన కర్మమేమిటి? నిజంగా యేబ్రాహ్మణుడైనా గండాన పుట్టిన బాలుణ్ణి చంపమని చెప్పగలడా! అసంభవం. దీనికంతకూ ప్రథమ కారణం, బ్రహ్మనాయుడు తన భార్య ఐతమ్మ శీలాన్ని శంకించటమే! ఇలా ఐతమ్మ శీలాన్ని శంకించి, నిజనిరూపణకు బ్రహ్మనాయుడు చేయించిన పరీక్షలెన్నో వున్నాయి. అవి కథకులుచెప్పే వీరగాథలలో స్పష్టంగా

తెలియగలవు. వాటినిక్కడ పొందుపరిస్తే, విస్తరమౌతుందనే భావంతో వదలటం జరిగింది.

ఇక ఈయన తమ్ముడే పేర్నీడు. మహాబలశాలి. యుద్ధవిద్యలో ఆరితేరినవాడు. చందోలు యుద్ధంలో రెండవ గొంకరాజును ఓడించి, బందీగా పట్టుకుని, అనుగురాజుకు అప్పజెప్పిన పరాక్రమశాలి. ఆచందోలులోనే, అనుగురాజు మైలమదేవిని వివాహమాడు సందర్భంలో గొప్ప నాట్యప్రదర్శన జరిగింది. అప్పుడొక తీయని కడాని, యొరులకు తెల్పరాని పనుల సురతాని, పైడంత పావసాని అనునామె

ఉ॥ ఈడెల మేటి కాంతికిక నెవ్వరు సాటన నొప్పుచుండున
పాటల గంధి మేని జిగివల్యెట లోపల దాగిలింత మూ
తాటల గబ్బి చన్గవ యొయారము పల్లవకోటికెల్ల నా
రాటము జేయనప్పురవరంబుననుండు మెఱుంగు చాడ్పునస్.

కం॥ పేర్నీని గాఢాహృదయో
దీర్ఘములగు తెఱవచూపులివి మదనుని యా
కర్ణాంత సహజకంబులె
వర్ధింపస్ గాకయున్న వాడిమిగలదే.

కం॥ మదనుండు పేరినీనిని
మదవతినిం గుఱియొనర్చి మార్గణసమితిన్
బొదవిన శిథిల పరస్పర
హృదయత నొప్పారియుండి రెంతయు వగలన్-[1]

ఈవిధంగా అనాచారప్రవృత్తికి అలవాటుపడిన పేర్నీడు, పావసానితో సంగమించటానికి అశ్వారూఢుడై చందోలుకు రాకపోకలు సాగిస్తూ ఉండేవాడు. ఈ రాకపోకలు రోజూ జరిగేవని గాథాకారులకథనమేగాక,

1) వీరభాగవతము-పద్యకావ్యము-ముదిగొండ వీరభద్రకవి-
ద్వితీయాశ్వాసము-పుట 53

వీరభాగవత గ్రంథకర్తకూడా పాపసానితో నిత్యశయవానికి పేర్నీడు చందోలు వెళ్ళేవాడని పొందుపరిచారు.

ఇక బ్రహ్మనాయనికుమారుడే బాలచంద్రుడు. ఐతమ్మకు లేకలేక కల్గిన ఒక్కగానొక్క బిడ్డడు. ఆ బాలచంద్రుని భార్య మాంచాల. రూపవతి, గుణవతి, శీలవతి. పైగా బ్రహ్మనాయనకు సొంత బావమరిది కూతురు. ఈ మాంచాలకూడా రేఖాంబా గండుకన్నమనీడులకు కల్గిన ఒక్కగానొక్క కూతురు. బాలచంద్రునికి మాంచాలతో వివాహం జరిగిందేకాని, ఒక్కసారైనా ఆమెవంక కన్నెత్తి చూసి యెరుగడు. వేశ్యతోనే అతని జీవితం ముడివడిపోయింది. అన్నపానాలు అన్నీ ఆవేశ్యయింట్లోనే.

ఇంతతెలిసికూడా, ఆబాలచంద్ర మాంచాలలిద్దరినీకలిపి మెట్టినిల్లైన తనయింట్లో సంసారం చేయించే ప్రయత్నంకూడా చేయలేదు బ్రహ్మనాయడు. అందుకే బాలచంద్రుడు తాడుతెగిన బొంగరంలా తిరుగ మరిగాడు. సబ్బసానిని మరిగి (సబ్బాయి) ఆవేశ్యాగృహానికే అంకితమై పోయ్యాడు. ఆవీధిలో ఆవెలకాంతకెంత భోగశుల్కం చెల్లించాడో ఊహకే అందనివిషయం. అది తగదని బ్రహ్మనాయడు ఒక్కసారైనా తనకుమారుణ్ణి మందలించిన పాపానపోలేదు. దానికి కారణం? తామూ అలాంటి అక్రమసంబంధానికి పాల్పడి, అనాచారకూపంలో కూరుకు పోయినవాడు కాబట్టేకదా! ఇంతేకాక, అసలు బాలచంద్రుని సంగడీలైన చాకలి చందూ, కుమ్మరి పట్టీ, వెలమల దోర్నీడూ మొదలైనయేడుగురూ బ్రహ్మనాయని అక్రమసంతానమేనను జనశ్రుతి పల్నాటిలో ఈనాటికీ వుంది. ఇది అనుమానాస్పదమే. అయినా శాస్త్రలోతుగా పరిశీలించాలి.

ప్రధాన మంత్రిగా రాజును సైతం శాసించగల్గి, రాజ్యాధికారాన్ని తన గుప్పిటలో పెట్టుకున్న దిట్టయైన బ్రహ్మనాయడు పెమ్మసానినీ, ప్రధానమంత్రికి తమ్ముడై, రాజాస్థానంలో ఉన్నతశ్రేణి నాక్రమించి, ప్రధాన కార్యపురుషుడైన పేర్నీడు పాపసానినీ, ప్రధానమంత్రి కుమారుడై, వంశగౌరవాన్ని నిలుపవలసిన బాలచంద్రుడు సబ్బసానినీ

మఱిగి, వ్యభిచారాన్నే కులాచారంగా పెట్టుకుని ఇంత నీచస్థితికి దిగజారి పొయ్యారంటే, ఇక అనాడు వల్నాడులో సామాన్యుని నైతికస్థాయి ఎంతవరకు కూలిపోయిందో, ఊహాతీతం.

అసలు బ్రహ్మనాయుడు, తానీ అనాచారవృత్తికి పాల్పడిందిచాలక, తన అనుచరులకు కూడా వేశ్యాబలగాల్ని పంపటం; వారి చేతనే దొంగతనాలు చేయించటం వంటి సందర్భాలు పలనాటి చరిత్ర లోతుగా పరిశీలించినవారికి తెలియకపోదు.

కోడి పందెంలో రాజ్యాన్ని కోలుపోయి, వలస వెళ్ళే సందర్భంలో తనవారినందరినీ దగ్గరకు చేర్చుకుని; వనవాసపు గడువు ఏడు సంవత్సరాలు ముగిసే వరకూ వారివారి భార్యలతో కలయికలుండ కూడదంటూ, కఠిన బ్రహ్మచర్యమే శరణ్యమని, ఆంక్షవిధించిన బ్రహ్మనాయుడు; వలస అనంతరం, మేడపి నుండి గురిజాల మీదికి తనదండుతో యుద్ధానికి వస్తూ, దారిలో మర్రివేముల, గుమ్మడంపాడు, గరికెపాడు, పమిడిపాడు, కంకణాలపల్లె గ్రామాలుదాటి సాయంకాలానికి మేళ్ళవాగు చేర్చాడు. అక్కడే గుడారాలెత్తించి దండుకు విడిది ఏర్పాట్లుకూడా చేయించాడు. అక్కడ మేళ్ళవాగులో ఆరాత్రి ఆదండుజరిపిన వ్యభిచారాన్ని దొంగతనాన్ని శ్రీనాధుడెంత విపులంగా వర్ణించాడో ఈక్రిందిపంక్తుల్లో సుబోధకమౌతుంది.

జారకామినులెల్ల సంతోషముగను
మగల నిద్దురబుచ్చి మనసులు బెదర
కెరలి విటులగూడి గృహములు వీడి
మించి సాహసమున మేరలు మీరి
తోడికోడండ్రును తోడివారలును
గురువులు బంధువులు గుర్తెరింగినను
నిందింతురనుశంక నిలుపక మదిని
వాగుల వంకల వనములయందు
ఇసుక దిబ్బలయందు నిరవైన పొదల
కుండెన కత్తెలు కూడి కాపాడ

మనసుల తమిమించ మదనుడావేళ
పూబాణములు వింటబూని సంధించి
మర్మముల్ నొవ్వంగ మాటిమాటికి నేయ
మంచిగంధముపూయ మనసు భీతిల్ల
పువ్వులు ముడువను బుద్ధియులేక
ఘన నఖిక్షతదంత ఘాతలువీడి
రతికూజితంబుల రంతులుమాని
బంధ చాతురియందు భావంబువిడక
కొందరు నేలను కొందరు నిలిచి
నయముతో కొందరు నానావిధముల
కొందరు కూర్చుండి కొందరు మమత
కలసిరి మేనుల కంపంబులలర;

ఇక చోరవృత్తి యీ విధంగా సాగింది.

చోరులు సాహస స్ఫూర్తుల తోడ
ప్రాణంబులకు దెగి భార్యల మరచి
బ్రతికి వచ్చెదమన్న భావంబు వదలి
పట్టణంబులయందు పల్లెలయందు
ధనికుల గృహముల తార్కొని దోచి
సారెకు దిరుగంగ సాగిరావేళ. [1]

ఇది ఊహాతీత భయంకర కామవిలాసం! ఉద్ధతి పెంచుకున్న కంచుకోత్సవం! స్వేచ్ఛగా జరుపుకున్న పరమలైంగిక వ్యాపారం! ఇంత సంస్కారహీనమైన దురాచారాన్ని, అవినీతి కాలవాలమైన వచ్చి దొంగతనాన్ని ఇంత విచ్చలవిడిగా జరిపించాడంటే బ్రహ్మనాయని చర్యలెంత నీచకృత్యాలో అర్థం కాకపోవు. యుద్ధసన్నద్ధులై వచ్చిన

1) పల్నాటి వీరచరిత్ర-బాలచంద్ర యుద్ధం-పండిత ఉమాకాన్త విద్యాశేఖరులు-పుట 8-9

వీరుల్లోవారి ఉత్సాహంకోసం ఇంత బరితెగించి ప్రలోభానికి దిగజారి పోయినవాడు, ఆంధ్రదేశచరిత్రలో మొదటివాడై, ఈవిధంగా గుర్తింపు పొందిన మహానాయకుడు ఈ బ్రహ్మనాయడేనేమో। ఆ నా టి నుం డే, యుద్ధానికి సైన్యాలు కదిలేటప్పుడు, వారి వినోదార్థం వేశ్యాబలగాన్ని వెంట తీసుకు వెళ్ళటం మొదలైంది. ఇలాంటి నైచ్యాలే చేయించి "దండుముండ" "దండులంజ" అనేపదాలకు శ్రీకారంచుట్టి ప్రాణప్రతిష్ఠ చేసిందికూడా బ్రహ్మనాయడే।

ఆ రోజుల్లో శైవమత ప్రచారం కోసం సాధారణ నీతిసూత్రాలకు కట్టుబడని మిండజంగాలు స్వేచ్ఛగా వ్య భి చ రిం చే వా ర ట. ఒక్క కల్యాణిలోనే వన్నెండు వేలమంది మిండజంగాలుండే వారనీ, వారికి కావలసిన వేశ్యల్ని బసవయ్య పంపుతుండే వాడనీ బసవ పురాణంలో ఉంది.[2] ఆ విధంగానే తన ప్రాబల్యంకోసం, తన కార్యసాధన కోసం ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించటమే కాక, నైతిక విశృంఖలత్వానికి కూడా పాల్పడినవాడు బ్రహ్మనాయడే।

---

2) ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర-ఏటుకూరు బలరామమూర్తి-
పుటలు 134-135

# బ్రహ్మనాయుడు చేసిన హత్యలు, చూపిన భయోత్పాతాలు

తీర్థయాత్రలకై చెన్నకేశవస్వామి విగ్రహాన్ని దౌర్జన్యంగా తరలించే సందర్భంలో అడ్డువచ్చిన అర్ధవీడు వీధుల పాపినీడును హతమార్చిన బ్రహ్మనాయనకు హత్యలు చేయటం వ రి పా టి గా మారిపోయింది.

అనుగురాజు గురిజాలను రాజధానిగా చేసుకుని పల్నాడును పరిపాలించే తొలి రోజుల్లో, మంత్రి దొడ్డనాయునితోపాటు, ఆయన రెండవ కుమారుడైన బ్రహ్మనాయుడు కూడా కొలువుకూటానికి వెళ్ళేవాడు. కొన్నికొన్ని సందర్భాల్లో, తండ్రి ముందుగా కొలువు కూటానికి చేరిన తర్వాత, బ్రహ్మనాయుడు తన అనుచరగణంతో బయల్దేరి వెళ్ళేవాడు. అలావెళ్ళే సమయాల్లో, తనకెదురుగా కనక తప్పెట్ల వాయిద్యఘోష, బూరకొమ్ముల పూరింతలు మారుమ్రోగుతుంటే, ఒకవైపు కాహళధ్వనులు, మరోవైపు ఢంజలనాదాలు కర్ణపుటాల్ని భేదిస్తుంటే, చుట్టూచేరిన యువజన సందోహం కోలాహలంగా జై కొడుతూ కరతాళధ్వనులతో ముందుకు సాగుతూవుంటే; అనుచరగణమంతా వీరావేశం విరుచుకు పడేలా, కర్రసాము, కత్తిసాములు గంభీరంగా ప్రదర్శిస్తుంటే, బ్రహ్మనాయుడు కాసెమీద వీరకాసె బిగించి దానిలో ఒకపిడిబాకును దోపి, భయంకర వాతావరణం ఉట్టిపడేలా పల్లటీలు కొడుతూ రాజసభా ప్రాంగణానికి చేరేవాడు.

అనుగురాజు రాజ్యాభిషిక్తుడైన తొలిరోజుల్లోనే పల్నాటికి నీటికరువు ఏర్పడింది. ఆ రోజుల్లో ప్రజలకు ముఖ్యమైన జీవనాధారం పశుసంపద. ఆ పశువులకు కొండల్లో మేత దొరికినా, వాటికి తాగేనీరు అందుబాటులో లేక బాధపడే రోజులవి. అందుకోసం ఆ ప్రాంతంలోనే ఒక చెరువును నిర్మించాలని అనుగురాజు మంత్రి దొడ్డనాయనకు కలిగింది. ఆ చెరువు నిర్మాణానికి నిర్ణయించిన స్థలంలో కొంతభూమి, నాగమ్మ తండ్రియైన చౌదరి రామిరెడ్డిది. దొడ్డనాయుడీవిషయం కబురుచెస్తే, తనపొలాన్ని యివ్వటానికి నిరాకరించాడు రామిరెడ్డి. ఈ విషయం తెలుసుకున్న బ్రహ్మనాయుడు, తన తండ్రి మాటను నిరాకరించిన రామిరెడ్డిపై కక్షబూనాడు.

ఓహో! ఇది కోలకు బుట్టిన కొత్తకొమ్ము
దీన్ని మూలమట్టం చేయకపోతే కాలమే కలిసిరాదు

అనుకున్నాడు. తన అనుచరగణాన్ని చేరబిల్చుకున్నాడు.

'పరికి పొదలో పావురాయి నక్కింది
గబ్బగిమూలో గబ్బిలాలై దూరి
ఏడు గడియల్లో ఎగదన్నుకు పోవాల'

అన్నాడు. ఆ రాత్రికి రాత్రే జిట్టగామాలపాడు చేరి, పక్కింటి వాడికి కూడా తెలియకుండ రామిరెడ్డి యింట్లో ప్రవేశించారు. అడ్డువచ్చిన నాగమ్మను నెట్టివేశారు. నిద్రిస్తున్న రామిరెడ్డిని ఆ మంచానికే కట్టి, దానితోనే పొందుగుల అడవుల్లోకి ఎత్తుకెళ్ళారు. అక్కడే ఒక చెట్టుకు వ్రేలాడగట్టి రాక్షసంగా ఉరితీశారు.

ఒక్కరాత్రి కథగా చెప్పుకునే ఈ కథను కడపజిల్లా బద్వేలు తాలూరా లింగాల దిన్నెపల్లె మేడం వెంకట్రాయుడు చెపుతుంటే ఎంతటి రోష విషాదాల్ని క్రక్కుతుందో చెప్పలేం.

కాలం వక్రించింది. జానపదగాధాకారులకు ఆదరణ మృగ్యమైంది. కాలగమనంలో కులవృత్తులకు పోషణకరువై, జీవన భృతికోసం రకరకాల దారులు వెతుక్కుంటూ దేశాలు పట్టారు జానపదులు. గానం చేసేవారు కరువై ఇలాంటి పూర్వగాధలన్నీ రానురాను జనశ్రుతిగానే నిలిచిపోయిన కాలం ఆసన్నమైంది. మరికొంత కాలానికి ఈ మాత్రం కూడా దక్కదేమో!

బ్రహ్మనాయునకు దైవత్వం అంటగట్టాలనే తపనతో ఇలాంటి చరిత్రాంశాలనుకూడా పొందుపరచక, వాటికి విలువకూడా దక్కనివ్వకుండా చేసి, అతిశయోక్తులూ, అభూత కల్పనలూ, మహిమలూ, మంత్రాలూ జోడించి, ఇతిహాస రూపంలో పురాణంలా ఇరికించి, అసలు జరిగిన చరిత్రకు చీడపట్టించి కావ్యాలను పూరించారు మనపూర్వులు. కొన్ని ప్రత్యేక ఆకర్షణలైన ట్రిక్కులు చమక్కులు జానపదుల గాధల్లోకూడా వుండవచ్చు. కాని చరిత్రకు చావులేదు కదా!

ఇక ఆధునికులు కూడా సమగ్ర పరిశీలన చేయక, ఇలాంటి కథలు నమ్మదగినవి కావని ఒకరంటే; మరొకరు అధునిక కల్పితాలని చెపుతూ, వారు మరొక కల్పనను సొంతవూహలతో సృష్టించి, చారిత్రక సత్యం కాకపోయినా, కవితా న్యాయమంటూ అసలు విషయాన్ని పక్కదారి పట్టించి, పఠితలను చీకాకు పరచి వారి న్యాయమేదో వారు సెలవిస్తున్నారు. అది అధునికం కాదేమో!

ఏది ఏమైనా, నాగమ్మకు బ్రహ్మనాయనిపై ద్వేషానికి కారణమంటూ ఒకటుండాలిగదా! కావ్యాల్లో లేనంతమాత్రాన కథకుల గాథల్ని, చివరకు పారంపర్యంగావచ్చే జనశ్రుతినీ కాదనటం ధర్మమా! అయినా పల్నాటి చరిత్రకు సంబంధించి, మనకు లభ్యమైన కావ్యాలలో కూడా భిన్నరీతులు కనిపిస్తున్నాయికదా! ఆకావ్యాలుకూడా ఒకనాటి కథకుల గాథల్ని ఆకళింపుచేసుకుని కొంతలో కొంత వ్రాయబడినవేకదా! ఎవరైనా తనకు లభ్యమైన పుస్తకాల్లో లేనంతమాత్రాన, తక్కిన చారిత్రకగాథల్ని సునాయాసంగా కొట్టిపారేయటం వెర్రితనం కాక మరేమిటి? అయినా, కారణంలేని కార్యముండదుగదా!

ఇదొక్కటేకాకుండా బ్రహ్మనాయడు తన అధిపత్యంకోసం చేసిన హత్యలుఇంకాలేకపోలేదు. అనుగురాజుకు నలగామరాజాదులెనమండుగురూ పుట్టకపూర్వం సంతతిలేని కారణంగా, తనమంత్రి దొడ్డనాయని పెద్ద కుమారుడైన బాదన్న (బాదరాజు, బాదమరాజు, అన్నపెద్దన్న, పెద్దనబాదరాజు ఈతనిపరముగా వినవస్తున్న పేర్లు)ను దత్తత తీసుకుని పెంచుకున్నాడు. కనుక ఈపెద్దన్నయే అనుగురాజు అనంతరం పల్నాటి సింహాసనమెక్కవలయునని దొడ్డనాయుడాశించాడు. కాని, అనుగురాజు అందుకు అంగీకరించకపోవుటచే, తన మంత్రిత్వాన్ని వదులుకుని, తన ద్వితీయపుత్రుడైన బ్రహ్మనాయని కప్పగించెననియు ఆ బ్రహ్మనాయడు అనుగురాజునూ, ఆతనితండ్రి దొడ్డనాయడినికూడా వధించి నలగామునిని సింహాసనమెక్కించెననియు రాబర్ట్ సీవెల్ అనే చరిత్రకారుడు వ్రాశాడు. ఆతని వ్రాతలనే సమీక్షిస్తూ ప్రముఖ చారిత్రక పరిశోధకురాలు శ్రీమతి వారణాసి యశోదాదేవిగారు

'The chronicle says that Dodda was bothered about his son : Brahmanayadu, who killed both Dodda and Alugu, and then enthroned Nalakama.'

కాని బ్రిహ్మనాయుడిట్లు రెండు హత్యలు చేయటానికి గల కారణం తెలియలేదని వ్యాఖ్యానించారు.

ఈపైనుదహరించిన ఇద్దరి వ్రాతలను సమీక్షిస్తూ ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావుగారు తనకు లభించిన కాెంపూడి తాళపత్ర ప్రతిలోని 105 బి. 106 ఎ. పుటలను ఎత్తిచూపిస్తూ....

నాగమ్మ వేటకువచ్చిన అనుగురాజుకు ఆతిథ్యమిచ్చి సత్కరించి అతని మెప్పును పొంది బ్రహ్మనాయునిపై కొన్ని కొండెములు చెప్పింది. అందులో ఒకటి బ్రహ్మనాయుడు తన తండ్రితో కలిసి సభలోనికి వచ్చి నప్పుడు అనుగురాజునకు నమస్కరింపకపోవుట, దానిని విశ్వసించిన అనుగురాజు, బ్రిహ్మన్న గర్వమునుగూర్చి, మంత్రియగు దొడ్డనాయనను ప్రశ్నించాడు. దొడ్డనాయుడీవిషయాన్ని బ్రహ్మనాయునికెరుకపరచగా, బ్రహ్మన్న తాను అవతార పురుషుడననీ, అందుచే తాను నమస్కరిస్తే అనుగురాజు మరణిస్తాడని చెప్పాడు. దాని నిరూపణకోసమే బ్రహ్మన్న అనుగురాజు సభలోనికి వచ్చాడు. అనుగురాజును సింహాసనంనుండి లెమ్మనిచెప్పాడు. ఆ సింహాసనానికి తాను చేతులెత్తి నమస్కరించాడు. వెంటనే ఆసింహాసనం పెళ్లున పగిలి ముక్కలై ఒకముక్క ఎగిరివచ్చి పక్కనే నిలబడివున్న అనుగురాజుకు తగిలింది. ఆదెబ్బతో అనుగురాజు మంచంపట్టాడు. అంత్యదశకు చేరిన అనుగురాజు తనను కైలాసానికి పంపమనీ, అలా పంపునప్పుడు, తనకు తోడుగా మరొకరిని పంపమనీ అబ్రిహ్మన్ననే వేడుకున్నాడు. అందుకా బ్రహ్మన్న కనికరించి, తన తండ్రిని రప్పించి, రాజునూ మంత్రినీ కలిపి ఒకేరథంలో పరలోకానికి పంపాడు.

హేతువాదదృష్టితో ఈకథను పరిశీలిస్తే బ్రహ్మనాయుడు తనతండ్రినీ అనుగురాజునూ హత్యచేశాడని నిశ్చయంగా చెప్పవచ్చు. బ్రహ్మ

నాయనియందమిత పక్షపాతముతో వ్రాయబడిన ఈపల్నాటివీరగాథలలో బ్రహ్మన్నకు దైవత్వమారోపింపబడి, అతను చేసే దారుణహత్యల్ని కప్పిపుచ్చే ప్రయత్నంలో తాను కోరినవారిని క్షణంలో కైలాసానికి పంపగల అలౌకిక మూర్తిగా చిత్రించటం జరిగింది. [1] అసలింతకూ అనుగు రాజుకు నాగమ్మ చెప్పింది కొండెమూ. నిజమూ.

ఇదే ప్రస్తావన సందర్భంలో శ్రీముడిగొండ వీరభద్ర కవిగారు, తన వీరభాగవతంలో ఈవిధంగా వ్రాశారు.

బ్రహ్మనాయడు పరశురామావతారుడనీ, అతను నమస్కరిస్తే వారిప్రాణాలు పోతాయనీ చెప్పుకొనుటచే నిజనిర్ధారణ దొడ్డనాయడు రాజసభలో ఒక ఉక్కుకంబాన్నీ మరొక గాజుకంబాన్నీ నిలిపి బ్రహ్మ నాయనను నమస్కరించమన్నాడు. అప్పుడు

కం॥ ఆయత భయముల నృపతిన్
బాయక సేవించు వీరభటులున్ దొరలున్
నాయకురాలుం గనుఁగొన
నాయఁడు నతిచేసి ధరణి నాధునిమ్రోలన్.

కం॥ మ్రొక్కిన గాజుంగంబము
గ్రక్కున ముత్తునియలయ్యె ఘనభుజుడు మఱన్
మ్రొక్కిన లోహపుయంత్రం
బక్కొలువునఁ జెక్కలగుచు నవనింబడియెన్.

ఉ॥ మూడవసారి హస్తములు మోడ్చిన నజ్జనపాలు వీపునన్
జూడినభంగి భగ్గుమనుచున్ వెసఁబుట్టె వ్రణంబు నొప్పిచేఁ
బోడిమిమాలి భూభుజుడు మూర్ఛిలె నంత సభాజనంబు లూ
టాడు మనంబులందరికి రంబుజ పత్రి జలంబుకై వడిన్.[2]

1) ఆంధ్రపత్రిక-దినపత్రిక-బ్రహ్మనాయని రాజనీతి-
డా॥ తంగిరాల వెంకటసుబ్బారావు ది. 29-6-69

2) వీరభాగవతము-ముదిగొండ వీరభద్రకవి తృతీయాశ్వాసము పుట 71

వీని నన్నిటినీ పరిశీలించి చూస్తే, బ్రహ్మనాయుడు తన తండ్రినీ, అనుగురాజునూ హత్యచేశాడనటంలో సందేహంలేదు. ఇందుకిపై విషయాలె సాక్ష్యం.

తన అన్న బాదన్నను అనుగురాజు దత్తత తీసుకున్న కారణంగా, పల్నాటికి రాజుకాగలడని తలంచిన బ్రహ్మనాయుడు ఆ బాదన్న క్రింద మంత్రిగం చెరపటం సిగ్గుచేటుగా భావించాడు. పల్నాటిపై తనకే పూర్తి ఆధిపత్యం కావాలనే దుర్బుద్ధితో మాయానాటకమాడి, ముందుగా రాజును పొడిచాడు. దానికభ్యంతరంచెప్పిన తనతండ్రినీ హతమార్చాడు, ఈచర్య పల్నాటి ప్రజల ఆగ్రహానికి గురియైంది. అప్పటికే బ్రహ్మనాయని బంధువర్గంలోని కొన్నిగృహాలు దగ్ధమయ్యాయి. చివరకు రాజధాని సమీపంలోని ఏడు గడ్డివాములుకూడా భస్మమయ్యాయి. ఇది గమనించిన బ్రహ్మనాయుడు మరోయుక్తిపన్నాడు. రాజకుమారులలో పెద్దవాడైనప్పటికీ పదమూడు సంవత్సరాల పసివాడు నలగాముడు. ఆ నలగామరాజును రాజుగాచేసి, తాను మంత్రిగా ప్రకటించుకున్నాడు. దానితో తిరుగుబాటు కొంతవరకు శాంతించింది. అప్పుడు జరిగిన దహనకాండను గురించి, అదంతా తన అవతార మహిమయనీ, అందుకే అవి పరశురామప్రీతి అయ్యాయనీ అభివర్ణించుకుని తనవారికి నచ్చ జెప్పుకున్నాడు. ఇది కథకుల కథనమైనా కాదనలేనినిజం.

ఇక కావ్యాల్ని పరిశీలించినా, పల్నాటి రాజులైన అనుగురాజాదులు కార్త వీర్యార్జునుని సంతతివారని చెప్పుకున్నారు. ఈ కార్త వీర్యార్జునుడు జమదగ్నిని చంపి ఆయన కుమారుడైన పరశురాముని కోపానికి గురియై, క్షత్రియ వినాశనానికి కారకు డయ్యాడు. అని ఆ కావ్యాల్లోనేవుంది.

పల్నాటి చరిత్రలో అనుగురాజు మంత్రియైన దొడ్డనాయుడును జమదగ్నిగా, ఆయన భార్య శీలమ్మను రేణుకాదేవిగా, వీరికుమారుడైన బ్రహ్మనాయడ్డి పరశురామునిగా వర్ణించటం జరిగింది. ఈ చిత్రణను పురస్కరించుకుని; కార్త వీర్యార్జునుని సంతతివాడైన అనుగురాజుకు, పరశురామావతారుడైన బ్రహ్మనాయుడు శత్రువుకాక మిత్రుడెలా

కాగలడు? శత్రువు కాపటం వల్లనే అనుగురాజును హతమార్చాడు. ఇది సహేతుకమేగదా! దీనిని బట్టియైనా బ్రహ్మనాయడు రాజహంతకు డనటంలో సందేహించ వలసిన పనిలేదు.

ఇన్ని హత్యలుజేసి మంత్రిగా స్థానమేర్పరుచుకుని పెత్తనం చెలాయించినా, చివరకు నాగమ్మ మంత్రిణియై, బ్రహ్మనాయడుదోచి దాచినధనాన్ని తన బంధువుల ఇండ్లనుండి తెప్పించి బయట పెట్టటంతో, తన కుటిలత్వం తనకే బెడిసి కొట్టింది. అయినా పట్టువీడక తన కొడుకు కన్నమదాసు నాయకత్వంలో గురిజాల కోటను దిగ్బంధం చేయించి, నలగామరాజును భయభ్రాంతుణ్ణి చేయించాడు. అదే సమయంలో పల్నాడును భాగించి పట్టపురాణి వీరవిద్యాదేవి బిడ్డలైన మలిదేవరాజులకు రాజ్యం పంచమని, ఆ కన్నమదాసునే నలగామరాజు వద్దకు రాయబార మంపాడు. ఆ స్థితిలో నెలకొన్న భయోత్పాతాన్ని భరించలేని నలగామరాజు కన్నమతో ఈ విధంగా వాపోయాడు.

కంఠమ్ముపై బ్రహ్మి ఖడ్గమ్ము మోపి
అన్నదమ్ముల పాళ్ళు అడుగగా నేల
నయశాలి యైనట్టి నాయుడు వచ్చి
ఎవరి భాగము వారి కిప్పింప దగును
కాదండునా నేను కన్నను చెపుమ.[1]

దీనినిబట్టి బ్రహ్మనాయడంటే నలగామరాజుకు ఎంతభయమో; ఎంతటి ప్రాణాపాయస్థితి సంభవిస్తే ఈ విధంగావాపోయాడో తెలుస్తుంది. ఇలా కోటను దిగ్బంధం చేయించి, నలగామరాజును భయభ్రాంతుణ్ణి చేసి చివరకు పంచుకున్న మాచెర్ల సీమకైనా మలిదేవరాజుకు పట్టం కట్టాడా? లేదు. మలిదేవులు పసిపిల్లలనేసాకుతో పదిహేను సంవత్సరాలు తానే పరిపాలన చేశాడు.

---

1) పలనాటి వీరచరిత్ర-పదకావ్యం-పింగళి లక్ష్మీకాంతం-పుట 53

ఆ వార్తవిని బ్రహ్మ యాత్మరంజిల్లి
పలనాడు రెండుగా భాగాలు పంచె
.... .... .... .... ....
మలిదేవు పేరిట మాన్యుడు బ్రహ్మ
పలనాటి నింపార పాలింపు చుండె.[1]

ఇన్ని హత్యలుచేసి, ఈ విధంగా సాధించి తనపాలన కిందికి తెచ్చుకున్న మాచెర్ల సీమతోనైనా తృప్తిపడక కోడిపందేలతో సహా రకరకాల ఎత్తులువేసి చిత్తైపొయ్యాడు. అరణ్య వాసంలో కూడా పందెంలో అనుకున్న నియమాల్ని పాటింపక, మాచెర్ల సీమలోని మందాదిలోనే రాపురాలు చేయించాడు బ్రహ్మనాయుడు. వళస నియమం తప్పారనీ, పుల్లరి చెల్లించలేదనీ మందపోటు చేయిస్తే; నలగామరాజు మీదికి దాడి చేయటానికి సన్నద్ధుడై మలిదేవరాజును అందుకు అనుమతికోరాడు. అప్పుడు మలిదేవుడు కూడా భయకంపితుడై తన అన్న నలగామరాజును కూడా చంపగలడేమోనన్న ఊహతో....ఈ విధంగా వాపోయాడు.

మసలక గురిజాల మరవక పొడుతు
.... .... .... .... ....
సెలవియ్య రాజేంద్ర సెలవియ్య రాజ
ఆమాట విని బాల మలిదేవరాజు
వినవయ్య నాయుడా నా విన్నవంబు
నీ చేతమృతిబొందె నపుడు నాతండ్రి
అనుగు రాజేంద్రుడు అతివేగమునను
మొక్కు వేసిన ఘనత మిక్కుటంబాయె–[2]

తనకు ప్రతికూలుడైన నలగామరాజు చెప్పటంలోనైనా ఔచిత్యముందేమోకాని, పూర్తిగా తనకు అనుకూలుడైన మలిదేవరాజు,

---

1) పలనాటి వీరచరిత్ర–పదకావ్యం–పింగళి లక్ష్మీకాంతం–పుటలు 53–54
2) ఆంధ్రప్రభ–దినపత్రిక–బ్రహ్మనాయని రాజనీతి–
డా॥ తంగిరాల వెంకట సుబ్బారావు 29–6–69

తన తండ్రి అనుగురాజును 'నీవేచంపావ'ని బ్రహ్మనాయనితోనే చెప్పటంలోని ఆంతర్యం పరికించి చూస్తే; తన స్వార్థం కోపం బ్రహ్మ నాయడెంతటి రాజహంతకుడో స్పష్టంగా తెలుస్తుంది.

బ్రహ్మనాయని పోరాటంలో పట్టూ విడుపులుండవు. అతనొకచోట హత్యారాజకీయం చేస్తే; మరో చోట ధూర్తరాజకీయం నెరపుతాడు. ఎత్తులపై ఎత్తులతో కసరత్తు చేసి స్వార్థం కోసం వెంపరలాడే బ్రహ్మన్నకు, అభిమానవర్గం, అనుచర యోధగణం, ఆపెనుక రహస్య భటవర్గం నిండుగా వుండేది. కఠోరవాస్తవాల్ని కప్పిపుచ్చినా, కట్టుకథల్ని పరమ సత్యాలుగా వినిపించినా, కారణ మడిగే ధైర్యంలేక, కుక్కిన పేనుల్లా పడివుండేవారు. కళ్ళుండీ కబోదుల్లా, చెవులుండీ బధిరుల్లా నటించవలసిందే గాని, స్వేచ్ఛగా, నిర్భయంగా అభిప్రాయాలను వెల్లడి చేసే స్థితిలోలేని మూగజీవులువారు. ఇక మలిదేవరాజా! నోరువిప్పే ధైర్యమున్నా తన ప్రాణభయం తనది.

అవతారపురుషుడనే పేరుతో అమాయకుల్ని చేరదీసి, అంధ విశ్వాసులనుగా తయారుచేసి తానాడవలసిన నాటకమంతా ఆడాడు బ్రహ్మనాయడు. వారామైకంలో పడిపోయి, మంత్రించిన మరబొమ్మల్లా తయారై, అతను చెప్పిందే సత్యమని నమ్మారు. విధిగా అతని ఆజ్ఞను పాటించారు కొందరు, మరికొందరు ఆతని అధికారానికి బందీలై ఎదిరించే సాహసంలేక జీవనభృతికోసం అతనికి పూర్తిగా తలలువంచారు. ఇక పద్మనాయకులంతా బ్రహ్మనాయని బంధువర్గమేగదా! వారిస్వార్థం వారిది. వారి రాబడికేమాత్రం లోటురాకుండా చూసుకోవటానికి బ్రహ్మ నాయనకు బ్రహ్మరథంపట్టే భజనభక్తులు వారు. దైవాంశ సంభవుడనే పేరుతో కొందర్ని అధికారదర్పంతో భయోత్పాతాన్ని సృష్టించి కొందర్ని ధనసంపాదనకు దాసుల్ని చేసి మరికొందర్ని ఉపయోగించుకొని తానుచేసే అక్రమకార్యాలను యథేచ్ఛంగా సాగించాడు బ్రహ్మనాయడు.

నిజానికి నలగామరాజు తల్లియైన మైలమదేవి తానుతెచ్చుకున్న స్త్రీధనమేకదా పల్నాటిరాజ్యం. కనుక తండ్రియైన నలగామరాజు

అనంతరం పల్నాటి రాజ్యానికి తనకూతురు పేరమ్మేకదా వారసురాలు. ఆమెపేరుమీదుగా కాబోయేపల్నాటిరాజు ఆపేరమ్మభర్తయైన అలరాజుకాక మరొకరెలాకాగలరు? అకారణంగానైనా తండ్రికొడుకులైన కొమ్మరాజు అలరాజులు నలగామరాజుపై మమతానురాగాలు వున్నా లేకపోయినా, చివరకు సింహాసనం సిద్ధించేవరకైనా నలగామరాజుతో సఖ్యతగా వుండి మసలుకోవచ్చుగదా! అలాకాక, మలిదేవరాజును తనవక్షం చేసుకుని, అంతకుపూర్వం ఎలాంటి విభేదాలులేని రాజపుత్రుల్లో విభేదాలు సృష్టించిన బ్రహ్మనాయడితో సఖ్యత పెంచుకుని నలగామరాజుతో విరోధం పెట్టుకోవలసిన అవసరమేమిటి, మంత్రియైన బ్రహ్మనాయనకు ఆజ్ఞా బద్ధులై మెలగవలసిన కర్మమేమిటి? మలిదేవరాజు భార్యయైన సిరాదేవి అలరాజుకు మేనత్తేరావచ్చు, అంతమాత్రాన యేకారణం లేకుండా కట్టుకున్నభార్య గడపైనా తొక్కకపోవటానికి అలరాజుకు పట్టిన దుర్గతి యేమిటి? ఏదోషమూ ఎరుగని రత్నాలపేరమ్మ పుట్టినింట్లోనే ఉండి పోవలసిన కారణమేమిటి? ఇదంతా మలిదేవరాజును పసివాణ్ణిచేసి, మాచెర్లపై పెత్తనంచేపట్టి, పరమనియంతగా చెలాయించిన బ్రహ్మనాయుని దుష్టకార్యఫలితమేకదా! అతని దుశ్చర్యలమూలంగానే కదా, అలరాజుకు అకాలమరణం సంభవించటం; దానితోపాటు ఏపాపమూఎరుగని రత్నాలపేరమ్మ జీవితంకూడా అడవిగాచిన వెన్నెలై, చివరకు అలరాజు మరణంతో పతితోపాటు చితినెక్కి సహగమనం చేయవలసివచ్చింది.

ఒకనాడు బ్రహ్మనాయడు తన ఆధిపత్యంకోసం అనుగురాజును చంపితే, పట్టపురాణి విద్యలదేవివున్నా, తనఆస్తికి హక్కుదారుడు కాబట్టే మైలమదేవి సహగమనం చేసింది. ఈనాడే అదేఆస్తికి వారసుడైన అలరాజును అకాలమృత్యువుపాలుజేస్తే పేరమ్మకూడా సహగమనంచేసింది. ఇలా మైలమ్మ పేరమ్మల సహగమనాలకు కారకుడు బ్రహ్మనాయడేకదా!

# చాపకూడు – బ్రహ్మనాయుడు

పల్నాటి చరిత్ర 12వ శతాబ్దంలో జరిగింది. 15వ శతాబ్దపు పూర్వార్థంలో శ్రీనాథుడాచరిత్రను ఇతిహాసరూపంలో మంజరీ ద్విపద ప్రబంధంగారచించాడు. అదేచరిత్ర ఆ శతాబ్దపు ఉత్తరార్థంలో ఓరుగల్లు (వరంగల్)లో ఆడుతూ పాడబడింది. ఆ ఆటపాటను తిలకించి, ఆలకించి, వినుకొండ వల్లభరాయుడు వీధినాటక విశేషంగా, ఏకాశ్వాస ప్రబంధమైన తనక్రీడాభిరామంలో పద్యరూపకంగా ఒక ఘట్టాన్ని గ్రంథస్తం చేశాడు. కథాఘట్టం చిన్నదైనా, పన్నెండవ శతాబ్దిలోని పల్నాటి చరిత్రకు సంబంధించిన ఎన్నో విషయాలు అందులో వివరింపబడ్డాయి. ఆ తర్వాత కొండయ్య మల్లయ్యలేకాక మరెందరో పల్నాటి చరిత్రను ద్విపద కావ్యాలుగా వ్రాశారు. గతశతాబ్దం (క్రీ. శ. 1862)లో ముదిగొండ వీరభద్రకవిగారు పద్య ప్రబంధంగా పల్నాటి చరిత్రను వ్రాశారు. ఇక వర్తమాన కాలంలో వ్రాసిన నవలలు, నాటకాలు, బుర్రకథలు, కావ్యాలూ; తీసిన సినిమాలూ ఉన్నాయి.

ఒక్క క్రీడాభిరామంలో తప్ప, తక్కిన పూర్వకవులు వ్రాసిన అన్నిగ్రంథాల్లోనూ అతిశయోక్తులూ, అభూతకల్పనలూ, మాయలూ, మహిమలూ, మంత్రాలూ విపరీతంగా ఉన్నాయి. అవన్నీ హేతువుకు అందవు. కనుక యథార్థాలుకావు. వానిలో సహేతుకమైన అంశాలే యధార్థాలుకావు. అవే చరిత్రకందాయి. శాసనాధారాలతో చాలావరకు నిలిచాయి.

పూర్వకవుల కావ్యాలలో బ్రహ్మనాయడు అవతారపురుషుడనీ, అపర పరశురామావతారుడనీ కీర్తించి ఆనాటిప్రజల్ని నమ్మిస్తే; అవి ఎలాగూ ఈనాడు హేతువుకందవు కనుక, వర్తమానరచయితలు కొందరు ఆవదాలను పూర్తిగా ఎత్తివేసి మరొక కొత్తవ్యూహాన్ని పన్నారు. వారి స్వార్థమేమిటోకాని, బ్రహ్మనాయుని వ్యక్తిత్వాన్ని ఘనంగా కీర్తించారు. పురాణపురుషుడు అనేపదాన్ని పూర్తిగా ఎత్తివేసి; గొప్ప సంఘ సంస్కర్తగా రూపుదిద్దారు. అందులో మిక్కిలిగా ప్రశంసలనందుకుని బ్రహ్మనాయనకు ఎనలేని కీర్తినార్జించిపెట్టింది 'చాపకూడు'

బ్రహ్మనాయుడు కుల రహిత సమాజం కోసం పాటుబడ్డ మహనీయుడనీ, చాపకూడు పేరుతో అన్ని కులాలవారినీ ఒకచోట జేర్చి సహపంక్తిభోజనాలు యేర్పాటుచేసి సమతకు పట్టంకట్టిన శ్రేయోకాముకుడనీ, గొప్ప సంఘ సంస్కర్తయనీ చాలామంది అభిప్రాయం.

బ్రహ్మనాయుడు పెట్టించాడని నూతనంగా సృష్టింపబడ్డ ఈ 'చాపకూడు' అనేపేరు బ్రహ్మనాయనకు అపాదింపకపోతే, ఇక పల్నాటి చరిత్రలో ఆయనకున్న స్థానమేమిటి? అందుకే బ్రహ్మనాయుడు మళ్ళీ పదికాలాలపాటు ప్రజల మనసుల్లో నిలవాలంటే ఈ నూతన సృష్టి అవసరమైంది ఈనాటి చాలామంది రచయితలకు ఇది రానురాను విపరీతమై, ఈనాటి సహపంక్తి భోజనాలకు, అనాడు 12వ శతాబ్దిలో బ్రాహ్మనాయుడు పెట్టించిన చాపకూడే ముఖ్యమైన మూలాధారమనీ, ఆ చాపకూడునే ఆదర్శంగా తీసుకుని ఈనాటి పెద్దలు సహపంక్తి భోజనాలనే పేరుతో సాగిస్తున్నారనీ చెప్పటంతో, ప్రజలంతా పల్నాటి బ్రహ్మన్నకు నీరాజనాలర్పిస్తున్నారు. ఇది ఎంతవరకు నిజమో పరిశీలించవలసిన అవసరం ముఖ్యం.

ఈ చాపకూడనేది అష్టాదశ వర్ణాలు కలిసి చేసిన సహపంక్తి భోజనమనీ, దానిని మొదట బ్రహ్మనాయడే పెట్టించాడనీ పల్నాటి చరిత్రను అందించిన వర్తమాన రచయితల్లో కొందరి కథనం. పూర్వకవుల వ్రాతల్లోగాని, జానపదుల కథాగానాల్లోగానీ ఎక్కడా ఈ చాపకూడు అనే పదం కనిపించదు, వినిపించదు. ఒక్క క్రీడాభిరామం అనే గ్రంథంలో రెండు పద్యాలలో వున్న నాలుగు పంక్తుల్లో మాత్రం, పల్నాటి యుద్ధానికిగల కారణాల్లో చాపకూటి కుడుపుకూడా ఒకటి, అనివుంది. అందులోనూ ఆ చాపకూడు బ్రహ్మనాయుడు పెట్టించినట్లు లేనేలేదు. ఆ పద్యపాదాలివి.

1) ఇచ్చోట భుజియించి రేక కార్యస్థులై
సామంత నృపతులు చాపకూడు....(ప. 122 ఎమెస్కో)

2) ఆరువల్లి నాయినారి (నాయురాలి) దుర్మంత్రంబు
కోడిపోరు, చాపకూటి కుడుపు
ప్రథమ కారణములు పల్నాటి యేకాంగ
వీరపురుష సంప్రహారమునకు... (ప. 119 ఎమెస్కో)

బ్రహ్మనాయడి చాపకూటి సిద్ధాంతమనీ, అదే సంఘసంస్కరణ మనీ, పల్నాటి చరిత్ర నందించిన ఈతరం రచయితలందరికీ ఈనాలుగు పద్యపాదాలే ఆధారమనటంలో అప్పటివారికి సందేహంలేదు. అంతకు తప్ప వారికి మరోమార్గంకూడా లేదు. వీనిలో మొదటసూచించిన రెండు పాదాల్లోనే 'సామంత నృపతులు సాగించిన చాపకూడు' అని స్పష్టంగా నిర్దిష్టంగా వుంది. అలాంటప్పుడు ఆచాపకూడు సర్వమత సకలకుల సహపంక్తిభోజనమెలాఅయిందో దురవగాహం.

అనుగురాజు పరిపాలనాకాలంనుండి కారెమపూడి యుద్ధంవరకూ సాగిన పల్నాటి చరిత్రకాలంలో; పల్నాటిరాజులూ, సామంతనృపతులూ కలిసి చేసిన చాపకూడు వేరువేరుస్థలాల్లో, వేరువేరు కారణాల మూలంగా రెండుమారులు జరిగినట్లు కథకుల గానాల్లోనూ, కొన్ని కావ్యాల్లోనూ ద్యోతకమౌతుంది.

కోడిపందెంలో ఒడిపోయిన బ్రహ్మనాయుడు తన వలసజీవితాన్ని పల్నాటిలోని మండాది అనే గ్రామంలోనే ప్రారంభించాడు. ఇది పందెపు నిర్ణయానికి విరుద్ధం. వలసజీవితం యేడేండ్లూ పరదేశంలో జరగాలని నిర్ణయమైతే; పల్నాటిలో పైగా మాచెర్లరాజ్యంలోనిదైన మండాదిలోనే సాగించటం నాయకురాలికీ, నలగామరాజుకూ యిష్టంలేదు. ఇక రెండవ కారణం ఇలా

'పందెమొక్కటికాదు బ్రహ్మనాయకుడ
గోవులేనుగులును గుఱ్ఱముల్ ధనము
లాదిగా గురిచేసి యాడెదమ'నిన
నాయుడామాటలకు నవ్వుచుననియె
'వెరపిడు మాటల వెరవంగనేల
ఇంతి! నేనిచ్చెద నేపందెమైన
పెట్టుము నీకింత ప్రియమయ్యెనేని
అది తప్పెదవేని నేనాడలే'ననిన
నాయరాలుబ్బుచు నలగాముచేరె-[1]

ఇది పందవనిర్ణయమైతే, అదంతా త్రోసిపుచ్చి, గుర్రాలనూ, పశువులనూ, సమస్త సంపదనూ, చివరకు చెన్నకేశవస్వామి భూషణాలను కూడా ఒలుచుకుని[2] తీసుకొని వెళ్ళిపోవటం నలగామరాజుకుబాధాకరమైంది. ఈచర్యలన్నీ పందెపునిర్ణయాలకు ఇలా విరుద్ధంగా వుంటే; పైగా మండాదిలో నాలుగు సంవత్సరాల నుండి వుంటూ, పల్నాటి అడవుల్లోనే మేపుకున్న పశువులకు పుల్లరికూడా కట్టకపోవడం మరీ కోపకారణమైంది. అందుకు ప్రతిగా పశువులను బందెపెట్టమని అర్ధవీటి వీధుల పల్నేడును కొంతమంది సాయుధులతో మండాదికి పంపాడు, నలగామరాజు. పశువుల కాపరులు ఆచర్యను నిరాకరించిన కారణంగా పోరుసంభవించింది. ఆపోరులో వీధుల పల్నీడుతోసహా కొందరు పశువుల కాపరులూ చచ్చారు. పల్నీడు చావుతోపాటు కన్నమదాసువచ్చి ఎదుర్కోవటంతో నాయకురాలు నలగామరాజుల ప్రయత్నం విఫలమైంది.

ఇన్ని తప్పులుచేసిన బ్రహ్మనాయడు, తనకు తానుగా సరిదిద్దు కొనటం మానివేసి, నలగామరాజు చర్యనే గర్హించాడు. మహోగ్రుడై తానొక్కడే గురిజాలమీద దాడిచేసి, కోటను సాధించాలని భీకర ప్రతిజ్ఞ చేశాడు. ప్రతిజ్ఞాఫలితం ఎలావుంటుందో, తన అన్నలకు ఏకీడు

---

1) పలనాటి వీరచరిత్ర-పదకావ్యము-పింగళి లక్ష్మీకాంతం-పుట '44
2) పలనాటి వీరచరిత్ర-పదకావ్యము-పింగళి లక్ష్మీకాంతం-పుట 190

మూడుతుందోనని మలిదేవరాజు భయపడ్డాడు. ఆదాడిలో తనఅన్నలను సంహరింపవద్దనిబ్రహ్మనాయనను అభ్యర్థించాడు.[1] అఅభ్యర్థనను మన్నించి గురిజాలమీదికి దండెత్తబోయాడు. ఆరాత్రి గురిజాల ఇష్టకామేశ్వరి ఆలయంలో బసచేశాడు. తెల్లవారుజామున గుడిపూజారి తంబళ్ళపెద్దు (ఇతడే అలరాజుకు విషపుష్పాల నిచ్చి చంపిన కొమ్మ జియ్యరు.)కు ఆనవాలిచ్చి, తాను గురిజాలమీదికి దండెత్తడానికి వచ్చినట్లు నలగామ రాజుతోచెప్పి ఊరంతా చాటింపుచేయమని పంపాడు.

ఉదయం ఏడుఘడియలు దాటగనే యుద్ధానికి సిద్ధమై బయలు దేరాడు. గుర్రాల్ని, ఏనుగుల్ని, వేలాదివీరుల్ని సంహరించాడు. కోటచుట్టూ వున్న అగడ్తనుదాటి కోటలో ప్రవేశించాడు. అంతఃపుర రక్షకులైన గమికాండ్లను నరికివేశాడు. చివరకు బ్రాహ్మణుల వినతిమేరకు గంగగుడిలో దాగివున్న నలగామరాజును క్షమించి తిరిగి మండాది చేరాడు. కొందరు కథకులు గురిజాలను బ్రహ్మనాయుడు కాల్చి వేశాడంటాడు.

మనుష్యులకు దైవత్వాన్ని అంటగట్టడం నేరం మాత్రమేకాదు; పాపం. మనిషిని భగవంతుడితో పోల్చవచ్చు. కానీ భగవంతుడిలాంటి ఊహకందని లీలలు చూపించకూడదు. అదే చరిత్రచేసుకున్న పాపం. అభూతకల్పనలులేని చరిత్రే సజీవచరిత్ర. బ్రహ్మన్న వీరుడేకావచ్చుగాక కానీ ఒక్కడే గుర్రాల్నీ, ఏనుగుల్నీ, వేలాదివీరుల్నీ సంహరించాడని వున్న అతిశయోక్తులు ఎత్తివేయుటం మంచిదనపించటంచేత ఆ Gossip జోలికి నేను పోలేదు.[2]

---

1) పలనాటి వీరచరిత్ర-పదకావ్యము-పింగళి లక్ష్మీకాంతం పుటలు 224-225

2) పల్నాటి వీరచరిత్ర-వచనకావ్యం-చిట్టిబాబు పుట 108

నిజానికి ఒక్కనిజేసి దొమ్మీగా చంపటం పరోక్షంగా పరాజయాన్ని అంగీకరించడమేనని నాయకురాలు నిశ్చయించుకున్నది. అందుకే తన సైన్యాలను అస్త్రసన్యాసం చేయించింది.[1] అదికానిచో బ్రహ్మనాయడు పెద్దవాడనే గురుభావంతో సైనికులు ఎదుర్కొనకపోవచ్చు. ఏదియేమైనా ప్రతిఘటన లేకపోవటంతో, బ్రహ్మనాయడు అంతమందిని కాకపోయినా, కొందరినైనా నిర్జించియుండవచ్చు. ఇది నిజం కాకపోదు. కథకులుకూడా, నాయకురాలు తన సైన్యాన్ని అస్త్రసన్యాసం చేయించిందని చెపుతారు. ఏది యేమైనా బ్రహ్మనాయడు గురిజాలలో భీభత్సాన్ని సృష్టించి మండాదికి వెళ్ళాడనటంలో సందేహంలేదు. ఇంత చేసినా బ్రహ్మనాయనకు మండాదిలో కాపురాలు చేయడం బాధాకరమైంది. వెంటనే సమస్తాన్నీ తరలించుకుని శ్రీశైలం చేరాడు. అప్పుడు శ్రీశైల ప్రాంతాన్ని హొయసల మాకరాజు పాలిస్తుండేవాడు. అక్కడ బ్రహనాయడు, మలిదేవరాజును ఆమాకభూపతికి పరిచయం చేస్తూ....

ఆ: వె: వీరి అగ్రజాతులారసి యొక నాగ
సాని యనెడి పేరి చానఁదెచ్చి
కలుషమాత్మలోనఁ గలిగి ప్రాడి ద్యూత
పణమునందు నోర్చి పరిభవించి

కం: ఏడబ్దములు ప్రవాసం
బోడక సేయంగఁబంచి దుర్వీశ్వర! పె
క్కాడంగనేల నీతో
జోడుగ రాజ్యంబుసేయఁ జూడుము నన్నున్

ఆ: వె: పూని విభుతగాంచి పువ్వులమ్మిన యూరఁ
గట్టెలమ్ము వాని కరణినింక
రాజ్యమేలి పిదప రాజసం బెడఁబాసి
దైన్య వృత్తినుండ ధర్మమగునె

1) ఆంధ్రప్రభ-సచిత్ర వారపత్రిక-అగ్నిపునీత-అల్లాదేవి ది 16-6-82

అదియునుంగాక

కం: లక్షయు నెనుబదివేలుప
లక్షింపంగ రామమాడలకుఁ గుదువంగ నే
నిక్షేపించెద సర్వ వి
పక్ష మదచ్ఛేదకంబు పరమాయుధమున్

అ: వె: వలసెనేని యింక వనమాల జపమాల
కుదువంగాగ నుంచుకొనుము వీని
విత్త మొసంగి మేము విడిపించు కొనుదాక
సంభ్రమమునఁబూజ సలుపుమయ్య-[1]

ఆ విధంగా లక్షా ఎనభై వేల రామమాడలకు కుదువబెట్టిన నృసింహ కుంతమనే తన ఆయుధాన్ని, తిరిగీ ధనమిచ్చి తాకట్టు విడిపించుకునే వరకు అమాకరాజు వద్దనే ఉండునట్లు బ్రహ్మనాయుడు కోరాడు. అందుకు మాకరాజుగూడా అంగీకరించాడు. దానికి బదులుగా....

సీ॥ అద్దిడు బద్దిడు అడవి జమ్ములపల్లె
కలరోడుపురి మారకాపురంబు
దున్న పోతులపల్లె దూపాడు కొలుకుల
ఎగువపాలెంబును దిగువపాలె
మన్న సముద్రంబు చిన్ని కొల్కుల గొల్ల
పల్లియు మరి వీరభద్రపురము
కోనభీములపాడు కొచ్చెర్ల కోటయు
సదగోడు ముటుకుల చాపమడుగు

1) వీరభాగవతము-ముదిగొండ వీరభద్రకవి-పుట 145

గీ: హర మహాక్షేత్ర మా త్రిపురాంతకంబు
రమణ నాకుల గణపవరం బనంగ
మేడిపియనంగ ఇరువదిమీద రెండు
పల్లియలకు గొనుండు అధిపత్యమవని. [1]

అలా అధిపత్యమిస్తూ నిర్ణయించుకున్న తాకట్టును నిర్ధారించటానికి, ఆ మాకరాజు, సామంతనృపతుల (సంస్థానీకుల)ను రావించాడు. వారిని దువ్వలేరు (ఈవాగు ప్రకాశం జిల్లా) ధూపాటి సీమలోని యర్రగొండపాలెం సమీపంలోవుంది) ప్రాంతానికి చేర్చాడు. ఆ నదిఒడ్డున చాపలు పరిపించి భోజనాలు యేర్పాటుచేశాడు. భోజనాల అనంతరం తాంబూలాలు సమర్పించాడు. బ్రహ్మనాయడూ, తానూ నిర్ణయించుకున్న శాసన పత్రాలపై ఆ సామంత నృపతులచే సాక్షిసంతకాలు చేయించాడు. అలా దువ్వలేరు సమీపంలో చాపకూడు భుజించటం వల్లనే ఆచోటు చరిత్ర ప్రసిద్ధిగాంచింది. ఆ తర్వాత అక్కడ నిర్మించిన గ్రామానికి 'చాపలమడుగు' అనే పేరు సార్ధకమైంది. నేటికీ ఆగ్రామం చాపలమడుగు అనే పేరుతోనే పిలువబడుతుంది. [2]

ఇది మొదటిసారిగా పల్నాడిరాజులు, సామంతనృపతులు కలిసి భుజించిన చాపకూడు. అయినా ఇది బ్రహ్మనాయుడు పెట్టించిన చాపకూడు మాత్రంకాదు. బ్రహ్మనాయుడు, ఆయన అనుచరుల జీవనభృతికోసం సాగించిన చాపకూడు. ఈ చాపకూడుమాత్రం పల్నాటి యుద్ధానికి దారి తీసింది కాదు.

ఇక రెండవమారు జరిగిన చాపకూడు :-

---

1) వీరభాగవతము-ముదిగొండ వీరభద్రకవి-పుట 146
2) చెన్నకేశవ క్షేత్రమహాత్మ్యము -
సూరపరాజు వేంకట్రామయ్య పుట 20

బ్రహ్మనాయని వలసజీవితం ఏడుసంవత్సరాలు దాటి ఏడునెలలు గడిచింది. మాచెర్ల రాజ్యంకోసం రాయబారమంపిన అలరాజు చెర్లగుడిపాడులో హత్య గావింపబడ్డాడని తెలుసుకున్న బ్రహ్మనాయడు వెంటనే నలగామరాజుపై యుద్ధాన్ని ప్రకటించాడు. వలసలో వారుంటున్న మేడపి కోటరక్షణ బాధ్యత తనకుమారుడైన బాలచంద్రునికీ, అతని స్నేహితులకూ అప్పజెప్పాడు. వీరనాయకులను, పోటుమన్నీలను, వీరభట సమూహాన్ని సమాయత్తం చేశాడు. గురిజాలమీదికి యుద్ధానికి బయలుదేరి, తాను రణస్థలిగా నిర్ణయించుకున్న కారెమపూడి చేరాడు, రణభూమి నుండి నలగామ రాజుతో చివరిసారిగా నెరపిన వీరరాఘవభట్టు (రణభట్టు) రాయబారంకూడా విఫలమైంది.

నలగామ రాజుకూడా సహాయులతో, సామంతుల సేనతో యుద్ధానికీ ససైన్యంగా చేరాడు. కారెమపూడి నాగులేటి ఒడ్డున ఇరువాగుల వారి యుద్ధశిబిరాలు ఎదురెదురుగా వున్నాయి. కుమారుడు అలరాజుమరణంతో కుంగిపోతున్న కొమ్మరాజుకు, నలగామరాజు గుడారాన్ని చూడగనే ఆవేశం పెల్లుబికింది. తన విల్లును అందుకుని సవరించాడు. తన గురువైన బలభద్ర రఘుపతిపేరు స్మరించాడు. ఒక తీవ్రమైన బాణాన్ని వింటసంధించి. నలగామరాజు గుడారానికి గురిపెట్టి వదిలాడు. ఆవాడి బాణం తొలకరి మెరుపులా మెరుస్తూ నలగామరాజుగుడారపు కంబాన్ని తాకి అవతలకు దూసుకుపోయింది వెంటనే గుడారం చీలిపోయింది. గుర్రాలు, ఏనుగులు కట్లుతెంచుకుని చెదరిపొయ్యాయి. సైనికులు భయభ్రాంతులై చింతపల్లివరకు పారిపొయ్యారు. అది గమనించిన నలగామరాజు, పారిపోతున్న భటులకు ధైర్యవచనాలు చెప్పించి రప్పించాడు.

ఈ చర్యతో నాగమ్మకు ధైర్యస్థైర్యాలు సన్నగిల్లాయి. జయం కలుగుతుందో లేదో అన్న సందేహం ఆమెలో ఏర్పడింది. వెంటనే ముఖ్యులైన కొండ అన్నమరాడును, ధరణికోట కేతరాజును, మాడుగుల వీరారెడ్డిని, చింతపల్లి రామిరెడ్డిని పిలిపించింది. మలిదేవులకు భాగమిస్తామని, మాచెర్లను ఏలుకోమని చెప్పమనింది. అప్పటికీ

బ్రహ్మనాయుడు ఒప్పుకొనకపోతే, నిజానిజాలు ఎలావున్నా; అలరాజును నరసింగరాజే చంపించాడంటున్నారు కాబట్టి, పగతీర్చుకోటానికి నరసింగ రాజును అప్పగిస్తామని చెప్పి సంధికుదర్చమని రాయబారమంపింది; 'ఇదొక రాజకీయపుఎత్తుగడ! మేడపిలో వుంచివచ్చినప్పటికీ, తెంపరియైన బాలుడు యుద్ధానికి తప్పకవస్తాడనీ, సంధిని పొసగనివ్వడనీ; పసిపట్టిన నాగమ్మ వేసిన పాచికఇది. చివరకదేజరిగింది.'

రాయబారులు ఈవిషయాలను మలిదేవరాజుకు విన్నవించారు. యుద్ధం మానండని పార్థించారు. చివరకు బలవంతంమీద కొమ్మరాజు సమ్మతించటంతో, బ్రహ్మనాదులుకూడా శాంతించి సమ్మతించారు. చివరి దశలో అనుకోకుండా ప్రళయగర్జనచేస్తూ సంగడీలతో వచ్చిన యువ వీరుడు బాలచంద్రుణ్ణికూడా మహాప్రయాసతో కొమ్మరాజుచేత చెప్పించి సంధికొప్పించారు.

ఉభయపక్షాలూ సంధికుదిరిందన్న సంతోషంతో ఉన్నాయి. ఒక అంగీకారానికి వచ్చిన ఉభయపక్షాలకూ బ్రహ్మనాయుడు విందుభోజనాలు యేర్పాటుచేశాడు. ఇదే బ్రహ్మనాయుడు స్వయంగా పెట్టించిన చాపకూడు. జానపద గాథాకారులు దీనిని చాపలన్నాలబంతి అంటారు. కొందరు దీనిని పాలికూళ్ళబంతి అంటారు. ఇది చాపలమీద విస్తళ్ళలో వడ్డించినబంతి అని మరికొందరంటారు. శ్రీనాథకవిసార్వభౌముడుమాత్రం విందుభోజనమనే పొందుపరిచాడు. ముదిగొండ వీరభద్రకవి పాలకూళ్ళ బంతి అన్నాడు. దీనినే చావన్నము లేక చాపప్రసాదము లేక చాప వంటకము అంటూ A heap of boiled rice poured on a sheet of cloth. అని C. P. Brown అన్నాడు. ఈ చాపకూడే విఫలమై పల్నాటియుద్ధానికి దారితీసింది. దీనికి ప్రథమకారకుడు బాలచంద్రుడు.

మేడపినుండి చెలికాండ్రతో కార్యెమపూడి యుద్ధానికి బయలుదేరిన బాలచంద్రుడు బ్రాహ్మణవీరుడైన అనపోతుని ఎలాగైనా యుద్ధానికి

రాకుండా నివారించాలనుకున్నాడు. కొంతదూరం వచ్చాక బాలచంద్రుడు తన భార్య మాంచాల దగ్గర ముత్యాలహారమూ, ముద్దుటుంగరమూ మరచి వచ్చానన్నాడు. అవి శుభావహమైనవి కాన వానిని తెమ్మని స్నేహితులలో మేటి పరాక్రమశాలియైన బ్రాహ్మణవీరుడు అనపోతును వెళ్ళిరమ్మని మేడపికంపాడు. తాను వచ్చేవరకు తక్కిన స్నేహితులతో త్రిపురాంతకం దగ్గర వేచియుంటామని చెప్పాడు. అది అసత్యమని మేడపిలో మాంచాల, బాలచంద్రుని ప్రియురాలు సబ్బాయిలద్వారా తెలుసుకున్న అనపోతు యుద్ధభూమికి తిరుగు ప్రయాణమయ్యాడు. త్రిపురాంతకం (కథమెట్ల చోళరావులగుట్ట) అంటారు. చేరగనే అక్కడ బాలచంద్రుడూలేడు, స్నేహితులూలేరు. కారణమేమిటాయని ఆలోచిస్తూ ఒక రావిచెట్టుదగ్గరకు చేరాడు. బాలచంద్రు డక్కడ రావిచెట్టుకు కట్టి వెళ్ళిన ఆజ్ఞాపత్రాన్ని చదువుకున్నాడు. 'బ్రాహ్మణ వీరుడు యుద్ధంలో మరణిస్తే ఆ బ్రహ్మహత్యాపాతకం నాకు చుట్టుకుంటుంది, కనుక యుద్ధానికి రావద్దని' అందులో వుంది. అది బాలచంద్రుని స్వహస్త లిఖితమే. అదిచదివి అనపోతు ఖిన్నుడయ్యాడు. ఆసమయంలోనే వీరులకు తినుబండారాలు తెచ్చే మాదచి అక్కడకు చేరింది. అనపోతు ఆమెకీవిషయాన్ని వివరించాడు. తన జందెమూ కాలిబిరుదమూ తీసి యిస్తూ, వాటిని బాలచంద్రునికి అప్పజెప్పమన్నాడు. వెంటనే తనతల నరుక్కుని భూమిమీద పడిపొయ్యాడు. ఆదృశ్యాన్నిచూచి మాదచి వణకిపోయింది. చివరకు తేరుకుని అనపోతు నెత్తురులో ఆజందెమునూ, బిరుదమునూ ముంచి తీసుకుని కారెమపూడి యుద్ధభూమికి బయలు దేరింది.

యుద్ధభూమిలో మలిదేవరాజు శిబిరంవద్ద సంధి కుదిరిందన్న సంతోషంతో విందుభోజనాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. చావలమీద విస్తళ్ళలో భోజనాలు వడ్డించారు. నెయ్యి వడ్డన జరుగబోతుంది. ఆసమయంలోనే మాదచి అక్కడకు చేరింది. అన్నంకన్నా రుచికరమైన వస్తువులంటూ, రక్తంతో తడిపిన అనపోతు జందెమునూ కాలిబిరుదాన్ని

బాలచంద్రుని కిచ్చింది. త్రిపురాంతకంలో తనకు అనపోతు చెప్పిన విషయమంతా వివరించింది. దానితో బాలచంద్రుడు, కత్తిమొనతో రొమ్మున పొడిచినట్లుగా మెలికలు తిరిగిపొయ్యాడు. ఒక్కసారిగా పెద్ద కేకవేశాడు. "ఉభయపక్షాలూ ఒకటైనాసరే. శత్రు సైన్యాలపై పడతాను. అందరినీ హతమారుస్తాను. నరసింగరాజు తల నరికితెచ్చి కొమ్మరాజుకు కానుకగా యిస్తాను" అంటూ అన్నం ముట్టకుండాలేచాడు. వడ్డించిన సిద్ధాన్నాన్ని విస్తరితోసహా పట్టుకుపోయి నాగులేటిలోని గంగధారమడుగులో కలిపి చేతులు కడుక్కున్నాడు. ఇదంతా చూసి, సంధికివచ్చిన రాయబారులతో సహా అందరూ లేచారు. వారి వారి అన్నాలనుకూడా తీసుకపోయి ఆ గంగధారమడుగులోనే కలిపారు. వెంటనే బ్రహ్మనాయుడు నలగామరాజు రాయబారులను పిలిచాడు. "కానున్న కార్యం కాకపోదు. ఇక బంధుత్వంలేదు. సంధిలేదు. బాలచంద్రుని ఎవ్వడూ ఆపలేరు. యుద్ధానికి సిద్ధంకండి" అని చెప్పి పంపించాడు. ఆవిధంగా, ఒకే ఒక కార్యంకోసం సామంత నృపతులు సాగించిన చాపకూటి కుడుపు విఫలమై పల్నాటి యుద్ధానికి దారితీసింది. ఇదే బ్రహ్మనాయుడు పెట్టించిన చాపకూడు. వినుకొండ వల్లభరాయుడు, క్రీడాభిరామం అనే తనగ్రంథంలో పొందుపరచిన చాపకూటికుడుపు యిదే...సందేహంలేదు. దీనివైఫల్యమే పల్నాటి యుద్ధానికి హేతువు.

అంతేగాని, వర్ణరహిత సమాజంకోసం బ్రహ్మనాయుడు చాపకూడు పెట్టించాడనటం అర్థరహితం. పైగా చెన్నకేశవాలయంలో హరిజనులను ప్రవేశపెట్టి, అందులో చాపకూడు అనే పేరుతో సహపంక్తి భోజనాలు పెట్టించాడనటం కేవలం కల్పితం. ఆ ఆలయం పునరుద్ధరింపబడిన తొలినాడే దానిని హరిజనులకు అంకితమివ్వబడింది. ఆనాడు ఆ ఆలయానికి అర్చకులూ హరిజనులే. అందువలన ప్రత్యేకించి హరిజన దేవాలయ ప్రవేశం జరిగిందనికాని, అందులో సహపంక్తిభోజనాలు జరిగాయనికాని చెప్పనవసరంలేదు. ఇంతకు మించి ఈచాపకూడు (సహపంక్తిభోజనం) విషయం పూర్వకవుల గ్రంథాల్లోగాని, శాసనాల్లోగాని లేదు. హరిజనులకు చెన్నకేశవాలయం అంకితమిచ్చిన రోజుల్లోనే మాచెర్లకు ఉత్తరదిశగా మన్న జమ్మలమడక అనే గ్రామంకూడా ఆ హరిజనులకే అగ్రహారంగా యివ్వబడింది.

# బ్రహ్మనాయుడు చేయించిన చివరిహత్య :-

పానకాలను తిరస్కరించి, వడ్డించిన సిద్ధాన్నాన్ని సైతం తన ఎదలోని సంగ్రామకుతూహలం రగిలిన బాలచంద్రుడు, వీరావేశంతో ఉప్పొంగిపోయాడు. తన సంగడీలను అందరిని పేరుపేరునా పిలిచాడు. సందేహాలు విడనాడి, ప్రాణాలపై ఆశలు వదులుకుని, కార్యశూరులై శత్రుసంహారం చేయండని, వారిలో ఉత్సాహాన్ని ప్రేరేపించాడు. ఆ తరువాత అరవై ఆరుగురు వీరనాయకుల సాహసపరాక్రమాలను పొగిడాడు. రణరంగంలో దూసుకుపోతున్న తనను గురించి ఎవ్వరూ బాధపడవద్దని ప్రార్థించాడు. నరసింగరాజు తలనరికి తెచ్చి చూపిస్తానని వీరప్రతిజ్ఞ చేశాడు. యుద్ధం చేయవద్దని ప్రతిమాలిన వీరుల మాటల్ని త్రోసిపుచ్చాడు. పినతండ్రుల బోధనలను కూడా తిరస్కరించాడు. ఇది గమనించిన బ్రహ్మనాయుడు కూడా తన కుమారుని మనసుమార్చటం సాధ్యపడదనుకున్నాడు. బాలచంద్రుని చేరదీసి యుద్ధ ధర్మాలను ఉపదేశించాడు. శంఖతీర్థం, మంత్రోదకం ఇచ్చి 'జయం కలుగునుగాక' అని ఆశీర్వదించి పంపాడు.

అప్పుడే నరసింగరాజు ఏనుగునెక్కి సేనాసమూహంతో యుద్ధ భూమికి చేరాడు. అది చూసిన బాలుడు రౌద్రాకారుడై సింహనాదంచేసి శత్రుసేన లోనికి కార్చిచ్చులా దూసుకుపోయ్యాడు. అతని మిత్రులు అతని కిరుపైపుల శాత్రవుల్ని చెండాడుతూ పోతున్నారు. చెరకు గడల్ని నుసుమాపట్టి నరికేసినట్లు నరుకుతూపోతున్నారు. ఖడ్గమూ కేడెమూ పట్టుకుని బాలుడు యుద్ధభూమిలో వీరవిహారం చేస్తుంటే, ఏ వీరుడూ అతన్ని ఎదిరించలేక పోతున్నాడు. రణరంగం బాలునికి క్రీడారంగమైంది. జొన్నచేసును నరికినట్లుగా శత్రుసమూహాలను ఊచకోత కోస్తూ పోయ్యాడు. పీనుగుపెంటలతో రణస్థలి మహాభయానకమైపోయింది. శరగాత్రులై పోరాడలేక; ధైర్యంతో యుద్ధంలో నిలువలేక నరసింగరాజు సేన విలవిలలాడి పోయింది. హతశేషులైనవారు కొందరు పారిపోవడం మొదలుపెట్టారు. కొందరు చచ్చిన ఏనుగులచాటున, మరికొందరు గుర్రాల గుంపుమాటున దాగారు. బాలచంద్రుడు ఇనుమడించిన పరాక్రమంతో విజృంభించాడు. వాని ఖడ్గధాటికి శాత్రవుల తలలు

తాటిపండులా ఎగిరిపడి రణభూమిలో దొర్లిపోతున్నాయి. వాని యుద్ధ తీవ్రతకు తాళలేని నరసింగరాజు సైన్యం, దైన్యంపొంది పారిపోవడం మొదలు పెట్టింది. అది గమనించిన నరసింగరాజు; బాలునిచూసి పసిగెత్తటం వీరులకు ఉచితంకాదని బోధించాడు. కాని సైనికులు నిలిచేందుకునే స్థితిలోలేరు. వారి ప్రాణభయం వారిది. సంగడీలతో బాలచంద్రుడు కలసిచేసిన యుద్ధం శత్రుసైన్యాన్ని చాపకట్టుగా కూల్చి వేసింది. రణభూమి రక్తపుమడుగైంది.

తనసైన్యం బాలాఘాతం నేలపాలైందని గ్రహించిన నరసింగరాజుకు, గుండెలు తల్లడిల్లాయి. మరికొంత సైన్యాన్ని తీసుకురావటానికి వేగంగా తన అన్న దగ్గరికి వెళ్ళాడు. బాలచంద్రుడది గమనించనే లేదు. స్నేహితులతోపాటు సింహనాదం చేస్తూ శత్రుసేనావాహినిని తునుమాడుతూనే వున్నాడు. ఇంతలో ఒకవీరుడు ఏనుగునెక్కి అటే వచ్చాడు. అది గమనించిన బాలుడు.

పైనగుడెవ్వడో భావింపలేక
నరసింగు వీడని నమ్మి చిత్తమున
తమకంబుచే వాని తలతెగగోసి
తనచేత బట్టుక తనతండ్రి కడకు
బాలుడు విచ్చేసె ప్రజ్వరిల్లుచును.[1]

బ్రహ్మనాయుడా దృశ్యాన్ని చూసి నవ్వాడు. వెంటనే

నాయకావళి జూచి నాయుడిట్లనియె
చెలువైన నరసింగు శిరమిదికాదు
రహిమెంకు శిరమౌట గ్రహియింపలేక
చనుదెంచె నేమయ్య? జగదీశతమ్మ

1) పలనాటి వీరచరిత్ర-బాలచంద్ర యుద్ధం
పండిత ఉమాకాంత విద్యాశేఖరులు-పుట 113

దైనట్టి నరసింహు డన్న దగ్గరకు
తరలెను బలములు తాదెత్తునముచు
తెలియలేపై తివి ధీరాగ్రగణ్య
అనిపల్కగా బాలుడాగ్రహమంది
వీరులకెల్లను విసతిగావించి
కడువేగమువవచ్చి కలిపె తమ్ములను [1]

అప్పటికి నరసింగరాజుకూడా పెద్ద సైన్యంతో వచ్చి రణభూమిలో తారసిల్లాడు. బాలచంద్రుని చెలికాండ్రంతా నరసింగరాజు సైన్యంపై విరుచుకుపడ్డారు. ఆలమందపై పెద్దపులులు పడ్డట్లుగా విజృంభించి స్వైరవిహారం చేశారు. ఆసమయంలో బాలచంద్రుడు "ఏడిరా అసుగు రాజుకొడుకు నరసింగు డెక్కడున్నాడురా? ఏడిరావాడు? నారాకకు భయపడి ఎక్కడన్నా దాగాడా? లేక పారిపోయాడా?''అంటూ ఎదిరించిన వారినందరినీ నరుకుతూ నరసింగరాజు దగ్గరకు చేరాడు. నరసింగరాజు వస్తున్న ఏనుగుపై లంఘించాడు. అప్పుడు బాలునికీ నరసింగరాజుకూ ఒక్క జాముసేపు ఘోరమైన ద్వంద్వయుద్ధం జరిగింది. ఆసమయంలో

విక్రమస్ఫూర్తియై వెలయబాలుండు
కాముని తమ్ముని గదిసెడువేళ
పేగులు వెడలగా భేదించి పొట్ట
అంకుశంబున బొడిచె ఆ నారసింగు-
అంతట నాబాలు డధికరోషమున [2]

వ్రేలాడుతున్న పేగుల్ని పొట్టలోనికి జొనిపి, దానిపై కాసీకోకను బిగించాడు. సామంతరాగోలను చేతబట్టి, శక్తినంతా కూడగట్టుకుని

1) పలనాటి వీరచరిత్ర-బాలచంద్ర యుద్ధం -
పండిత ఉమాకాన్త విద్యాశేఖరులు పుట 114

2) పలనాటి వీరచరిత్ర.పదకావ్యము-పింగళి లక్ష్మీకాంతం-పుట 474

నరసింగుని వక్షస్థలాన కుచ్చాడు. అది వీపులోనుంచి అవతలకు వెళ్ళింది. ఆదెబ్బతో నరసింగరాజు ప్రాణం విడిచాడు. ఏనుగు కుంభస్థలం మీదనే పడిపోయ్యాడు. పడిపోయిన నరసింగుని శిరస్సుకోసి ఒకచేతపట్టాడు. పాతపగ ఉన్నప్పటికీ మైలమ్మసుతుడైన నరసింగరాజు మరణానికి మిక్కిలిగా దుఃఖించాడు బాలచంద్రుడు. తమ్ములను అక్కడేవుంచి, ఒకచేత ప్రేవుల నొత్తిపట్టి, బ్రహ్మనాదులున్న కొలువులోపలికెళ్ళి నరసింగరాజు తలను చూపించాడు. బ్రహ్మనాయడాశిరస్సును ఒక రత్నపీఠంపై ఉంచాడు. భక్తితో మొక్కాడు. అప్పుడు కొలువులో వున్న నాయకులంతా, కోపాలు లోపల అణచుకుని నరసింగుని తలకు నమస్కరించి దుఃఖించారు.

నరసింగరాజు మరణం రాజకుటుంబానికి విపరీతమైన దుఃఖాన్ని తెచ్చిపెట్టింది. మలిదేవరాజు, కొమ్మరాజు శోకతప్తులయ్యారు. ఇది గమనించిన బ్రహ్మనాయడు తనదోషాన్ని కప్పిపుచ్చటానికి కొడుకుదగ్గరకు చేరి పరిపరివిధాల దూషించాడు. అప్పుడాబ్రహ్మనాయని కపటానికి, కల్లబొల్లి ఏడుపులకూ ఉద్రేకియైన బాలచంద్రుడు తన తండ్రినిచూసి, వగలమారి ఏడుపులు చాలించమన్నాడు మొదటినుండీ తన తండ్రి చేసిన దుష్కృత్యాలను పరుసగా ఎత్తిచూపిస్తూ, పలనాటికో ఇటువంటి అవస్థాలన్నిటికీ నీవేకారణమన్నాడు. చివరకచ్చట నిలువలేక రణభూమికేగి శత్రుసైనికులను చెండాడి తన చెలికాండ్రతో తానూ వీరస్వర్గమలంకరించాడు. అప్పుడు సూర్యుడు అస్తమించాడు. లోకమంతా చీకట్లు క్రమ్మింది.

# కోడిపందెం

పల్నాటి చరిత్రనందించిన పూర్వకవుల కావ్యాల్లోనూ, జానపదుల గాథల్లోనూ పరిశీలించి చూస్తే, ఈకథను భారతేతిహాసంతో సమతుల్యంగా ఉండాలనే తలంపుతో నడిపినట్లు తెలుస్తుంది. భారత కథాఘట్టాలను పోలిన విషయాలు కొన్ని ఈపల్నాటి చరిత్రలో ఉండటమే ఇందుకు కారణం. అందువల్లనే ఈచారిత్రక కథకు పౌరాణిక ప్రతిపత్తి కలిగింది. అతిశయోక్తులూ, అభూతకల్పనలూ విపరీతంగా చోటుచేసుకున్నాయి. ముఖ్యంగాఈ కథను గానంచేసే జానపదులకూ, ఆ తర్వాత వారిననుసరించి వ్రాస్తూ ఈకథనందించిన కవులకూ బ్రహ్మనాయనియందున్న మితిమీరిన పక్షపాతమే, బ్రహ్మన్నను అవతారపురుషునిగా, ధర్మవేదిగా, గొప్ప శాంతపురుషునిగా చిత్రించటం జరిగింది. అందువల్ల నిజమైన చరిత్ర నివురుగప్పిన నిప్పులా ఉండిపోయింది.

భారతకథలో ధర్మరాజుకున్నట్లే, ఈపల్నాటి చరిత్రలోని బ్రహ్మనాయనకుకూడా ద్యూతగుణముంది. అక్కడ భారతంలో పాచికలయితే, ఇక్కడ పల్నాటిలో కోడిపుంజులు. అక్కడ జీవంలేని పాచికలతో ద్యూతం. ఇక్కడ సజీవద్యూతం. (ప్రాణి ద్యూతం లేక సమాహ్వయం) జరిగింది. అక్కడ పాచికలాటలో ధర్మరాజు రాజ్యాన్ని పోగొట్టుకుని పన్నెండేండ్లు అరణ్యవాసం చేస్తే; ఇక్కడ బ్రహ్మనాయడు ఆడిన కోడి పందెంలో మలిదేవరాజు ఓడిపోయి ఏడేండ్లు వలసపోవలసి వచ్చింది.

పల్నాటి చరిత్ర జరిగిన కాలంలో, ఆడిన ఈకోడిపోరును గురించి వ్రాసిన రచయితలు, ఎవరికి తోచినట్లు వారు వ్రాశారు. ఆవిధంగానే వర్ణనలూ చేశారు. అయినా కోడిపోరుమాత్రం ఆనాడు పల్నాటికి ముఖ్యపట్టణమైన గురిజాలలోనే జరిగిందని అందరూ ఒకే అభిప్రాయాన్ని సూచించారు. కానీ, కథకులగానాల్లోనూ, జనశ్రుతిలోనూ అందుకు భిన్నంగా, మాచెర్ల నుండి గురిజాలకు వెళ్ళే మార్గంలో మధ్యనవున్న మంచికల్లు గ్రామ సమీపాన జరిగిందని చెప్పబడుతుంది.

మాచెర్ల నుండి గురిజాలకు వెళ్ళే మార్గానికి పది కిలోమీటర్ల దూరంలో పాల్వాయి (పాలవాయు) అనే గ్రామముంది. ఈగ్రామానికి సమీపంలో ఆగ్నేయదిశగా రెండు కిలోమీటర్ల దూరంలో విశాలమైన బయలు ప్రాంతంలో ఈనాటికీ కనిపిస్తున్న రెండు పెద్ద రాళ్ళగుట్టలున్నాయి. వీటిని కోళ్ళగుట్టలనీ, కోడేరుగుట్టలనీ ఈనాడుకూడా పిలుస్తుంటారు. ఈప్రదేశాన్ని కోడేరు ఈరబయళ్ళు (వీరబయళ్ళు) అంటారు. ఈప్రదేశం ఆనాటి మాచెర్లసీమకూ, గురిజాల సీమకూ సరిహద్దుప్రాంతం. కనుక జనశ్రుతి ననుసరించి ఆనాడు కోడిపోరు జరిగిన ప్రాంతం ఇదేకావచ్చు.

ఇక కోడిపందాలు జరిగినప్పుడు బ్రహ్మనాయుని పక్షాన, నాయకురాలు నాగమ్మపక్షాన వేలాదిజనం పందెంచూడటానికి రావటం జరిగింది. అలా వచ్చినజనం, ఒక్కొక్కరు ఒక్కొక్క రాయితెచ్చుకుని, వాటిపై కూర్చొని కోడిపందాల్ని తిలకించారనీ, పందాలు ముగిసిన తర్వాత ఇరుపక్షాలవారూ వారివారి రాళ్ళను తీసి, ఎవరివైపు రాళ్ళు వారివైపుననే రెండుగుట్టలుగా వేశారనీ జనవాక్యం. అలావేసిన రాళ్ళగుట్టలే, ఈనాడు మనకు కనిపించే కోళ్ళగుట్టలు. ఇవే కోడేరు గుట్టలు. ఈ రెండింటిలో తూర్పు వైపున ఉన్నగుట్ట గురజాలవారిది. పడమరవైపున ఉన్నగుట్ట మాచెర్లవారిది. అని చెపుతారు. ఈగుట్టలపైనున్నరాళ్ళు సహజంగా వుండే రాళ్ళలా కనిపించవు. గుట్టల లోపలిభాగంలో ఎలావున్నాయో తెలియదుకాని, పైనున్నవిమాత్రం పరిశీలించి చూస్తే, నున్నగా పలుచగా పెద్ద పీటరాళ్ళలా కనిపిస్తాయి. ఏదిఏమైనా పల్నాటి చరిత్రకు సంబంధించిన ఇలాంటి స్థలాలు మనకు ఈనాటికీ సన్నిహితంగా కనబడుతూనే ఉన్నాయి. కనుక ఈకోడేరుగుట్టల్ని, వీటిని గురించి చెప్పే జనశ్రుతినీ కాదనలేం.

జానపదుల కథల్లో, ఈకోడిపోరు జరిగిన స్థలాన్ని గురించి ఇలా వర్ణిస్తారు.

"పాల్వాయి రెంటాల పాలబయలో చౌళ్ళ
కోలేరు దాపునా కోలదిబ్బలకాడ (కోలేరు = గోలివాగు)
కోడి జగడానికై కొత్తపుంజులు దెచ్చి
పట్టిరే పందాలు పంతాలు ఎగదట్టి"

అనే దానినిబట్టి కావ్యాల్లో ఉన్నట్లు, కోడిపోరు గురిజాలలో జరుగలేదనేది సత్యమని గ్రహించక తప్పదు.

ఇక ఈ "కోళ్ళపోరు–గోపన్న విరుగు" అనే కథను శ్రీనాథుడు వ్రాశాడో లేదో తెలియదు. ఒకవేళ వ్రాసినా, ఆకథ ఇప్పటివరకూ ఎవరికీ లభ్యంకాలేదు. పురాతన కవులలో ఈకోళ్ళపోరును గురించి, మంజరీద్విపదలో వ్రాసిన మల్లయ్య రచన ఒకటే లభ్యమౌతుంది. ఆ తర్వాత ఈకోడిపోరును గురించి పందొమ్మిదవ శతాబ్దిలో ముదిగొండ వీరభద్రకవిగారు పద్యకావ్యంగా వ్రాసిన వీరభాగవతంలో పొందు పరిచాడు. మంజరీ ద్విపదలో లభ్యమైన మల్లయ్య రచనను శ్రీపింగళి లక్ష్మీకాంతంగారు సేకరించి ఆయన పరిష్కరించిన పలనాటి వీరచరిత్ర పదకావ్యంలో చేర్చారు. ఈ మల్లయ్య పదహారవ శతాబ్దంవాడని చరిత్రకారుల నిర్ణయం. ఈకథారచయితయైన మల్లయ్యకూడా, పూర్వమీ పల్నాటి చరిత్రను–శ్రీనాథుడు చెప్పగా, ఆకథను తాను సురలా వినిపిస్తున్నట్లు చెప్పుకున్నాడు. అంటే శ్రీనాథుడు చెప్పిన ఈకథ, ఏకారణంచేతనో లుప్తమైపోగా, మల్లయ్య ఈకథను జనశ్రుతిగా విని వ్రాశాడని తేలుతుంది.

మల్లయ్య తన సొంతఊహలెన్నో అందులో ప్రక్షిప్తంచేసి, అతిశయాలతో, అభూతకల్పనలతో అల్లినకథగా మనకిప్పుడు కనిపిస్తుంది. అందువల్లనే మూలకథావృత్తాంతం చాలావరకు మరుగున పడిపోయింది. ఆయనచూపిన స్వకపోలకల్పనలుకూడా సహజానికిదూరమై, మంత్రాలూ, మంత్రాక్షతలూ, కోడిమహిమలతో కొంత; శకునాలూ, శకునఫలితాలు, కాలజ్ఞానాలు మొదలైన అంశాలు, అవులకాసే అతిసామాన్యుడైన గోపన్న వివరించటంలో మరికొంత; వీటికితోడు యుద్ధవర్ణనలూ విపరీతంగా పెంచి, అసలు ఇతివృత్తాన్ని తిక్కిరిబిక్కిరిచేశాడు. చివరికి పల్నాటి చరిత్ర జరిగిన కాలాన్నికూడా మరిచిపోయి, తాను వ్రాసుకుంటున్న కాలానికి అతుకునట్లు శ్రీకృష్ణదేవరాయడని వ్రాశాడు. ఇకనలగాముని కొల్వులో తురుష్క భటులున్నట్లూ, నాయకురాలాతురుష్కరౌతులకు గుర్రాలనిచ్చి

బ్రహ్మనపై యుద్ధానికి పంపినట్లు వర్ణించాడు. ఈకథా కాలంనాటికి తురుష్కసర్దారులు హిందూరాజులకొలువులో చేరిరనుట చరిత్రకేవిరుద్ధం.[1] దీనినిబట్టి "కోళ్ళపోరు-గోవన్నవిరుగు" అనుకథ కేవలం మల్లయ్య సొంతమై, అసలుకథకు ప్రమాణికంగా నిలువలేకపోయింది. కనుక కథకులు చెపుతున్నట్లు కోళ్ళపోరు గురిజాలలోకాక; గురిజాల, మాచెర్ల మధ్యనవున్న గోలివాగు ప్రాంతంలో జరిగిందని ఆశించటంలో సందేహం లేదు. అందుకు సాక్ష్యం, ఇప్పుడు అక్కడున్న కోడేరుగుట్టలే.

కల్యాణపురి కలచూరి వీరసోముని కూతురు సిరాదేవితో, మలిదేవ రాజు పెండ్లిజరిపించాడు బ్రహ్మనాయుడు. అత్తవారింటికి వచ్చే సిరాదేవితోపాటు, అరణంగా వెయ్యిగోవుల్ని, మరోవెయ్యి గొర్రెల్ని, వాటినికాసే మహాయోధులైన ఆలకాపరులను ముగ్గురినికూడ మాచెర్ల చేర్చాడు. ఆ సంపదతోపాటు, సిరాదేవి అన్న కొమ్మరాజు, ఆయనభార్య చెల్లమదేవి, కుమారుడు అలరాజుకూడా మాచెర్ల వచ్చారు.

ఈ అలరాజుకు గురిజాలనేలు నలగామరాజు కూతురు రత్నాల పేరమ్మదేవితో ఇంతకుముందే వివాహం జరిగింది. మాచెర్ల, గురిజాల రాజులతో వియ్యాలందుకున్న కారణంగా, పల్నాటిలో స్థిరపడాలనే సంకల్పంతోనే, వీరు సిరాదేవితోపాటు మాచెర్ల చేరినట్లు చరిత్రనుబట్టి తెలుస్తుంది. కాని వీరుముప్వురూ మాచెర్ల వచ్చినతర్వాత, వియ్యంకుడైన కొమ్మరాజుగానీ, అల్లుడు అలరాజుగానీ గురిజాలలోని నలగామరాజు గడప తొక్కినవారుకాదు. గతంలో వీరికీ నలగామరాజుకూ మధ్య ఏవిధమైన విభేదాలు వున్నట్లు పల్నాటి చరిత్రలో కనిపించవు. దీనినిబట్టి వీరు కేవలం బ్రహ్మనాయుని అండచూసుకుని, ఆయనప్రాపున మనుగడ సాగించాలనే తలంపుతో కల్యాణపురి నుండి మాచెర్ల వచ్చినట్లు విశద మౌతుంది. అందువల్లనే బ్రహ్మనాయుని ఆజ్ఞకూ, ఆంక్షకూ బద్ధులై గురిజాల వెళ్ళటం జరుగలేదని నమ్మవలసి వస్తుంది.

---

1) పల్నాటి వీరచరిత్ర-పింగళి లక్ష్మీకాంతం-పీఠిక-పుట 35

వీరంతా మాచెర్ల చేరినతర్వాత, ఒక శుభముహూర్తాన బ్రహ్మ నాయుడు మలిదేవరాజును మాచెర్లకు పట్టాభిషిక్తుని చేశాడు. కల్యాణ కలిచూరి వీరసోమునితో వియ్యమందిన కారణంగా, ఒక బలమైనరాజు తనకు అండగా నిలిచాడని బ్రహ్మనాయుని ఆనందం అవధులు దాటింది.

మరికొంత కాలానికి మలిదేవుని వివాహ కట్నకానుకలు కొన్ని నలగామరాజుకు అందజేయాలని, తానేస్వయంగా గురిజాలకు ప్రయాణ మయ్యాడు బ్రహ్మనాయుడు. అదేమిటోకాని, కొమ్మరాజు ఇటు మాచెర్ల వారికీ, అటు గురిజాలవారికీ రాజబంధువు. పైగా ఒకవంక వియ్యంకుడు, మరోవంక బావమరిది. అదీగాక అందరిలోనూ పెద్దవాడు. భారత కథలో భీష్మునికెంత గౌరవముందో, అంతటిగౌరవం పల్నాటి చరిత్రలో ఈకొమ్మరాజుకూవుంది. అంతటి పెద్దమనిషి, పైగా స్వయంగా తన యింటినుండి తెచ్చుకున్న పెండ్లికానుకల్ని, తనకు పెద్దబావగారు పైగా వియ్యంకుడూ అయిన నలగామరాజుకు, కనీసం బావమరిదిగానైనా అందజేసే అర్హత కొమ్మరాజుకు లేదా? ఇదంతా గాలికి వదలి, బ్రహ్మనాయుడు తానే స్వయంగా గురిజాల వెళ్ళవలసిన అవసరమేమిటి? నిజంగా బ్రహ్మనాయనకు నలగామరాజుపై ఏద్వేష భావమూలేక, పల్నాటి రాజలోకాన్నంతటినీ ఒకటిగా చేయాలనే తలంపు వుంటే, కొమ్మరాజునే గురిజాలకు పంపేవాడు. అలాంటిదేమీ చేయక, స్వయంగా తానే బయలు దేరాడంటే, అందులో ఏదోకపటం వుందని చెప్పక తప్పదు. ఒకవేళ పెండ్లికూతురు పైపువారు ఎవ్వరూ లేనప్పుడు, అందరికీ పెద్దవాడైన బ్రహ్మనాయుడు కట్నకానుకల్ని తీసుకెళ్ళటం సహజమే కాని, పెద్దవాడైన కొమ్మరాజున్నాడుకదా? మరెందుకు పంపలేదు. దీనినిబట్టి ఆలోచిస్తే, నలగామరాజును ఏకాకిని చేయాలనే తలంపుతో, బ్రహ్మనాయుడాయనపై ఏవోకొండెములల్లి, రాజబంధువుల్లో విముఖత కలిగించటానికే వెళుతున్నట్లు ద్యోతకమౌతుంది. కాకపోతే పుట్టింటి కానుకల్ని పుట్టింటివారేకదా, తీసుకెళ్ళటం జరగాలి? ఇది బ్రహ్మనాయుని ద్వేషబుద్ధికాక మరేమిటి?

బ్రహ్మనాయుడు కానుకలతో గురిజాలపోతూ, ఆపట్టణ సమీపంలోని రేవంత బయళ్ళలో ఎవరో ఏదో సరదాకోసం జరుపుకుంటున్న కోడి పందాన్ని చూస్తూ ఆగిపోయ్యాడు. భారతకథలోని ధర్మరాజులాగా, బ్రహ్మనాయుడుకూడా జూదక్రీడ వ్యసనపరుడు. ఈతనికున్న జూదపు వ్యామోహాన్ని గురించి జానపదులు ఒక చిన్న ఐతిహాసిక కథకూడా చెపుతారు. ఈకథలో బ్రహ్మనాయుడు తనకు నిత్యమూ విధేయులై, తాను చెప్పిందే సత్యమని మూర్ఖంగా నమ్మి, తన ఆజ్ఞనే దైవాజ్ఞగా భావించి, బానిసలుగా జీవించే, తన అనుచరయోధగణమైన అరపై ఆరుగురు వీరనాయకుల్ని, జూదంలో తాను ఎలా ఓడించి, తనకు భృత్యులుగా చేసుకున్న వివరంకూడా వుంది.

ఎంతోమంది యతీశ్వరులకూ, మునులకూ వాసస్థానమైన గుత్తికొండ (పల్నాటిలోని) బిలానికి ఒకనాడు వనవిహారార్థం ముప్పై ముగ్గురు సోమారపు రాజులు వచ్చారు. ఆ బిలంలో అంతకుముందే వుంటున్న అరపై ఆరుగురుగల ఒక ప్రమథగణం, ఈ సోమారపురాజులకడ్డుతగిలి, తమతో పగడసాలాటనాడి ఓడిస్తేనే, బిలం లోపలికి ప్రవేశమన్నారు. అంతేగాక, ఎవరు ఓడినా ఎదుటిపక్షానికి ఊడిగం చేయాలని పట్టుబట్టారు. అందుకు సమ్మతించిన సోమారపు రాజులు, ఆప్రమథగణంతో పగడ సాలాటనాడి ఓడిపొయ్యారు. పందెపు నియమంప్రకారం సోమారపురాజులు ఆప్రమథ గణానికి ఊడిగం చేస్తూనే వచ్చారు.

ద్యూత వ్యసనపరుడైన బ్రహ్మనాయుడీవిషయాన్నెలాగో పసి పట్టాడు. మహావీరులైన ఈ అరపై ఆరుగురు ప్రమథలనూ జూదంలోనే ఓడించి తనవశం చేసుకోవాలని తలిచాడు. దానికి అనువుగా "కిచ్చన బోయడు"అనే గొల్లబోయని అవతారమెత్తి, అమాయకుడిలా ఆగుత్తికొండ బిలం సమీపానికి చేరి ప్రమథగణానికి కనిపించాడు. బ్రహ్మనాయుడే ఈఅవతారమెత్తాడని తెలియని ప్రమథగణం కిచ్చనబోయన్ని వెర్రి గొల్లనిగా భావించి, అతనితో "వేడిపాలు తాగే వ్యాజపుగొల్ల" "పచ్చిపాలు తాగే పౌరుషపుగొల్ల" గొల్లమంకు చాలించి పగడసాలాటకు రమ్మన్నారు. ఆమాటలు వినపడీ వినపడనట్లు నటించిన బ్రహ్మనాయడు

(కిచ్చనబోయడు) చివరకు అతిప్రియాసమీద పగడసాలాటకు ఒప్పు కున్నాడు. జూదం మొదలైంది. ఆట ముగియబోయే సమయంలో తన మంత్రిశక్తిచే ప్రమథగణానికి తెలియకుండా పాచికల్ని తారుమారు చేయించి, కిచ్చనబోయడే . గెలుపు సాధించుకున్నాడు. పందెపు నియమంప్రకారం ముందుగా సోమారపు రాజులు బానిసత్వం నుండి విముక్తులయ్యారు. అరపై ఆరుగురు ప్రమథులూ, కిచ్చనబోయనికి ఊడిగం చేయటానికి సిద్ధమయ్యారు. ముందుగా వారి ఓపికను పరీక్షించాలని నిర్ణయించుకున్న కిచ్చనబోయడు, పాదరక్షలు లేకుండా అ ప్రమథగణాన్ని తనవెంట రమ్మన్నాడు. అంగీకరించిన ఆ అరపై ఆరుగురినీ దొండకాయల పల్లెవరకూ, పగిలిన పలుగురాళ్ళ బాటగుండా నిప్పులుచెరిగే ఎండలో నడిపించాడు. కొందరికి కాళ్ళు బొబ్బలెక్కాయి. మరికొందరికి పగిలిన ఆ పలుగురాళ్ళ కొనలతాకిడికి పాదాలు చీల్చుకొని పోయి నెత్తురులు కారాయి. అయినా ఓపికతో నడిచారు. ఆతర్వాత దొండకాయల పల్లెనుండి కారెమపూడివరకు పల్లేరుకాయలు విపరీతంగా వున్న ప్రాంతంమీదుగా నడిపించాడు. విధిలేని ఆ ప్రమథగణం బాధా తప్తులైకూడా సహనం వహించి, అశక్తత చూపక, అతిప్రియాసతో కారెమపూడివరకూ నడిచారు. అక్కడ కిచ్చనబోయడు తనఅవతారాన్ని చాలించి బ్రహ్మనాయడుగా మారిపొయ్యాడు. అప్పుడు అవతార పురుషుడైన బ్రహ్మనాయనకు, ఆ అరపై ఆరుగురూ సాగిలపడి నమస్కరించి వారితప్పుల్ని క్షమించమన్నారు. అలా తన ఆధీనమైన అరపై ఆరుగురికీ వీరనాయకులని పేరుపెట్టి తన చెప్పుచేతల్లో ఉంచు కున్నాడు. ఇదీకథ.

కట్నకానుకలతో వెళుతూ గురిజాల సమీపంలోని రేవంతుబయళ్ళలో జరుగుతున్న కోడిపందాన్ని ఆసక్తితో చూస్తున్న బ్రహ్మనాయనకు ఒక మెరుపులాంటి ఆలోచన తట్టింది. అలాంటి కోడిపందెంతోనే నలగామ రాజును ఓడించి, గురిజాల సీమనుకూడా స్వాధీనం చేసుకోవాలను కున్నాడు. ఇంతలో పందెమాడుతున్న ఒకకోడిపారిపోయింది. వెంటనే ఒకతుంటరి "అదిగో! బ్రహ్మనాయనికోడి పారిపోతుంది! ఆ పారిపోయే

పుంజు బ్రహ్మనాయనిదే" అని బిగ్గరగా అరిచాడు. ఆమాటలు విన్న బ్రహ్మనాయుడు స్తంభించి పోయ్యాడు. రోషంతో బుసలు కక్కాడు. ఆ బుసలకు బుగ్గలమీదవున్న మీసాల కొసలు రుషరుషలాడాయి. ఇదంతా నాగమ్మ చేయించిన కుట్రగా భావించాడు. అక్కడే కొంతసేపటికి తమాయించుకుని గురిజాల వెళ్ళి నలగామరాజుకు పెండ్లి కానుక ల్ని అందించాడు.

బ్రహ్మన్నతో కుశలప్రశ్నల అనంతరం విందుభోజానాలుజరిగాయి. వెంటనే బ్రహ్మనాయుడు తిరుగుప్రయాణానికి సిద్ధమయ్యాడు. కాని, తాను వస్తున్నప్పుడు రేపెంతు బయళ్ళలో తనకు జరిగిన పరాభవం జ్ఞప్తికి వచ్చి ఆనాడు సూటిపోటుమాటలతో నలగామరాజునూ, వాడి వేడి మాటలతో నాయకురాలినీ దెప్పిపొడుస్తూ పంతానికి దింపాడు. ఫలితంగా రాబోవు ఆషాఢ శుద్ధ తొలిఏకాదశినాడు ఇరుపక్షాలకూ కోడిపందెం జరిగే టట్లు నిర్ణయం జరిగింది. ఓడినవాడు వారి రాజ్యాన్ని వదలి యేడేండ్లు వలసపోవాలి. అరణ్యాల్లో జీవించాలి. ఇది పందెపు నియమం.

మాచెర్ల చేరిన బ్రహ్మనాయడు, ఈ కోడిపోరు విషయాన్ని మలిదేవరాజుతో సంప్రదించాడు. మలిదేవరాజుకు ఇష్టం లేకపోయినా, అంగీకరించటం తప్పలేదు ఆ తర్వాత బ్రహ్మనాయడు, తన అన్న బాదన్నతో సంప్రదించి రావీరపడాలుచే నల్లగొండసమీపంలోని పానగల్లు నుండి చిట్టిమల్లు అనేకోడిని మంత్రాక్షతలు చల్లించి తెప్పించినాడు. ఇది దేవతా మహిమగల కోడిపుంజుగా కావ్యాల్లో అభివర్ణింపబడింది.

తనవారంతా చుట్టూ కూర్చొనివుండగా బ్రహ్మనాయడు చిట్టిమల్లను చేరదీసి, పందెంలో తనకు జయమో అపజయమో తెలుపమని ఆ కోడి పుంజుకు అక్షింతలు చల్లాడు. ఆకోడి గంభీరస్వరంతో బిగ్గరగా కూసింది మళ్ళీ కూయుమని కోరగా, హీనస్వరంతో నిరుత్సాహంగా అరిచింది. అదేమిటని విచారించగా, మొదటిగెలుపు బ్రహన్నదేకాని, మరుపందెంలో అపజయమని శకునాలు చెప్పేవారు చెప్పారు. అయినా పట్టువీడక బ్రహ్మనాయడు, తనతల్లి శీలమ్మదగ్గరికెళ్ళి ఆశీర్వాదం పొందాడు.

ఆమె యిచ్చిన మంత్రాక్షతల్ని తీసుకుని తన పరివారంతో పందానికి వెళ్ళాడు.[1] ఈలోపు గురిజాలలో నాయకురాలు "నల్లమల్లి"అనేపుంజును సిద్ధంచేసింది. ఈకోడి "చివ్వల బెబ్బులి"యని వీర భాగవతం లో పేర్కొనబడింది.

మాచెర్ల, గురిజాల రెండుదేశాలకూ మధ్యనవున్న కోలేరు (గోలివాగు) సమీపంలోని బయళ్ళలో ఇరుపక్షాలవారికీ కోడి పందాలకు రంగం సిద్ధమైంది. సరిహద్దు ప్రాంతమవటంవల్ల, చూడవచ్చిన ఇరుపార్శ్వాల జనంతో ఆప్రదేశం నిండిపోయింది. పందెం మొదలైంది. బ్రహ్మనాయని చిట్టిమల్లును చెవుల గోవన్న (బాలగోవన్న) పట్టాడు. బ్రహ్మనాయుడాపుంజును గోవన్నదగ్గర నుండి తీసుకుని, దాని ఒడలు నిమురుతున్నట్లు నటించి, గోవన్నకేదో చెవిలోచెప్పి, తిరిగి పుంజును గోవన్న కప్పగించాడు. ఆ తర్వాత నాయకురాలు తన పుంజును నల్లమల్లును తెప్పించి, తానే స్వయంగా పందెమాడటానికి సిద్ధమైంది. ఇద్దరూ గరిడీలోనికి దిగారు. మధ్యవర్తిగా అలరాజును ఎంపిక చేశారు. ఇరుపక్షాల జనం, జయం తమదేనని అనుకుంటున్నారు. ముందుగా ఒకదానినొకటి తెలుసుకోవటానికి గరిడిలో వదలి వాటి తోకల్ని పట్టి ఆడిస్తూ చూపిచారు.

కోళ్ళను పోరుకు విడువటానికి ముందు, వాటి వాటి కాలివేళ్ళలో వెనుకనున్న ఒకదానికి కత్తులుకట్టి కాసెపోతలు చుట్టారు, ఆ తర్వాత వారి వారి కోళ్ళపైనున్న జుట్లను వరస్పరం కొరికించటానికి, వాటితలలు పట్టారు. ఈచర్యనే సిగపట్లు అంటారు. ఇది కోడిపందానికి ముందు జరిగే ఆనవాయితీ. ఇది పందెమాడే కోళ్ళకు ఒకదానిపై మరొకదానికి రోషం పెంచటానికి చేసే ప్రయత్నం. ముందుగా నాయకురాలి కోడి నల్లమల్లి, చిట్టిమల్లి జుట్టుపట్టి కొరికింది. చిట్టిమల్లి సిగ చీలిపోయి రక్తం కారటం మొదలైంది. ఆరక్తాన్ని నిగూఢంగా నాయకురాలి చీరపై చల్లాడు గోవన్న. నాయకురాలి చీరమీదనున్న ఆ రక్తపు

---

1) పల్నాటి వీరచరిత్ర-పదకావ్యం-పింగళి లక్ష్మీకాంతం-పుట 87-88

మరకల్ని మధ్యవర్తికి చూపిస్తూ, బహిష్ఠయైన ఆడదానితో పందెం కట్టటం కోడివందానికే విరుద్ధమన్నాడు. ఇక తానేమిచెప్పినా, అప్పట్లో పొసగదనే ఉద్దేశంతో నాయకురాలు పక్కకు తప్పుకుని, బయటికెళ్ళి చింతపల్లి రెడ్డిని పందెం వేయటానికి పంపింది. ఇది జానపదులగాథ. ఇదే కోడిపోరు సందర్భం వచ్చినప్పుడు, వీరభాగవత గ్రంథకర్త, ఈఘట్టాన్ని మరోవిధంగా వర్ణించాడు.

కం॥ అవ్వల నాయకురాలొక,
చివ్వల బెబ్బులియనంగఁ జెలువగు కోడిన్
గ్రొవ్వలరారంగ దెచ్చిన,
నివ్వెలఁదికి నాకుఁబందెమెట్లగుననుచున్.

కం॥ మేటియుగు బాలగోపన
గోటం గుంకుమరసంబు గూఢక్రియ ను
త్పాదించి తెలియకుండ వ
ధూటింగని నిట్టులనియె దూరస్థితుడై.

కం॥ ధరఁ పుష్పవతుల సరియై
పురుషులు పందెంబుగట్ట బోలునె సభలన్
సరసీరుహాక్షి! తొలఁగుము
పురజనములు నవ్వనిచటఁ బొసఁగదు నిలువన్.[1]

ఈపద్ధతిని ప్రవేశపెట్టిన శ్రీ వీరభద్రకవిగారు: జానపదుల కథా ఘట్టానికి సామీప్యత సంతరించుకున్నట్లు వ్రాసినా; ఆసమయంలో అక్కడికి కుంకుమరసం ఎలా వచ్చిందో చెప్పలేదు పైగా కుంకుమరసం అక్కడికిచేరటంకూడా దుర్లభం. కనుక ఈవిషయంలో జానపదులుచెప్పిందే సత్యమనటంలో సందేహంలేదు. జూదంలో ఇంతటి ధూర్తచర్యకుపాల్పడిన వారు, ఎంతటిమోసానికైనా వెనుకాడరు, ఏఅవినీతికైనా పాల్పడకపోరు.

1) వీరభాగవతము-ముదిగొండ వీరభద్రకవి-చతుర్థాశ్వాసము-పుట 128

ఆ తర్వాత చింతపల్లి రెడ్డి నల్లమల్లునూ, చెవుల గోపన్న చిట్టిమల్లునూ పందానికి విడిచారు. రెండుకోళ్ళూ ఒకదానికొకటి తీసిపోని విధంగా పోరాటం ప్రారంభించాయి. ఈ పోరట పటిమను గమనిస్తున్న ప్రేక్షక జనంలో విపరీతమైన ఉత్కంఠ రేకెత్తింది. అలా జాముపైపు హోరాహోరీగా కోళ్ళపోరు సాగింది. చివరకు చిట్టిమల్లు విజృంభించింది. అది గమనించిన చింతపల్లి రెడ్డి పుంజుల్ని నీళ్ళకెత్తాలన్నాడు. అందుకు బ్రహ్మనాయడొప్పుకోలేదు. పోరాడి పోరాడి డస్సిపోయి, ఏదో ఒకపుంజు చచ్చేదాకా, పోరు కొనసాగాల్సిందేనన్నాడు. చివరకదేపోరాటంలో నల్లమల్లు నీరసించి నేలపై కూలి చచ్చిపోయింది. బ్రహ్మనాయడు పకపకా నవ్వాడు. మాచెర్లప్రజలు చప్పట్లు కొడుతూ హర్షధ్వానాలు చేశారు. నలగాముడు విషణ్ణవదనుడయ్యాడు. నాగమ్మ ముఖం వెలవెల బోయింది. దేహం కంపించింది. కాని మళ్ళీ అంతలోనే ముఖం జేవురించింది. కండ్లు ఎరుపెక్కాయి. బ్రహ్మన్నను చూసి

పందె మొక్కటికాదు బ్రహ్మనాయకుడ
గోవులేనుగులును గుర్రముల్ ధనము
లాదిగా గురిచేసి యాడెదమనిన

ఆమాటలకు బ్రహ్మనాయడు నవ్వాడు.

వెరపిడు మాటల వెరవంగనేల
ఇంతి! నేనిచ్చెద నేపందెమైన
పెట్టుము నీకింత ప్రియమయ్యెనేని
ఆడి తప్పెదవేని నేనాడలేనని [1]

పలికాడు. మాటాడి తప్పరాదన్నాడు.

ఆవిధంగా నాయకురాలు బ్రహ్మన్నను మారు పందానికి ఒప్పించింది. నలగామరాజుకు ధైర్యవచనాలు చెప్పింది. వెంటనే

---

1) పల్నాటి వీరచరిత్ర-పదకావ్యం-పింగళి లక్ష్మీకాంతం-పుట 144

మారుపందానికి ఇరుపక్షాలు సిద్ధమయ్యాయి. ఈసారి నాగమ్మ 'సివంగిడేగ' అనే కోడిని సిద్ధంచేసింది. పింగళివారు సేకరించిన పద కావ్యంలో రెండవసారి ఆడిన కోడిపుంజు పేరేమిటో తెలువలేదు. ఇక వీరభాగవతంలోకూడా, మొదటి పందెంలో ఉదహరించిన 'చివ్వల బెబ్బులి'నే రెండవ పందెంలోకూడా ఆడించినట్లుంది. మొదటి పందెంలో ఆడిన నాగమ్మ కోడి చచ్చిందికదా! మరి రెండవ పందెంలో అదేకోడిని ఎలా వదిలారు, పందానికి అనేది సంశయం. కనుక మారుపందెంలో జానపదులు పేర్కొన్నట్లు, నాయకురాలు వదిలినకోడి 'సివంగిడేగ' అనునదే యధార్థం. ఇక బ్రహ్మన్న రెండవసారికూడా మొదటిపందెంలో గెలిచిన చిట్టిమల్లునే సిద్ధంచేశాడు.

నాగమ్మ సివంగిడేగను ఈసారి మువ్వల భీముడు పట్టాడు. ఎన్నో పందాలలో ఆరితేరినా, ఈపందెంలో మాత్రం కొత్తకోడి యిది. కోడిన పట్టిన భీముడుకూడా ఆకోవకు చెందినవాడే. ఇక బ్రహ్మన్న కోడి చిట్టిమల్లునే, మొదటి పందెంలో పట్టిన బాలగోపన్నే పట్టాడు. కొత్తకోడితో గరిడీలోనికి దిగిన మువ్వలభీముడు పందెపు నియమాలను ప్రేక్షకులు కూడా వినేలా మరీమరీ హెచ్చరించాడు. "పందాన్ని చూడవచ్చినస్థలం పరస్థలం వాసులందరికీ" అని సంబోధిస్తూ; ఈసారి ఎవరు ఓడినా, తమ పందెపు నియమానికి బద్ధులై వుండాలన్నాడు. ఒకవేళ బ్రహ్మనాయుడు ఓడితే, ధన ధాన్య వస్తువాహనాలు, మణిమయ కేళికా మందిరాలు, నివాస సౌధాలు విడిచి, యేలేశ్వరం రేవుద్వారా కృష్ణానదిని దాటి ఏడు సంవత్సరాలు పరస్థలాల్లో వన్యజీవనం సాగించాలన్నాడు. అలాగే నాయకురాలు ఓడితే, పైనచెప్పిన విధంగానే సర్వాన్నీ విడిచి చిట్టేల రేవుద్వారా కృష్ణానదిని దాటిపోవాలన్నాడు. ఇందులో ఎవరు ఓడినా, ఎవరు గెలిచినా ఇదే చివరిపందెం. దీనికి తిరుగులేదన్నాడు. అదే విధంగా పత్రాలు వ్రాసుకుని సంతకాలు చేశారు. [1]

---

1) వీరభాగవతము-పద్యకావ్యం-ముదిగొండ వీరభద్రకవి-పుట 128

మరుపందెం మొదలైంది. నోరులేని కోళ్ళు కలియబడ్డాయి. అన్నీ తెలిసిన మనుషులు వాటి ప్రాణాలతోనే చెలగాటం పెట్టుకొన్నారు. ఒక్కసారి వాయిద్యాలు మ్రోగాయి. మొదట్లోనే చిట్టిమల్లు సివంగిడేగను లొంగదీసింది. ఈ కోటికి ఈసారి పోరు జాముసన్నరసేపు సాగింది. పోరు జరుగుతున్నకొద్దీ సివంగిడేగకు ఉత్సాహం ఇనుమడించింది. మొదటి పందెంలో బాగా అలసివున్నకారణంగా, రానురాను చిట్టిమల్లుశక్తి సన్నగిల్లుతూ వచ్చింది. పక్కకు తప్పుకోబోయింది. వెంటనే కన్నమదాసు బ్రహ్మనమీద ఆనపెట్టి తనకత్తిని అడ్డుపెట్టాడు. అలా అడ్డుపెట్టటం పందెపునియమానికి విరుద్ధమన్నాడు మధ్యవర్తిగానున్న అలరాజు. అదే సమయంలో గరిడిలో అక్షింతలు వెలిశాయి. సమయం చూసుకుని చిట్టిమల్లును ఒక్కతన్ను తన్నింది సివంగిడేగ. చిట్టిమల్లు నేలకూలింది. గురిజాలవారివైపు ప్రేక్షకుల్లో విజయధ్వానాలు మిన్నుముట్టాయి. నాగమ్మ కట్టుబోతుల చేత మంత్రాక్షతలు చల్లించి చేతబడి చేయించిందన్నారు మాచెర్ల వీరులు. ఏదియేమైనా ఈపందెంలో గురిజాలవారు జయించారని, తన తీర్పును ప్రకటించాడు అలరాజు. ఇరుపక్షాల వాదోపవాదాలు పెచ్చుమీరి చివరకు యుద్ధానికి దారితీశాయి.

ఆస్థితిలో ఓటమిని సహించలేని గోపన్న, తనబ్రతుకు నిరర్థకమనుకున్నాడు. తనకుతానుగా ఆత్మహత్య చేసుకోలేక, ఓడిన పరాభవాన్ని భరించలేక పెల్లుబికిన పౌరుషాన్ని దిగమింగలేక, తన సమీపంలోనున్న ఆరె జోగన్నకు తన అస్త్రాలనిచ్చి, తనను చంపమని ప్రాధేయపడ్డాడు. గోపన్న కోరికప్రకారం ఆరె జోగన్న బాలగోపన్నపై అస్త్రాలువేసి కూల్చాడు. అది కన్నమదాసుకు తెలిసి, ఆరె జోగన్న తలను ఖండించాడు. చివరకు ఓటమిని అంగీకరించిన బ్రహ్మనాయుడు గోపన్న శవాన్ని తీసుకుని మాచెర్లచేరి దహన సంస్కారాలు చేయించాడు.

ఇదే ప్రస్తావము వచ్చినప్పుడు వీరభాగవతంలో వీరభద్రకవి ఇలా వ్రాశాడు.

గోపన్న తనకోడి ఓడెనన్న విరాగముతో ముప్వల భీముని వద్దకు చేరి....

ఉ॥ ముప్వల భీమః నేనిక విముక్తుడనయ్యెద ఖడ్గధారచేఁ
ద్రెవ్వఁగనేయు నా శిరము-డీని యొకించుకయేని నీమదిన్
నెవ్వగ మానిరమ్ము ధరణిం గృకవాకమువద్ద నాకు లే
దవ్వల జీవితంబిది యధార్థముగా మఱినీకుఁదెల్పితిన్.

కం॥ అని నమ్మఁబల్కి దగ్గఱ
దన చేతి కృపాణమిచ్చి దనుజారిని నె
మ్మనమునఁ జేర్చి విలోచన
వనజంబులు మూసియున్న వాని వినీతిన్.

ఆ॥ మూర్ఛచిత్తుఁడైన ముప్వల భీముండు
గళము దఱిగె నిశిత ఖడ్గధార
విగత జీవుఁడైన విషధరాధిపుఁజంపు
కాకివోలె సుంత కరుణలేక.

అంతలో గోపన్న జాడకోస మచ్చటికి

గీ॥ వచ్చి కన్నమ దాసుండు వాని ఖడ్గ
మరసి గోపన్న నడఁచె సత్యం బితండ
టంచు ముప్వల భీమునిఁదుంచె ఖడ్గ
ధారఁ గంఠంబు తెగి రక్తధారలొలుక-[1]

ఏదియేమైనా, ఈ కోడిపందానికి మాచెర్ల రాజైన మలిదేవరాజు రాలేదు. అందుకు కారణం, అతనికి ఈ కోడిపందెం ఇష్టంలేదు. అయినా,

---

1) వీరభాగవతము-ముదిగొండ వీరభద్రకవి -
చతుర్థాశ్వాసము-పుటలు 131-132

బ్రహ్మనాయుడు కోడిపందెమాడాడు. ఆడినవాడు, మొదటే విజయం పొందాడుగదా! మళ్ళీ మారుపందానికి ఒ ప్పు కో వ ట మే మి టి? తొలి విజయాన్ని చవిచూసిన ఉత్సాహంతో, మలి పందెం అంతగా అవసరం లేకపోయినా, అంగీకరించాడు. పైగా తొలిపందెంలో బాగా అలిసిపోయిన కోడినే మలిపందెంలోకూడా పెట్టాడు. తొలిపోరులో నా గ మ్మ కో డి చచ్చింది. కనుక మలిపందెంలో మరోకోడిని తెచ్చి పెట్టింది. కొత్తకోడి ముందు, అలిసిపోయిన కోడి ఓడటం సహజమేకదా! దీనికి కట్టుబోతులచేత మంత్రాక్షతలు చల్లించి ఓడించవలసిన అవసరంలేదు. అలాంటి మంత్రాక్షతలు బ్రహ్మనాయుడి దగ్గరకూడా వున్నాయికదా! పైగా ఆయన తల్లి శీలమ్మకూడా కొన్ని మంత్రాక్షతల్ని యిచ్చి పంపించిందికదా! ఆ మంత్రాక్షతల్ని తానే ముందుగా చల్లి విజయం సాధించవచ్చుగదా! ఒకవేళ తానేచల్లి ఆపెపాన్ని నాగమ్మకు ఆపాదించాడేమో! అయినా, మంత్రాక్షతలకు కోడి ఓడిపోతుందా అనేది హేతువుకందని విషయం! ఇది కేవలం అభూత కల్పన. మొదటిసారి ఓడిపోయిన నాగమ్మ, మీదు మిక్కిలి తెలివితో మారుపందానికి బ్రహ్మనాయునను ఒప్పించింది. బ్రహ్మనాయుడు తెలివి తక్కువతనంతో ఒప్పుకుని ఓడిపొయ్యాడు. ఇది నాయకురాలు నాగమ్మచూపించిన నయకౌశలం. దీనిమూలంగా రెండుగా చీలిన పల్నాడు ఒక్కటైంది. దీనినే 'ఆరువల్లి నాయివారి దుర్మంత్రం' బన్నారు పూర్వకవులు.

బ్రహ్మనాయుడు గొప్ప జూద క్రీడా వ్యసన లోలునిగా నిర్ణయించే ఈకథను, రెంటచింతల నివాసి జక్కంపూడి పెద్దవెంకటేశ్వర్లు, మధురమైన వాచకంతో, క్రమబద్ధమైన భావాభినయంతో ఆకర్షణీయంగా చెప్తూ వుంటే, వినేవారికి ఆసక్తితోపాటు ఆనందంకూడా కలుగుతుందనటంలో సందేహంలేదు.

## పలువురి పాలనలో పల్నాడు

అనాటి పల్నాడుపై శాల్యం 1050 చదరపు మైళ్ళు. ఇదిసముద్రానికి 120 మైళ్ళ దూరంలో వుంది. దీనికి ఉత్తర పశ్చిమాలుగా 75 మైళ్ళ పొడవున కృష్ణానది ప్రవహిస్తుంది. ఈ పల్నాటిని శా. శ. 1033 (క్రీ. శ. 1111) నాటికి 300 గ్రామాలున్నట్లు, మాచెర్ల అదితేశ్వ రాలయంలోని నాగస్తంభ శాసనం ప్రకారం 'పల్లిదేశ శతత్రయాన్తర్వర్తి' అను పదాన్ని బట్టి తేలుతుంది. కొండవీటిదండకవి తనుబట్టి ప్రతాపరుద్రుని కాలంనాటికి 150; అప్పకవి కాలంనాటికి 184; మద్రాసు రాష్ట్రపు తాలూకాల విభజన జరిగినప్పుడు 200 గ్రామాలున్నట్లుంది.

ఈ పల్నాడును 7 మొదలు 11వ శతాబ్దంవరకు పల్లవులు; 12-13 శతాబ్దాల్లో పల్నాటి హైహయులు, చోళులు, కాకతీయులు 14-15 శతాబ్దాల్లో రెడ్లు; 16వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు; 16-17 శతాబ్దాల్లో మహమ్మ దీయులు పాలించినట్లు చరిత్రనుబట్టి, శాసనాధారాలనుబట్టి తెలుస్తోంది. 18వ శతాబ్దంలో ఈపల్నాడు ఆంగ్లేయుల పాలనక్రిందికివచ్చినా, ఒంగోలు నెల్లూరు సీమలలాగా ఆర్కాటు నవాబుక్రిందనే వుంది. ఆ తర్వాత ఔరంగజేబు కాలంలో రామరాజు మంత్రిప్పను వారసత్వపు దేశముఖుగా, కుమారవారి వంశంలో మరియొకరిని దేశపాండ్యగా నియమించి పాలించారు. ఆ తర్వాత మంత్రిప్ప మనుమడు వీ ర భ ద్రి య్య 34 సంవత్సరాలు పల్నాడంతా తన పాలనలోనికి తెచ్చుకుని, సంవత్స రానికి 3 లక్షల రూపాయలు ఆర్కాటు నవాబుకు కప్పంకడుతూవచ్చాడు.

క్రీ. శ. 1764లో ఆర్కాటు నవాబు వీరభద్రియ్యను తగ్గించి, పల్నాటిని 5 సీమలుగా విభజించి పాలన సాగించాడు. అవి మాచెర్ల, గురిజాల, తుమ్మకోట, కారెంపూడి, తంగెడుసీమలు. ఇలా విభజించిన ఆ సీమలపై దేశపాండ్యలుగా ఆధిపత్యమిస్తున్నట్లు కొందరిని నియమించి పాలన సాగించారని క్రీ. శ. 1783 నాటి చింతల రామేశ్వరుని గుడిలోపల శాసనాలనుబట్టి తెలుస్తుంది.

క్రీ. శ. 1766న తుమ్మకోటలోనున్న ఆంగ్లేయసేనలు, నవాబు సేనలకు రక్షణగా వుంచబడ్డాయి. కాని, యిజరా దారులు ప్రజల్ని పీడించి

సర్కారుకు లాభం చేకూర్చారేకాని పల్నాటిని దుర్దశపాల్జేశారు. క్రీ. శ. 1787వ సంవత్సరంలో తక్కిన జిల్లాలతోపాటు, ఈ పల్నాటినిగూడా ఆంగ్లేయ కంపెనీకి నవాబుచే తాకట్టు పెట్టబడింది. క్రీ. శ. 1790లో కంపెనీవారు స్వపరిపాలన కిందికి తెచ్చుకుని ఈపల్నాటినీ, ఒంగోలునూ కలిపి వర్కిచిన్ దొరవారిని కలెక్టరుగా నియమించారు. అప్పటికి పల్నాడులో వున్న గ్రామాలు 150. అందులో 27 గ్రామాలు నిర్మానుష్యాలు.

మళ్ళీ క్రీ. శ. 1792లో కంపెనీవారు ఈపల్నాటిని (సీడెడ్ డిస్ట్రిక్టు) సేవా భత్యానికి వదలిన జిల్లాలలో చేర్చి, దేశముఖ్ రామరాజు వీరభద్రయ్య కుమారుడు రాజేశ్వరరావుకూ, దేశపాండ్య కుమార వీరన్నకూ, నెలకు చెరినూరు వరహాలు వేతనమిస్తూ పల్నాటిపాలన కప్పగించారు. క్రీ. శ. 1793లో కుమారవీరన్నకు ఎందుచేతనో వేతనం ఆగిపోయింది. వెంటనే వీరన్న నిజాంరాజ్యంలో తన స్నేహితుడైన ఒక జమీందారుద్వారా వేయిమంది భటుల్ని తీసుకొచ్చి, తుమ్మకోటపై దాడిజరిపి ఆంగ్లేయసైనికుల్ని చంపించాడు. క్రీ. శ. 1801లో జరిగిన ఒడంబడికప్రకారం పల్నాటిని తిరిగికంపెనీవారు స్వాధీనం చేసికొని గుంటూరు కలెక్టరుగారైన స్కాట్‌దొరవారి పాలనకింద ఉంచారు.

స్కాట్‌దొరవారి పల్నాటి హీనస్థితిని గుర్తించి, బాధలకు గురియైన రైతులకు ప్రభుత్వంనుండి అప్పులుఇప్పించి కొంతవరకు సహాయపడ్డారు. ఆతర్వాత రాజేశ్వరరావుకూ, కుమార వీరన్నలకూ చెరి 75 వరహాలు వేతనమిస్తూ వచ్చారు. మరలా క్రీ. శ. 1804లో క్రోఫోర్డుదొర కలెక్టరుగావచ్చి, ఈ తాలూకాను సర్వేచేయించి, వ్యవసాయాన్ని బాగా అమలువరిచారు. ఆ తర్వాత వీరన్న చనిపోవటంతో అతని వేతనం ఆగిపోయింది. అది తెలిసి వీరన్నకుమారుడు విశ్వేశ్వరరావు 1812లో నైజాంనుండి బసవన్న అనేవాణ్ణి పిలిపించి, పల్నాటిని బందిపోటుఅల్లర్లకు గురిచేశాడు. బసవన్నను పట్టుకుని శిక్షించి, రెండవ వేతనవరుడైన రామరాజు రాజేశ్వరరావుకూ, అతని తర్వాత అతనికుమారుడు

వీరభద్రయ్యకూ, చివరకాతని మరణానంతరం అతని ఇద్దరుభార్యలకూ, 50 వరహాలు వారి జీవితాంతాలవరకూ వేతనాలు సాగించారు. ఈ వేతన వరులైన రామరాజు వారివంశం మిక్కిలిగా ఈనాటికీ ప్రబలివుంది. కాని కుమారవారివంశంలో ఎవరూ కానరారు.

ముదిగొండ వీరభద్రకవిగారు రచించిన వీర భాగవతంలో శ్రీ మద్దులవల్లి గురుబ్రహ్మశర్మగారు వ్రాసిన అవతారికకు ఇది సంగ్రహ రూపంగా వ్రాయబడింది.

# మాచెర్ల – చెన్నకేశవాలయాలు

వీరవిద్యాదేవికి జన్మించిన మలిదేవాదులను బ్రహ్మనాయుడు దగ్గరకు తీసి పల్నాటిరాజ్యంలో కొంతభాగమిప్పించి, గురిజాల నుండి విడిపోయి, మాచర్ల పట్టణమును నిర్మించుకుని, వారుయుక్తవయస్కులు కానందున వారికి బదులు తానే పరిపాలించాడని శ్రీ ఉమాకాన్తంగారు వీరచరిత్ర ప్రథమభూమిక 81-82 పుటలలో వ్రాశారు. ఇక శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు సేకరించిన పల్నాటి వీరచరిత్ర పదకావ్యంలోని 53–54 పుటలలో

'వీరులందరితోడ వెడలి గురిజాల
చంద్రవంకకు వచ్చి జలకమ్ములాడి
మజిలి చేసినతావు మాచెర్లయనుచు
పట్నమ్మునకు పేరు పరగంగబెట్టి'

అని వుండటంతో శ్రీ ఉమాకాన్తంగారి సూచన నిజమేనని చెప్పక తప్పదు. కాని పల్నాడును పాలించిన హైహయరాజుల కాలంనాటికే "ఇది మహాదేవి చెరువు, మహాదేవి తటాక" అను పేర్లతో ప్రసిద్ధమైన గ్రామమై, రాజధానిగా ఎన్నబడినట్లు శ. సం. 1030 లేక (క్రీ.శ. 1111) చాగి బేతరాజు శాసనాలవల్ల తెలుస్తుంది.

1. స ఏవ "మహాదేవి తటాకే" చంద్రభాగానదీప్రదేశ
   అతుకూరిమార్గ సమీపే దశనివర్తన పరిమితాం ప్రాదాన్.
2. సబేత భూపతిః శౌనకగోత్రేన మహీధర పౌత్రేణ
   శ్రీధరపుత్రేణ జోగిమాంబికా నందనేన శ్రీమదాదిత్యేన
   "మహాదేవి తటాకాభిదానాయాం" రాజధాన్యా ప్రతిష్ఠితా. [1]

అని వుండటంచేత ఈమాచెర్లయనే గ్రామం బ్రహ్మనాయనికి పూర్వమే "మహాదేవ తటక" అనే పేరుతో పల్నాటికి రాజధానిగా వున్నట్లు విశదమౌతుంది.

---

1) ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము–
కుందూరి ఈశ్వరదత్తు–పుటలు 146-201-202

పూర్వం ఇక్కడొక గొప్ప తటాకం (చెరువు) వుంది. ఈ తటాక మధ్యలో ఒక దేవి (రూపులమ్మ) గుడి వుంది. ఇది 1500 ఏండ్లకు పైకాలమున కట్టినదనీ, ఈగుడికట్టిన తర్వాతనే చెరువునిర్మాణం చేశారనీ, మహాదేవి ఈచెరువుమధ్యలో కలదుకాన మహాదేవి తటాకమని పేరుపెట్టి; గ్రామానికికూడా ఆపేరే పెట్టారని చరిత్రకారుల నిర్ణయమేకాక, జనశ్రుతి కూడా వుంది. దీనినిబట్టి బ్రహ్మనాయడు నూతనంగా ఈగ్రామాన్ని కట్టించాడనేది అసత్యం. కాకపోతే పూర్వ మెప్పుడో కట్టినగ్రామం పాడు బడటంతో బ్రహ్మనాయుడు దానిని బాగుచేసియుండవచ్చు. అందువల్ల బ్రహ్మనాయడు కట్టించాడనే వాడుకగూడా యుంచవచ్చు. ఏది ఏమైనప్పటికీ బ్రహ్మనాయని తర్వాతకూడా ఈగ్రామాన్ని "మహాదేవి చెరువు" అని పిలువబడుతూ వచ్చిందేకాని కావ్యాల్లో వున్నట్లు బ్రహ్మ నాయడు మజిలి చేసిన తావుగా 'మాచెర్ల' అని మాత్రం పిలువబడలేదు

ఈ పట్టణానికి పూర్వభాగమైన చంద్రవంక నదీ తీరానగల త్రినేత్రుని ఆలయం ముందున్న శాసనంలో ఈవిధంగా వుంది.

శా. శ. 1276 (క్రీ. శ. 1354) అగు నేటి భాద్రపద శుద్ధ పౌర్ణమీలు శ్రీమన్మహా మండలేశ్వర వీరప్రతాప బిరుదాంకితులు నగు శ్రీశ్రీ ప్రతాప రుద్ర మహాదేవరాజులుంగారు సజీవులై రాజ్యముసేయుచుండగా వారి సామంతు శ్రీశ్రీ మాచయనాయనింగారు ఈ మహాదేవి చెర్వుపట్టణమును ఏలుచుండి, శ్రీ స్వామివారికి అంగరంగ భోగాదులు జరుగుటకుగాను కొంత భూవసలి సమర్పించినట్లు ప్రకటించబడింది. దీనినిబట్టి ఆనాటి సామంతప్రభువు మాచయనాయనింగారు అయిన కారణంగా మాచయ అనుశబ్దం మాచెర్లగా మారి యుండవచ్చునంటారు. [1]

ఇక ఈశాసనం తర్వాత లభించిన శాసనాలలో (ఒక్కముక్తిరాజు శాసనంలో తప్ప) ఈ గ్రామనామం మాచెర్ల అనే వ్రాయబడి వుంది. కనుక మహాదేవిచెరువు అనేగ్రామం మాచనాయని కాలంనుండి మాచెర్లగా మారినదనటంలో అతిశయోక్తిలేదు.

1) చెన్నకేశవస్వామి క్షేత్రమహాత్మ్యం -
సూరపురాజు వెంకటామయ్య పుట 2-3

ఇక చాగి మొదటి చేతరాజుకాలం (క్రీ. శ 1111)లో నిర్మింపబడిన ఆదిత్యేశ్వరాలయాన్ని; అనుగురాజు పల్నాటికి రాజ్యాభిషిక్తుడైన తొలిరోజుల్లో, అంటే క్రీ. శ. 1132-33 ప్రాంతంలో, బ్రహ్మనాయని ప్రోద్బలంతో చెన్నకేశవాలయంగా మార్చబడి గర్భాలయంవరకు నిర్మించబడింది. అంతకుముందు దీనిని "దర్దళం" (పైకప్పులేనిగుడి) అని పిలిచేవారు.[1] దీని నిర్మాణంకోసం దానం చేసినవారిలో వెంకటగిరి వెలుగోటి రాజవంశపు స్త్రీ ఒకరని అక్కడి శాసనంవల్ల తెలుస్తుందంటూ ఉమాకాన్త విద్యాశేఖరులు పల్నాటి వీరచరిత్ర ద్వితీయ భూమికలో తెలియపరిచారు. పుట 79.

అలా చెన్నకేశవ ఆలయంగా మార్చబడిన తొలిరోజుల్లో చెన్నకేశవ స్వామి ఆలయ పూజానిర్వహణాధికారం మాల (హరిజను)ల కర్పింపబడి,[2] వారికి జమ్మలమడక అనేగ్రామాన్ని అగ్రహారంగా ఇవ్వబడింది.

బ్రహ్మనాయని ఆధిపత్యంలో దేవపూజావిధిలో పాల్గొనువారు దాసులుగానూ, మతప్రచారంలో పాల్గొనువారు గోసంగులుగానూ,[3] ఆనాటి చరిత్రను గానంచేయువారు వీరవిద్యావంతులుగానూ పేర్కొనబడి ప్రసిద్ధులైరి. కాని పల్నాటి యుద్ధానంతరం పల్నాటిలో తీవ్ర కరువు పరిస్థితులేర్పడి జీవనాధారంకోసం ఇతర ప్రాంతాలకు మాలలంతా వలస వెళ్ళిపోయ్యారు.

వారిలో గోసంగులనబడేవారు వారి పూర్వస్థావరమైన 'మాలేపాడు' (ఇది ప్రొద్దుటూరుకు ! కిలోమీటర్ల దూరంలో, పెన్నానదికి ఆవల వుంది) చేరి, అక్కడొక చెన్నకేశవాలయాన్ని నిర్మించుకుని, వారే అర్చకత్వం నిర్వహిస్తూ జీవనాన్ని సాగించారు. అలా మాలేపాడు వెళ్ళినవారి సంతతిలో 19వ శతాబ్దపు ఉత్తరార్ధంలో చెన్నకేశవ స్వామికి అర్చకత్వం

---

1) చెన్నకేశవస్వామి క్షేత్రమహాత్మ్యం-
సూరపురాజు వెంకటామయ్య పుట 13
2) చెన్నకేశవస్వామి హరిజనార్చకులు- గంధం నాగేశ్వరరావు పుట 92
3) చెన్నకేశస్వామి-హరిజనార్చకులు-గంధం నాగేశ్వరరావు పుట 93

నెరపిన పెనికలపాటి చటారయ్య (చటారుదాసు) గొప్ప విద్వాంసులు, సంగీత సాహిత్యాల్లో ప్రతిభాశాలి. ఈయనవాక్కు ఆ ప్రాంతవాసులకు వేదవాక్కు. సకాలంలో వర్షాలు కురియకపోయినా, గ్రామాలలోనూ, పొలాలలోనూ, చీడపీడలంకురించినా పశునష్టం జరుగుచున్నా, ఈ చటారు దాసుచే రామాయణాన్ని పారాయణం చేయిస్తే వర్షాలు కురిసి, ఆ ప్రదేశ మంతా సుభిక్షంగా వుండేదని జనశ్రుతి. ఈయన తర్వాత ఈయన పెద్ద కూతురు గొప్ప జ్ఞానియై ఈనాటికీ అవిశ్రాంతభక్తితో మఠవాసం చేస్తూ వుంది. ఇక్కడ చెన్నకేశవస్వామికి ప్రతిసంవత్సరం వైశాఖ శుద్ధ తదియలు తిరుణాళ్ళ జరుపుతారు. ప్రస్తుతమున్న అర్చకులు చింతా పెద్దచెన్నయ్యగారు.

అలాగే వలసవెళ్ళిన అర్చకదాసుల్లో కొందరు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకా ఉప్పులూరు చేరారు. వీరు తిరువీధివారు. గ్రామవీథిలో దేవుని ఊరేగింపు కార్యక్రమం వీరికి ముఖ్యం. తిరువీధి సేవచేయువారుకాన తిరువీధివారని పిలువబడుతూ, ఉచ్చారణ సౌలభ్యం కోసం "తిరు" అనునది పోగా "వీధి" అను ఇంటిపేరుతో ఇప్పుడు వ్యవహ రింపబడుతున్నారు. పల్నాటి యుద్ధానంతరం నూరేళ్ళకు వీరు ఉప్పులూరు గ్రామం చేరారు. [1]

చందవోలు దుర్జయ గొంకరాజులకు పల్నాడు స్వాధీనమైన రోజుల్లో, కందూరు చోడుల ఆశ్రయంలో మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట తాలూకా అమరాబాదు మండలంలోని మాధవానిపల్లె చేరి అక్కడ రాయలగండి కొండమీద నిర్మించుకున్న వారి పూర్వపు దేవాలయమైన చెన్నకేశవస్వామి ఆలయానికే అర్చకత్వం నెరపినవారు దాశరథివారు. వీరు పల్నాటి యుద్ధానంతరం తిరిగి ఆ ప్రాంతానికేచేరి, ఆ చెన్నకేశవస్వామికే అర్చకత్వం నెరపుతున్నారు. ప్రస్తుతమున్న అర్చకులు దాశరథి సుధాకరయ్యగారు.

---

1) చెన్నకేశవస్వామి-హరిజనార్చకులు -
గంధం నాగేశ్వరరావు పుటలు 92-93

వీరంతా ఈనాటికీ యజ్ఞోపవీత ధారణకల్గి, స్వామివారి కల్యాణ నిర్వహణ శాస్త్రీయ విధానము, దైవ పూజా విధి, యాజ్ఞికహోమ నిర్వహణాది కార్యాల్లో పరిపూర్ణజ్ఞానులై యుండుట మిక్కిలి ఆనంద దాయకం.

ఇక పూర్వమొకప్పుడు దుర్జయగొంకరాజుల స్వాధీనమైన పల్నాటి పునస్సాధనకోసం, తీర్థయాత్రా నెపంతో చెన్నకేశవ పూజావిగ్రహం కోసం వెళ్ళిన బ్రహ్మనాయుడు ముందుగా అర్ధవీడుచెన్నకేశవాలయంలోని మూలవిగ్రహాన్ని తొలగించాడు. కాని ప్రత్యర్థులు జరిపిన దాడి తీవ్రతకు తట్టుకోలేక విఫలుడై వెళ్ళాడు. మనోహరమైన శిల్పసంపదతో అలరారు అర్ధవీడులోని చెన్నకేశవాలయంలో ఈనాటికీ, మూలవిరాట్టు ఒకప్రక్కన పడిపుంది నిరాదరణకు గురియై, పూజా పునస్కారములు లేక ఆలయమంతా శిథిలమై ఒక అవశేషంగా మిగిలిపోయి, గత చరిత్రకు తార్కాణంగా నేటికీ కనిపిస్తుంది.

ఆవిధంగా అర్ధవీడులో విఫలుడైన బ్రహ్మనాయుడు కనకాద్రిపల్లె (ఇది కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలంలోనిది. బనగాని పల్లె నుండి తాడిపత్రికి వెళ్ళే మార్గంలో ఇటికాల అనే గ్రామానికి చేరువలో వుంది.) చేరి, అక్కడి చెన్నకేశవాలయంలోని విగ్రహాన్ని తొలగించి తీసుకొనిపోయి, తనయాత్రలో ఉపయోగించుకుని, పల్నాడును సాధించిన అనంతరం ఆవిగ్రహాన్ని మాచెర్లలో ప్రతిష్ఠించాడు. నేడు ఈచెన్నకేశవ ఆలయంకూడా దేవుడులేని ఆలయంగా ఉండిపోయి, ఆలనా పాలనా లేక ఏకాంతంలో అవక్షయమై, గతకాలపు స్మృతిచిహ్నంగా నేటికీ చూపరులకు శిథిలరూపంలో దర్శన మిస్తుంది. ఈ రెండు చెన్నకేశవాలయాల వినాశనానికి బ్రహ్మనాయుడే కారకుడు.

కాలగమనంలో ఈపల్నాటిని ఎందరోరాజులు పరిపాలిస్తూవచ్చారు. వారివారి కాలాల్లోకూడా మాచెర్లలోని చెన్నకేశవాలయానికి పునరుద్ధరణ జరిగి యుండవచ్చు కాని, అట్టిశాసనాలు కొన్ని మాత్రమే చరిత్రకారులకు లభించినట్లుంది. చివరకు 18వ శతాబ్దంలో ఈపల్నాడు ఔరంగజేబు

వశమైంది. ఈయన పాలనాకాలంలో రామరాజు మంత్రప్పను దేశముఖుగా, కుమారవారి వంశంలో మరియొకర్ని దేశపాండ్యాగా నియమించి ఈపల్నాడును వారికి జమీగా యివ్వటం జరిగింది.[1] ఈదేశముఖు దేశపాండ్యగారలు చెన్నకేశవస్వామికీ, ఇదే ఆలయ ప్రాకారంలోని వెంకటేశ్వరస్వామికీ (ఇప్పుడిది శిథిలమై వుంది) కలిపి ఉభయులకూ ఉపయుక్తంగా వుండేలా ఈ జమ్మలమడక అగ్రహారాన్ని మార్పుచేశారు.[2] వీరి కాలంలోనే అగ్రవర్ణస్థులైన వైష్ణవాచార్యులను అర్చకులుగా నియమించి వారికే ఈజమ్మలమడక గ్రామాన్ని అగ్రహారంగాకూడా ఇవ్వటం జరిగియుండవచ్చు. మరికొన్ని శాసనాల ఆధారంతో మాచెర్ల చెన్నకేశవస్వామి ఆలయ పునరుద్ధరణ ఈవిధంగా జరిగిందని తెలుస్తుంది.

హైహయరాజుల పాలన తర్వాత కాకతీయుల కాలంలో పల్నాటి వీరులకు శ. సం. 1237 (క్రీ. శ. 1315)లో కొంతభూమి ఇవ్వబడినట్లు చెన్నకేశవాలయంలోని ఒకరాతిపై వ్రాయబడింది. చెన్నకేశవస్వామి ఆలయంముందున్న ఒక మండప స్తంభంపై శ.సం. 1319 (క్రీ. శ. 1397 ఈశ్వర సం॥)నాటి శాసనంలో పేరూరి ముక్తిరాజు అనునాతడు మహాదేవి చెర్వులోని చెన్నకేశవుని గర్భగుడికి కొన్ని మరమ్మత్తులు చేయించినట్లు పేర్కొనబడింది. మరొక స్తంభంపై శ. సం. 1336 (క్రీ. శ. 1414) జయ సంవత్సరంనాటి శాసనంలో జన్యావుల కేశవనాయనింగారు దేవాలయం ముందున్న మండపానికి కొన్ని మరమ్మత్తులు చేయించినట్లు పేర్కొనబడింది. మూడవ స్తంభంపైవున్న శ. సం. 1351 (క్రీ. శ. 1429) సిద్ధార్థి సంవత్సరంనాటి మరొక శాసనంలో చెనుకలి గోపనాయనింగారు దేవాలయం ముందున్న మండపానికి కొన్ని మరమ్మత్తులు చేయించినట్లు పేర్కొనబడింది. మరొక స్తంభంపైవున్న శ. సం. 1541 (క్రీ. శ. 1619) నాటి మరొక శాసనంలో విశ్వకర్మ కులానికి

---

1) వీరభాగవతము–అవతారిక–మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ–పుట 5

2) చెన్నకేశవస్వామి క్షేత్రమహాత్మ్యము –
సూరవరాజు వెంకట్రామయ్య పుట 3

చెందిన ఒకవ్యక్తి చెన్నకేశవస్వామి దేవాలయంలో నిత్యదీపానికై కొంత భూమిని కానుకయిచ్చినట్లు పేర్కొనబడింది. [1]

ఈ చెన్నకేశవస్వామి ఆలయప్రాకారం వెలుపలనున్న ఒకపెద్ద రాతికంబాన్ని ధూపాటి సీమలోని త్రిపురాంతక నివాసులగు పాలుట్ల తిరుపతయ్యగారి కుమారుడు ఓబన్నగారు ప్రతిష్ఠించారు. ఈప్రతిష్ఠ శా. శ. 1566 (క్రీ. శ. 1644)లో జరిగింది [2]

ఆ తర్వాత దుర్గి గ్రామ వాస్తవ్యులు శ్రీ కంచనపల్లి నారాయణరావు పంతులుగారు పదివేల రూపాయలు వెచ్చించి, ఈ చెన్నకేశవ స్వామికి ఒక పెద్ద రథాన్ని నిర్మించి యిచ్చారు. ఆనాడు ఈరథనిర్మాణానికి పదివేల రూపాయలు ఖర్చుచేయుటం జరిగింది. దీని నిర్మాణం ది. 23-4-1879లో మొదలై ది. 29-4-1880 నాటికి పూర్తిచేసుకుని ప్రథమోత్సవం జరుపబడింది. [3]

ఇలా మాచెర్ల చెన్నకేశవస్వామి దేవాలయం శతాబ్దాల తరబడి అంచెలంచెలుగా అభివృద్ధిచెంది నేటికీరూపంలో దర్శనమిస్తుంది.


ఈవిధంగా పల్నాటి చరిత్ర జరిగిన కాలంలోని చెన్నకేశవ ఆలయాల స్థితిగతులు కొనసాగాయి. ★

---


1) గుంటూరు మండల సర్వస్వం-మాచెర్ల దేవాలయం వ్యాసకర్త యస్. రమేశన్ ఐ.ఎ.యస్. సంపాదకులు-దరువూరి వీరయ్య పుట 271

2) చెన్నకేశవస్వామి క్షేత్రమహాత్మ్యం- సూరపరాజు వెంకటరామయ్య పుట 34

3) వీరభాగవతము-అవతారిక-మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ పుట 12



మూలవిగ్రహం తొలగించబడి శిథిలావస్థలోనున్న
"అర్ధవీడు" చెన్నకేశవాలయం
(ప్రకాశం జిల్లా)



మాచెర్ల చెన్నకేశవాలయం
"పల్నాడు"
(గుంటూరు జిల్లా)

# ఉపయుక్త గ్రంథాలు-వ్యాసాలు


1. చెన్నకేశవస్వామి క్షేత్ర మహాత్మ్యము - సూరవరాజు వెంకటరామయ్య
2. చంద్రప్రభ చరిత్ర - తిరుపతి వేంకటేశ్వర కవులు
3. ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర-ఏటుకూరు బలరామమూర్తి
4. మగువమాంచాల-బాలచంద్రుడు-అలరాజు ఏటుకూరి వేంకటనరసయ్య
5. ఆంధ్రదేశ చరిత్ర-సంస్కృతి - ఆచార్య పిశుపాటి శ్రీరామశర్మ
6. పల్నాటి వీరచరిత్ర-పదకావ్యం-పింగళి లక్ష్మీకాంతం
7. గుంటూరు మండల సర్వస్వం-శ్రీ యన్. రమేశన్-యస్. ఎ. యస్. సంపాదకులు-దరువూరి వీరయ్య
8. వీరభాగవతము-అభిప్రాయాలు-జయంతి రామయ్యపంతులు మల్లాది వేంకటసోమయాజులు
9. వీరభాగవతము-ఉపోద్ఘాతము-జానపాటి పట్టాభిరామశాస్త్రి
10. పల్నాటిసీమలో కోలాటం-డాక్టర్ బిట్టు వెంకటేశ్వర్లు
11. ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి-ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం, ఖండవల్లి బాలేందు శేషగిరి
12. కమ్మవారి చరిత్ర-కొత్త భావయ్యచౌదరి
13. విస్మృతాంధ్ర నాయకులు-కొడాలి లక్ష్మీనారాయణ
14. అప్పకవీయము-కాకునూరి అప్పకవి
15. కాకతీయుల కాలంనాటి సామాజిక జీవితం-మలయశ్రీ
16. పల్నాటి యుద్ధం-నాటకం-మేళ్ళచెరువు పద్మనాభం
17. పల్నాటి యుద్ధం-నాటకం- డాక్టర్ కంభాళమఠం బసవలింగదేవర
18. ఆంధ్ర నాట్యం-జానపద గిరిజన నృత్యాలు- డా॥ నటరాజ రామకృష్ణ
19. కందూరి చోడుల శాసనములు-చరిత్ర-సంస్కృతి- బి. యన్. శాస్త్రి, ఎం. ఏ.
20. త్రిపురాంతక దేవాలయ శాసనములు-బి. యన్. శాస్త్రి, ఎం. ఏ.

21. - మార్కండేయ పురాణం-మారన-వావిళ్ళ ప్రచురణ
22. పల్నాటి వీరకథాచక్రము-డా తంగిరాల వెంకటసుబ్బారావు
23. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము-కుందూరి ఈశ్వరదత్తు
24. వీరభాగవతము-అవతారిక-మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ
25. వీరభాగవతము-పద్యకావ్యం-ముదిగొండ వీరభద్రకవి
26. వలనాటి వీరచరిత్ర-నాటకం-ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి
27. బ్రహ్మనాయుడు-డాక్టర్ బిట్టు వెంకటేశ్వర్లు
28. పల్నాటి వీరచరిత్ర-చిట్టిబాబు
29. క్రీడాభిరామము-వినుకొండ వల్లభరాయుడు
30. చెన్న కేశవస్వామి-హరిజనార్చకులు-గంధం నాగేశ్వరరావు
31 భారతదేశ చరిత్ర-సంస్కృతి-మొదటి భాగం -
వారణాశి యశోదాదేవి
32 వలనాటి వీరచరిత్ర-పండిత ఉమాకాన్త విద్యాశేఖరులు
33. పల్నాటి వీరచరిత్ర-టెంటాల గోపాలకృష్ణ
34. పల్నాటి వీరచరిత్ర-నాగశ్రీ
35. వీరభూమి-బుర్రకథ-డాక్టర్ కంభాళమరం బసవలింగదేవర
36. జానపద విజ్ఞానము-డాక్టర్ బిట్టు వెంకటేశ్వర్లు
37. Journal of Te ugu stud es Vo . No. 1 Book No 1
38. భారతి-అక్టోబరు 1985
39. భారతి-జూన్ 1986
40. ఆంధ్రప్రభ-సచిత్ర వారపత్రిక-16-6-82, 23-6-82
అగ్నిపునీత ల్లాదేవి
41. ఆంధ్రప్రభ-దినపత్రిక-బ్రహ్మనాయని రాజనీతి-29-6-69
42. బ్రౌణ్య తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు
43. శబ్దార్థ చంద్రిక-మహాకాళి సుబ్బారాయుడు

## పౌరాణిక కథలు:

1. బోయరాజు కథ-గంగుల పెద్దరాజన్న

పాపినేనిపల్లి-అర్ధవీడు మండలం-ప్రకాశం జిల్లా

2. పాపన్న యుద్ధం-లాకా అవులయ్య-

అర్ధవీడు-అర్ధవీడు మండలం-ప్రకాశం జిల్లా

3. పాపినీని ఒరుగు-నలగొండ కోటయ్య-

బోగోలు-కంభం మండలం-ప్రకాశం జిల్లా

4. కూర్మయ్య కథ-గుప్పల మల్లయ్య-

సిద్ధాపురం-అచ్చంపేట తాలూకా-మహబూబ్‌నగర్ జిల్లా

5. నాయకురాలి కథ-నగునూరు వెంకటయ్య-

ఆరవెల్లి పెగడపల్లి మండలం-కరీంనగర్ జిల్లా

బండారు కేశవరావు-నూకపల్లి; నన్నపరాజు హనుమంతరాజు

నుస్తలపూరు-కరీంనగర్ జిల్లా

6. దాశరథి సుధాకరయ్య-

మాధవానిపల్లె-అమరాబాదు మండలం-మహబూబ్‌నగర్ జిల్లా

7. వంగీపురం వెంకటాచార్యులు-

గంగాపురం-జడ్చర్ల మండలం-మహబూబ్ నగర్ జిల్లా

8. సురభి (అల్లం) కొండలరావు-

గుడ్లనరవ-బిజినేపల్లి మండలం-మహబూబ్‌నగర్ జిల్లా

9. కొండూరి కాశమ్మ-గోపాలపురం-పామూరు-ప్రకాశం జిల్లా

10. మాదినేని రాధాకృష్ణమూర్తి-మాచెర్ల-గుంటూరు జిల్లా

11. మద్దికర మల్లారెడ్డి కోలగుట్ల-దుర్గి మండలం-గుంటూరు జిల్లా

12. మేడం వెంకటరాయుడు-లింగాలదిన్నెపల్లె-

బద్వేలు తాలూక-కడప జిల్లా

13. గుండ్లదుర్తి శివరామిరెడ్డి-మాలేపాడు-ప్రొద్దుటూరు-కడప జిల్లా

14. జక్కంపూడి పెదవెంకటేశ్వర్లు-రెంటచింతల-గుంటూరు జిల్లా

15. జక్కంపూడి అయితం-గడేపునిపాడు-గుంటూరు జిల్లా.

| | |
|---|---|
| అనుగురాజు రాజ్యపాలవ | క్రీ. శ. 1132-1147 |
| నలగామరాజు జననం | క్రీ. శ. 1134 |
| రాజ్యపాలన | క్రీ. శ. 1147-1182 |
| మలిదేవరాజు జననం | క్రీ. శ. 1140 |
| రాజ్యపాలన | క్రీ. శ. 1172-1173 |
| పల్నాడు విభజన | క్రీ. శ. 1157 |
| మలిదేవరాజు వివాహం | క్రీ. శ. 1171 |
| పట్టాభిషేకం | క్రీ. శ. 1172-1173 |
| బాలచంద్రుని జననం | క్రీ శ. 1159 |
| మాంచాల జననం | క్రీ. శ. 1161 |
| బాలచంద్ర మాంచాల వివాహం | క్రీ. శ. 1167 |
| కోళ్ళపోరు-మండాది వలస | క్రీ. శ. 1174 |
| మందపోటు-మేడపి వలస | క్రీ. శ. 1178 |
| అలరాజు రాయబారం<br>పల్నాటి యుద్ధం | క్రీ. శ. 1181-1182 |

# కొన్ని ముఖ్య సవరణలు

| పుట | వంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 5 | 11 | రాజులుకూడా | రాజులు |
| 5 | 14 | చేపన | చేసిన |
| 6 | 24 | బేతవీరకామునిమనుమడు | బేతమనుమడు |
| 7 | 13 | ప్రతిష్ఠించడం | ప్రతిష్ఠించడాలు |
| 7 | 16 | అచ్చుటన్చుటా | అచ్చుటచ్చుటా |
| 11 | 21 | గిరి చుర్గం | గిరి దుర్గం |
| 14 | 12 | యసస్సు | యశస్సు |
| 18 | 8 | శ్రీవంగపురం | శ్రీవంగీపురం |
| 18 | 18 | ప్రాంతమండలి | ప్రాంతమండలి |
| 18 | 22 | నివస్తుంది | నివసిస్తుంది |
| 19 | 6 | సైన్యమూ | సైన్యమూ |
| 21 | 1 | కందూరు బోడుల | కందూరు చోడుల |
| 26 | 27 | అంతర్వాహిది | అంతర్వాహిని |
| 33 | 14 | వెలియ | వెలయ |
| 33 | 25 | దీనిదశ | దీనదశ |
| 37 | 15 | ప్రభావ | ప్రభావ |
| 38 | 26 | దొడ్డనాయడూ | దొడ్డనాయడూ |
| 45 | 6 | మహారవీర | మహావీర |
| 47 | 12 | మారేపాడు | మాలేపాడు |
| 48 | 19 | వలికి | ఎలికి |
| 52 | 14 | నోలాడి | నోలాడె |
| 56 | 12 | క్రి. శ. 1697 | క్రి. శ. 1597 |
| 57 | 6 | కోవంకి | కోవెకి |
| 57 | 18 | Traet | Tract |
| 58 | 16, 17 | నాడు9 | వాఁడు |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 63 | 3 | పాతాళతో | పాతాళంలో |
| 69 | 16 | వల్లకిరో | వల్లకిలో |
| 70 | 13 | సాంఘికాచాల్ని | సాంఘికాచారాల్ని |
| 71 | 12 | ఆలయానికికెదురుగా | ఆలయానికెదురుగా |
| 74 | 15 | వాయనీ | వాయని |
| | 22 | హియ్యాయో | హొయ్యేయో |
| 77 | 9 | సమిష్టి | సమష్టి |
| 83 | 19 | వేరువడి | వేరువరచి |
| 83 | 25 | కాలంలోనే | కాలంలో లేని |
| 84 | 15 | కవిత | కలిత |
| 90 | 17 | వెలమ | వెలసుల |
| 92 | 16 | నొడినోట | నొకనోట |
| 95 | 16 | యుద్దాలు | యుద్ధాలు |
| 96 | 8 | ఈతని | ఈతనిని |
| 100 | 7 | హతమ | హతము |
| 102 | 15 | చాయక | చాయత |
| 103 | 22 | అలరాజు | అలరాజుమండి |
| 107 | 6 | చెన్నకేశ్వర | చెన్నకేశవ |
| 110 | 4 | దిమ్ము | దెమ్ము |
| 111 | 14 | మేలపవ | మెలపున |
| 112 | 19 | విబపుష్పాల | విషపుష్పాల |
| 117 | 3 | కొలిసి రాసిపోసిన | కొలిచి రాశిపోసిన |
| 118 | 21 | పెద్యావతి | విద్యావతి |
| 121 | 20 | జాగ్గిక్రతి | పాగ్గిక్రతి |
| 123 | 10 | నపాటల | నప్పాటల |
| 126 | 6 | నభిక్షత | నఖక్షత |
| 132 | 9 | నిర్ధారణ | నిర్ధారణకు |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 137 | 22 | ఈనాడే | ఈనాడు |
| 138 | 18 | యదార్థాలు కావు | యదార్థాలు |
| 140 | 9 | అప్పటివారికి | (ఈపదం లేదు) |
| 143 | 12 | బ్రహవాయుడు | బ్రహ్మనాయుడు |
| 146 | 26 | అన్నమరాదు | అన్నమరాజు |
| 148 | 9 | కథమెట్ల | కథకులు |
| 151 | 1 | తాటివందులా | తాటివండ్లలా |
| 152 | 21 | కాసీకోక | కాసెకోక |
| 162 | 17 | చూపిచారు | చూపించారు |
| 169 | 6 | కవిత | కవిలె |
| 170 | 5 | వర్కిచిన్ | ఏర్కిచిన్ |
| 172 | 15 | 1030 | 1033 |



# పల్నాటి వీరులు

[పరిశోధనాత్మక చారిత్రిక నాటకం]

గుర్రం చెన్నారెడ్డి

ఈనాటకం ప్రచురణ, ప్రదర్శన హక్కులు రచయితవి. ప్రదర్శింప గోరేవారు రచయిత అనుమతి పొందాలి.

—: పాత్రలు :—

| | | |
|---|---|---|
| బ్రహ్మనాయుడు | .... | మలిదేవరాజు మంత్రి |
| కొమ్మరాజు | .... | రాజబంధువు |
| బాలచంద్రుడు | .... | బ్రహ్మనాయని కుమారుడు |
| కన్నమదాసు | .... | మలిదేవరాజు సైన్యాధిపతి |
| నలగామరాజు | .... | గురిజాల రాజు |
| నరసింగరాజు | .... | గురిజాల యువరాజు |
| అలరాజు | .... | "రాయబారి" నలగామరాజు అల్లుడు |
| వల్లయ్య, మల్లయ్య | .... | నలగామరాజు వేగులు |
| నాయకురాలు | .... | నలగామరాజు మంత్రిణి |

ఇంకా ముగ్గురు పూర్వగాథా కళాకారులు

ఈనాటకాన్ని దిగ్విజయంగా ప్రదర్శించిన
చైతన్య కళాస్రవంతి నటవర్గం (మాచెర్ల)

| | | |
|---|---|---|
| బ్రహ్మనాయుడు | : | గుర్రం చెన్నారెడ్డి |
| కొమ్మరాజు | : | యస్.కె. మస్తాన్ |
| అలరాజు | : | కె. వి. గోపాలరావు |
| నలగామరాజు | : | యం. ప్రసాదరావు |
| నరసింగరాజు | : | కె. కోటేశ్వరరావు |
| బాలచంద్రుడు | : | టి. వి. సుబ్బారావు |
| కన్నమదాసు | : | వంగా బలరామిరెడ్డి |
| నాయకురాలు | : | గూడూరు సావిత్రి |
| వల్లయ్య | : | జి. రంగనాయకులు |
| మల్లయ్య | : | యస్. సత్యనారాయణాచారి |

దర్శకత్వం : గుర్రం చెన్నారెడ్డి



## నా మాట

మాన్యుల కావ్యముల్ చదివి, మౌఖిక గాథల నాస్వదించి, ప్రా
ధాన్యపు తావులన్ వెతికి, తెచ్చినదీ పలినాటిగాథ। చై
తన్య కళాస్రవంతి కను దర్శన మీ తొలిచూలుబిడ్డ। ఈ
దృశ్యక నాటకాభినయ కౌశలమున్ తిలకింప ప్రార్థితుల్.

రచయిత.

# అభినందన

టి. వి. యస్. శాస్త్రి
ఆఫీసర్, ఆంధ్రాబ్యాంక్.
ది. 18-2-89

శ్రీ గుర్రం చెన్నారెడ్డిగారికి

అభినందనలతో,

మీ "వలనాటి వీరులు" నాటకం మనసు లగ్నంచేసి ఆమూలాగ్రంగా చదివాను. వలనాటి చరిత్రను, అందులోని పాత్రలను విశ్లేషించి కన్నులకు కట్టినట్లు చూపినారు. ధన్యులు. చరిత్ర పుటలలో దాగియున్న ఇంకా ఎన్నో రహస్యములను వెలికితీసి ముందు ముందు ఇంకా ఎన్నో నాటకాలను వ్రాయాలని మనసారా ఆశిస్తున్నాను.

సంస్కారవంతమైన రచయితే నటుడు, ప్రయోక్తకూడా యైతే, ఆ నాటకం ఎంతరసవత్తరంగా ఉంటుందో మీ "వలనాటి వీరులు" ఒక చక్కని నిదర్శన. పాత్రోచిత సంభాషణలు, పల్లెనాటి పల్లెపదాలు మరీ వన్నెతెచ్చినవి.

ఇది ముఖప్రీతికోసం వ్రాసిన మాటలుకావు. ఒక చక్కని నాటకం చదివిన ఆనందానుభూతిలో మనసున గుబాళించిన మల్లెలు విరజల్లిన సువాసనలు.

డా॥ గంగిశెట్టి లక్ష్మీనారాయణ
తులనాత్మక అధ్యయనకేంద్రం
తెలుగు విశ్వవిద్యాలయం
ఆంధ్ర సారస్వత పండితభవనం
హైదరాబాద్

ది. 14-1-'90 తేదీన "వల్నాటి వీరులు" నాటకం తొలి ప్రదర్శన ఏర్పాటైనప్పుడు, అంతకు మునుపే ఆనాటకాన్ని చదివిఉన్న మిత్రులు డా॥ గంగిశెట్టి లక్ష్మీనారాయణగారు (ప్రస్తుతం డైరెక్టర్, తులనాత్మక అధ్యయన కేంద్రం, తె. వి. వి.) ఆహ్వానపత్రాన్ని చూడగనే సంతోషాతిశయంతో వ్రాసిపంపిన పద్యం.

మిత్రులు శ్రీ గుర్రం చెన్నారెడ్డిగారికి

నమస్కారాలు. నూతన సంవత్సర శుభాకాంక్షలు.

ఒక చారిత్రక సత్యశోధనొక భావోత్కర్షతంగూడి రూ
పకమై మీకొక నూత్నకీర్తి సమకూర్చన్ సాహితీ వీథులన్
ప్రకటంబొందెను పల్లినాటను భవత్ప్రావీణ్యమున్ చాటుచున్-
సకలానందము పొంగి పెల్లుబుక సత్సామాజికశ్రేణికిన్-

హైదరాబాదు
ది. 10-1-90

ఉంటాను
మీ
లక్ష్మీనారాయణ

AC No. 41091

# పల్నాటి వీరులు

## మొదటి రంగం

[మండాదిలో ఒక వీధి నలగామరాజు వేగులు మల్లయ్యా, వల్లయ్యలు హరిదాసుల్లా వేషాలు వేసుకుని, హరినామ సంకీర్తనంచేస్తూ రహస్యాలను సేకరిస్తున్నారు. మల్లయ్య తలమీద అక్షయపాత్ర, భుజాన తంబుర, చేతిలో చిరుతలు; వల్లయ్య భుజాన జోలె, చేతుల్లో తాళాలూ వున్నాయి.]

వల్ల : ( వస్తూ) అరే! సూరీ! అదుగో! చూడు! అక్కడేదో అలికిడిరా!

మల్ల : అలికిడీలేదు. నీ బొందాలేదు. అదీ... అదీ.. .నీ ఒలికి ఊలికి వదక, మెలుకువతో వరుసకలవరా....జియ్యరూ.

వల్ల : అదిసరేగానీ అప్పైపుచూడు. ఆ రాచ నగరు దాపున తారాడుతూ, తచ్చాడుతూ వుందే! ఆ కలికి ఎవర్రాసూరీ!

మల్ల : (చూస్తూ) ఆఁ....ఆఁ....అవును. నిజమేరోయ్ (తన్మయుడై) ఆహా! కలికీ! నా చిలుకలకొలికీ! వయ్యారపు ములికీ! అబ్బా! వలపుదాహమేస్తుందిరా జియ్యరూ!

వల్ల : ఒరేయ్! ఒరేయ్! ఇది గురజాలకాదురా! మండాది! మలిదేవ రాజుగారి వలసరాజ్యం. మర్యాద తప్పామా....మనమక్కెలు విరిగినట్లే; ఒకవేళ పడాలు వచ్చాడా, మనవక్కలు చీరినట్లే. ఒళ్ళు దగ్గరుంచుకుని సంచరించరా సూరీ!

మల్ల : అంతేనంటావురా జియ్యరూ! అయితే వద్దు. ఇకనేం? పద మందుకునీ పదరాముందుకూ (చిరుతలూపుతూ పాట ప్రారంభించాడు.)

జై .. శ్రీమద్రమారమణ గోవిందో....హరి

వల్ల : (వరుస కలుపుతూ) శ్రీ పాండురంగ పెరదగోవిందో.. .హరి. (తాళం పవరించాడు.)

మల్లి: హరి హరిలో రంగ హరి

వల్లి: కస్తూరిరంగ హరి....కావేటిరంగ హరి

మల్లి: రంగా రంగా యనుడీ....శ్రీరంగని సేవలు కొనుడీ

వల్లి: రండి సుజనులారా మీరిక....పండరినాధుని గనుడీ

మల్లి: హరి.. .హరిలొరంగ హరి

వల: కస్తూరిరంగ హరి ..కావేటిరంగ హరి

మల్లి: అయ్యలారా! హరిభక్తులారా!

మాధవి పురమున

వల్లి: భూధవు గొలిచిన

మల్లి: బాధలు తొలగును

వల్లి: వ్యధలే తీరును

మల్లి: క్రోధభావమును విడువండి!

వల్లి: దుర్భోధలు మాత్రము వినకండి!

మల్లి: హరి....హరిలొ రంగ హరి

వల్లి: కస్తూరిరంగ హరి....కావేటిరంగ హరి

మల్లి: నాయనలారా! నయశాలులారా!

కాముని రాజ్యము

వల్లి: క్షేమ సుధామము

మల్లి: ప్రేమకు చిహ్నము

వల్లి: నీమపు నిలయము

మల్లి: సేమమారయగ రారండి!

వల్లి: సంక్షేమముతో బ్రతకండి!

మల్లి: హరి....హరిలొరంగ హరి.

వల్లి: కస్తూరిరంగ హరి....కావేటిరంగ హరి.

మల్ల : సరసులారా! సాధుపుంగవులారా!

భక్తిని గొలిచిన

వల్ల : ముక్తి లభించును

మల్ల : భక్తికిమార్గము

వల్ల : తృప్తిగ దొరకును

మల్ల : శక్తివంతులై చేరండి!

వల్ల : అనురక్తినిజూపుచు నిలవండి!

మల్ల : హరి....హరిలోరంగ హరి,

వల్ల : కస్తూరిరంగ హరి. ..కావేటిరంగ హరి

మల్ల : సుజలారా! సురుచిరోత్తములారా!

పేదలకందరి

వల్ల : కాదరణీయము

మల్ల : భేదభావముల

వల్ల : బెదురే లేదట

మల్ల : మోదముమీరగ రారండి!

వల్ల : ఆమోదము తెలుపుచు కదలండి!

మల్ల : హరి....హరిలోరంగ హరి

వల్ల : కస్తూరిరంగ హరి....కావేటిరంగ హరి

కన్నమ : (వస్తూ) ఆవండి. (దగ్గరకు చేరి) ఎవలు ఒయ్యి?

మల్ల : హరిదాసులం.

వల్ల : యాయవరానికి వచ్చాం.

మల్ల : ఇదిగో! అక్షయపాత్ర....చిటికెలు (చిరుతలు మోగించాడు.)

వల్ల : ఇవిగో! జోలె, తాళాలు (తాళాలు వాయించాడు.)

కన్న : మీ వూరు?

మల్ల : ఓరుగల్లు.

పల్ల : తిరుపతికయ్యా మాప్రయాణం.

కన్న : ఇక్కడ ఏఏవాడలు తిరిగారు?

మల్ల : బ్రాహ్మణవాడలు....బలిజెవాడలు.

పల్ల : కుమ్మరివాడలు....కోమట్లవాడలు.

కన్న : (అక్షయపాత్రను చూశాడు.) ఇందులో అమృతపడి యేదీ?

మల్ల : అబ్బే....ఎవరూ వేయందే?

పల్ల : ఇదేదో ఎత్తివచ్చిన పూరులావుంది. ఎవరేస్తారారిసూరీ, ధాన్యం?

మల్ల : పదరా....జియ్యరూ.

పల్ల : ఊఁ....పదరా పద. యేంజేస్తాం?

(రెండడుగులు ముందుకు వేశారు.)

కన్న : ఆగండి! కాలు కదిపారో....కాలునిదర్కిస్తారు. జాగ్రత్త. నిజంగా మీరు హరిదాసులేనా?

మల్ల : అబ్బ! ఏమిటయ్యా ఈపరిశీలన?

పల్ల : ఎందుకయ్యా ఈ హుంకరింపు?

మల్ల : బిచ్చం వేసే నాధుడే లేడుగానీ....

పల్ల : బింకంమాత్ర బారెడు, ఇంతకూ నీవెవరు?

కన్న : నేనా! ఎరుగరా? కన్నమదాసును, సర్వసైన్యాధిపతిని.

మల్ల : (భయపడ్డాడు.) కన్నయ్యకు దాసులా! అయితే అందరమూ శ్రీహరికి దాసులమేగా!

పల్ల : (వణుకుతూ) కానీ సైన్యాధిపతి అంటే....కాస్త భయంగా ఉందిరా సూరీ!

మల్ల : నాకూ కాస్త వణుకు పుడుతుందిరా జియ్యరూ!

కన్న : ఊఁ(నవ్వాడు) వాడలుతిరుగుతూ; జాడలుతెలుసుకుంటున్నారా?

పల్ల : అబ్బే! అదేం లేదండీ!

కన్న : కాకపోతే మీకళ్ళల్లో ఆ భ య మెం దు కు? మీ కా ళ్ళ లో ఆ వణుకెందుకు? పదండి రాచనగరుకు. (ఇద్దరి మెడలమీద చేతులువేసి నెట్టుతూ) కొండమ్మా! వీళ్ళిద్దరినీ వృద్ధమాత శీలమ దేవిగారిదగ్గరకు చేర్చు. సర్వమూ సరిచేసి పంపుతుంది. ఊం.. పొండి! (నెట్టాడు)

హుం .... కాముని రాజ్యం .... అంటే న ల గా ము ని రాజ్యమా! (నవ్వాడు) చారుల వంపించి, సమాచారం రాబట్టుకుంటున్నావా నాగమ్మా! వీడూ....కన్నమదాసు. అవర పరశురామావతారుడైన బ్రహ్మనాయనకు పెద్దకుమారుడు. మత్సరంతో మదించి, అదిరివడు అబోతును సైతం అదుపులోపెట్టగల అసహాయశూరుడీకన్నమదాసు. అంబరం నుండి అగాధానికి చొచ్చుకుపోవు అగ్గిపిడుగును సైతం అరచేత నిలుపగల అప్రతిభటుడీకన్నమదాసు. కానీ కాలంనీడి. అయినా, కాననసీమల్లో కాపురాలుచేస్తూ....వలసజీవితం సాగిస్తున్న మామీద ఇంకా కక్షసాధిస్తూనే వున్నావా! నాగమ్మా! హుం.... ఎంతదైన్యం నీజీవితం? (పోబొయ్యాడు. ఎదురుగా వస్తున్న బ్రహ్మనాయనను చూసి వెనగ్గా వచ్చాడు.)

బ్రహ్మ : (వస్తూ) కుమారా! కన్నమా! ఎక్కడికి ప్రయాణం?

కన్న : మీకు తెలియందేముంది తండ్రీ? గురిజాలనుండి గూఢచారులు వచ్చారు. యాయవారం పేరుతో మాయావినోదం కల్పిస్తూ, మనవాళ్ళను తనవాళ్ళుగా తయారు చేసుకోవాలని తంటాలు పడుతున్నారు. కపటం కనిపెట్టాను. ఛీకొట్టి శీలమదేవిగారిదగ్గరకు పంపించాను.

బ్రహ్మ : (నిండుగా శ్వాసపీల్చి వదిలాడు) ఊం... అయితే ఆడిన మాటకోసం మందాది అడవులు చేరినా, అరవెల్లి నాగసాని వడగ విప్పి బుసకొడుతూ వెంటాడుతూనే ఉందన్నమాట! అయినా, అల్పవిషయాలకు ఆలోచనదేనికి క న్న మా! మనమూ తగు జాగ్రత్తలోనే ఉన్నాంకదా! నగరికి నాల్గువైపులా గట్టి కాపలా పెట్టించాను. అంతఃపురరక్షణబాధ్యత, పడాలు వీరన్నకప్పగించాను.

కొలరి ఫౌజుల గస్తీచర్యలు యధారీతి కొనసాగుతూనే ఉన్నాయి. అరపై అరుగురు వీరనాయకులు అప్రమత్తంగానే వున్నారు. ఇక నగర భద్రతవిషయంలో మనకు లోటేమిటి? వెళ్ళు ఒక్కసారి ఆలమందల్ని తిలకించి, గోపాలకుల కావలా కట్టుదిట్టం చేసిరా.

కన్న : అలాగే నాన్నగారూ. (వెళ్ళాడు.)

బ్రహ్మ : నాగమ్మా! ఇంకా మామీద నీకసి తీరనేలేదా! ఆనాడు వేడుక కోసం వేటకు వెళ్ళి, అలసివచ్చిన అనుగురాజుకు ఆతిధ్యమిచ్చావు. దాని ఆధారంతోనే రాజాస్థానికి రాకపోకలు సాగించి ప్రాపకం సంపాదించుకున్నావు. ఆయన మరణానంతరం రాజపుత్రుల్లో విభేదాలుసృష్టించి అతిచాకచక్యంతో అమాత్యపదవి నందుకున్నావు. అడ్డురాగలడన్న భావంతో, అనువంశిక మంత్రినైన ఈ బ్రహ్మనపై అభాండాలు మోపి, నీ మంత్రిత్వాన్ని సుస్థిరం చేసుకున్నావు. చివరికెలాగో పట్టపురాణి విద్యలదేవి కుమారులైన బాలమలిదేవులు, తమవంతు భాగంపంచుకుని పాలించే మాచెర్ల సీమనుకూడా కోడిపోరులో పందెమొడ్డించావు. కపటంతో ఓడించావు. కందమూలాలు తినమని కారడవులు పట్టించావు. ఇంతాచేసి, యింకా అక్కసు తీరని రక్కసిలా....మామీద విషం క్రక్కుతూనే వున్నావా!

కన్న : (ఆతురతగా వచ్చాడు.) దారుణం! మహాదారుణం తండ్రీ! మన మనుగడకే పెనుతుఫాను సోకింది! ఏ జీవధనాన్ని మనం జీవనాధారంగా ఎంచుకుని పెంచుకుంటున్నామో! ఏజీవరాశి పావన పాలధారలతో ప్రాణాన్ని నిలుపుకుంటున్నామో! ఆ పశుసంపద మనవశం తప్పిపోయింది!

బ్రహ్మ : కన్నమా! ఏమిటి నువ్వంటున్నది? ఏంజరిగిందక్కడ?

కన్న : ఏమని చెప్పాలి తండ్రీ? అడవిచెంచుల అంబుల ప్రయోగాలకు మన గోగణమంతా బెదిరిపోయి, అంబాయంటూ గుంపులు గుంపులుగా గురిజాలవైపు పోతున్నాయి.

బ్రహ్మ : ఆఁ.... అంతపని జరిగిందా! అయితే మన గోపాలకులంతా ఏమయ్యారు? అవక్రపరాక్రమంలో అందెవేసినశూరులే అమాత్రం ప్రతిఘటించలేక పోయ్యారా!

కన్న : ప్రతిఘటించలేదని మనమెలా అనగలం తండ్రీ! అక్కడ చిమ్మినరక్తం కాల్వలై ప్రవహించింది. ఇరువర్గాల్లో చచ్చిన వారితోపాటు..మనగోవుల మృతకళేబరాలుకూడా కన్పిస్తున్నాయి. శరీరమంతా శరసముదాయంతో మునిగిపోయిన ముంగెర పావన్న మృతదేహము, కత్తివేటులకు కండలుచీలి మొండెము వేరై కాలం చెల్లిన ముత్యాల పెదమల్లు శరీరమూ నెత్తుటిమడుగులో తేలుతూ కనిపించాయి. శిరస్సు తెగిపోయి, శరీరం చిద్రవలై, గుండెలు బయటపడి కూలిపోయిన సింగన రాయబోయని వికృతరూపం చూడటానికే అసహ్యంగా వుంది. కరుడుగట్టిన నెత్తురులో కూరుకుపోయిన పట్టర్ల సోముని ఆకారం గుర్తుకే రావటంలేదు.

బ్రహ్మ : (శరీరం కంపించింది) అబ్బా! ఎంతఘోరంజరిగింది కన్నమా! చెన్నకేశవా! నేను నీకుచేసిన అపచారమేమిటిస్వామీ? (తేరుకుని) ఇంతకూ శత్రువులెవరో గమనించావా కుమారా! ఇందులో గురిజాల ప్రభువుల కూటచేష్ట లేదంటావా!

కన్న : లేదని మనమూహించటం పొరపాటే అవుతుంది. ఊళ్ళో ప్రవేశించిన వేగులు గురిజాలవారైనప్పుడు...అదే సమయంలో మందను పొడిచిన పందలు మరొకరెలా కాగలరు? కానీ శత్రువర్గంలో చచ్చినవారంతా కొత్తవారే! అందులో ఒక్కడ్ని మాత్రం లీలగా గుర్తుపట్టగలను. ముమ్మాటికీ వాడే! గిరిజన నాయకుడు. అర్థవీడును పాలించే...వీధుల పళ్ళిడు.

బ్రహ్మ : (ఆలోచించాడు) ఊఁ... అర్థమైంది. అర్ధవీటి వీధుల పళ్ళిడు నాయకీ నాగమ్మకు నమ్మినబంటు. నలగామరాజుకు చేదోడు. అయినా ఇంతయుద్ధమూ జరుగుతూవుంటే... మేటి విలుకాడు, ఆలకావరుల కథినాయకుడైన లంకన్న చూస్తూ ఊరుకున్నాడంటావా!

కన్న : లేదు. అసలాతని విషయం చెప్పటమే మరిచాను. ఆలదొడ్డిలో పాల గుంజకడ, పడివున్న ఆ లంకన్న శవం....ఎంతభీభత్సమో! పొట్ట చితికిపోయింది. పేగులు పోగులై బయటికొచ్చాయి. మాంసపుముక్కలు పక్కపక్కనే పడివున్నాయి. ఊడిన చర్మం! విరిగిన ఎముకలు! కెరలిన రక్తం! నరుకుడుపడిన అవయవాలు! చితికిన తల! దానిపక్కనే పగిలిన పాలదుత్త!

బ్రహ్మ : (ఆవేశం ప్రకోపించింది. ఒక్క కేకవేశాడు.) కన్నమా!

కన్న : (ప్రాధేయంగా) తండ్రీ!

బ్రహ్మ : భైరవఖడ్గాన్ని బయటకులాగు.

కన్న : (ఒరనుండి సర్రున ఖడ్గాన్ని లాగాడు) చెప్పండి. (మోకరిల్లాడు)

బ్రహ్మ : ఆలమందలెక్కడున్నాయో తెలుసా!

కన్న : గద్దెరాతి కనుమదాపున....

బ్రహ్మ : అయితే కంచుటరిగెను చేతబట్టి కదనమార్తాండుడవై పవన వేగంతో బయలుదేరు. మదకరీంద్రసమూహంపై విరుచుకుపడు సింహకిశోరంలా; మేఘపంక్తిపై చెలరేగు ప్రళయ ఝంఝూ మారుతంలా విజృంభించి, నీ భుజబల పరాక్రమ విక్రమక్రమ చాతురీ విభవంతో పట్టర్లను పరిమార్చి మన పశుగణాన్ని మరల్చుకురా! వెళ్ళు!

కన్న : మహాప్రసాదం. (లేచి చకచకా వెళ్ళాడు.)

బ్రహ్మ : (ఆలోచనలో పడ్డాడు.) హుం....ఆనాడు కోడికోసం పానగల్లు వెళ్ళిన రాయ వీరపడాలు, మాస్టీల బరిసెపోట్లకు బలై....బ్రతుకును చాలించాడు. ఆ తర్వాత గొట్టిపాళ్ళలో గోవుల కాస్తున్న బాల గోవన్న కోడిపోరులో అమ్ముల ఘాతాలకు అసువులు చాలించాడు. ఈనాడు గోగ్రహణంలో సింగన రాయబోయడు చిత్రహింసలపాలై జీవితాన్ని చాలించాడు. పాపం అలరాజుకు అనుచరులై, కంటికి రెప్పలా కాపాడే .... కల్యాణపురి యర్రగొల్లయోధులు

ముప్పురూ ఈవిధంగా గతించారన్నమాట! ఊఁ....ఇక దీనితో మార్గం నిష్కంటకమైంది. కానీ యేంలాభం? నావాడుగా మారబోతున్నాడనుకున్న సహజ వీరప్రతాపుడూ, మహిత దోర్బలఘనుడూ, విహిత కార్య నిర్వాహకుడూ, రాచబిడ్డడూ అయిన లంకన్న కూడా నిహతుడయ్యాడన్నమాట....ఈ గుండెకోత నెలా భరించాలి.

గీ॥ ఆలమందను పొడుచుచు అర్భటించు
 పరమ నీచుల నెల్లర ప్రతిఘటించి
 నరుకులాడిన గోగ్రహణమ్ము నందు
 కన్ను మూసితివయ్య లంకన్న నీవు!

లంకన్నా! నా కన్నకుమారునికన్న మిన్నగా పెంచుకున్నాను. ఆలమందల కధిపతిని చేశాను. కానీ ఆనాడు పెందోటలో బెబ్బులి పట్టిన కంట్లపుకోడెను కాపాడలేని పిరికివనీ, శీలమవారింటి కూరలుతిన్న శూరత్వమేమైందనీ...నిన్ను నిందించాను. పందవైన నీకు మగతనమెందునూ లేదంటూ, మగువలా మందలోనుండుమని శాసించాను. ఆనాటినుండి ఈనాటివరకూ ఆడకట్టుకట్టి....జడకొప్పు పెట్టి....నా ఆజ్ఞాబద్ధుడవై ఆలమందను కాపాడి, చివరకు కళంక రహితుడవై, పుణ్యలోకం చేరావా లంకన్నా! పూర్వాపరాలాలోచింపని నా నియోగమే....నాకీవియోగాన్ని తెచ్చిపెట్టింది. సరే పోటుపడ్డ బ్రతుకు....పాటుపడ్డచోట ఉండరాదు. ఇందుకు మరో మార్గమాలోచిస్తాను. (నెమ్మదిగా వెళ్ళాడు.)

# పల్నాటి వీరులు

## రెండవ రంగం

[మేడపి పట్టణం. రాజసభా ప్రాంగణంలో విడిదిమందిరం. అందులో రెండు ఆసనాలు. అలరాజు అలోచనతో అటూ ఇటూ తిరుగుతున్నాడు.]

అల : మాచెర్లలో పచ్చగడ్డలమీద విచ్చుకత్తులు ఒరసికొన్ననాడే.... హెచ్చుతగ్గులు తేలిపొయ్యేవి. కాని బ్రహ్మనాయని కోరికమేరకు ఆనాడు పోరు విరమింపక తప్పలేదు. అది గతించి ఎనిమిది సంవత్సరాలైనా, పెద్దన్న పిడివాదం ఈమేడపిలోకూడా పెడదారి తొక్కి మిడిసిపడుతూనే ఉందన్నమాట! అనుగురాజుకు దత్త పుత్రుడనీ, రాచబిడ్డను పెండ్లాడిన బిరుదు రేడనీ ప్రత్యేక ప్రతిపత్తికోసం ప్రాకులాడుతున్నాడేమో....పాపం....హుం. ఈ అలరాజెవడో! వీనికి రాచమల్లనే బిరుదెలావచ్చిందో! వీని వంశ కీర్తిప్రతిష్ఠలేమిటో! ఈతను ఈనాటికీ గ్రహించనట్లుంది. వీడు కల్యాణ కలచూరి బిజ్జల భూపతి ప్రపౌత్రుడనీ, సమర భీకర శత్రుసంహారుడైన వీరసోముని పౌత్రుడనీ, వీరికి తెలియదేమో! విలువిద్యలో విశేషపాండితి నిండుకున్న నిఖిల శస్త్రాస్త్ర సంయుక్త సంవేదియైన కొమ్మభూపతి కుమారుడని ఈతనికి గోచరం కాలేదేమో! మత్సరగ్రస్త మానసులై మదించి, ఎదిరించిన నూర్గుర పుడమి రేడుల నోడించి, వారిపేర పుత్తడిబొమ్మలు చేయించి, నా గుర్రపు కాలిపెండెరానికి బిగించి, రాచమల్లని బిరుదువహించిన ఈ అలరాజు పరాక్రమం అవగాహనకే రాలేదేమో! చూస్తాను.... చూసీ....వీరి ప్రతిభా ప్రభావ పరాక్రమాలను ప్రక్షాళన చేస్తాను.

కొమ్మ : (వస్తూ) కుమారా! అలరాజా! ఏమిటీ అసహయ ప్రసంగం! ఎందుకొచ్చిందీఆవేశం!

అల : ఆవేశం కాదునాన్నా! అంతర్గతమధనం! ఆర్తజన సంక్షేమ మంటూ ఆప్తులుపడే ఆరాటం! దీనికంతకూ నేనూ నాచర్యలే అవరోధంలా వుంది.

కొమ్మ : అంత కొరగానిచర్యలేంచేశావని నీవు అవరోధమయ్యావుకుమారా! మలిదేవులకు మరోపెండ్లైనా చేసి సాధించగలనంటూ బెదిరించి, వెయ్యి గోవుల్ని....మరోవెయ్యి గొర్రెల్ని, చివరకు వాటిని కాసే గొల్లబంట్లను సైతం....అరణంగా తెమ్మంటూ ఆంక్ష విధించిన బ్రహ్మన్నకు మారాడక సర్వాన్నీ మాచెర్ల చేర్చడమా....నీ అవరోధం!

అల : అరణమడగటం వారిహక్కునాన్నా. అడిగారూ సాధించుకున్నారు. అరణ్యవాసమంతా ఆగోవుల ఆధారంతోనే ఆ కలి ద ప్పు లు బాపుకున్నారు. ఆవిషయంలో వారికెందుకుంటుంది నాన్నా, అవరోధం?

కొమ్మ : మరేమిటయ్యా? కోడిపందెంలో ఓడిపోయి, మందాది వలసకు దండు కదలిపోతుంటే.... ఏలేశ్వరం రేవులో బ్రహ్మన్నను కబళించిన కారుమొసల్ని; అందరు యోధానయోధులుండగా.... నీవొక్కడవే ముందుకుదూకి ఖండించి కడతేర్చుటేనా....నీ అవరోధం.

అల : అలాంటి సాహసాలు, వారి అంతరాత్మలకు అవగతాలు కావు నాన్నా.

కొమ్మ : కాకపోతే మరేమిటి? జూదం వలదని ఎందరు వాదించినా వినక, చివరకు రాజానుమతికూడాలేకుండా రాజ్యాన్ని పణమొడ్డి పరాజయం పాలై; ఏడేండ్లు వనవాసంచేయించినా వెక్కసపడక....వ్యతిరేకత చూపక....సహనంతో సహకరించి సహజీవనం సాగించటమా....నీ అవరోధం?

అల : జూదంలో జయాపజయాలు వారికి గణితవ్యాలు కావునాన్నా! పంతమే వారిధ్యేయం. దాన్ని నెగ్గించుకోవడమే వారి లక్ష్యం.

అదే వారి గొప్పతనానికీ, స్వతంత్ర ప్రతిపత్తికీ, అధికార నియంత్రణకూ విజయసంకేతంకూడా. పసితనంనుండి మన మలిదేవులు వారి ప్రాపున జీవించారు. అదే వారికంతటి ఆధిపత్యానికి అనురూపం. ఈ విధానం కొనసాగినంతకాలం వారివారి జీవితాలకు ఏ అవరోధమూ ఉండదు నాన్నా!

కొమ్మ : మరి, వారికున్న అవరోధమేమిటి? నీకి ఆవేశానికి కారణమేమిటి?

అల : ఏనాడో మాచెర్లలో మరుగునపడ్డ పచ్చగడ్డలపోరు....మరలా రగుల్కొని బుగుల్కొన బోతుంది. నా గుర్రపు కాలి పెండెరానికి బిగించిన పెద్దన్న బొమ్మ నెలాగైనా తొలిగించాలనే కోరిక, యిప్పుడీ మేడపి నగర పెద్దల్లో పొడకడుతూవుంది. అదేవారి అవరోధానికి....నాకి ఆవేశానికి....కారణం.

కొమ్మ : అసలానాటి పోరుకు కారణం నీవా? లేక, పెద్దన్న జాదరాజా?

అల : ఇద్దరమూ కాము. దానికి మూలం పెద్దన్న అశ్వరక్షకుడు దాదవారిమల్లు.

కొమ్మ : (నవ్వాడు.) ఆశ్చర్యంగా వుంది! అనామకుడు అంతటి ఆర్భాటం చేశాడా!

అల : అదేమిటి నాన్నా అలా అంటారు? తన యజమానినుండి తాను తెచ్చుకున్న అహంభావమే అది. ఆ పొగరుతోనే....నా అశ్వరక్షకుడు గంగాధరంతో వాదాడాడూ, నన్నూ నా జవనాశ్వాన్నీ కించపరుస్తూ తన అక్కసునంతా నాగుర్రంమీద ప్రయోగించాడు.

కొమ్మ : ఏంచేశాడేం?

అల ; అసలు పెద్దన్న అందరిలోనూ బలవంతుడట. దానికితోడు అతని గుర్రం కూడా మిక్కిలి ఘనమైందట. అందుకే దానికి కార్యబలుదనే నామం సార్థకమైందట. ఆ విషయాలనే ఏ కరువు పెడుతూ....నా గుర్రమేదో తప్పుకుని దారివ్వలేదంటూ కొరడాతో కొట్టాడట. పరవాని దెబ్బకు కొరకొరలాడినవా గుర్రం, ఆనాటి నుండే మేతకూ నీటికీ దూరమై....కన్నీరు కారుస్తూ దురపిల్లుతూంది.

కొమ్మ : గురాల్లకావరికింత దురహంకారమా! ఇది సహించరాని నేరం.

అల : అందుకే పెద్దన్న పేరుతో పుత్తడిబొమ్మను చేయించాను. దాన్ని నా గుర్రపు కాలిపెండెరానికి తలకిందుగా బిగించాను. ఒకే లక్ష్యంలో ప్రతిఘటిస్తూ, శత్రు నిర్దళనకార్యంలో నిరుపమాన నైపుణ్యం చూపించి... సవరాల జిమ్మడనీ, శివకాశ్వమనీ సార్థక నామాలతో ప్రఖ్యాతి గడించిన నా గుర్రంకన్న.. అతని కారు బొల్లడే మిన్నయా! శాత్రవశతాన్ని నిర్జించి, విశాల రాజలోకంలో విశిష్టస్థాన మాక్రమించిన ఈ అలరాజుకన్న; కంచర్లనేలు ఒక్క కృష్ణగంధర్వునే ఓడించిన పెద్దన్న... అధికుడా! ఏరూపంలో అధికమో తేల్చుకోవాలనే నిర్ణయానికివచ్చాను. "సై" అంటూ సవాలు చేశాను. సంధికివచ్చిన భట్టును తిరస్కరించాను. అవిషయంలో ఆగ్రహించిన పెద్దన్న. పోరుకు సిద్ధమయ్యాడు. పదుగురికి తెలిస్తే పెడనివ్వరనే ఉద్దేశంతో. అర్ధరాత్రి పోరుకు ఆహ్వానించాను. చంద్రవంక తీరాన, గుర్రాలమడుగు దాపున, పచ్చగడ్డలపై యుద్ధవేదిక నిర్ణయించాను. బల్లున తెల్లవారేవరకూ బవరం హోరాహోరీగా సాగుతూనేవుంది. ఇది గమనించిన బ్రహ్మనాయుడు, హుటాహుటిన మావద్దకు చేరాడు. మాగుర్రాల్ని ఆపబోయ్యాడు. పెద్దన్న గుర్రం వెంటనే ఆగిపోయింది. కాని, నా గుర్రంమాత్రం సకిలిస్తూ అదాటున ముందుకు దూకింది. ఆదూకుడులో బ్రహ్మన్నపాదాన్ని చితుకదొక్కింది.

కొమ్మ : అయ్యో అంతపని జరిగిందా! నివారింప వచ్చిన వానికే అవాంతర ప్రమాదమా!

అల : అయినప్పటికీ బ్రహ్మన్న ఓరిమివహించాడు బాధనుసహించాడు. కూరిమితో నా కత్తిని ఒరచెయ్యమన్నాడు. దానికి తగిన ఆహారం లేనిదే ఉపసంహరణ జరగదన్నాను. అది సుక్షత్రియ వీరజాతి నిర్ణయించుకున్న నియమమన్నాను. ఆనియమాన్ని పాటించి, నిస్తుల విజయాలను సాధించటంవల్లనే నాఖడ్గానికి సూర్యబేతాళ మనేపేరు సుస్థిరమైందన్నాను. వెంటనే నాకరవాలానికి జంతు బలిని సమర్పించి, మాపోరు విరమింపజేశాడు.

కొమ్మ : మంచిది. మరి వివాదమంతా ఆనాడే సమసిపోయిందిగదా, మరలా ఈ మేడడిపిలో విచారణ దేనికి?

అల : పోరు విరమణే జరిగింది. కాని బొమ్మను తీసివేయలేదుగా.

కొమ్మ : ఓహో! అదావిషయం. అయినా గతించిన దానికి వివాద మెందుకు కుమారా! ఇకనైనా ఆబొమ్మను తీసివేసి, ఐకమత్యంతో కమ్మని జీవితాలు సాగించవచ్చుగా.

అల : ఇప్పుడుమాత్రం మాలోని ఐకమత్యానికి అంతరాయమేముంది నాన్నా!

కొమ్మ : ఆ బొమ్మను తొలగించకపోవటమే వారికి అంతరాయం. మానిన పుండు మళ్ళీ ఎందుకో సెలవేస్తుంది. కాబట్టి పంతాలకు పోయి అంతర్గత కలహాలకు లోనై, అరివర్గంచే అవాంతర పరిణామాన్ని కొనితెచ్చుకోవద్దు కుమారా! పరిస్థితుల నర్థంచేసుకుని చరించటమే ఉత్తమలక్షణం

అల : తండ్రీ నాకై నేను ఆబొమ్మను తీసివేస్తే....అది నాబలహీనతకే ప్రబలతార్కాణం. ఒకవేళ ఆబొమ్మనుంచటం వారికి అవమాన కరమని అభ్యంతరం చెప్పినా, లేక జీవితంలో ఏరూపంలోనైనా నేనోడిపోయానని నా మనస్సుకు తట్టినా....ఆమరుక్షణంలోనే, నా గుర్రపు కాలిపెండెరంనుండి ఆబొమ్మ తొలగింపబడుతుంది. ఇదే నా వాగ్దానం.

ఉ॥ సైచితి నింతకాల మతిశాంతమనమ్మున-సాటివారి సం
కోచముకూడ వీడెనని కూరిమితో చనుచుండ, యిప్పుడీ
పేచి తలెత్తుటేమి? మనపెద్దలకీ చెడుమూడుటేమి? యే
పాచికవేసినన్ పడెడి బాలుడనంచు తలంచిరేమదిన్.

వస్తా నాన్నా! పెదమలిదేవరాజుగారెందుకో పిలిపించారట (వెళ్ళాడు)

కొమ్మ : (శ్వాసపీల్చాడు.) పట్టుదల గట్టిదైనా, శౌర్యం సుసంపన్నమైనా, సహనంలో సంస్కారి, మా అలరాజు. కనుకనే కాలపై పరీత్యానికి గరళకంఠునిగా పాలికావయ్యాడు. పలనాడంతా వివాదాల

విషవలయంలో చిక్కుకుని స్రుక్కిపోతుంటే కన్న తల్లిదండ్రుల మార్గాన్నే కర్తవ్యంగా భావించాడు. చెల్లెండ్ర భవితవ్యాన్ని ఆలోచించి మలిదేవులవక్షాన్ని నేను సమర్థిస్తే....వలనాటిరాజ్యానికి వారసుడైకూడా .... బంగారు భవిష్యత్తును పరిత్యజించాడు. కట్టుకున్న భార్యనుసైతం కడకునెట్టి .... నన్నే అనుసరించాడు. ఎన్ని అవాంతరాలు సంభవించినా, ఎట్టి సంక్షోభం మొలకెత్తినా ధీరగంభీరుడై చారువదనంతో తన విధిని నెరవేర్చుకుంటున్నాడు. ఏమీ ఈతనిత్యాగం!

గీ॥ పసిడి బొమ్మను భార్యను, పల్లినాటి
వారసత్వపు కోరికల్ వదలిపెట్టి
తల్లి దండ్రుల సేవలే ధర్మమనుచు
తిరుగు అలరాజు కష్టముల్ తీరునెపుడు?

(ముఖంలో విచారం పొడసూపింది. ఎవరో వస్తున్నట్లు అలికిడి. తేరుకుని చూశాడు.) రండి! బ్రహ్మనామాత్యా! రండి! ఆశీనులు కండి. (ఆసనం చూపించాడు.) ఆఁ.... ఏమిటీ విశేషం?

బ్రహ్మ : మీకు తెలియనివిశేషమేముంది కొమ్మభూపతీ! అనుకున్న నిర్ణయంప్రకారం ఏడుసంవత్సరాల అరణ్యవాసాన్ని పూర్తిచేశాం. కనుక ఇక జరుగవలసిన కర్తవ్యాన్ని నిర్వర్తించేమార్గం మన మెన్నుకోవాలిగదా!

కొమ్మ : అవును అందుకు మీరూహించిన నిర్ణయమేమిటి?

బ్రహ్మ : వలసను పూర్తిచేసి యేడుమాసాలైనా: ఎదిటి పక్షం నుంచి ఏవిధమైన కబురూ మనకురాలేదు. రాదనికూడా నాకుతెలుసు. ఇక్కడ మనవారంతా కాననసీమల్లో కష్టాలనుభవించారు. కాబట్టి కదనానికే కాలుదువ్వుతున్నారు. అది ప్రస్తుతం నాకిష్టంలేదు. సామరస్యంతో రాజ్యాన్ని సాధించటంలో ఉన్న గొప్పతనం.... సమరంతో ఏనాటికీ రాదుకదా! ధర్మానికి కట్టుబడి వలసను పూర్తిచేశాం. అదేధర్మాన్ని పాటించి, రాజ్యాన్ని రాబట్టటం

ఉత్తమ రాజధర్మం. కనుక సంధిప్రయత్నంతో సమస్యను పరిష్కరించుకుందామని వాకోరిక.

కొమ్మ : మరి మీరీవిషయాన్ని మ లి దే వ రా జు గారితో సంప్రదించక పోయ్యారా బ్రహ్మనా!

బ్రహ్మ : అదీజరిగిపోయింది. కాని మొదట్లో మలిదేవులు అయిష్టతనే ప్రకటించారు 'మాచెర్లకోసం మంతనాలు జరిపి, సాధించినా, అడుగడుగునా అవాంతరాలు సృష్టిస్తూ కష్టాలపాలుజేసే అనాయకు రాలి దుర్నయాల నెదుర్కొవటంకన్న ఈమేడపిలో కాపురమే మేలన్నారు." అయినా పురుషకార్యంతో పూర్వఫలితాన్ని సాధిస్తే వచ్చే ఘనతను విపులీకరించాను. రాయబారాని కొప్పించాను.

కొమ్మ : మంచిది బ్రహ్మనా. మరి రాయబారిఎవరో మీరేనిర్ణయించండి!

బ్రహ్మ : ఆ నిర్ణయమూ జరిగిపోయింది కొమ్మరాజా! అందుకు మీ అనుమతికోసమే ఇక్కడికి వచ్చాను. అంగీకరిస్తారనికూడా ఆశిస్తాను.

కొమ్మ : ఇంతకూ ఎవరాతడు బ్రహ్మనా? సంధికార్యాన్ని నిర్విఘ్నంగా నెరవేర్చుకుని రాగల చతురుడేనా?

బ్రహ్మ : (చిరునవ్వుతో) ఎవరూఅని వేరే అడగాలా కొమ్మభూపతీ! సామవాక్యాలతో శత్రువునైనా మెప్పించి, ఒప్పించగల మేటి శాంతమూర్తి. తెరవేటకాడై క్రూరరిపువర్గాన్ని పరాభూతుల జేసిన బిరుదురౌతు. మధ్యందిన భానుతేజునిలా సోమవంశంలో శోభిల్లు సౌమ్యశీలి. ఇంకెవరున్నారు? మీకుమారుడు అలరాచే....

కొమ్మ : (నిశ్చేష్టుడై) ఆఁ ఏమిటి! అలరాజా! సంధికంప నిశ్చ యించారా! బ్రహ్మనామాత్యా' రాజులెప్పుడైనా రాయబారానికి వెళ్ళారా! బ్రాహ్మణుడు పోవాలి. లేదా భట్టునుపంపాలి, పైగా వీరులూ విక్రమోన్నతులూ, కార్యసాధన శక్తియుక్తులైన సచివులూ....ఇందరుండ, నాకుమారునే పంపదలిచారా, బ్రహ్మనా! హుఁ... మీ నియోగం... మా వియోగానికే హేతువేమో!

బ్రహ్మ : అంతమాటెందుకంటారు కొమ్మభూపతీ? రామ రావణ యుద్ధానికి ముందు అంగదుడు రాయబారిగా పోలేదా! పాండవుల పక్షాన కౌరవులతో శ్రీకృష్ణుడు దౌత్యకార్యం నెరపలేదా! అయినా మన అలరాజు యిరుపైపులవారికీ బంధువు. పైగా నలగామరాజుకు అల్లుడు. దానికితోడు తానువెళుతున్నది రాయబారానికైనా.... వెళ్ళేది అత్తవారింటికికదా! రాకరాక యిల్లుచేరిన అల్లుని అభినందించక.... అల్లరి పాల్జేసి కలతను తెచ్చిపెట్టుకుంటాడా నలగామరాజు. అపోహలకు తావీయక అనుమతినీయండి. అంతా సవ్యంగానే జరిగిపోతుంది.

కొమ్మ : (నిట్టూర్చి) సరే! కాదనేదేముంది? బ్రహ్మనా! రాజ్యసంపాదనా కార్యభారాన్ని నిర్వహిస్తుంది మీరు. అందుకు నేనెందుకు సహకరించకపోవాలి? కానీ, ఒక్కమాట! లేకలేక కలిగిన ఒక్కగానొక్క బిడ్డడువాడు. వాణ్ణి అమితగారాబంతో పెంచుకుంది, మీచెల్లెలు చెల్లమదేవి. ఆమెకీవిషయాన్ని ఒక్కసారి వివరిస్తే మంచిదని....నా ఆశ.

బ్రహ్మ : అవశ్యం కొమ్మభూపతీ! కుమారుని సంధికంపుతూ, తల్లికి చెప్పకపోవడం సాహసమే ఔతుంది. కాబట్టి చెల్లమతో సంప్రదించి ఆమె ఆశీస్సులందుకున్న తర్వాతనే మన అలరాజు ప్రయాణం.... వస్తా....మరి. (వెళ్ళాడు)

కొమ్మ : (విచారంతో) కల్యాణమేలు కలచూరి వంశజులమైన మాసోదరు లేడుగురికీ నాకుమారుడీ అలరాజు ఒక్కడే వంశాంకురం. గురిజాల నేలు నలగామరాజు, కూరిమి నెచ్చెలికాడనీ, పేరిమిగన్న ప్రభువనీ తలచాను. అతని యేకైకపుత్రిక పేరమదేవితో పెండ్లిజరిపించాను. పుత్రులులేని నలగామరాజుకు అల్లుడైన మా అలరాజే వారసుడని తలపోశాను. బ్రహ్మనాయని ప్రోత్సాహంతో .... నా సోదరి సిరాదేవితోపాటు, నా పినతండ్రుల కూతుళ్ళ నిద్దరినీ మలిదేవ సోదరులకిచ్చి వివాహాలు జరిపాము. పశ్చిమచాళుక్యుల కర్కశ విధానంతో సామంతం సాగించటం సాధ్యపడక నాసోదరులందరూ

తలకొకదారిలో తరలిపొయ్యారు. ఆ కారణంగానే....నేనీ పలనాడు చేరాను. కానీ యిప్పటివరకూ అవరోధాలతో అభియోగంపాలైన పలనాటి భవితవ్యం....నాకుమారుని రాయబారంతోనైనా బాగుపడితే, అది అందరికీ ఆనందమే!

అల : (వస్తూ) నాన్నా! అనుకున్నదొకటి, ఆదేశమింకొటి. వినికిడి ఒకటైతే, వినిర్ముక్తం మరొకటైంది. నాపై ఏదో ఒత్తిడి రాబోతుందని నేనూహిస్తే....నేనేదో ఉద్ధరించగలనంటూ, రాయబారానికి ప్రయాణం కమ్మన్నారు, మలిదేవరాజుగారు.

కొమ్మ : ఆవిషయాన్నే బ్రహ్మనాయడుకూడా యిప్పుడే సెలవిచ్చి, మీతల్లి అనుమతికోసం వెళ్ళాడు. కానీ, ఈ రాయబారవిషయంలో నాకేదో అనుమానం మొలకెత్తుతుంది కుమారా!

అల : మీకెందుకునాన్నా అనుమానం? నే వెళుతున్నది శాంతి దౌత్యానికేగా? సామవాక్యాలతో సమర్ధనీయంగా సంధి పొసగింప లేననా; ఒకవేళ న్యాయదూరులై సంధిని నిరోధించి విరోధిస్తే.... నిలువరించి విచారించలేననా!

కొమ్మ : అదికాదు కుమారా! పుట్రింతలు పచరించటంలో మహామేధావి, నాయకురాలు నాగమ్మ. ఆమె దుర్మంత్ర ప్రభావమే....మన మలిదేవుల నీగతికి ఈడ్చింది. దేశద్రోహమా....జరిగిపోయింది. ఇక బంధుద్రోహంకూడా జరుగుతుందేమోనని....నా సంకోచం.

అల : నేను వెళుతున్నది యుద్ధానికి కాదునాన్నా! రాయబారానికి! వీరజనపూజితులూ, విక్రమార్జిత బాహుబల సంపన్నులూ, సర్వ ధర్మజ్ఞులూ, సోమకుల దీపకులూ అయిన మీరే బెగడు పడితే.... ఇక తక్కినవారిగతి యేంకాను? కాబట్టి ధైర్యం చిక్కబట్టుకుని కార్య సాఫల్యతకోసం కర్తవ్యాన్ని బోధించండి.

కొమ్మ : హుం....కర్తవ్యం! కర్తవ్యమనేపేరుతో, కర్కోటకులై చెరలాడు విషపుప్పుల మధ్యకు వెళ్ళటమా! కుత్సితుడై, స్వార్ధపూరిత మత్సర హృదయుడైన ఆ నరసింగరాజు; దురహంకారియై, దురార్జిత

పదవీగర్వ పరిస్పర్ధియైన ఆ మాయలమారి నాగమ్మ....రెండూ రెండు క్రూరసర్పాలై, రాహుకేతువుల్లా రాజసభలో పొంచివుంటే.. రాయబారికి రక్షణ లభిస్తుందాయని నా సందేహం! పైగా ఒంటరిగా....

అల: మీకాసందేహమే వద్దు నాన్నా!

గీ॥ కొలువులోపల మర్యాద నిలుపకుండ
ధర్మ విద్రోహమేదేని తలచిరేని
నారసింగును ఖండించి బీరపడచి
నుగ్గునూచగ నాగమన్ నురిమిపైతు.

నా శక్తిసామర్థ్యాలూ, శౌర్యసాహస పరాక్రమాలూ మీకుతెలియనివి కావు. సమరస భావంతో సంధినంగీకరించా....సరేసరి. లేక అడ్డదారిలో పోటొడ్డి నిలిచారా, సమర భీకర శత్రుసంహారుడైన ఈ అలరాజు, చెలరేగి చెండాడక మానడు. సాటి శాత్రవకోటికి మేటి పోటరియై కాటికి పంపిన పటుతర శౌర్యసోముడు; నా తాత కలచూరి వీరసోముడు నా పరాక్రమాన్ని గమనించి, నాకిచ్చిన మణుల కిరీటం....నన్నొక అజేయమూర్తిగా గుర్తించి, నా కంఢించిన పైరిజన శిరచ్ఛేదన సాధనమైన సూర్యబేతాళకరవాలం వాటి ప్రతిభా ప్రభావ విశేషాలు మీకు తెలిసినవే! ఇకమీకెందుకు భయం? ఆ నాగమ్మ నరసింగరాజు లెంతటి నిరంతర క్రోధానల విషజ్వాలావృత క్రూరసర్పాలై పడగలెత్తి బుసలు కొట్టినా.... ఆ పడగలమీదనే పాపాదాలు మోపి చితుకద్రొక్కి, పెల్లుకొనకుండా సల్లార్చగలను. ఇకనైనా సంశయాన్ని వీడండి.

బ్రహ్మ: (చేతిలో తులసిమాలనుపట్టి, బాలచంద్రునితో వచ్చాడు.) భళీ! అలరాజా! భళీ! రాచూలిపై రాచపుట్టువు రసస్ఫూర్తినిచూపించావు. నీ సాహసం ప్రశంసనీయం! నీలాంటి పరాక్రమశూరులుండుట వల్లనే శౌర్యలక్ష్మి ఈనాటికీ వీరహారతులెత్తుకుంటుంది! వంకి దేవరాజా! కొమ్మరాజా! యింకనూ అనుమానమా! రాచమల్లు రాయబారవిషయంలో, మా సోదరి చెల్లమదేవికూడా....మొదట

విముఖత చూపినా.... ఆతర్వాత సుముఖతనే ప్రదర్శించింది. మోదమందవలసిన ఈకార్యానికి ఖేదమంద పనిలేదు. ఇదిగో! తులసివనమాల! (మాలను చూపిస్తూ) ఇది శత్రువిజయసాధకం. ఇది మెడలో ఉన్నంతవరకు మీకుమారునకు ఏ ఆపదా సంభవింపదు. (మాలను అలరాజు మెడలో వేశాడు.) ఆఁ....మరొక్క మాట. అదుగో నాకుమారుడు బాలచంద్రుడు. చెన్నకేశవ వరప్రసాదితుడు. సుప్రశస్తబలుడు. ఆ బాలకుణ్ణి, మీకుమారునకు మారుగా మీకు యిల్లడపెడుతున్నా. (బాలుని రెట్టపట్టితీసుకొచ్చి కొమ్మరాజు ముందుంచాడు.) స్వీకరించు. పైగా అలరాజుకు అంగరక్షకునిగా, మహావీరుడైన కన్నమదాసును పంపుతున్నా. ఇకనైనా సంకోశాన్ని సడలించుకుని, రాచమల్లును రాయబారమంపు. సర్వమూ సానుకూలమౌతుంది.

కొమ్మ : బ్రహ్మనా! మీమాట కెదురేమిటి? మీరానాడు మలిదేవరాజుకు మాసోదరి సిరాదేవినిమ్మని కోరినప్పుడు; దాసరివాళ్ళతో వియ్యం తగదని కసరి తిరస్కరించాడు, మాతండ్రి వీరసోముడు. కాని, శివనందుల కోట ముట్టడిలో చేతగానివారమై....మీసహాయాన్నే అర్థించాం. మీ భుజశక్తితోనే విజయాన్ని సాధించుకున్నాం. మొదట మిమ్ము హేళనచేసి తిరస్కరించిన కారణంగా మేమానాడే తగిన గుణపాఠం నేర్చుకున్నాం. మరోసారి అలాంటి పొరపాటు చేసి మర్యాద పోగొట్టుకుంటామా. సరే. అలరాజునే సంధికంపి సత్ఫలితాన్ని సాధించండి.

బాల : (కొమ్మరాజు ముందుకు వచ్చాడు.) మామా! కొమ్మరాజా! ఇది వెలనుకిశోరం. వీడు బాలుడైనా అప్రతిమాన రణకళా శోభితుడని సగర్వంగా చెప్పుకుంటున్నాను.

ఉ॥ బాలుడు లెమ్మటంచలుప భావము పూనకు-పూర్వమాదిగా
శీలమవారి వంశ పరిశీలన జేసిన గోచరించు-ఈ
బాలుడె మేటివీరుడయి భండనమందున పచ్చిరక్తమున్
గ్రోలి విహారమున్ సలుపు క్రోల్పులియంచు తలంచుమా యికన్.

సమరసభావంతో సంధి పొసగింపబూనిన మా బావ అలరాజుకు ఏ ఆపద నాపాదింప సాహసించినా, అడుగడుగునా పిడుగులా ప్రత్యక్షమై, ఆరక్కసుల నుక్కడించి, మీ మానసిక దౌర్బల్యాన్ని మాయంచేయగలడీబాలచంద్రుడు. ఇదేనాశపథం. ఇకనుండి నన్ను మీ కుమారునిగా ఎంచుకో. (వెళ్ళారెల్లాడు)

కొమ్మ : మంచిది బాలచంద్రా! వీరుడవై చిరకీర్తినార్జించు. (బాలుణ్ణి లేపి భుజంతట్టి ఆశీర్వదిస్తూ వెళ్ళాడు.)

బ్రహ్మ : అలరాజా! నీయుద్దేశమేమి?

అల : ఉద్దేశమేముంది? సాధువచనాలతో సమయోచిత వాక్కులతో సంధినెరపి, జ్ఞాతి వైరాన్ని మాన్పటానికే సర్వవిధాలా ప్రయత్నిస్తాను. సమ్మతితో సమాధానపడి సమర్యాదతో సాగనంపారా! సర్వమూ సానుకూలమేగదా! అలాకాక ప్రాప్తించిన రాజగర్వంతో, ఉన్మత్తప్రలాపులై విర్రవీగితే....పర్యవసానాన్ని వారే చవిచూస్తారు. ఆసమయంలో ఒక్క నాగమ్మ నరసింగులే కాదు, వందమంది సమరశూరులైనా అవలీలగా జయింపగల సామర్థ్యం పదిమడిగల్గిన సాహసవీరుడీఅలరాజు. వీరాంశ సంజనితా విక్రమోద్దండ భండన పాండిత్య వైభవస్ఫూర్జిత వీరముద్రిక అందుకున్న విశేష శౌర్యసంపన్నుడీరాచమల్లు. తొత్తులమారియై జిత్తుల ఎత్తులుపేసి, పెత్తనం చెలాయిస్తూ పలనాటికే మిత్తియైన ఆ నాగమ్మను చిత్తుజేసి చిత్రవధ చేస్తాను. ఇది తథ్యం. సహనం సమాదరణ పొందినవరకే నాలో నిలుస్తుంది. అదుపు తప్పిందా.... కదనమే ప్రాధాన్యం వహిస్తుంది. వస్తా బ్రహ్మనామాత్యా, ప్రయాణానికి సిద్ధంకావాలిగదా! (వెళ్ళాడు.)

బ్రహ్మ : (అలరాజు వెళ్ళగనే బాలచంద్రుణ్ణి చేరదీశాడు.) అర్థమైందా బాలచంద్రా, అలరాజు పట్టుదల. ఒకనాడు పచ్చిగడ్డల కలహంలో, పోరు నివారింపబోయిన నన్నే పరాభవించాడు. ఈతను బయటికెంత సౌజన్యశీలుడో, అంతర్యంలో అంతటి దురహంకారి. ఆ అహంభావంతోనే పోరు విరమణ జరిగినా, తన

గుర్రం కాలికి అవహేళనగా, ఆనాడు పెద్దన పేరు మీద కట్టిన బొమ్మను ఈనాటికీ తీసివేయలేదు. ఇది మన వంశగౌరవానికే గొడ్డలిపెట్టు. పైగా ఈచర్య, శత్రువర్గంలో చులకనభావాన్ని పెంచుతుంది. కనుక, ఈతనివెంట వేడుకవానిలా నీవుపోయి, మార్గమధ్యంలో బలపరాక్రమాలు ప్రదర్శింపక, చాతుర్యంతో ఆ బొమ్మనూ....దానితోపాటు....నే వేసిన తులసిమాలనూ తేవాలి. దీనికి నీవే సమర్థుడవు. ఇదిరహస్యం. కనుక నిన్నే నియోగిస్తున్నా! జాగ్రత్త! వెళ్ళిరా!

బాల: సరే....(చకచకా వెళ్ళాడు.)

బ్రహ్మ: ఊఁ....నలగామరాజనంతర మీ అలరాజే పలనాటికి వారసుడు. కానీ, ఈతడు మమ్మల్ని ఉద్ధరిస్తాడనుకోవటం వట్టిభ్రమ! ఇది పెడమువిుంచిన పల్లు! ఏనేర్పుతోనైనా ఈపంటిని ఊడబీకించాలి. (సాలోచనగా వెళ్ళాడు.)

(తెరవ్రాలును)

# పల్నాటి వీరులు

## మూడవ రంగం

[గురిజాల రాజభవనంలో నరసింగరాజు]

నర: (వ్యంగ్యంగానవ్వుతూ) నిలువెల్లావిషంనింపుకున్న నీకుట్రలు మాకు తెలియవనుకున్నావా బ్రహ్మనా! నీకున్న స్వార్థం, స్వామిద్రోహం, రాజ్యకాంక్షలేకాక....జూదరివై రాజ్యవిస్తరణకోసం రాజునే కాదని కోడిపందెమాడావు. వారికొంప కూల్చావు. ఇలా ఎన్నోకుట్రలు చేశావు. అన్నిటిలోను అ ప జ యం పొం దా వు. అడవులపాలయ్యావు. మళ్ళీ రాజ్యంకోసం రణాభిలాషివై రంకెలు వేస్తున్నావని గ్రహించాను. నీ అరవై ఆరుగురు వీరనాయకుల్నీ వెంటబడి, వేటాడి, కసితీరేవరకూ తునుమాడి, కత్తికొక్కశిరస్సును గుచ్చి, గ్రామజాతరలు జరిపించగలడీనరసింగరాజు. నీ అండనున్న గోసంగి కన్నమదాసొక దండివిరుడనీ, ఉద్దండపిండమనీ, గండరగండడనీ, కదనమార్తాండ మండిత ప్రకాండుడనీ కలలు గంటున్నావేమో! వాడి కండపట్టు తిండితో మెండుకున్నదేకాని, ఖండనానికిమాత్రం మొండిచేయియని గ్రహింపలేకపోతున్నావు. ఆర్భాటం చేశావా....అధఃపతనమే! పరాక్రమదీప్తితో పరిఢవిల్లి, ప్రతిపంధియూధమదకుంభి కుంభస్థల విచ్ఛేదన హర్యక్షదక్షుడైన రాచబిడ్డడీనరసింగరాజు. (నవ్వాడు.) సింహంతో పోరాటానికి చిట్టెలుకల్ని ప్రోత్సహిస్తున్నావా! జాగ్రత్త! (ఆసీనుడయ్యాడు.)

ఎల్లయ్య: (వస్తూ) యువరాజావారికి నమస్కారములు. నేచెప్పునదేమన....

ఉ॥ ఇంతకు పందెమోడి వలసేగెడివేళ స్వకీయులందరిన్
చెంతకు చేరబిల్చికొని "శీలము చిందిలకుండ దీక్షతో
రంతులు మానుడంచు" వివరమ్ముగజెప్పి; తదాజ్ఞ శత్రుః
శాంతముదాక పొందుడని ఆంక్షవిధించెను నాయడక్కటా!

(పురాణోక్తిలో) వలసవెళ్ళే దినమ్మునసే .... వీరనాయకులనూ, పోటుమన్నీలనూ, చివరకు సంగడీలను సైతము విడిచిపెట్టక, వనవాసక్లేశములతోపాటు గడువుమేరకు యేడేండ్ల పర్యంతము.... కఠిన బ్రహ్మచర్యవ్రతమును పాటించవలెనని....ఆజ్ఞ విధించి.... నిరంకుశుండైన బ్రహ్మనాయండు. జై శ్రీమద్రమారమణగోవిందో హరి. (నాలుక కొరుక్కున్నాడు.)

నర: (గట్టిగా) పల్లయ్యా! ఏమిటాకలవరం?

పల్ల: పొరపాటు యువరాజా.

నర: అలవాటుగా మారిందా....అణగారిపోతావు....జాగ్రత్త!

పల్ల: అనురక్తిలోనున్న పరాకునూ, అన్వేషణలో అంటనిస్తానా.... యువరాజా.

నర: అయితే నీవు చెపుతున్న ఆజ్ఞ నిజమేనంటావా.

పల్ల: అయ్యో! అబద్ధమాడితే....ఈ వేగులపల్లయ్య శవం....దూప చెరువులో తేలుతుందని తెలుసు యువరాజా.

నర: ఊఁ. అయితే, వలసకూ బ్రహ్మచర్యదీక్షకూ సంబంధమేమిటి?

పల్ల: అక్కడేవుంది కిటుకు యువరాజా! వలస అనంతరం మాచెర్ల నెలాగూ సానుకూలంతో సాధింపలేం కనుక, సమరంతోనైనా స్వాధీనం చేసుకోవాలి. కాబట్టి తనవారంతా సమరయోధులై నిలవాలి. పాలిపోని మగటిమి చూపాలి. కామపరతంత్రులైతే కదనం చేయలేరనేది, ఆ బ్రహ్మనగారి నమ్మకం. అలా బ్రహ్మ చర్యాన్ని పాటించబట్టే....శ్రీరామచంద్రుడుకూడా చంపలేని ఇంద్ర జిత్తును, లక్ష్మణుడొక్కడే చంపగలిగాడట! ఇలాంటివే ఉదాహరణ లిచ్చాడూ....పాపం....ఉస్సూరనిపించాడు.

నర: ఇంతకూ యుద్ధం చేసైనాసరే, మాచెర్లను మళ్ళీ రాబట్టుకోవాలనే కోరిక....వలసవెళ్ళే రోజే ఉందంటావు.

పల్ల: అక్షరాలా....

నర: మరి ఆ బ్రహ్మచర్యాని అందరూ పాటించినట్లేనా!

వల్ల: ఒక్క బాలచంద్రుడు తప్ప....

నర: అదేమిటి?

వల్ల: అసలాంక్ష విధించిందే అతనికోసం. పైగా బాలచంద్రునికి భార్యతో కలయికలేకుండా చేయాలని....అనపోతును ప్రత్యేకంగా అందుకే నియమించాడు. కాని, యేంలాభం? బాలుడు భార్య దగ్గరికైతే చేరలేదుగాని, సాని సబ్బాయినిమాత్రం సంపూర్తిగా మరిగాడు.

నర: కన్నపుత్రునికోసం ఇంతటి కఠిననియమాన్ని విధించాడంటే నమ్మలేను. దీనికేదో ప్రబలమైన కారణముండకపోదు.

వల్ల: కారణమా! కావలసినంత! తన పెద్దకొడుకు కన్నమదాసును కాదని చిన్నవాడైన బాలచంద్రునికి పెద్దలంతా పట్టుబట్టి పెండ్లి చేయటమే! అందులో తనమాట ఎలాగూ నెగ్గలేదు కనుక, తాను విధించే షరతునైనా పాటించాలని పంతగించి ఒప్పించాడు.

నర: ఏమిటా ఒడంబడిక?

వల్ల: ఇకముందెవరైనా వెలమవారు పెండ్లి జరుపుకుంటే, రేచెర్ల గోత్రికులైన కన్నమదాసు వంశంవారికి ముందుగా పెడ్లి జరిపి, వారి ఆశీర్వాదం పొంది, ఆ తలంబ్రాలతోనే రేచెర్ల గోత్రజులైన పద్మనాయక వెలమలు పెండ్లి జరుపుకోవాలట. ఇప్పుడాతంతునే గదా వెంకటగిరి ప్రాంతంవారు అక్షరాలా పాటిస్తుంది.

నర: ఏమీ నిరంకుశత్వం? స్వజనులమీదనే యింతటి అఘాయిత్యమా! సరే! మహారాజుగారు ఆస్థానానికివచ్చే వేళౌతుంది. పూర్వగాథా కళాకారుల్ని సిద్ధంచెయ్! వెళ్ళు!

వల్ల: సెలవు. (వెళ్ళాడు.)

నర: రానురాను నీచేతలు స్వజనహితాన్నికూడా కోలుపోయి, మితిమీరి రోతపుట్టిస్తున్నాయి బ్రహ్మనా! ఎవడైనా సహజశౌర్యోపేతుడై ప్రతిభా ప్రభావ పరిపూర్ణుడై, భండన పాండితి నిండుకుని, క్షాత్ర తేజంతో కదనం చేయువాడే వీర్యవంతుడుకానీ, ప్రతాలతో వ్యక్తి

స్వేచ్ఛను చంపుకుని, కడుపుదీర కండలు బెంచినంత మాత్రాన
కయ్యానికి తగుదురనుకున్నావా బ్రహ్మనా....కల్ల.

మల్లయ్య: (తెరలో) నరసింగరాజులవారికి నమోవాకాలు.

నర: ఎవరది? (చూసి) ఓం....వేగులమల్లయ్యా! రా, ఏమిటివిశేషం?

మల్ల: ఏముంది మహారాజా?

సీ॥ అద్దిడు బద్దిడు అడవి జమ్ములపల్లె
కలరోడుపురి మారకాపురంబు
దున్నపోతులపల్లె దూపాడు కొలుకుల
ఎగువపాలెంబును దిగువపాలె
మన్నసముద్రంబు చిన్నికొల్కుల గొల్ల
పల్లియు మరి వీరభద్రపురము
కోన భీములపాడు కొచ్చెర్ల కోటయు
సదగోడు ముటుకుల చావమడుగు

గీ॥ హర మహాక్షేత్రమౌ త్రిపురాంతకంబు
రమణ నాకుల గణపవరంబనంగ
మేదిపియనంగ ఇరువదిమీద రెండు
పల్లియలకు గొనుండు అధిపత్యమవని.

ఇరవైరెండు పల్లెలకు అధిపత్యమిస్తున్నా తీసుకోండి.

నర: మల్లయ్యా! ఏమిటి నువ్వనేది? ఇరవైరెండు గ్రామాలు నీవు...
నాకు అధిపత్యమిస్తున్నావా!

మల్ల: అయ్యో! నరసింగరాజా! అంత తొందరేలనయ్యా!
(పురాణోక్తిలో) అనీ ఇవ్విధంబున శ్రీశైలమునేలు మాక మహీ
పాలుండు; దువ్వలేరు సమీపంబునకు సామంత నృపతుల రావించి,
చావకూడు తినిపించి, సాక్షిసంతకములు చేయించి, తాంబూలాదు
లొసంగి, ఆస్థలమ్మునకు చావలమడుగను గ్రామనామమ్మిడి
అనిపినా....

నర : ఎవరిని?

మల్ల : ఎవరైతే ప్రాణిద్యూత పణమ్మునందు అపజయమ్మునంది, యేడబ్దముల ప్రవాసముచేయ, దైన్యవృత్తిం జరియింపలేక, రాజసంబెడబాయలేక....ఒక లక్షయు ఎనుబదివేల రాపుమాడలకు బేరమాడి, తాను ధరించునట్టియు పరమేశ్వర ప్రసాదితమ్మని చెప్పికొనునట్టియు, నృసింహకుంతంబనుఖడ్గంబును;అద్దానితోపాటు, తాను స్మరించు జపమాల, వనమాలలు సైతము కుదువంబెట్టి.... తిరిగి విత్తమిచ్చి తాకట్టు విడిపించుకొనువరకు....ఆమాకభూపతివద్ద నిక్షేపించి, మేడపి రాజధానిగా నొనర్చి, కాలక్షేపము సేయుచు నుండె కనకాద్రి చెన్నునుభక్తుండు....బ్రహ్మనాయుండూ.... జై శ్రీమద్రమారమణ గోవిందో హరి. (పెదవి కొరుక్కున్నాడు.)

నర : (గట్టిగా) మల్లయ్యా! ఏమిటాపలవరం?

మల్ల : అలవాటు యువరాజా!

నర : అదుపుచేయకపోతే పదవికేచేటు! జాగ్రత్త!

మల్ల : ఇదీ.. స్వస్థానంలోవచ్చే చిత్తభ్రమకానీ, పెరవారిదగ్గర పరధ్యానంకూడా ఉంటుందా యువరాజా!

నర : ఊం. ఇంతకూ మేడపిలో నివాసాలకు కారణం ఇదన్నమాట! సరే! వెళ్ళు! అప్రమత్తంగా అన్వేషణ సాగించు.

మల్ల : అందుకు సందేహమా యువరాజా! సెలవు. (వెనగ్గావెళ్ళాడు.)

నర : (నవ్వాడు.) ఇంతగా చెడిబ్రతుకుతూకూడా.. మాచెర్లకోసం యింకా ప్రయత్నిస్తున్నావా! అది యీసంగరరంగ విశృంఖల వీరవిహారుడైన నరసింగరాజు బ్రతికుండగా నీకసాధ్యం. ఆనాడు మాతండ్రి గతించగనే, అనువంశికపాలనలో అగ్రజుడే రాజ్యార్హుడన్నావు. అదే, ఆశయంతో మాఅన్న నలగామునికి పట్టం కట్టావు. కాని, ఆసూత్రాన్ని నీవుమాత్రం పాటింపక, నీ అన్న పెద్దన్నను కాదని నీవే మంత్రిత్వాన్ని స్వీకరించావు. అది మీ కుటుంబవిషయం కాబట్టి, మాకనవసరం. దానితోనైనా తృప్తి

పడ్డావా! లేదు. తెలిసీతెలియని వయస్కులమైన మమ్మల్ని మభ్యపెట్టి, అమాత్యపదవి ఆధారంతో అవధులతిక్రమించావు. అడ్డదారులు తొక్కావు. కాని, అదేసమయంలో పలనాటిప్రజల ఆశాకిరణమైన నాయకురాలు నాగమ్మ దుర్గాదేవిలా ప్రత్యక్షమై.... నీ స్వార్ధానికి అడ్డుకట్టవేసింది. నీగుట్టును బట్టబయలు చేసింది. ప్రభుత్వ కోశాగారానికి చేరవలసిన అపారమైన ధనరాసుల్ని.... ఏడుఘడియలకాలంలోనే నీబంధువుల యిండ్లనుండి బయటకు లాగింది. రాజాస్థానికి చేర్చి....నీపై అభియోగంమోపింది. ఏం చేయగలిగావు? నిజం నిరూపణకావటంతో, అసత్యమని అడ్డుకోలేక పొయ్యావు. అశక్తుడవై అసూయతో వెళ్ళి పొయ్యావు. స్వార్ధపరుడివేకాక, స్వామిద్రోహివనికూడా ఆనాడే రుజువైంది. ఇంకా నీఆటలు సాగుతాయనుకున్నావా, బ్రహ్మనా!

నాయకురాలు : (వస్తూ) భేష్! నరసింగరాజా! భేష్! నిజంగ్రహించావు'

ఉ॥ బంధుర సౌమ్యశీలురు నృపాలురు, మీరలెరుంగకుండ పెన్
బంధువులోలె వర్తిలుచు భాగ్యముదాచుట్టుండనిమ్ము గ
ర్వాంధుడు బ్రహ్మనాయడపరాతిరిలో గురిజాల కోట ది
గ్బంధమొనర్చినట్టి పరిఘర్షణకార్య మెరుంగపైతివా!

ఒక్క అసూయతోనే వెళ్ళిపొయ్యాడనుకున్నావా, బ్రహ్మన! లేదు. తన అస్తిత్వంకోసం సైన్యాధిపతిమైన తనకొడుకు కన్నమదాసు నడ్డుపెట్టుకుని బందిపోటులా కోటను దిగ్బంధం చేయించాడు. నీయన్న నలగామరాజును భయభ్రాంతుడ్ని చేయించి; పట్టపురాణి బిడ్డలంటూ, మలిదేవుల్ని పాపల్లా వాడుకున్నాడు. పట్టుబట్టి మాచెర్లను పంచుకున్నాడు. పేరు మలిదేవులదైనా, పెత్తనం బ్రహ్మనగారే చెలాయిస్తూ....పదిహేనుసంవత్సరాలేకధాటిగా.... పరిపాలన సాగించాడు. అర్ధమైందా నరసింగరాజా! బ్రహ్మనాయన కున్న పదవీవ్యామోహం.

నర : నిజమే! పదవీకాంక్ష కాకపోతే....పసిపాపలైన మలిదేవులకే పలనాటిలో భాగమా! తక్కిన మాసోదరులంతా ఏమైపోతా రనుకున్నాడీదుర్మార్గుడు! నిజంగా పెద్దరికాన్ని వెలగబట్టే నియతిపరుడైతే, నన్ను కాదన్నా, మా సవతితల్లి భూరమదేవి బిడ్డలైన కామరాజాదులు ముప్పుర్ని.... ఏనాగులేటిలో కలుపుదా మనుకున్నాడీదుష్టుడు! పెద్దయైనవాడు అన్నదమ్ములందరినీ సమానంగా చూడవచ్చుగా!

నాయ : తనప్రతిష్ఠకోసం తక్కినవారేమైనా, తనకేమిటిబాధ? ఎలాగైనా సరే, మీకుటుంబంలో చీలికలు కల్పించి, కలతలు రేకెత్తించి, కలహాలు సృష్టించి, తానొక వర్గానికి నాయకుడై....క్రమంగా పలనాడంతటినీ, తన ఏలుబడి కిందికి తెచ్చుకుని, తానూ తన బంధువులూ సురక్షితంగా ఉండాలనే తపనతప్ప మరేమీలేదు.

నర : అందుకేనేమో! మాచెర్లకు మలిదేవుని రాజ్యాభిషిక్తుని జేసిన మరురోజే....గురిజాలకు ప్రయాణమై వచ్చాడు. దారిమధ్యలో ఔత్సాహికులెవ్వరో వేడుకగా జరుపుకునే కోళ్ళపోరును తిలకించి, అలాంటి జూదంతోనే గెలుపు సాధించి, గురిజాలను వశంచేసుకుని, పలనాటికి ఏకచ్ఛత్రాధిపత్యం వహించాలనుకున్నాడేమో (నవ్వాడు) పాపం! అత్యాశకు లోనయ్యాడు. అపజయం పాలయ్యాడు. చివరకు మాచెర్లను మనకే స్వాధీనంచేశాడు. మందాది అడవులుపట్టాడు. (మళ్ళీనవ్వాడు.) బ్రహ్మనా! కక్కుర్తి కూటికాసపడితే కడుపునిండుతుందేమో కాని, మనసు నిండదని మాత్రం తెలుసుకోలేకపొయ్యావు. అదీ....నీదురాశ!

నాయ : అంతటితోనైనా బ్రహ్మనకు ఆదురాశ చచ్చిందనుకున్నావా నరసింగరాజా! లేదు. చెన్నకేశవుడు తన యిష్టదైవంకదా! తనకేదారిలేక వెళ్ళేవాడికి, ఆదేవుని ఆభరణాలతో పనేమిటి? దేవుని భూషణాలన్నీ ఒలుచుకని, కంట్లపుకోడెకెత్తి కారడవులు పట్టాడే....ఇదేనా! ఆయనకున్న భక్తిపరాయణత్వం?

నర: (వెటకంగా నవ్వాడు.) తాను ధూర్తుడయ్యాడు కాబట్టే, తన ప్రజల్ని దోపిడీవాళ్ళులా గుర్తించి అవనిచేశాడు. హుం.. అందుకే ఏదేవుడూ తనకు సహాయకారి కాలేకపోతున్నాడు. అదీ....అతని దుర్గతి.

నాయ: అవున్లే....తానే విష్ణ్వంశ సంభూతుడనంటూ విశేషంగా చాటుకున్నాడుగదా! ఇక తనకు దేవుడేమిటి? ఆదేవునికి ఆభరణాలేమిటి? అయినా, నరసింగరాజా! నా విష్ణుపృధివీపతి? అనికదా ఆర్యోక్తి! అలాంటి దైవత్వం ప్రజల్ని పాలించే రాజుకు లేకుండా....మంత్రియైన బ్రహ్మనాయని కెలావచ్చిందో!

నర: అదంతా అతని ప్రచారప్రభావం. అమాయకులైన ప్రజలున్నారుకదా, నమ్మటానికి. మరి యిప్పుడేమైంది? బ్రతుకుదెరువుకు మార్గం దొరకక, రాజసంతో రాజీపడలేక, క్షాత్రస్ఫూర్తిని వెలయించే ఖడ్గాన్ని తాకట్టుపెట్టి, బ్రతుకు నీడుస్తున్నాడుకదా బ్రహ్మనాయుడు. అసలానాడే మాపుల్లరి మాకు చెల్లించి, మా స్వాధీనమైన మండాదిలోనే ఆలమందను మేపుకుంటూ కాపురాలు చేస్తే కాదనేవారెవరు? మారుతల్లి పిల్లలైనా మలిదేవులు మా సోదరులేనని నాలుగేండ్లు ఓపిక పట్టాం. కనీసం సమాధానమైనా యివ్వక గర్వంతో చరించాడు. చివరకు మందపోటుతో మదమణగి శ్రీశైలం చేరాడు. హొయసలమాకరాజు నాశ్రయించి మేడపిలో తాకట్టుతో బ్రతుకుతున్నాడు. ఇదేగదా నాగమ్మా, అతనికున్న దైవాంశ!

నాయ: అదేమిటి నరసింగరాజా? పల్నాటిని పంచుకుని, మాచెర్లను పుననిర్మాణము చేయించినరోజే.... పురవీధుల్లో కనకవర్షం కురిపించాడటకదా! ఆమహిమలన్నీ యిప్పుడేమయ్యాయి? అంతటి శక్తిసంపన్నుడైన బ్రహ్మనాయడు, కేవలం తాను బ్రతకటానికి తన విజయసంకేతమైన ఖడ్గాన్ని తాకట్టు పెట్టాడా! ఎంత ఆశ్చర్యం!

నర: (నవ్వాడు) కనకవర్షమా!! అది నిజమని నీవూ నమ్మావా, నాగమ్మా! కాదు. అదంతా తన అనుచరవర్గం అల్లిన కట్టుకథ. అలా ఎందుకుచేశాడో తెలుసా! ఇక్కడ దోచి, దాచుకున్న నల్లధనం....ఇంకా మిగిలిఉందేమో! దానినంతా తెలుపు చేసు కోవడానికి వేసిన ఎత్తుగడే....అది.

నాయి: ఎలాంటి ఎత్తుగడలూ వేయకపోతే....ఎంతటి ప్రచారమత్తులో పడవేయకపోతే, ఈవలనాటికి ఇంతటి దుర్దశ ఎలావచ్చింది? ఈసీమలో ఎంతమందిలేరు రాజోద్యోగులు? వారందరికీ లేని మహర్దశ....తన కొమ్ము కాసే కొలువు జీతగాళ్ళే కోటీశ్వరులౌతారా! ఇక తక్కినవారు దరిద్రనారాయణులా!

నర: భగవంతుడు ఆశ్రితపక్షపాతిగదా, నాగమ్మా! దానినిబట్టి అపర భగవానుడని చెప్పుకునే బ్రహ్మనాయుడు, బంధుపక్షపాతిగాక నురేమౌతాడు? కనుకనే తనవారంతా తలదన్నిన కుబేరులై తే.... తక్కిన నౌకర్లంతా తలమాసిన కుచేలులయ్యారు. లేకుంటే.... ఏబంగారు జలప్రవాహమొచ్చి పద్మనాయకుల యిండ్లలో కూరుకు పోయిందని నమ్మాలి?

నాయి: ఓహో! నడుమంత్రపుసిరి! పద్మనాయకుల నట్టిళ్ళలోనే నాట్య మాడినట్లుంది! కాబట్టే పసిడిముద్దలు పాతర్లలోనూ అశేషధనరాసులు నేలమాళిగల్లోనూ విశేషంగా వెలిశాయి. నిజమే, విడుఘడియల కాలంలో ఎక్కడని వెతకగలం? ఎంతని రాబట్టగలం? జిత్తులమారి నక్క.

నర: కాదు, నరమాంసం మరిగిన పెద్దపులి.

నాయి: అంతటి క్రూరజంతువు కాబట్టే....అర్ధవీటి వీధుల పల్నీడును అంతంచేయించాడు. సమరభీకర శత్రు సంహారుడైన ఆహూరుణ్ణి ఎక్కటిపోరులో ఉక్కడంపలేక నియమహీనమైన దొమ్మీయుద్ధం చేయించి నేలకూల్చారు.

నర : అవును నాగమ్మా! నెత్తుటిమడుగులో దోగ్గాడుతున్నట్లు, నేటికి దర్శనమిస్తున్న ఆ మహావీరుని ఉగ్రరూపం నాలో యింకా చెరిగి పోలేదు. విగతవైభవులై విపిన భూముల్లో అసువులు నిల్పుకునే అర్భకుల కింతటి ఆర్భాటమా! అహంభావ పరిపూర్ణులైన ఆమూకను మార్కొని, వాకటారితో కడతేర్చేకాలం త్వరలోనే వుంది నాగమ్మా!

వాయ : సెభాష్! సరియైనపోకడ! సమరపరాక్రమంటే అలాగే వుండాలి.

(తెరలో) శ్రీశ్రీశ్రీ వీరకామేంద్ర పౌత్ర! అనుగుభూపతిపుత్ర!
ఆత్రేయ గోత్ర! అభినుతగాత్ర!
హైహయవంశ శరదాబ్జ! వినయగుణ విరాజ
ఘనవిభవ బిడౌజ! శ్రీశ్రీశ్రీ నలగామరాజ!
బహుపరాక్! బహుపరాక్!

(నలగామరాజు వస్తుంటే నాగమ్మ, నరసింగరాజులిద్దరూ చెరియొక వైపు నిల్చొని, ఆహ్వాన పూర్వకంగా శిరస్సులు వంచారు. తన సింహాసనందాకా వచ్చిన నలగామరాజు చేసిన చేసంజ్ఞచే అందరూ ఆసీనులయ్యారు. ఆవెంటనే కథకులు వచ్చారు.)

కథ : (ప్రవేశించి) మహారాజులవారికి అభివాదాలు. (సభనుద్దేశించి) సభకు నమస్కారాలు. (కథను మొదలుపెట్టారు.)

వినరావీరుడ చాగివారి ఘన వీరచరితనేడు ॥విన
తెలుగునాట పలనాటినేలనూ రత్నగర్భయనరా ॥వి॥
వీరులెందరో పుట్టిపెరిగినా వీరభూమియిదిరా విన॥
అందముచిందెడి ప్రకృతిశోభకు ఆలవాలమిదిరా విన
కదురు కవ్వములు కుదురుగతిరిగే కరువులేనిసీమా విన

అలాంటిసీమను హైహయవంశ సంజాతుడైన శ్రీచాగి బేతరాజుగారు పాలించేవారు. ఇక పలనాటి పక్కనేవున్న వెలనాటి సీమను చందవోలు రాజధానిగా చేసుకుని దుర్జయ గొంకరాజులు పాలించేవారు.

వలనాటివారు పశ్చిమ చాళుక్యులకు సన్నిహితులైతే; వెలనాటి దుర్జయులు తూర్పు చాళుక్యచోళులను సమర్ధించేవారు.

ఇలా వుండగా; వేంగిదేశాన్ని ఆక్రమించాలని, తూర్పు చాళుక్య చోళులకు, పశ్చిమ చాళుక్యులకు పోరాటం సంభవించింది. అందులో పశ్చిమచాళుక్యులు పరాజయమంది, వారి స్వదేశమైన కల్యాణపురి చేరుతూ..సహాయంచేసిన వలనాటివారికి పాలమూరులో ఆశ్రయమిచ్చారు. అలా కొంతకాలం జరిగిన తర్వాత.

ఆవలినాటిని దుర్జయరాజొకడేలుచునున్నాడా ॥విన॥
చోడవంశ సంభూతుడు రెండవ గొంకరాజెయతడూ ॥విన॥
వలనాటిరాజ్య పరిపాలనచూచుటకూ ॥విన॥
గండ్రకోటలో పేరమరాజును ప్రతినిధిగానిల్పె ॥విన॥

అలా గొంకరాజుల స్వాధీనంలోవున్న పల్నాటిని ఎలాగైనాసరే, తిరిగి వశంచేసుకోవాలనే కోరిక; పూర్వ వలనాటి పాలకుడైన బేతభూపతి తమ్ముడగు అనుగురాజుకు కలిగింది. కాని, గొంకరాజు ప్రతినిధి వీరపేరమరాజు పల్నాటిలోని గండ్రకోటలో ఉండగా, ఆక్రమించడం అసాధ్యమనుకున్నాడు. అందుకని పేరమరాజును ఒంటరిగా చేజిక్కించుకుని హతమార్చాలి. ఆతర్వాత చందవోలు గొంకరాజును ఎదుర్కొనడం సులభ మనుకున్నాడు. దాని కనుగుణంగా, యుద్ధానికని చెప్పక, తీర్థయాత్రలనే నెపంతో, దండుతోసహా పాలమూరు సంస్థానంలోని రాయలగండి రహస్య స్థావరం నుండి వలనాటికి బయలుదేరాడు, అనుగురాజు; అందుకని.

నీలికోకలనుగట్టి నుదుట తిరుమణిని దీర్చినాడా ॥తం॥
పూర్వులాదిగా తాతలుచేసిన పాతకములనెల్లా ॥తం॥
పరిహారము చేయుటకేయని వివరమెంచసగినాడా ॥తం॥
సపరివారమును వెంటబెట్టుకొని సాగిపోయినాడా ॥తం॥
పుణ్యక్షేత్రముల పూజలుసేయుచు కృష్ణరేవుదాటి ॥తం॥
అర్లగొండయే అనుకూలమ్మని అచటనిల్చినాడా ॥తం॥

అలా నిల్చినతర్వాత జొన్నవిత్తులకోసమంటూ....అర్ల కొండ గ్రామంలో రాష్ట్రకూటులతో కలహం పెంచుకున్నాడు, అనుగురాజు సేనాపతి తెప్పలినీడు. ఆకలహాన్ని అణచటానికి గండ్రకోటలో రాజప్రతినిధిగా వున్న ఊరపేరమరాజు కొంతసైన్యంతో వచ్చి యుద్ధానికి దిగాడు. కాని తెప్పలినీనిచేతిలో నిహతుడయ్యాడు. ఆప్తుని మరణంతో మహోగ్రుడైన చందవోలు గొంకరాజుకు

మత్సరమ్ము మదిహెచ్చెర....సై
కాసెమీద కాసెగట్టెర....సై
కరకుకత్తి చేతబట్టెర....సై
కుప్పలించి గుర్రమెక్కెర....సై
సమరభేరి మ్రోగించెర....సై
చెచ్చెరసేనలు కదలగ....సై
చిచ్చరపిడుగై వచ్చెరా
కచ్చెడు కారేడువ్వెరా
భళానందిభళితమ్ముడాసై మేల్‌భళానోయ్‌దాదానా....

అది గమనించిన అనుగురాజు సేనావాహిని

ఫెళఫెళఫెళ ఆర్భటిచేయుచు పెక్కుగతులచేరి....భళాభళి
జబ్బలుచరుచుచు భళిరభళాయని గొబ్బునకసిమీర.... భళాభళి
త....తకిటతక....తకిటతక....తరికిట....తరికిట....త
విచ్చుకత్తులను జల్లికేడెముల చరాలునందుకొని....భళాభళి
పగతురపైబడి నరకుచు తరుగుచు కోసిరికంఠాలు....భళాభళి
అదేసమయమని గొంకరాజుపై దుముకుచునెదురేగి....భళాభళి
కుంభితొండమును ఒక్కవ్రేటుతో తుండెముచేశాడా....భళాభళి
పుడమినితాకిన గొంకభూపతిని చెరగొనెపేర్నిడు....భళాభళి

ఆవిధంగా బందీయైన చందవోలు భూపతిని అనుగురాజుదగ్గరకు చేర్చగా....

వినవయ్యా ఇటువినవయ్యా ఓచాగిఅనుగురాజా ॥తం॥
కదనమునందున నిన్నెదిరించుట తరముగాదునాకూ ॥తం॥
ఓడిననాపై వగసాధించుట పాడిగాదునీకూ ॥తం॥
చెలిమికోరితిని కినుకమాని నా మనవి వినుమురాజా ॥తం॥

అలా పరితపిస్తూ....గొంకరాజు....సభకు నమస్కరించి

గీ॥ బవరమొనరించి మీచేత బందినైతి
సుతను మైలమ్మ నలుగు భూపతికినిచ్చి
అరణమిచ్చెద పలనాడు శరణుగోరి
సంధి పొసగించి పంపుడీ సభికులార.

ఆ వినతిని సభ ఏకగ్రీవంగా ఆమోదించి, సంధి నంగీకరించింది. అలా పలనాటిని హస్తగతం చేసుకుని, మంత్రి దొడ్డ నాయని సహకారంతో పూర్వవైభవాన్ని పునరుద్ధరించి, సిరులుచిందుసీమగా వెలయించారు, అనుగురాజుగారు.

(కథకులు రాజుకూ సభకూ అభివాదం చేసి వెళ్ళారు.)

నల : నరసింగరాజా! కళాకారులకు పారితోషికాలిప్పించే యేర్పాటు చేయించు. ఆఁ.... నాకేదో అనుమానంగా వుంది. ఈరోజు కోటరక్షణ బాధ్యత జాగ్రత్తగా పరిశీలించు.

నర : అలాగే మహారాజా! (వెళ్ళాడు.)

నల : నాగమ్మా! ఈరోజు జరుపదలచిన చర్చనీయాంశమేమిటి?

నాగ : ఏముంది మహారాజా? కోడిపందెంలో మలిదేవరాజుకు మనం విధించిన ఏడువత్సరాల అరణ్యవాసపు గడువు తీరిపోయింది. అది గతించి యేడుమాసాలైనా..మాచెర్లవిషయంలోమాటాడక మౌనంగా ఉన్నారంటే, నాకేదో అనుమానంగా వుంది.

నల : అడిగినా సాధించుకోలేమనే ఉద్దేశం కావచ్చు. అందువల్లనే ఉడిగియుండవచ్చు.

నాయ : అడగకుండా రాజ్యాన్ని విడుచుటకంటే అడిగి లేదనిపించు కోవటంలో వున్న గొప్పతనం ఆబ్రహ్మనాయనకు తెలియదంటారా నలగామరాజా!

నల : తెలుసు. కానీ, అడిగి కాదనిపించుకునే న్యూనతకన్న అడగక పోవటంలోవున్న రాజసమే అధికమనుకున్నాడేమో!

నాయ : అయితే దీనినిబట్టి మాచెర్లను మరలా వారికివ్వటం అసాధ్య మంటారు.

నల : అంతే దానికి తిరుగులేదు. మరలా మాచెర్లనిచ్చి, చీటికి మాటికి వారితో తగవులు పెంచుకుని సభ్యరాజలోకంలో చవుకబారిపోవటం నాకిష్టంలేదు. పైగా మలిదేవులే నాకు సోదరులుకారు. మేమంతా ఎనిమిదిమంది సోదరులం.

నాయ : మంచిదే, మరి గడువుతీరినా పోదుమెదపనివాడు, రేపు కత్తిబట్టి కాలుకదిపితే?

నల : అంటే....నీయుద్దేశం?

నాయ : యుద్ధం ..

నల : యుద్ధమా! (నవ్వాడు.) నాగమ్మా! నేలతీపితెలిసిన యేపాలకుడూ పాలితభూమిని పంచడు. యుద్ధమంటే జంకడు. పైగా మేము క్షత్రియువీరులం. యుద్ధం మాకు అతిసామాన్యమైన విషయం. దానికితోడు ప్రజాహితవునుకోరే ప్రధానిగానీవున్నంతకాలం, ప్రజా బలానికా. మాకు లోటులేదు. యుద్ధమనే భూతాన్ని బ్రహ్మన ప్రేరేపించినంతమాత్రాన భయపడువాడు కాడీనలగామరాజు.

నాయ : మీకు ప్రజాబలముంది. నిజమే. కాని, యేకొందరోతప్ప ప్రజలంతా యుద్ధానికి రారుకదా! మరి, అబ్రహ్మనకు అరవై ఆరుగురు వీరనాయకులబలం అఖండంగావుంది. దానికితోడు పోటు మన్నీలను, పద్మనాయకులను, సంగడీలను అడవులు పట్టిన దగ్గర్నుంచి బలాధికుల చేసుకుంటూ వచ్చాడు. దీనికేమంటారు మీరు?

నల : వారంతా, నియంత బ్రహ్మన కర్కశవిధానంలో స్వేచ్ఛను చంపుకుని, భావదాస్యంతో బ్రతుకులు సాగిస్తున్న బడుగుజీవులు. ముందుచూపెరుగని మూర్ఖులు. వారందరినీ మట్టుపెట్టటానికి మా నరసింగరాజొక్కడు చాలు. అయినా యుద్ధమే సంభవిస్తే మనకున్న బలంలో వారెంత? వారి బండారమెంత?

నాయ : మహారాజా! వేగులవల్ల నే సేకరించిన విషయాన్ని వినండి. రాజ్యభాగమనే నెపంతో ముందుగా మీవద్దకు రాయబారంవస్తుంది. కాని, అది మాచెర్లకోసం కాదు. పలనాటిప్రజల సానుభూతికోసం. అబ్రహ్మనకు కావలసింది పలనాడు సర్వస్వం కానీ, ఒక్క మాచెర్ల వరగడాకాదు. కాబట్టి మనతో యుద్ధమేచేయాలి. దానిలో మనల్ని ఓడించి పలనాడును పూర్తిగా స్వాధీనంచేసుకోవాలి. రాయబారాన్నంగీకరించామా....యిక యుద్ధప్రసక్తిలేదు. యుద్ధం లేకపోతే పలనాటి సార్వభౌమాధికారమా .... వారికిరాదు. రాయబారమంగీకరించినా, తిరస్కరించినా, మరో అపవాదైనా మనమీద మోపి, యుద్ధం చేయలనే కోరికతోనే వున్నాడు. దీనికి పునాది అడవులు పట్టేరోజే వేసుకున్నాడని మీకూ తెలుసు. కాబట్టి వారికే యిష్టంలేని రాయబారాన్ని మనమెందుకు అంగీకరించాలి? భాగాలు పంచి పలనాటిలో వారికెందుకు స్థానం కల్పించాలి? అసలు రాయబారాన్నే తిరస్కరిస్తే....వారి భాగాలేమిటో....బలాబలాలేమిటో రణరంగంలో తేల్చుకోవచ్చుగా?

నల : మంచిది నాగమ్మా: నేనుమాత్రం కాదంటానా! అయినా మాకు కావలసింది పలనాటి ప్రజల భవితవ్యంకానీ....భాగాలు కాదు. సమైక్యతతో సాధించలేని ప్రజాక్షేమం....భాగాలతో సాధ్యమౌతుందంటే....నేను నమ్మలేను. కనుక సమైక్యతా సాధనకోసం నా సర్వశక్తుల్నీ ధారపోయడానికి సిద్ధంగా వున్నాను. ఇందుకు అడ్డువచ్చిన అరిబలాన్ని పరాజితుల చేయగలనే నమ్మకం నాకుంది.

ఉ॥ నీవనినట్లు బ్రహ్మనయె నేటివిపత్తుకు చేటు-వాని దు
ర్భావమె మా సహోదరుల పాలిటి వైరముపెంచె-కాన శౌ
ర్యావహమూర్తినై పగర రక్తముచిమ్మెదుదాక పోరి; ఆం
ధ్రావని వీరపూజలిడ ఆహవమందు జయమ్ము గాంచెదన్.

నాగమ్మా! ఇంతకూ రాయబారిగా వచ్చేనేర్పరి ఎవరో తెలుసుకున్నావా!

నాయ: ఇంకెవ్వరు! మీఅల్లుడు అలరాజు!

నల: అలరాజా! ఆశ్చర్యంగావుందే! ఇదేదో పనిగట్టుకు చేసిన పన్నాగమే!

నాయ: మీకన్నను మీచేతనే హెడిపించాలని, ఆబ్రహ్మనచేసిన కుటేృయిది.

నల: ఊఁ... సరే! కాని, ఈవిషయంలో నామనసెందుకో బండవారిపోతుంది. రానురాను బ్రహ్మనాయుని చర్యలు నాలోఅసహనాన్ని రేకెత్తిస్తున్నాయి. అయినా, కర్తవ్యాన్ని నిర్విఘ్నంగా నిర్వర్తించే నేను....ఒకరికి భయపడవలసిన పనిలేదు. కాని, బంధుత్వాన్ని వరిగడించే ప్రమాదం రావచ్చుననే అనుమానం నాకుంది. కనుక రాయబారంలో నెరపవలసిన కార్యాన్ని నీవే ఆలోచించి నిర్ణయించు. అందుకభ్యంతరమేలేదు.

నాయ: ~~రాజా!~~ మంత్రిణిగా నాకర్తవ్యం నాకు తప్పదుకదా! ఏదియేమైనా అన్నదమ్ములమధ్య అంతరాయం కల్పించిందనే అపప్రధ నాపాదింపకపోడు, ఆ బ్రహ్మనాయడు.

ఉ॥ అన్నలు తమ్ములందరొకటై చరియించుట కిచ్చగింపకే
పన్నితి కుట్రలంచు తెగవాగుచు నాపై నిందమోపుచున్
నన్నొక ధూర్తుపోలె తన నాటకమందు రచించుకొన్న బ్ర
హ్మన్న మనమ్ములో కపటమార్గముగాక మరేమియుండునో!

నల: అవును నాగమ్మా! మొదట చీలికతెచ్చిందే ఆబ్రహ్మనాయడు. ఆచీలికనే కలకాలం సాగించి, మా లో మా కు కలయికలేకుండ చేయాలనే అతని వంకరబుద్ధి ఎవరికితెలియంది!

ఉ॥ అర్థములేని యీరగడకంతకు మూలము బ్రహ్మనాయడే
స్వార్థము మేరమీరి, తనవారుసుఖమ్ముగ నుండగోరు కా
ర్యార్థమెకాని, వేరు కలదా-నెపమేమియులేని మాపయిన్
వ్యర్థప్రయత్నముల్ సలుపు పై ఖరిజూచిన తేటతెల్లమౌ!

కనుక సందేహింపక సమస్యను పరిష్కరించి సమైక్యతను కాపాడు.

నాయ: సరే! మీకోసం! ఈపలనాటి ప్రజలకోసం బాధ్యతను నామీదనే వేసుకుంటాను. అన్నిటికీ ఆత్రిలోచనుడే సాక్షి.

(ఏవో భీకరశబ్దాలు వినిపించాయి)

నల: మంత్రిజీ! ఎక్కడివాతమ్మెటధ్వనులు? కాహళ శబ్దాలు? అవి మన పొలిమేర దాపునే వినిపిస్తున్నాయి! అంతధైర్యంగాపొలసాడే ఆవీరులెవ్వరు?

నాయ: తత్తరపడకండి నలగామరాజా! అవి మీఅల్లుడు అలరాజు రాయబారానికి వస్తూ హెచ్చరికచేసే నినాదాలు కావచ్చు.

నల: ఊఁ... (నవ్వాడు.) రాయబారమంపిన మలిదేవుడు....నాతమ్ముడు రాయబారిగా వస్తున్నది నాఅల్లుడు, అలరాజు. బ్రహ్మనా ఏమి నీబుద్ధిచాతుర్యం! నీ స్వార్థ సంకుచిత రాజకీయంతో, మా బంధుత్వాలకుకూడా తావులేకుండా చేయటాని వేశావా, ఈ ఎత్తు! అల్లుని పంపినంత మాత్రాన....ఆత్మీయతను పురస్కరించుకుని వ్యక్తిత్వాన్ని చంపుకునే స్వార్థపిశాచి యనుకున్నావా, ఈనలగామ రాజు. (శంఖం జేవురించింది.) నాగమ్మా! ఇంతకుముందు మనమనుకున్న నిర్ణయమేనిర్ణయం. ఇందులోబంధుత్వాలకేమాత్రం తావీయ పనిలేదు. ఎన్ని విఘాతాలు వచ్చినా, ఎంత విద్వేషం పెరిగినా, ఏపరిణామం ప్రాప్తించినా, విచారాన్ని విడనాడి.... కర్తవ్యాన్ని కాదనక....చర్చను కొనసాగించు.

నాయ: మహాప్రసాదం (మెడలోని రుద్రాక్షమాలను సవరిస్తూ కళ్ళు మూసి ధ్యానించింది.)

అల : (వస్తూనే) మహారాజున కభివాదాలు. (నమస్కరించాడు.)

నాయ : (దిగ్గునలేచి నిల్చుంది.)

నల : (చిరునవ్వుతో) అల్లుడా! అలరాజా! ఆసీనుడవు కమ్ము. అందరూ క్షేమమా! మీతండ్రి కొమ్మభూపతి కుశలమా!

అల : మలిదేవులతోసహా అందరూ కుశలమే మామా!

నల : అల్లునిరాక ఊహించని విధంగా జరిగింది! కారణమేమిటో?

అల : నేను అల్లునిగా రాలేదు. రాయబారిగా వచ్చాను.

నాయ : ఎవరుపంపితే వచ్చావు?

అల : మలిదేవరాజు నాగమ్మా!

నాయ : నేను మహామంత్రిణిని. (గంభీరంగా అంటూ రుద్రాక్షమాల సవరించింది.)

నల : రాయబారి! నీ రాయబారమేమని?

అల : మహారాజా! అనుకున్న గడువు మేరకు, మీతమ్ములు మలిదేవులు వలసను పూర్తిచేశారు. కనుక, విమలధర్మాన్ని పాటించి, దాయాది వాత్సల్యాన్ని పరిగణించి, ఆనాడు పంచియిచ్చిన మాచెర్ల సీమను వారికి ప్రసాదించి, మీహైహయవంశ ప్రఖ్యాతినీ, పలనాటి ప్రశస్తినీ ప్రదీపింపజేస్తారని మనవిచేస్తున్నా.

నల : (నవ్వి) దీనికింత ప్రసంగమెందుకు అలరాజా? ఆనాడు మేము పంచియిచ్చింది పరిపాలనకుగానీ, జూదంలో పందెమొడ్డి పరిత్యజించటానికికాదు. భాగమిచ్చినా, ఫలితం దక్కించుకోలేనివారికి మరలా రాజ్యమేమిటి? పైగా పలనాటికి కాబోవు వారసుణ్ణి రాయబారిగా పంపడమేమిటి? బంధుప్రీతితోనైనా భాగం సాధించి పలనాటిలో తన ఉనికిని సుస్థిరం చేసుకుందామనుకున్నాడేమో ఆ బ్రహ్మనాయుడు! అది జరగనిపని.

నాయ : అసలు అర్హతలేనివారికి భాగం పంచటమే పొరపాటు. ఆ పొరపాటును మళ్ళీ చేదలచుకోలేదు.

అల : అదేమిటీ! అర్హత ఉండబట్టేగా....మాచెర్లను దాయభాగంగా వంచి యిచ్చారు. ఆనాడూ నీవూ వున్నావుగా మహామంత్రిణీ!

నాయ : ఉన్నాను. కాబట్టే చెపుతున్నాను. దా య భా గ మ ం టూ మేమానాడు వారికి వంచి యివ్వలేదు. మేమిచ్చింది దయాభాగం అంతే.

అల : (ఆశ్చర్యంగా) ఏ మి టీ! దయాభాగమా! ఊఁ.. సరే! ఏభాగమైనా, గడువుపూర్తిచేశారు. కాబట్టి, వారి రాజ్యం వారి కివ్వాలిగా.

నల : గడువును పూర్తిచేసింది అరణ్యవాసానికిగానీ, అసలు రాజ్యాన్ని తిరిగి పొందటానికికాదు. అదైనా పరభూముల్లో చేయవలసిన అరణ్యవాసం....మా భూముల్లోనే, నాలుగేండ్లు చేశారు. అదేమంటే యుద్ధంచేసి విధుల వల్నీడును హతమార్చారు. మండాది మాది కాదా! మండాది అడవులు మాస్వాధీనంలో లేవా!

నాయ : అదీచాలక ఒంటరివాణ్ణి ఏమీ చేయరనే ఉద్దేశంతో గురజాలమీదికి యుద్ధానికివచ్చి నానాభీభత్సంచేశాడు, బ్రహ్మనాయుడు!

నల : ఆతర్వాత తక్కిన మూడేండ్లూ వనవాసమన్న మాటే మరచిపోయి! మేదపిలో రాజ్యాన్ని పాలించారు. వనవాసమంటే యిదేనా! పూర్తిచేయటమంటే యింతేనా? అయినా, యీభాగాలెందుకు! మా అన్నదమ్ములందరితోపాటు, వారుమాతో కలసిఉండవచ్చుగా. దీనికి వలనాటినంతటినీ ఖండించి ము క్క లు చేయవలసిన వనేమిటి?

అల : అంటే....మీ అభిప్రాయం; మాచెర్లను మళ్ళీ వారికిచ్చే ప్రసక్తి లేదనేగా!

నాయ : ఇది మాఅభిప్రాయమేకాదు, న్యాయకోవిదులెవ్వరైనా చెప్పే అభిప్రాయమే ఇది. జూదంలో గెలుచుకున్న ఆస్తిని ఓడినవారికి అందులోనూ పందెపునియమాన్ని పాటించనివారికి, ఉచితంగా యిచ్చే ప్రసక్తి యేధర్మశాస్త్రంలోనూ లేదు.

అల : ఊం... అయితే దీనినిబట్టి అన్నదమ్ముల్లో అంతరంగిక విభేదాలు పెంచటానికి నీవే కారణం! ఈవిధంగా తప్పుదారిలో కలతలు పెంచి పలనాటిలో మరో కురుక్షేత్రయుద్ధానికి నాంది పలుకుతున్నదికూడా నీవే! మహామంత్రిణీ! గురజాల కోటలో నీవు అడుగు పెట్టిన నాటినుండే....అన్నదమ్ములమధ్య హెరహెచ్చాలు మొదలయ్యాయని తేలిపోయింది.

నల : కాదు. బలదర్పవటిమతో మమ్మల్ని మభ్యపెట్టి, రాజ్యార్హత లేనివారికిగూడా రాజ్యాన్ని పంచియిచ్చిన ఆ బ్రహ్మనాయని కూటచేష్టలే, ఈ తరతమవిభేదాలకు అంకురార్పణ.

అల : ఆం....ఏమన్నారూ? పట్టపురాణి బిడ్డలైన మలిదేవులకు రాజ్యార్హత లేదా!

నాయ : ఉంటే, అనుగురాజు మరణానంతరం వారికే ఎందుకు పట్టం కట్టలేదు. ఒకవేళ నేనేమైన చేశాననుకుంటే....ఆనాడు ఈ కోటలో నాకు స్థానమేలేదుగా! సర్వాధికారియైన ఆ బ్రహ్మనయేగా.... ఈ నలగామరాజును పలనాటిగద్దెపై నిలిపింది. అలా ఎందుకుచేశాడో చెపుతున్నా విను. ఈపలనాడు మైలమదేవి పసుపుకుంకాలకింద అరణంగా వచ్చింది. ఇది ఆమెకు పుట్టినింటివారినుండి సంక్రమించిన సొంతఆస్తి. దీనిమీద అధికారం, ఆమె కుమారులకు తప్ప మరొకరికిలేదు. పైగా ఈ నలగామరాజు అందరిలోనూ అగ్రజుడు పారంపర్యానుగతంగానైనా అగ్రజుడే రాజ్యార్హుడు. ఒకవేళ ఆనాడు రాజ్యార్హతవిషయంలో బ్రహ్మనాయుడు తప్పటడుగు వేసిఉంటే; అంతకుముందాతడు చేసిన రాజద్రోహనేరానికి, నివురుగప్పిన నిప్పులావున్న పలనాటి ప్రజాపౌరుషం....ఒక్కసారిగా పేట్రేగి విప్లవాగ్ని జ్వాలామయంగా విస్తరించి, భస్మరాశి చేయడానికి సిద్ధంగావుంది. దానికితోడు ఆసమయంలో తానూ మంత్రిపదవి నాశించాడు కాబట్టి, పెడమార్గం తొక్కలేకపోయ్యాడు.

అల : నేను రాయబారిగా వచ్చింది మీ వితండవాదాన్ని, గతచరిత్రనూ తెలుసుకోవటానికి కాదు.

నాయ : ఆవిషయం మాకూతెలుసు. మలిదేవులకు రాజ్యార్హత అన్న విషయం రాబట్టే గతాన్ని గుర్తుచేయవలసి వచ్చింది. కానీ, నీకు చెప్పాలనేవేడుక మాకూలేదు. అయినా ఒక్కవిషయమాలోచించు. నీ మేనత్త సిరాదేవి అత్తవారింటికి వస్తూ ఎంతో గోసంపదను అరణంగా తెచ్చుకుంది. ఆ సంపదలో మలిదేవుని సోదరు లెనమండుగురిలో ఏఒక్కరైనా చేయిచాపి భాగమడిగారా! లేదు. దానికి కారణం....మలిదేవులకు భాగమంటూ రాయబారానికివచ్చిన నీవే చెప్పాలి.

అల : నేను భాగమంటూ రాయబారానికిరాలేదు. ఒకమారిచ్చిన భాగాన్ని; పందెంలో అనుకున్న నిర్ణయాన్ని పాటించి, వలసను పూర్తిచేశారు కాబట్టి, ఆనిర్ణయాన్ని మీరూ పాటించి, వారిరాజ్యం వారి కివ్వమంటున్నాను. ఇది కనీసధర్మమనికూడా హెచ్చరిస్తున్నాను.

నాయ : అలరాజా! ఉడుతఊపులకు కొండలు చలిస్తాయనుకున్నావా! ఇలాంటి హెచ్చరికలెన్నోచేసి, ఆడది యేంచేయగలదనే పురుష హంకారంతో పంతగించిన మీ బ్రహ్మన్న ఇప్పటి కెన్నిమార్లు నాచేతిలో పరాభూతుడుకాలేదు. హెచ్చరికలకు జంకేవారెవ్వరూ లేరిక్కడు. పైగా ధర్మమంటున్నావు. ఏమిటాధర్మం? కోడి పోరులో తొలివరాజయాన్ని మేం మనస్ఫూర్తిగా అంగీకరించాం. కాని మలివందెంగా మేం గెలుపుసాధించగనే యుద్ధం ప్రారం భించారు. బ్రహ్మనగారు. అప్పుడు నీవేగా మధ్యవర్తివి! ఏం చేయగలిగావు? అంతేకాదు. బ్రహ్మన్న కోడినిపట్టిన చెవుల గోవన్న, ఓడిన పరాభవాన్ని భరించలేక, పొడుపొన్ని దిగమింగ లేక, ఆత్మహత్యకు పాల్పడలేక, ఆదేజోగన్నచే అస్త్రాలు వేయించుకుని చస్తే...ఈనాయకురాలే చంపించిందని నాపై ఆరోపణ చేశాడు. ఇదేనా ధర్మం! అలతొక్కిడిలో లంకన్న చనిపోతే.... అదీ యీనాగమ్మే చంపించిందని వాపోయాడు. ఇదేనా ధర్మం?

అల : కట్టుబోతుల రావించి అక్షతలు చల్లించిన నీ దుర్న్యయ నాటకాలు ఎవరికి తెలియనివి? అనాడు కోడిపోరులో ఇరువాగులవారి దురాకృతాలు దూషితాలు కాబట్టే త గ వు లు పెం చ టం తగదని ఊరుకున్నాను. ఏది యేమైనా, అనుకున్న నిర్ణయానికి కట్టుబడి అపజయాన్నంగీకరించారూ, గడువుమేరకు వలసమా పూర్తిచేశారు మలిదేవులు. అదేనిర్ణయానికి మీరూ బద్ధులై నిలవండి! లేదా! రాబోవు దుష్పరిణామాలకు....నీవే బాధ్యత.

నాయు : ఏపరిణామాన్నైనా ఎదుర్కోవడానికి మేం సిద్ధంగా వున్నాం. దయాభాగం కాదుగదా! చివరకు పలనాటిలో కత్తిమొనమోపినంత మేరనైనా వారికిచ్చేదిలేదు.

అల : నలగామరాజా! మీసమాధానంకూడా యిదేనా!

నల : అలరాజా! పలనాడును భాగించి భ్రష్టుపట్టించ దలచుకోలేదని.... నేను మొదటేచెప్పాను. కాని అందరమూ కలిసి అన్యోన్యంగా ఉండటానికిమాత్రం సమ్మతిస్తాను. అదైనా బ్రహ్మనాయుడు మంత్రిత్వాన్ని ఆశించకుండా వుంటేనే.

అల : అది జరగనిపని. సామరస్యంతో సంధి నంగీకరిస్తారనే నమ్మకంతోనే నన్ను పంపారు. కాని, యుద్ధంచేసి వారిరాజ్యాన్ని వారు సాధించుకోలేకకాదు. అయినా, పైత్యరోగికి పంచదార చెగటైనట్లు నీవు నీతమ్ముల క్షేమాన్ని కాక్షించలేకపోతున్నావు. బుద్ధిజాడ్యంతో చేసే కార్యాలు దుష్ఫలితాలనే యిస్తాయి. జాగ్రత్త అల్పబుద్ధుల మాటలువిని జ్ఞాతివైరాన్ని పెంచుకుంటున్నావు, అగ్నికణాన్ని యింటికప్పులో దాచుకుని ఆహుతి కావటానికి ఆరాటపడుతున్నావు. ఇప్పటికైనా వారిరాజ్యాన్ని వారికి యిచ్చి దాయాది వాత్సల్యానికి దారిచూపించు. కాదంటావా కదనం తప్పదు. దానితో మీ పతనమూతప్పదు. ఆస్థితిలో ఆలోచించినా, ఫలితము దక్కదు. ఆ భండనభూమిలో, చండప్రచండ మండిత దోర్దండపిండులై.... గండ్రగొడ్డండ్లతో, మండలాగ్రాలతో చెండుచెండాడుతూ వచ్చే వీరనాయకుల విశృంఖల వీరఖండనలకు .... నీ ద ం డ ం తా వండదరిగినకాయగూరల్లా ఖండికలై భూమండలంపై దొర్లకతప్పదు.

నల : ఆఁ ఏమిటీ! బెదిరిస్తున్నావా!

అల : లేదు అభ్యర్థిస్తున్నాను. తిరస్కరిస్తే రాగల ప్రభావాన్ని ఆపుకోలేరంటున్నాను.

నాయు అలరాజా! నలగామరాజు కూరిమికూతురు పేరమదేవి భర్తవనీ, పలనాటికి వారసుడవనీ. గ్రహించి, యిప్పటివరకూ ఓరిమి వహించాము. రాయబారిగా వచ్చి, అరిసేనా దర్పాన్ని అదేపనిగా ఏకరువుపెట్టి ఎగిరిపడుతున్నావు! (రుద్రాక్షమాలను ఉద్రేకంగా సవరించింది.)

చ మగతనమున్నదంచు పెడమాటలు మాటికి మాటిమాటికిన్
తెగబడి వాగెదేల? రణధీరులు శూరులటంచుబల్కి యా
పొగరున దూలుచున్ సమరభూమికి వచ్చెది మీబలమ్ముతో
రగడకు సిద్ధమైన మగరాయడనంచు నెరుంగజెప్పుమా!

వాగ్గర్వంతో వసపిట్టలా వదరక, వచ్చినదారిచూసుకో! లేదా! బవరానికివచ్చి మా బలమేమిటో తెల్చుకో! నీవగ్రగల్భాలకు త్రుళ్ళిపడే పిరికిపందలెవ్వరూ లేరిక్కడ.

అల. ఆఁ.. ఏమీ! నాది వాగ్గర్వమా, నాగమ్మా! నిరంతర యుద్ధోన్మాదంలో ఉన్మత్తపిశాచివై, దాయాదులమధ్య దగాకోరువై, దారుణ హింసాకాండకు దారిచూపే దగుల్బాజీవయ్యావు. పలనాటి రాజకల్పవృక్షానికి వేరుపురుగులా దాపురించి, స్వజన విరోధ విష వృక్షానికి నీరుపోసి నిరంతరాయంగా పెంచుతున్నావు. ముందు నిన్ను తెగటార్చి, జ్ఞాతివైరాన్ని ఇక్కడే పరిష్కరిస్తాను. కాచుకో! (కత్తిలాగి నరకబొయ్యాడు. నలగామరాజు అడ్డుపడటంతో ఆపి, దూసినకత్తితోనే వేగంగా వెళ్ళబోయాడు.

నల :- అలరాజా! ఆగు.

అల : (ఆగాడు.)

నల : (దగ్గరకుచేరి) అలరాజా! రాయబారిగావచ్చినా నీవునాఅల్లుడవు. విడిదికివచ్చి విందారగించు.

అల : ఈసమయంలో బంధుత్వానికి తావులేదు. వస్తా! (వెళ్ళాడు.)

నాయ : తెలిసిందా నలగామరాజా అలరాజు దురహంకారం?....సరే.. నిష్కళంకుడైన శివుని ధ్యానించి, చిత్తశాంతి పొందాలని వుంది. నాకు సెలవీయండి. వస్తా. (రుద్రాక్షమాలను సవరిస్తూ వెళ్ళింది.)

పల్ల : (మరోవైపునుండి వేగంగా వచ్చాడు.) మహారజా! ఘోరం! మహాఘోరం! అలరాజుగారేంచేశాడో చూశారా!

నల : ఏంచేశాడేమిటి?

పల్ల : మహామంత్రిణిగారిపై ప్రయోగించటానికి వీలు చిక్కక, దూసిన కత్తితోనే వెళ్ళిపొయ్యారా! పోతూ.... పోతూ .... తలవాకిట్లోని ఊక్కుకంబాన్ని, ఒక్కదెబ్బతో రెండు ముక్కలుగా నరికి, కత్తిని ఒరలో దోపారు. అప్పటికీ శాంతించక తన శివకాశ్వంపై లంఘించి, కన్నమదాసును కలుషకుని చెర్లగుడిపాడు దారిపట్టారు.

నల : పల్లయ్యా! అలరాజు చెర్లగుడిపాడు చేరడమేమిటి! అతను వస్తూ హెచ్చరించిన కాహళధ్వని రెంటాల పొలిమేరల్లోగదా, వినిపించింది.

పల్ల : అవును మహారాజా! వారొచ్చింది రెంటాలమీదుగనే కాని, విడిదికి గుడారాలెత్తిందిమాత్రం చెర్లగుడిపాడులో.

నల ; అదెలా సంభవం?

పల్ల : అదే అంతుచిక్కని రహస్యం. అలరాజుగారితోపాటు, అంగ రక్షకుడుగా కన్నమదాసుకూడా మేడపినుండి బయలుదేరాడు. ఇసుక త్రిపురవరమూ, మర్రివేములమీదుగా నిన్నటిరాత్రికే కంభంపాడుచేరి, అక్కడే విడిదిచేశారు. కాని, రాత్రికి రాత్రే కన్నమదాసు కనుమరుగై రాయబారసమయానికి గురిజాలలో ప్రత్యక్షమయ్యాడు. దానికి నా అనుమానం మాత్రం..అతడారాత్రే.. కంభంపాడు నుండి మాడుగులమీదుగా చెర్లగుడిపాడు చేరాడనుకుంటా! అందుకే వేగుల మల్లయ్యను అక్కడికే పంపించా....

నల : ఊం.... నీఅనుమానం సరైందే కావచ్చు. లేకపోతే, అలరాజు రాక తెలియకుండా అతనికి చెర్లగుడిపాడులో విడిది నెవరు ఏర్పాటు చేస్తారు?

వల్ల : మరొక్కవిశేషం మహారాజా!

నల : ఏమిటది?

వల్ల : కంభంపాడు నుండి బయలుదేరిన అలరాజు రెంటాలదాటి లేడివాగు దాపుకు చేరారు. దరులుతన్ని ప్రవహిస్తున్న ఆవాగును చూసి, తన సవరాల గోడిగను అక్కడే ఆపారు. ఇంతలో బాలచంద్రుడు, తన గజ్జెలబొల్లనిపై స్వారిచేస్తూ....అపశకునపక్షిలా అక్కడికి చేరాడు. ఇద్దరూ నవ్వులాటగా .... వా హ నా ల తో వాగును దూకించటానికి పంతమాడారు. వారివేకాక, వారివారి వాహనాలకున్న ఆభరణాలతోసహా, నిలుపుదోపిడిగా పందెమొడ్డుకున్నారు. అదృష్టం కలిసిరాక అలరాజుగారోడిపోయ్యారు. తన నగలన్నీ ఒలిచి బాలచంద్రునికిచ్చారు. కానీ, అదేదో మాటవరుసకు జరిగిందంటూ....భూషణాల్లోని తులసిపేరును మెలుకువగా పక్కకు తప్పించి వెనుదిరిగిపోయ్యాడు బాలచంద్రుడు.

నల : ఇదేదో కుట్రలావుంది! అమూల్యమైన ఆభరణాలను వదలిపెట్టి, ఒక్క తులసిదామాన్నే చేపట్టటంలో ఆ బాలుని అంతర్యమేమిటి?

వల్ల : అదే చెప్పబోతున్నాను మహారాజా! అలరాజుగారి తలిదండ్రులు అలరాజుగారిని రాయబారమంపటానికి మొదట్లో తిరస్కరించారు. వారి అనుమానం పోగొట్టటానికి "శత్రువిజయసాధకమని" చెప్పి ఒక తులసిసూలను అలరాజుగారి మెళ్ళోవేసి, అతికష్టంమీద ఆ తలిదండ్రులను ఒప్పించి పంపాడు, బ్రహ్మనాయుడు. దాన్ని చమత్కారంగా తప్పించి తీసుకెళ్ళాడు, బా ల చ ం ద్రు డు. ఆసమయంలో కన్నమదాసుకూడా అక్కడలేడు. కాబట్టి కన్నమదాసు రాత్రికిరాత్రే చెర్లగుడిపాడు చేరాడనటంలో ఎట్టిసందేహమూ లేదు. పైగా ఇదంతా బ్రహ్మనాయని ఆదేశాలమేరకే జరిగిందనేది సత్యం. సెలవు. (వెళ్ళాడు.)

నల : హుం.... నమ్మించిచేసిన దుర్నయమన్న మాట, యిది! భార్యకు దూరమై, సకలసౌఖ్యాలనూ త్యజించుకుని, మలిదేవాదుల్నే ఉపచరిస్తూ ఉంటున్న ఉదాత్తగుణసంపన్నుడూ, మహత్తర త్యాగశీలియైన, అలరాజు మనుగడకూడా నీకు భారమైందా బ్రహ్మనా! అభిమానధనుడైన అలరాజును రాయబారమంపిస్తూ, దారిమధ్యలోనే పరాభవదైన్యానికి గురిచేశావా! ఛీ! నీ బ్రతుకెంత నీచాతినీచం? నీ క్షుద్ర రాజకీయ మనుగడకోసం, యింతటి అకృత్యానికి పాల్పడుతావా! ఇక ప్రాణహానికిమాత్రం తలపడవనే నమ్మకమేమిటి?

మల్ల : (హడావిడిగా వచ్చాడు.) మహారాజా! చెర్లగుడిపాడులో అలరాజు గారికి విడిదియేర్పాట్లు చేశారేగాని, ఒక్క కొమ్మజియ్యరు తప్ప, స్వాగతం పలకటానికి తంబళ్ళవారెవ్వరూ లేరక్కడ! వారంతా వీరతాయెత్తులు కట్టుకుని, వీరపాణంచేసి....పలనాటి భవాని వర్ధిల్లాలి. స్మరహరుని ఫాలనేత్రం విచ్చుకోవాలి. అంటూ.... రాత్రికి రాత్రే మన గురజాల కామేశ్వరాలయానికి చేరారు. ఇదంతా నాగమ్మగారి రక్షణకోసమో, కాక మరేమిటో అర్థం కావటంలేదు.

నల : నాగమ్మ భద్రతవిషయంలో మనకేలోటూలేదు. ఇక అలరాజు విషయమే ఆలోచించాలి. సరే! మీరుమాత్రం రహస్య సేకరణ తీవ్రతరం చేయండి. (వెళ్ళాడు.)

(తెరవాలును)

# పల్నాటి వీరులు

## నాల్గవ రంగం

[మేడపిలోని కొమ్మరాజు భవనంలో విడిదిగది. దానిలో కొమ్మరాజు.]

కొమ్మ : (నిరుత్సాహంతో) ఈనాడు నామనసెందుకో నిరాశానిస్పృహలతో నీరసించి పోతుంది! నాకు తెలియకుండానే నా శరీరం తడబడు తూంది! మస్తిష్కంలో మసలాడే మమకారానికీ, ఎదలో కదలాడే వేదనకూ పొత్తు కుదరటంలేదు. మనస్సాక్షి మధితమై మతిభ్రమ నాపాదిస్తుంది! వార్ధక్యలోపమా! లేక ఆలోచనా వ్యాపకమా! (ఏవో వికలశబ్దాలు వినిపించాయి.) ఆఁ ఏమది! ఏమా వికార ధ్వనులు! పట్టపగలు నక్కల వికల్ప విలాపాలా! కుక్కల వికట రోదనలా! అబ్బా! ఏమిటీకోకిలకూత, అంత కటువుగా వుంది! (తుళ్ళిపడి) ఆఁ... అదేమిటి! ఓఁ... గుడ్లగూబ! మగులుగోడపై మిడిగుడ్లతో మిటారించి చూస్తుంది! అబ్బా! ఏమావికారస్వరూపం' ఎంత భయంకరంగా వుంది! (తెరలు తెరలుగా శ్వాసపీల్చాడు.) ఈనాడెందుకో అన్నీ అశుభసూచనలే! అపశకున లక్షణాలే! ఏమిటీ వింత! రాయబారిగా వెళ్ళిన అలరాజుకు, ఏ ఆపదా రాలేదుకదా!!

బ్రిహ్మ : (వస్తూ) కొమ్మరాజా! రాయబారిగా వెళ్ళిన అలరాజు, ఈనాడు కూడా రాలేదు. కారణమేమిటో! మామగారి మన్ననకు పాత్రుడైన అలరాజుకు, మరలి రావటంలో జాప్యం జరిగిందేమోనని నా అనుమానం!

కొమ్మ : బ్రహ్మనా! అలరాజు కార్యదీక్ష మన మెరుగనిదికాదు. మన్న నలకూ, మమకారాలకూ లోనై చేపట్టిన కార్యాన్ని చూపెట్టక అలసభావం వహిస్తాడంటారా!

బ్రహ్మ : నేనూ అదేయోచిస్తున్నాను కొమ్మరాజా! కానీ, అలరాజు రాక పోయినా, బాసటగా వంపిన కన్నమదాసైనా రావాలిగా! కార్యం సానుకూలమవటంవల్లనే కాలయాపన జరిగిందేమో!

కొమ్మ : కార్యం సానుకూలమైతే, ఇకమనకు కావలసిందేమిటి? కులపగలు అంతరించి పలనాడంతా విలసితశోభతో కళకళలాడిపోదూ!

బ్రహ్మ : అంతటిఅదృష్టాన్ని కలుగజేస్తాడనేగా, అలరాజును రాయబారిగా పంపింది.

కన్న : (ఆతురతగా వచ్చాడు.) వంకిదేవరాజా! కొమ్మరాజా! అపరాధిని నేనే! నేనే అపరాధిని! ఆత్మార్పణ చేసుకోలేక, మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. (ఒరనుండి ఖడ్గాన్ని లాగాడు.) ఇదిగో నాభైరవ ఖడ్గం! ఆత్మీయుణ్ణి ఆపదలో ఆదుకోలేని అధముడయ్యాడీ కన్నమదాసు. ఒక్క దెబ్బతో నాశిరస్సు ఖండించి.... మీ ఆత్మను శాంతింపజేసుకోండి. ఊఁ.... కానివ్వండి, కొ మ్మ భూ పా లా (కత్తినిస్తూ తలవంచాడు.)

కొమ్మ : ఏమిటి నాయనాయిది? ఎందుకొచ్చిందీఆవేశం?

కన్న : ఆవేశంకాదు కొమ్మభూపతీ! ఆత్మాపచారం! అ స మ ర్థు ని ఆక్రందన! ఏమని చెప్పేది? మీ పెద్దల ఆజ్ఞను జవదాటలేక, అనుమతిపొందే వ్యవధిలేక ఆగిపొయ్యానేగాని, అశక్తుడనై కాదు. అదే లేకపోతే; ఇదే భైరవఖడ్గంతో ప్రళయాగ్ని రుద్రునిలా విక్రమించి, వైరిచయాన్ని మారి మసగేవాణ్ణి. శాత్రవ హరిణ సమూహంలో చిరుతపులిలా జొరబడి అన్యాయానికి అవసాన దశను పూర్తి చేసేవాణ్ణి. కాని, యేంలాభం? కాలరాక్షసి కరాళనృత్యం చేసింది. పమునుకక్కే ఈకరవాలం....ఒరలోనే నిదురించింది.

బ్రహ్మ : అంత పనెందుకు కన్నమా! రాయబారం విఫలమైతే, రద్దిచేయకుండా రమ్మనే చెప్పాంగా! ఇంతకూ రాయబారమేమైంది?

కన్న : (కత్తిని ఒరలో దోపాడు.) రాయబారం రట్టడితో మొదలై రగడను పెంచుకుంది. చివరకు రాయబారి ప్రాణాలకే రక్షణ లేకుండా పోయింది.

కొమ్మ : అంటే!!

కన్న : పలనాటి వీరుల్లో అగ్రగామి అలరాజు....పరమపదం చేరాడు.

కొమ్మ : ఆఁ....ఏమిటీ! నా అలరాజు మరణించాడా! తండ్రీ! భువనైకశూరా! అస్తమించావా నాయనా! ఒక్కగా నొక్క బిడ్డడివని, పెంపెక్కిన ప్రేమతో పెంచుకున్న మాకుదక్కకుండా మా మానస గోళాల్లో అగ్ని గుండాల్ని పేల్చి, అమరపురి చేరావా, అలరాజా! కల్యాణ కలచూరి వంశానికి తలమానికమవై, శౌర్యలక్ష్మిని చేపట్టిన శూరశిఖామణివై, ధర్మాధర్మాల నాపోశన పట్టావు. ధరాధినేతల నెందరినో పట్టి గరిపించావు. అట్టి నీకు అకాల మరణమా కుమారా! తెరవేట సమరంలో డెబ్బై ఏడుగురు మహీపతుల్ని నీ వొక్కడవే తునుమాడావు. ఒక్క హోదాటి కదనంలోనేమదించిన రాజుల నందరినీ మట్టుపెట్టావే....ఆ పరాక్రమ సంపదనంతా ఎక్కడదాచావు తండ్రీ! (దుఃఖంతో ఆసనంపై వాలిపొయ్యాడు.)

బ్రహ్మ : హుఁ....దాయాద ద్వేషఁ; అల్లుని మరణానికి దారితీసిందన్న మాట! ఇంతకూ అక్కడ జరిందేమిటి కన్నమా!

కన్న : రాయబారం విఫలం కావటంతో....గురిజాలలో విడిది చెయ్యటం తగదని, వెంటనే బయలుదేరి చెర్లగుడిపాడు చేరాం. పూల బుట్టతో తంబళ్ళ కొమ్మజియ్యరెదురయ్యాడు. వినయభావంతో అలరాజును విశేషంగా కీర్తించాడు. దేవతార్చనకంటూ తీసుకు పోతున్న పూలలో ఒక పూలగుత్తిని అలరాజుకిచ్చి వెళ్ళిపొయ్యాడు. వలదని వారించినా వినక, వాసనపీల్చిన అలరాజుకు, మత్తు ప్రకోపించింది. గుర్రంమీదనే వాలిపొయ్యాడు. వణకిపోతున్న అలరాజును ఒక తంగెడుచెట్టు నీడకు చేర్చి; గురిజాలవెళ్ళి పేరమ దేవిని తీసుకొచ్చాను. ఆమెను కండ్లారా చూశాడు. తనకున్న బిరుదులన్నీ, తన కూరిమిసెచ్చెలికాడైన బాలచంద్రుని కివ్వమని చెప్పి....కన్ను మూశాడు.

బ్రహ్మ : (కళ్ళలో ఆవేశంపొంగింది.) కన్నమా! అర్థమైంది! ఇకచెప్పకు! ఆ తంబళ్ళ కొమ్మజియ్యరంటే ఎవ్వడో, వానిపూర్వచరిత్ర ఏమిటో నాకు బాగాతెలుసు. వాడు పేరుకు శివబ్రాహ్మణుడేకాని, పరమ కిరాతకుడు! మండాదిలో మందపోటుల అనంతశర్మ, గురిజాలను

AC No 44.1091

కుంతంతో పొడవాలని నే నొక్కణ్ణే వెళ్ళాను. నా జాడ తెలుసుకున్న ఆ జియ్యడు, అనువుగాచి నన్నే హతమార్చాలను కున్నాడు. ఆ మిషతోనే అర్ధరాత్రి కామేశ్వరాలయానికి వచ్చాడు. కానీ, నన్ను చూడగనే భయమావహించిందేమో, అశక్తుడై గడగడా వణకి పొయ్యాడు. విధిలేక చివరకు నా ఆజ్ఞనే పాటించాడు. అంతటి దుర్మార్గుడా తంబళ్ళపెద్దు. వాడికి నేనూ, నావర్గమూ అంటేచాలు..విద్వేషంతో విషం క్రక్కే కాల సర్పంలా కాటువేయాలని నిరంతరం తలపోస్తూ ఉంటాడు. దానికి కారణం....వాడికున్న ధనదాహమే! ఇంతకూ ఆ ఘోర రాక్షసుణ్ణి పరిమార్చక ఊరకనే వచ్చావా!

కన్న : లేదు. ఆ తంబళ్ళపెద్దు కంఠాన్ని తెగనరికి, వాని కండలు కరకరా కోసి కాకులకు వెదచల్లుదామనే తలంపుతో ఆప్రదేశమంతా గాలించాను. చివరకు ఊరికి ఉత్తరాన చింతల తోపులో శవమై కనిపించాడు. చేసేదిలేక వెనుదిరిగి వచ్చాను.

బ్రహ్మ : ఇంతకూ అసలు అలరాజు మరణానికి మూలాధారమేమిటో గ్రహించావా!

కన్న : గ్రహించాను. నాయకురాలి ప్రోద్బలంతో నరసింగరాజే ఆ విషపూరిత పుష్పాలను కొమ్మజియ్యడుకిచ్చి పంపించాడని రూఢిగా తెలిసింది.

బ్రహ్మ : ఊఁ....అయితే, ఈ మరణోదంతానికి వెనుక నాయకురాలి కుట్రతోపాటు; నరసింగరాజు హస్తంకూడా ఉందన్నమాట! హుఁ....నరసింగరాజా! అల్లుని హతమార్చి రాజ్యాన్ని చేపట్ట దలచావా, దుర్మార్గుడా!

కొమ్మ : (ఉగ్రుడై లేచాడు.) ఏమిటీ! అలరాజు మరణానికి నరసింగరాజు కారకుడా! ఓరీ! నరసింగరాజా! నీ రాజ్యకాంక్షానలం బంధుత్వాన్నే భస్మీపటలం చేసిందిరా! రాక్షసా! పలనాటి పూజ్య ధరాతల సింహపీఠమధిష్ఠింప, అలరాజే వారసుడని గ్రహించి, దాన్ని తప్పించడానికే ఈ కుట్రచేశావా నీచుడా! ఎక్కటి పోరులో

ఎదుర్కొనటానికి చేతగాక, వాని దండి భుజాదండ మండిత సూర్యబేతాళ ప్రచండలాగ్ర మండలాఖండ తేజఃప్రచండ దోర్దండ దండనలకు పిండికాగలవని తెలిసి; ఈర్ష్యాసూయ ద్వేషా సమ్మిళిత విషజ్వాలా ప్రజ్వల సముజ్జ్విత మత్సర హృదయుడవై వాత్సల్యహీనుడవై విషప్రాల నాయాబ్రహ్మింప జేసి, హతమారుస్తావా ఛండాలుడా! ఈ విధంగా నాయకురాలి అండతో వారసత్వానికి అడ్డుకట్టవేసి రాజ్యాన్ని చేపట్ట ప్రయత్నిస్తున్నావా! ఎంత జాతి ద్రోహివిరా నీవు! ఇక రాబోవు రణరంగంలో వల్లకాటి రాజ్య మేలుదువుగాని, తొందరపడకురా తుచ్ఛుడా!

బ్రహ్మ : శాంతించు కొమ్మరాజా! దీనితో కుట్రఎవరిదో తేలిపోయింది. ఇకముందు మనకర్తవ్యమేమిటో ఆలోచించాలిగదా! కన్నమా! అలరాజు నెక్కడికిచేర్చావు?

కన్న : పల్లకిలో భద్రపరచి, రతనాల పేరమదేవితోసహా మాటుకులచేర్చి అక్కడే దిగవిడిచాను. ఆమె ఆనతిమేరకే మీకు తెలియపరచటానికి వచ్చాను.

బ్రహ్మ : సరే! వెంటనే వెళ్ళి, రాజలాంఛనాలతో, రాచమర్యాదలతో రథారోహణ చేయించి, దుందుభిధ్వానంతో, రుంజలూ రుద్రవీణల నాదాలతో రాచరావులకడనున్న రుద్రభూమికి చేర్చు. అంత్య క్రియలకు అన్ని యేర్పాట్లూ చేయించు.

కన్న : అలాగే తండ్రీ! (వెళ్ళాడు.)

బ్రహ్మ : క్షమించు కొమ్మరాజా! మీరు వద్దన్నా; పట్టుదలతో మిమ్మల్ని ఒప్పించి, అలరాజును పంపటం నాదేపొరపాటు. ఈవిధంగానే మాచర్లచే రావీరపడాలునూ, కోడిపోరులో గోవన్నను, మంద పోటులో లంకన్ననూ....చేజేతులా జారవిడుచుకున్నాం. ఇలా ఒక్కొక్క మహావీరుడు, ఒక్కొక్క సందర్భంలో, ఆ నాయకురాలి దుర్నయాలకే బలిపశువులై పోయ్యారు. ఇక మనం శాంతించినా, మన వీరకిశోరాలనాపటం అసాధ్యం. మెస్న రాయబార మంపునాడే....సమరంతోనే రాజ్యాన్ని సాధించాలని పట్టుబట్టిన

మన వీరయోధుల్ని ఇక ఇప్పుడాపలేం. వారిలో సహనం చచ్చింది. ఉద్రేకం హెచ్చింది. కనుక యుద్ధమే కర్తవ్యం. ఇదేవిషయాన్ని మలిదేవ భూపతిగారితో మనవిచేసివస్తా. (వెళ్ళాడు.)

కొమ్మ : ప్రభూ! శంకరా! పితృసేవలో బ్రతుకును పునీతం చేసుకున్న కరుణాసముద్రుడు నా అలరాజు. రాజకీయాలలో హృదయమున్న వారికి తావులేదనే నిజాన్ని నిరూపించటానికే, నాకుమారుని నీసన్నిధికి చేర్చుకున్నావా, కైలాసనాథా! నిర్భాగ్య జీవినై నిరంతర వేదనతో నివ్వటిల్లు ఈదరిద్ర నిరర్థజీవికి భవితవ్యమేమిటి పరమేశ్వరా!

చ॥ విడువక రేయియుంబవలు వేడుకతో మము జూచుచున్న నా
కొడుకు గతించె, వానికయి కోడలుకూడ సతీత్వబుద్ధితో
విడుచును ప్రాణమగ్గివడి–వియ్యమునందిన వేళయెట్టిదో
తుడుచుకపోయె నాబ్రతుకు దుష్టులొనర్చిన క్రూరచేష్టకున్.

బాలచం : (దూసుకువచ్చాడు.) వంకిదేవరాజా ! కొమ్మరాజా విన్నారా! యీ ఘోరకలి! అలరాజు, నిహతుడయ్యాడట! ఆ రాక్షసకృత్యానికి నరసింగరాజే కారకుడట! దానికంతకూ ఆ మాయలమారి నాగమ్మ ప్రోద్బలమట! రాజ్యలోభంతో మానవతా విలువల్ని సమాధిచేసి, ఎదురునిల్చి పోరే దమ్ములేక దొంగదెబ్బ తీశాడా కులఘాతుకుడు, నరసింగరాజు! ఏమిటీదారుణం? ఎన్నాళ్ళు సాగనివ్వాలీ హత్యల్ని? ఎంతకాలమని సహించాలీమత్సర్యల్ని?

కొమ్మ : నిజమే బాలచంద్రా! కలచూరి వంశమాణిక్యం కాంతిహీనమైంది. నా బ్రతుకు బడబానలంలో పడిపోయింది! పలనాటి వేగుచుక్క హస్తమించింది.

బాల : ఆత్మీయులంతరించి, అల్లుని హత్యచేయించి, ఆత్మ వంచన చేసుకున్న ఆ కుంచితుల నంతమొందించకపోతే....మన పరాక్రమానికి పరువేమిటి? మానవత్వాన్ని మసిచేసి కూతురు తాళితెంపి ఆమె పసుపుకుంకుమను చేతులారా చెరపి, మమతనే మట్టుబెట్టిన

ఆ రాక్షసుల అంతం చూడకపోతే, మన వీరత్వానికి విలువేమిటి? అనుజ్ఞ యివ్వండి. ఆ కిరాతకుల హతమార్చి, వారి కళేబరాలపై భైరవ నృత్యంచేసి....గురిజాలనే భీభత్సం చేసివస్తా.

కొమ్మ : నాయనా బాలచంద్రా! శాంతికి పట్టాభిషేకమని సంధికంపాం మనం. కాంతికి కాటుకపూసి కాటికి పంపారు, వారు. వృద్ధజీవిని నేనేంచెప్పగలను?

బాల : అంతేనా కొమ్మరాజా! దీనికి ప్రతీకారమే లేదా! ఈకఠోరవార్త వింటేనే ఒడలు జలదరించి, గుండెలు జ్వలించి, కండలు మండిపోయి, రోమరోమమూ పౌరుషంతో ప్రకోపించి ప్రకంపించిపోతుందే! ఇట్టి తరుణంలో కన్నకుమారుని దారుణ మరణానికి ప్రతిక్రియగా మమ్మల్ని కత్తిబట్టమనే శక్తినికూడా కోల్పోయారా కొమ్మరాజా!

కొమ్మ : బాలచంద్రా! నాలో చైతన్యవాణి మూగవోయింది నాయనా! ఇప్పుడు నేనేమీ చెప్పలేను. అంతా దుర్విధి!

బాల : హుం.... విధి! ఏదివిధి? రాయబారమంపడమా! లేక వారు నీచులై విషమిచ్చి అలరాజును చంపటమా! ఏదిమామా విధి? ఇలాగే మీపెద్దలంతా విధిని స్మరిస్తూ, కర్తవ్యాన్ని కడకునెట్టి, కాగల పరిణామాలు, మనకు మరణాలేగా! సకల లౌకిక పరిజ్ఞాన రాజనీతిజ్ఞుండవు! సర్వ ధర్మాలనూ ఆపోశనపట్టిన మహామేధావివి! మాబోటి వీరకిశోరాలకు మీరు చెప్పవలసిన మాటలేనా యివి! ఒక్క ఆడదాని అగడాలకు; వీరులమైకూడా బీరువుల్లా శిరసులు వంచవలసిందేనా! వారుచేసే దురాగతాలకు, ఇలా ఎంతమంది పరాక్రమ శూరుల్ని బలియిచ్చుకుంటూ పోవాలి!

కొమ్మ : ఈవిషయంలో నేను నిమిత్తమాత్రుడ్ని బాలచంద్రా! సర్వాన్నీ సాధించటానికి, మనం బ్రహ్మనాయనను మార్గదర్శకంగా ఎన్నుకున్నాం. కనుక ఆయన ఆనతినే అందరమూ పాటిద్దాం.

బాల : మామా! ఒకరివిషయం నాకనవసరం, అలరాజును రాయబార మంపుతూ, ఆయనకు మారుగా, నా తండ్రి మీకు యిల్లడపెట్టాడు. కాబట్టి మీకువచ్చిన విపత్తును నేనేభరించాలి. కనుక నాశరీరంలోని ప్రతి రక్తబిందువునూ మీకునీరాజనంగా సమర్పించుకుంటున్నాను. చింబోతు గాంభీర్యంతో చిందులువేస్తూ, స్వజన సంహారానికి కారకుడైన ఆ నరసింగరాజు తలనరికి మీకునైవేద్యంగా నివేదించి నాశక్తిని నిరూపించుకుంటానని....యిప్పుడే వీర ప్రమాణం చేస్తున్నా! ఇక విచారాన్ని విడనాడి....మనశ్శాంతిని నింపుకో.

బ్రహ్మ : (వచ్చాడు.) ఓహో! పల్నాటి లేగదూడ....తల్లిని విడిచిందేమో, రాజభవనాల్లోచేరి రంకెవేస్తున్నట్లుంది! ఆం....కల్యాణ భూపతీ, కొమ్మరాజా! మలిదేవరాజుగారితో అన్నివిషయాలూ చర్చించాను. అలరాజు మరణం ఆయన గుండెల్లో అగ్నిజ్వాలల్ని రేపింది. పెల్లుబికిన దుఃఖంతో కుప్పగూలిపోయారు. ఉపచారాలతో ఉపశమించి, వీరయోధుల నందరినీ యుద్ధానికి సన్నద్ధుల చేయమన్నారు. కారెంపూడి నాగులేటి ఒడ్డున కదనభూమిగా నిర్ణయించమన్నారు. వచ్చే తొలి ఏకాదశినాడే .... యుద్ధాన్ని ప్రారంభించాలన్నారు. జరిగిన దారుణ సంఘటనకు మిమ్మల్ని క్షమాపణకోరి పరామర్శించటానికి ఇక్కడికే వస్తున్నారు.

బాలచంద్రా! ఈమేడపి కోట రక్షణబాధ్యత అంతా నీదీ .... నీ సంగడీలదే! మలిదేవరాజుగారి కుమారుడు బిరుదురాజుకు పట్టం కట్టి. నిన్ను మంత్రిగా నియమిస్తున్నాం. కరణం కార్యాన్ని అనపోతు చూస్తాడు. కాబట్టి బాల్యచాపల్యాన్ని వీడి, అంతఃపుర రక్షణ అతిజాగ్రత్తగా నిర్వహించండి.

కొమ్మరాజా! మలిదేవ రాజుగారితో కలిసి అలరాజు అంత్య క్రియలకు విచ్చేయండి. పద! బాలచంద్రా! (బ్రహ్మనాయుడూ, బాలచంద్రుడూ బయటికెళ్ళారు. కొమ్మరాజు లోపలికెళ్ళాడు.)

(తెరవాలును)

# పల్నాటి వీరులు

## ఐదవ రంగం

[గురిజాల రాజభవనంలో విడిదిమందిరం, అందులో నరసింగరాజు]

నర : ఏమీ విచిత్రపరిణామం! ఎంత మనోవేదనకు గురిచేస్తుందీ అపనింద. గురిజాలను దిగ్బంధంచేసి, పలనాటిని పంచుకున్ననాడుకానీ, మందపోటులో కొందలపడి స్పందించిననాడుకానీ, కోడిపోరులో అన్యాయం జరిగిందని ఆక్రోశించిననాడుకానీ, నాయకురాలు నాగమ్మనే ద్వేషిస్తూ దూషిస్తూ వచ్చిన ఆ బ్రహ్మనాయుడు, ఏఒక్క సంఘటనలోనూ నాది తప్పాఅని, నన్ను వేలెత్తి చూపలేక పొయ్యాడు. కాని, ఈనాడు నామీదనే నిందమోపాడు. ఈవిధంగా పలనాటిని కైవసం చేసుకోవాలనే కూటచేష్టతో మా రాజవంశ నిర్మూలనానికి కంకణం కట్టుకున్నట్లుంది. తానుచేసే ఈ మహా యాగానికి మొదటిబలిగా అలరాజును అతి చాకచక్యంతో అంత మొందించాడు. ఆ నేరాన్ని నాపై మోపి, రెండవ యజ్ఞపశువుగా నన్ను చేపట్టాలని అల్లికలల్లుతున్నాడు. చివరకీనాటకం నాతోనే అంతమౌతుందో, లేక పలనాడంతా నెత్తిటిలో దోగిపోవాలో తేలిపోవాలి.

ప్రభూ! పరమేశ్వరా! సామ్రాజ్యదాహంతో, హృదయధర్మాన్ని కూడా నిరసించి, వారసులమైన మా వంశకర్తలను నిర్జించటమే ఆ బ్రహ్మనాయని రాజకీయమా! పైగా నిరపరాధినైన నాపై నిందమోపటమా! శంకరా! రాజ్యకాంక్షతో విచక్షణ కోల్పోయిన విషజీవియనీ, అల్లునిచంపిన అపరాధియనీ పలనాటి చరిత్రలో నాపేరు చిత్రింపబడవలసిందేనా! దేవదేవా!

చ॥ ఇల పలనాటి గద్దెపయి నెక్కెడి కోర్కె జనించియున్న చో  
కులగిరివంటి అగ్రజుని కూల్చిన, నాకిట అడ్డమున్నదే!  
సులువుగపొందు నీక్రియను చూడక, ముందిక నెప్పుడో  
అలరెడి రాజ్యలబ్ధికయి అల్లునిచంపు కసాయినందువా!

ఈనాటివరకు విధినిర్వహణ బాధ్యతతప్ప రాజ్యవ్యవహారాలలో ఏనాడూ తలదూర్చని ఈ నరసింగరాజు బ్రతుకును ఎంతజటిలం చేశావయ్యా, ధూర్జటీ? నా జీవననాటకానికి యిదే చరమాంకమా త్రిపురాంతకా! భావితరాలు నన్ను శ పిం చ టా ని కే జరిపిన ఈకుట్రలోని అంతరితాన్ని బయుటపెట్టి; నాబాధ నివారించి, నన్ను నిష్కళంకునిగా నిరూపించగలవని ముకుళిత హస్తాలతో వేడు కుంటున్నాను, మహేశ్వరా! ఇవే నానమస్కృతులు. (తేరుకుని వెళ్ళబొయ్యాడు. రెండడుగులు వేయగనే చిత్తభ్రమ కలిగిందేమో ఆగి....ముందువైపు తీక్షణంగా చూశాడు.)

ఆఁ.... ఎవరాస్త్రీమూర్తి! విచార వదనంతో, విషణ్ణహృదయంతో, విశీర్ణకుంతలాలతో, రక్తాశ్రువులు రాలుస్తూ నావైపే తీక్షణంగా చూస్తుంది! ఆఁ....ఆఁ....పేరమ్మా! (ఒక్కపెట్టున కుప్పగూలి పొయ్యాడు. తేరుకుని మెల్లగాలేస్తూ) నీవాతల్లీ! సుగుణాల కల్పవల్లివే! నీవుకూడా నీపినతండ్రిని శంకిస్తున్నావా పేరమ్మా! పేరుకు నలగామని పుత్రికవేగాని, పెంచింది నేనేవమ్మా....నేను పెంచిన మమకారాన్ని తుంచివేసుకునే తుచ్ఛుడుకాడమ్మా ఈ నరసింగరాజు. హైహయవంశ సామ్రాజ్యానికి ఆనవాలుగా నిలిచి, మాన్యమానినీ శిరోమణివై, మహిత మహిళాలోక శిఖామణివై, భావివలనాటికి పట్టపురాణివై వెలుగొందగలవనీ, మాఅన్నదమ్ము లిద్దరికీ ఆదర్శవనితవై పుత్రులులేనికొరత తీర్చగలవనీ ఆశించాను. కానీ, అపవాదాల్ని నమ్మి; నీ పినతండ్రిపై కినుక వహిస్తావని ఏనాడూ ఊహించలేదమ్మా! మలిదేవులు వలసవెళ్ళిన నాటినుండి నీవొకవంక....నీభర్త మరోవంక నిలిచిపోవటానికి కారకులెవరో గ్రహిస్తే....నాపై నీకు కోపమే రాదమ్మా!

మమతానురాగాలు నింపుకుని మల్లెతీవలా నిన్ను పెంచుకున్నాను. అట్టి నీభావి భాగ్యోదయానికి నిర్దేతమైన నీభర్త అలరాజుపై నాకు వ్యక్తిగత ద్వేషమేమిటమ్మా! అయినా, అలరాజుదాకా

ఎందుకు? దగ్గరున్న నాఅన్ననే హతమార్చి సింహాసనాన్నాక్రమిస్తే...ఇక్కడ నన్నడ్డుకునేవారెవరు? ఇకనైనా నాఅసలువిషయాన్ని అవగతం చేసుకుని నన్ను మన్నించు తల్లీ!

ఆఁ....ఏమిటిది? ఇంకాఎందుకు నాకీఆవేదన? పేరిమితో పెంచుకున్న పేరమ్మ, పతితోపాటు చితినెక్కి పరమపదం చేరింది. ఇక మిగిలిందీ, ఈగుండెలో రగిలిందీ, ప్రతికందరంలోనూ ప్రేలిందీ ఒకేఒక లక్ష్యం. అదే.... అదే....వైరి నిర్మూలన కార్యక్రమం. కూటనీతితో నాటకమాడుతూ, అయినవారిమధ్య అంతరాలుసృష్టించి ఆధిపత్యంకోసం ఆరాటపడుతున్న....ఆ నీచుల్ని ఈచేతులతోనే పాతరవేసి....భూస్థాపితంచేస్తా! ఇదే..నా ప్రతిఘటన! విధియేమైనా చేయగలను కానీ, కూతురు తాళితెంపినాదనే అసత్య ప్రచారాన్ని అడ్డుకోలేక పోతున్నాను. ఇది.... నా గ్రహచారమేమో! ఏం చెయ్యాలి? ఈబాధ నెలా బాపుకోవాలి?

నాయ : (వస్తూ) నరసింగరాజా! ఏమిటీఆలోచన? వే ర మ దే వి సహగమనం చేసిందనేనా!

ఉ॥ పోయినవారికోసమయి పొల్లుదనమ్మున నీరసించి వా
పోయిన లాభమేమిటి? అపూర్వములాయివి యుద్ధభూమినిన్
బాయక హెచ్చరించు పరిపంథి సమూహమడంచు సాధనో
పాయము నిర్వహించి గుణపాఠము నేర్పుము లాతివారికిన్.

నర : పెంచినప్రేమకదా, నాగమ్మా! ఒక్కసారిగా తెంచుకోలేక; కన్నుల్లో మెదిలే గారాబాన్ని కడకు నెట్టివేయలేకనే ఈవిచారం. పైగా నా మానసగోళంలో నిప్పులకుంపటిలా రాజుకుంటూ..అంతర్జ్వలితమై గగ్గోలుపరిచే అపనిందను ఎలా బాపుకోవాలో అర్థమే కావటంలేదు.

నాయ : ఇలాగే విచారిస్తూ మెత్తమెత్తగా మనం కూర్చుంటే; మన విరోధివర్గం తన బిగువును అడిచూసుకుంటూనే పోతుంది. సమరం సాగించాలని నిన్నటిరాత్రికే కారెమపూడిచేరి, అరిబలగమంతా కత్తులు నూరుతుందని, యింతకుముందే రాయబారిగా వచ్చిన వీరరాఘవభట్టు చెప్పింది విన్నావుగా నరసింగరాజా!

నర : విన్నాను. కానీ, అరిసేన ఆర్భాటంచేసే సమరానికి నితాకుపడే విరక్తుడుకాడీనరసింగరాజు. వీడు క్షాత్రిగుణసంపన్నుడు. ఆ పిరికి మెరాలపాలిటి పోతరించిన సమరకేసరివీడు. కానీ, ఒంటరివాణ్ణిచేసి బంధుత్వాన్నికూడా పరిగణించక, రాజ్యలోభంతో అల్లుని చంపినాడనే అపకీర్తికే కుమిలిపోతున్నాను. పైగా ఈ అపవాదు విషయంలో అన్నగారి ఆంతర్యమేమిటో అవగాహమే కాలేదు . అదేనాబాధ.

నాయ : అన్నాగారికన్నీతెలుసు. గతాన్నీ వర్తమానాన్నీ గుర్తెరిగిన మహామేధావి ఆయన. ఎవరో ఏదో కుట్రతో వాగారని దోష రహితుడైన తమ్ముణ్ణి దూరంచేసుకుని, మరోతగవును తెచ్చుకునే అజ్ఞానికాదు మీఅన్నగారు. అదుగో .. వారుకూడా మాటల్లోనే వచ్చేస్తున్నారు.

నల : (వస్తూ) రణభట్టు రాఘవరాజు రాయబారం విన్నావుగా నాగమ్మా! (నరసింగరాజు నుద్దేశించి) బృందావనంలో జంటపాదసాల్లా మా అన్నదమ్ముల మిద్దరం ఇప్పటివరకూ ఒకేఆశయంతో నిలబడి పలనాటి ప్రశస్తికి పాటుపడ్డాం. కాని, యీనాడు అలరాజు మరణాన్ని ఆసరా చేసుకుని, మాలోమాకు వైషమ్యాలు కల్పించటానికి ఆ బ్రహ్మనాయడు చేసినకుట్ర ఎంత కర్కశమో చూశావా! అంతటి పాశవిక చర్యకు నాతమ్ముడు తలపడినాడంటే... నేను నమ్మనూ ...నమ్మలేను. కానీ, నాదొక సందేహం! మాఇద్దరిలో కలతలు పెంచటానికి ఆ బ్రహ్మన్నకు వేరేమార్గాలెన్నిలేవు? దీనికి అలరాజునే చంపించవలసిన పనేమిటి?

నాయ : రాజా! వారుపన్నిన ఉచ్చులోపడి మీలో మీరు కలహించు ఉంటే, అనుగురాజు సంతానమేగా అంతరించేది. ఆ తర్వాత అలరాజేకదా వారసుడు. వారసుడు బ్రతికేవుంటే, వారికి దక్కే దేమిటి? కనుక అలరాజునే ముందుగా అంతంచేసి, ఆనెపాన్ని మీతమ్మునిపై మోపితే అదినమ్మినమీరు వైషమ్యాలు పెంచుకుని పరస్పరం నిర్జించుకోవడమేగా, జరిగేది. అప్పుడేగదా తనమార్గం

నిష్కంటకమయ్యేది. ఆ పాచిక పారటానికేగా, కన్నమదాసు ద్వారా అలరాజుకు విషప్రయోగం చేయించాడు బ్రహ్మనాయడు.

నల : దుర్మార్గుడు! ఎంతటి ఘోరానికైనా వెనుకాడని పాపి.

నాయ : ఇంతకుముందు ఆ బ్రహ్మన చేసిన నేరాల్లో ఇదొక లెక్కలోనిది కాదు, నలగామరాజా! అది మీ ఊహకు కూడా అందకపోయి యుండవచ్చు. అసలు మీ తండ్రిగారిమరణానికి కారణమేమిటో మీకుతెలుసా!

నర : మాబాల్యదశలో జరిగిన మాతండ్రిగారి మరణంమాకెలాతెలుసు?

నల : రాచపుండుతోకదా నాగమ్మా, మాతండ్రిగారు మరణించింది.

నాయ : కాదు. బ్రహ్మనాయడు వేసిన కత్తిపోటు....

నల : (బిత్తరపొయ్యాడు) ఏమిటీ! కత్తిపోటుతోనా! నిజమేనంటావా నాగమ్మా! అయినా మాతండ్రిగారిని హత్యచేయవలసిన అవసరం ఆ బ్రహ్మనకేమిటీ?

నాయ : వలనాటి రాజ్యంకోసం ఒక్క మీతండ్రినేకాదు; అందుకు అడ్డు వచ్చిన తన తండ్రినికూడా హతమార్చాడు. ఆ కుట్ర ఎలాగో బయటికి పొక్కి వలనాటి ప్రజల్లో వ్యతిరేకత కనిపించింది. నిరసన వెల్లువ పెల్లుబికింది. అది ఉపద్రవంగా మారి అప్పటికప్పుడే ఏడు గడ్డివాములుకూడా దగ్ధమైపొయ్యాయి. ఆ తిరుగుబాటును గమనించిన బ్రహ్మనాయడు, ప్రజావిప్లవం రాక తప్పదని గ్రహించాడు. అందుకే మిమ్మల్ని గద్దెనెక్కించాడు. తాను మంత్రిగా నిర్ణయించుకున్నాడు.

నర : మరి, రాచకురుపు మాటేమిటి, నాగమ్మా?

నాయ : అదే చెప్పబోతున్నాను. ఆనాడు తనతండ్రి దొడ్డనాయనితో పాటు, బ్రహ్మనాయడుకూడా కొలువుకూటానికి వెళ్ళేవాడు. కాని, గర్వంతో రాజుగారికి నమస్కరించేవాడుకాదు. ఆ ప్రవర్తనకు కొలువుకూటం అభ్యంతరం చెప్పింది. తండ్రికూడా ఆచర్యను

గర్హించాడు. దానికి సమాధానంగా బ్రహ్మనాయుడు, తాను పరశురామావతారుడనీ, తానునమస్కరిస్తే రాజుగారు మరణిస్తారనీ నొక్కిచెప్పాడు. అందుకు నిదర్శనంగా రాజుగారిని సింహాసనం నుండి లేపి, పీఠానికి నమస్కరించాడు. అది పెఠిల్లున పగిలి ముక్కలై ఒకముక్క రాజుగారి వీపున గుచ్చుకుంది. ఆ గాయాన్నే రాచపుండుగా అభివర్ణించి ప్రచారం చేయించారు.

నర: ఇది నమ్మదగిన విషయమేకాదు. ఎంత అవతారపురుషుడైతే మాత్రం నమస్కరించిన మనుషులు మరణిస్తారా! సింహాసనం ముక్కలౌతుందా! అసంభవం! అదేనిజమైతే...అసలు పరశురాముడే క్షత్రియసంహారానికి గొడ్డలెందుకు పట్టాడు. ఇదంతా కట్టుకథ.

నాయ: అగు నరసింగరాజా! ఆకథ అంతటితో ఆగలేదు. ఆగాయంతో రాజుగారు మంచం పట్టారు. యమయాతన అనుభవించారు. చివరకు మరణించేముందు తాను కైలాసం వెళుతున్నట్లు గ్రహించి ఒంటరిగా పోలేక, తోడుగా మరొకరిని పంపమని, ఆ బ్రహ్మనాయననే వేడుకున్నారట. అందుకాయన కనికరించి, తనతండ్రి దొడ్డనాయనను తోడుచేసి కైలాసానికి రథారోహణ చేయించాడు. తెలిసిందా పరశురామావతారం ఎంతపని చేసిందో! రాజునూ మంత్రినీ ఒకేసారి కైలాసానికి పంపింది.

పల: ఇదిఅసలే నమ్మశక్యం కానివిషయం. ఈ ప్రపంచంలో ఏకార్యానికైనా తోడుపంపటం చూశాంకానీ, మరణానికి తోడుపంపే వితండాన్ని మనమెక్కడా చూడలేదు. పరిశీలించిచూస్తే ఇవి రెండూ హత్యలేననేది స్పష్టంగా తేలిపోయింది.

నాయ: ఏదియేమైనా, బ్రహ్మనాయుడు పరశురామావతారుడనే ప్రచారం మాత్రం ముమ్మరంగా సాగిపోతుందికదా! అంధవిశ్వాసులంతా మూఢభక్తితో....అదేనిజమని నమ్మారూ.... ఇంకా నమ్ముతూనే వున్నారు.

పల: ఊఁ....అయితే బ్రహ్మనాయుడు తానుచేసే కసాయి పనులకు అన్నిటికీ దైవత్వమనే సాకుతో తారుమారుచేసి తందనాలువలికే ఒక మూకను ముందే తయారుచేసుకుని పోషిస్తున్నాడన్నమాట.

నాయ : అవును. అయినా ఆమూక ఎవరోకాదు. తనకు పెద్దకుమారుడని చెప్పుకునే కన్నమదాసు వంశీయులే! ఆవంశంలోనే మరొకశాఖను సృష్టించి, కేవలం తనప్రచారంకోసమే నియమించాడు. ప్రస్తుతం వీరవిద్యావంతులనే పేరుతో....మాయావినోదంకలిపిస్తూ...బ్రహ్మన చేసే అక్రమాలను....మహిమలుగా వర్ణించిచెప్పేవారు వారే! ఆఁ.... మరొక్కవిశేషం మహారాణా! రాజును సంహరించటం జరిగిపోయింది కదా! ఇక పరుశురామావతార మెందుకని, తాను మంత్రికాగానే పలనాటి కృష్ణయ్యగా అవతారాన్ని మార్చాడు.

నల : ఛీ! నీచా! బ్రహ్మనా! ఎంత కుటిలమోయీ నీ బ్రతుకు! దైవత్వ మనే పేరుతో నీవుచేస్తున్న దౌష్ట్యాలు రాక్షసజాతికూడా చేయదు. ఇన్నిచేసినవాడివి, ఇక మా అలరాజును అంతమొందించలేదంటే నమ్మేదెవరు? అదీచాలక, కారెమపూడి రణభూమిలో సైన్యాన్ని మోహరించి. నాతమ్ముడు నరసింగరాజును అప్పజెప్పమని సిగ్గులేక రాఘవభట్టును రాయబారమంపావా! ఈవిధంగా మమ్మల్ని ఒకరి తర్వాత మరొకర్ని హతమార్చి, పలనాటినే ఆక్రమించుకుందా మనుకున్నావా! పాపీ!

నాయ : అలా ఆక్రమించుకున్న పలనాటి రాజ్యానికి పట్టం కట్టాలనేగా బాలచంద్రుణ్ణి యుద్ధానికి రాకుండా తప్పించి, తక్కినవారితోనే వచ్చాడు.

నర : అదేమిటి? అందులోకూడా మోసమా! అయితే తక్కినవారు ఊరుకున్నారా!

నాయ : హుఁ....భావదాస్యంతో బ్రతికే బడుగుజీవులు, ఊరుకొనక నోరుకూడా మెదవగలరా!

నల : నాగమ్మా! ఇంతకీ యుద్ధం; అలరాజు మరణించినందుకా లేక దాయభాగంకోసమా! దాయభాగమే అయితే....మరి, నరసింగ రాజును పంపమని కోరడమేమిటి?

నాయ : రెంటికీకాదు. బాలచంద్రుని పట్టాభిషేకం కోసమని ముందే చెప్పానుగా! అందుకనే అంతఃపుర రక్షణకోసమనే సాకుతో; బాల చంద్రుణ్ణి మేడపిలోనే రాచవాసానికి కాపుంచి వచ్చాడు.

నర : నాగమ్మా! ఇక సహించడానికి వీల్లేదు. ఆబాలుడు మేడపిలోనే కాదు. కొండగుహలలో దాగినా వెన్నంటి వెతికి ఖండించక మానడీ నరసింగరాజు!

వాయ : నరసింగరాజా! నీ భుజదర్పమేకదా నలగామరాజుకు వజ్రకవచం.

నర : అన్నా! గ్రహించావా; వాని అంతర్యాన్ని! నన్ను హతమార్చి, నిన్ను రాజ్యభ్రష్టునిచేసి, బాలచంద్రునికి పలనాటి పట్టం కట్టాలనే దురూహతోనే ఇపుడీ యుద్ధానికి పూనుకున్నాడు. ఇక సహిస్తే సర్వమూ నాశనమే! ఇప్పటివరకూ అపనిందలతో అలసి సొలసిన ఈ వీరకిశోరాన్ని రెక్కవేసి హెచ్చరిస్తున్నాడు. మంచు పట్టుతో రంకెలువేసే ఆ కుంకలపై చెంగలించి చెండాడే సమయం సమీపించింది. అనుజ్ఞ యివ్వండి! నాకడసారి కందరం కదిలేదాకా కదని పాండితి ప్రదర్శించి, శత్రుకళేబరాలను నాగులేటిలో దొర్లించి వస్తా!

వల : మంచిది నరసింగరాజా! ధర్మహాని ఎంతకాలం సహించగలం! సమరభూమిలో శత్రువు నిల్చొని శౌర్యం క్రక్కుతూవుంటే....జాగు చేయటం క్షత్రియలక్షణం కాదు. మానహీనుడూ, హీనచరితుడూ, జారుడూ, చోరుడూ అయిన ఆ బ్రహ్మనాయని అనుచరులు చేసే గర్జాజ్వలిత ఘనఘనార్భటులకు కాలం చెల్లిపోవాలి. కత్తిబట్టి కార్యరంగానికి వీర్యవంతుడవై బయలుదేరు. నీలో వేడినీ, నీ కరవాలపు వాడినీ ప్రదర్శించి, అరిబలగాన్ని అంతంచెయ్! వెంటనే సైన్య సమీకరణ సాగించి, రణభేరి మ్రోగించు.

చ॥ తిరిపపు భూమికోసమయి తిమ్మిరిపుట్టి రణమ్ముచేయ ని
ర్భరగతి నాగులేటికడ రంపిలుచున్న విపక్షసేనపై
కెరలి నితాంతదాంత భుజకీర్తిసముజ్జ్విత హేతిఘాత సం
గర మొనరించి యాకలుష కార్యమడంచుడు వీర్యవంతులై!

నర : అవశ్యం మహారాజా! (వెళ్ళాడు.)

నల : మహామంత్రిణీ నాగమ్మా! నాఅల్లుడూ కూతురు మరణాలతో తృప్తి చెందని ఆ బ్రహ్మన్న తానే ముందుగా కదనభూమిలో కాలుమోపి, జ్ఞాతివధకు ప్రారంభోత్సవం చేశాడు. ఇక సహించటం కల్ల. కనుక బాంధవాభిమానాన్ని పక్కకునెట్టి, కదనరంగంలో కుపితసింహంలా కుప్పించి, పొగరుబోతులై పోతరించిన, ఆ వైరివృషభాల్ని మారిమసగే సమయమాసన్నమైంది. వెంటనే యుద్ధానికి తరలి రమ్మని మన సామంతుల కధికారపత్రాలు పంపించు! సమరానికి సహాయులై రమ్మంటూ వివిధ దేశాధిపతుల కాహ్వానాలందించు.

నాయ : అలాగే మహారాజా!

నల : అమ్మా! పేరమ్మా! మీ అకాల మరణాలకు అశ్రుతర్పణలిస్తూ, బ్రహ్మనాయుడు సాగించే భండనానికి ప్రతికృతంగా ప్రతిఘటించ టానికి అంకితమౌతున్నాడమ్మా నీ తండ్రి....ఈ నలగామరాజు.... (బాధగా వెళ్ళాడు.)

నాయ : (ఆలోచింప సాగింది.) నాజీవితచక్ర మెన్నిమలుపులుతిరిగిందో యేమని యోచించాలి? పాలుగారు పసిబుగ్గల తడి ఆరకముందే.... నాతల్లి గతించింది. ఊరంతా వ్యాపించిన మహామారి ఉపద్రవానికి నిలువలేని నాతండ్రి సబ్బిమండలపు మల్యాల సంస్థానంలోని ఆరవెల్లి గ్రామం నుండి మా కుటుంబం మొత్తాన్నీ ఈ పల్నాడులోని జిట్టగామాలపాడు చేర్చి స్థిరత్వమేర్పరిచాడు. కాని, యేంలాభం? పసివయస్సులోనే పసుపు కుంకుమను కోల్పో యాను. సాము గరిడీలతోపాటు, సమస్త విద్యలూ నేర్పించి, ముద్దుగా పెంచుకున్న నా మేనమామ, మేకపోతుల వీరజగ్గారెడ్డి కూడా అనతికాలంలోనే అస్తమించాడు. అలా వియోగాలతో విరాగి నైన నాకు, నాతండ్రి నిర్మించి యిచ్చిన శివాలయాన్నే సర్వంగా భావించాను. ఆ పురహరుడిచ్చిన భస్మరాశినే ఐశ్వర్యంగా స్వీక రించాను. కాని, మరో కఠోరఘాతం నా మనోఫలకంపై సమ్మెట పోటు వేసింది. అదే....నా తండ్రిమరణం! చెరువు నిర్మాణంకోసం ప్రభుత్వమాక్రమించుకున్న పొలం...."నాది" అని అడ్డగించిన

నా తండ్రిని....పరమ సాధువును....నిరతాన్న దానపరుని....హత్య జేశారు బ్రహ్మనాయని అనుచరులు. అబలను ఒంటరిదాన్ని నేనేం చేయగలను? పురుషాధిక్యత నెలకొన్న ఈ ప్రపంచంలో నేను ఏకాకినయ్యాను.

చ॥ విడిచితి జన్మభూమి నను వీడినతల్లికి నార్తిజెందుచున్
వడి పలినాడుచేర ఎడబాసిరి భర్తయు మేనమామ! ఆ
తడవున కుందుచుండ కనతండ్రినిచంపిరి దుష్టఘాన ఈ
చెడును భరింపలేక వ్యధచెందితి జన్మ సుఖమ్ము రోసితిన్.

ఆనాడే....నా అంతర్యంలోని ఆదిశేషుడు పడగవిప్పి బుసకొట్టాడు. ప్రతిచర్యకు సిద్ధంచేసుకున్న నా పథకరచన ఫలించింది. దాని ఫలితంగానే....నలగామరాజు ఆస్థానంలో మంత్రిణిగా స్థాన మేర్పరచుకున్నాను. కుట్రతో బ్రహ్మనాయడు పన్నే అవరోధాన్ని అధిగమిస్తూ "నాయకురాలు"అనే అన్వర్థనామాన్ని సార్థకం చేసుకున్నాను. పల్నాటిలో గుళ్ళుకట్టించాను, భక్తిని పరామర్శించాను. దూపచెరువుతోపాటు కుంటలూ నిర్మించాను. ప్రజల సంక్షేమాన్ని చక్కదిద్దాను. కానీ, ఈనాడు ముందుగనే ముస్తీబై, కదన భూమిలో కాలూని, ఆడది యేంచేయగలదనే అహంకారంతో కదనానికి కత్తులునూరుతున్నాడు, బ్రహ్మనాయడు. కనుక ప్రతిచర్యగా యుద్ధాన్ని ప్రకటించటం నాకూ తప్పలేదు.

ఉ॥ ఆడది అస్వతంత్రయట! అయ్యది పూర్వము పెద్దలెప్పుడో
వాడిన శాస్త్రధర్మమని వాగెడి పూరుష దుర్వినీతి క
ల్లాడెడి ఆడజాతి వికలత్వము బాపు సదాశయమ్ముతో
వీడని పంతమూనితిని, విప్రతికారపు మూలమెన్నితిన్.

కానీ, మా ఇరువాగుల పోరులో అమాయకులెంతమంది అసువులు కోల్పోతారో....అనూహ్యమైన విషాదఘట్టమది. దేవా! నటదూర్జటీ! ఈయుద్ధాన్నెలా నడిపిస్తావో....నీవే నాకు దిక్కు.

(ధ్యానంతో వెళ్ళింది.)

(తెరవాలును)

# పల్నాటి వీరులు

## ఆరవ రంగం

[యుద్ధభూమి. కొద్దిదూరంలో సాయుధులైన యుద్ధవీరులు.]

బ్రహ్మ : (అంతా కలియజూశాడు.) ఊc....స్వపక్షయోధులతోపాటు, సహాయులై సమరానికివచ్చిన సాహసవీరులంతా సమయంకోసం నిరీక్షిస్తున్నట్లుంది.

ఆహాc.... ఏమా సమరోద్రేకం! కంచుకాలు ధరించి, కదనాపేక్షతో పొంచి, కలియనుంకించు వీరయోధుల వీరావేశం చూస్తుంటే.... పొలికలనులో నడిబొడ్డున నాటిన "భూతరాట్కంబా"నికి శాత్రవ వీరుల్ని బలిపెట్టాలనే ఉద్రేకంతో ఉద్యమింప ఆరాటపడు తున్నట్లుంది! (నవ్వుతూ) ఇక ఈపల్నాటి రాజ్య మహోజ్వల మనోహరగాథ రేపటితో మరో మలుపు తిరిగి వీరగాథగా మార బోతుందన్నమాట!

(ముందుకుసాగాడు.) వీరులారా! రే పె పో రా టం ప్రారంభం! అప్పటివరకూ ఓపికపట్టండి!....చెన్నకేశవా! ఇది కర్మభూమి! దీనికిఅవస్థ ఏనాటికైనా రాకతప్పదు. కనుక ఈసమరాన్ని నీవే సాగించి....ఈ ఆశాజీవికి విజయం చేకూర్చు తండ్రీ! (పక్కనున్న గుడారంలోపలికి వెళ్ళబొయ్యాడు.)

కన్న : (బరిసెను చేతబట్టి ఆత్రంగా వచ్చాడు.) తండ్రీ! ఆగండి! ఒక్క మాట! కొమ్మరాజుగారేంచేశారో చూశారా!

బ్రహ్మ : ఏంచేశారేం?

కన్న : ఉదయాన్నే నలగామరాజు రణభూమిలో సగర్వంగా ఎత్తించిన గుడారాన్ని చూశారేమో! ఉగ్రులైపొయ్యారు. కండ్లు చండ్ర నిప్పులయ్యాయి. మధ్యాహ్నభాస్కరునిలా మండిపడుతూ మమ్మల్నందరినీ చేరబిలిచారు. విల్లును సవరించి తన గురుపైన

బలభద్రి రఘుపతిపేరు స్మరించారు. ఒకే ఒక్క బాణాన్ని ఆకర్ణాంతం లాగి....సారించారు. కనురెప్పపాటులో ఆ బాణం.... నలగామరాజు గుడారపు కంబాన్ని తాకింది, దానితో కంబం పెళ్లున పేలిపోయింది. డేరాచీలిపోయింది. గుర్రాలూ ఏనుగులూ కట్లుతెంచుకుని చెల్లాచెదరయ్యాయి. కల్లోలమైన నలగాముని సైన్యం పరారై చింతపల్లి చేరింది.

బ్రహ్మ : కొమ్మరాజంటే ఎవరనుకున్నావు కుమారా! సమరగాంగేయుడు. ఆయన దోశ్శక్తి అపారం! ఊఁ....అయితే మనకు ఇది తొలివిజయ మన్నమాట! ఇక అంతిమవిజయంకూడా మనదే! దానికి తిరుగు లేదు, సరే! కన్నమా! ఇక్కడేవుండి ఇతరుల నెవ్వరినీ లోపలకు రానీయకు, చివరకు మనవాళ్ళైనా సరే....జాగ్రత్త! మలిదేవ రాజుగారెందుకో పిలిపించారు. శిబిరం లోవలికివెళ్ళి విషయం గ్రహించివస్తా. (శిబిరంలోవలికెళ్ళాడు.)

కన్న : హుఁ.... కొమ్మరాజా! స్థిరసంకల్పులంటే మీరేనయా! ఒక్క శరప్రయోగంతోనే శాత్రవమూకను ఉక్కిరిబిక్కిరి చేయించి, రాబోవు పోరాటవిజయానికి నాందిపలికారు. నాబోటి వీరయోధులకు మార్గదర్శకులై రణోత్సాహంతో రంపిల్లజేశారు! ఇక ఈ కన్నమ శౌర్యం అనుపమానం. ఆడితప్పిన అసత్యవాదులై; ఒడంబడికను వ్యతిరేకించిన బుద్ధిహీనులై; జడతనిద్రలో పడకవేసిన ఆ పెడసర కట్టెల్ని పొడిపొడిచేసే సమయం సమీపించింది.

ఉ॥ తప్పుడు దారిలో నడచి తార్కొనవచ్చిన కూళజాతికిన్
చెప్పనదేమి? ఆలమున చిప్పిలి ఆ తెరవాటు దొంగలన్
గుప్పిటబట్టి చొప్పవలె కుప్పగకూల్చి కిరాతకమ్ముగా
పిప్పియొనర్చి తీరెదను! పీనుగపెంటగ రాశిపోసెదన్!

బాల : (ఆవేశంతో వచ్చాడు.) ఆఁ....ఏమిటిది? ఎక్కడివారక్కడ నిర్జీవ ప్రతిమల్లా నిలుచున్నారేమిటయ్యా? దట్టీలు దట్టించి, కంచుకాలు బిగించి, ఖడ్గాలు చేబూని, కారెమపూడికి తరలివచ్చిన అవసర మేమిటో....ఇంతలోనే మరచిపొయ్యారా! లేక కదనభూమిని పొంచి

పన్నెండు గ్రామాలకు పుష్టిగా పరివేష్టితమైన నాయకురాలి సైన్యాన్ని గాంచి, దైన్యంతో తల్లడిల్లిపోతున్నారా! ఆహా! ఎంత అబ్బురమయ్యా మీ ప్రవర్తన! మూతులకు ఉక్కుచిక్కాలు బిగించుకుని, బిక్కమొగాలతో స్రుక్కిపోతున్న మీరు; ఈ చిక్కునెలా చక్కబరుస్తారయ్యా? పలనాడంతా నెత్తుట మునిగిపోవు సమయం సమీపించింది, లెండి! ఖడ్గాలను చేతబట్టి కార్యరంగానికి దూకండి! లెండి! జై చెన్నకేశవా!

ఉ॥ ఎత్తిన కత్తిదించక యథేచ్ఛగ ఆహవరంగ వీధినిన్
జొత్తిలి దూకుచున్, హరికిశోరములట్లు చెలంగి శత్రులన్
గుత్తులుగాగ ఈ భువిని కూలగనేసి విశేషశౌర్య సం
వర్తినిజూపి నిల్వుడిక భావిచరిత్రకు వన్నెగూర్పగన్.

(శిబిరంలోనికి వెళ్ళబొయ్యాడు.)

కన్న: ఆగు. శిబిరంలో ప్రవేశించటానికి వీల్లేదు.

బాల: కారణం?

కన్న: అది నీకనవసరం.

బాల: ఏమిటీపొగరుబోతు సమాధానం? కండకావరమా లేక కన్నుల కెగదట్టిన మత్సరమా!

కన్న: ఏమిటావాగుడు? కారుకూతలకూ గద్దరిచేష్టలకూ జంకేవారెవ్వరూ లేరిక్కడ! పెడసరబుద్ధితో మిడిసిపడక వచ్చినదారి చూసుకో! ఉద్రేకాన్ని, కచ్చెకు కాలుదువ్వి మచ్చరించావా, చిచ్చునపడ్డ మిడుతలా మాడి బూడిదైపోతావు! జాగ్రత్త!

బాల: ఊఁ.... (నవ్వాడు) భటవృత్తితో రాజభోజనాన్ని బకాసురునిలా మెక్కి, కారుదున్నలా కండలుపెంచినంతమాత్రాన, నీబెదిరింపులకు అదిరిపడే అర్భకుడనుకున్నావా, వీడు! ప్రాణాన్ని పణమొడ్డి, బ్రతుకును బవరానికి అంకితంచేసి, శత్రుసంహారమొనర్చ, ఆహవరంగానికేతెంచిన అసమాన శూరుడీ వెలమవీరుడు. నన్నాపటానికి నీవెవరు? ఊఁ.... తప్పుకో! (వేగంగా వెళ్ళబొయ్యాడు.)

కన్న : (బరిసెను రెండుచేతులతో అడ్డుగాపెట్టి నెట్టుకుంటూ పొయ్యాడు.) ఏమాపొగరుబోతుతనం? నాతోనే కయ్యానికి చెయ్యందిస్తావా, తులువా! వీడు రణరంగభీముడు. దుర్జయభుజశాలి. యుగాంత కాల సంఘాతమూర్తి. వియత్తల విహారానికెగురబోయే విహగేంద్రుడు సైతం....నేను తలుచుకుంటే తప్పించుకుపోలేడు. చీరబోతు గాంభీర్యంతో నిద్రనీల్గే కుర్రికుంకవి; నీవుకూడా నన్ను ఎవరూ అని ప్రశ్నిస్తావా! వీడు మలిదేవరాజుగారి సేనావాహినికి సర్వ సైన్యాధిపతి! అపరపరశురామావతారుడైన బ్రహ్మనాయనకు పెమ్మసానెమ్మ వల్ల కలిగిన పెద్దకుమారుడీకన్నమదాసని తెలియదా! వ్యర్థప్రలాపీ!

బాల : ఓహో! అదా నీపొగరు? అయితే వీడుమాత్రం సామాన్యుడనుకున్నావా! సంగడీలకు ప్రాణసఖుడు. పురుషోత్తమమూర్తయైన బ్రహ్మనాయనకు....నిజసతి ఐతమదేవివల్ల ఆవిర్భవించిన అరిజయ సంశీలుడని నీకుమాత్రం తెలియదా! నీవు పెద్దకుమారుడవైతే.... నీ తలదన్ని పుట్టిన శీలమ్మ మనుమడీబాలచంద్రుడు! కాలరుద్రుడై కిలింపవచ్చాడు. కాచుకో నా కరవాలధాటికి. (కత్తి నెత్తి కన్నమతలపై వేయబోయాడు. కన్నమ బరిసెనడ్డు పెట్టి ఆపుకున్నాడు.

కన్న : తమ్ముడూ....బాలచంద్రా!

బ్రహ్మ : (శిబిరం నుండి వెలుపలకు వచ్చి ఆశ్చర్యంగా చూశాడు.) ఆగండి! (ఆగారు) ఈతరుణంలో అంతర్గత కలహమా! (తీక్షణంగా చూసి దగ్గరకు చేరాడు.) కుమారులారా! ఇదికాదు, మీకుకావలసింది వర్గశత్రువును తుదముట్టించటం కావాలి. కన్నమా! శిబిరంలోపలికెళ్ళు!

కన్న : సరే....(వెళ్ళాడు.)

బ్రహ్మ : (బాలునిదగ్గరకు చేరి సానునయంతో) బాలచంద్రా! సంగరానికి వచ్చావా!

బాల : సంగరానికి రాక బొంగరాలాడమంటారా తండ్రీ! (కత్తిని ఒరలో దోపాడు.)

బ్రిహ్మ : కాదుకుమారా! నీవు నాకు ఏకైక పుత్రిడవు. అందువల్లనే నిన్ను మేడపిలో ఉంచవలసి వచ్చింది. బొంగరాలాడు వయస్సులో వున్న నిన్ను సంగరానికి రమ్మనలేకపోయ్యాను.

ఉ॥ శీలమ వంశమున్ నిలుపు సింగపుపిల్లవె కాని, చూడగా
బాలుడవీపటంచు, రణపొందితి పూర్తిగ నేర్వనట్టి ని
న్నాలము సేయబంవ హృదయమ్మున శంకజనించి మత్సర
జ్వాలలు క్రిక్కు సంగరపు సన్నిధిజేర్పగ సంశయించితిన్.

బాల : ఆ బొంగరాలాటే నన్నొక వీరునిగా, రణరంగ ధీరునిగా నిలిపింది. నే వేసిన బొంగరపు ములికి తాకుడుతో మూర్ఛిల్లిన కోమటి అన్నమ, తేరుకుని దూషించిన దెప్పిపొడుపు మాటలే....నన్ని సమరభూమి కాహ్వానించాయి. సంగడీలతో సహా సమరం సాగిద్దామనే వచ్చాను. కాని, వారిలో ఒక్క అనపోతునుమాత్రిం మార్గమధ్యంలోనే వెనుకకు పంపవలసి వచ్చింది.

బ్రిహ్మ : కారణం? అతనేకదా మీ సంగడీలకు రణవిద్యాగురుడు! పైగా మహావీరుడు!

బాల : అవును. నిజమే! కాని, అనపోతు బ్రాహ్మణుడు! రణరంగంలో మరణిస్తే బ్రహ్మహత్యా దోషమంటునని....ఆపనిచేశాను.

బ్రిహ్మ : నీవనుకున్నది వట్టిభ్రిమ. అతడసహాయ శూరుడు! పైగా అభిమానధనుడు! అంతటి బ్రాహ్మణవీరుని రాకను నిరోధించటం.... మనకు శాపగ్రిస్తమేమో, ఊహించావా కుమారా! సరే....కాని, యిప్పుడిక్కడ మనం చేయవలసిందేమీలేదు. ఒక్క కొమ్మరాజు వేసిన బాణతీవ్రితకే జంకి; నలగామరాజూ, నాయకురాలూ కలిసి ధరణికోట కేతరాజునూ, చింతపల్లి రెడ్డినీ మనదగ్గరకు రాయబార మంపారు. అదే, ఇప్పుడు శిబిరంలో జరుగుతున్న సంభాషణ! మాచెర్ల వరగడాను మనకిస్తామనీ, నరసింగరాజును మన కప్ప గిస్తామనీ....నిర్ణయించి, ఎవరిరాజ్యాన్ని వారు యధారీతిగా పాలించుకోవచ్చని చెపుతున్నారు.

బాల : మరి, దీనికి కొమ్మరాజుగారొప్పుకున్నారా!

బ్రహ్మ : అసలందరికన్న ముందు అంగీకరించిందే ఆయన. పైగా అప్ప జెప్పిన నరసింగరాజును చంపటంకూడా ఆయన కిష్టంలేదు. ఈస్థితిలో నేనూ మౌనంవహించక తప్పలేదు. అదిగో! (బయటికి చూపిస్తూ) మేడపినుండి మాడచి వచ్చి, నిన్ను రమ్మంటున్నట్లు ప్రాధేయపూర్వకంగా చూపిస్తుంది. సంధికుదిరి....శిబిరంలో ఇరు వాగులవారూ, సామంత నృపతులతోసహా చాపకూటికి కూర్చున్నారు. మాడచిని విషయమడిగి తెలుసుకుని నీవూవచ్చి చాపకూటిలో సహకరించు. వెళ్ళిరాకుమారా!

బాల: సరే (చకచకా వెళ్ళాడు.)

బ్రహ్మ : నేనొకటి ఉహిస్తే....తానొకటి తలచివచ్చాడు, బాలచంద్రుడు. ఎలాగైతేనేం....రాగలదనుకున్న తుఫానుహోరు, తుంపరజల్లులతో సద్దుమణిగింది. (శిబిరంలోకెళ్ళాడు.)

బాల: (రక్తంతో తడిపిన జంద్యెమూ, కాలిబిరుదమూ ఛేతబట్టి పరుగుతో వచ్చాడు.) తండ్రీ! (పెడబొబ్బపెట్టాడు.) ఆపండి భోజనాలు. ఆప్తహితుడు అనపోతు, ఆత్మహత్యతో అస్తమించాడు. పలనాటి మేటివీరుడు....పరమపదం చేరాడు. ఇవిగో నెత్తురువారు జందెమూ, బిరుదమూ ఆనవాలుగా పంపాడు. నాహితుని ఆత్మ శాంతికోసం....నేనొనర్చిన ప్రతిజ్ఞాపాలనకోసం పరిపంథిసైన్యాన్ని పరిమార్చి, ఆ నరసింగుని తలనరికి తెచ్చేవరకూ....యుద్ధం చేయటానికే సిద్ధమయ్యాడీబాలచంద్రుడు. ఇక మీరెవ్వరూ నన్నాపలేరు. (జందెమూ బిరుదమూచూస్తూ) మిత్రమా! అనపోతా! ఎంత సాహసానికి పాల్పడితివయ్యా? విప్రకుమారుడవనీ, ఆర్య రక్తమనీ, కదనంలో కడతేరిన బ్రహ్మహత్యా దోషమంటుననీ, దురూహచేసి, దారిమధ్యలోనే అనపత్రముంచి, నిన్ను ఆహవ రంగానికి రాకుండా ఆపిన అధముడయ్యా వీడు. బాల్యమాదిగా హితవులందించిన నీ జతకూడి సంచరించినంతకాలం .... నాపై ఈగను వాలనిచ్చావా! చీమను చిట్టాడనిచ్చావా! యేడేండ్ల పర్యంతం నీ శాసనఖడ్గమే నన్నొక వీడునిగా నిలిపిందే....అట్టి

నిన్ను అర్థంలేని అపోహలకు లోనై అమరపురికర్పించిన ఈఅల్లునికి రక్తంతో తడిపిన జందెమూ, కాలిబిరుదమూ ఆనవాలుగా పంపావా, సోదరా! ఎనిమిదిమందిసంగడీలలో అనపోతే అతిరథుడన్నమాటలు నేటితో దాటిపొయ్యాయా మిత్రమా!

ఊం.... ఇక యిప్పుడు నాకేదిదారి? అటు ఆత్మీయుని మరణవార్త! ఇటు పెద్దలు సాగించే సంధికార్య సమాలోచన! అది రొమ్ములు రంపిల్లే వజ్రఘాతం! ఇది మాటల విందుతో మభ్యపెట్టే.... మంత్రాలోచన! చలికీ వేడికీ పొత్తుకుదరని సంఘాత సంధి సమయమిది! భాగలబ్ధికై వచ్చిన వైషమ్యాలతో, ఖులవగకై నెలకొన్న ఘోరవంతాలతో .... వలనాడు పూర్తిగా వంటగదికి చేరుకుంది! ఇక కావలసింది కోతగాండ్రు. ఈకార్యాన్ని నేనే నిర్వహించాలి. అంధ్రలోకమున్నంతవరకూ, ఈ వలనాటివీరుని వరాక్రమరేఖ లదృశ్యం కాకుండా అమరపూజ లందుకోవాలి. ఇదే నా ప్రతిజ్ఞ! (కత్తిలాగాడు.) జై చెన్నకేశవా (పోబొయ్యాడు.)

బ్రహ్మ: (శిబిరం నుండి వచ్చాడు.) ఆగు బాలచంద్రా. (షమీపించి) ఆవేశం అనర్థాలకు మూలం. శాంతించి యుద్ధప్రయత్నాన్ని విరమించుకో!

బాల: (కత్తిని ఒరలో దోపాడు.) శాంతి! ఇంకెక్కడి శాంతి తండ్రీ! వలనాటి వీరుల్లో ప్రధమస్థానాన్నాక్రమించిన అలరాజు, విష ప్రయోగంతో అసువులు విడిచే; తక్కినవీరుల్లో తలమానిక మనిపించుకున్న అనపోతు, ఆత్మహత్యతో అంతరించాడు! ఇంకా శాంతించి, మనంకూడా ఆ మాయలమారి ఆరవెల్లి నాగమ్మచేతలకు బలికావలసిందేనా తండ్రీ!

బ్రహ్మ: (బాధతో) బాలచంద్రా! ఎన్నోనోములఫలితంగా నీవుజనించావు. అనుకున్నవన్నీ సమకూరి, పాలికూళ్ళబంతి సాగుసమయంలో తిరస్కరించి సమరం సాగించటం. ఏవిధంగా ఆలోచించినా మనకే అనర్థదాయకం. దుడుకుతనంతో దురమున దూకినంతమాత్రాన అదనంగా మనకు లభించేదేమిటి? ఏప్రయోజనమాశించి యుద్ధం చేయాలి?

బాల : ప్రయోజనంకన్నా ముఖ్యమైంది, ప్రతిజ్ఞాపాలన నాన్నా! ఆనాడు అలరాజుకు మారుగా నా కొనరెట్టపట్టి....ఇతడే నీ కుమారు డని, కొమ్మరాజుకు నన్ను ఇల్లడపెట్టిన విషయాన్నే మరిచి పొయ్యారా! అలరాజు మరణానికి ప్రతిక్రియ చేస్తానని, నేనుచేసిన ప్రతిజ్ఞ అవగాహమే కాలేదా! ఆనాడు అలరాజుకు రాచరావులకడ శ్మశానవాటికలో చేసిన దహనసంస్కారాల చితిమంటలు ఆకసాని కెగసి, ప్రతీకార ప్రతాపాగ్ని జ్వాలలై నాలుకలు సాపి కుల పగ తీర్చుకొమ్మని, భుగభుగలాడిన సెగలు ఈనాటికీ చల్లారనేలేదే.... ఈచలి మీకెలాదాపురించింది తండ్రీ!

బ్రహ్మ : ఏసాధనకోసం నీవు ప్రతిజ్ఞ చేశావో, ఆ నరసింగరాజునుకూడా మనకప్పగిస్తున్నారు కదా! కుమారా!

బాల : అప్పగింతకు కాదునాన్నా నేను ప్రతిజ్ఞ చేసింది.

బ్రహ్మ : కాక మరేమిటి?

బాల : యుద్ధంలో ఆ నరసింగరాజు తలనరకటానికీ, దానినితెచ్చి కొమ్మ భూపతి కివ్వటానికీ....అంతే! దీనికి తిరుగులేదు. ఇక ఈబాలుడు వైరిమూకలపాలిటి ధూమకేతువు. వీనిలో జ్వలించే వీరరసోద్రేక విప్లవావిర్భూత పరాక్రమ క్రమ విక్రమోద్వేగ విజృంభణాగ్ని జ్వాల నెవ్వరూ ఆపలేరు. వీడు కుబుసంవీడిన కోడెత్రాచు! కట్లుతెంచుకున్న పోట్లగిత్త! బాదంవంశ పాటవాన్నీ, రేచెర్ల గోత్రప్రతిష్ఠనూ, మాచెర్లసీమ గౌరవాన్నీ ఈశీలమువారి వెలమ బిడ్డడు సముద్ధరింప సన్నద్ధుడై యుద్ధానికి ఉద్యమిస్తున్నాడు. జై చెన్నకేశవా! ఒర నుండి కత్తినిలాగి వేగంగా వెళ్ళాడు.)

బ్రహ్మ : అబ్బా! ఏమీబాలునిమూర్ఖత్వం? కోరుకున్నశత్రువును చేతికంది స్తుంటే నేరుపుతోనిర్వీర్యుణ్ణిచేసి నిర్మూలించేఅవకాశాన్ని అణగార్చాడీ అవివేకి. ప్రయాసపడకుండా ప్రయోజనం చేకూర్చే పెద్దల మాటల్ని పెడచెవినిబెట్టి కదనానికే కాలుదువ్వాడీగడుసరి! రణమూ.. శాత్రవమారణమంటూ పెడబొబ్బలతో పేట్రిగి క్రొవ్వులిలా కోతల చేయబోయాడీపెడసరి!

ఇంతకూ నా ఊహ తారుమారైంది! నా ఆశలగాధంలో కూరుకుపోయాయి! వంశోద్ధారకుడని నేనాశిస్తే, సంశయాన్ని తెచ్చిపెట్టి, సంఘర్షణకు సాహసించాడీకలినుడు! ఇప్పుడేంచేయాలి? ఏమార్గాన్ననుసరించాలి? ఈ విషమసమస్యనెలా బాపుకోవాలి?

ఊం.... సరే! ఏదియేమైనా, ముందు బాలుని దక్కించుకోవాలి. వాడు దక్కాలంటే....యుద్ధమేచేయాలి. తప్పదు. ఇక యుద్ధం తప్పదు. విపక్షయోధుల మారణహోమమూ తప్పదు.

అదిగో! అప్పుడే కదనభూమిపై యుద్ధమేఘమావరించింది! అదిగో నాగులేరు! మర్మర ధ్వనితో మహాయాత్రకై నురగలు క్రక్కుతూ, ఆకాశ గంగలా దూకబోతుంది! ఇక సంధికుదరదు. సమరమాగదు. (ముందుకు సాగాడు.) వీరయోధులారా! రేపు ప్రారంభమనుకున్న యుద్ధం....బాలుని తొందరపాటువల్ల....ఇప్పుడే ఆరంభమైంది. యిక యేమాత్రం ఆలసించక మీరంతా శంఖుతీర్థమంటపందగ్గరకు చేరండి. అక్కడే తీర్థం పుచ్చుకుని, నాచే వీ ర తాం బూ లా లందుకుని బవరానికి బయలుదేరాలి. పదండి నేనూవస్తున్నా!

తెరలో : (జయధ్వానాలు) జయ గండరగండా....జగనొబ్బగండా....
మండితమార్తాండా....కోటికోలాహలా....
జయ జగన్నాధా....

బ్రహ్మ : ఆహా! ఏమావిజయధ్వానాలు! (శిబిరంవైపు చూస్తూ) మలిదేవ మహారాజా! మన ప్రయత్నమంతా మధురసంగీతాన్ని బధిరులకు వినిపించినట్లైంది. మనప్రమేయం లేకుండానే....యుద్ధం ప్రారంభమైంది. ఇక విందును ఆపి....సంధినిత్రిప్పిపంపి, మీరూ యుద్ధానికి సన్నద్ధం చేయండి. నేనిదే శంఖుతీర్థ మంటపందగ్గరికెళుతున్నా! (బయటికెళ్ళాడు.)

కన్న : (శిబిరం నుండి బయటికి వచ్చాడు.) హుం.... ఏమా బాలుని తలబిరుసు? ఎంతవీరుడైతేమాత్రం....పరిస్థితిని పరిశీలించవలసిన అవసరమేలేదా! సమయాసమయాన్ని తెలుసుకోలేక, తాత్కాలిక ఆవేశానికి లొంగిపోయి కదనానికే కాలుదువ్వుతాడా! ఎవరినైతే

ధర్మస్వరూపుడనీ, వీరావతారుడనీ, ఈ పల్నాటి ప్రజలు విశ్వసిస్తున్నారో .. అట్టి వివేకశాలియైన కన్నతండ్రిని కాదని యుద్ధానికే సిద్ధమైపోతాడా! ఏమీ ఈతని తెలివితక్కువ తనం? ఇంతకూ విధి అనివార్యమైంది. యువకోద్రేకం వెర్రితలలువేసింది. కానీ అది వెక్కిరింతపాలు కాకుండా చేయవలసిన బాధ్యత, సైన్యాధిపతినైన ఈ కన్నమదాసుకుంది. ఇక కర్తవ్యానికి కంకణధారుణ్ణై...అరిసేనాబలగాన్ని అంతంచేస్తాను. అదిగో! అప్పుడే నాయకురాలి సైన్యం కదనభూమికి నలువైపులా చేరుకుంది. జై చెన్నకేశవా! (వేగంగా వెళ్ళాడు.)

నాయ: (మరోవైపు నుండి వచ్చింది.) ఆహా! ఏమా సైనికులసంబరాలు? వీరముద్రికలు దాల్చి, రణోత్సాహులై పోత్సహించిన పోటుకాండ్ర ఉద్రేకాలు చూస్తుంటే....కంఠేకాలునికి కంధరహారంగా శత్రు శీర్షాలను నివేదించాలనే ఉత్కంఠతతో ఉవ్విళ్ళూరు తున్నట్లుంది! వీరసైనికులారా! వినుతశౌర్య ప్రతాపులారా! సర్వం త్యాగమయం చేసి, కరవాలాలు చేతబట్టి, కదనానికేతెంచిన మీకు మా ఘన స్వాగతం! మీ మీ సేనానుల ఆజ్ఞలు జవదాటక, శాత్రవారణ్యాన్ని ఊచకోత కోయండి! పగరనెత్తురు చవిచూడని ఖడ్గాలు ఇకముందు మీచేతుల్లో ఉండరాదు. జై హరహర మహాదేవ్!

మ్రోగింప సాగండి విజయరణభేరీ!
చేపట్టి కదలండి భీకర కటారీ!

చటుల సాహసమొప్ప శౌర్యమ్ము చూపించి
కొదమ సింహముభాతి కుప్పించి లంఘించి
పగవాని గుండెలో బాకుపోటును దించి
నిట్టనిలువుగచీల్చి నెత్రుటేరులముంప మ్రో

కాసెకోకనుగట్టి ఖడ్గమ్ము చేపట్టి
చండవిక్రమ మెసగ సింహగర్జనచేసి
ఉక్కుజోదులపట్టి కంఠాలు తెగగొట్టి
వైరిశీర్షములన్ని బంతులై భువిరాల మ్రో

కనులు నిప్పులుక్రమ్మ క్రౌర్యమ్ము దీపింప
చిచ్చరపిడుగులా చివ్వున చెరలాడి
వీరవిక్రమధాటి విచ్చుకత్తిని నరికి
తెగివడు మొండెముల్ నాగులేటనుదూల ॥మో॥

(పాడుతూ వెళ్ళింది.)

జాల : (మరోవైపు నుండి వచ్చాడు.) సమరశూరులారా! సాహసవీరులారా! మీ పిరికికండల్ని చిత్రికబట్టి, శక్తిసామర్ధ్యాలకు సానపెట్టి, వీర విక్రమ విభవంతో సమరధీమంతులై నిలవండి! సంగ్రామ రంగంలో, సముధికోత్సాహంతో ఔడుగరచి, జబ్బచరచి, ఒడలు పెంచి, హుంకరించి పోరాటం సాగించండి! మీ వేటులకు ఈటె లొరుసుకుని నిప్పుకలు క్రక్కాలి. మీ పోటులకు శాత్రవులగుండెలు వ్రీలి, ప్రేవులురాలి, కళేబరాలు గంగధారమడుగులో తేలిపోవాలి! నాగులేటి వీరబయళ్ళలో సమరనాట్యం సలిపి, పలనాటి పౌరుష మప్రమేయంగా నిలిపిన మీ వీరగాథలు నాపరాలపై చెక్కబడి చిరకీర్తి నార్జించాలి. ఇక విక్రమించండి.

అవిగో! వీరణాల మ్రోతలు! యుద్ధభేరీ ఛాంకారాలు! లెండి! అనిలో దూకి, అరివీరుల పొలయించి, పలనాటి పౌరుషాన్ని వ్రపంచానికి చాటండి! జై చెన్నకేశవా! (వెళ్ళాడు.)

నర : (మరోవైపునుండి వస్తూ) సైనికవీరులారా! సమరాంగణధీరులారా! మీ పరాక్రమప్రదర్శనల కిదేసమయం. ఈరణభూమికి చుట్టూ పన్నెండు గ్రామాలకు పరుచుకున్న మన మహాసైన్యం, శత్రువునేకాదు. చివరకు గాలినికూడా చొరనివ్వదు. విక్రమ దర్పంతో శత్రుసమూహంపై విరుచుకుపడి పొలికలనులో విలయ తాండవం చేయండి. మీ శౌర్యానలజ్వాలలతో శాత్రవసేనను భస్మ మొనర్చి, విజయగీతికలతో వీరవసంతం చల్లుకోండి. మీ కీర్తి చంద్రికల ప్రతిహతాలై పలనాటిలో పసిడిహారతులెత్తుకోవాలి.

సేనా నాయకులారా; మీరంతా నా కరవాలసంకేతాన్ననుసరించి సైన్యాలను నడపండి. సర్వసైన్యాధ్యక్షుడైన చింతపల్లి రెడ్డి వ్యూహరచన మీ నైపుణ్యానికి మరో మహత్తర అవకాశం.

అవిగో భద్రగజాలపై మార్మోగు ఢంజలు దుద్రివీణలు! ఆధ్వనికి కుంభిని వణకిపోతుంది. కులగిరులు దద్దరిల్లిపోతున్నాయి. లెండి! జూలు విదల్చిన సింహాల్లా శాత్రవహరిణాలపైబడి చీల్చిచెండాడండి. జై హరహరమహాదేవ్! (వెళ్ళాడు.)

కన్న : (వస్తూ) వీరాగ్రేసరులారా! విశృంఖల వీరవిహారులారా! శత్రు భయంకరాకారులై ఖడ్గాలుదూసి, చయ్యన ఝళిపించి, దండిహారుల దట్టించి, తుండెలుగా ఖండించి, పలనాటి పరాక్రమశోభకు పటుత్వం చేకూర్చండి. రాండ్రించి నిప్పురలుక్రక్కె బలోద్ధతులైన పద్మనాయకుల సమరపాటవం. భీషణరోషాగ్ని వెలార్చె పోటు మన్నీల దోర్బల పరాక్రమం, జతకలుపుతూ సమర శాత్రవకోటి సంహారానికి చరమదశను పూర్తిచేయండి. అవిగో! రణభేరీ మ్రోతలు! బూరకొమ్ముల పూరింతలు! లెండి! వీరరసోద్రేక విస్ఫూరితులై మహావృక్షాలను సైతం సమూలంగా పెల్లగించు ప్రచండవాయువులా విజృంభించి, విరోధివర్గాన్ని దూదిపింజల్లా ఎగరగొట్టండి. జై చెన్నకేశవా! (వెళ్ళాడు.)

బ్రహ్మ : (వచ్చాడు.) సమరయోధులారా! ఇది స్వరాజ్య సాధనకోసం చేసే ప్రజాపోరాటం. నిరంకుశ శక్తుల వ్యతిరేకతే మన పోరాట లక్ష్యం. వీరనాయకుల ఆనతిమేరకు మీరంతా ఉప్పొంగి పొంగు నాగులేటి తరంగాల్లా విరుచుకపడి నాయకురాలి ముూకను తుడిచి పెట్టండి.

అవిగో! కదనభూమిలో ఖంగుమంటూ, శిరస్సుల్ని ఖండిస్తూ కబంధాల్ని దొర్లిస్తూ....వీరఖడ్గాలు ప్రళయనాట్యాలుచేస్తున్నాయి. అవిగో మహావేగంతోవచ్చే బాణాలు! వక్షస్థలాల్ని చేదిస్తూ దూసుకుపోతున్నాయి! కంఠాల్ని విలుంఠనం చేస్తున్నాయి! లెండి! విజయమో, వీరస్వర్గమో తేల్చుకోండి! చెన్నకేశవుడు మీకు సదా అండనుండుగాక! (శిబిరంవైపు వెళ్ళాడు.)

నాయ : (మరోవైపు నుండి వస్తూ) ఆహా! ఏమా సైనికుల యుద్ధ నైపుణ్యం? క్రోధఘూర్ణితులై కదనభూమిలో కెరలాడు ఆ వీరుల శౌర్యానలజ్వాలలు, కాలభైరవుని ప్రళయకాల లలాటాగ్ని జ్వాలల్లా నలుమూలలా అలముకుని నుగ్గాడుతున్నాయి! (మరోవైపు చూస్తూ) ఆఁ.... ఏమా బాలచంద్రుని పరాక్రమం! వాని ఖడ్గధాటికి సైనికుల తలలు బంతుల్లా ఎగిరిపడి, కదనభూమిలో దొర్లిపోతున్నాయి. ఆఁ.... అదేమిటీ! యుద్ధభూమిని వదలి నరసింగరాజు నావైపు వస్తున్నాడు. పారిపోయి కాదుగదా!

నర : (పరగునవచ్చి నాగమ్మా! నాగమ్మా! బాలచంద్రుని ఖడ్గ చాలనానికి మనసైన్యమంతా వికావికలై పోతుంది. పారిపోవటం వీరధర్మం కాదని వివరించినా....వినేరీతిలోలేరు. రోషావిర్భూతులై కొందరు ఎదిరించినా, వాని మెరుపుదాడికి ఆగలేక పోతున్నారు. ఈసమయంలో మరికొంతసైన్యమెంతో అవసరం.

నాయ : ఏమిటీ! ఒక్కబాలుని పరాక్రమానికి ఆగలేక పలాయితులౌతున్నారా! ఎంత విచిత్రం?

నర : వాడు బాలుడుకాదు నాగమ్మా, ప్రళయకాలరుద్రుడు! సంగడీలతో చెంగలిస్తూ వాడు మనసేనలో జొరబడి....చెరకు గడల్ని మునుముపట్టి నరికినట్లు తునుమాడుతూ వస్తుంటే....నిర్వీర్యులై నిలువరించలేకపోతున్నారు.

నాయ : నరసింగరాజా! ఆ బాలుని శౌర్యమంతా పాడుబోతులవరకే పరిమితం. అయినా, పలనాటికి కాబోయే ప్రభుడవునీవు. నీకు నేను చెప్పవలసినదేమిటి? వెళ్ళు? చెదరిన సైన్యాన్ని నాగులేటివైపు నడిపించు. ఈలోపు మేళ్ళవాగులో మనం దాచిన సైన్యం వచ్చి తారసిల్లుతుంది. వెళ్ళు! వీరోచితంగా పోరాడి, పలనాటిరాజ్యాన్ని దక్కించుకో. అదిగో! చూశావా! నీవిటురాగానే.... నీ స్థానంలో సమరం సాగిస్తున్న ఉపసైన్యాధిపతి తలనరికి, తనతండ్రిదగ్గరకు తీసుకెళ్ళాడు బాలచంద్రుడు! అది నీ తలకాయు కాదని....ఛీకొట్టాడేమో బ్రహన్న! ఆ తల నక్కడే పడవేసి విరక్తుడై మళ్ళీ

యుద్ధానికి వస్తున్నాడు. వాణ్ణి సమయించడానికిదే సమయం. వెళ్ళు. నేనిదే నలగామరాజుతో ముచ్చటించి వస్తా! (వెళ్ళిండి.)

నర : ఊఁ.... ఇక అబాలుని శక్తిసామర్థ్యాలేమిటో నేను చూస్తాను. వీడసహాయ శూరుడు! వైరి నిర్యాతనానికి దీక్షబూనిన రౌద్ర రసోద్దీపిత సమరకేసరివీడు. కండలు చీలినా, గుండెలు జారినా, పేగులు రాలినా, చివరి నెత్తుటిబొట్టు చిమ్మేదాకా యుద్ధమొనర్చి.. పలనాటి రాజ్యాన్ని పరిరక్షించుకోగలడీ నరసింగరాజు. (ఖడ్గాన్ని లాగాడు.) వైరిజన శిరచ్ఛేదన సాధనమా! కరవాలమా! వేటు కొక్క శిరస్సు, తాటిపండులా ఎగిరిపడి కబంధాలు దొర్లిపోవాలి. పదా! (వెళ్ళాడు.)

బాల : (దూసుకువచ్చాడు.) రే! నరసింగరాజా! ఎంత కాలమిలా తప్పించుకోగలవురా! వీడు సమరోర్వీ విశృంఖల వీరవిహారుడు! సమరోద్వేగ జనితోగ్ర రోషావిర్భూత విక్రమ ప్రాశస్త్య వీరగంధ మలముకున్న విప్లవవీరుడీబాలచంద్రుడు! వీని విజృంభణకు ఆకాశ మావులించాలి! దిఙ్మండలం గర్జించాలి! గండశిలలదిరి పోవాలి! పిడుగుపైనా పిడికిలితో బిగించగల సామర్థ్య పటిమ సంతరించుకున్న, ఈబాలుని చేతిహేతిచే నీతల తెగనరికి కొమ్మ భూపతికిచ్చి కులపగ తీర్చందే వీనిపంత మీడేరదు....నిలు! (వేగంగా ముందుకు సాగాడు. వెనగ్గా నరసింగరాజు ప్రత్యక్షమై వికటహాసం చేశాడు. బాలుడు వెనుదిరిగాడో లేదో....నరసింగరాజు బాలుని డొక్కలో, కత్తితో ఒక్కపోటు పొడిచి లాగాడు. బాలు డొక్కపెట్టున కేకవేసి....బయటికి వచ్చిన పేగుల్ని లోపలికిదూర్చి కాసె బిగించుకుంటున్నాడు.)

నర : (మళ్ళీ నవ్వుతూ) దర్పపుకూతలూ, వ్యర్థప్రలాపాలూ కావురా, కదనానికి కావలసింది. నోటిబింకం వేటులో చూపాలి. పోటుకు నిలవాలి. కార్చిచ్చును నోటి ఊర్పుతో ఆర్ప ప్రయత్నించే అవివేకివైన నీకు ఆర్భాటమెందుకురా! సంగడీలతో బొంగరాలాడు కుర్రకుంకకు సంగ్రామరంగమా!

బాల : (ఈలోపు అంతా సర్దుకున్నాడు.) రే! నీచ రాజాధమా! దొంగ దెబ్బ తీస్తావా! ఇది వెలమకిశోరంరా! కాచుకో నా కరవాలధాటికి. (ఇద్దరూ పోరు సల్పారు. చివరకు నరసింగరాజు పడిపోగా; బాలుడు నరసింగరాజు తలనుకోసి చేతబట్టి వచ్చాడు.)

(తలను చూస్తూ) నరసింగరాజా! నీకెంతగతి పట్టింది? (ముందుకు చూస్తూ) మామా కొమ్మరాజా! తండ్రీ! బ్రహ్మనామాత్యా! నావంత మీదేరింది. నరసింగుని తలనరికి తెచ్చాను. తిలకించండి (తూలిపోతున్నాడు.)

బ్రహ్మ : (వచ్చాడు బాలుడు తెచ్చిన నరసింగుని తల చూశాడు. పొంగి పొయ్యాడు. కాని, వెంటనే మలిదేవుని శిబిరంవైపు చూశాడు. చిత్తరవొయ్యాడు. వెంటనే బాలుని పైలేని కోపం తెచ్చుకుని తీక్ష్ణంగా చూశాడు.)

ఎంతఘోరం చేశావు బాలచంద్రా! అసలు నీవీ రణరంగానికెందు కొచ్చావు? ఎవరుపిలిస్తే వచ్చావు? వచ్చినవాడివి ఎవరి కోరిక మేరకు ఈ శిరస్సును ఖండించావు? ఛీ! పిలువని పేరంటంలా యుద్ధానికి వచ్చి, సంధితో సద్దుమణిగే సమయంలో....యుద్ధాన్ని రెచ్చగొట్టి....ఇంతటి అకృత్యం చేస్తావా పాపీ! జ్ఞాతివైరానికే కుమిలి....కుమిలి పోతున్న (శిబిరంవైపు చూస్తూ) ఆమలిదేవ రాజు....ఇపుడీజ్ఞాతివధను గమనిస్తే....ఆయనగతి యేంకాను? రాజకుటుంబానికి మృత్యుదేవతలా ప్రత్యక్షమై....ఈ ఘోరహత్యకు పాల్పడుతావా! దుర్మార్గుడా! ఇదేనా....నీతీ....న్యాయమూ!

బాల : ఆం.... ఏమన్నారు? రాజకుటుంబానికి మృత్యుదేవతనా! నేను చేసినపని పాపమా! ధర్మదూరులై అల్లుని హత్యచేయించిన వారిని హతమార్చటం....అన్యాయమా! ఆహా! ఏమయ్యా మీ నీతి వాక్యాలు! కాసెలు బిగించి, కవచాలు తొడిగి, కత్తులు చేతబట్టి, కాల్నడరేవు లన్నీదాటి, బలోపేతులైన పద్మనాయకులతో, కారెమపూడికి కదలివచ్చిన కారణమేమిటో....యుద్ధానికి కాదా! ద్యూతవ్యసనం బలిసి, కోడిపందెంలో ఓడిపోయిన పరువు చాలక,

పలనాటి పరగణాను విడిచి, పంటభూముల్ని మరచి, యేడేండ్ల వలసలో....మండుటెండల్లో మసలి, కారడవుల్లో కాపురాలు సలిపి, చెట్ల కాయలు తిని, సెలయేళ్ళ నీళ్ళుతాగి, పాలపకూరలతో బతుకులు నిలుపుకున్న వెతలన్నీ కథలేనా! ఒక్క మాచెర్లయేకాదు.. కత్తిమొన మోపినంత మేరకైనా కోరుటకే వీలులేదన్న.... ఆ నాయకురాలి దర్పం తలపుకే రాలేదా!

అయినా కోచకోళ్ళకు రోసమేమిటి? ఇప్పటికీ రణభూమిలో నిన్ను నమ్ముకుని, నీ పిలుపునందుకుని, నిస్వార్థజీవులై, శూరధర్మాన్ని పాటించి, ఖండనోర్దండ శౌర్య మార్తాండపిండులై....వైరి వీర సైన్యోగ్ర మహాహవంలో సమున్నత విరవిహారమొనర్చి, వీర మరణం పొంది, ప్రాణదానం చేశారే....వారిమీదలేని జాలి..దయ, నీచుడైన ఈ నరసింగరాజుపై రాలిందా! ఇది నీధర్మమా!

ఒక్క పెదమలిదేవుని పెండ్లికోసమై....శివనండ్ల కోటను విధ్వంసం చేసి ...ప్రియుదంపతుల్ని అన్యాయంగా ఆత్మహత్యల పాల్జేశావే.... ఇది నీ న్యాయమా! ఆనాడు అలరాజును రాయబారమంపుతూ, ఆయన మెడలోవేసిన తులసిమాలను మెలుకువతో తెమ్మంటే.... బాల్యచాపల్యంతో నీకుట్రను పసిగట్టలేకపొయ్యాను. పాలకోసం పొదుగులుకోసే నీ స్వార్థతత్వం..ఈనాటికి పూర్తిగా అవగతమైంది. నీవెంత తప్పించుకున్నా నీకీవాదుపోదు. నీకుటిల రాజనీతికి దుమ్మెత్తి పోస్తూ, భావితరాలు నిన్ను తూర్పారబట్టకపోవు. నాకేమిటి? నేను చేసిన ప్రతిజ్ఞను పాటించాను. నా ధర్మాన్ని నెరవేర్చాను. ఇక మీ యిష్టానిష్టాలు నన్ను బంధింపనేరవు. ఈబొందిలో ప్రాణమున్నంతవరకూ పోరాడి వీరస్వర్గం చూర గొంటాను. జై చెన్నకేశవా! (వెళ్ళాడు.)

బ్రహ్మ : అబ్బా! బాలుడెంత నిందించాడు! వీడూ, బాలుడుకాదు. శిశు పాలుడు! నాపాలిటి కలి కాలుడు! అజ్ఞానాంధకారమావహించి, కన్న తండ్రినే దూషించిన కర్కోటకుడువీడు! హుం.... పంతమట! ప్రమాణమట! ప్రతిఫలమాసించని ప్రతిజ్ఞ దేనికిచేసినట్లు? అందరి

మెక్కటానికా, ఆహవరంగంలో దూకి అసువులర్పించటానికా! ఎందుకొచ్చిందీఅవస్థ! బయటపడ్డ పేగుల్ని పొట్టలో పొదిగి.... పోరాటం సాగించే వీడు, ఇంకెంతకాలం బ్రతకగలడు! స్వామీ! చెన్న కేశవా! ఇపుడేమిటి నాకు దారి! ఇటు స్వజనతిరస్కారం! అటు విరోధిజనపరిహాసం! అపకీర్తితరలో పొతచెక్కనై ముక్కలు కాబోతున్నాను స్వామీ! నిందలేకుండా ఈబొందిపోయే మార్గమే లేదా, భక్తవత్సలా! (పోబోయి ఆగి) హుం.... హుం.... హుం.... అరివాదులందరూ అర్థంచేసుకున్నారులే!

కన్న : (రక్తసిక్తాంగుడై వచ్చాడు.) తండ్రీ! నాగమ్మ సాగించే దుర్భేద్యమైన సమరవ్యూహంలో చిక్కుకుని, మన మహాయోధు లంతా తలకొకమార్గంలో నిహతులైపోతున్నారు! శత్రువుల శరఘాతాలకు....శరీరమంతా జల్లెడయిపోయి పరమపదం చేరాడు.... బాలచంద్రుడు! (తలవాల్చాడు.)

బ్రహ్మ : ఆం.... ఏమిటీ! బా..ల..చంద్రు....పరమపదించాడా (కుంగి పోయ్యాడు.)

కన్న : అంతేకాదు. ఒప్పిచెర్లలో పెద్దన్న బాదరాజు నలగాముని సైన్యాన్నీ, అశ్వక దళాన్నీ నామరూపాల్లేకుండా చేశాడేకాని, తన కారుబొల్లనితోసహా....అక్కడే కల్లికొరిగాడు. ఇక సన్నిగళ్ళలో మీ ముద్దుల తమ్ముడూ, నలగామరాజు పటాలాన్ని నలినలిచేసి.... వాహూ నేలకొరిగారు!

బ్రహ్మ : కన్నమా! ఇకచెప్పకు. చెప్పి..నన్ను నిర్వీర్యుణ్ణి నిస్సహా యుణ్ణి చేయకు. ఈ గుండెలో జ్వలించే దుర్భర బాధాతప్తవేదనా కీలలకు ఆజ్యంపోయకు. ఇంతకూ నీపోరాటమెక్కడ?

కన్న : చింతపల్లిలో! అక్కడ నామీద విరుచుకుపడే శత్రుసైన్యాన్ని నిరవశేషమొనర్చినా....అదేమిటో! కట్టలు తెంచుకున్న కడలి ప్రవాహంలా మాటిమాటికీ మరోదండు వచ్చి నాపై మార్కొంటూనే వుంది. అయినా పట్టునీడక మట్టుపెడుతూనే వున్నాను.

బ్రహ్మ : ఆదండు ఎక్కడనుండి వస్తుందో! దాని ఉనికి ఏమిటో గమనించావా!

కన్న : గమనించాను. నలగొండ నుండి మేళ్ళవాగు కనుమవరకూ, నాగులేటి పొడవునా....ఆరువేల గుర్రపుదళాన్నీ .... మూడు వేల కాల్బలాన్నీ....ముందేదాచి వుంచిందట, నాయకురాలు. అందులో భాగమే నామీదికి వచ్చేది.

బ్రహ్మ : నాగమ్మా! ఏమి నీరణవ్యూహరచనాపాటవం? సరే....కన్నమా! ఎవరెంతసాహసించినా .... అపారమైన నీదోశ్శక్తిని అధిగమించే వారెవ్వరూలేరు. ఆవిషయం వారికీతెలుసు. వీరుల్ని అప్రమత్తం చేసి, వచ్చినదళాన్ని వచ్చినట్టేమట్టుపెట్టి, మహావీరుడవనిపించుకో! వెళ్ళు!

కన్న : సరే..వస్తా! (వెళ్ళాడు.)

బ్రహ్మ : బాలచంద్రా! అస్తమించావా, ..నాయనా!—(తలవాల్చాడు.) హుం.... దెబ్బతిన్న యువకిశోరం....కసిమసగింది? కదనపాండిలి ప్రదర్శించి కాలధర్మం చేసింది! వీరపూజలందుకోవలసిన చూరా గ్రెసరుడు, నా బాలచంద్రుడు....శవపూజ చేయించుకోబోయ్యాడు! మా అన్నదమ్ములైదుగురికీ, వీడొక్కడేవంశాంకురం. అందుకే.... అందుకే బడిపాఠాలు చెప్పాను! విన్నాడా! బలిపీఠమెక్కాడు! నా బ్రతుకును బడబానలంలో ముంచాడు. మహా పరాక్రమశాలి బాలచంద్రుడు! వాని సాహసానికి అసూయచెందిన యుద్ధరాక్షసి మృత్యుఘంటను మ్రోగించింది....ముందే బలిగొన్నది. —

దీనికంతకూ ప్రథమకారణం....నాలోని రాజ్యదాహమే! అదే యీ పలనాటియుద్ధానికి ప్రాతిపదిక! ఆ సామ్రాజ్యకాంక్షే, ఇంతటి మారణహోమానికీ, నా వంశ వినాశనానికీ కారణభూతమైంది! ఇంత స్వార్థం నిండుకున్న ఈ విషజీవికిక ప్రాయశ్చిత్తం లేదు. ముమ్మాటికీ లేదు.

ఆఁ.... ఏమది? గతాన్ని స్మరిస్తూ.... వర్తమానాన్ని వదులుకుంటున్నాను. అ సం భ వ ం. అలా జరుగడానికి వీల్లేదు. నావారంతా నశించినతర్వాత నావవానిలా నేనుండి చేసేదేమిటి? యుద్ధానికి నేనూ సన్నద్ధుడనౌతాను. (ఖడ్గాన్ని లాగాడు.) అరిబలగాన్ని ఈ కరవాలానికి ఎరచేస్తాను. చెన్నకేశవా! ఈ బ్రహ్మనాయనకు కదనంలో కత్తిని ఝళిపించే తరుణం ఆసన్నమైంది. కరుణించి విజయం చేకూర్చు. (దూసిన ఖడ్గంతోనే వెళ్ళాడు.)

నాయ : (వస్తూ: ఆఁ.... ఎవరావ్యక్తి? ఏమాఖడ్గచాలనం? జవనాశ్వాన్ని శరవేగంగా సాళ్వగతిలో దూకిస్తూ; నా సేనలో జొరబడి చేతికందినవరకు నరుకుతూ, గంగధార మడుగువైపు దూసుకుపోతున్నట్లుంది. ఓఁ.... అర్థమైంది! మాంచాల! మరణించిన తన మగడు బాలచంద్రునికోసమేనేమో! పాపం!

మాంచాలా! ఎంత తెంపుచేసి వచ్చావమ్మా ఈ రణభూమికి? ఆడది సింహాసనమెక్కినందుకేనమ్మా; నీమామ బ్రహ్మనాయుడింతచేశాడూ! పశుపులకూ పక్షులకైనా స్వాతంత్ర్యముంది కానీ, మన ఆడజాతికి లేదమ్మా! ఈ పురుష దౌష్ట్యానికి బలియై, మనజాతి పురోగతి నశించిపోయిందమ్మా! ఈసమరభూమిలో భర్తకుసాయంచేద్దామని వచ్చావా తల్లీ! ఎంత త్యాగశీలివే!నా జాతి పరువునిలిపావమ్మా! నీపేరు తెలుగువీరగాథల్లో శాశ్వతంగా నిలిచి, మగువ మాంచాలగా ప్రసిద్ధికెక్కుతుంది తల్లీ!

(మరోవైపు చూసింది.) ఊఁ.... యుద్ధం చివరిదశకు చేరింది. మహావీరులంతా నేలకొరిగారు. కొమ్మరాజు, జోదుల సోమశేఖరునీ, వాని తమ్ములనూ హతమార్చి; తానూ తన తమ్ములతోసహా మరణించాడు. ఆవార్తవిన్న మలిదేపులు దుఃఖించి హఠాన్మరణం పొందారు.

(ఇంకోవైపు చూసింది. ఆత్మీయులు, అనుచరులు, చివరకు కన్నకొడుకుగూడా కూలిపోవటంతో....బ్ర హ్మ నా య డు స్వయంగా ఖడ్గాన్ని చేపట్టాడు. ఎదిరించిన పచరుల బ్రహ్మన్ననూ, కారెమపూడి రాజునూ, భీమసింగునూ హతమార్చి....అడుగో! ఇటే వస్తున్నాడు. బహుశా నామీదికే కావచ్చు! కరవాలమా! శత్రువు

చేరువ కాబోతున్నాడు. మేలుకో! (ముందుకుసాగింది.) బ్రహ్మ నాయుడా! నీరణరంగ ప్రవేశానికి స్వాగతమయ్యా! రా! చూపించు నీ యుద్ధనైపుణ్యం! (వెనుకకువచ్చింది.)

బ్రహ్మ : (వృద్ధసింహంలా వచ్చాడు.) అబలా! నాకే ఎదురునిలిచావా! నీకెంతధైర్యం? ఒకనాడు ఒంటరిగా నేను గురిజాలమీదికి యుద్ధానికి వస్తే! ఎదిరించేదమ్ములేక నిర్యుద్ధసంధి చేసుకున్నావు. ఈనాడు నేసున్న రణస్థలిలో కాలూని కత్తిబట్టావు. ఆనాటివిషయం అప్పుడే మరిచావా!

నాయ : లేదు. మరచిపోలేదు. ఆనాడుగురిజాలలోనాకు ఎనిమిదివేల సైన్యమున్నా; ఒంటరివాడవైన నిన్ను మట్టుపెట్టక ప్రాణాలతో వదలి పెట్టాను. ఎందుకో తెలుసా! ఒక పరాక్రమశాలిని ఒంటరివాణ్ణిచేసి దొమ్మిగా కూల్చటం....పరోక్షంగా పరాజయాన్ని అంగీకరించటమే అనుకున్నాను. అందుకే నా సైన్యాన్ని అస్త్రసన్యాసం చేయించాను. అయినా, నీ వానాడు గురిజాల పురవీధుల్లో జరిపిన నరమేధం....నీవు చిందించిన నెత్తురు మరకలు ~~ఈనాటికీ~~ చెరిగి పోలేదు బ్రహ్మనా! ఈనాగమ్మ చిత్తశుద్ధి ఏనాటికీ శంకనీయం కాదు.

బ్రహ్మ : ఓహో! అందుకేనా, మహాసాగరంలో తిమింగిలం నోరు తెరచి జలచరాలను భక్షించినట్లు....ఈ సైనికార్ణవ మధ్యంలో నిలుచుని, నా సమస్త బంధువులనూ....ఆప్తులనూ, నే దరిజేర్చిన మలిదేవ భూపతులనూ....చివరకు నాకన్నకొడుకునుగూడా...కరాళరాక్షసివై కబళించావు. ఇంతచేసిందీ చాలక అరివీరభయంకరుడూ, వీరజన సమాదరణీయుడూ, నిత్య నూతనోద్వేగ శౌర్యాగ్ని వెలార్చే.... ఈ బ్రహ్మనపై కత్తిఝాని కయ్యానికి వస్తున్నావా! అందునా ఆడదానివి!! అబలవు!

నాయ : అవును. ఆడదానిని కాబట్టే....ఇంత కాలంనుండి నీవు వేసే ఎత్తుల్ని చిత్తుచేస్తూ....ఈ పలనాటిని ముక్కలు కాకుండా చేశాను. దీని సమగ్రతను కాపాడాను. అయినా, ఈ ఆడదానితోనే యుద్ధం చేయాలని కత్తిబట్టి వచ్చావుగా! ఆగడమెందుకు! ఊఁ....కానివ్వు! (కత్తిని సవరించింది.)

బ్రహ్మ : ఛీ! ఆడదానితోనా యుద్ధం. అందునా భర్తృవిహీనతో! ఇది పురుషజాతికే తలవంపు. (పోబొయ్యాడు.)

నాయు : ఆ పురుష హంకారమే ఈ వల్నాటిని ఈగతికి ఈడ్చింది. అంతటి కుళ్ళుబుద్ధి మంత్రాంగం నెరపే నీలాంటి పెద్దల్లోనే వుంటే....ఇక ఈ వల్నాటిస్త్రీల భవితవ్యం బగ్గిపాలుగాక మరేమౌతుంది! ఇంత నారీద్వేషమా బ్రహ్మనాయడుగారు! అవసరమనుకుంటే..అవకాశాన్ని చూసుకుని ఆడదికూడా అన్నిరంగాల్లోనూ ఆరి తేర గల దు. నరకాసుర సంహారంలో సత్యభామ లేకపోతే శ్రీకృష్ణునిగతి యేమయ్యేది? నేను ఆడదానినే....కానీ కర్షకవీరవనితను....మేడి నోగలతోపాటు .... వాడికత్తినికూడా పట్టగల దిట్టను! (నవ్వుతూ) నాకేమిటి?

బ్రహ్మ : ఆడుఃహతోనేనా, నలగామరాజును కొదమగుండ్ల లోదాచి, విరామ పతాకమెత్తించి, పారిపోయాడని ప్రచారం చేయించి, ఆపైన యుద్ధాన్ని ఉద్ధృతం చేయించావు. అంతా కుత్సితం! కుటిల రాజకీయం!

నాయు : కాదు. అది రణవ్యూహం! రాజ్యతంత్రం! రాజభక్తికూడ! బ్రహ్మ నాయుడా! రాజనీతిలోనూ, ప్రజాశ్రేయస్సునాకాంక్షించటంలోనూ, నావిద్యుక్తధర్మాన్ని నెరవేర్చటానికేఆపనిచేశాను. ఆఅనవాయితీని కాపాడటానికే....కత్తిబట్టాను. కదనరంగానికొచ్చాను. పోటొడ్డి నిలిచాను.

బ్రహ్మ : ఊఁ.... వీరవనితవు! సర్వనాశనీ! ఇంత విధ్వంసం జరిగినా, నీ రక్తదాహమింకనూ తీరలేదా! బ్రహ్మరాక్షసి!

నాయు : అవును. నేను బ్రహ్మరాక్షసినే! అందుకే కత్తిబట్టాను. కానీ, అవతార పురుషులమనీ, అపరభగవానులమనీ .... చెప్పుకునే మీరెందుకు కత్తిబట్టారో! ఓహో! ఇదికూడా పురుషహంకారమే కాబోలు.

బ్రహ్మ : ఏమిటి! అతివపైకూడా నాయంతటివానితో ఆశయాలు వల్లిస్తూ, ఆర్భాటం చేస్తున్నావా! (కత్తినెత్తాడు. కానీ..ఎందుకో ఆగి

పోయ్యాడు.) ఛీ! ఆడది! ఆడది! అవధ్య! అందుకే బ్రతికి పోయ్యావు. (కత్తిని పారవేసి పోబొయ్యాడు.)

నాయ: ఆగు! బ్రహ్మనాయడా! నీవన్నట్లు అతివనై పుట్టి, ఆయినవారి నందరినీ పోగొట్టుకుని, విరాగినై కూడా, ఈరాజకీయ కర్మలంలో ఎందుకు దిగానో....యిప్పటికీ నీకు బోధపడనేలేదా! అయితే విను. (ముఖంలో విషాదఛాయలు తేలాయి.)

ఆనాడు....అమావాస్య....అర్ధరాత్రి .... అంధకారంలో అబలనైన నన్ను ఆవలకు నెట్టి....వద్దూ....వద్దూ....వద్దూ....మా నాన్నను చంపొద్దూ....అని ఆక్రందించినా లెక్కచేయక, నాతండ్రి కాళ్ళూ చేతులూ కట్టి పట్టుబట్టి ఎత్తుకుపోయి, పొందుగుల అడవుల్లో చెట్టుకు వ్రేలాడగట్టి కిరాతంగా ఉరితీసి చంపారే! ఆ దుర్మార్గమంతా ఎవరిది? నీదికాదా! అంతకసి నా తండ్రిమీద నీకెందుకొచ్చింది చెప్పు? ఇప్పుడైనా నిజంచెప్పు?

బ్రహ్మ: (ఆలోచనలో పడ్డాడు.) అవును....నిజమే....అయితే ఇదంతా, ఆనాటి నీ తండ్రిమరణాన్ని ఆసరా చేసుకుని, కూటనీతితో నీవాడుతున్న నాటకానికిది చివరిరంగమన్నమాట! ఆనాడు మాటు కాసి....ఈనాడు కాటువేశేవా! ఆ పంతంతోనే ఇంత ప్రళయాన్ని సృష్టించావా! అందుకేనా ఈపల్నాడును వల్లకాడు చేశావు!

నాయ: (వ్యంగ్యంగా) నాపంతంకోసం చేశానో: లేక నీస్వార్ధ సామ్రాజ్య గుత్తాధిపత్యంకోసమే జరిగిందో..భావిచరిత్రకారులుభాష్యంపలుకక పోరు. మన యిద్దరి అంతరాత్మల్లోని అంతరితాలను సైతం వెలికితీసి భావిప్రజలకు బట్టబయలుగా చూపించకపోరు. అదుగో! నీ కుయుక్తుల దుర్వ్యాపారానికి నిండుశరీరాలు మొండెములై నేలరాలిన పన్నెండిండ్ల పద్మనాయకులూ, డెబ్బైరెండు గోత్రాల ఆత్మబంధువులూ....చూడు. (మరోవైపు చూపిస్తూ) అదుగో! నీ కుటిల రాజనీతికి తుండెలుగా ఖండింపబడిన వీరనాయకులూ, పోటు మన్నీలూ, చూడు, ఆ పీనుగులపై కాట్లకుక్కలు కమరబడి

మాంసపుముక్కల్నెలా పీక్కుతింటున్నాయో! ఇక ఇటుచూడు! వీరమరణం పొందిన ఆసైనికుల శవాలపైబడి రాకాసి రాబందులెలా కండల్ని చీల్చుకుతింటున్నాయో చూశావా! (ఇంకోవైపుచూపిస్తూ) అదిగో! అదే! విలువిద్యా నిపుణుడు! రణరంగభీష్ముడు....సంగ్రామ సింహుడైన కొమ్మరాజు కళేబరం! నరుకుడువడి .... నక్కల పాలైంది. అదిగో! గంగధార మడుగుదాపున పేగులు బయటపడి, నెత్తురుముద్దగా పడివున్న....నీ కుమారుడు బాలచంద్రుని శవం! ఆ శవంమీదనే పడిపోయి....అంతిమ శ్వాసవదిలిన....నీ కోడలు మాంచాల; వారిప్రక్కనే సంగడీల శవాలు, చూశావా! అలా నీవారంతా దిక్కులేని చావు చస్తారని, ఇంతకుముందు నీవేమాత్రం ఆలోచించినా....ఈ యుద్ధభూమికి నాకన్న ముందేవచ్చి....నన్ను హెచ్చరించేవాడివా! ఇంతఘోరకలికి పాల్పడేవాడివా! బ్రహ్మ నాయడా! ఇప్పటికైనా అర్థమైందా, ఆత్మీయుల మరణదుఃఖబాధ!

బ్రహ్మ : (కండ్లలో నీళ్ళునిలిచాయి.) అర్థమైంది నాగమ్మా! నీ అఖండ మేధాశక్తి అపూర్వమనీ....నీ ప్రతిభ స్త్రీలోకానికే గర్వకారణమనీ, పూర్తిగా అర్థమైంది! నీవు చూపినదంతా....కూటనీతి కాదనీ.... ధీయుక్తితో నెరపిన చాణక్యనీతియనీ....అదే రాజధర్మమనీ.... ఈనాటికి అవగతమైంది. ప్రపంచ చరిత్రలో ప్రథమ మహిళా మంత్రిణిగా నీపేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. నలరాజు తుది విజయం నీకే యిచ్చాడు. ఇక నలగామరాజే ఈఅఖండ పలనాటికి ప్రభువు. నీవే మహామంత్రిణివి. నీవన్నట్లు, నాలోని స్వార్థం.... స్త్రీ ద్వేషమే నన్నీగతికి యీడ్చింది. అదే పలనాటియుద్ధానికి దారి తీసింది. అమాయకులంతా ఈ యుద్ధాగ్నిలో సమిధలై పోయ్యారు. పుట్టెడు నల్లపూసలూ ఒకేరేవులో తెంపవలసిన పరిస్థితి దాపురించింది. పచ్చనిపంటపొలాలతో విలసిల్లవలసిన పలనాడు... నా మూలంగా పచ్చులబీడైపోతుంది. ఈ దుర్భర ఘోర పాప పరిహారార్థం....గుత్తికొండ బిలంలో....జైనసూక్తమైన సల్లేఖన వ్రతమాచరించి....ఆత్మ సంస్కారంతో....శాంతినిపొంది....కైవల్య పథం చేరుకుంటాను....అదే నా....గమ్యం! (వెళ్ళిపోతాడు.)

నాయ: (కత్తిని పారేసింది.) బ్రహ్మనాయుడా! ఇప్పటికైనా శాంతిని పొందాలనివాంఛిస్తున్నా. శాంతికాముకులకు నేనుసర్వదా అంజలించి ప్రార్థిస్తాను. (మోకరిల్లింది.) వయస్సులో నాకన్న పెద్దవాడవు. సుపథగామినిగా వర్ధిల్లమని నన్నాశీర్వదించు! (తలవంచింది.)

బ్రహ్మ: (ఆశీర్వదిస్తున్నట్లు చేయిచాపాడు.)

నాయ: ఇక నేనూ నా జన్మస్థలమైన మల్యాల దుర్గంలోని ఆరవెల్లి గ్రామానికి పోయి, నా శేషజీవితాన్ని అక్కడే గడిపి, తనువు చాలిస్తాను. పదండి! నలగామరాజును ఈ అఖండ పలనాటికి పునరంకితం చేద్దాం!


(ఇద్దరూ వెళ్ళారు.)

(తెరవ్రాలును)

శ్రీ కోటేశ్వర ప్రింటింగ్ ప్రెస్, నరసరావుపేట. (ఫోన్ : 455)

# నాటకం

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 14 | 27 | గరళకంఠనిగా | గరళకంఠునిలా |
| 15 | 14 | ఆశీనులు | ఆసీనులు |
| 18 | 15 | విచాఠించ | విదారించ |
| | 26 | విషపుప్వుల | విషపుర్వుల |
| 19 | 11 | అం ి కఠంచా | అంగీకరించారా |
| | 22 | సల్లాంచ్చ | వల్లార్చ |
| 23 | 17 | పోత్స | ప్రోత్స |
| | 21 | బిల్చుకుని | బిల్చుకొని |
| | 22 | శత్రుఃక్ష | శత్రుశిక్ష |
| 25 | 17 | ' శీర్వాదం | ఆశీర్వాదం |
| 44 | 27 | చెండు చెండాడు | చెండు బెండాడు |
| 54 | 23 | హస్తమించింది | అస్తమించింది |
| 60 | 14 | పాదసాల్లా | పాదపాల్లా |
| 79 | 11 | వీఠధర్మ | వీరధర్మం |
| 83 | 22 | జలించే | జ్వలించే |



గుర్రం చెన్నారెడ్డి

జననం–

ప్రకాశంజిల్లా రంగాపురం

విద్యాభ్యాసం –

కంభం, మాచెర్ల, గుంటూరు

నివాసం – రెంటచింతల

ఇతర కృతులు – ఎనిమిది నాటకాలు, మూడు రేడియోనాటికలు, ఒక ఖండ కావ్యం, ఒ
పద్యకావ్యం, ముప్పై ఏకపాత్రలతో కూడిన ఒక ఏకపాత్రాభినయ కదంబం, ఒక జానప
సంగీత నృత్య రూపకం (అప్పగింత), వివిధ పత్రికలలో గేయాలు, వ్యాసాలు.

నాటకరంగం: రంగస్థల నటులు, ప్రయోక్త, దర్శకులు, సాంఘిక, పౌరాణి
చారిత్రక, జానపద నాటకాలలో పలు విధములైన పాత్రలు పోషించారు. తెలు
విశ్వవిద్యాలయంవారు నిర్వహించిన ఏకపాత్రాభినయ శిక్షణ శిబిరానికి, దర్శకు
నిర్దేశకులు. వివిధ నాటక పరిషత్తులకు, ప్రాథమిక పరిశీలకునిగా, న్యాయ నిర్ణేత
వ్యవహరించారు. శతాధిక నాటక పాత్ర పరిపోషణా దురంధరులనీ, ఉత్తమకావ్య నా
ప్రక్రియ నిర్మాణపరులనీ, ఏకపాత్రాభినయ సంశోభిత, ధీవిలసితులనీ, నాటకా
వ్రాయడం, వేయడం, దర్శకత్వం చేయుటలో త్రివిక్రమత్వాన్ని, వెలార్చార
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే సన్మానం అందుకున్నారు.